7 అక్టోబర్ 2012

ఆదివారం ఆంధ్రజ్యోతి

కవర్‌స్టోరీ

'మనో' వైద్యుల మనసు వైద్యం

11

ట్రావెలోకం

వసంత ఋతువులో స్వీడన్ దీవుల్లో...

14

ప్రయోగం

ఐకోనోరైటింగ్

Powered By
ASHOK LEYLAND

Compact · Most Fuel Efficient
Minimum Maintenance Expenses

Exclusive, Most trusted & No.1 OEA of Ashok Leyland

RAPOWER GENERATORS

10kVA to 2000 kVA DIESEL GENERATORS

RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED, Head Office & Regd. Office: BANGALORE. Mfg. Units: Channapatna (KA), Tiruchirapalli (TN)

HYDERABAD: MR. M D PRASAD : 0 98486 15020, MR. RAMESH : 0 98486 15026 | VIJAYAWADA: MR. AVINASH, 0 95538 33444, 0866 2492838 VISAKAPATANAM: Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814, Mr. SHARVAN : 0 98487 88815 | KURNOOL: Mr. D.K. KISHORE :0 99486 71600 | ANANTHAPUR: Mr.G.T.PRABHAKAR : 0 98486 02300

www.rapower.in

కాన్ వేదికపై పోస్ట్ మోడర్న్ చిత్రం

సుప్రసిద్ధ కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్ సూ దర్శకత్వం వహించిన 'ఇన్ ఎనదర్ కంట్రీ' చిత్రాన్ని పోస్ట్ మోడర్న్ చిత్రంగా అంతర్జాతీయ సినిమా విమర్శకులు అభివర్ణించారు. దీన్ని 1989 నాటి సంచలనాత్మక చిత్రం 'సెక్స్, లైస్ అండ్ వీడియోటేప్' చిత్రంతో కొందరు, 1994 నాటి హాలీవుడ్ చిత్రం 'పల్ప్ ఫిక్షన్'తో కొందరు పోల్చారు. ఇందుకు కారణం ఈ చిత్ర కథా సంవిధానం. ఇది సంపూర్ణ చిత్రం కాదు, అసంపూర్ణ చిత్రం, ఇది పూర్తి కాని నిరంతర చలన చిత్రం అని దర్శకుడు హాంగ్ సాంగ్ తన చిత్రం గురించి చెప్పుకున్నారు.

నటి యుపర్‌తో దర్శకుడు హాంగ్ సాంగ్ సు

'ఇన్ ఎనదర్ కంట్రీ' చిత్రంలో గొడుగు దృశ్యం మళ్లీ మళ్లీ కనిపిస్తుంది. అలాగే ఏన్ మూడు పాత్రలలోను బీచ్ వద్ద కనిపించిన ప్రతి సందర్భంలోనూ లైట్ హౌస్ గురించి అడుగుతుంది. అలాగే మూడు రకాల నేపథ్యాలతో, మూడు రకాల మూడ్‌లలో ఏన్ ఆ బీచ్‌కి వచ్చిన ప్రతిసారీ లైఫ్ గార్డ్ 'యు ఆర్ వెరీ బ్యూటిఫుల్' అని ప్రశంసిస్తాడు. గొడుగు, లైట్ హౌస్, అందం అనే ఈ మూడు మాటలకు వాటి వాటి అస్తిత్వం ఉంది. మానవ జీవితానికి ఈ మూడు మాటలతోను ఒక అనిర్వచనీయమైన అనుబంధం ఉందన్నది దర్శకుని భావన.

శత చిత్ర నటి ఇజబెల్ యుపర్

'ఇన్ ఎనదర్ కంట్రీ' చిత్ర కథానాయకి ఏన్ పాత్రను సుప్రసిద్ధ ఫ్రెంచ్ నటి ఇజబెల్ యుపర్ పోషించారు. ఒక పాత్రకూ మరో పాత్రకూ సంబంధం లేని మూడు రకాల ఏన్ పాత్రలనూ ఆమే పోషించారు. అటు నాటక రంగంలోనూ, ఇటు చలనచిత్ర రంగంలోనూ ఇజబెల్ ఫ్రాన్స్‌లో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆమె ఇప్పటికే దాదాపు నూరు చిత్రాలలో నటించారు. యూరప్‌లో నూరు చిత్రాలలో నటించడం అంటే అంత తేలిక కాదు. వీటిలో కొన్ని హాలీవుడ్ చిత్రాలు కూడా ఉన్నాయి.

ఈసారి కాన్ చిత్రోత్సవంలో ఇజబెల్ యుపర్ నటించిన చిత్రాలు రెండు పోటీ విభాగంలో ప్రదర్శించబడ్డాయి. ఇది కూడా ఒక విశేషమే. ఒకటి కాన్ వేదికపై అత్యుత్తమ గౌరవం దక్కించుకున్న మైఖేల్ హనీకే ఫ్రెంచ్ చిత్రం 'అమోర్' (వృద్ధ దంపతుల కుమార్తెగా) అయితే రెండవది దక్షిణ కొరియాకు చెందిన హాంగ్ సాంగ్ సూ దర్శకత్వం వహించిన 'ఇన్ ఎనదర్ కంట్రీ' చిత్రం. 65 ఏళ్ల కాన్ చరిత్రలో ఇజబెల్ యుపర్ నటించిన 14 చిత్రాలు అనేక అంతర్జాతీయ చిత్రాలతో పోటీ పడడం, వాటిలో రెండు సార్లు ఇజబెల్ ఉత్తమ నటి పురస్కారాలు అందుకోవడం అన్నిటి కంటె విశేషం.

ఇజబెల్ యుపర్ తల్లి ఇంగ్లీషు టీచర్, తండ్రి బీరువాలు తయారు చేసే వ్యాపారి. ఆయన యూదు కావడంవల్ల రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని చివరికి ప్యారిస్ వచ్చి స్థిరపడ్డాడు. 1953లో పుట్టిన ఇజబెల్‌కు చిన్నప్పటి నుంచి ఆంగ్ల సాహిత్యంతో సాన్నిహిత్యం ఎక్కువ. ఆంగ్ల నాటకాలు కూడా బాగా వంటపట్టాయి. తల్లి ప్రోత్సాహం లభించడంతో ఆమె నటనా రంగంలో అడుగుపెట్టి చిన్నప్పుడే రాణించింది. ఫ్రెంచ్ వెండితెరపై ఇజబెల్ నిజంగా వెండి వెలుగుల మహారాణే!

ఇన్ ఎనదర్ కంట్రీ
కథా స్రవంతిలో జీవన స్రవంతి

ఏ రచయిత అయినా తాను సమాజానికి చెప్పదలచిదాన్ని తన రచనల ద్వారా సృజనాత్మకంగా వ్యక్తం చేస్తారు. అయితే రచయిత తొలుత ఎక్కడ తన రచన ప్రారంభిస్తారో, ఆ రచన ఎలా సాగాలనుకుంటారో, ఆ రచన ముగింపు ఎలా ఉండాలనుకుంటారో చివరికి వచ్చేసరికి అలానే జరుగుతుందన్న గ్యారంటీ ఏమీ లేదు. ఈ విషయాన్ని ఎంతోమంది రచయితలు గతంలో చెప్పారు కూడా. అలాగే సాహిత్యంలోని పాత్రలు రచన నుంచి బయటపడి రచయితతో ముఖాముఖీ జరిపిన సందర్భాలు కూడా అనేకం. అదొక రకం ప్రయోగం. 'ఇన్ ఎనదర్ కంట్రీ' అనే దక్షిణ కొరియా చిత్రంలో కూడా మనం ఇటువంటి పరిస్థితినే చూస్తాం. ఈ చిత్రంలో ప్రధాన కథలో అంతర్భాగాలుగా చిన్న చిన్న కథలు నడవడం చూస్తాం. ప్రయోగాత్మక చిత్రాలను కాన్ చిత్రోత్సవం సాదరంగా స్వాగతించడమే కాక కాన్ చిత్రోత్సవానికి వచ్చే ప్రతినిధులు కూడా ప్రయోగాలకోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తుంటారు.

'ఇన్ ఎనదర్ కంట్రీ' చిత్రంలో పార్క్ సూక్, వొంజు తల్లీకూతుళ్లు. దక్షిణ కొరియాలో ఎక్కడో తమ జీవితం తాము జీవిస్తుంటారు. రోజులు నెట్టుకురావడానికి తల్లి ఎన్నో అప్పులు చేస్తుంది. అప్పులవాళ్లు తొందరగా తీర్చమని ప్రాణం తీస్తుంటారు. ఈ తలనొప్పి నుంచి తప్పించుకోవడానికి కొన్నాళ్లు విశ్రాంతి తీసుకుందామని మొహాంగ్ అనే బీచ్ పట్టణానికి తల్లీకూతుళ్లు వస్తారు. మన గోవాలాంటి అందమైన బీచ్ అది. బీచ్ ఒడ్డున అందమైన ఒక చిన్న హోటల్. అంతా చాలా ఆహ్లాదకరమైన వాతావరణం. అటువంటిచోట వద్దన్నా సృజనాత్మకత తన పని తాను చేసుకుపోతుంది. కూతురు వొంజుకి కథలంటే చాలా ఇష్టం. సినిమాలంటే మరీ ఇష్టం. ఆమెకి బుర్రలో ఎప్పుడూ కథల మీద కథలు సినిమాలు సినిమాలుగా రీళ్ల కొద్దీ గిర్రున తిరిగిపోతుంటాయి. ఇక ఇంత అందమైన ప్రాంతానికి వచ్చిన తర్వాత కథ రాయకుండా ఎలా ?

చిత్ర నిర్మాత పాత్రలో ఏన్‌గా ఇజబెల్ యుపర్

వొంజు కథ ప్రారంభమవుతుంది. ఆ కథలో వొంజు కూడా ఒక పాత్ర అయిపోతుంది. తాను రాసే కథలో ప్రధాన పాత్రధారి పేరు ఏన్. ఆమె ఒక ఫ్రెంచ్ మహిళ. ఆమె ఒక సినిమా నిర్మాత. వొంజు కథ రాస్తున్న కాగితాలలోనుంచి ఏన్ బయటకు వచ్చేస్తుంది. తన చిత్ర దర్శకుడు కుటుంబ సమేతంగా వస్తున్నాను, మీరూ రండని ఆహ్వానిస్తే, ప్యారిస్ నుంచి ఆమె తిన్నగా మొహాంగ్‌లోని ఆ చిన్న హోటల్‌కి వస్తుంది. హోటల్‌లో దిగిన తర్వాత దైనందిన కార్యక్రమాలు చూసుకుని బయటకు వచ్చి చూస్తే దూరంగా సముద్రం రా, రమ్మని పిలుస్తుంది. మెట్లు దిగేటప్పటికి ఆ హోటల్ యజమాని ఇల్లు కూడా పక్కనే ఉండడం గమనిస్తుంది. వర్షం వచ్చేలా ఉంటుంది వాతావరణం. ఇంతలో ఆ ఇంట్లో నుంచి వొంజు క్రిందికి దిగి వస్తుంది. (వొంజు ఇక్కడ రచయిత్రి కాదు, తన కథలోనే ఒక పాత్ర. హోటల్ యజమాని కుమార్తె పాత్ర). అలా అక్కడి వరకూ వెళ్లి వద్దామనుకుంటున్నాను, ఇంతలో ఈ వర్షం అని ఏన్ అనగానే వొంజు లోపలికి వెళ్లి గొడుగు పట్టుకువచ్చి పదండి, నాకు కూడా కొన్ని సామాన్లు కొనుక్కునే పని ఉందని కూడా బయలుదేరుతుంది. ఇద్దరూ కొంత దురం వెళ్లాక రెండు దార్లు వస్తాయి. నా దారి ఇటు (గ్రాసరీ షాపు వైపు), మీ దారి అటు (సముద్రం వైపు) అని దారి చూపిస్తుంది.



రెడ్ కార్పెట్‌పై ఐశ్వర్యారాయ్

AFP

బీచ్‌లో కాళ్లకి తగులుతున్న సన్నటి ఇసుక తళ తళ మెరుస్తుంటే ఏన్‌కి ఎంతో హాయిగా ఉంటుంది. అంతలో అక్కడ ఒక లైఫ్ గార్డు కనిపిస్తాడు. లైట్ హౌస్‌కి ఎలా వెళ్లాలని ఆమె అతడిని అడుగుతుంది. ఆ లైఫ్ గార్డుకి ఫ్రెంచ్ భాష రాదు, ఏన్ ఇంగ్లీషులో అడుగుతుంది. అది కూడా అంతంత మాత్రమే. ఇద్దరి మధ్యా భాషా సంబంధమైన సమస్య కాస్త హాస్యస్ఫోరకంగా నడుస్తుంది.

కథ ఇలా నడవడం వొంజుకి అంతగా నచ్చదు. అందుకే ఏన్ పాత్రను మార్చేస్తుంది. ఈసారి ఏన్ ఒక సంపన్నుని భార్యగా ప్యారిస్‌నుంచి మొహాంగ్ పట్టణానికి వస్తుంది. ఆమె ప్రియుడు మున్సూ అనే కొరియా చిత్ర దర్శకుడు. అతని ఆహ్వానం మేరకు ఏన్ అక్కడకు వస్తుంది. అతనికి సెల్ ఫోన్ మ్రోగితే భయం. ఆ ఫోన్ తన భార్య దగ్గరినుంచైతే తాను ఫలానా చోట ఉన్నానని చెప్పే ధైర్యం కూడా లేదతనికి. తమ మధ్య రహస్య సంబంధం అలానే కొనసాగాలనుకుంటాడు. కాని ధైర్యం లేనప్పుడు ఈ పిరికి విహారాలెందుకని ఏన్ ప్రశ్నిస్తుంది. ఇద్దరూ గొడవపడ్డాక ఏన్ సముద్రంవైపుకి వెళ్లవద్దామనుకుంటుంది. హోటల్ మెట్లు దిగేసరికి వర్షం పడే సూచనలు కనిపిస్తాయి. ఇక్కడ మళ్లీ వొంజు అదే పాత్రలో ప్రత్యక్షమవుతుంది. ఈసారి తనంతట తానే గొడుగు తీసుకువచ్చి ఉంచండి, వర్షం రావచ్చు, తడిచిపోతారని ఏన్‌కు గొడుగు ఇస్తుంది. కాని ఏన్‌కి వర్షం వస్తే తడవాలన్న కోరిక కలుగుతుంది. తడవాలనుకున్నప్పుడు చేతిలో గొడుగు ఎందుకు అనుకుంటూ అలా అని గొడుగును తిరస్కరించలేక నేను దీన్ని ఎక్కడైనా మరిచిపోతే ? అని అడుగుతుంది. పరవాలేదు ఈ ఊళ్లో ఎక్కడ వదిలేసినా సురక్షితంగానే ఉంటుందని వొంజు భరోసా ఇస్తుంది. ప్యారిస్‌లో అటువంటి పరిస్థితి ఉండదు కాబట్టి ఏన్ ఆ సమాధానానికి కాస్త విస్మయం చెందుతుంది. బీచ్‌లో నడుస్తున్న ఏన్‌కి మళ్లీ లైఫ్ గార్డు కనిపిస్తాడు. మళ్లీ అదే లైట్ హౌస్ సంభాషణ. ఈసారి కాస్త భిన్నంగా. ఏన్ అక్కడనుంచి నిష్క్రమించిన తర్వాత ఆమె సెల్ ఫోన్ కింద పడిందని గమనించిన లైఫ్ గార్డు ఆ ఫోన్‌ను జాగ్రత్త చేస్తాడు. ఏన్ కోసం మున్సూ ఫోన్ చేస్తే, ఆ ఫోన్ కాల్‌ని లైఫ్ గార్డు అందుకుంటాడు. అతడి గొంతు విని మున్సూకి కోపం వస్తుంది. ఏన్‌ని వెదుక్కుంటూ ఆ లైఫ్ గార్డు టెంట్ వద్దకు వచ్చిన మున్సూకి అప్పటికే ఫోన్ కోసం తిరిగొచ్చిన ఏన్ ఆ టెంట్ లోపల పడుకుని సరదాగా లైఫ్ గార్డుతో కబుర్లు చెప్పడం మరీ పిచ్చి కోపం తెప్పిస్తుంది. ఏన్ జీవితంలో మున్సూ పరపురుషుడే అయినా తన ప్రియురాలు మరో పరపురుషునితో మట్లాడుతోందని మున్సూ అసూయతో రెచ్చిపోతుంటాడు.

ఈ కథ కూడా అంత బాగా ఉన్నట్టు రచయిత్రి వొంజుకి అనిపించలేదు. మళ్లీ కథని మార్చేస్తుంది. ఏన్ భర్త మరో స్త్రీతో సంబంధం పెట్టుకోవడం అవమానంగా భావించి ఏన్ భర్తకు దూరమై మొహాంగ్‌కు వస్తుంది. తాత్త్విక చింతనతో జీవితానికి అర్థం ఏమిటని తనను తాను ప్రశ్నించుకుంటుంది, ఈ అన్వేషణలో ఏన్ తన కంటె పెద్దదైన పార్క్ సూక్‌ను కలుస్తుంది. (ఈ పార్క్ రచయిత్రి వొంజు తల్లే. ఆమె కూడా ఈ మూడవ కథలో ఒక పాత్ర.) నాకు జీవితంలో చాలా ప్రశ్నలు ఉన్నాయి, వాటికి సమాధానాల కోసం వెదుకుతున్నానంటే, పార్క్ ఆమెను ఒక బౌద్ధ సన్యాసి వద్దకు తీసుకువెళ్తుంది. అక్కడ జరిగే సంభాషణ ఏన్ సందేహాలను నివృత్తి చేయకపోగా ఆమెకు మరిన్ని శేషప్రశ్నలను మిగుల్చుతుంది.

రచయిత్రి వొంజుకి మూడు కథలలోను ఏదో లోటు కనిపిస్తుంది. కాని అదేమిటో తెలియదు – చిన్న పిల్ల కదా. అక్కడితో తెరపడుతుంది!

ఈ ప్రయోగాత్మక చిత్రంలో ప్రధాన పాత్ర అయిన ఏన్‌కు వొంజు మూడు కథలలోను మూడు రకాల వ్యక్తిత్వాలను ఆవిష్కరిస్తుంది. ప్రతి కథ వెనుకా బరువైన జీవితం ఉంటుంది. ఏ కథా ప్రేక్షకులు కోరుకున్నట్టు సాగదు, ఆఖరికి రచయిత్రి కోరుకున్నట్టు కూడా నడవదు! ఈ మూడు పాత్రల స్వభావాలూ మూడు రకాలు. ఈ పాత్రల నేపథ్యం కూడా విభిన్నం. అందుకే ఒకే రకమైన సంభాషణలు జరుగుతున్నా ఆయా పాత్రలను బట్టి, పరిస్థితులను బట్టి ఆ సంభాషణల అర్థం మారుతుంటుంది. ఆయా పాత్రల మధ్య గల వ్యత్యాసాలను బట్టి వాటి మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు కూడా కనిపిస్తాయి. ఈ చిన్న కథలు ఇలాగే ముగియాలా, లేక మరోలా జరగాలా అంటే అది ప్రేక్షకులు ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

– జగన్ 99854 11211
jagan@andhrajyothy.com

కామెంట్

చెప్పొచ్చేదేమంటే...

జీవ వైవిధ్యం సదస్సు జరిపి తమ ప్రాముఖ్యాన్ని ప్రపంచానికంతటికీ తెలియజేసినందుకు సకల ప్రాణికోటి మానవుడి పట్ల కృతజ్ఞతతో ఉంది. పాత కోపాల్ని పక్కనపెట్టి మనిషిని కూడా అదే స్థాయిలో గౌరవించాలని సంకల్పించాయి అవి.

చాలా సమావేశాలు పెట్టుకున్నాయి కాని ఒక ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. బిజీగా ఉండి రాలేకపోయిన జీవరాశులను కూడా పిలిపించారు. రాత్రింబవళ్ళు చర్చించాక చివరికి 'వైవిధ్యం' మీద మరో సదస్సు జరపడమొక్కటే సరైన కృతజ్ఞత అవుతుందని నిర్ణయించాయి.

అనేక కమిటీలుగా ఏర్పడి పనులు చకచకా చేయడం మొదలుపెట్టాయి. ముందుగా నది, సముద్రం, అడవి, కొండ, మైదానం, పచ్చికబయలు అన్నీ ఉన్న ప్రాంతాన్ని సమావేశస్థలంగా ఎంపిక చేశాయి. వచ్చినవాళ్ళు ఉండడానికి వీలుగా గుడిసెలు, పెంకుటిళ్ళు, చెక్క ఇళ్ళు సిద్ధం చేశాయి. రకరకాల ఆహార పదార్థాలను తెచ్చి రెడీగా ఉంచాయి.

చాలా ముందుగానే ఆహ్వానాలు వెళ్ళడంతో జనం పెద్దయెత్తున బయల్దేరి వచ్చారు. మనిషి మనిషి కోసం ఏర్పాటుచేసే సదస్సుల్లో ఏం జరుగుతుందో అందరికీ తెలుసు కాబట్టి దానికైతే అంతమంది రాకపోయేవారేమో! ఇది మిగతా ప్రాణికోటి తమ గౌరవార్థం నిర్వహిస్తున్న సదస్సు కనుక ఆసక్తికొద్దీ తండోపతండాలుగా తరలివచ్చారు. వచ్చిన వారిలో కొందర్ని ఎంపిక చేసి విడిగా ఉంచారు నిర్వాహకులు.

మర్నాడు అందరూ నిద్ర లేచి చూసేసరికి ఎంపిక చేయబడ్డ ఆ మనుషులు వాళ్ళకొచ్చిన పనులేవో వాళ్ళు చేసుకుంటూ కనిపించారు. అందులో ఏ ఒక్కరూ ఒకే రూపులో లేరు. ఎవరూ రెండో వాళ్ళు చేస్తున్న పని చేయడం లేదు. వచ్చిన వాళ్ళందరి మొహాల్లో కనిపించిన ప్రశ్నార్థకాలకు సమాధానంగా ప్రాణికోటి ప్రతినిధి గొంతు సవరించుకుని ఇలా చెప్పాడు: ఈ సదస్సు పేరు మానవ వైవిధ్యం. అన్ని రంగుల వాళ్ళు, అన్ని జాతుల వాళ్ళు, అన్ని వృత్తుల వాళ్ళు, అన్ని విశ్వాసాల వాళ్ళు బతుకుతున్న నేల ఇది. మా వైవిధ్యం మీకెంత అవసరమో గుర్తించినట్టే మీ వైవిధ్యం కూడా మీ మనుగడకు అంతే అవసరమని గుర్తించమని చెప్పడానికే ఈ ఏర్పాటు. ■

విశేషం

అపరిచితుల ఉద్యమం

మన దేశంలో పత్రికాస్వేచ్ఛ ఉంది. జీవించే హక్కు ఉంది. వాక్ స్వాతంత్ర్యం ఉంది. కాని ఇంటర్‌నెట్ స్వేచ్ఛ లేదెందుకని? ఇప్పుడిప్పుడే సామాన్యులకు చేరువవుతున్న నెట్ మీద ఇన్నేసి ఆంక్షలు–నిబంధనలు అవసరమా? అంటూ హ్యాకర్లు తొలిసారి ఒక కొత్త ఉద్యమానికి నాంది పలికారు. విచిత్రమేమిటంటే– నిరసనలో పాల్గొన్న హ్యాకర్లలో ఒకరికి ఒకరు తెలియదు. గుర్తుపట్టే వీలూ లేదు. కారణం– అందరూ ముఖానికి మాస్కుల్ని తగిలించుకుని రావడం.

ప్రపంచదేశాల్లోని కొందరు స్వేచ్ఛావాదులు 2003లో 'అనానిమస్' (అపరిచిత) పేరుతో ఒక బృందాన్ని కూడగట్టారు. ప్రభుత్వాలు తమ హక్కుల్ని 'ఇంటర్నెట్ రెగ్యులేషన్' పేరిట కాలరాస్తున్నాయన్నది వారి వాదన. నెట్‌లో ఏముండాలో ప్రభుత్వాలు నిర్ణయించాల్సి అగత్యం రావడం దురదృష్టకరం. నెట్ నియంత్రణ ప్రభుత్వాల చేతుల్లోకి పోతే ప్రమాదం అంటూ.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెట్‌కు స్వేచ్ఛనివ్వాలన్నది వారి డిమాండ్. అందుకే, బెంగుళూరులో అనానిమస్ మూవ్‌మెంట్ గుప్పున లేచింది. ఇక్కడ పాల్గొన్న వారంతా అపరిచితులైనా.. వారి డిమాండ్ గురించి ఒకరికొకరికి బాగా తెలుసు. చేయాల్సిన నిరసనల గురించి తెలుసు. ఇవన్నీ ఇంటర్‌నెట్‌లో రహస్యంగా ఏర్పాటుచేసుకున్న చాట్‌రూంలో ద్వారా తెలుసుకున్నారు వీరంతా. హ్యాకర్ల సమాచారాన్ని తెలుసుకోవాలంటే.. పాత్రికేయులు కూడా చాట్‌రూంలోకి లాగిన్ అవ్వాల్సిందే! లింక్‌డెన్ అకౌంట్‌లో సమాచాన్ని పంచుకోవాలన్నా, ట్విట్టర్‌లో ట్వీట్ చేయాలన్నా బోలెడన్ని స్క్రీనింగ్‌లు చేస్తారు ఈ హ్యాకర్లు. అడ్డంకులు దాటుకున్నాకే అనానిమస్‌లతో మాట్లాడే అవకాశం వస్తుంది.

నిరసనలో పాల్గొన్న అనానిమస్ సభ్యుడొకరు మాట్లాడుతూ ''ది పైరేట్ బే', 'విమియో' వంటి వైబ్‌సైట్లకు ఇప్పటికే సంకెళ్లు వేశారు. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు (ఐఎస్‌పి) ఆ సైట్లను బ్లాక్ చేశారు. అవి హ్యాకింగ్ సైట్లని ఆరోపిస్తే, అలాంటివి చాలానే ఉన్నాయి. వీటి మీదే ఎందుకంత కోపం. ఇప్పుడు ఈ సైట్ల నోరు మూయించారు. ఇక, ఊరుకుంటే ఇంకెన్ని సైట్లకు తాళం వేస్తారో తెలియదు. అందుకే మేమంతా గళం విప్పేందుకు సన్నద్ధమయ్యాం'' అన్నాడు. ఇదంతా అనానిమస్ సభ్యుల అభిప్రాయం. కాని ఇప్పటికే వీళ్లు కొన్ని ప్రభుత్వ విభాగాలు, రాజకీయ పార్టీలకు చెందిన సైట్ల మీద, ఇంటర్నెట్ సర్వీసులపైన దాడి చేశారు. తమ ఆపరేషన్లను రెండో దశకు తీసుకొచ్చారు. ప్రభుత్వ వెబ్‌సైట్ల వివరాల్ని ఆర్‌టిఐ (సమాచార హక్కు) ద్వారా తీసుకోమని కొందరు హ్యాకర్లు సామాన్యుల్ని పురమాయిస్తున్నారు. వారి నుంచి అందిన సమాచారంతో సైట్లను హ్యాక్ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అనానిమస్ బృందంలోని సభ్యులందరూ హ్యాకర్లు కాదు. ఒకవేళ ఏదైనా వెబ్‌సైట్ రూపాన్ని మార్చేసినా, హ్యాక్ చేసినా చాట్‌రూమ్‌లో ఆ విషయం వెంటనే తెలుస్తుంది. హ్యాకర్లను తిట్టిపోసేవాళ్లు, వెనకేసుకొచ్చే వాళ్లు ఇద్దరూ ఉన్నారు. అయితే, అపరిచిత ఉద్యమం మాత్రం అందర్నీ విస్తుపోయేలా చేసింది. ■

ఈవారం కవిత

ఆరుద్ర నక్షత్రం

పుట్టకు పెట్టిన బొట్టోలే
మట్టికి మొక్కిన మనిషోలే
రాలిన వాన చినుకోలే
రంగుల సింగిడి మొలకోలే

పుట్టుకు వచ్చిన ఆరుద్ర
పురుగును చూడమ్మో ...
ఎర్రని సెలకల్లా నడిసొచ్చే
వేకువ మొగ్గమ్మో

సిలకల ముక్కుల సందం సెలకల
సిగ్గులొలికె సింధూరంలా
మైదాకెర్రగ పండిన చేతుల
మరులుగొలిపె మందారంలా

నేలతల్లి గుండెల్లో పూసిన
నెత్తురు ముద్దమ్మో ...


బొమ్మ: అక్బర్

కన్నతల్లి కనుబొమ్మలనడుమ ..
పొడిసే పొద్దమ్మో

గురువిందా గుత్తులు పగిలీ
ఇత్తులు రాలీ పడినట్లూ
పగిలిన నేలా సొరికెల నుంచి
పగడాలొలుసూకున్నట్లూ

గుడ్డాలల్లో గునగున నడకల
పెడ్డలపై పసిగుడ్డమ్మో ...
చీమల వేటకు చిక్కకుండగా
బతుకును ... ఎడ్డిబతుకమ్మా

మునివేళ్లతో నువు ముట్టుకుంటివా
అత్తిపత్తివలె ముడుసుక పోతది
స్పర్శను ఉట్టిగ పసిగట్టేసే ...
గ్రహణశక్తి గమ్మత్తుగ ఉంటది

సృష్టివిలాసపు అద్భుత వింతల
చూడ కన్నులు చాలవులే ...
కవితాశిల్పం చెక్కిన చేతుల
కాలమెపుడు పద చిత్రములే

నిండుగ మనుగడ రెండుకార్తులె
నీ జీవనమెంత పావనమో
నూరేళ్లూ జీవించిన నరులకు
నీతో పోలిక తగదేమో

సకల జీవులా విధ్వంసానికి
కారణమైనది ఎవరమ్మో ...
భూతదయను బోధించిన వాడే
భూతల్లిని చెరబట్టినడమ్మో

– అందెశ్రీ

అక్టోబర్ 7 నుండి 13 వరకు డా. పి.ఎ. రామన్

మేషం: అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

మీ గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగే సూచనలున్నాయి. సంబంధం లేని విషయాలకు దూరంగా ఉండాలి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. అదనపు రాబడి యత్నాలు ఫలించవు. వ్యాపారులకు ఒత్తిడి అధికం. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, చికాకులు. స్త్రీల ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ప్రయాణాల్లో చికాకులు, అసౌకర్యం. శనివారం నాడు పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి.



వృషభం: కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలి. దుబారా ఖర్చులు అధికం. ధనం చేతిలో నిలవదు. కష్ట సమయంలో సన్నిహితులకు తోడుగా నిలుస్తారు. మీ శ్రీమతి వైఖరిలో మార్పు సంతోషం కలిగిస్తుంది. ఆస్తి పంపకాల వ్యవహారం మరింత జటిలమవుతుంది. దాయాదులతో జాగ్రత్తగా మెలగాలి. తొందరపాటు నిర్ణయాల వల్ల నష్టపోయే ఆస్కారముంది.

మిథునం: మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

కొత్త పథకాలు, ఆశయాలతో ముందుకు సాగుతారు. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం ఉంటుంది. అసాధ్యమనుకున్న వ్యవహారం తేలికగా సానుకూలమవుతుంది. వృత్తి, ఉద్యోగ బాధ్యతల్లో మెలకువ వహించండి. ధనప్రలోభం వల్ల అధికారులు చిక్కుల్లో పడే ఆస్కారం ఉంది. కావలసిన సమాచారం అందుకుంటారు. నిరుద్యోగులకు భేషజం, అభిమానం తగవు.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్తగా ఉండాలి. అనుభవజ్ఞులు, పెద్దల సలహా తీసుకోవడం క్షేమదాయకం. ఆది, సోమవారాల్లో అభియోగాలు, విమర్శలు ఎదుర్కుంటారు. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో విధంగా వ్యయమవుతుంది. స్త్రీలకు ఆరోగ్య సంతృప్తి, వస్త్రప్రాప్తి, వస్తులాభం వంటి ఫలితాలున్నాయి. ఉద్యోగస్తులకు బోనస్, పండుగ అడ్వాన్స్‌లు మంజూరు కాగలవు.

సింహం: మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

పట్టుదలతో శ్రమించి అనుకున్న పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. అనుకోని ఖర్చులు, చెల్లింపుల వల్ల మంగళ, బుధవారాల్లో స్వల్ప ఇబ్బందులు తప్పవు. బంధువులకు వివాహ సమాచారం అందిస్తారు. ప్రేమికుల ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. స్త్రీలకు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరం. ఒక పుణ్యక్షేత్ర సందర్శనకు సన్నాహాలు సాగిస్తారు.

కన్య: ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

ముఖ్యమైన వ్యవహారాలతో హడావుడిగా ఉంటారు. ప్రముఖుల సిఫార్సుతో సభ్యత్వాలు పదవులు స్వీకరిస్తారు. మీ వ్యవహారదక్షత పలువురిని ఆకట్టుకుంటుంది. గురు, శుక్ర వారాల్లో అయినవారి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి. ఆత్మీయులకు ధనసహాయం చేస్తారు. ఆకస్మిక ప్రయాణం తలపెడతారు. మీపై వచ్చిన అభియోగాలు తొలగిపోతాయి.

తుల: చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు మందకొడిగా సాగుతాయి. మీ యత్నాలకు పరిస్థితులు అనుకూలించవు. శనివారం నాడు వ్యవహార సానుకూలతకు బాగా శ్రమించాలి. ఏ యత్నం కలిసిరాక నిరుద్యోగుల్లో నిరుత్సాహం నెలకొంటుంది. ఆత్మీయుల సలహా, హితవు మీపై మంచి ప్రభావం చూపుతాయి. ఖర్చులు పెరిగినా ఆర్థిక ఇబ్బందులుండవు. వృత్తి, వ్యాపారాల్లో మెలకువ వహించండి.

వృశ్చికం: విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఏ యత్నం ఫలించక నిరుత్సాహం చెందుతారు. మితిమీరిన ఆలోచనలతో మనస్థిమితం ఉండదు. పనులు మొక్కుబడిగా పూర్తి చేస్తారు. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. ఊహించని ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. ఆది, సోమవారాల్లో ధన సహాయం అర్థించి భంగపాటుకు గురవుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం ఉత్తమం. అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో జాగ్రత్త.

ధనస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

వ్యవహారాల్లో మొహమాటం తగదు. మీ నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేయండి. కొన్ని విషయాల్లో మొదట్లో మనస్తాపం కలిగించినా క్రమంగా కుదుటపడతారు. మంగళ, బుధ వారాల్లో పనులు ముందుకు సాగక, యత్నాలు ఫలించక నిరుత్సాహం చెందుతారు. వ్యాపారాల అభివృద్ధికి చేపట్టిన పథకాలు మంచి ఫలితాలిస్తాయి. హామీలు, మధ్యవర్తిత్వాలు, చెక్కుల జారీలో జాగ్రత్త.

మకరం: ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఒక శుభకార్యానికి శ్రీకారం చుడతారు. మీ యత్నాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఒక సమాచారం తీవ్రంగా ఆలోచింపజేస్తుంది. కుటుంబీకుల మధ్య అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. అధికారులకు పర్యటనలు, అదనపు బాధ్యతలతో తీరిక ఉండదు. వాగ్వాదాలు, ఉద్యమాలకు దూరంగా ఉండడం క్షేమదాయకం.

కుంభం: ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

సంతోషం కలిగించే వార్తలు వింటారు. లక్ష్యసాధనలో అనుకూల ఫలితాలుంటాయి. ఆందోళన కలిగించిన సమస్య తేలికగా సమసిపోతుంది. ఖర్చులు పెరిగినా ఇబ్బందులుండవు. విలాస వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. మంగళ, శనివారాల్లో నగదు లెక్కలు, కరెన్సీ నోట్లను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. వృత్తి, ఉద్యోగ బాధ్యతల్లో చికాకులు తొలగిపోతాయి.

మీనం: పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

లౌక్యంగా పనులు చక్కబెట్టుకోవాలి. ముక్కుసూటిగా పోయే మీ ధోరణి వివాదాస్పదమవుతుంది. పెద్ద ఖర్చు తగిలే సూచనలున్నాయి. కష్ట సమయంలో అయినవారికి చేదోడుగా నిలుస్తారు. గృహ మార్పునకు యత్నించండి. లక్ష్యసాధనకు ఓర్పు, నిరంతర శ్రమ అవసరం. గురు, శుక్ర వారాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి.

అంకెలతో అదృష్టం

ఐ.బి. సాహు
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.....
2. పుట్టిన తేదీ .....

(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)

3. పుట్టిన సమయం .....
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు .....
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

ఎ.జి., పర్లాకిమిడి

నా పేరు వైబ్రేషన్స్‌కు సరిపడేట్టుగానే ఉన్నదా? నాకు సరిపడే వైబ్రేషన్స్, సరిపడని వైబ్రేషన్స్ సూచించగలరు.

ఒక వ్యక్తి ఛార్ట్ సంఖ్యా శాస్త్రపరంగా ప్రాథమిక స్థాయిలో చూడడం అనేది ఐదు నిమిషాలలోపే అవుతుంది. కాకపోతే ఈ ప్రాథమిక స్థాయి ప్రతివారూ పరిశీలించే వీలు కలిగి ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో చెప్పే అంశాలు ఇవే. 1. మీ బర్త్ వైబ్రేషన్ 10. 2. మీ విధాన వైబ్రేషన్ 25. ఈ రెండు అంశాలలో జన్మ వైబ్రేషన్ ద్వారా నిర్ధారించబడేవి ఆర్థిక విషయాలు, కుటుంబ విషయాలు. విధాన సంఖ్య ద్వారా నిర్ధారించబడే విషయాలు ప్రొఫెషన్, వివాహం. ఈ అంశాల గణన ప్రాథమిక స్థాయిలో అంచనా సాధ్యం కాదు. ప్రాథమిక స్థాయిలో పేరు 37, 73, 64, 55 సంఖ్యలలో ఉండవచ్చా లేదా అని నిర్ణయించేయడం. విధాన సంఖ్య 25గా వచ్చింది కాబట్టి 25గా నిర్ణయించేద్దాం అనుకోవడం. తేదీల విషయంలో 1,10,19,28 మంచి తేదీలు 7,16,25 మంచి తేదీలు. ఆదివారం లక్కీ వీక్. గోల్డెన్ యెల్లో, లేత ఆకుపచ్చ రంగు కలిసి వచ్చే రంగులు. కెంపు, కాట్స్ ఐ అదృష్ట రత్నాలు. నేను పైన వివరించిన డేటా మీకు ప్రతి పుస్తకంలోను లభ్యం అవుతుంది. నెట్‌లో ప్రతి సైట్‌లో అటుఇటుగా దర్శనం ఇచ్చే సమాచారమూ ఇంతే. ఇక ఈ అంశాలకు ఫార్చ్యూన్ టెల్లింగ్ జత కలిపితే మరింత సమాచారం ఇవ్వవచ్చు. ఈ ప్రక్రియను ఏ నెటిజన్ అయినా, ఏమాత్రం ఇంటర్‌నెట్ జ్ఞానం ఉన్న వ్యక్తి అయినా సులభంగా ఫాలో కావచ్చు. ఇదంతా ప్రాథమికం మాత్రమే. ఉపయోగం ఎంతవరకు అనేది ఎవరి అభిరుచిని బట్టి వారికే వదిలివేయాలి.

ఇక మీ పుట్టిన తేదీ వివరాలతో డీప్‌గా, డెప్త్‌లో గణించిన అంశాలు. మీరు అడిగిన సంఖ్య ద్వారా వ్యక్తిగత సంఖ్య 8. మిమ్మల్ని ప్రభావితం చేసే మరో సంఖ్య 7. 90 శాతం ప్రభావితం చేసే సంఖ్యలు 1,3,4,8,5.

జన్మ విధాన సంఖ్యలలో సిగ్నిఫికెన్స్ గమనించినట్లయితే ప్రగాఢమైన డిటర్మినేషన్, అడ్మినిస్ట్రేషన్ చెయ్యగల కెపాసిటీ, తామరాకుపై నీటిబొట్టు మనస్తత్వం ప్రస్ఫుటంగా ఉన్నాయి మీలో. ధనపరంగా నష్టం అనుకోకుండా అన్నీ తెలిసి ఉండీ బోల్తాపడడం, మొండితనం, రేడియేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగుపరచుకోవడం ఖచ్చితంగా మీ జీవితంలో సంభవిస్తాయి. సంభవించి ఉంటాయి. ప్రధానంగా ప్రభావం చూపే 8వ సంఖ్య కారణంగా జ్ఞానం ఎన్నో రకాలుగా సాధించడం మరో లక్షణం. టీచింగ్ మరో లక్షణం. తెలిసిన విషయాన్నే నేర్పుగా, అద్భుతంగా ప్రజంట్ చేయడం మీకున్న మరో లక్షణం. 1,7,8 సంఖ్యలలో 8వ సంఖ్య 160 డిగ్రీల బలంతో అలరారుతుంటే 7వ సంఖ్య 140 డిగ్రీలలో, 1వ సంఖ్య 110 డిగ్రీలలో పరిఢవిల్లుతున్న విశిష్టమైన ఛార్ట్ మీది. ఈ అంచనాల ప్రకారం మీరు ఉన్న పరిధిలో అధికులకు మీ పేరు, మీ శక్తి సామర్థ్యాలు నైపుణ్యం తెలిసే ఉంటుంది. ఇక్కడ మీకు సరిపడని సంఖ్య 2. కారణం మీ ఛార్ట్‌లో ధనాన్ని పరివేక్షించే 5వ సంఖ్య మీకు పాండిత్యాన్ని, ప్రకర్షను ఇవ్వగలిగిందే తప్ప ధనాన్ని సురక్షితంగా ఇవ్వలేకపోయింది. ఫలితం కరిమ్రింగిన వెలగపండు చందం. ఇది ప్రభావితమైనది 2వ సంఖ్యతో. అదేవిధంగా మీ ఛార్ట్‌లో రిపీట్ అయిన సంఖ్యల ప్రభావంలో 1,5 6,3. ఈ రెండు సంఖ్యల సంయుక్త ప్రభావం పై ఫలితాన్ని మరింతగా బలోపేతం చేసింది. ఇక్కడ సురక్షిత ధనం అనే పదానికి అర్థం ధనం మీ చేతిలో ఉంటుంది అవసరమైనపుడు మాత్రం కాదు. అవసరార్థం అరచేతిలో ఏమీలేని పరిస్థితిలో మీరు పదేపదే అనుకునే మాట ఒక్కటే. ''శకునం చెప్పే బల్లి కుడితిలో పడింది''. ఈ పరిస్థితి 2014 ఆగస్ట్ తరువాత ఎంతలా మారుతుందంటే గడిచిన జీవితంలోని ఏ ఇబ్బందీ గుర్తుకు రానంతగా. ఇది ఫలించాలంటే మీరు దత్తత తీసుకొనబడి ఉండాలి. ఈ కండిషన్ లేనట్లయితే 2019 వరకు మీ పరిస్థితి ఇంతే. మీ వృత్తి స్వతంత్రమైనది. మీకు మీరే బాస్. మీకు మీరే సర్వెంట్. ఇంకా వివరించాలంటే స్థలాభావం. అయినా ఒక వ్యక్తి జీవితాన్ని ఒక పేజీలో కుదించే పరిజ్ఞానం ఇంకా పెంపొందించబడలేదు.

క్లుప్తంగా 1 7 కాంబినేషన్‌లో మీపై పనిచేసే వైబ్రేషన్స్ సంఖ్యా రూపంలో వరుసగా ఇలా ఉన్నాయి.

1వ వైబ్రేషన్ శక్తి తక్కువైనప్పటికీ స్వతంత్ర వృత్తిని ఇవ్వగలిగింది.

2వ వైబ్రేషన్ నెగెటివ్ ప్రభావం ధనంపై చూపిస్తుంది.

3వ వైబ్రేషన్ వృత్తి నిపుణతను పెంచుతూనే ఉంటుంది.

4వ వైబ్రేషన్ ధనం తాలూకు నెగెటివ్ దిశను 10 శాతం స్థిరపరుస్తుంది.

5వ వైబ్రేషన్ 90 శాతం పాండిత్యాన్ని, 10 శాతం ధనాన్ని ఇస్తుంది.

6వ వైబ్రేషన్ పేరుకు మాత్రమే నెగెటివ్ కాని అన్ని కంఫర్ట్స్ ఇస్తుంది.

7వ వైబ్రేషన్ హార్మోనిలో ఉండి తర్క జ్ఞానాన్ని ఇస్తుంది.

8వ వైబ్రేషన్ చేతులు కాల్చుకోవడం, బోల్తాపడడం అనే అంశాలలో పరిపూర్ణంగా సహాయం చేస్తుంది.

9వ వైబ్రేషన్ కెపాసిటీ, స్థిరమైన వైవాహిక జీవితం ఇవ్వడంలో 100 శాతం సమర్థన ఇస్తుంది.

ఈ అంశాలలో మీ పాజిటివ్ నెగెటివ్ శక్తి స్థాయి మీకు అర్థమై ఉంటాయి. మీ పేరులో 'ఒ' అనే అక్షరం చేర్చి ప్రతిరోజు 210 సార్లు వ్రాయండి. ఈ కోర్స్ మీ ఆర్.వి. ఎనర్జీ గణాంకాలతో నిర్ధారించబడింది. 2014 ఏప్రిల్ వరకు ప్రతిరోజు వ్రాయండి. సత్ఫలితం తథ్యం.

Adv.

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా : అంకెలతో అదృష్టం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 033.

చోటీ దునియా

★ అఫ్సర్

యూనివర్సిటీ బస్సు దిగాను రోజులాగానే. బస్సు దిగి అరమైలు నడిస్తే మా యూనివర్సిటీ లైబ్రరీ వస్తుంది. లైబ్రరీలో కాసేపు చదువుకునో, రాసుకునో ఆ తరువాత క్లాసులకి వెళ్లడం నా దినచర్య.

ఆ అరమైలు నడక అంటే చాలా ఇష్టం నాకు. ఆలోచించుకుంటూ నా చదువు లక్ష్యాన్ని, బతుకు బాటని కొలుస్తున్నట్టుగా అడుగులో అడుగు వేస్తూ వెళ్తాను నిదానంగా.

''హే, సాహెర్, ఫాస్ట్ ... ఫాస్ట్.. నువ్వు నత్త కన్నా అన్యాయం'' అంటుంది ఆర్తి ఎప్పుడూ.

ఆర్తికి నాకూ చాలా తేడా. ఆస్మాన్ జమీన్ ఫరక్. దాంతో నడవడం అంటే పరిగెత్తడమే. నాకు ఆ పరుగు ఎందుకో నా లోపలి నించి రాదు, నా కాళ్లలోంచి రాదు. నా మాటలోంచి కూడా రాదు.

ఎందుకు ఈ చదువు చదువుతున్నానా? అని రోజూ ఒక ప్రశ్న. అసలు ఈ దేశంలో ఎందుకున్నానా అని రెండో ప్రశ్న. నిజమే. ఈ చదువులో నేను ఎంత ఇన్వెస్ట్ చేసినా, ఫలితం అంత గొప్పగా ఏమీ ఉండడం లేదన్నది నిజం. ఈ దేశంలో ఇంకెంత కాలమున్నా మా దరిద్రం మాత్రం మాతోనే అంటిపెట్టుకుని ఉంటుందన్నది కూడా అంతకంటే నిజం.

ఈ గ్రాడ్యుయేషన్ కాగానే తరవాతి చదువుకి ఆఫ్ తీసుకుని, కొన్నాళ్లు ఏదయినా పనిలో కుదరాలి. ఇంట్లో కాస్త శాంతిని చూడాలి. అదొక్కటే నా కల ప్రస్తుతానికి.

ఇవాళ యూనివర్సిటీ బస్సు దిగగానే ఇంకోసారి గుప్పున వాసన కొట్టింది నా మొహం చుట్టూ కప్పుకున్న హిజాబ్. దాన్ని తల మీంచి తీసి బ్యాగులో పెట్టాలని ఒకటికి రెండుసార్లు తెలియకుండానే నా చేతులు ప్రయత్నించాయి. కానీ, ఆ చేతుల్ని ఏదో ఆలోచన కట్టి పడేసింది. అంత తేలికగా తీయలేకపోయాను. లోకం అంతా నన్నే గుచ్చిగుచ్చి చూస్తోందన్న అనుమానం. నిజానికి ఆ దారిన వెళ్లే వాళ్లలో ఏ ఒక్కరికీ నా వైపు కన్నెత్తి కూడా చూసే తీరిక లేదని నాకు తెలుసు. అయినా, అన్ని కళ్లూ నా మీదే వాలినట్టు!

''లాండ్రీకి వెయ్యడానికి కాయిన్స్ లేవు ఛోటీ. ఇప్పుడు ఉతికి ఆరేసే సమయమూ లేదు. ఇవాళ ఎలాగోలా సర్దుకో'' అని అమ్మీ ఆ మాసిన హిజాబ్‌ని తల చుట్టూ కప్పి ''కాలం అస్సలేం బాగాలేదు. దేశం కాని దేశం ... భాష కాని భాష .. మన వాళ్లెవరూ దగ్గర లేని దేశం. మన జాగ్రత్తలో మనం ఎప్పుడూ ఉండాలి'' అంది. ''హిజాబ్‌కీ సెక్యూరిటీకీ సంబంధం లేదు అమ్మీ'' అనాలనుకున్నా.

''బయటికి వెళ్లేటప్పుడు 'ఆయతల్ కుర్సీ' చదవడం మరచిపోవద్దు ఛోటీ. ఆ దువా చదువుకుని, ఒంటి మీదకి ఊదుకుంటే, నీ మీదకి ఏ సైతాన్ గాలీ వీచదు'' అని రోజూ బయటికి అడుగు పెడుతున్నప్పుడు గుర్తు చేస్తుంది అమ్మీ. ''అమ్మీ, ఇది అమెరికా!'' అని ఎన్నోసార్లు అని, ఇక అనడం వల్ల ఏ మాత్రం ఫాయిదా లేదని తెల్సుకొని, ఊరుకుండిపోతాను.

అమెరికా అంతా సైతాన్ల రాజ్యమని అమ్మీ గట్టి నమ్మకం. అయితే, మరి ఇక్కడెందుకున్నట్టు? పెదమామయ్య రఫీ సిటిజన్ కాగానే చేసిన పని – మమ్మల్ని అమెరికా లాక్కురావడం. అమ్మీ వద్దు వద్దు అంటున్నా వినలేదు. ఏ రెస్టారెంట్‌లో పని చేసినా కొన్నాళ్లకి కష్టాలు తీరిపోతాయని రఫీ మామూ మొదట్లో అనుకున్నాడు. కానీ, పాత కష్టాలు తీరుతున్నాయో, కొత్త కష్టాలు వచ్చి పడుతున్నాయో ఇప్పటి దాకా తేలడం లేదు.

ఈ ఏడేళ్లలో అమెరికా చాలా మారింది. కానీ, అమ్మీ ...! నిజానికి, హైదరాబాద్‌లో ఉన్నప్పుడూ అంతే కదా తను. ఊరు ఊరంతా సైతానులే ఆమె కంటికి. చాలా అనుమానంగా చూస్తుంది ఎవరినైనా. చాలా ఆలోచించి కానీ చేతులు కలపదు ఎవరితోనూ. అమ్మీ అట్లా ఎందుకయిందో చెప్పాలంటే అదో పెద్ద కథ అవుతుంది.

ఆర్తిని మొదటిసారి మా ఎపార్ట్‌మెంట్‌కి పిలిచినప్పుడు, అమ్మీ నన్ను కిచెన్లోకి తీసుకెళ్లి, ''ఏం, మీ కాలేజ్‌లో ముస్లిం అమ్మాయిలు లేరా, దోస్తీ చెయ్యడానికి?'' అనేసింది వెంటనే. ఆర్తి హిందువు అన్న విషయం నాకు అస్సలు తట్టనే లేదు అప్పటి దాకా. నిజంగా తట్టలేదా? తట్టిన్నా, ఆర్తి స్నేహం ముందు అది ఎటో ఎగిరిపోయి ఉంటుంది. అమ్మీని ఇట్లా అంటున్నాను కానీ, 'ఇది అమెరికా' అని నేను మాత్రం ఎన్ని సార్లు నాకు నేను చెప్పుకోలేదు. హిజాబ్ తల మీద లేని క్షణం నిజంగా ఊపిరాడనట్టే ఉంటుంది నాకు. అది లేకుండా పక్క సందులో ఉన్న గ్రోసరీ స్టోర్‌కైనా వెళ్లగలనా? అంతగా అలవాటు పడిపోయాను దానికి. అందుకే మురికి వాసనేస్తున్నా దాన్ని తీసేయలేక పోయాను.

రాత్రి సరిగా నిద్ర లేదేమో, అడుగు తీసి అడుగు వేస్తే ఆవలింతలు వచ్చేస్తున్నాయి. అడుగులు భారంగా పడుతున్నాయి.

ఈలోపు కొద్ది దూరంలో ఉన్న కాపిటల్ భవనం వేపు నించి పెద్ద కేకలు .. గుంపులు ... బ్యానర్లు ... 'హు, మళ్లీ ఇదో గొడవ'' అనుకున్నాను. కాపిటల్ చుట్టూరా నిరసన శిబిరాలు ... occupy నినాదాలు ... ఇదో కొత్త ఉద్యమమట! ఏ రకం ఉద్యమమో నాకింత వరకూ అర్థం కాలేదు. టీవీలో, రేడియోలో ఒకటే హోరు. ఆర్థిక అసమానతల మీద యుద్ధమట. అది అయ్యే పనేనా? కానిపనికి ఇంత రాద్ధాంతం అవసరమా? ఇవాళ నా ట్యూషన్ ఫీజు తడిసి మోపెడయ్యింది. కనీసం చదువు చెప్పించలేని ప్రభుత్వం ?! చదువుని పెద్ద పెట్టుబడి చేసి, వ్యాపారం చేసి అందనంత దూరం తీసుకెళ్లిన ప్రభుత్వాలు, రిపబ్లికన్లూ, డెమొక్రాట్లూ కూడా. ఎవరికైనా ఇది పట్టిందా? నన్ను కాస్త చదువుకోనివ్వండి. అది చాలు నాకు.

'నీకూ చదువుకీ బహుదూరం. కనీసం పాకిస్తానీ రెస్టారెంట్‌లో సఫాయిగా కూడా నువ్వు పనికొస్తావా లేదో తెలియదు'' అబ్బా జాన్ అసహనంగా అంటుంటాడు. ప్రతి దానికీ ఈ పాకిస్తానీ ఏమిటో! ఈ పాక్ ముద్ర పడీ పడీ నేను ఇండియన్ అన్న విషయం కూడా మరచిపోతానేమో చివరికి. మొన్న ఎవరో ఒక అమ్మాయి ''హే, పాకీ!'' అని గట్టిగా పిలిచింది కూడా వెటకారంగా. ముస్లిం ... అంటే పాకీ. ఇదే ఇక్కడ అందరికీ తెలిసింది. ఎంత అన్యాయం! ''నేను పాకీ అని నీకు ఎట్లా తెలుసు?'' అని దాని మోహం మీద ఒక్కటి ఇచ్చి రావాలని అనిపించింది. ''లేదు, ఎప్పుడూ అట్లా చెయ్యకు. ముస్లింలంకి మంచి కాలం కాదిది. సహనం ... మనకి అల్లా ఇచ్చిన ఒకే ఒక్క ఆయుధం..'' అంది ఒకసారి అమ్మీ ఏదో సందర్భంలో.

2

"saheraa, this is a game. No way! You got to learn this! just play, play and play!" నువ్వు ఎక్కడి నుంచి వచ్చావన్నది ఇక్కడెవరూ చూడరు. ఇప్పుడు ఈ క్షణంలో వీళ్లందరితో సమానంగా నువ్వు ఆడుతున్నావా లేదా అన్నదే చూస్తారు. బంతి జారిపోయిందా, ఆట బంద్'' అన్నారొకసారి ప్రొఫెసర్ సయ్యద్, నవ్వుతూ. ఆయనంటే నాకు చాలా గౌరవం. క్విజ్ ప్రశ్నల్లాంటి పరీక్షలు కాకుండా, ఆలోచనకి పదునుపెట్టే పేపర్లు విద్యార్థులతో రాయించడం, ఆ రాసింది వాక్యం వాక్యం పట్టి పట్టి చదివి, కామెంట్స్ రాయడం ... అంతగా విద్యార్థుల్ని ఇష్టపడే ప్రొఫెసర్లు నిజంగా అరుదు.

''కానీ, ఈ ఆట ఎట్లా ఆడాలి, దాని గ్రామర్ ఏమిటి అన్నది నీ ఇష్టం. నువ్వు తేల్చుకో. ఎవ్వరూ చెప్పరు. ఈ వ్యవస్థకి కావాల్సింది నువ్విచ్చే రిజల్ట్. అంతే. నీ వైఫల్యం కాదు.''

నిజమే, ఆ వైఫల్యం అనేది అనుక్షణం కాళ్ల ముందు సంకెల అయినప్పుడు .. నా ప్రమేయం లేకుండానే అది నా వర్తమానాన్ని శాసిస్తున్నప్పుడు ... ఏం చెయ్యాలి?

'కానీ, ప్రొఫెసర్, ఇప్పటికీ నిజానికి ఇది నాలోకం కానే కాదని అనిపిస్తోంది. ఎక్కడో ఒక మారుమూల పాత బస్తీ బళ్లో చదువుకున్న దాన్ని. బతుకు వెంటపడి పిచ్చిగా తరిమితే, బంతిలా ఇక్కడికి వచ్చి పడ్డదాన్ని. తొమ్మిదో తరగతి దాకా ఒక్క ఇంగ్లీష్ వాక్యం అయినా పూర్తిగా వినని దాన్ని ... అవును, ఉర్దూ తప్ప నాకు ఇంకో లోకం తెలియదు. కంప్యూటర్‌తో కూడా నేను ఉర్దూలోనే మాట్లాడతాను' అనుకున్నా చాలా సార్లు లోపల్లోపలే. పైగా, నేనెప్పుడూ గొప్ప బ్రిలియంట్ స్టూడెంట్‌ని కాదు. చాలా యావరేజ్. ఎందుకో, నాలోపల ఆ పోటీ స్పిరిట్ లేదు మొదటినించీ.

బొమ్మలు : అక్బర్

అసలు ఆ స్పిరిట్ ఎక్కడి నించి వస్తుంది? ఎప్పుడూ అర్థం కాదు నాకు. ఒక పూట తింటే ఇంకో పూట తినలేకా, ఒక క్లాసు పుస్తకం కొంటే ఇంకో పుస్తకం కొనలేకా. ఒక నెల స్కూలు ఫీజు కడితే ఇంకో నెల కట్టలేకా ... అవును, నేను ఎవరితో పోటీ పడాలి!?

ఈ కోర్సులో చేరాక మొదటి వారం రైటింగ్ రెస్పాన్స్ పంపినప్పుడు ఆయన అన్న మాటకి ఆయన ముందే ఏడుపు తన్నుకొచ్చింది. ''నువ్వు ఇంగ్లీషులో ఉర్దూ రాస్తున్నావ్, సాహెర్. రెండో భాషలో రాయడం కష్టం. నిజమే, నాకు తెలుసు. కానీ రాయడం నేర్చుకోవాలి. నువ్వు రోజూ ఎంతో కొంత రాయాలి. కావలిస్తే, రైటింగ్ సెంటరుకి వెళ్లి అన్నీ ఎడిట్ చేయించుకో'' అన్నారు మరీ మొహమ్మీద. కాని, అసలు మొత్తంగా ఈ లోకమే రెండో భాషలా ఉంది నాకు.

ఆ తరువాత ఆయన అన్న మాట నా గుండెని పిండేసింది. ''నీ సమస్య భాష ఒక్కటే కాదు, ఆలోచన కూడా. భాష వేరు. ఆలోచన వేరు. ఆలోచన సాఫీగా ఉంటే భాష సాఫీగా ఉంటుంది, తిన్నగా ఆలోచించడం లేదు నువ్వు'' అన్నారు చప్పున నా కళ్లలోకి తీక్షణంగా చూస్తూ.

ఆ రాత్రి ... అబ్బాజాన్ అన్న ఇంకోమాట నా గుండెల్లో రాయిలా పడింది. ''ఈ సెమిస్టర్ నువ్వు ఆఫ్ తీసుకో. నాకు ఉద్యోగం వచ్చాక మళ్లీ మొదలెట్టు. ఇప్పుడు నేను ఈ ఖర్చులు భరించలేకపోతున్నా.''

అబ్బాజాన్ అట్లా అనడంలో ఆశ్చర్యమేమీ లేదు. మొన్నటిదాకా గ్రోసరీ స్టోర్‌లో ఉన్న చిన్నా చితకా ఉద్యోగం ఇప్పుడు లేదు. రెండు నెలల క్రితం ఆ ఉద్యోగం పోయినప్పుడు ఒక నెల ఇంటి అద్దె కట్టడానికి కూడా డబ్బులు లేవు. చివరికి అమ్మీ ఒక పాకిస్తానీ రెస్టారెంట్‌లో పార్ట్ –టైమ్‌కి కుదరాల్సి వచ్చింది. ఆ వచ్చే డబ్బు ఇంట్లో గ్రోసరీలకే చాలడం లేదు. ఇక ట్యూషన్ ఫీజు కట్టాలంటే తల తాకట్టు పెట్టినంత పనే అవుతోంది.

''డియర్ ప్రొఫెసర్, మీరు రేపటి క్లాసుకి రెండు ప్రశ్నలు పోస్ట్ చేస్తే చాలు అన్నారు. కానీ, ఈ రాత్రి నా ముందు కనీసం పది ప్రశ్నలు ఉన్నాయి. వాటికి జవాబు మీరే కాదు, ఈ ప్రెసిడెంట్ అయినా చెప్పగలడో లేదో నాకు తెలియదు. అయినా ఈ దేశంలో కనీసం ప్రశ్నలు అడిగే స్వేచ్ఛ అయినా ఉన్నందుకు సంతోషంగా ఉంది నాకు.''

అని ఆ రాత్రి పన్నెండు గంటలకి ప్రొఫెసర్‌కి ఇమెయిల్ రాసి, సోఫా మీద వాలిపోయాను నిస్సత్తువగా. ఆయనేమంటారో చూడాలి. ఆ మాటలు .. ఆ కాసిని మాటలు కావాలి తనకి. నీరసించిన ఈ క్షణాల్ని వెలిగించే మాటలు. ఆ కాసిని మాటలు ఎవరి నించయినా పర్లేదు .. తన చుట్టూ ఉన్న లోకంలో ఏ చీకటి మూల నించి అయినా పర్లేదు.

సోఫాలో కూలబడి, ఏదో పుస్తకం తెరిచే ప్రయత్నంలో పడ్డా.

కానీ, ఆ ప్రశ్నలు నా ఆలోచనలతో జగ్లింగ్ చేస్తున్నాయి నిర్దాక్షిణ్యంగా. అవును, ప్రశ్నలకి దయలేదు. ఆ మాటకొస్తే, అస్సలు ఇక్కడ ఎవరినీ ఎవరూ దయతలచరు. పని .. పని .. పని .. చేసిన పని బాగుంటే మెచ్చుకోలు. నీ వైఫల్యాలనెవ్వరూ క్షమించరు. కానీ, నీ వైఫల్యాల నించే నీ వ్యక్తిత్వం మీదా, నీ కెరీర్ మీదా తీర్పులు ఇచ్చేస్తారు.

అవును, జగ్లింగ్ చేసే బాల్స్‌కి క్షణం కూడా విరామం ఉండకూడదు. బంతి ఆడుతూనే ఉండాలి చేతుల్లో ... పది బంతులు రెండు చేతుల్లో ...! రేపు ఆర్తితో మాట్లాడాలి. ''నాతో మాట్లాడ్డం కాదే ... నువ్వు నీతో కూడా అంతే తీవ్రంగా మాట్లాడుకోవాలి'' అని రాత్రి చివరి మాటగా చెప్పింది ఆర్తి. నాతో నేను మాట్లాడుకోవడం అంటే ...! ఇది తెగే వ్యవహారమేనా?

3

పొద్దున్న లేచి గబగబా తయారై కాంపస్‌కి బయలుదేరాను. ముందే ఆర్తికి ఫోన్ చేశాను. క్లాసులు అయ్యాక ఒక గంట యూనియన్ కఫేలో కూర్చుందాం అని.

క్లాసులు మూడు గంటలకి అయిపోయాక, యూనియన్ కఫేలో కూర్చోబోతుండగానే ఆర్తి వచ్చేసింది మంచి లేత ఎరుపు రంగు టీషర్టు వేసుకొని. దాని టీషర్ట్స్ బాగుంటాయి. నాకూ అలా టీషర్ట్స్ వేసుకొని తిరగాలని ఉంటుంది నిజానికి. లోపల ఒక డ్రెస్సు, దాని మీద ఈ బురఖా– ఒక్కోసారి చిరాకు పుడుతుంది.

ఆర్తి టీషర్టు మీద వాక్యాలు కూడా బాగుంటాయి. ఇవాళ ఆ టీషర్టు మీద ఏముందా అని ముందుకు వంగి చదివాను. If hope is an impossible demand, then we demand the impossible అని పసుపు రంగు అక్షరాల్లో ఉంది.

''బాగుంది. చాలా మంచి లైన్'' అన్నాను వెంటనే.

''నచ్చిందా, నిజంగా? అది జూడిత్ బట్లర్ మాట ... నాది కాదు'' అంది ఆర్తి. ''సరే, నువ్వు కాఫీ గాని, చాయ్ గానీ తీసుకుంటావా? It's my treat!''

మూడు డాలర్లు కాఫీ (మిగతా 12వ పేజీలో)

"saheraa, this is a game. No way! You got to learn this! just play, play and play!" **నువ్వు ఎక్కడి నుంచి వచ్చావన్నది ఇక్కడెవరూ చూడరు. ఇప్పుడు ఈ క్షణంలో వీళ్లందరితో సమానంగా నువ్వు ఆడుతున్నావా లేదా అన్నదే చూస్తారు. బంతి జారిపోయిందా, ఆట బంద్'' అన్నారొకసారి ప్రొఫెసర్ సయ్యద్, నవ్వుతూ.**

'తూనీగా తూనీగా ఎందాక పరిగెడతావే రావే నావంకా ..'

ఇప్పటికీ మన పెదాలపై తడారని బాణి! ఈ పాట వెనకే 'మనసంతా నువ్వే' సినిమా కళ్లముందు కదలాడుతుంది. దాని సృష్టికర్త ఎవరనేది ప్రత్యేకంగా మీకు చెప్పక్కర్లేదేమో! ఇంజనీరింగు, సివిల్స్‌లలో ఏ పట్టాలక్కర్లేదని సినిమా పట్టాలెక్కి దర్శకుడయ్యాడతను. 'మనసంతా నువ్వే' స్టేషన్లో ఎక్కి 'శ్రీరామ్', 'నేనున్నాను', 'మనసు మాట వినదు', 'బాస్', 'ఆట', 'రెయిన్ బో', 'రాజ్', 'ముగ్గురు' లాంటి స్టేషన్లలో మజిలీలు చేస్తూ సినీ ప్రయాణం సాగిస్తున్నారు. త్వరలో 'పార్క్' స్టేషన్ చేరబోతున్నారు. కుటుంబ చిత్రాలను భిన్న తరహాలో ఆవిష్కరించి, తనకంటూ ప్రత్యేకమైన ప్రేక్షకులను ఏర్పరచుకున్న యువ దర్శకులు వి.ఎన్. ఆదిత్య హ్యాపీడేస్ ఇవి.

నేను ఇప్పటికీ 'సిద్ధార్థ' ముద్దు బిడ్డనే!

నేను ఇప్పటికీ 'సిద్ధార్థ' ముద్దుబిడ్డనే!' కన్‌ఫ్యూజ్ అయ్యారా? అది మా కాలేజీ పేరండీ! సరిగ్గా నా టెన్త్ అయిపోవడం, మా నాన్నగారికి లింగపాలెం నుండి విజయవాడకి బదిలీ అవడం ఒకేసారి జరిగాయి. నాన్న స్టేట్ బ్యాంక్ మేనేజర్‌గా ఉండేవారప్పట్లో. ఇంట్లో వాళ్ల కంటే ముందు విజయవాడ వెళ్లి, మా బంధువుల ఇంట్లో మకాం వేసి, ఇంటర్ ఏ కాలేజీలో చేరితే బాగుంటుందనే ఎంక్వయిరీ మొదలెట్టాను. వడపోతల అనంతరం 'లయోలా', 'సిద్ధార్థ'లు తేలాయి. 'లయోలా' స్ట్రిక్ట్ అని చెప్పడంతో 'సిద్ధార్థ'లో చేరిపోయా కానీ, చేరాకగానీ తెలియలేదు ఇది అంతకంటే యమ స్ట్రిక్ట్ అని.

'568' గాడు

ఇంట్లోవాళ్లు నన్ను ఇంజనీరింగ్ పట్టాతో చూడాలనుకోవడంతో వాళ్ల ముచ్చట కాదనలేక ఎం.పి.సి తీసుకున్నా గానీ, నేను చేరవలసిన గమ్యం అది కాదని నా ఇంగితం చెబుతూనే ఉండేది. కాలేజీలో చేరిన తొలిరోజే లెక్చరర్ 'మీ పరిచయాలు చేసుకోండి' అనడంతో, ఒక్కొక్కరం చెప్పుకుంటూ వెళ్తున్నాం. ఇంతలో ఒకడు తక్కున లేచి, చేతులు కట్టుకుని 'ఐ యామ్ రాజేష్, ఫ్రమ్ శ్రీకాకుళం – 568 కిలోమీటర్స్' అని చెప్పేసి సీరియస్‌గా కూర్చున్నాడు. వాడు ఏం చెప్పాడో ... లెక్చరర్‌తో పాటు మాకెవరికీ అర్థంగాక తెల్లమొహం వేశాం. తర్వాత ఒకసారి లైబ్రరీలో కనిపించినప్పుడు అడిగితే 'బెజవాడనుండి సికాకుళానికి 568 కి.మీ. దూరం. అంత లాంగు నుండి వచ్చానంటే గొప్పే కదండీ' అంటూ పట్టపగలే చుక్కలు చూపించాడా సిక్కోలు సిన్నోడు ఉరఫ్ రాజేశ్ అగర్వాల్. అమాయకత్వమో, అతి తెలివితేటలో తెలియలేదు గానీ ఆ తర్వాత వాడి పేరు మాత్రం 568గా స్థిరపడిపోయింది.

అమ్మాయిలు లేనిచోట ...

అప్పట్లో మా కాలేజీలో అమ్మాయిలు లేకపోవడంతో కాలర్ ఎగరేస్తూ హీరోయిజం ప్రదర్శించే అవకాశం కుర్రాళ్లందరం మిస్ అవుతూ ఉండేవాళ్లం. మా లెక్చరర్లు నాగరాజు, అడుసుమిల్లి శ్రీనివాస్, వై. మధుసూదన్ గార్లు సాంస్కృతిక కార్యక్రమాలు బాగా ఆర్గనైజ్ చేసేవారు. మా హీరోయిజం ప్రదర్శించుకోవాలంటే అందులో ఏదో ఒక ఆక్టివిటీలో పాల్గొనాల్సి వచ్చేది. డిగ్రీ విద్యార్థులు యోగేష్ పాయ్ (కొంకిణి), సంజయ్ లుల్లా (మరాఠీ), రామన్ శేషాద్రి (తమిళం)లు కల్చరల్ టీమ్ లీడర్లు. వాళ్లను ఒప్పించి డిబేటింగ్‌లో పాల్గొని 'సమాజంపై సాహిత్యం ప్రభావం' అనే టాపిక్‌పై అనర్గళంగా మాట్లాడి 'బెస్ట్ ఎంగ్ స్పీకర్'గా మొదటి ఫ్రైజ్ కొట్టేశాను. అది మొదలు సీనియర్ ఇంటర్ వచ్చేసరికి దాదాపు 40 ఫ్రైజులు గెలిచాను. ఇంట్లో ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ రాయమని ఎంత మొత్తుకున్నా ... అక్కడే బి.ఎస్.సి కంటిన్యూ చేశానంటే ఆ కాలేజీని ఎంతగా ఇష్టపడ్డానో అర్థం చేసుకోవచ్చు. తర్వాత వరంగల్ ఆర్.ఇ.సికి వెళ్లి అక్కడా ఫస్ట్ ఫ్రైజ్ తీసుకురావడంతో మనమొక సెలబ్రిటీగా మారిపోయాం. ఎంచేతంటే ఆర్.ఇ.సి. నుండి ఫ్రైజ్ తెచ్చిన మొదటి స్టూడెంట్‌ని నేనే గనక.

'సృజనోత్సవ్' అలా మొదలైంది

కొన్నాళ్లయ్యేసరికి కాలేజీ తరపునుండి ఇతర కాలేజీలకు వెళ్లి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సుమారు 340 ఫ్రైజులు తీసుకొచ్చాను. ఎప్పుడూ మేం మరో కాలేజీకి వెళ్లడమేనా? మా కాలేజీలో కార్యక్రమాలు నిర్వహించి ఇతర కాలేజీ స్టూడెంట్స్‌ని ఆహ్వానించవచ్చు కదా అనే ఆలోచన రావడం ఆలస్యం, మా సిద్ధార్థ అకాడమి ట్రెజరర్ 'ముమ్మనేని సుబ్బారావు (హీరో శర్వానంద్ తాతయ్య) గారితో నా మనసులోని మాట చెప్పాను. ఆయన ఆలోచించి, వెంటనే అమలు చేశారు. అలా 'సృజనోత్సవ్' రూపుదిద్దుకుంది. తొలి సారి భారీ ఎత్తున పండగలా చేశాం. వివిధ కాలేజీల నుండి 1500 మంది స్టూడెంట్స్ వచ్చారు. కొసమెరుపు ఏంటంటే ఇప్పుడు చిత్ర ప్రముఖులైన కులశేఖర్, గాయని సునీతగార్లు ఆ ప్రోగ్రాంలో పాల్గొని బహుమతులు తీసుకోవడం. అప్పట్లో 'లయోలా' కాలేజీలో చదివే (ఇప్పటి దర్శకులు) ఇంద్రగంటి మోహనకృష్ణ కూడా వచ్చారు. కార్యక్రమాలకు నన్ను కో – ఆర్డినేటర్‌ను చేయడంతో మరింత బిజీ బిజీగా ఉండేవాడ్ని. ఒకసారి నాగార్జున యూనివర్సిటీ తరపునుండి నార్త్ ఇండియాలో జరిగిన 15 రోజుల యూత్ ఫెస్టివల్ వెళ్లి రాజీవ్‌గాంధీగారి చేతుల మీదుగా మెమెంటో అందుకున్నా. అదొక స్వీట్ మెమోరీ నాకు.

'శివ' ప్రభావం ఉండేది

స్టూడెంట్స్‌లో గ్రూపు తగాదాలు బాగానే ఉండేవి. యు.ఎస్.ఒ, యు.ఐ. అనే రెండు గ్రూపుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని ఉండేది. అప్పట్లో వచ్చిన వర్మగారి 'శివ' సినిమా ప్రభావం కూడా స్టూడెంట్స్‌పై చాలా ఉండేది. ఎంతలా అంటే, ఆ సినిమాలోని 'భవానీ'ని ఇమిటేట్ చేస్తూ, సాక్సుల్లో రాడ్లూ, బటన్ నైఫ్‌లూ దాచుకుని, పిడికిలి చుట్టూ వెహికిల్ చైన్లు తిప్పుకుంటూ తిరిగేవాళ్లు. ఈ రెండు గ్రూపుల మధ్య ఏదైనా రాజుకుందంటే ... కాలేజీ గేట్లు మూసేదాక వచ్చేది. మొగల్రాజపురం అంతా విద్యార్థుల కవాతుతో దద్దరిల్లేది. ఇలాంటి గొడవల్లోనే ఒకసారి కాలేజీలోకి ఎవ్వర్నీ పోనివ్వటం లేదు. ఆ టైంలో నేను కాలేజీలోకి ఎంటరవుతుంటే కొందరు ఆపేశారు. అక్కడే ఉన్న యు.ఎస్.ఒ.కి సంబంధించిన రమణ నన్ను ఒక్కడిని మాత్రం లోపలికి వదలమని ఆర్డరేశాడు. లోపలికి వెళ్లినా, నేను క్లాసుకు వెళ్లనని ఏ కల్చరల్ ప్రోగ్రాం గురించో కసరత్తు చేస్తానని వాళ్లకంత నమ్మకం మరి.

నాగార్జునకు సన్నివేశం వివరిస్తూ...

డిసెంబర్ 31 హంగామా

న్యూ ఇయర్ రాబోతోందంటే వీరలెవల్లో మందు పార్టీ చేసుకోబోతున్నట్టు ఒకటే హంగామా చేసేవాళ్లం. మా పార్టీ ఏంటో తెలుసా? ఒకటిన్నర లీటర్ల 'స్ప్రయిట్' సాఫ్ట్ డ్రింక్ విత్ మిక్చర్. అంతే! ఒక డిసెంబర్ 31కి మా ఫ్రెండ్ ఇంట్లో కలిశాం అంతా. ఆ ఫ్రెండ్ రూమ్మేట్ (పేరెందుకు లెండి) అప్పటికే ఉద్యోగి. జీతం అందుకున్న రోజు కావడంతోనో, కొత్తగా ఉద్యోగం వచ్చిందనో ... సర్‌ప్రైజ్ చేయడానికి, ఎవ్వరికీ తెలియకుండా పీపాల కొద్దీ బీర్లు తెచ్చి మేడపైని వాటర్ ట్యాంకులో పోసేశాడు. నీళ్లు తాగుదామని పంపు విప్పి (మసక వెలుగులో రంగు గమనించలేదు) గొంతులో పోసుకోగానే కుంకుడుకాయ రసం తాగినట్టు చేదు. వాంతి చేసుకున్నంత పనైంది. ఇలా సర్‌ప్రైజ్ చేయడంలో అఖండుడు తను. 'ఎల్' షేప్‌లో ఉండే ఆ బిల్డింగులో అంతా బాచిలర్లు ఉండబట్టి సరిపోయింది కానీ అదే ఏ ఫ్యామిలీ వాళ్లో ఉండి ఉంటే ....?! నిషా నషాళానికి ఎక్కిన తర్వాత ఆ అర్ధరాత్రి 'మొగల్రాజపురం వీధుల్లో నూలుపోగు లేకుండా ఎవరైనా తిరిగొస్తారా' అంటూ తొడగొట్టి సవాల్ విసిరేవాడు. పందెం డబ్బు వేలో లక్షలో అనుకునేరు! కేవలం రూ. 5 మాత్రమే.

నా సంపాదన నాదే ...

నా పాకెట్‌మనీకి ఇంట్లో ఆధారపడ్డం అనేది ఎప్పుడోగానీ జరిగేది కాదు. మొదట్లో ఆగస్టు 15 లాంటి రోజుల్లో రేడియోలో జరిగే ప్రత్యేక కదంబ కార్యక్రమాల్లో పాల్గొని రూ.150 నుండి 500 వరకూ సంపాదించేవాణ్ణి. వాటితో సినిమాలు ... అప్పట్లో విజయవాడలో ఉన్న పాతిక థియేటర్లూ జల్లెడ పట్టేసి ... కొత్తసినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసేవాణ్ణి. అంత సినిమా పిచ్చి.

ఒకసారి మా ఫిజిక్స్ లెక్చరర్ టి.వి.ఆర్‌గారికి ఫేర్‌వెల్‌పార్టీ ఇస్తున్నప్పుడు ఆయన నన్ను 'నీ ఫ్యూచర్ ప్లాన్' ఏంటి అని అడిగితే తడేమని 'ఫిలిం డైరెక్టర్ నవుతా'నన్నాను. ఇంజనీర్‌గానో, సివిల్స్ రాసి పెద్ద ఆఫీసర్‌గానో అవతరించి ఉద్ధరిస్తానని అందరూ కలలు కనేవాళ్లుగానీ నేను మాత్రం మొదట్నించి సినిమా డైరక్టరు అవ్వాలనుకునేవాణ్ణి. నా కలల్ని సాకారం చేసుకోవడానికి డిగ్రీ అయిపోగానే చలో మద్రాస్ అంటూ ఆరోజే ప్రారంభమైన 'పినాకిని' ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాను.

'భైరవద్వీపం' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టరుగా ఉన్న రోజుల్లో సిద్ధార్థ కాలేజీవాళ్లు పిలిచి బెస్ట్ అవుట్ గాన్ స్టూడెంట్‌గా గుర్తించి 'మిస్టర్ సిద్ధార్థ' అనే బిరుదుతో మా పేరెంట్స్ ముందు నన్ను సన్మానించడం జీవితంలోని మరచిపోలేని మధుర ఘట్టం. తర్వాత 'మనసంతా నువ్వే' చిత్ర దర్శకుడిగా మీ ముందుకు రావడం ... ఆ తర్వాత ఏం జరిగిందో నాకంటే మీకే బాగా తెలుసు! కానీ ... ఇప్పటికీ ప్రతి ఏడాదీ జరిగే సిద్ధార్థ 'సృజనోత్సవ్'కి నాతో పాటు ఒకరిద్దరు సెలబ్రిటీలను వెంట తీసుకుని వెళ్లి ఆ ఉత్సవంలో పాల్గొంటాను. ఆ రకంగా నా హ్యాపీడేస్‌ని నేను ఎప్పటికీ మిస్ కాను.

adityavnagendra@yahoo.com

– గొరుసు జగదీశ్వరరెడ్డి

అమ్మమ్మా... అల్లరి పిడుగమ్మా!

నేను పుట్టింది ఏలూరులోనే అయినా నాన్నగారి బదిలీల వలన పిల్లి పిల్లల్ని మార్చినట్టు ఆయన మమ్మల్ని రాష్ట్రమంతా తిప్పారు. నాన్నగారు రచయిత కావడంతో ఇంట్లో సాహితీ సంపద చాలా ఉండేది. ఇల్లు మారినప్పుడల్లా ఇతర సరంజామా రవాణా చేయడం ఒకెత్తయితే, పుస్తకాలు రవాణా చేయడం అంతకు పది రెట్ల శ్రమగా ఉండేది.

నేను కాస్త అల్లరి ఎక్కువే చేసేవాడ్ని. ఎక్కువ దెబ్బల రుచి చూసింది జంగారెడ్డి గూడెంలో. ఒకసారి మజ్జిగ కవ్వం విరిగేలా తగిలించారు. తోటి పిల్లలు గుజ్జనగూళ్లు కట్టుకుంటుంటే హనుమంతుడిలా వాటిపై ఎగిరి లంఘించడం, నాన్న మాటకు ఎదురు చెప్పడం... ఎవరైనా కొట్టకుండా ముద్దెట్టుకుంటారా చెప్పండి? అయితే, ఆ దెబ్బలకు తగ్గట్టుగా తర్వాత తాయిలాలుండేవి. దెబ్బలు మరిచిపోవడానికి అవే కాస్త తెరపి మరి.

నా ఆటలన్నీ వయసులో నాకంటే పెద్దాళ్ళతోనే. దాంతో మనకు 'బాలముదురు' అనే బిరుదు కూడా ఉండేది. మా అన్నదమ్ములందరికీ నాన్నగారు వేదం నేర్పించడంతో ఎవరింటికి వెళ్లినా 'ఏదీ, బాలవటువుల్లా పట్టుపంచెలు కట్టుకుని వేదం చదవండ్రా' అని పురమాయించేవారు. అప్పుడు మాత్రం వేదాలు వల్లిస్తూ బాలపండితులమయ్యేవాళ్లం.

ఎంత అల్లరి చేసినా, చదువుల్లో ముందే ఉండేవాణ్ణనుకోండి. కాకపోతే టెన్త్‌లో మూడు పేపర్లు రాయగానే 'పేపర్ లీకయింద'ంటూ పరీక్షలు ఆపేశారు. మళ్లీ ఎప్పుడు పెడతారో తెలియదు. దాంతో తాతవాళ్ల ఇంటికి ఏలూరు వెళ్లిపోయి సినిమాలు చూస్తూ ఉండిపోయా. అప్పుడే 'స్వాతి ముత్యం' సినిమాని 15 సార్లు వరసగా చూసేశా. తర్వాత ఎగ్జామ్స్ రాశాగానీ, ముందు రాసిన మూడుపేపర్లలో 90 మార్కులు దాటితే, తర్వాత రాసిన వాటిల్లో 60 లోపే ... మరి సినిమాల ప్రభావం!

గుర్తు పట్టండి

1

2

3

4

5

వీరంతా మన పొరుగు రాష్ట్రాధినేతలు. వీరిని గుర్తు పట్టగలరా?

'రియల్ స్పైడర్' మాన్

మీకు తెలుసా?

ఇతడు సినిమా స్పైడర్ మాన్ కాదు. నిజమైన స్పైడర్ మాన్. పేరు అలైన్ రాబర్ట్. ఎత్తైన గోడలు కనిపిస్తే చాలు చిన్నప్పటి నుంచి కూడా అతడి కాళ్లు, చేతులూ ఆటోమేటిగ్గా కదిలిపోయేవి. అవి ఎక్కేసి ఖుషీ ఖుషీ అయిపోయే వాడు. రాను రాను ఆ ఖుషీ అలవాటులోకి మారిపో యింది. ఆ అలవాటు వల్ల 20 ఏళ్ల వయసులో ఒకసారి కూలబడ్డాడు. ఎముకలు విరి గాయి. 'ఇక డేకుతూ గడపవల సిందే పో' అన్నాడు డాక్టరు. ఆరు నెలలపాటు పడకదిగలేదు. కానీ కలలు మానలేదు. మళ్లీ ఆరోగ్యం సాధించాడు. ఈసారి ప్రపంచ స్థాయిలో ఎత్తైన కట్టడా లను ఏరి, కోరి ఎక్కేశాడు– పారిస్‌లో ఈఫిల్ టవర్, సిడ్నీలో ఒపెరా, మలేషియాలో ట్విన్ టవర్స్, అమెరికాలో సియర్స్ టవర్, దుబాయ్‌లో బుర్జ్ ఖలీఫా, చైనాలో ద సెంట్రల్ ప్లెయిన్స్ ఫొర్టాలెజా భవనం ..ఇలా 90 దాకా. ఇన్ని విజయాల్లో అతడికి తోడుగా ఉన్నవి రెండే– ఒక జత బూట్లు, చేతి చెమటను పీల్చుకునే చాక్పీసు పెట్టె. క్లిక్కుమనిపించే కెమెరాలను పట్టించుకోడు. ఎవరి అనుమతి కోసం వేచివుండడు. పెద్దగా రక్షణ ఏర్పాట్లు చేసుకోడు. ఈ సారి అతడి లక్ష్యం ప్రపంచంలోని ఎత్తైన హోటళ్లలో రెండవదైన (1,053 అడుగులు) బుర్జ్ అల్ అరబ్. మిస్ కాకుండా చూసేద్దామామరి !

పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో మొదటి అక్షరం 'ప' మూడవ అక్షరం 'ము' గల మూడు అక్షరాల పదాలను పూరించండి.

1. మార్గము — ప ☐ ము
2. భారతంలోని భాగం — ప ☐ ము
3. పదిహేను రోజులు — ప ☐ ము
4. తెలుగు మ్యాప్ — ప ☐ ము
5. ఎత్తు కాదు — ప ☐ ము
6. దోరగా పండడం — ప ☐ ము
7. ఆకు — ప ☐ ము
8. ఒక నీటి పూవు — ప ☐ ము
9. గద్యము కానిది — ప ☐ ము
10. ముకుతాడు — ప ☐ ము

నిర్వహణ : చేబియ్యం రామారావు

చెప్పండి చూద్దాం

1. బార్క్ పూర్తి పేరేమిటి?
2. పిఎస్ఎల్‌వి–సీ21 ఏయే దేశాల ఉప గ్రహాలను అంతరిక్షంలోకి తీసుకెళ్ళింది?
3. బ్రిటన్‌కు ఎన్నేళ్ళ నిరీక్షణ తర్వాత గ్రాండ్‌స్లామ్ టైటిల్ దక్కింది?
4. హైదరాబాద్‌లో ప్రస్తుతం జరుగుతున్న సదస్సు పేరేమిటి?
5. శ్రీలంకలో జరుగుతున్న 'పొట్టి క్రికెట్ టోర్నీ'లో ఎన్ని దేశాలు ఆడుతున్నాయి?

రంగులు వేయండి

నా బొమ్మ

వై. శ్రావణి, 5వ తరగతి
ఆదిత్య పబ్లిక్ స్కూల్,
పాలకొల్లు, పశ్చిమ
గోదావరి జిల్లా.

దారి కనుక్కోండి

జవాబులు

చెప్పండి చూద్దాం
1. బాగా ఆడాలంటే ఓపెనర్స్ నిండుగా 2. భోస్వ్, జపాన్ 3. 76 ఏళ్ళు 4. ఐదు లైబ్రరీల సమస్య 5. శ్రీలంక

పదవిన్యాసం
1. జగతికి నెఱుగుట– కథనుక 2. జనసరళి–ఆకుపచ్చ
3. రమణీయం– భక్తిమార్గ 4. ఉత్తరాంధ్ర– కరీంనగర్
5. పరిచిన మార్గాలకే– ఉపాధి

గుర్తు పట్టండి
1. కథలు 2. కవులు 3. నెక్లెసు 4. నవలు 5. నవ్వులు 6. కళ్ళలు
7. కలలు 8. కమలం 9. కవితలు 10. కర్రలు

బొద్దింక రోబో!

ఏడు అంగుళాల ఈ బొద్దింకను చూశారా! దీని పేరు చెబితే, దీని రూపు చూస్తే మనుషులు భయంతో పరుగులు తీస్తారో ఆ బొద్దింకే ఇది. అయినా.. అన్ని లెక్కలూ సరిగ్గా కుదిరితే ఇదే త్వరలో మన ఖాతాలో చేరబోయే కొత్త స్నేహం. దీనికి అన్ని ప్రత్యేకతలేమిటబ్బా అని కదా మీ సందేహం ? డైనోసార్ల కాలం నుంచి భూమ్మీద ఒక వెలుగు వెలుగుతున్న కీటకం ఇది. అంటే ఎన్నో వాతావరణాలను తట్టుకుని మనముందు తిరుగులాడుతోందని. దీనికి ఫలానా ఆహారమే తినాలని నియమం లేదు. ఎండిన చర్మం, చెక్క ముక్క, బీరు..ఏదైనా లాగించేస్తుంది. ఒక్కోసారి నెలరోజులైనా తిండి మాటెత్తకుండా ఉండిపోతుంది. అంతేనా? తల కత్తిరించినా వారం పాటు బతికేస్తుంది. 40 నిమిషాలపాటు ఊపిరి బిగపట్టుకుని ఉండిపోతుంది. గంటకు 3 మైళ్ల వేగంతో చకచకా తిరిగేస్తుంది. ఎంత చిన్న సందు దొరికినా దూరేస్తుంది. అది మూటగట్టుకున్న ఇన్ని 'వరాలను' గమనించాడు కాబట్టే, ఇంజనీరింగ్ ప్రొఫెసర్ అల్పర్ బోజ్‌కర్ట్ (నార్త్ కరోలినా) దీనిపై ఎన్నో ప్రయోగాలు జరిపాడు. భూకంప శిథిలాల్లో చిక్కుకున్న వారిని రక్షించగలిగే కీటకంగా దాన్ని గుర్తించి, బుల్లి రోబో బొద్దింకల్ని తయారు చేసే ప్రయత్నంలో తలమునకలై ఉన్నాడు. ఆల్ దబెస్ట్ అల్పర్.

సరదాగా...

చిందోగు

కెంజి కవాకమి హైస్కూల్ దశలో పాడుబడ్డ స్కూటర్ విడిభాగాలతో నాలుగు చక్రాల బుల్లి బండిని తయారు చేసాడు. మరో బొమ్మ సైకిల్, పిల్లికోసం డస్టర్‌తో కూడా చెప్పులు చేసాడు. అప్పుడు అతడు ఒక చిన్న పత్రికకు ఎడిటర్. తను కనిపెట్టిన వాటి గురించి ఆ పత్రికలో రాయడంతో ప్రసిద్ధుడయ్యాడు. ఇలా కాకుండా కొంచెం పనికొచ్చేవి, సరదా పుట్టించేవి కనుగొని, వాటి గురించి రాద్దామని ట్రెండు మార్చాడు. అలర్జీబారిన పడినవారికి కావలసినంత టిష్యూ పేపర్ అందించే పరికరం (దాని పేరు హే ఫీవర్ హ్యాట్), రోడ్డు క్రాస్ చేసేందుకు చక్రం గల మడత చెక్క, పాప కదలికలను బట్టి నేలను శుభ్రంచేసే తుడుపుకర్ర..ఇలా 20 సంవత్సరాలలో 700 పరికరాలు కనుగొన్నాడు. ఆ విద్యకు చిందోగు అని నామకరణం చేసాడు. ఇప్పుడతడు జపాన్,అమెరికావారికి వినోదం పంచేవాడు. యూరప్‌కు ఆధునిక కళాకారుడు. కొరియా, ఆస్ట్రేలియా, కెనడావారికి సైంటిస్టు. ఆయా దేశాలవారికి కెంజిని అలా చూపే మూడు పుస్తకాలూ ఇప్పుడు మూడు హాట్‌కేకులు.

"ఇంట్లో పిల్లల అల్లరిని పాజిటివ్‌గా చూడాలి. ఒక్కోసారి వాళ్ల అల్లరి వల్లే.. ఆఫీసు నుంచి మన వెంటపడి వచ్చే సమస్యలు మాయమైపోతాయి. పిల్లలతో కలిసిపోవడం ఒక స్వభావంగా మారితే మానసిక ఆరోగ్యం బాగుంటుంది.."

– డాక్టర్ మయూర్‌నాథ్ రెడ్డి, మానసిక వైద్యులు

మనిషికి ఇప్పుడొచ్చిన దుర్భరమైన కష్టమేమిటో తెలుసా? మనసుకు కష్టమొస్తే ఓ అర గంట బాధల్ని వినే నాథుడు దొరకకపోవడం. ఎదుటివాళ్ల కన్నీటిని తుడిచి, ఓదార్చే స్నేహశీలి మాయమైపోవడం. ఇలాంటి సంక్షోభంలో గంట గంటకూ వచ్చే పేషెంట్ల మనోవ్యాధుల్ని విని.. వైద్యం చేసే మానసిక వైద్యుల పరిస్థితి ఎలా ఉంటుంది? వాళ్ల మనసుల మీద ఎలాంటి ప్రతికూల ప్రభావం పడుతోంది..? ఆస్పత్రుల నుంచి బయటపడ్డాక.. ఎలా రిలాక్స్ అవుతున్నారు? అని కొందరు సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో మాట్లాడితే.. వాళ్లు చెప్పిన కబుర్లే ఈ వారం కవర్‌స్టోరీ.

"రోజుకు 20 మంది పేషెంట్లకు వైద్యం చేస్తే.. ఇంటికి వెళ్లాక అందులో కనీసం ముగ్గురు పేషెంట్లు గుర్తుకొస్తారు. వాళ్లు సమస్యాత్మకమైన వారై ఉంటారు. వారిని సైతం మరిచిపోయి మనః శరీరాలను తేలిక చేసుకునేందుకు 'జాకబ్‌సన్ ప్రోగ్రెసివ్ మజిల్ రిలాక్సేషన్ థెరపీ' చేస్తుంటాను నేను. దీనితో అరికాలు నుంచి తల వరకు శరీరంలోని ప్రతి భాగానికీ సాంత్వన చేకూర్చుకోవచ్చు.."

– నరేష్ వడ్లమాని, కేర్ హాస్పిటల్, బంజారాహిల్స్

"శరీరం బడలికగా ఉన్నప్పుడు వేణువు, వీణ, పియానో వంటి ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాన్ని వింటాను"

'మనో' వైద్యుల మనసు వైద్యం!

1

మొదటిసారి ఎవరికైనా రాజధానిలోని మానసిక చికిత్సాలయానికి వెళితే.. పిప్పికొనంత పనవుతుంది. మెదడు ఆధీనం కోల్పోతే మనిషి జీవితం ఇంత దుర్భరంగా మారుతుందా? అనిపిస్తుంది. మనిషిని మనిషిగా కాకుండా చేసే శిక్ష కన్నా పెద్ద శిక్ష మరేముంటుంది? అన్న బాధ కలుగుతుంది. ఆస్పత్రిలో పదినిమిషాలు గడిపితే మనకే ఇలాంటి వైరాగ్యం ఆవహిస్తే.. 30 ఏళ్లపాటు మెంటల్ హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్ పరిస్థితి ఏమిటి..? అక్కడున్న పేషెంట్లందర్నీ మరిచిపోయి.. సాయంత్రం మామూలు మనిషిగా ఇంటికి వెళ్లగలరా..? ఇదే ప్రశ్న ఆయన్ని అడిగితే ఒక్క క్షణం ఆలోచించి "మాకు రోగుల పట్ల వ్యక్తిగత భావోద్వేగాలు ఉండవు. అలాంటి బంధం రోగులకు, వైద్యులకు ఇద్దరికీ మంచిది కాదు. ఇది నేను నమ్మే ఫిలాసఫీ. సీటులో కూర్చున్నంత వరకు నేను వైద్యనిపుణుడ్ని మాత్రమే. ఇంటికి వెళితే డాక్టరును కాదు, మామూలు మనిషిని. అయితే, ఆ ప్రభావం అస్సలు ఉండదని కాదు. మేము బాధలు వినే వృత్తిలో ఉన్నాం కాబట్టి.. మా మీద వాటి తాలూకు నెగెటివ్ వైబ్రేషన్స్ ఎంతో కొంత ఉంటాయి. దీన్ని బ్రేక్ చేసేందుకు ఒక్కో సైకియాట్రిస్టు ఒక్కో వ్యాపకాన్ని ఎంచుకోవడం సహజం. ఇదిగో నేను ఈ కొత్త సెల్‌ఫోన్‌తో తాలా మటుకు రిలాక్స్ అవుతుంటాను" అంటూ శ్యామ్‌సంగ్ గెలాక్సీ–2 నిరీస్ మొబైల్‌ను చూపించారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్‌ల గురించి యమస్సీడుగా అప్‌డేట్ అవుతారాయన. తను వాడుతున్నది ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్ మొబైల్ కాబట్టంతో.. నెట్ చూసుకోవడం చాలా సులభం. "ఎప్పుడు ఖాళీ దొరికినా.. నెట్‌లోకి వెళ్లిపోతాను. మెయిల్స్ చెక్ చేసుకోవడం. రైళ్లు, విమానాల రాకపోకల వేళల్ని తెలుసుకోవడం, వైద్యపరిశోధన విషయాల్ని అధ్యయనం చేయడం నాకు సరదా. కొత్త విషయాల్ని తెలుసుకోవాలనిపిస్తే.. టక్కున వికీపీడియా ఓపెన్ చేసి చదివేస్తుంటాను.." అన్నారు. త్వరలోనే ఐపాడ్–2 కొనుక్కుని తన రిలాక్సేషన్ సాధనాన్ని అప్‌గ్రేడ్ చేసుకోనున్నారట ఈ సీనియర్ సైకియాట్రిస్టు.

2

మృత్యువు అంచులకు వెళ్లిన ఎంతోమందికి పునర్జన్మ ప్రసాదిస్తున్న క్లినికల్ సైకాలజిస్టు కె.నిరంజన్‌రెడ్డి. వైద్యుడిగా నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. ఎంత బిజీలో ఉన్నా.. విసుగు అన్నదే ఎరుగరు. క్లినికల్ సైకాలజీ ప్రొఫెసర్‌గా పదవీవిరమణ చేసి.. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'రోమ్స్ కౌన్సెలింగ్ సెంటర్'లో పనిచేస్తున్నారు. "మీరు రోజూ కష్టాలు వింటుంటారు. అది మీ వృత్తి అయినా.. ఆ ప్రభావం నుంచి మీరెలా బయటపడుతుంటారు?" అంటే– గలగల నవ్వేశారాయన. "నాకు ఈ వృత్తిలోనే గొప్ప సంతృప్తి దొరుకుతుంది. గుండెల్లో భరించలేని బాధను పెట్టుకుని నా దగ్గరికి వస్తుంటారు. వాళ్ల కష్టాన్ని అర్థం చేసుకుని.. ఏ చిన్న దారి చూపించగలిగినా.. అదే చాలనిపిస్తుంది. మానసికంగా తిరిగి కోలుకున్న రోగులు నా వద్దకు వచ్చి కృతజ్ఞతలు చెప్పినప్పుడు సంతోషమేస్తుంది.." అన్నారు ఆయన. మానసిక జబ్బుల్ని నయం చేసే వైద్యులు కూడా మనుషులే! వాళ్లకు కూడా కొన్ని మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. "రోగులకు చిత్తశుద్ధితో వైద్యం చేయాలి. ఎంత ప్రయత్నించినా.. కొన్ని కారణాలవల్ల రోగిలో మార్పు రాకపోవచ్చు. ఎందుకు ఇలా జరుగుతోందని తీవ్రంగా స్పందిస్తూ పోయే వైద్యులకు.. 'బర్న్ అవుట్ సిండ్రోమ్' వచ్చే అవకాశం ఉంది. సేవారంగంలో ఉన్న వాళ్లందరికీ ఈ జబ్బు వచ్చే అవకాశముంది" అంటున్నారీ వైద్యుడు.

మానసిక ఒత్తిళ్లను తగ్గించుకునేందుకు తను ఎంచుకున్న థెరపీ 'గైడెడ్ ఎఫెక్టివ్ ఇమాజినరీ'. అంటే క్లినిక్‌లో కాస్త తీరిక దొరికినప్పుడు.. కళ్లు మూసుకుని తనకు నచ్చిన ఒక అద్భుత సౌందర్యలోకంలో విహరించి వస్తారు నిరంజన్‌రెడ్డి. "దీన్ని ఎవరైనా చేయవచ్చు. ఓ పది నిమిషాలు కేటాయిస్తే చాలు. మనకు జలపాతం, పూలమొక్కలు, పక్షులు నచ్చాయనుకోండి. ఆ ప్రపంచాన్ని మనకు మనమే ఊహించుకోవడమే ఈ థెరపీ. దీన్ని జర్మన్ సైకియాట్రిస్ట్ హాన్స్‌కార్ల్ ల్యూనర్ అభివృద్ధి చేశారు" అని చెప్పారు.

క్లినిక్ నుంచి ఇంటికి వెళుతూనే.. విశ్రాంతి కోసం 'త్రీడేస్ ఫార్ములా' నొకదాన్ని కూడా రూపొందించుకున్నారు నిరంజన్‌రెడ్డి. ఆయనకు పాత పాటలంటే ప్రాణం. 'మాయాబజార్', 'గుండమ్మ కథ'లాంటి సినిమాలంటే కూడా చాలా ఇష్టం. ప్రతి మూడు రోజులకు– ఒకరోజు పాటలు వినడం, ఒక రోజు సినిమాలు చూడటం, ఒక రోజు స్నేహితుల్ని కలవడం.. చేస్తుంటారు. ఎవరికైనా పనికొచ్చే మంచి ఫార్ములానే ఇది.



మొబైల్‌తో కాలక్షేపం: డాక్టర్ ప్రమోద్ కుమార్, మానసిక చికిత్సాలయం, హైదరాబాద్

3

సైకియాట్రిస్టుల్లో అనుభవజ్ఞురాలైన డాక్టర్ గౌరీదేవి.. సమయం చిక్కితే చాలు. కిచెన్‌లో వంటలు చేస్తూనో, గార్డెన్‌లో పూటతొట్లను శుభ్రం చేస్తూనో కనిపిస్తారు. "ఈ రెండు పనుల్ని నేను చాలా ఇష్టంతో చేస్తాను. అందుకే, ఆస్పత్రి నుంచి వస్తూనే అది మొదలు పెట్టేస్తే మనసు తేలికవుతుంది" అంటారామె. "జీవితంలో విఫలమైన వారు, మోసానికి గురైన వారు, బాధల్ని దిగమింగుతూ బతికేవారు.. నా దగ్గరికి వస్తుంటారు. వాళ్ల మనోవ్యథల్ని వినడం నా విధి. వాళ్ల బాధలోకి నేను వెళ్లిపోతే వైద్యం చేయలేను. మేమెప్పుడూ పేషెంట్‌ను బయటి నుంచే అర్థం చేసుకుంటాము. లోపలికి వెళ్లే ప్రయత్నం చేయము. ఈ వృత్తికి 'అబ్జెక్టివ్ అసెస్‌మెంట్' ముఖ్యం. సబ్జెక్టివ్‌గా ఉండడం కాదు. మేము సబ్జెక్టివ్‌గా ఉంటే పేషంట్‌కు కూడా నష్టమే. ప్రతి మనిషికీ ఎదుటి వాళ్ల పట్ల జాలి, దయ ఉంటాయి. అలాగని ప్రతి దాన్నీ మనసులోకి తీసుకోకూడదు. వృత్తిధర్మానికి, వ్యక్తిగతానికి స్పష్టమైన నిబంధనల్ని పెట్టుకుంటేనే మనసుకు ప్రశాంతత లభిస్తుంది.." అన్నారు. ఒకప్పుడు ఆమె వృత్తిలో ఎదురయ్యే ఒత్తిళ్లను తగ్గించుకునేందుకు సంగీతాన్ని ఔషధంగా చేసుకునేవారు. "నేను గతంలో వీణ వాయించేదాన్ని. ఇప్పుడు మళ్లీ మొదలుపెట్టాలనుకుంటున్నాను. పండుగలు, వేడుకలన్నా కూడా నాకు చాలా ఇష్టం. స్నేహితుల్ని, బంధువుల్ని కలవడం, దేవాలయాలకు వెళ్లడం, ఇంట్లో పూజలు చేయడం.. మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఇది మన సంస్కృతి మనందరికీ ఇచ్చిన వరం.." అని చెప్పారు. మందుచీటీలతో వైద్యం చేసే డాక్టర్ గౌరీదేవి.. ఇప్పుడు పొట్టికథలు రాసి.. అక్షర వైద్యం చేసేందుకు రెడీ అవుతున్నారు.

'గైడెడ్ ఎఫెక్టివ్ ఇమాజినరీ' చేస్తున్న రోమ్స్ కౌన్సెలింగ్ సెంటర్ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కె.నిరంజన్‌రెడ్డి

4

లండన్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో సైకియాట్రీ చేసిన నరేష్ వడ్లమానికి– వైద్యుడికీ, రోగికీ ఉండాల్సిన సంబంధం గురించి స్పష్టంగా తెలుసు. "పేషెంట్‌కు వైద్యుల మీద కలిగే అభిప్రాయాన్ని ట్రాన్స్‌ఫరెన్సీ అని, వైద్యులకు పేషెంట్‌ల మీద కలిగే అభిప్రాయాన్ని కౌంటర్ ట్రాన్స్‌ఫరెన్సీ అని వైద్యపరిభాషలో పిలుస్తారు. ఈ అంశం మీద మాకు మెడిసిన్‌లో శిక్షణ ఉంటుంది. కొంతమంది రోగులు వైద్యులు చెప్పినట్లు మందులు వేసుకోరు. జాగ్రత్తలు తీసుకోరు. అమూల్యమైన సమయాన్ని వెచ్చించి వైద్యం చేసినా.. పురోగతి కనిపించదు. అప్పుడు కాస్త కోపం వస్తుంటుంది. రోజుకు 20 మంది పేషెంట్లకు వైద్యం చేస్తే.. ఇంటికి వెళ్లాక అందులో కనీసం ముగ్గురు పేషెంట్లు గుర్తుకొస్తారు. వాళ్లు సమస్యాత్మకమైన వారై ఉంటారు. వారిని సైతం మరిచిపోయి మనః శరీరాలను తేలిక చేసుకునేందుకు 'జాకబ్‌సన్ ప్రోగ్రెసివ్ మజిల్ రిలాక్సేషన్ థెరపీ' చేస్తుంటాను నేను. దీనితో అరికాలు నుంచి తల వరకు శరీరంలోని ప్రతి భాగానికీ సాంత్వన చేకూర్చుకోవచ్చు.." అని తన అనుభవాన్ని చెప్పారు.

గిటార్ ప్రియుడు: కల్యాణ్ చక్రవర్తి, చైల్డ్ సైకియాట్రిస్ట్

మనసు పొరల్లో గూడుకట్టుకున్న ఎంతటి సమస్యకైనా మందిచ్చి నయం చేసే ఈ సైకియాట్రిస్టు.. తనకు సమస్య రాకుండా.. మ్యూజిక్ థెరపీని కూడా ఆశ్రయిస్తుంటారు. "శరీరం బడలికగా ఉన్నప్పుడు వేణువు, వీణ, పియానో వంటి ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాన్ని వింటాను" అన్నారు నరేష్. ఇల్లు, ఆస్పత్రి.. సమయపాలనలో ఒత్తిడికి అస్కారమే లేదంటున్న ఈ డాక్టర్ దగ్గర ఏడాదికి సరిపడా ప్రణాళిక ముందే తయారై ఉంటుంది. "కేంబ్రిడ్జ్‌లోని మా ప్రొఫెసర్ దగ్గర ఎప్పుడూ రెండేళ్ల జీవిత ప్రణాళిక ఉండేది. కుటుంబాన్ని విహారయాత్రలకు తీసుకెళ్లడం, జర్నల్స్‌కు ఆర్టికల్స్ రాయడం, ఎంతమందికి పేషెంట్లను చూడాలో నిర్ణయించుకోవడం, బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లడం.. ఇవన్నీ టైమ్‌టేబుల్ ప్రకారం చేస్తారాయన. ఈ విధానాన్ని అనుసరించకపోతే, నేను జబ్బులకు గురికావాల్సి వస్తుంది" అంటున్నారు కేర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వడ్లమాని.

"నేను గతంలో వీణ వాయించేదాన్ని. ఇప్పుడు మళ్లీ మొదలుపెట్టాలనుకుంటున్నాను. పండుగలు, వేడుకలన్నా కూడా నాకు చాలా ఇష్టం. స్నేహితుల్ని, బంధువుల్ని కలవడం, దేవాలయాలకు వెళ్లడం, ఇంట్లో పూజలు చేయడం.. మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఇది మన సంస్కృతి మనందరికీ ఇచ్చిన వరం.."

– డాక్టర్ గౌరీదేవి, సైకియాట్రిస్ట్, హైదరాబాద్

5

తిరుపతిలోని వెంకటేశ్వర మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఎన్.భాస్కర్‌నాయుడు.. మానసిక వైద్యంలో అనుభవజ్ఞుడైనా.. కొన్ని సమస్యలకు తాత్కిరతకు మించిన మందు లేదంటారు. అందుకే మనోవ్యాధిగ్రస్తులకు ఇచ్చే మందుగుళికల్లో.. కాస్త తత్వశాస్త్రాన్ని కలిపి ఇస్తుంటానని చెప్పారాయన. "చాలా యేళ్ల నుంచి ఈ వృత్తిలో పనిచేస్తున్నా నాకెవ్వరూ బోర్ కొట్టలేదు. పేషెంట్ల బాధలు నా మనసును ఇబ్బంది పెట్టలేదు. ఎందుకంటే, నా చేతిలో ఎప్పుడూ ఏదో ఒక ఫిలాసఫీ పుస్తకం ఉంటుంది" అంటూ వివేకానంద స్వామి రచనల్ని చూపించారు. భగవద్గీత సారాంశాన్ని అర్థం చేసుకుని, జీవితాన్ని ఆ దృక్పథంతో చూడటం అలవాటు చేసుకుంటే.. మానసిక సమస్యలకు విరుగుడు లభిస్తుందంటారీ డాక్టర్. "సైకాలజీ అన్నది విదేశాల నుంచి దిగుమతి అయిన శాస్త్రం. భగవద్గీత మన భారతీయాత్మ నుంచి పుట్టిన తత్వశాస్త్రం. గీత చదివితే– సమస్య మూలాల్ని పసిగట్టడం.. విశ్లేషించడం.. అర్థం చేసుకోవడం.. పరిష్కరించుకోవడం.. సులభమవుతుంది. ఈ గ్రంథం పట్టుకుంటే నేను అన్నీ మరిచిపోతాను" అన్నారు భాస్కర్‌నాయుడు.

పుస్తకాలు రాయడం నా అభిరుచి : డాక్టర్ శ్రీనివాస తేజ, మైండ్‌కేర్ హాస్పిటల్, నెల్లూరు

6

ఆ క్లినిక్‌లోకి వెళ్లేటప్పుడు దిగాలు ముఖాలు వేసుకుని వెళ్తే పేషెంట్లు.. బయటికి వచ్చేటప్పుడు మాత్రం చిరునవ్వుతో వస్తారు. మందుల కంటే ముందు ఆ డాక్టర్ చెప్పిన నాలుగు మాటలు రోగుల్ని అలా మార్చేస్తాయి మరి. నెల్లూరులోని మైండ్‌కేర్ హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రీనివాస తేజ వైద్యం చేసే తీరు అది. "మీరు ఎంతోమంది సమస్యల్ని వింటారు. వైద్యం చేస్తారు. ఆ ఒత్తిడి మీ మీద పడదా?" అని అడిగితే "క్లినిక్స్‌లో నుంచి బయటికి వస్తే డాక్టర్లూ అందరిలాంటి వాళ్లే. రిలాక్సేషన్ కోసం కొందరు మందుకొడతారు. కొందరు క్లబ్‌లకు వెళతారు. కొందరు పుస్తకాలు చదువుతారు. నేనైతే పుస్తకాలు రాస్తుంటాను. స్టెతస్కోపు ఇంట్లో పడేస్తూనే.. పెన్నూ పేపరు తీసుకుని.. గదిలో కూర్చుంటా. 'మాతృభాష ప్రాథమిక విద్య' అనే పుస్తకం రాశాను. మంచి స్పందన వచ్చింది. 'మంచి నిద్రకు మార్గాలు' అనే పుస్తకం కూడా బాగుందన్నారు స్నేహితులు. ప్రస్తుతం 'లైంగిక విద్య' అనే పుస్తకం రాస్తున్నాను. ఇవన్నీ కాకుండా మా పిల్లలతో ఎక్కువ గడుపుతాను. పాఠశాలలో వాళ్కుకు మరుసటి రోజు బోధించే పాఠాల్ని ఈ రోజే బోధిస్తుంటాను. అప్పుడు వాళ్లకు పాఠాలు సులువుగా అర్థమవుతాయి కదా. ఇంటికొస్తూనే.. నన్ను అభినందిస్తుంటారు. వాళ్ల కాంప్లిమెంట్స్ నాకు మంచి ఎంజాయ్‌మెంట్" అన్నారు ఈ నెల్లూరు డాక్టర్.

7

పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలంటే ఎంతో ఓర్పు కావాలి. వాళ్కితో ఏదైనా మానసిక సమస్యలొస్తే వైద్యం చేయడానికి ఇంకెంతో సహనం కావాలి. అలాంటి వృత్తిలో పనిచేస్తున్నారు డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి. రెయిన్‌బో ఆస్పత్రిలో చైల్డ్ సైకియాట్రిస్ట్‌గా పనిచేస్తున్న ఈ డాక్టర్ "వైద్యచికిత్స కోసం వచ్చే పిల్లల్ని దగ్గరికి తీసుకోవడం, వాళ్ల స్థాయికి వెళ్లి మాట్లాడటం, తల్లిదండ్రులకు నచ్చజెప్పడం నా పని. "ఈ వృత్తిలో ఒత్తిడి సర్వ సాధారణం. దాన్ని రోజూ కొనసాగిస్తే, వైద్యులు కూడా ఏదో ఒక రోజు జబ్బు పడాల్సి వస్తుంది. ఇంటికొస్తూనే క్లినిక్ విషయాలకు బ్రేక్ వేయగలిగే సామర్థ్యాన్ని ప్రతి వైద్యుడు అలవర్చుకోవాలి. లేకపోతే పనిచేయడం కష్టం" అంటున్న ఈ డాక్టరుకు కుటుంబ సభ్యులతో కలిసి వాకింగ్ చేయడం అలవాటు. సమయం చిక్కినప్పుడల్లా ఆ పనే చేస్తారు. భార్య గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్. కూతురు ఉంది. కుటుంబం తర్వాత ఆయనకు ఇష్టమైన వ్యాపకం సంగీతం. "మ్యూజిక్ శరీరానికి మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. మన ఉచ్ఛ్వాసనిశ్వాసాలల్ని క్రమబద్ధీకరిస్తుంది. వినడమే కాదు. నాకు స్వతహా పియానో, గిటారు వాయించడం తెలుసు. సంగీతాన్ని పలికిస్తూ.. వినడం వల్ల దృష్టికేంద్రీకరణ (అటెన్షన్ అండ్ కాన్‌సంట్రేషన్) పెరుగుతుంది. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రీయంగా రుజువైంది.." అన్నారు. వారాంతాల్లో కీ బోర్డ్‌ను ప్లే చేస్తూ.. ఆ తరువాతి వారానికి కావాల్సినంత ఉల్లాసాన్ని నింపుకుంటారట ఆయన. పిల్లలకు కూడా సంగీతాన్ని నేర్పిస్తుంటారు. ఆస్పత్రిలో ఒత్తిడి అనిపిస్తే.. కాసేపు 'బ్రేక్ ఫ్రీ టెక్నిక్స్'ను పాటిస్తారు కళ్యాణ్‌చక్రవర్తి. హిందూ సంప్రదాయంలో 'ఓం'లాంటి జపమాల ఉన్నట్లే.. ఆంగ్లంలోనూ కొన్ని పదాలను వల్లెవేయడమే ఆ టెక్నిక్.

8

మానసిక వైద్యశాలలో ఎంతమంది పేషెంట్లను చూసి ఇంటికొచ్చినా.. పిల్లల ముఖాల్ని చూస్తూనే అవన్నీ మరిచిపోతానంటున్నారు సైకియాట్రిస్ట్ డాక్టర్ మయూర్‌నాథ్‌రెడ్డి. "పాత కాలంలో మానసిక వైద్యం చేయడం కష్టంగా ఉండేది. పేషెంట్ల మనోవ్యథల్ని వినీ వినీ.. విసుగొచ్చేది. సరైన మందులు ఉండేవి కావు. ఇప్పుడు అలా కాదు. త్వరగా ప్రభావం చూపే మందులొచ్చాయి. పేషెంట్లలో వెంటనే పురోగతి కనిపిస్తున్నది. ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో వైద్యులకు ఉత్సాహం కలుగుతోంది.." అని వివరించారు. పనిలో ఎదురయ్యే ఒత్తిడిని పోగొట్టుకునేందుకు ఆయన పిల్లలే ఆయనకు మంచి వైద్యులట. "ఇంట్లో పిల్లల అల్లరిని పాజిటివ్‌గా చూడాలి. ఒక్కోసారి వాళ్ల అల్లరి వల్లే.. ఆఫీసు నుంచి మన వెంటపడి వచ్చే సమస్యలు మాయమైపోతాయి. పిల్లలతో కలిసిపోవడం ఒక స్వభావంగా మారితే మానసిక ఆరోగ్యం బాగుంటుంది.." అంటూ తన రిలాక్సేషన్ రహస్యం చెప్పారాయన.

ఉద్యోగ బాధ్యతలకు, కుటుంబ జీవితానికి స్పష్టమైన విభజన రేఖ ఉన్నప్పుడే.. ఒత్తిళ్లు దరిచేరవు. ఈ రెండింటినీ కలగలిపితే కలత చెందక తప్పదు.. అంటున్నారు మానసిక వైద్యులు. వీరందరూ ఎన్నెన్నో మానసిక సమస్యల్ని వింటూ.. వైద్యం చేస్తున్నా.. ఏ రోజూ ఆస్పత్రి ఒత్తిళ్లను ఇంటికి తీసుకురాలేదు. ఇంట్లో ఎంత కాలక్షేపం చేసినా ఆస్పత్రిలో సమయాన్ని వృథా చేయలేదు.



డాక్టర్ భాస్కర్ నాయుడు

ఇంటర్వ్యూలు: **సండే డెస్క్**

ఫోటోలు: గోపి కృష్ణ, అశోకుడు

❖ మిక్చర్ పొట్లం

బొమ్మలు: ఎన్.రాజశేఖర్ రెడ్డి

శాంపుల్ అనాలసిస్

''మేడమ్, ఈ హెయిర్ ఆయిల్ ఉచితంగా ఇస్తున్నాం. తప్పక వాడండి. మళ్లీ మూడు నెలల తర్వాత వస్తాం'' చెప్పేడు సూర్యారావు.

''మూడు నెలల తర్వాత రావడం ఎందుకూ?'' అడిగింది విశాలాక్షి.

''ఇది టెస్టింగ్ శాంపుల్. మూడు నెలల తర్వాత మీ జుత్తు ఉందో, ఊడిందో చూశాక గానీ బల్క్ ప్రొడక్షన్ మొదలెట్టం'' గొప్పగా చెప్పేడు.

దెందూ దెందే!

''డాక్టరుగారూ, ఆపరేషనంటే భయంగా ఉందండి. ఏమీ అవదు కదా.. ఇప్పటివరకూ ఇంజక్షను కూడా ఎరుగను'' వణికిపోయాడు చంద్రయ్య.

''భలేవాడివయ్యా. భయపడితే నీ జబ్బు తగ్గేదెలా? ఆపరేషన్ చేయడమం టే నాకూ భయమే మరి. నీలా వణుకుతున్నానా చెప్పు? ఇలాంటప్పుడే ధైర్యం తెచ్చుకోవాలి'' చెప్పేడు డాక్టర్ దైవాధీనం.

రెండూ ఒకటి కాదా?

''నీ భార్యను ఉరి తీసి చంపావని నేరం రుజువైంది. ముద్దాయిగా నీవు చెప్పదల చుకున్నది ఏమైనా ఉందా?'' అడిగాడు జడ్జి జేజయ్య.

''మూడు ముళ్లు వేసిన నాడు అంటగట్టని ముద్దాయి తనాన్ని ఒక్క ముడి వేసినందుకు అంట గట్టడం అన్యాయం యువరానర్'' ఆక్రోశంతో కోర్టు దద్దరిల్లేలా అరిచాడు గంగారాం.

తప్పించుకు తిరుగువాడు...!

''ఈ మధ్య నేనో హారర్ నవల చదివాను. చదువుతుంటే వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి తెలు సా? ఇంతకీ ఆ కథ ఏంటంటే ...'' చెప్పబోయాడు అప్పారావు.

''ఆగు, అదేదో తలనిండా జుత్తున్నోడికి చెప్పు. నాది బట్టతల కదా'' చిరాగ్గా అన్నాడు వెంకట్రావు.

'చోరులు శిక్షణలో ఉన్నారు'

కనకారావు ఇంట్లో ఒక అర్ధరాత్రి వేళ దొంగలు పడ్డారు. ఒకరూ, ఇద్దరూ కాదు, ఏకంగా 40 మంది. వాళ్లను చూడగానే ఠారెత్తిపోయిన కనకారావు 'ఇందేంటి? ఇంత మంది దొంగలా?'' అంటూ నోరు తెరిచాడు.

''కంగారు పడకయ్యా. వీళ్లంతా 'చోర శిక్షణ'లో ఉన్న స్టూడెంట్స్. ప్రాక్టికల్స్‌కి నీ ఇల్లు ఎంచుకున్నాం అంతే'' చెప్పాడు శిక్షణ ఇచ్చే ప్రొఫెసర్ గంగులు.

జిన్నాను అర్థం చేసుకోలేదు

జిన్నా, రూటీ ప్రేమకథ గురించి చక్కగా చెప్పినందుకు డానీని అభినందించకుండా ఉండలేను. జిన్నా సహజంగానే మంచివాడు. ఉదారవాది. కాని చాలా మంది ఆయనను మతతత్వవాదిగా భావిస్తారు. అది దురదృష్టకరం. పాకిస్థాన్ పాలకులు కూడా జిన్నాను అర్థం చేసుకోలేదు. పాకిస్థాన్ ఏర్పరచినందుకు చివరిక్షణాల్లో ఆయన పశ్చాత్తాప పడినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇరుదేశాలూ కలిసి జీవించడానికి దగ్గరవుతున్నాయి. చూద్దాం. ప్రపంచ యవనికలో ఉభయజర్మనీల్లా ఈ రెండూ కలిసిపోయేరోజులు వస్తాయేమో!

– కాలవపల్లి విశ్వరూపాచార్య, హైదరాబాద్

నిత్యమూ జరిగేవే

''టీలో చిటికెడు చక్కెర తక్కువుంది. నా భార్య అయితే అలా చచ్చినా వేయదు '' అంటూ నిజజీవితంలో ఎన్నో మధ్యతరగతి కుటుంబాల్లో జరిగే సంఘటనలే 'చిటికెడు చక్కెర' క థలో కనిపించాయి. 'వయసు వాయిదా ' కవర్‌స్టోరీ చదివి ఎన్నో విషయాలు తెలుసుకున్నాము.

– శ్రీకాళహస్తి వెంకట శేషగిరిరావు, నెల్లూరు

అందం, ఆరోగ్యం, ఆనందం

'జన్యువులు, క్రోమోజోములు బలహీనంగా ఉంటే ముదిమిఛాయలు త్వరగా వస్తాయి. ఆహారం, నిద్ర లోపాలతో పాటు ఒత్తిడి ఎక్కువగా ఉన్నా ఈ సమస్యలొస్తాయి' అంటున్నారు ప్లాస్టిక్ సర్జన్లు. ఇవి తెలిసీ సామాన్యులు కూడా అంత డబ్బు ఖర్చుపెట్టి శస్త్ర చికిత్సలవైపు మొగ్గుచూపుతున్నారంటే.. కాలం ఇలా మారిందనుకోవాలి. 'మీ వయసును మైనస్ చేయాలంటే..'అని మీరు సహజ పదార్థాల జాబితా ఇవ్వడం ఉపయోగకరంగా ఉంది. మన శరీర ప్రకృతిని అర్థం చేసుకుని మసలుకుంటే అదే అందం, ఆరోగ్యం, ఆనందం.

– వినీత, గుంటూరు

మనకూ కావాలి

సందేహాలు ముసురుకుని ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురైనపుడు 'నైతికత' ప్రశ్నిస్తుంది మనిషిని. అది ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకసారి అనుభవమే. ఆ ప్రశ్నకు సమాధానం వెతుక్కోవడంలోనే, ఆ పైన సరైన మార్గం ఏర్పరచుకోవడంలోనే మనిషి విజయం దాగివుంది. 'త్రీవరల్డ్స్' చిత్రంలో అలన్, జ్యులియట్, వెర పాత్రలను అలాంటి నైతికతా సమస్యే వెంటాడింది. సినిమా తీయడానికి అవసరమైతే చచ్చిపోవాలి అని నమ్మే కేథరిన్ లాంటి దర్శకులు మనకూ కావాలి.

– పాల్ దివాకర్, చిత్తూరు

అమ్మవారంటే ఆమే

'నీ బతుక్కొక పట్టు పావడా కూడానా 'అని చిన్నాడు బంధువుచేత అవహేళనకు గురైన కె.ఆర్.విజయగారు ఆ తరువాత చలనచిత్ర నటిగా మారి వెండితెర వేల్పుగా తెలుగు, తమిళ ప్రేక్షకుల మన్ననలందుకోవడం వెనుక ఆమె నిరంతర శ్రమ, పట్టుదల దాగున్నాయి. అమ్మవారి పాత్ర అనగానే ఇప్పటికీ ప్రేక్షకుల మనసులో ఆమె రూపమే సాక్షాత్కరిస్తుందనడంలో ఇసుమంతైనా సందేహం లేదు. ఆమె తన నటనతో పాటు వ్యక్తిత్వంతో కూడా నేటితరానికి ఆదర్శంగా నిలిచారు. ఇప్పటికీ ఆమె నటనలో వన్నె ఏ మాత్రం తగ్గలేదని ఇటీవల ఆమె నటించిన శ్రీరామరాజ్యం వంటి చిత్రాలు నిరూపించాయి.

– గొడవర్తి శ్రీనివాసు, ఇ మెయిల్

డోన్ట్ ఫీల్

ఇప్పటికే రెండొందల పాటలు పాడిన దీపు(మొగిలిగిద్ద ప్రదీప్‌కుమార్) 'హ్యాపీడేస్' ర్యాగింగ్ చుట్టే తిరిగాయి. ఇంజనీరింగ్ విద్యార్థి కనుక అది మామూలే. ఉత్తరాది అమ్మాయి స్వదస్తూరితో రాసిన శంకర్ మహదేవ్ పాట ఇంకా దీపు దగ్గరే వుండిపోయింది. ఆమెపై ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో! దీపూ, డోన్ట్ ఫీల్. గెట్ రెడీ టు సింగ్ థౌజండ్ మోర్ సాంగ్స్.

– అరవింద్, హైదరాబాద్

– పి.అరుణ్‌కుమార్, కార్తిక్, వాసుదేవ, ఇ మెయిల్

ఏల ఈ గోల?

అంత మాత్రానికి మునగచెట్టు పెంచడమేల? పెంచితివి పో పురుగుమందు కొట్టడమేల? కొడితివి పో రూ.600 ఖర్చు పెట్టి ఆ చెట్టును పడగొట్టడమేల? శీనా, కొన్ని ఐడియాలు ఇలాగే తుస్సుమంటాయి అని తెలుసుకోకపోతే ఎలా?

– ప్రసాద్, నంద్యాల

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.comకి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

❖ వంటసాల

చికెన్ కర్రీ

కొంకణి టు కాశ్మీర్ వయా మహారాష్ట్ర

కాశ్మీరీ చికెన్

కావలసిన పదార్థాలు: చికెన్ – అరకేజి, ఉల్లి తరుగు – 2 కప్పులు, ఎండు మిర్చి – 2, కాశ్మీరీ కారం (మార్కెట్లో దొరుకుతుంది) – ఒకటిన్నర స్పూను, వెల్లుల్లి – 6 రేకలు, అల్లం – అంగుళం ముక్క, దనియాల పొడి – 1 టీ స్పూను, జీలకర్ర – పావు టీ స్పూను, యాలకులు – 6, దాల్చిన చెక్క – 2 అంగుళాలు, జీడిపప్పు –50 గ్రా., బాదం – 25 గ్రా., పెరుగు – 100 గ్రా., ఉప్పు – తగినంత, నూనె – 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు – పావు కప్పు.

తయారుచేసే విధానం : చికెన్ ముక్కలకు ఉప్పు పట్టించి పక్కనుంచాలి. కారం, దనియాల పొడి, కాశ్మీరీ కారం, జీలకర్ర, లవంగాలు, దాల్చిన చెక్క, యాలకులు విడివిడిగా వేగించి, అన్నీ కలిపి పొడి చేయాలి. జీడిపప్పు, బాదం పలుకులు కూడా వేగించి పొడి చేయాలి. నూనెలో ఉల్లి, అల్లం, వెల్లుల్లి తరుగు వేగాక చికెన్ ముక్కలు వేసి సన్న మంటపై 5 నిమిషాలు ఉంచాలి. మసాలపొడి, ఉప్పు కలిపి మరో రెండు నిమిషాలు వేగించాలి. ఇప్పుడు తగినన్ని నీళ్లు పోసి ఉడికించాలి. తర్వాత జీడిపప్పు, బాదం పొడి కలపాలి. పెరుగు కలిపి చిన్న మంటపై 5 నిమిషాలు ఉంచి, కొత్తిమీర చల్లి దించేయాలి. ఈ కర్రీ రైస్, రోటీ, నాన్, బ్రెడ్‌తో బాగుంటుంది.

మహారాష్ట్ర చికెన్

కావలసిన పదార్థాలు: చికెన్ – 200 గ్రా., అల్లంవెల్లుల్లి పేస్టు – 1 టీ స్పూను, పచ్చిమిర్చి పేస్టు – అర టీ స్పూను, ఎండు కొబ్బరి – 100 గ్రా., దనియాలు – 1 టీ స్పూను, ఎండు మిర్చి – 2, నువ్వులు అర టీ స్పూను, నూనె – 2 టేబుల్ స్పూన్లు, చిన్న ఉల్లిపాయ – 1, పసుపు – చిటికెడు, కారం – అర టేబుల్ స్పూను, పెరుగు – 1 టేబుల్ స్పూను, గరం మసాల – యాలకులు (2), దాల్చిన చెక్క (అంగుళం ముక్క), లవంగాలు (3), బిర్యాని ఆకు (1) , గోదా మసాల పొడి (మార్కెట్లో దొరుకుతుంది) – 1 టీ స్పూను, కొత్తిమీర తరుగు – 1 టేబుల్ స్పూను, ఉప్పు – రుచికి తగినంత, నీరు – ఒకటిన్నర కప్పు.

తయారుచేసే విధానం: చికెన్ ముక్కలకు సగం అల్లం వెల్లుల్లి, పచ్చిమిర్చి ముద్దను పట్టించి అరగంట పక్కనుంచాలి. నూనెలో గరం మసాల దినుసులు, ఉల్లి తరుగు, మిగిలిన అల్లం వెల్లుల్లి, పచ్చిమిర్చి పేస్టులు వేసి దోరగా వేగించాలి. ఇప్పుడు గోదా మసాల, ఉప్పు, కారం, పసుపులతో పాటు ముక్కలు వేయాలి. మసాలా ముక్కలకు పట్టిన తర్వాత నీరు కలిపి ఉడికించాలి. 10 నిమిషాల తర్వాత కొబ్బరి, దనియాలు, ఎండుమిర్చి, నువ్వులను వేగించి గ్రైండ్ చేసిన పేస్టు కలపాలి. దించేముందు పెరుగు కలిపి చిటికెడు గోదా మసాల, కొత్తిమీర చల్లాలి. ఈ కర్రీ అన్నంతో మంచి కాంబినేషన్.

కావలసిన పదార్థాలు: చికెన్ (పెద్ద ముక్కలు) – 800 గ్రా., పచ్చికొబ్బరి తురుము – రెండు కప్పులు, ఉల్లిపాయలు – 4, కారం – 1 టీ స్పూను, పసుపు – అర టీస్పూను, గరం మసాల పొడి – 2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి – 4, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి పేస్టు – 3 టీ స్పూన్లు, ఉప్పు – సరిపడా, నూనె – 2 టేబుల్ స్పూన్లు.

కొంకణి చికెన్

తయారుచేసే విధానం: చికెన్ ముక్కలపై కత్తితో పొడుగ్గా గాటు పెట్టి, అల్లం మిశ్రమాన్ని కూరి గంట పాటు పక్కనుంచాలి. కొబ్బరి తురుమును కొద్ది నూనెలో వేగించి, సగం ఉల్లి ముక్కలతో కలిపి పేస్టు చేసుకోవాలి. నూనెలో మిగతా ఉల్లితరుగు, పచ్చిమిర్చి, కొద్దిగా ఉప్పు, గరం మసాల పొడి, కారం, పసుపు ఒకటి తర్వాత ఒకటి వేగించాలి. ఇప్పుడు చికెన్ ముక్కలు కలిపి 10 నిమిషాలు (బ్రౌన్ రంగులోకి వచ్చేవరకు) వేగించాలి. తర్వాత ఉల్లి, కొబ్బరి పేస్టు, ఉప్పు వేసి 4 కప్పుల నీరు పోసి మూత పెట్టాలి. చికెన్ ఉడికి, నూనె తేలిన తర్వాత కొత్తిమీర చల్లాలి. ఈ కర్రీ పలావ్, జీరారైసులతో బాగుంటుంది.

విస్బీ నగరం

వసంత ఋతువులో స్వీడన్ దీవుల్లో...

పోయిన సంవత్సరం సెప్టెంబర్ నెలలో లూసియన్ అనే స్వీడిష్ ఫోటోగ్రాఫర్ మా ఇంటికి వచ్చి విశాఖపట్నంలో నాతో పాటు నెల రోజులు ఉండి, సముద్రతీరంలో తిరుగుతూ ఫోటోలు తీసుకుని ఆనందపడ్డాడు. నాకంటే ఆయన రెండేళ్ళు పెద్ద. తనకు తెలిసిన భూటాన్ దేశపు మిత్రుల ద్వారా నా అడ్రస్ తెలుసుకుని వచ్చానని చెప్పాడు. ''సముద్ర తీరాలంటే నాకు చాలా ఇష్టం'' అంటూ తాను తీసిన ఫోటోలతో ఆంధ్రా యూనివర్సిటీలో ఒక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాడు. ఆయన ఆహ్వానంపై ఈ ఏడాది మేలో నేను స్వీడన్ వెళ్ళాను.

స్వీడన్ ప్రయాణం అనగానే నాకు మొదటగా గుర్తుకొచ్చింది. రవీంద్రనాథ్ ఠాగూర్‌కి నోబెల్ అవార్డు ఇచ్చిన స్వీడిష్ అకాడమీ, స్వీడన్‌లో సంచారం చేసే కాల్దరేష్ జిప్సీలు 'The Magic Lantern' అనే పేరుతో స్వీయచరిత్ర రాసుకున్న ప్రఖ్యాత స్వీడిష్ మూవీ డైరెక్టర్ ఇంగ్‌మర్ బెర్గ్‌మేన్. మే నెలలో ఒక రోజు ఉదయాన ఢిల్లీ నుండి బయలుదేరి సాయంకాలానికి స్టాక్‌హోం ఎయిర్‌పోర్టులో దిగాను. లూసియన్ ఎయిర్‌పోర్టుకి వచ్చి తీసుకుపోయాడు. స్టాక్‌హోం నగరం చాలా అందంగా ఉంది. లేత గులాబీ రంగులో మెరుస్తున్న భవనాల మీద నీలాకాశం నీడ పడి మరింత సుందరంగా కనిపించింది.

వసంత ఋతువు మొదలయ్యే రోజులు కాబట్టి చెట్లన్నీ పూత మీద ఉన్నాయి. ఎరుపు, పసుపు రంగుల్లో ఉన్న తులిప్ పుష్పాలు రోడ్డు అంచుల్ని వెలుగుతో నింపాయి. జెట్టీలోని ఎత్తయిన పెద్ద ఓడలు హెల్సింకి, లాట్వియా దేశాలకి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాయి. డిన్నర్ చేసి అపార్టుమెంటుకి చేరుకునేసరికి రాత్రి పది గంటలైంది. అయినా అంతా వెలుతురే. ఉత్తర ధృవానికి దగ్గరగా ఉండడం వలన ఎండాకాలం అంతా వెలుగే ఉంటుంది స్వీడన్‌లో. మొదటి భార్యతో విడిపోయాక, మారియా అనే జర్నలిస్టుతో సహజీవనం చేస్తున్నాడు లూసియన్. వారంతపు శెలవుల్లో కలుసుకుంటారట. వాళ్ళది ఓపెన్ సొసైటీ కాబట్టి ఎలాంటి దాపరికాలు లేకుండా తమ వ్యక్తిగత జీవితం గురించి చెప్పేస్తారు. వెలుతురు ఉండగానే నిద్రపోవటం కష్టమైంది ఆ రాత్రి.

మర్నాడు పది గంటలకి బయలుదేరి ఒక ఫోటోగ్రాఫర్ని, ఒక యాంటిక్ డీలర్ని కలిసి ఒంటిగంటకి 'స్వీడిష్ జిప్సీ సొసైటీ'కి వెళ్ళాం. అక్కడ మాకు ఇంగ్‌వార్ అనే అతడు పరిచయమై ''మీరు రెండు వారాల తర్వాత వస్తే వారిని కలవగలరు. ప్రస్తుతం వాళ్ళు మాల్మోలో జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొంటున్నారు'' అని చెప్పి మా నెంబర్లు తీసుకున్నాడు. రాత్రికి లూసియన్ నా కోసం ఏర్పాటుచేసిన డిన్నర్‌కి వచ్చిన వారందరూ యాభై సంవత్సరాలు దాటిన స్త్రీలే. ఋగ్వేదం అంటే బాగా ఇష్టపడే మాగ్దలీన్, ఇండియాలో యాత్రలు చెయ్యాలనుకుంటున్న సనా హాన్‌సన్, రాజా రాంమోహన్‌రాయ్ చేసిన సంస్కరణలని మెచ్చుకునే కుజిమా నాకు మంచి మిత్రులయ్యారు. డిన్నర్ పని అందరం కలిసి పంచుకున్నాం. నేను చేసిన టమోటా పులుసుని వాళ్ళు బాగా మెచ్చుకుని ''మీరు మా దేశంలో ఒక స్త్రీని పెళ్ళి చేసుకోవాలనుకుంటే, ఇదే మీకు పెద్ద అర్హత'' అంటూ నవ్వారు.

స్వీడన్ విస్తీర్ణం అంతా కలిసి మన రాష్ట్రానికి రెండు రెట్లు ఉంటుంది. అయితే జనాభా మాత్రం కోటి కంటే తక్కువే ఉన్నారు. స్వీడన్ అంతా దీవుల సముదాయం. బాల్టిక్ సముద్రంలోని 25 వేల దీవులు కలిసి ఈ ద్వీప సముదాయం ఏర్పడింది. హెల్సింకీ నుండి స్టాక్‌హోం వరకు గంటసేపు సాగిన విమాన ప్రయాణంలో ఈ దీవులన్నీ సముద్రం మీద తేలుతున్న ఆకుపచ్చని మేఘం మాదిరిగా కనిపిస్తాయి. ఉత్తర ధృవానికి దగ్గరగా ఉండడం వలన విపరీతమైన చలి. 17వ శతాబ్దం నాటికే స్వీడన్ ఒక ప్రముఖ వాణిజ్య కేంద్రంగా పేరు తెచ్చుకుంది. మాల్మో, ఉప్‌సాలా, గోటెన్‌బర్గ్‌లు స్వీడన్‌లోని ముఖ్యమైన నగరాలు.

విశాలంగా ఉన్న స్టాక్‌హోం రోడ్ల మీద నడుస్తూ ఉంటే ఏదో ఒక పువ్వుని పడవగా చేసుకుని తేలిపోతున్నట్లుగా ఉంది. నడక ప్రియుల కోసం ప్రత్యేకంగా బాటలు వేశారు. చదరపు కిలోమీటరుకు సగటున 20 మంది మాత్రమే నివసిస్తున్న ఈ దేశంలో మనిషి ఎదురైతే చాలు, ఎంతో ప్రేమగా పలుకరించుకుంటున్నారు.

చర్చి కంటే పవిత్ర కార్యం

''గోట్‌లాండ్ ఐలండ్‌కి వెళ్ళే ముందుగా మనం చేయవలసిన ఒక ముఖ్యమైన పని ఉంది. మేము చర్చికి వెళ్ళడం అయినా మర్చిపోతాం గానీ, దాన్ని మరిచిపోలేము. మాకు అదే పవిత్రకార్యం'' అని చెప్పి 'అదేమిటో తెలుసా!' అన్నట్లు నా వైపు చూశాడు లూసియన్.

''అంత గొప్ప విషయం ఏమిటో నాకు చెప్పండి సార్'' అన్నాను.

''ఇంట్లో ఉన్న చెత్తను తీసుకెళ్ళి రీసైక్లింగ్ సెంటర్‌లో ఇవ్వటమే ఆ పవిత్రకార్యం'' అంటూ నవ్వాడు.

ఇంటికి వెళ్ళగానే చెత్త అంతా ఒక పద్ధతి ప్రకారం ప్లాస్టిక్ సంచుల్లోకి పేర్చుకున్నాం. ఇలా చేయటం వలన సెంటర్లో మనకి ఆలస్యం కాదు, ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలు, ఆహారం, చెక్క సామాగ్రి, పింగాణీ ఇలా అన్నిట్నీ వేరువేరుగా ప్యాక్ చేయడం వలన కారులో స్థలం కూడా కలిసి వచ్చింది. మాకు దగ్గరగా ఉన్న సెంటర్ ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అది ఐదు ఎకరాల గ్రౌండ్. అక్కడ ఉన్న పెద్ద ట్రాలర్స్ మీద ఉన్న డబ్బాల్లోకి మెట్లు ఎక్కి వెళ్ళాల్సిందే. ఏ దేవుడి పూజ ఏ మందిరంలో జరుగుతూ ఉందో తెలుసుకోవడానికి తొందరపడే భక్తుల మాదిరిగా ఉన్నారు వాళ్ళు. అలాంటి సెంటర్లు మన దేశంలో ప్రవేశపెట్టి, మన పరిసరాల్ని కూడా సౌందర్యవంతంగా తయారుచేసుకోవచ్చు కదా అనిపించింది. దేశాన్ని శుభ్రంగా ఉంచడంలో స్వీడిష్ పౌరులు తీసుకుంటున్న శ్రద్ధకి శాల్యూట్ చేశాను.

దారిలో ఒక చర్చి చూసి అక్కడి నుంచి మేము Trauma and Crisis సెంటర్‌కి వెళ్ళాం. యుద్ధాల్లో మారణకాండ, హత్యలు, దౌర్జన్యాలు చూసి, మానసిక సమతౌల్యాన్ని కోల్పోయిన వారు వైద్యం చేయించుకునే ప్రదేశం అది. ఆ భవనంలో డాక్టర్లతో పాటు కొందరు ఫోటోగ్రాఫర్లూ పనిచేస్తున్నారు. తెలిసినవారు లూసియన్‌కి 'హాయ్' చెప్పగానే నన్ను వారికి పరిచయం చేశాడు. కొంతమంది వాలంటీర్లు ఆ రోగులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి మందులు ఇస్తున్నారు. ఇలాంటి కౌన్సెలింగ్ సెంటర్లు యూరప్‌లో చాలా చోట్ల ఉన్నాయట. ఇలాంటి కేంద్రాల వలన సమాజంలో పిచ్చివాళ్ళు, చెడ్డవాళ్ళు తగ్గిపోయి అందరూ హాయిగా జీవిస్తారు. సాయంత్రానికి మాగజైన్-3 గ్యాలరీలో జరుగుతున్న Ai wei wei ఆర్ట్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళాం. సమకాలీన చైనా సమాజంలో జరుగుతున్న అసమానతల మీద తిరుగుబాటు చేసిన కళాకారుడు ఏ-వై-వై. అతని చిత్రాలు, సినిమాలు మనల్ని ఆలోచింపజేస్తాయి.

9 అంతస్తుల నౌక

మరునాటి ఉదయం సామానులన్నీ కారులోకి సర్దుకుని గోట్‌లాండ్ ప్రయాణానికి సిద్ధం అయ్యాం. స్టాక్‌హోంకి దక్షిణంగా 40 కి.మీ. దూరంలో ఉన్న నైన్‌షామ్ తీరం నుండి మా బోట్ బయలుదేరింది. దాని పేరు Destination Gotland. ఇది 500 కార్లని, 1500 ప్రయాణికుల్ని ఒకేసారి రవాణా చేస్తుంది. మొత్తం 9 అంతస్తులు. 95 మీటర్లు పొడవు, 25 మీటర్ల వెడల్పు ఉన్న ఈ బోటు టైటానిక్‌ని తలపిస్తూ ఉంది. గోట్‌లాండ్-స్టాక్‌హోం మధ్య ఇలాంటివి నాలుగు బోట్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. బోటులోని ఏర్పాట్లన్నీ ఎంతో విలాసవంతంగా ఉన్నాయి. అంతర్జాతీయ ప్రయాణికులతో నిండిన ఈ బోటు లోపల చిన్నపిల్లాడిలా తిరుగుతున్న నన్ను చూసిన లూసియన్‌కి నవ్వు ఆగటం లేదు. బోటు మధ్యలో ఉన్న రెస్టారెంట్ ఒక ప్రత్యేక ఆకర్షణ. ఏదో పండుగ జరుపుకున్నట్టుగా ఉందే కానీ ప్రయాణిస్తున్నట్లుగా లేదు. 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోట్‌లాండ్ దీవిని చేరడానికి నాలుగు గంటలు పట్టింది. గోట్‌లాండ్ తీరం మీద ఎర్రపెంకుల ఇళ్ళు చూడగానే సంబరపడ్డాను. వాటి వెనకాలే పురాతన కోట శిఖరాలు కనిపించాయి. సముద్రమట్టానికి 50 అడుగుల ఎత్తులో ఉంది ఈ దీవి. గోట్‌లాండ్‌కి ముఖ్య పట్టణమైన విస్బీరేవులో బోట్ ఆగింది. 80 కిలోమీటర్ల పొడవు, 30 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ అందమైన దీవిని సొంతం చేసుకోవడానికి చరిత్రలో చాలా యుద్ధాలు జరిగాయి. వాటిల్లో వైకింగ్ (800 AD - 1050 AD)ల దండయాత్రలే ఎక్కువ.

గులాబీల నగరం

విస్బీకి గులాబీల నగరం అని ముద్దుపేరు. నగరం చుట్టూ నిర్మించిన మధ్య యుగాల నాటి ఎత్తయిన గోడ ఇప్పటికీ దృఢంగానే ఉంది. ఈ దీవి మొత్తం జనాభా 50 వేలు కాగా, 20 వేల మంది పౌరులు ఈ విస్బీలోనే ఉంటున్నారు. మా కారు పొలాల మధ్య గుండా సాగిపోయింది. దారిలో విండ్‌మిల్స్ కనిపించాయి. విశాలమైన ఫాంహౌస్‌ల చుట్టూరా ఉన్న పచ్చని పొలాల్లో గోధుమ రంగు గుర్రాలు, నల్లమూతి బొచ్చు గొర్రెలు మందలుగా తిరుగుతూ, తాపీగా జీవితాన్ని గడుపుతున్నాయి.

గోట్‌లాండ్‌లోని ఆహ్లాదకరమైన వాతావరణం చాలామందినే ఆకర్షించింది. రిటైర్ అయిన మిలటరీ వారూ, ధనవంతులూ ఇక్కడ గెస్ట్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. స్వీడన్ భూభాగం మొత్తంలో గోట్‌లాండ్‌ది వందో వంతు మాత్రమే అయినా ఈ దీవి ఒక ప్రత్యేకతని సంతరించుకుంది. లూసియన్ కూడా ఇక్కడ రెండు చిన్న ఇళ్ళు కొన్నాడు. వాటిని ఎండాకాలంలో అద్దెకి ఇవ్వటం ద్వారా ఆయనకి కొంత ఆదాయం వస్తుంది.

మేము వెళ్ళింది గోట్‌లాండ్‌లో ఉన్న ఫెరిలూన్ అనే చిన్నదీవికి. దాని పొడుగు ఏడు కిలోమీటర్లు. వెడల్పు మూడు కిలోమీటర్లు. వందల రకాల పక్షులు అక్కడ నీటిలో వేట చేస్తున్నాయి. అడవి అంచున ఆగింది మా కారు. ఎర్ర రంగులో ఉన్న ఒక చిన్న చెక్క ఇంటి ముందుకి వెళ్ళగానే ''ఇదే మన ఇల్లు. దీన్ని నువ్వు తప్పకుండా ఇష్టపడతావు'' అంటూ లోపలికి తీసుకెళ్ళాడు లూసియన్.

చుట్టూరా చిన్న కొండలు, అడవి పెనవేసుకుని ఉన్నాయి. ఒక వైపుగా సముద్రం ఉంది. మానవమాత్రుడు కనిపించడం లేదు. ఇరవై ఇళ్ళ కంటే ఎక్కువ లేవు. చెట్లూ, పక్షులే అక్కడ ఎవరికైనా తోడు. స్థానికంగా నిర్మించిన ఈ చెక్క ఇళ్ళని 'తోర్ప్' అంటున్నారు. వీటిలో సకల సదుపాయాలూ ఉన్నాయి. జులై, ఆగస్టు నెలల్లో మాత్రమే ఈ దీవులకు యాత్రికులు వస్తారు. మిగిలిన కాలం అంతా ఇవి ఖాళీగానే ఉంటాయి. కాబట్టే నాకు ఇక్కడ నివసించే అవకాశం వచ్చింది. సామానంతా సర్దుకొన్నాక, సైకిళ్ళ మీద బాల్టిక్ తీరం వైపు షికారుకి వెళ్ళాం. నీటి ఒడ్డు మీద ఎత్తయిన గడ్డిలో మౌనంగా తిరుగుతున్నాయి బాతులు. మా అలికిడి విని ఆకాశంలోకి ఎగిరినపుడు మాత్రమే తెలిసింది. అవి కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయని. అలా అవి కాసేపు శూన్యపు అద్దం మీద కొన్ని కవితలు రాసి దూరంగా వెళ్ళిపోయాయి. పవిత్రమైన ఈ పరిసరాలని వర్ణించాలంటే స్వర్గం అనే పదం ఒక్కటే సరిపోతుందేమో.

(తరువాయి వచ్చే వారం)

- ప్రొ. ఎం.ఆదినారాయణ
ఫోన్ : 98498 83570

'డెస్టినేషన్ గోట్‌లాండ్'లో వ్యాసకర్త

గులాబీల నగరంలో ఓ ఇంటి సొగసు



మీద పెట్టే ధైర్యం నాకు లేదని దానికి తెలుసు. ''వద్దు'' అన్నాను. కొంచెం మొహమాటపడుతూ.

''మొహమాటం వద్దే తల్లీ. మనం రోజూ ఏమీ ఇక్కడ కాఫీ తాగం కదా. అయినా, స్టార్ బక్స్ కాఫీ ... జస్ట్ .. ట్రై చెయ్. నువ్వు ఇక్కడే ఈ సీట్లకి కాపలా కాయ్. నేనెళ్లి చప్పున తీసుకొస్తా'' అంటూ చకచకా స్టార్ బక్స్ కౌంటరుకి వెళ్లి, రెండు కాఫీలు పట్టుకొచ్చి కూర్చుంది ''బోలో ... చెప్పు'' అంటూ.

ఎక్కడ మొదలు పెట్టాలి? మౌనంలోకి కూరుకుపోతున్నా. నా పరిస్థితి ఆర్తికి తెలుసు. ఎంత కాదన్నా, తను సీనియర్. ఈ ఏడాది తన చదువు అయిపోతుంది. పైగా, తను చాలా స్పష్టంగానూ అన్ని వైపుల నుండీ ఆలోచిస్తుంది. నేను ఆలోచన కూడగట్టుకునే లోగా,

''ఇంట్లో ఎలా ఉంది? తనే అడిగింది.

''బాగా లేదు. అమ్మికి విసుగ్గా ఉంది. బయటికి వెళ్లి పని చెయ్యడం అమ్మికి అస్సలు నచ్చదు. అబ్బాజాన్ అక్కడో గంటా ఇక్కడో గంటా చేస్తున్నారు. అదీ నిలకడగా లేదు. నా చదువు ఏమవుతుందో తెలియదు. ట్యూషన్ ఫీజు పెరిగిపోతోంది.''

''ఛోటీ, ఇవన్నీ ఎలాగోలా త్వరలో సర్దుకుంటాయి. వాటి గురించి వర్రీ అయినా నువ్వు చెయ్యగలిగిందేమీ లేదు. నువ్వు ఇప్పుడు వర్రీ అవ్వాల్సిందీ నీ గురించి.''

ప్రశ్నార్థకంగా చూశాను ఆర్తి కళ్లలోకి.

''అవును. ఈ చదువు నీకు గొప్ప అవకాశం. చదువు అంటే మంచి గ్రేడ్స్ తెచ్చుకొని, త్వరగా గ్రాడ్యుయేట్ అవ్వడమే కాదు. అది ముఖ్యమే, సందేహం లేదు.''

''అదే ముఖ్యం నాకు. కానీ, నా గ్రేడ్స్ పడిపోతున్నాయి. పడిపోవడం ఏమిటిలే, అవి ఎప్పుడు మాత్రం బాగున్నాయి కనుక!''

''గ్రేడ్స్ రావాలి. కాదనను. కానీ, నువ్వు చదువులోనే కాదు, నీ వ్యక్తిత్వం మలుపు తిరిగే కార్నర్‌లో ఉన్నావు ఇప్పుడు. ఈ కార్నర్ లో నువ్వు కొంచెం గందరగోళంగా కూడా ఉన్నావ్.''

''అంటే ...''

''అంటే ... ఈ టీషర్టు మీద రాసిన వాక్యాలు చదువుమ్మల్లీ.''

''If hope is an impossible demand, then we demand the impossible. బాగుంది.''

''దానికి కొనసాగింపు ఉంది. ... If the right to shelter, food, and employment are impossible demands, then we demand the impossible.''

''ఇది ఎవరిది?''

''ఇదీ జూడిత్ బట్లర్‌దే. ఇవాళ రాత్రి ఇంటికి వెళ్లి ఆవిడెవరో గూగుల్ చెయ్యి. ఆమె న్యూయార్క్ occupy camp లో అన్న మాటలు నీకు ఇమెయిల్లో పంపిస్తా. చదువు. చూడు. ఆలోచించు.''

''అవన్నీ నాకెందుకు?''

''అదే నీ సమస్య. నీదే కాదు, ఇక్కడ ఉన్న చాలా మంది మన వాళ్ల సమస్య అదే. ప్రపంచం చాలా పెద్దది అనుకుంటాం గాని, నిజానికి చాలా చిన్నది. ఏక్ దమ్ ఛోటీ దునియా. నువ్వు కాస్త నింపాదిగా ఆలోచిస్తే, మన ఊరినించి న్యూయార్క్ దాకా ఒకటే లోకం. ఒకటే సమస్యలు. ఒకటే ఘోష. ఇక్కడ occupy , అక్కడ తెలంగాణ. అంతే. మనం గోడ మీద పిల్లుల్లా కూర్చొని ఉంటామంటే కుదరదు. ఇవన్నీ చాలెంజెస్. నువ్వేమిటో తేల్చుకోమని నిలదీసే ప్రశ్నలు. ఇప్పుడు అందరి పరిస్థితీ ఒక్కటే. అందరి ఆందోళనా ఒక్కటే. కానీ, ఎవరి ఐడెంటిటీ వాళ్లదే. నువ్వు అది గమనించడం లేదు. అది గమనించకపోతే మన చదువుకి అర్థం లేదు... అమ్మో, మరీ పొడుగైపోయిందా నా లెక్చర. కానీ, చెప్పాలనుకుంది ఇదే.''

''ఏమో. నేను అవేవీ సరిగా చూడలేకపోతున్నా. చూసినా, అవి మనకి సంబంధం లేని సమస్యలు అనిపిస్తున్నాయి.''

''అందరం చివరికి ఈ ఛోటీ దునియాలో ఒకే రకమైన ఒడిదుడుకులూ కష్టాలూ అనుభవించాల్సిన వాళ్లమే. పైగా, వలస బతుక్కి వేరే సమస్యలు కూడా తోడవుతాయి.''

''నిజమే. ఈ వలస బతుకు ఎందుకా అనిపిస్తుంది చాలాసార్లు? ఇంత దూరం ఎందుకొచ్చామా అనిపిస్తుంది.''

''తప్పదు. అది నీ ఛాయిస్ కాదు. వలస పోవడం తప్పని కాలం ఇది. మీ అబ్బాజాన్ వాళ్లు ఖమ్మం దగ్గిర ఎక్కడో పల్లెటూర్లో ఉండేవాళ్లు. హైద్రాబాద్ ఎందుకు వచ్చారు? ఒక్కసారి వలస అంటూ మొదలైన తర్వాత అది నీ చేతుల్లో లేదు. కాళ్ల కింద నేల తగిలే దాకా వెళ్తూనే ఉంటాం. ఆ కొత్త నేల నేర్పించే పాఠాలకి మనం సిద్ధంగా ఉన్నామా లేదా అన్నదే ముఖ్యం.''

''ఇందాక ఐడెంటిటీ అన్నావ్? అది నిజంగా మనకి ఉందా, దేశం కాని దేశంలో ... భాష కాని భాష మాట్లాడే వారి మధ్య ..''

''ఎందుకు లేదు? ఐడెంటిటీ అన్నది ఒక దేశం కన్నా, ఒక భాష కన్నా పెద్దది. కాకపోతే, యూనివర్సిటీ కాంపస్‌లోకి వచ్చాక మనలాంటి టీనేజర్లకి – ఇప్పుడు నేను టీనేజర్‌ని కాదనుకో. ముఖ్యంగా వలస వచ్చిన టీనేజర్లకి ఆ ఐడెంటిటీని ఎట్లా వెతుక్కోవాలో తెలీదు. మనలో చాలా మందిమి హిందువులమైతే హిందూ స్టూడెంట్స్ కౌన్సిల్‌లో చేరతాం. ముస్లింలు అయితే కాంపస్ మసీదు చుట్టూ చేరతాం. మనకి తెలియకుండానే మనం ఆ లేబుల్స్‌లోకి ఇమిడిపోయి, అక్కడొక లిటిల్ ఇండియానో, పాకిస్తాన్నో సృష్టించుకుంటున్నాం. అదే గీత, అదే ఖురాన్, అదే పూజ, అదే నమాజ్ మన ఐడెంటిటీ మార్కర్లు అవుతున్నాయి. మన ఐడెంటిటీ వెతుకులాట అక్కడితో ఆగిపోతోంది. అంతకంటే దాటి వెళ్తే అది మన కంఫర్ట్ జోన్ కాదు కాబట్టి, సుఖంగా ఉండదు కాబట్టి.''

''తప్పదు. అది నీ ఛాయిస్ కాదు. వలస పోవడం తప్పని కాలం ఇది. మీ అబ్బాజాన్ వాళ్లు ఖమ్మం దగ్గిర ఎక్కడో పల్లెటూర్లో ఉండేవాళ్లు. హైద్రాబాద్ ఎందుకు వచ్చారు? ఒక్కసారి వలస అంటూ మొదలైన తర్వాత అది నీ చేతుల్లో లేదు. కాళ్ల కింద నేల తగిలే దాకా వెళ్తూనే ఉంటాం. ఆ కొత్త నేల నేర్పించే పాఠాలకి మనం సిద్ధంగా ఉన్నామా లేదా అన్నదే ముఖ్యం.''

''అందులో తప్పేముంది?''

''అందులో తప్పేమీ లేదు. కానీ అదే పూర్తిగా ఒప్పు అనుకోవడం తప్పు. ఆ కొద్దిసేపు ఆ మీటింగుల తరువాత నువ్వేమిటో ఎప్పుడైనా ఆలోచించావా? లేదు. ఎవ్వరూ ఆలోచించరు. నువ్వు నిజంగా హిందువువా? నిజంగా ముస్లింవా? నాకయితే అది సగమే నిజమనిపిస్తుంది. మిగతా సగం నువ్వు నీ చుట్టూ ఉన్న నేలలో ఎంత బాగా ఇమిడిపోతావన్న దాని మీద ఆధారపడి ఉంటుంది. కాపిటాల్ బిల్డింగ్ దగ్గర కూర్చొని కేకలు వేస్తున్న వాళ్లని చూశావా? ఆ కేకలో నీకు నిజాయితీ వినిపించడం లేదా?''

''లేదు. వాళ్లంతా హోమ్ లెస్. హోప్ లెస్. కష్టపడడం ఇష్టం లేక అట్లా సోమరిగా అక్కడ బైఠాయిస్తున్నారు. అడ్డా జమాయిస్తున్నారు'' అన్నాను చాలా స్థిరంగా.

''నువ్వు వాళ్లతో మాట్లాడావా?''

''లేదు.''

''మరి, ఎట్లా అంటున్నావ్?''

''అమ్మీ, అబ్బా ఇంకా మన దోస్తులు మాట్లాడుకుంటుంటే విన్నా. మా ఇంటికి వచ్చే కొంతమంది ఫ్రెండ్స్ కూడా అన్నారు.''

''వాళ్లు కాదు, నువ్వు... నువ్వు ఏమనుకుంటున్నావ్?''

''నేనేమీ అనుకోవడం లేదు ... నాకు అంత తీరిక లేదు. ఓపిక లేదు.''

''ఏమీ అనుకోవద్దు ఇట్లా అంటున్నా అని. ఇది టిపికల్ దేశీ మైండ్ సెట్. నువ్వు ప్రొఫెసర్ సయ్యద్ అన్న మాటకి ఎంత బాధ పడ్డావో గుర్తుందా?''

''అవును.''

''అది నీ గురించి మాత్రమే కాదు. నీ రైటింగ్ గురించి మాత్రమే కాదు. అసలు ఆలోచనని బుర్రలోకి రానివ్వని, ఆలోచన బుర్రలోకి వస్తే ఏమవుతుందో అని బెదిరిపోయే మన అందరి గురించి..''

''ఆలోచన అంటే నాకు బెదురు లేదు. కాని, నాకు ఆలోచించే తీరిక ఎక్కడుంది? చదువుతోనే సరిపోతోంది. పోటీ ... పోటీ. ఎట్లయినా మెడికల్ కాలేజ్‌కి వెళ్లాలి.''

''లేదు, నువ్వు చదువు గురించే కాదు, గ్రేడ్ల గురించే కాదు, అంకెల గురించే కాదు. కెరీర్ గురించే కాదు, అనుభవాల గురించి కూడా ఆలోచించాలి. సంఘటనల గురించి కూడా ఆలోచించాలి. క్రిటికల్ థింకింగ్ కావాలో కావాలో అని ఎందుకు మన ప్రొఫెసర్లు అంతగొంతు చించుకుంటున్నారు? క్రిటికల్ థింకింగ్ లేకపోతే నీ అవగాహన పెరగదు. నీకు నువ్వు అర్థం కావు. నువ్వు నీ కంఫర్ట్ జోన్ నించి ఇంచు కూడా కదలవ్.''

''ఎందుకు కదలాలి?''

''కదలకపోతే నువ్వు ముందుకు వెళ్లలేవు కాబట్టి. ఇవాళ ట్యూషన్ ఫీజు ఒక్కదాని సమస్య అనుకుంటున్నావు. మీ అబ్బాజాన్‌కి నెలవారీ జీతం పోయి, గంటలవారీ జీతం మిగలడం, ఒక్కోసారి అదీ లేకపోవడం, ఇష్టం లేకపోయినా మీ అమ్మీజాన్ బయటికి వెళ్లి పని చెయ్యడం .. ఇవన్నీ నీ ఒక్కదాని సమస్యలు కాదు. అవి కేవలం నీ సమస్యలు అనుకోవడం వల్ల నీకు భూతాల్లా కనిపిస్తున్నాయ్. నిన్ను ఒంటరిని చేసి భయపెడుతున్నాయ్.''

''అమ్మో. ఇది చాలా కాంప్లికేటెడ్‌గా ఉంది నాకు.''

''లేదు. అందుకే నీతో నువ్వు మాట్లాడుకోవాలి కాసేపయినా. నీతో నువ్వు ఇంటర్వ్యూ చేసుకోవాలి కాసేపు. ఈ చదువుల్లో మనకి దక్కే గొప్ప ట్రైనింగ్ అదే. అదొక్కటే నేర్చుకుంటే మిగతావి వాటి వెనక వస్తాయి.''

కాఫీ అయిపోయింది. కాని చర్చ ఒక కొలిక్కి రాలేదు. రాదేమో! కానీ, ఆర్తి అట్లా ఎంత సేపయినా మాట్లాడగలదు. నేను ఎందుకు మాట్లాడలేను? నా లోపల ఈ ఐడియాలు ఎందుకు పుట్టవు? కనీసం ఈ ఒక్క విషయం అయినా ఆలోచించాలి. మాట్లాడాలి. నేనూ గొంతు విప్పి మాట్లాడాలి.

''సరే ... నాకు అలసటగా ఉంది. రేపు కలుద్దాం'' అనేసి ఇద్దరం యూనియన్ బయటికి వచ్చి, మా బస్ స్టాపుల వేపు నడక మొదలెట్టాం.

4

ఆర్తి మాటలు నా లోపల సందడిగా తిరుగుతున్నాయి. అంత తేలిక కాదు నా మొద్దు బుర్రని తట్టి లేపడం. కాని, ఆర్తికి మాట్లాడ్డం తెలుసు. తట్టి తట్టి కొట్టినా ఒక వాక్యం ఊడిపడదు నా గొంతులోంచి. కానీ, ఆర్తికి ఆలోచనల్ని తట్టడం తెలుసు.

నిద్రలేని ఇంకో రాత్రి నాకోసం కాచుక్కూర్చుందేమో?!

అవును. నా కంఫర్ట్ నించి బయటికి ఎందుకు రాలేనూ? నా లోపలి భయాల వల్లనా? ఈ చట్రం దాటితే ఏమవుతుందో అన్న గందరగోళం భరించలేకనా? నేను చేసే ప్రతి పనీ ఈ కంఫర్ట్ జోన్ లోనే ఇమిడి ఉందా?

గడియారంలో పక్షి రెండు గంటల దగ్గర ప్రశాంతంగా కూసింది, ఇక పడుకో అన్నట్టుగా.

ఏం ఆలోచిస్తున్నానో కూడా తెలియదు. ఎన్నో రకాల ఆలోచనలూ ఆవేశాలూ గుట్టలుగా పడిపోతున్నాయి నా మీద! కాకపోతే, ఈ ఆలోచనలు చికాకు పెట్టడం లేదు. అశాంతి పెట్టడం లేదు. ఒక్కో పొర విడదీస్తున్నంత ప్రశాంతంగా ఒక్కొక్కటి మనసు ముందు పరేడ్ చేస్తున్నాయి. ఈ క్షణాలు బరువుగా ఉన్నాయి కానీ, మనసు మాత్రం ఒకింత తేలికగా నిబ్బరంగా ఉంది.

ఇదేమీ పెద్ద యుద్ధం కాకపోవచ్చు. కానీ, ఒక యుద్ధాన్ని జయించుకొస్తున్న నింపాదితనం నా లోపల.

afsartelugu@gmail.com

❖ సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి

1			●	2	●	3
	●	●	4			
5		6		●	●	
	●		●	7	8	
9				●		●
	●		●	●		●
●	10					

అడ్డం

1. 'ఇంగ్లీష్ వింగ్లీష్' హీరోయిన్ (3)
2. బాలకృష్ణ, సదా జంటగా నటించిన చిత్రం (4)
5. కృష్ణ, నాగార్జున తండ్రీ కొడుకులుగా నటించిన సినిమా (4)
7. 'థైం వేస్ట్'కు వ్యతిరేక పదంతో వచ్చిన ఆశాషైనీ సినిమా (3)
9. జంధ్యాల సినిమా 'రాగలీల' హీరో (4)
10. దేవీ ప్రసాద్ దర్శకత్వంలో శ్రీకాంత్, సునీల్ నటించిన చిత్రం (6)

నిలువు

1. నాగార్జున 'డమరుకం' దర్శకుడు (6)
2. 'పున్నమినాగు' హీరోయిన్ తలకిందులైంది (2)
3. 'చీకటితో వెలుగు చెప్పెను నేనున్నానని' గీత రచయిత (4)
4. నిఖిల్ హీరోగా వచ్చిన చిత్రం '..తేడా' (2)
6. సాయికుమార్ కొడుకు ఆది హీరోగా అశోక్ డైరెక్ట్ చేస్తున్న చిత్రం (5)
8. ఎన్టీఆర్ 'ఆటగాడు' అయితే కమలహాసన్ '....' (4)

గత వారం జవాబులు

1 చా	రు	2 ల	త	●	●	3 భా
లా	●	క్ష్మీ	●	4 అ	వు	ను
5 బా	ల	రా	జు	●	●	చం
గుం	●	య్	●	6 రా	●	ద
7 బి	8 న	●	9 సు	ధా	క	ర్
●	10 బి	ల్	●	కృ	●	●
11 మా	యా	●	12 కృ	ష్ణ	చ	క్ర



అడ్డం

1. చిరంజీవి ముద్దు పేరుతో మొదలైన 'విలాసం' (4)
4. తూగోజీలోని పుణ్యక్షేత్రం – ఆరామాల్లో ఒకటి (4)
7. తేనెటీగ గూడు – వెనకనించి కదిలించండి (2)
8. తెలుగు 'రివ్యూ' (3)
10. గిరీశం ఇచ్చే లెక్చరంతా ఈ మ్యారేజ్ పైనే (2)
11. వానరం (2)
13. ఎడ్లతో దున్నడానికి సిద్ధమైన నాగలి (3)
15. ఇది తీయడమే తలారి పని (2)
16. ఊసరవెల్లి మార్చే 'వర్ణాలు' (3)
17. సీతారాముల పుత్రరత్నాల్లో ఒక రత్నం (3)
18. సుఖం అనుభవించేవాడు, 'ఏకచక్రే మహా --' (2)
19. అట్నుంచి వచ్చిన ఆలోచన (3)
21. తిరగబడ్డ మహిళ (2)
23. ఒంట్లోని తీగ – అడ్డం 11 క్లూలో వెతకండి (2)
25. మనలో మనం మాట్లాడుకోవడం (3)
27. మొదలు లేని 'తేనుపు' (2)
28. ఇది కూడా మురిపమే (4)
29. బరువెక్కిన త్రాసు (4)

నిలువు

1. అతి చిన్న మూషికం (4)
2. వర్షపు రాకను తెలిపే పవనాలు (2)
3. ఆద్యంతాల 'మానస' (2)
4. ఈ గుత్తుల పళ్లు ఎండితే 'కిస్‌మిస్' (2)
5. వేపను పెళ్లాడే చెట్టు (2)
6. కప్పను గుర్తుకు తెచ్చే లంకారాణి (4)
9. పాలను మరిగిస్తే వచ్చేది ? (3)
12. యుద్ధరంగంలో వాడే భారీ తుపాకి – మొదట్లో సవరించాలి (3)
13. 'టర్నింగ్' (3)
14. వ్యాకులత (3)
15. వారధి కట్టడంలో రాముడికి హెల్ప్ చేసిన ప్రాణి (3)
18. తెలుగువారి 'మీల్స్' – ఏకవచనంలో (4)
20. ఒక మసాలా దినుసు – చివర సున్నా లుప్తం (3)
22. కామాక్షి కొలువైన ఒకనాటి 'కంచి' (2)
24. గొడవ – చివర వత్తు తెగింది (2)
25. రవళి (2)
26. వేడుక లాంటిదే (2)
27. మతి తప్పిన భానుమతి పల్టీ కొట్టింది (2)

గత వారం జవాబులు

1 పు	లు	2 సు	●	3 లు	●	4 కొ	ఠ	5 వి
రు	●	6 మ	7 నో	వే	8 ద	న	●	ప
9 గు	10 రే	●	ము	●	మ్ము	●	11 శ్రే	ణి
●	12 భా	తం	●	13 వి	●	14 అ	యో	●
15 తీ	గ	●	16 సం	యో	గ	●	17 భి	క్ష
●	18 ణి	రా	●	గం	●	19 లై	లా	●
20 గ	తం	●	21 జో	●	22 జా	●	23 షి	24 కృ
బ్బి	●	25 సా	ల	26 భం	జి	27 క	●	త
28 లం	చ	ము	●	గు	●	29 త	టా	కం

నిర్వహణ : గొరుసు

గత వారం జవాబులు

9	6	2	4	5	3	8	7	1
5	7	3	8	6	1	2	9	4
4	8	1	7	2	9	3	5	6
2	4	5	3	8	7	1	6	9
3	9	7	1	4	6	5	8	2
8	1	6	2	9	5	4	3	7
7	2	8	9	3	4	6	1	5
1	5	4	6	7	8	9	2	3
6	3	9	5	1	2	7	4	8

అంకెళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

4			2					7
	9		3	1			4	
2			9	8	4			1
		6				7	1	4
	4	9				6	3	
3	7	1				2		
9			4	5	2			6
	6			9	3		8	
1					8			3

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255
ఫోన్: 040-6522 5554

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారిచూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు .....

పుట్టిన తేదీ .....

పుట్టిన సమయం .....

పుట్టిన ఊరు (మండలం) .....

ప్రశ్న .....

పుట్టిన తేదీ వివరాలు లేని వారు 1 నుండి 249 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాసి పంపండి. (ఇవి కృష్ణమూర్తి పద్ధతిలోని 249 సబ్స్).

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా

అదృష్ట రత్నజ్యోతి,

ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76,
అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

అదృష్ట రత్నజ్యోతి

ఐ.ఎస్.ఆర్., కృష్ణలంక

మా అమ్మాయి జన్మకుండలి సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు.

మీ అమ్మాయి జన్మకుండలి ప్రకారం– నక్షత్రం రేవతి–1

2027 మే వరకు బుధ దశ.

2027 మే నుండి 2034 మార్చ్ వరకు కేతు దశ.

2034 మార్చ్ నుండి 2053 డిసెంబర్ వరకు శుక్ర దశ. పిదప రవి చంద్ర దశలు.

కంట్రోలింగ్ ఫేక్టర్స్ : బుధునికి కుజ శుక్ర రవి శనులు. కేతువుకు చంద్ర శుక్రులు. శుక్రునికి రాహు గురు కేతు బుధులు. రవికి కుజుడు. చంద్రునికి బుధ కుజులు.

యోగాలు చెప్పుకోతగ్గవి లేకపోయినా జాతకం కొన్ని రెమిడీస్ పాటిస్తే యోగిస్తుంది.

1. లగ్నమే చంద్రలగ్నం కావడమన్న కాంబినేషన్ వలన, భవిష్యత్తులో ఎప్పుడైనా ఏ కోణంలో అయినా జీవితాన్ని తపస్సు చేసి మార్చుకోవాలనుకుంటే మాత్రం అది సాధ్యం కాదు!

2. గట్టి ఆయుర్భావానికి గట్టి రెమిడీస్ పాటించాలి. అలాగే 2013 డిసెంబర్ 8 నుండి 2014 మే 27 మధ్య, 2016 జులై 25 నుండి సెప్టెంబర్ 23 మధ్య బాలారిష్టం చోటు చేసుకోకుండా బుధ శుక్రులకు గట్టి రెమిడీస్ పాటించాలి.

అలాగే తిరిగి 2034 మార్చ్ నుండి 2037 జులై మధ్య, 2050 జనవరి నుండి 2052 అక్టోబర్ మధ్య గండాలకు గట్టి రెమిడీస్ పాటించాలి.

3. అదృష్టం బలపడడానికి రాహువుకూ, శక్తి చైతన్యం జడమై పోకుండా కేతువుకూ ఆయా సమయాల్లో ఆయా రెమిడీస్ పాటించాలి.

4. మంచి ఆయుర్భావానికీ, వృత్తికీ, ధన యోగానికీ కనకపుష్యరాగం ధరించాలి.

5. సామాజికంగా తన కుటుంబం ఉన్నతిలోకి రావడానికి ఈ జన్మకుండలిలో బలమైన కాంబినేషన్స్ ఉన్నాయి. అవి పూర్తి స్థాయిలో పనిచేయడానికి పుష్యరాగం+పగడం ధరింపజేయాలి.

6. విద్య బాగుంటుంది కానీ ప్రేమ వ్యవహారాల వలన వెనకబడకుండా చూసుకోవాలి. కుజ శుక్రులకు ఎంత గట్టి రెమిడీస్ పాటిస్తే అంత మంచిది. ఈ లవ్ ఎఫైర్ విషయంలో ఒక సందర్భంలో ప్రాణం తీసుకోవడానికి కూడా వెనుకాడని సంఘటన జరుగుతుంది. అలా జరిగేది 2034 నుండి 2037 జులై మధ్య. అంటే శుక్రునిలో శుక్రాంతర్దశలో. అంటే తన 23 నుండి 26వ ఏట మధ్య. అలా మొత్తానికి వివాహం, ప్రేమ వివాహం అవుతుంది.

అయితే ఇక్కడ ఒక పెను పరీక్ష పాసవ్వాల్సి ఉంటుంది. అది... నిజానికి జన్మకుండలిలో కళత్ర భావం చెడింది. కుజ దోషం లేకపోయినా, కళత్ర భావం సప్తమ అష్టమ భావాధిపతులతో, రవి శనుల రెండు డిగ్రీల దూరం కూడా లేని యుతితో నిండిపోవడం జరిగింది. టూ మెనీ కుక్స్ స్పోయిల్ ది ఫుడ్! ఒకే భావంలో అన్ని గ్రహాలు ఉండకూడదు. అది కూడా వృత్తి, కళత్ర భావాల్లో! కనుక ద్వికళత్రం లాంటి దోషమే కాకుండా ఎన్నో అర్థాల్లో ఇక్కడ కళత్ర భావం చెడింది. అయితే పుట్టింది పున్నమి నాడు. ఆ పూర్ణచంద్రుని పూర్వపుణ్యంతో కూడిన వీక్షణ సప్తమం మీద పరిపూర్ణంగా ఉంది కాబట్టి పరిహారాలు పాటిస్తే వైవాహిక జీవితాన్ని పూర్తి స్థాయిలో మనకు తగ్గట్టుగా మలచుకోవచ్చు! ఆ మహా పరిహారం... ఇక్కడ... ''భర్త డాక్టర్ కావడం''!! భర్త డాక్టరయితే వైవాహిక జీవితంలో మరే ఇతర సమస్యలూ లేనట్టే, రానట్టే!

అయితే అమ్మాయిది లవ్ మ్యారేజ్. మరి అలాంటి సందర్భంలో అబ్బాయి డాక్టరవ్వాలన్న రూలేమీ లేదు కదా! ఇదీ... సరిగ్గా ఇక్కడ ఇదీ తిరకాసు!!!

కనుక రవి శనులకు ప్రత్యేకమైన రెమిడీస్ ఇప్పటి నుండి పాటిస్తూ ఉంటే... విద్య మెడిసిన్ అవుతుందీ... ఆ ప్రేమించేదేదో డాక్టర్‌నే ప్రేమించడం, పెళ్ళి చేసుకోవడం జరుగుతుంది!!

సంతానం : సంఖ్య 2. ఒకటికీ మూడుకీ మధ్య ఎబార్ట్ అవుతుంది. ఈ విషయం అమ్మాయికి అస్సలు తెలియకుండా జాగ్రత్తపడాలి.

స్థిర చరాస్తులు : వీలయినంత వరకూ తన పేరు మీద లేకుండా చూసుకోవాలి. ఇన్వెస్ట్‌మెంట్‌కి అంటే కొని, అయిదారేళ్ళకి అమ్మి సొమ్ము చేసుకునే ఉద్దేశ్యమైతే ఈ చార్ట్ బాగా లాభాలు గడిస్తుంది. అలాగే వ్యాపారం చేయాలనుకుంటే, మెడికల్ షాపులు ఈమె పేరు మీద కలిసొస్తాయి.

అదృష్ట రత్నాలు : కనకపుష్యరాగం+పగడం ధరించాలి. అయితే ధరించిన నాటి నుంచి కొన్ని రెమిడీస్ రోజూ చేసుకునేవి జీవితాంతం పాటించాలి. పాటించలేనట్టయితే రత్నాలు ధరించకపోవడమే మంచిది.

అదృష్ట దిక్కు : ఈస్ట్ ఫేసింగ్ అయితే ధన యోగం, వృత్తిలో మంచి స్థితి, సంభాషణా చాతుర్యం. వెస్ట్ ఫేసింగ్ అయితే ఆఫండాన్ గండాలవుతూ ఉంటాయి. సౌత్ ఫేసింగ్ అయితే వైవాహిక జీవితంలో పోరాటాలు, ఒకరి పొడ ఒకరికి పడకపోవడం, శక్తిచాలనం చాలకపోవడం జరుగుతుంటాయి. నార్త్ ఫేసింగ్ ఇంట్లో అయితే రక్షంతి పుణ్యాని పురాకృతాని... ఎలాంటి కష్టం నుండైనా కూడా ఒడ్డుకు తీసుకొచ్చే పూర్వపుణ్యం అక్కరకు రావడం, వైవాహిక జీవితంలో తన వంతు కర్తవ్యంగా భర్తతో పేచీ లేకుండా చేయడం, వ్యాపారంలో సాధ్యమైనంత సహకారం అందించడం ఉంటాయి.

యోగం : ఈ జన్మకుండలిలో యోగం పట్టాలంటే, పని చేయాలా వద్దా అని ఊగిసలాడుతున్న పర్వత యోగాన్ని పనిచేసేలా చేసుకోవడం! దీనికి కొన్ని ప్రత్యేక పరిహారాలు పాటించాలి.

శక్తియుక్తులు : ఏ విషయమైనా మనసుకు తీసుకోకుండా ఉంటే జీవితం గడిచిపోతుంది. భర్త తాలూకు ప్రతి కదలికనూ తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలనుకుంటే నరకమే. కుభార్యాయాం కుతో రతిః ! మూర్ఖపు భాగస్వామితో నరకమే గతి!

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అధినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అధినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 62255** Advt

పిల్లలూ... బొమ్మలరాతను నేర్పుతాడీ అంకుల్!

'అరుంధతి' సినిమా గుర్తుందా...? అందులో తన జేజమ్మ చిత్రపటాన్ని చూస్తూ.. ఆ పటంలో ఆమెకు సంబంధించిన చరిత్రను చదువుతూ కనిపిస్తుంది అరుంధతి. చిత్రపటాల్లో చరిత్ర రాయడం ఒక అద్భుతమైన కళ. దాని పేరు ఐకోనోరైటింగ్. అలాంటి కళను ఉపయోగించి పన్నెండేళ్ల క్రితమే మన కడప జిల్లా వాడైన జె.రాబిన్‌సన్. తన తాతతండ్రుల చిత్రాలలో వారి జీవిత చరిత్రను పొందుపరిచారు. ముందు తరాల వారికి తెలియాలన్న సంకల్పంతో ఆ పనిచేశారాయన. ఆ నైపుణ్యమే ఇప్పుడో కొత్త తరహా విద్యావిధానానికి నాంది పలికింది. కేంద్రప్రభుత్వం సైతం దానిని గుర్తించింది. మలేషియా, థాయ్‌లాండ్, జపాన్‌లకు చెందిన విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు ఈ ప్రక్రియను అమలు చేయడంతోపాటు పరిశోధనలూ జరుపుతున్నాయి.

జె.రాబిన్‌సన్ అసలు పేరు జింకా శ్రీనివాసులు. తన కుమార్తె స్నేహితురాలి పుట్టినరోజు కోసం ప్రత్యేక బహుమతి ఇవ్వాలన్న ఆలోచనే 'ఐకోనో రైటింగ్'కు పురిగొల్పింది. ఈ ప్రక్రియ ద్వారా కాగితాన్ని పొదుపు చేయడంతో పాటు, విద్యాభ్యాసం పట్ల పిల్లల్లో ఆసక్తిని రేకెత్తించవచ్చంటున్నారు రాబిన్‌సన్.

ఐకోనో రైటింగ్ అంటే...!

''చదువుతూ రాయడానికి బదులు రాస్తూ చదవడం దీని ప్రత్యేకత. పిల్లలకు చదువు చెప్పాలంటే ఒక వస్తువును పరిచయం చేసి, దాని ద్వారా రాయడం, చదవడం నేర్పుతాం. ప్రస్తుత విద్యా విధానంలో చిన్న పిల్లలకు రెండు రూళ్లు, నాలుగు రూళ్ల పేపర్లు పెట్టి అక్షరాలను అరగదీయిస్తున్నారు. పిల్లలకు ఇష్టం లేకున్నా, వారిని బుజ్జగించి, బ్రతిమాలి, అవసరమైతే దండించి మరీ వారి చేత రాయిస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. పిల్లలు తమంతట తామే స్వచ్ఛందంగా రాసేలా వారిలో ఆసక్తిని కలిగించాలి. అది ఐకోనోతోనే సాధ్యం అవుతుంది. ఒక పేపర్ మీద పెన్నుతోనో, పెన్సిల్‌తోనో బొమ్మ లేస్తాం. లైన్లు గీస్తాం. వాటిపై అక్షరాలు రాయిస్తాం. ఉదాహరణకు– యాపిల్ బొమ్మ వేశామనుకోండి. దాని లోపలి భాగంలో లైన్లు గీసి 'ఎ' రాయాలని చెబుతాం. విద్యార్థి ఆ పండు బొమ్మను నింపాలన్న ఉద్దేశంతో మన ప్రమేయం లేకుండానే ఇష్టపూర్వకంగా రాస్తాడు. ఆ పద్ధతిని 'పాజిటివ్ రైటింగ్ మెథడ్' అంటాం. తర్వాత బొమ్మ వెలుపలి భాగంలో 'ఎ' రాయాలి. దాన్ని 'నెగెటివ్ రైటింగ్ మెథడ్' అని పిలుస్తారు. మూడో పద్ధతిలో బొమ్మ లోపలా, బయటా రాయాలి. దీనినే 'కాంబో' లేదా 'ఐకోనో రైటింగ్ మెథడ్' అంటారు. ఇలా బొమ్మలను నింపుతూ రాయడం వల్ల విద్యార్థికి అభ్యాసం పట్ల మక్కువ కలుగుతుంది. ఇందులో రంగుల పెన్సిళ్లను వాడొచ్చు. సాధారణంగా అందరూ వాడే.. బ్లూ కలర్ ఇంకును వాడాలన్న నిబంధనేమీ లేదు. విద్యార్థికి ఏ రంగు నచ్చితే దాన్ని వాడుకోవచ్చు.

కాగితం ఆదా..

ఐకోనో రైటింగ్‌తో కాగితాన్ని పొదుపు చేయవచ్చు. మీరు గమనించారో లేదో, ఏదేని నోటు పుస్తకంలోని కాగితంలో కొంతభాగాన్నే మనం ఉపయోగిస్తాం. మిగతా పేపరంతా వృథా అవుతుంది. ఐకోనోలో అలా ఉండదు. రైటింగ్‌తోనే ఒక పేపరు మీద బొమ్మ వేస్తాం. ఆ బొమ్మలోనే చిత్రానికి సంబంధించిన చరిత్రను తెలియజెప్పడం దీని ప్రత్యేకత. అందరికీ అర్థమయ్యేలా చెప్పాలంటే– ఒక కాగితం మీద గాంధీజీ బొమ్మను వేశామనుకోండి. ఆయన జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఆ బొమ్మలో రాయవచ్చు. దీనివల్ల బాపూజీ బొమ్మ మనసులో ముద్రపడిపోతుంది. దీంతో పిల్లల్లో విజ్ఞానంతోపాటు కళాతృష్ణ పెరుగుతుంది.

ఇక మన కుటుంబీకుల బొమ్మను గీసి, అదే పేపర్‌పై వారి చరిత్ర కూడా రాశామనుకోండి. అది భవిష్యత్ తరాలకు పనికొస్తుంది. తాత, ముత్తాతల గొప్పదనం, వంశచరిత్ర తెలుస్తుంది.

ఇంకొక విషయం.. పాఠశాలల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇస్తుంటారు. క్రికెట్ సర్టిఫికెట్ అనుకోండి. అందులో విన్నర్ అనో, రన్నర్ అనో.. నాలుగు లైన్లు తప్ప మరేమీ వుండదు. పేపరంతా ఖాళీగా కనిపిస్తుంది. అదే ఖాళీ ప్రదేశంలో క్రికెట్ చరిత్రను లిఖిస్తే ఏదో ఒక సమయంలో ఆ విద్యార్థి దాన్ని చదవకపోడు. క్రికెట్ చరిత్ర తెలియకపోదు. ఐకోనో విధానంలో 1 నుంచి 6వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 7 నుంచి 10వ తరగతి వరకు ఇంటర్‌మీడియట్, కాలేజీకి అడ్వాన్స్‌డ్ లెవల్ అని మూడు విభాగాలు వుంటాయి.

ఎలా కనుక్కొన్నారు..?

2000 సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న నా కూతురు క్యాథరిన్ ఓ రోజున నావద్దకు వచ్చి.. తన స్నేహితురాలి పుట్టిన రోజుకి ఏదైనా బహుమతి కావాలని, అది చాలా ప్రత్యేకంగా వుండాలని మరీమరీ కోరింది. ఏం చేయాలో నాకేం పాలుపోలేదు. చిన్నప్పటి నుంచీ నాకు ప్రయోగాలన్నా, కొత్త వస్తువు తయారు చేయాలన్నా చాలా ఇష్టం. దాంతో బుర్రకు పదును పెట్టాను. మొదట జీసస్ బొమ్మ గీశాను. అందులో బైబిల్‌లోని రెండు అధ్యాయాలను లిఖించాను. అది చూసి మా అమ్మాయి ఎగిరిగంతేసింది. పుట్టిన రోజుకి ఇంకా సమయం వుండడంతో ఆ బొమ్మను గోడకు వేలాడదీశాను. బొమ్మలోని బైబిల్ చాప్టర్లు చదువుకోవడానికి ఓ భూతద్దం కూడా కొని పక్కనే వేలాడదీశాను. మా అమ్మాయితో పాటు ఇంటి కొచ్చిన ఆమె స్నేహితులు ఆ బొమ్మను చూసి ఆకర్షితులయ్యారు. భూతద్దాన్ని తీసుకుని ఆసక్తిగా చదవసాగారు. రోజూ బైబిల్ చదవమని ఇంట్లోవాళ్లు పోరు పెట్టినా వినని పిల్లలు, పోటీపడి చదువుతుంటే నాకు ఆశ్చర్యం వేసింది. ఇదే ప్రక్రియను చదువులో కూడా ప్రవేశపెడితే బావుంటుంది కదా! అనిపించింది. ఆ ఆలోచనే నా పరిశోధనను పరుగులు పెట్టించింది.

ఐకోనో రైటింగ్‌తో వేసిన చిత్రాలు

ప్రభుత్వాల ఆసక్తి..

ఏబీసీడీల నుంచి ఉన్నత చదువుల దాకా నేను ఐకోనో మీద పరిశోధనలు చేశాను. భిన్నమైన చార్టులు రూపొందించాను. మొదట ఆవడిలోని సిరగుమాంటిస్సోరి స్కూల్‌కు తీసుకెళ్లి యాజమాన్యానికి చూపించాను. అది వారికి ఎంతో నచ్చింది. దిగువ తరగతుల ఉపాధ్యాయులను పిలిచి నేను తయారు చేసిన వాటిని పరిశీలించాలని చెప్పారు. వారం రోజుల్లోనే ఫలితాలు వెలువడ్డాయి. ఉపాధ్యాయులు కూడా ఆశ్చర్యపోయారు. పిల్లలు ఎనలేని ఆసక్తి చూపుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దాంతో నాకూ ఉత్సాహం వచ్చింది. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. నేను ఈ ప్రక్రియను కనుక్కోవడానికి నా భార్య సహకారం ఎంతోవుంది. అన్ని పనుల్నీ వదిలేసి ఐకోనో మీద ప్రయోగాలు చేస్తూ కూర్చుంటే, అన్ని వ్యవహారాలను ఆమే చూసుకునేది. కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తుంది తను. ఐకోనో రైటింగ్ గురించి చెబుతూ అనేక చోట్ల తిరగాల్సి వచ్చింది. మొదట నిరాశ ఎదురైనా, తరువాత చాలామంది విద్యావేత్తలు ఆసక్తి చూపడం మొదలుపెట్టారు. ఓసారి కేంద్రీయ విద్యాలయం వారు నిర్వహించిన 'టీచింగ్ మెథడాలజీ' సదస్సులో పాల్గొనే అవకాశం వచ్చింది. అందులో బహుమతి కూడా వచ్చింది. మెల్లగా విషయం కేంద్రప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ ప్రక్రియ మీద అందరికీ అవగాహన కల్పించాలని సంబంధితులకు ఉత్తర్వులు వెళ్లాయి.

సదస్సుల కోసం ప్రయత్నం..

దక్షిణ భారతదేశంలో వెయ్యికి పైగా కేంద్రీయ విద్యాలయాలున్నాయి. వాటిల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాను. ప్రస్తుతం చెన్నయ్‌లోని కొన్ని స్కూళ్లలో 'ఐకోనో రైటింగ్' వాడుతున్నారు.

'ఐకోనో రైటింగ్' గురించి థాయ్‌లాండ్‌లో ఆ మధ్య ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. అక్కడ ప్రముఖుల్ని కలుసుకునే అవకాశం దొరికింది. 'జర్నల్ ఆఫ్ ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అచ్చువేసిన పుస్తకంలో 'ఐకోనో రైటింగ్' గురించి నేను రాసిన వ్యాసం ప్రచురించారు. జర్మనీకి చెందిన 'రీడ్ ఎల్స్‌వేర్' ప్రపంచవ్యాప్తంగా కొత్త విద్యా విధానాలకు ఇచ్చే బహుమతుల్లో 'ఐకోనో రైటింగ్'కు ప్రథమ బహుమతి వచ్చింది. మలేషియాలోని సైన్స్ విశ్వవిద్యాలయంలో దీన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. మలేషియా ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియ పట్ల ఆసక్తి చూపింది. 'ప్యాటర్న్' మార్చి ఇస్తే ప్రవేశపెడతామని మలేషియా ప్రతినిధులు అడిగారు. ఈ మేరకు ఒక ఒప్పందం కుదిరింది. అందుకోసం త్వరలోనే మళ్లీ అక్కడికి వెళ్తున్నాను. పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి కూడా ఓ ఆహ్వానం వచ్చింది. ముందు ఒప్పుకున్న పనులు పూర్తయితే, ఆ తరువాత పాక్ వెళ్తాను.

పెద్ద చదువులు చదవకపోయినా...

కడప జిల్లా తాడిపత్రికి చెందిన పద్మశాలీల కుటుంబం మాది. మా తల్లిదండ్రులు జింకా వెంకటలక్ష్మి, జింకా మురళీ శంకరస్వామి. మా తాత జింకా ఆదినారాయణస్వామి 1915 నుంచి 1926 వరకు బ్రిటిషువారి హయాంలో ఆఫ్రికా ఖండంలోని ఉగాండాలో పోస్టుమాస్టర్‌గా పని చేశారు. ఆయన స్వదేశానికి వచ్చాక మా నాన్న రైల్వే ఉద్యోగం కోసం చెన్నయ్ వచ్చారు. అప్పటి నుంచి మేం ఇక్కడే వున్నాం. మా కుటుంబమంతా స్వరాష్ట్రానికి తిరిగి వెళ్లిపోయినా, నేను ఇక్కడే వుండిపోయాను. నాది మతాంతర వివాహం. భార్య హేమలత కోసం నేను మతం మారాను. అప్పుడే శ్రీనివాసరావుకు బదులు రాబిన్‌సన్‌గా పేరు మార్చుకోవాల్సి వచ్చింది. దీన్ని మా నాన్న తప్ప మిగతావారంతా వ్యతిరేకించారు. దాంతో దగ్గరి వాళ్లకు దూరమయ్యాను. చిన్నప్పటి నుంచీ నాకు పుస్తకాలు చదవడమంటే ఇష్టం. స్కూలు అయిపోగానే లైబ్రరీకి వెళ్లేవాడిని. రకరకాల ప్రయోగాలు చేసేవాడిని. పదో తరగతి తర్వాత ఐటీఐ చేశాను. తర్వాత ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజైనింగ్‌లో డిప్లమో చేశాను. నాకు చేసిన పని చేయడమంటే విసుగు. ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లడం, చేసిన పనే చేస్తూ సాయంత్రానికి ఇంటికి చేరడం ఇష్టం ఉండదు. అందుకే చాలా ఉద్యోగాలు చేసినా సంతృప్తి లేక, వదిలేశాను. సొంతగా ఓ సంస్థ స్థాపించాను. అందులో నష్టం రావడంతో దానినీ వదిలేశాను. అన్నీ అయ్యాకే 'ఐకోనో రైటింగ్'ను కనుక్కొన్నాను. ఈ విద్యను ఇప్పుడు దేశ, విదేశాలకు మరింత విస్తరించాలన్న పట్టుదలతో పనిచేస్తున్నాను..'' అంటూ ముగించారు రాబిన్‌సన్.



ఇలా అక్షరాలతో చిత్రాలు వేయవచ్చని చూపిస్తున్న రాబిన్‌సన్

రాబిన్‌సన్ ఫోన్ నెం. : 09884307219

– ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నయ్

ఫోటోలు: కర్రి శ్రీనివాసులు

విలువైన ప్రాంతీయ చరిత్ర

''స్టడీ ఆఫ్ హిస్టరీ మేక్స్ మెన్ వైజ్'' అంటాడు ఫ్రాన్సిస్ బేకన్. వెనక్కి చూసుకుని ముందుకు అడుగు వేస్తేనే జీవన ప్రయాణం సాఫీగా సాగేది. దురదృష్టవశాత్తు నేటి తరం వెనక్కి చూసుకోవడానికి అంత సుముఖంగా లేదు. నేటి విద్యావిధానంలో చరిత్ర, ప్రాచీన, సాంఘిక అంశాల నిష్పాక్షిక అధ్యయనం అంతంత మాత్రంగానే ఉంది. అసలు చరిత్ర అధ్యయనమే అవసరం లేదన్న స్థితి నెలకొంటోంది. చారిత్రక అవగాహన, సంస్కృతి, సంప్రదాయాల మీద విశ్లేషణ లేకపోవడం దేశ పౌరుణ్ణి లక్ష్యంలేని బాణంలాగా తయారు చేస్తోంది. ఇది ప్రమాదకరమైన ధోరణి అనే వాదనతో వేదాంతం లక్ష్మీ ప్రసాదరావు పాఠకుల్ని గతంలోకి తొంగిచూడమంటున్నారు. అలాగే వర్తమానంలో బాధ్యతలను గుర్తు చేస్తున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలు మొన్నటివరకు కలిసే ఉన్నాయి. పాలనా సౌలభ్యం కోసం 1904లో కృష్ణా జిల్లా నుంచి గుంటూరు వేరుపడితే, 1970లో ప్రకాశం జిల్లా గుంటూరు జిల్లా నుంచి వేరుపడింది. నూతన చరిత్ర అందరికీ



తెలిసిందే అయినందున రచయిత 1947 ముందుకే పరిమితమై ఈ పుస్తక రచన చేశారు. చరిత్ర పూర్వయుగం నుంచి అంటే శిలాయుగపు నివాస స్థలాలతో మొదలుపెట్టి ఈనాటి ప్రముఖ వ్యక్తుల ప్రస్తావనదాకా తీసుకొచ్చి ముగించారు. పంపమహాకవి, మంత్రి భాస్కరుడు (తిక్కన తాత), తిక్కన సోమయాజి, కేతన, ఎర్రాప్రెగడ, శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు, బ్రహ్మనాయుడు వగైరా జిల్లా ప్రముఖులందరి గురించీ ఇందులో ఉంది. సామంతపూడి మల్లయ్య క్రైస్తవ గ్రంథాన్ని పద్యరూపంలోంచి శ్రీశైలం మల్లన్నకు అంకితమివ్వడం నాటి మత సామరస్య ధోరణికి మచ్చుతునకగా నిలుస్తుంది. ఆలయాలు, దేవుళ్లు, శాసనాలు, వంశ చరిత్రలు, ఆధునిక కవులు, రచయితలు, ప్రముఖులు అందరినీ పాఠకునికి విసుగులేకుండా పరిచయం చేయడంలో రచయిత కృతకృత్యుడయ్యాడనే చెప్పవచ్చు. ఉప ప్రాంతాలలోని వీరులు, త్యాగమూర్తులు చాలావరకు స్మరణీయులు కాకుండా మిగిలిపోతారన్న రచయిత వేదనను తీర్చేందుకైనా ఈ పుస్తకాన్ని చదవాల్సిందే.

– ఆర్.శ్రీకృష్ణ ప్రసాద్

గుంటూరు–ప్రకాశం జిల్లాలు ... చరిత్ర సంస్కృతి
వేదాంతం లక్ష్మీ ప్రసాదరావు, పేజీలు : 232, వెల : రూ.100
ప్రతులకు : 040–2334 3782

(అసం)పూర్తి 'సవాల్'

తెలంగాణ– సాధించుకునేదాక సమరమే అంటున్నాడు కవి అన్వర్. ఊసుపోని కవిగా దితడు. ఊరుకోని కవి ఇతడు. సర్వ అన్యాయాలకూ సర్వనామమైన తెలంగాణ ఘోషకు వెర్రిగొంతుకనిచ్చినవాడు. అన్వర్‌లో సున్నితత్వమూ ఉంది, కరకుదనమూ ఉంది. నిలబడుండ్రి, జనగణమన తెలంగాణ, ఎంతసేపు, మా చరిత్ర– లాంటి కవితలు ఈ అభివ్యక్తిని పట్టి చూపుతాయి. మనల్ని తట్టి లేపుతాయి...

ఒక లోపం మాత్రం కనిపిస్తోంది. తను ఎంచుకున్న సబ్జెక్ట్‌పై ఫోకస్ లేకుండా– వ్యక్తిగత అభిమాన వ్యక్తీకరణకు (హక్కుల గుండె, ప్రజల రాములు, వరవర కవితలు, మా నాయిన కవిత) 'సవాల్'ను వేదికగా ఎంచుకోవడం, అన్నిటినీ ఇందులో ఇరికించేయడం ఇబ్బందిగా అన్పిస్తుంది. అయితే, ఈ ఇబ్బంది పంటిలో పాలకూర ఇరుకున్నప్పుడు కలిగేదే కానీ పంటికింద రాయి లాంటిది కాదు. వేరే సందర్భంలో, వేరే వేదికపై ఆ నివాళులు, ఆ అభిమానాలూ న్యాయమైనవే.

'ఒక జెండే లేదు, అన్నీ ఎజెండాలే
పోరాటమే లేదు అంతా రాజకీయమే' అనడంలో ఎజెండాలు, రాజకీయం అల్పమైనవి అనే మామూలు రాజకీయ నాయకులు మాట్లాడే పడికట్టు ధోరణి ఉంది తప్ప రాజకీయ స్పృహ లేదు. అది లేకపోతే ఉద్యమం చేయడమే కాదు, ఉద్యమానికి కవితా హారతి పట్టడం కూడా అసంపూర్ణమే అవుతుంది. ఇలాంటి ఖాళీలు ఉన్నాయి అన్వర్‌లో.



దారి దీపాలు, గుండె పగిలి ఏడుస్తున్నాం కవితలు– వీరుల కోసం అన్వర్ చిందించిన కంటి చుక్కలు. నెత్తురు చుక్కలు. కదిలించేవిలా ఉన్నాయి. దోఖా కవితలో– 'స్నేహంగా నా ఆల్బంలోకి చొరబడ్డ నే దొంగమొఖం... పాత జ్ఞాపకాల ముసుగు తొలగిన దోఖేబాజ్ది'– అద్భుతం. సవాల్ కవితలో– 'మేం పోరాటం చేస్తున్నాం / ఉద్యమం లేకుండా చేయగలవా? / మేం ఊపిరి బిగబట్టి ఊదితే / పడిపోకుండా ఉండగలవా?' అంటారు అన్వర్. ఇలాంటి కోపం, ఇలాంటి ఆవేశం, ఇలాంటి సవాల్ కావాలనుకుంటారు పుస్తకం టైటిల్ చూసి కొన్నవారు. పూర్తి న్యాయం చేయలేదేమో అనిపించింది అన్వర్!

తెలంగాణకై పోరేవారు ఉద్యమాన్ని ఆపి ఈ కవితలు చదవాల్సిన పని లేదు గానీ కోరేవారు మాత్రం చదవొచ్చు. కోరనివారు కూడా చదివితే ఒక గాఢమైన ఆకాంక్షను తెలుసుకోవచ్చు. ఆ ఆకాంక్ష గాఢత వెనకనున్న సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక నేపథ్యాల్ని తెలుసుకోవచ్చు.

– శ్రీశైల్‌రెడ్డి పంజుగుల

సవాల్, అన్వర్, పేజీలు : 96, వెల : రూ.60
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

నేను కరీంనగర్‌ని మాట్లాడుతున్నా

కొంతకాలంగా తెలంగాణ సాంస్కృతికోద్యమం తన సంస్కృతిని,కళలను గొప్పగా చాటుకుంటోంది. తన మూలాల్ని తవ్వుకుంటూ, తన చరిత్రను సవివరంగా ఆవిష్కరించుకుంటోంది. ఆ మొత్తం చరిత్రలో 'తమ వంతు ఇదిగో' అంటూ ఆయా ప్రాంతాలు, ఉప ప్రాంతాలు, అస్తిత్వాలు, ఉప అస్తిత్వాలు కూడా పొల్లు పోకుండా తమ గురించి రాసుకుంటున్నాయి. అందులో భాగమే కరీంనగర్ కథలు, కవిత్వం, చరిత్ర ; జగిత్యాల కవిత్వం, చరిత్ర..ఇంకా..ఇంకా

కవితా జగిత్యాల

క్రీ.శ.1110 నుండి 1116 వరకు పొలాస రాజధానిగా పరిపాలించిన జగ్గదేవుడు 21 యుద్ధాలు చేసి పలు నూతన గ్రామాలను స్థాపించాడు. అతడు నిర్మించిన ఒక గ్రామానికి 'జగదాలయం' అని పేరు పెట్టగా, అదే జగిత్యాలగా స్థిరపడిందని చరిత్రకారుల కథనం. ఆ ప్రాంత చరిత్రలో జగిత్యాల జైత్రయాత్ర మరువలేని అధ్యాయం. ఆ అధ్యాయానికి 35 ఏళ్లు అయిన సందర్భంగా దానిని అందమైన ఫోటోలతో 'సిల్హౌట్ ' పద్ధతిలో అలంకరించి ఒక పుస్తకంగా మలిచారు కె.వి.నరేందర్, సంగెవేని రవీంద్రలు. (18 వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ పద్ధతిని కళలు, మీడియా రంగాల్లో విశిష్టంగా వాడుతున్నారు) ఈ

ప్రయోగానికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ అని పేరు పెట్టుకున్నారు వాళ్లు. వాళ్ళిద్దరూ కలిసి రాసిన ఈ కవిత ఉత్తేజభరితంగా ఇలా మొదలవుతుంది.

చితులు చల్లారుతాయేమో.. / స్మృతులు మరణించవు / ఇప్పుడు దృశ్యాల్ని తవ్వితీసుకోవటం / అనివార్యం.. / బాంచెన్ నా తొలిరూపం / బందూకు నా మలిరూపం / రష్యా గోడల మీద సైతం / ఆనవాల్లు ముద్రించిన / రుద్రవీణని... / నేను..జగిత్యాలని! / .....

నేను రుద్రవీణని... జగిత్యాలని
కె.వి.నరేందర్, సంగెవేని రవీంద్ర, వెల : రూ. 75,
పేజీలు : 48, ప్రతులకు : 94404 02871

నిరసనాలంకారం

2011 సంవత్సరం తెలంగాణ ఉద్యమం దృష్టిలో ఆత్మత్యాగాల, విద్రోహాల కాలం. దానికి వ్యక్తీకరణే 'కరీంనగర్ కవిత.' రాష్ట్ర స్థాయిలో 'కవితా వార్షిక', 'కవిత', 'తెలంగాణ కవిత' ఏటా ప్రచురిస్తున్న తీరులోనే తామూ జిల్లాస్థాయిలో కరీంనగర్ కవిత్వం తీసుకురావాలని ఆ జిల్లా కవుల సంకల్పం. ఆ వరుసలో ఈ పుస్తకం రెండవది. 42 మంది కవుల ఈ పుస్తకంలో ఉద్యమ స్ఫూర్తి తుదకంటా నిండివుంది. 'నిరసనాలంకారం', 'తెలంగాణ భాష' శిఖరాన నిలిచే కవితలు. పుస్తకంలో సగం కవితలు బాగున్నాయంటే, ఇప్పటి పరిస్థితుల్లో అది చాలా వరకు విజయం సాధించినట్లే. రాబోయే సంకలనాలు మరింతగా వికసించాలని ఆశిద్దాం.

కాలరెగరేయడం ఇప్పుడు మామూలు విషయం కానేరదు / ఇప్పుడు మోహరించిన రాస్తారోకో పేరు / పట్టపగలు కాలబెట్టుకున్న శ్రీకాంత్ అందాం

('వీరులారా మీకు వందనం' నుంచి)

ద్రోహం దహనం కావాలనే / సకల జనుల సంవేదనల సారాంశం / అప్రియ మంత్రివర్యా! / నీ అరాజకీయం ఆకస్మిక మరణం కావాలె / ప్రాణ సమాన పదవి పరమపదించాలె / ఎల్లలోకం సల్లగుండాలె

('సావుదప్పు' నుంచి)

కరీంనగర్ కవిత–2011
గౌరవ సంపాదకులు : డాక్టర్ నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, వెల : రూ 60,
పేజీలు : 86, ప్రతులకు : 99854 11275

సమాంతర చరిత్ర

జిల్లా కవుల గొంతును అక్షరబద్ధం చేసిన 'సాహితీ సోపతి' ఇపుడు జిల్లా చరిత్రను ముందుకు తెచ్చింది. జిల్లాలోని వెల్గటూర్ మండలంలో ఈనాడు ఒక కుగ్రామంగా ఉన్న కోటిలింగాల ఆంధ్రుల అత్యంత ప్రాచీన రాజధాని అని పలు ఆధారాలతో రాసిన దాదాపు 8 పేజీల ప్రధానవ్యాసం ఇందులో ఉంది. చరిత్రకు పూర్వయుగం నుంచి జిల్లా చరిత్రను నమోదు చేసారిందులో. ఆహారం, వస్త్రాలు–దుస్తులు, అలంకారాలు, ఆటపాటలు, సాహిత్యం, వైద్యం, చిత్రలేఖనం, మతం తదితర అంశాలలో వచ్చిన మార్పు గురించి విపులంగా తెలియజేసారు. తొలి తొలుగు మహిళా మంత్రి నాయకురాలు నాగమ్మ అని, ఆమె భారతదేశంలోనే కాకుండా, ప్రపంచంలోనే తొలి మంత్రి అని ప్రతిపాదించిన వ్యాసం కూడా ఇందులో ఉంది. 14 మంది లబ్ధప్రతిష్టులైన వ్యాసకర్తలు జైశెట్టి రమణయ్య, ఠాకూర్ రాజారాం సింగ్, కుర్రా జితేందర్ బాబు, సంగనభట్ల నరసయ్య, వి.వి.కృష్ణశాస్త్రి, మలయశ్రీ, దేమె రాజారెడ్డి, జె.కిషన్, నలిమెల భాస్కర్, బి.ఎస్.రాములు, ఎం.నారాయణ శర్మ, సందెవేని తిరుపతి, డాక్టర్ రావి ప్రేమలత, సంకెపల్లి నాగేంద్రశర్మల రచనలు ఉన్నాయి ఈ 'ఖాన్‌దాన్'లో.



కరీంనగర్ ఖాన్‌దాన్
వెల : రూ. 75, పేజీలు : 144
ప్రతులకు : నలిమెల సావిత్రి, సెల్–9704374081

– యింద్రవెల్లి రమేష్
9985440002

సరళంగా సైన్సు

భావవాదం అంటే ఏమిటి? భౌతికవాదం అంటే ఏమిటి? భూమి కథేమిటి? భూమిపైనే జీవం పుట్టిందెందుకు? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవడం ఎవరికైనా చాలా అవసరం. అలాంటి జవాబులు సవివరంగా, సరళంగా అందించిన 9 అధ్యాయాల పుస్తకం ఇది. భావవాదం నుంచి భౌతికవాదానికి మళ్ళడానికి కారణమైన బాల్యానుభవాన్ని రచయిత 'నా మాట'లో రాసుకున్నారు.

జీవ వికాసం, బొర్రా గోవర్ధన్
వెల: రూ. 80, పేజీలు : 158
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్

స్వీకారం

బ్లడ్ క్యాన్సర్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్
రచన : డా. జక్కుల విజయ్‌రావు
పేజీలు : 201, వెల: రూ.200
ప్రతులకు : జె.ఎల్. ప్రవలిక, ప్లాట్ నెం.1, శ్రీ చంద్రా హోమ్స్, టీచర్స్ కాలనీ, చక్రిపురం, ఇసిఐఎల్(పోస్ట్),హైదరాబాద్–62

★★★

తదేక గీతం–చైతన్య దీపం
రచన : నెల్లిమర్ల లక్ష్మి
పేజీలు : 73, వెల: రూ.60
ప్రతులకు : క్రిసెంట్ పబ్లికేషన్స్ 29–25–43ఎ, వేమూరి వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ–520 002.

★★★

ప్రజల మనిషి ప్రకాశానికి పద్య కవితా కల్హారమాల
సంపాదకులు : డా. మంగళగిరి ప్రమీలాదేవి
పేజీలు : 94, వెల: రూ.90
ప్రతులకు : 98487 34544

★★★

చలివేంద్రలు (నానీలు)
రచన : ఆర్.కె. కటారి
పేజీలు : 40, వెల: రూ.35
ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి

★★★

బాలల భువనవిజయం
(సాహిత్యరూపకం)
రచన : కేఎస్వీ
పేజీలు : 32, వెల: రూ.25



కేఎస్వీ సరసమైన కథలు
పేజీలు : 219, వెల: రూ150
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

బుద్ధుడి కథ



బుద్ధుని మీద ఎన్నో కథలు వచ్చాయి. భావవాదంతో రాసినవారున్నారు. భౌతికవాద దృక్కోణంలో రాసినవారున్నారు. ఇది మొదటి తరహా రచన. బుద్ధుడి పుట్టుక గురించి ఇలా రాసారు ఇందులో– ''(లుంబినీ వనంలో) మాయ ప్రసవించింది. మగబిడ్డను కన్నది. మానవ, దేవలోకాలు ఆనందంతో గంతులు వేసాయి.'' విప్లవం నుంచి వేదం వరకు సాహితీ ప్రస్థానం సాగించిన ఆచార్యుల తాజా రచన ఇది.

బుద్ధజీవిత సంగ్రహం, డా. దాశరథి రంగాచార్య
వెల : రూ 30, పేజీలు : 53
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్

దేనికైనా రెడీ

ఇంతకుముందు 'ఢీ' కొట్టిన విష్ణు ప్రస్తుతం 'దేనికైనా రెడీ' అంటున్నాడు. అతనే నిర్మాతగా '24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ' బేనర్ కింద ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో హాస్యమే ప్రధానం. తల్లీకొడుకుల సెంటిమెంట్‌తో పాటు ఆద్యంతం వినోదాత్మకంగా ఉండేలా చిత్రాన్ని తీర్చిదిద్దామని చెబుతున్నారు. బ్రహ్మానందం ప్రత్యేకమైన పాత్ర చేస్తున్న ఈ సినిమాలో హీరోయిన్ హన్సిక. జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెలలోనే ఈ చిత్రం తెలుగు, మలయాళంలలో ఏకకాలంలో రిలీజవుతోంది.

Powered By
ASHOK LEYLAND

Exclusive, Most trusted & No.1 OEA of Ashok Leyland

RAPOWER GENERATORS

10kVA to 2000 kVA DIESEL GENERATORS

ENVIRONMENT FRIENDLY

- Compact
- Most Fuel Efficient
- Minimum Maintenance Expenses

The next generation power source
BUNGLOW DG
Blue Magic!

10 kVA & 15kVA
PORTABLE GENERATORS
Can take care of AC loads / water pump / lighting and other miscellaneous loads.
Remote operated DG Set is our innovative and special feature.

www.rapower.in

RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED, Head Office & Regd. Office: BANGALORE. Mfg. Units: Channapatna (KA), Tiruchirapalli (TN)

HYDERABAD:
5/5-93 & 94, 2ND FLOOR, SHIVA CHAMBERS, RANIGUNJ, SECUNDERABAD - 500 003
Phone No. 040-27700840/27700841, 27711239/2274 , FAX: 040-27700841,
E:powerzenhyd@gmail.com,
MR. M D PRASAD : 0 98486 15020 ,
MR. RAMESH : 0 98486 15026

VIJAYAWADA:
#40-22, MOGALRAJ PURAM, BSRK COMPLEX
VIJAYAWADA - 520 010
KRISHNA DISTRICT,
ANDHRA PRADESH.
Phone No. 0866-2492838/ 2492848
powergenvja@gmail.com
MR. AVINASH, 0 95538 33444
0866 2492838

VISAKAPATANAM:
GROUND FLOOR, #48-6-33,
RAMA TALKIES SIDE ROAD, SRINAGAR,
VISAKAPATNAM - 530 016
Phone No. 0891-3012009 / 2791602 / 0 9848788816
rapowergenvizag@gmail.com
Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814,
Mr. SHARVAN : 0 98487 88815

KURNOOL:
P.O. No. 14, APSP SHOPPING COMPLEX,
NEAR BELLARY CHOWRASTRA,
KURNOOL - 518 002, Phone No. 08518 - 256700
kurnool@rapowergen.com
Mr. D.K. KISHORE :0 99486 71600

ANANTHAPUR:

Other State Branches: Hubli | M'lore | Pune | Kochi. Tamil Nadu: Chennai | Madurai | Coimbatore | Tirunelveli

14 అక్టోబర్ 2012

ఆదివారం

ఆంధ్రజ్యోతి

ప్రత్యేక కథనం

పర్యాటకానికి పండగొచ్చింది..

హ్యాపీడేస్ 10

కారుణ్య

'లాలెస్'

కాన్ చలన చిత్రోత్సవంలో చిన్నబోయిన పెద్ద సినిమాలు

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో కాన్‌కు చాలా విశిష్టమైన స్థానం ఉంది. అప్పటివరకు ఎవరికీ తెలియని నటీనటులు అక్కడ ఏదైనా సినిమాలో మంచి పాత్ర పోషిస్తే రాత్రికి రాత్రి పెద్ద తారలైపోగలరు. అప్పటివరకూ ఎక్కడా పేరైనా వినిపించని దర్శకులు కూడా ఉన్నట్టుండి సుప్రసిద్ధులైపోతారు. కాన్ చిత్రోత్సవంలో అవార్డులు రాకపోయినా ఫరవాలేదు, అసలు ప్రదర్శన కంటూ యోగ్యత సాధిస్తే చాలు... ముందుగా యూరప్‌లో, ఆ తర్వాత అమెరికాలో, క్రమేణా మిగతా ప్రపంచంలో ఆ చిత్రాలకు మార్కెట్ వచ్చేస్తుంది. సినిమాకు మంచిపేరు వస్తే గోల్డెన్ గ్లోబ్, ఆస్కర్ బరిలోకి దూసుకుపోతాయి. ఆస్కర్‌లో కూడా అవార్డులు రాన క్కరలేదు, నామినేషన్ వరకూ వెళ్లినా చాలు ప్రపంచ వ్యాప్తంగా కొత్త మార్కెట్ అవకాశాలకు మార్గం సుగమం అవుతుంది. అందుకే ఔత్సాహిక దర్శక నిర్మాతలు కాన్ చిత్రోత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. మార్కెట్ అవకాశాలు ఉన్నచోట సహజంగానే హాలీవుడ్ ముందు వరుసలో ఉంటుంది. మరీ ముఖ్యంగా హాలీవుడ్‌లో ఇప్పటికీ వెలిగిపోతున్న బ్రాడ్ పిట్, నికోల్ కిడ్‌మన్ వంటివారు అయితే చిత్రోత్సవంలో అందరితో కలిసిపోతూ తమ చిత్రాలను ప్రమోట్ చేసుకుంటారు.

హాలీవుడ్ నుంచి ఈసారి ఈ చిత్రోత్సవానికి మూడు పెద్ద చిత్రాలు వచ్చాయి. వాటిలో బ్రాడ్ పిట్ నటించిన తాజా చిత్రం 'కిల్లింగ్ దెమ్ సాఫ్ట్‌లీ', నికోల్ కిడ్‌మన్ నటించిన 'ది పేపర్ బాయ్' ఉన్నాయి. అలాగే ఆస్ట్రేలియా దర్శకుడు హిల్‌కోట్ నిర్మించిన మరో అమెరికన్ చిత్రం 'లాలెస్' కూడా బడ్జెట్ రీత్యా పెద్ద సినిమానే. ప్రపంచంలో ఎక్కడెక్కడినుంచో వచ్చిన చిత్రాలు చిన్నవైనా అనూహ్యమైన కథాంశాలతో, అద్భుతమైన కథనంతో సంచలనం సృష్టిస్తే హాలీవుడ్ చిత్రాలు మూస కథలతో తేలిపోయాయి. ఈ చిత్రాలన్నీ అమెరికాలో ఒక్కొక్క చారిత్రక దశకు సంబంధించినవి; సాహిత్యం ఆధారంగా వెండి తెర రూపం సంతరించుకున్నవీ. అయినా కాన్‌లో మంచి పేరు తెచ్చుకోలేక పోయాయి. అందుకు ప్రధాన కారణం కథలో కొత్తదనం లేకపోవడం, కథనంలో పట్టు లేకపోవడం. 'కిల్లింగ్ దెమ్ సాఫ్ట్‌లీ'లో బ్రాడ్ పిట్, 'ది పేపర్ బాయ్'లో నికోల్ బాగా నటించినా ఆ నటీనటులకు మాత్రమే పేరు వచ్చింది గాని సినిమాలుగా ఇవి గుర్తింపునకు నోచుకోలేదు. రేఖ దాటిన సంభాషణలు, మితిమీరిన హింసాత్మక దృశ్యాల వల్ల కూడా ఈ చిత్రాలు గౌరవానికి దూరమయ్యాయి.

బ్రాడ్ పిట్ 'కిల్లింగ్ దెమ్ సాఫ్ట్‌లీ'లో జాకీ కోగన్ అనే కిరాయి హంతకుని పాత్రలో కనిపిస్తారు. ఈ హంతకుడు కనీసం ముఖపరిచయం ఉన్నా వారిని కాల్చడానికి ఒప్పుకోడు. తెలియనివారిని హత్య చేసేటప్పుడు కూడా వారి హావభావాలను చూడడం కోగన్‌కు ఇష్టం ఉండదు. ఒక సందర్భంలో కోగన్ కారు డ్రైవర్‌తో మాట్లాడుతూ 'నువ్వు ఎవరినైనా చంపావా?' అని అడుగుతాడు. అతను లేదని సమాధానం చెబితే చంపడం అంటే 'చాలా టచీగా, ఫీలీగా ఉంటుంది' అంటూ నవ్వేస్తాడు. అంటే ఏమిటని డ్రైవర్ అడిగితే 'అంటే ఎమోషనల్‌గా ఉంటుంది. అంటే వాళ్లు ఏడుస్తారు, చంపొద్దని వేడుకుంటారు. వాళ్ల కన్నీళ్లు, వేడుకోళ్లు అబ్బే, అదంతా మనకు పడదు. మెత్తగా చంపి పడేయాలి (కిల్లింగ్ దెమ్ సాఫ్ట్‌లీ), అదే మనకు ఇష్టం. మరు క్షణంలో చచ్చిపోతున్నామన్న సంగతి అవతలివాడికి అస్సలు తెలియకూడదంటాడు'' కోగన్. సెంటిమెంట్లు అంటే అంత చికాకు ఈ హంతకునికి!

జార్జ్ హిగిన్స్ అనే రచయిత 1974లో రాసిన 'కోగన్స్ ట్రేడ్' అనే నవల ఆధారంగా దర్శకుడు ఆండ్రూ డొమినిక్ ఈ చిత్రాన్ని నిర్మించారు. నవల దాదాపు నాలుగు దశాబ్దాల క్రితంది అయినా ఈ చిత్రంలో 2008 నాటి అమెరికా ఎన్నికల ప్రచార దృశ్యాలు కనిపిస్తాయి. అంటే అప్పటి క్రైమ్ కథని ఇప్పటి పరిస్థితులకు అన్వయించి దర్శకుడు కథ చెబుతున్నాడని భావించాలి. ఈ మార్పువల్ల ప్రత్యేకంగా ఈ చిత్రానికి ఒనకూడిందేమీ లేదు. బ్రాడ్ పిట్ స్వయంగా కాన్‌కు వచ్చి తనని ఫోటోలు తీస్తున్న అభిమానులను తానూ ఫోటోలు తీస్తూ అందరితోనూ కలిసిపోవడంతో ఆ దృశ్యాలకు యూరప్ ప్రసార మాధ్యమాలలో మంచి ప్రచారం మాత్రం లభించింది. బ్రాడ్ పిట్ కొత్త రకం కిరాయి హంతకునిగా కనిపించడంవల్ల ఈ చిత్రానికి కాన్ వేదికగా మంచి మార్కెటింగ్ కూడా జరిగింది.

హిల్ కోట్ దర్శకత్వం వహించిన 'లాలెస్' చిత్రం 1930వ దశాబ్దం తొలిరోజుల్లో వర్జీనియాలో చోటు చేసుకున్న యథార్థ సంఘటనల ఆధారంగా నిర్మితమైంది. కథాకాలం మద్యపాన నిషేధం అమలు తుది దశలో ఉన్నప్పటిది. ఊరికి దూరంగా ఎవరి కంటా పడకుండా చిట్టడవిలో పెద్ద పెద్ద బట్టీలలో దొంగ సారాయి కాయడం, దానిని చట్టవిరుద్ధంగా రహస్య మార్గాలలో ప్రజలకు చేరవేయడం, వేలకు వేల డాలర్లు చేతులు మారడం, అడ్డొచ్చిన వారిని నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేయడం – ఇదీ ఆనాటి పరిస్థితి. ఇదంతా బాండ్యూరాంట్ సోదరులుగా అప్పట్లో ప్రసిద్ధులైన ఒక కుటుంబం చెప్పుచేతల్లో జరిగింది. ఈ పరిస్థితి గురించి తెలుసుకున్న అమెరికా ప్రభుత్వం చార్ల్స్ అనే గట్టి అధికారిని ఆ ప్రాంతానికి పంపిస్తుంది. అతడు లంచగొండి, పైగా చాలా కఠినాత్ముడు. ఈ నేపథ్యంలో సాగే కథకి ఎంత హింసాకాండ జోడిస్తే అంత కిక్కు!

మ్యాట్ బాండ్యూరాంట్ అనే రచయిత తన ముందు తరంవారిపై రాసిన 'ది వెట్టెస్ట్ కౌంటీ ఇన్ ది వరల్డ్' అనే నవల ఈ చిత్రానికి ఆధారం. పీరియడ్ ఫిల్మ్‌గా హిల్‌కోట్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు కాని ఇందులోని హింసాకాండ చూసి బాండ్యూరాంట్ కుటుంబ వారసులు కూడా గుండెలు బాదుకున్నారు. ఆ రోజుల్లో హింసాకాండ జరిగిన మాట నిజమే కాని మరీ ఇంత హింసాకాండ జరిగిందంటే మాత్రం నమ్మశక్యం కావడం లేదని వారు వర్జీనియాలో ఈ చిత్రం ప్రీమియర్ చూసి గగ్గోలు పెట్టారు. మితిమీరిన హింస మార్కెటింగ్ వ్యూహమని బాండ్యూరాంట్ కుటుంబంలోని యువతరం సరిపెట్టుకుంది గాని సినిమా ప్రపంచానికి దూరంగా రోజులు నెట్టుకొస్తున్న ఈ కుటుంబంలోని పెద్దవాళ్లు మాత్రం ఆ రోజులను మళ్లీ గుర్తు చేసుకోవద్దు బాబూ అని కళ్లు మూసుకున్నారట!

ఈ రెండూ కాక మూడో హాలీవుడ్ చిత్రం 'ది పేపర్ బాయ్'. కథా కాలం 1969. ఫ్లోరిడాలో జరిగిన ఒక అధికారి హత్య కేసులో హిల్లరీ వెటర్ అనే వ్యక్తి జైలుపాలవుతాడు. అతని ప్రియురాలు షార్లట్ బ్లెస్ కోరికపై వెటర్‌ను కలుసుకోవడానికి మయామి పత్రిక విలేఖరి జాన్సన్ తన సోదరుడు జాక్‌తో కలిసి జైలుకు వెళ్తాడు. కేవలం జాత్యహంకార కారణాలవల్లే వెటర్‌ను నిర్బంధించారని జాన్సన్ విశ్వసిస్తాడు. అందుకే వెటర్‌ను నిర్దోషిగా చూపించడానికి అతడు ప్రయత్నిస్తాడు. ఈలోగా షార్లట్‌కు జాన్సన్ సోదరుడు జాక్ సన్నిహితం కావడం చూసి అప్పటికే పెరోల్‌పై విడుదలైన వెటర్ జాక్‌ను చంపేస్తాడు. అతడు మళ్లీ కటకటాల వెనక్కి వెళ్లక తప్పదు. పీట్ డెక్స్‌టర్ కొన్ని చారిత్రక సంఘటనల ఆధారంగా 1995లో రాసిన నవల స్ఫూర్తితో దర్శకుడు లీ డేనియల్స్ ఈ చిత్రాన్ని నిర్మించాడు. 'గెల్‌హార్న్ అండ్ హెమింగ్‌వే' చిత్రంలో అద్భుతంగా నటించి అందరి అభిమానాన్నీ చూరగొన్న నికోల్ కిడ్‌మన్ ఈ చిత్రంలో షార్లట్ బ్లెస్‌గా పూర్తి భిన్నమైన పాత్ర పోషించి తన అసమాన ప్రతిభను ప్రదర్శించారు. కాని ఈ చిత్రం కూడా వాస్తవిక పాత్రల వాస్తవిక సంభాషణల పేరనోటికి వచ్చినట్టు మాట్లాడడం కాన్ చిత్రోత్సవంలో అందరికీ వెగటు పుట్టించింది. ఎన్నో అద్భుతమైన చిత్రాల ప్రదర్శనకు వేదికగా నిలిచిన కాన్ గౌరవ ప్రదమైన పోటీ విభాగం క్రింద కాదు కదా, పోటీ రహిత విభాగానికి సైతం వీటిని ఎంపిక చేయకుండా ఉంటే ఆ గౌరవం మరింత ఇనుమడించేది.

బై బై కాన్!

– జగన్ 99854 11211
jagan@andhrajyothy.com

'లాలెస్'లో కాస్త రొమాన్స్

రెడ్ కార్పెట్‌పై నికోల్ కిడ్‌మన్

AFP

బీట్ జనరేషన్ కథే 'ఆన్ ది రోడ్'

హాలీవుడ్ ప్రేక్షకుల కోసమే అన్నట్టు తీసిన చిత్రం 'ఆన్ ది రోడ్'. ఇది రెండవ ప్రపంచ యుద్ధానంతరం కొన్నాళ్లకు వేళ్లూనుకున్న బీట్ తరానికి చెందిన కథ. న్యూయార్క్‌కు చెందిన యువ రచయిత సాల్ పారడైజ్‌కు జనబాహుళ్యం గురించి రాయాలని తపన. కాని ఏం రాయాలో తెలియదు, కాని ఏదో ఒకటి రాయాలి. కార్లో అనే మిత్రుడితో నిష్ఫల చర్చలు జరుపుతాడు. ఇద్దరూ డీన్ అనే వ్యక్తిని కలుసుకుంటారు. అప్పటి సమాజానికి డీన్ కొత్త వ్యక్తి! చిన్నప్పటినుంచే నేరాలు చేస్తూ జైలుకి వెళ్లి వస్తూ తనకి నచ్చిన రీతిలో పైలాపచ్చీసుగా గడిపేస్తున్న వ్యక్తి. జీవితాన్ని పిచ్చిపిచ్చిగా జీవించేయాలనుకునే ఇటువంటివాళ్ల గురించే రాయాలని సాల్ నిర్ణయించుకుంటాడు. అందరితో కలిసి కొన్నాళ్లు, ఒంటరిగా కొన్నాళ్లు సాల్ న్యూయార్క్‌నుంచి ఎన్నో రాష్ట్రాలు దాటి చివరికి కాలిఫోర్నియా వరకూ ప్రయాణిస్తాడు. అనేక పనులు చేస్తాడు. ఆ ప్రయాణంలో అమెరికా జనజీవితంలో బీట్ జనరేషన్ ప్రభావాన్ని సమగ్రంగా రికార్డు చేయగలిగాడు. ఆ జీవితానుభవాలనే అతడు పుస్తకంగా రాస్తాడు. అదే 'ఆన్ ది రోడ్'.

రోడ్డెక్కిన బీట్ తరం

అమెరికన్ గాయకుడు బాబ్ డిలాన్‌ను సైతం ఎంతో ప్రభావితం చేసిన ఆనాటి బీట్ జనరేషన్ మార్గదర్శి నీల్ కెసాడీయే ఈ చిత్రంలో డీన్. 'ఆన్ ది రోడ్'లో రచయిత సాల్ నిజ జీవితంలో అసలు రచయిత కెరాక్. కెసాడీ భార్య కేరలిన్ తమ ముగ్గురి మధ్య గల సంబంధాల గురించి, అనుభవాల గురించీ, బీట్ జనరేషన్ గురించీ 'ఆన్ ది రోడ్' ప్రచురించిన యాభై ఏళ్లకి ఒక పుస్తకం రాసింది. దాని పేరు 'ఆఫ్ ది రోడ్'!

చరిత్రపుటల్లో...

'ది మోటార్‌సైకిల్ డైరీస్' చిత్రంతో (క్రిష్ 'గమ్యం' చిత్రానికి ఇదే స్ఫూర్తి) 2004లో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బ్రెజిల్ దర్శకుడు వాల్టర్ సలేస్ ఈ సారి 'ఆన్ ది రోడ్' అనే చిత్రంతో అంతర్జాతీయ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇదే పేరుతో అమెరికన్ రచయిత జాక్ కెరాక్ రాసిన దీనికి ఆధారం. 1957లో ఈ నవల మార్కెట్‌లోకి వచ్చినప్పుడు వార్నర్ బ్రదర్స్ దీన్ని సినిమాగా తీద్దామని లక్షా పది వేల డాలర్లు హక్కుల క్రింద చెల్లిస్తామన్నారట. కాని కెరాక్ ఏజంట్ పారమౌంట్ పిక్చర్స్‌కు లక్షా యాభై వేల డాలర్లకు బేరం పెట్టాడట. అది నచ్చని కెరాక్ సుప్రసిద్ధ నటుడు మార్లన్ బ్రాండోని ఈ నవల హక్కులు కొనుక్కోమని, ఇద్దరం కలిసి నటిద్దామనీ ఊరించాడు. కాని బ్రాండో ఇది నవలగానే బాగుంటుంది గాని సినిమాగా బాగుంటుందా అని సరిగానే సందేహించాడు!

'ఆన్ ది రోడ్' టీమ్

ఏళ్లు గడిచిపోయాయి. ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో పాతిక వేలకే హక్కులు విక్రయించడానికి కెరాక్ సిద్ధపడ్డాడు. అయినా ఎవరూ కొనలేదు. 1979లో ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొపోలా ఈ చిత్రం హక్కులు కొన్నారు. కాని రచనగా బ్రహ్మాండంగా ఉన్న ఈ నవలకి స్క్రీన్ ప్లే రాయడం తమ వల్ల కాదని చేయి తిరిగిన రచయితలు సైతం తేల్చేశారట! కాని చివరికి 2010 కాన్ చిత్రోత్సవంలో కలుసుకున్న కొపోలా, వాల్టర్ కరచాలనం చేసుకున్నారు. 'ఆన్ ది రోడ్' గురించి చర్చించుకున్నారు. ఎలాగైతేనేం, 'మోటార్‌సైకిల్ డైరీస్' పుణ్యమా అని ఆ నవల ఇన్నేళ్లకి అంటే 30 ఏళ్ల తర్వాత చలనచిత్ర రూపంలో రోడ్డెక్కింది! 2012 కాన్ చిత్రోత్సవ వేదిక వెండి తెరపై తళుక్కున మెరిసింది!

కామెంట్

మన్మోహన్‌కో సిక్సర్

శ్రీశ్రీశ్రీ మన్మోహన్ జీజీజీ,

ముందో మూడు వెనకో మూడు గౌరవాలు తగిలించి నేను మీకు ఈ ఉత్తరం రాయడం వెనకున్న కారణాన్ని ఆర్థికవేత్తలయిన మీరు ఈపాటికి గ్రహించే ఉంటారు.

మా ఇంట్లో ఇటీవల జరుగుతున్న సంభాషణలు ఈ విధంగా ఉంటున్నాయి.

మమ్మీ... లేస్ : సారీ నీ కోటా అయిపోయిందమ్మడూ.

అమ్మా... ఆమ్లెట్ : ఆరు గుడ్లూ తినేశావు కదరా.

భార్యామణీ... రిమోట్ : రోజుకు ఆరు చానళ్ళు తిప్పడానికే అనుమతి.

ఇటీవల మా వీధిలో ఒక సీనియర్ సిటిజన్ పేవ్‌మెంట్ మీద వాలుకుర్చీ వేసుకుని కూర్చుంటున్నాడు. సాయంత్రమైతే చాలు పూనకం వచ్చినట్టు వీధిలో వాళ్ళందర్నీ తెగ తిడుతున్నాడు.

ఏమిటయ్యా... ఎంతమంది వస్తారు నీ కోసం? లంచ్ టైంకే ఆరు కార్లు వచ్చేశాయి మీ ఇంటికి. నువ్వూ మీ ఇంట్లో వాళ్ళు ఇప్పటికే డజనుసార్లు బయటికి వెళ్ళొచ్చారు. ఇది కామన్ రోడ్డు అనుకుంటున్నావా? నీ ప్రైవేటు రహదారి అనుకుంటున్నావా? ఒక్కో ఇంటివాళ్ళూ ఇన్నేసిసార్లు తిరిగితే రోడ్డు గుంటలు పడక ఏమవుతుంది? తారు రోడ్డయ్యా ఇది... ఇనుప రోడ్డో, ఉక్కు రోడ్డో కాదు.

మీరు ఏమంటూ ఆరు పరిమితి పెట్టారో కాని ఆరు కంటే ఎక్కువసార్లు తన వంటకు వంకలు పెట్టకూడదని మా ఆవిడా, చదువుకోమని ఆరు కంటే ఎక్కువసార్లు చెపితే ఇంట్లోంచి వెళ్ళిపోతానని మావాడూ, టీవీ/కంప్యూటర్/సెల్‌ఫోన్ ఈ మూడిట్లో దేన్నయినా సరే రోజులో ఆరు కంటే ఎక్కువసార్లు కట్టేయమని చెపితే హేగ్‌లోని అంతర్జాతీయ కోర్టుకు ఫిర్యాదు చేస్తానని నా కూతురూ... రోజులో కనీసం ఆరుసార్లు బెదిరిస్తున్నారు నన్ను.

ఒక జబ్బుకి ఆరు కంటే ఎక్కువ మందులు రాసినా, ఏడాదిలో ఆరు కంటే ఎక్కువ బ్రిడ్జిలు కూలిపోయినా, ఒక మనిషిని ఒక తప్పుకు ఆరు కంటే ఎక్కువ బూతులు తిట్టినా... ద్వీపాంతర వాసం గాని, మంచు ఎడారులకు గాని పంపాలనే ప్రతిపాదనలు కూడా అక్కడక్కడ వినిపిస్తున్నాయి. పెద్దగా చదువుకోని భారతదేశ ప్రజలు ఉన్నట్టుండి ఇంత సృజనాత్మకంగా ఆలోచించగలుగుతున్నారంటే అది కేవలం మీరు ప్రసాదించిన చైతన్యమే.

అందుకు మీకు ఆరు కోట్ల అభినందనలు, ధన్యవాదాలు తెలుపుతూ దేశ ప్రజలందరి తరపున నాదో చిన్న మనవి.

దయచేసి మీరు కూడా మాకు విధించిన పరిమితినే పాటిస్తూ మీ మొత్తం పాలనలో ఆరు కంటే ఎక్కువ తప్పుడు నిర్ణయాలు తీసుకోకండి. అంతకంటే ఎక్కువైతే గ్యాస్‌బండకు మేము పూర్తి మూల్యం చెల్లించినట్లే మీరూ చెల్లించాల్సి వస్తుంది.

ఇట్లు, మీ శ్రేయోభిలాషి

శ్రీశ్రీశ్రీ సామాన్య జీజీజీ

■

ఈవారం కవిత

మా నాన్న గీతా పారాయణం

ఒక చేత్తో సుత్తీ ఒక చేత్తో కొడవల్లా
ఒక చేతిలో కొ.కు. ఒక చేతిలో చలంతో
మా అమ్మ ముక్కోటి దేవుళ్ళ చాదస్తాల్ని
శ్రావణ శుక్రవారాల్నీ, కార్తీక సోమవారాల్నీ
మొదలంటూ తెగనరికే
పరశురాముడిలాంటి నాన్న
బాబాల గారడీల్ని స్వాముల మోసాల్ని
విక్రమార్కుడిలా చీల్చి చెండాడి
కాపిటల్‌ని కంద పద్యంలా
బట్టీయం పట్టిన నాన్న
ఒక్కసారిగా ఎక్కడో ఆగిపోయాడు.
జియ్యరుస్వాముల్ని కూడా
అయ్యరు వడల్లా అప్పడంలా
కరకరా నమిలి మింగిన నాన్న
అయిదుపదులు దాటేసరికల్లా అదేంటో
సగ్గుబియ్యంలా జావకారిపోయాడు.
నలుగురు ఆడపిల్లల బరువుతో
నడుం జారినట్టయి నడి సంద్రంలో
పడిపోయిన నాన్న
కొ.కు ల్నీ, చలాల్నీ, గోర్కీల్నీ
కట్టకట్టి అటకెక్కించాడు.



బొమ్మ: అక్బర్

పుస్తక ప్రదర్శనలంటే ఉరుకులు పెట్టే నాన్న
పెళ్ళి సంబంధాల కోసం పరుగులు పెడుతున్నాడు.
దానాలంటే గిట్టని నాన్న కన్యాదానాలు
చేసేస్తున్నాడు.
కూతుళ్ళ ఈస్ట్‌మన్ కలర్ కష్టాలు
అల్లుళ్ళ అలకపాన్పులు తీరే సరికల్లా
బీపీల్నీ, షుగరుల్ని సంపాదించుకుని
కిడ్నీల్లో నాలుగు రాళ్లని వెనకేసుకుని
ఓ రోజుకి రిటైరైపోయాడు.
ఇకనన్నా చదువుకుంటాడులే అనుకుంటే
చంకలో విష్ణు సహస్రనామంతో ఎదురుపడ్డాడు.
గీతాపారాయణం చేస్తూ కనపడ్డాడు.
ఇదేంటి నాన్నా అంటే
అనాయాస మరణం కోసం అంటూ
అరుణాచలంలో చలంలా
తలొంచిన చార్వాకంలా
కన్నీళ్ళతో నవ్వాడు నాన్న.

– జి. లక్ష్మి , 94907 35322

అక్టోబర్ 14 నుండి 20 వరకు

డా. పి.ఎ. రామన్

మేషం: అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

పనుల సానుకూలతకు బాగా శ్రమిస్తారు. ఖర్చులు భారీగా ఉంటాయి. ఆది, గురువారాల్లో మీ శ్రీమతి వైఖరి నిరుత్సాహ పరుస్తుంది. నగలు, నగదు జాగ్రత్త. వ్యాపార వర్గాలకు ఒత్తిడి, శ్రమ అధికం. వృత్తి, ఉపాధి పథకాలు మందకొడిగా సాగుతాయి. ప్రయాణాల్లో చికాకులు తప్పవు. కొత్త వ్యక్తులతో జాగ్రత్త. పెద్దల ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతుంది. అధికారులకు సిబ్బందితో ఇబ్బందులు.



వృషభం: కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ముఖ్యమైన వ్యక్తుల్ని కలుసుకుంటారు. ఆదాయానికి మించి ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. పట్టుదలతో శ్రమించి ఒక లక్ష్యాన్ని సాధిస్తారు. మంగళ, శనివారాల్లో అనవసర జోక్యం ఇబ్బంది కలిగిస్తుంది. దంపతుల మధ్య శుభకార్య ప్రస్తావన వస్తుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త. అనుభవంతో ఒక సమస్యను అధిగమిస్తారు. అధికారులకు అదనపు బాధ్యతలు, ఒత్తిడి అధికం.

మిథునం: మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

రావలసిన ధనం అందుతుంది. కుటుంబ విషయాలపై శ్రద్ధ వహిస్తారు. స్త్రీల కోరికలు, అవసరాలు తీరుతాయి. గృహంలో ప్రశాంతత నెలకొంటుంది. వేడుకలు, విందుల్లో పాల్గొంటారు. దైవదర్శనాల్లో అప్రమత్తంగా ఉండాలి. గురు, శుక్ర వారాల్లో వ్యవహారాల్లో జాగ్రత్త. మీ సేవలకు గుర్తింపు, ప్రశంసలు లభిస్తాయి. నిరుద్యోగులకు ఒక అవకాశం కలిసివస్తుంది.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సన్నిహితులు, అయినవారి ప్రశంసలు అందుకుంటారు. విలాసాలు, కుటుంబ అవసరాలకు బాగా వ్యయం చేస్తారు. పరిచయాలు, వ్యాపకాలు విస్తరిస్తాయి. స్త్రీల ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. వృతి, ఉద్యోగ బాధ్యతల్లో మెలకువ వహించండి. కోర్టు, ఆస్తి, స్థల వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. పెద్దల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది.

సింహం: మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలతో క్షణం తీరిక ఉండదు. బంధువులకు మీ వైఖరి అసంతృప్తి కలిగిస్తుంది. ఖర్చులు పెరిగినా ఆదాయానికి లోటుండదు. పొదుపు పథకాలు, పెట్టుబడుల ఆదాయం అందుతుంది. వృత్తి, వ్యాపార సంబంధాలు బలపడతాయి. భాగస్వామిక ఒప్పందాల్లో సముచిత నిర్ణయాలు తీసుకుంటారు. స్త్రీలపై శకునాల ప్రభావం అధికం. తలపెట్టిన పనులు మందకొడిగా సాగుతాయి.

కన్య: ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

నిరుత్సాహం వీడి యత్నాలు సాగించండి, సత్ఫలితాలు లభిస్తాయి. మీపై వచ్చిన అపవాదులు తొలగిపోగలవు. వృత్తి, ఉద్యోగ బాధ్యతల్లో మెలకువ వహించండి. ఆదాయానికి తగ్గట్టుగా ఖర్చులు రూపొందించుకుంటారు. వ్యాపార అభివృద్ధికి చేపట్టిన పథకాలతో విక్రయాలు ఊపందుకుంటాయి. ఆకస్మిక ప్రయాణం తలపెడతారు. స్త్రీలు దైవదర్శనాల్లో అప్రమత్తంగా ఉండాలి.

తుల: చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. శుభవార్తా శ్రవణం, కొత్త పరిచయాలేర్పడతాయి. దుబారా అధికం. ఆది, సోమవారాల్లో పనులు, యత్నాల్లో ఆటంకాలు ఎదుర్కొంటారు. వృత్తి, ఉద్యోగ బాధ్యతల్లో మార్పులు సంభవం. నిరుద్యోగులకు కలిసివచ్చే సమయం. శారీరక శ్రమ నిద్రలేమితో అస్వస్థతకు గురవుతారు. పెద్దల సలహా పాటించండి. లౌక్యంగా పనులు చక్కబెట్టుకోవాలి.

వృశ్చికం: విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

కొన్ని విషయాలు పైకి చెప్పుకోలేక మధనపడతారు. దాపరికం వల్ల అశాంతి, చికాకులు తప్పవు. ఖర్చులు పెరిగినా తట్టుకుంటారు. మంగళ, బుధవారాల్లో పెద్ద మొత్తం ధన సహాయమై బంధువులు ఇరకాట పెట్టవచ్చు. క్రయవిక్రయాలు బాగున్నా లాభాలు అంతంత మాత్రమే ఉంటాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాల విషయాన్ని పునరాలోచించండి. మీపై నిఘా ఉంటుంది, జాగ్రత్త.

ధనస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఆదాయ వ్యయాలు ఫర్వాలేదనిపిస్తాయి. ధన వ్యయంలో భేషజాలకు పోవద్దు. మంగళ, బుధవారాల్లో కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. గురు, శుక్ర వారాల్లో గత తప్పిదాలు పునరావృతమయ్యే ఆస్కారం ఉంది. వృత్తిపరమైన సంబంధాలు బలపడతాయి. స్త్రీలకు వాహనం నడిపేటప్పుడు ఏకాగ్రత ముఖ్యం. అధికారులకు అదనపు బాధ్యతలు, ఒత్తిడి అధికం.

మకరం: ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

గృహంలో సందడి నెలకొంటుంది. పనులు అనుకున్నట్టు జరుగుతాయి. కరెన్సీ నోట్లు తీసుకోవడంలో జాగ్రత్త. శనివారం నాడు చిన్న తప్పిదాలే సమస్యగా మారే అవకాశం ఉంది. ప్రముఖులతో దైవదర్శనాలు, వేడుకల్లో పాల్గొంటారు. మీపై వచ్చిన అభియోగాలు, విమర్శలను దీటుగా తిప్పికొడతారు. అధికారులకు బాధ్యతల మార్పు, స్థానచలనం సంభవం.

కుంభం: ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఒక శుభకార్యం చేయాలనే సంకల్పం బలపడుతుంది. బంధుమిత్రులతో సంప్రదింపులు జరుపుతారు. ఆదాయ వ్యయాలు ఫర్వాలేదనిపిస్తాయి. మొండి బాకీలు కొంత వసూలవుతాయి. ఆది, సోమవారాల్లో వ్యవహార సానుకూలతకు బాగా శ్రమించాలి. అధికారులకు మీ అభిప్రాయాలు సూచనప్రాయంగా తెలియజేయండి. ఎవరినీ తక్కువజేసి మాట్లాడవద్దు.

మీనం: పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మీ కష్టానికి తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. కొత్త పరిచయస్తుల సహాయం అవసరమవుతుంది. మంగళ, బుధవారాల్లో హామీలు, మధ్యవర్తిత్వాలు ఇరకాటానికి గురిచేస్తాయి. స్త్రీలు దైవదర్శనాల్లో నగదు, ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యమైన పత్రాలు, సమాచారం అందుకుంటారు. ప్రయాణాల్లో చికాకులు అధికం.

అంకెలతో అదృష్టం

ఐ.బి. సాహు
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.....
2. పుట్టిన తేదీ .....

(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)

3. పుట్టిన సమయం .....
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు .....
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

ఎస్.వై.ఆర్., వైజాగ్

పుట్టిన తేదీ లేదు. ఊరు వివరాలే ఉన్నాయి. పుట్టిన తేదీ వివరాలు లేకపోతే సంఖ్య వ్రాయమన్నారు. నా పేరులో మార్పు వివరించగలరు.

వివరాలు లేని పక్షంతో ప్రశ్నా పద్ధతిని వాడాలి. వైబ్రేషన్స్ ఇంటర్‌ప్రెట్ చేయడానికి ఉపయోగించేదే న్యూమరాలజీ కాబట్టి మీరు అడిగిన సంఖ్య ద్వారా మీ పేరులో ఏక్టివేట్ అయ్యే వైబ్రేషన్స్‌ను గుణించవచ్చు. మీరు అడిగిన 36వ సంఖ్య మీ కుటుంబ జీవితంలోని ఒడిదుడుకులను ప్రభావితం చేస్తుంది. 36వ సంఖ్యకు ఉన్న స్థాయి, బలం 140 డిగ్రీల లోపే ఉంది. ఈ బలం అధమ పక్షం 300 డిగ్రీలు దాటి ఉండాలి. కాబట్టి మీ పేరులో 'హెచ్' అనే అక్షరం చేర్చినట్లయితే మీ పూర్తిపేరు హార్మోనిలోకి మారుతుంది. ప్రతిరోజు 95 సార్లు మీ పూర్తి పేరు వ్రాసుకోండి. వ్రాసే పద్ధతి కరెక్ట్‌గా ఉండాలి. ఏ మార్పు కోసమైతే మన పేరు కోర్స్‌లా వ్రాస్తున్నామో ఆ మార్పు మీరు వ్రాయడంలో శక్తిని పుంజుకోవాలి.

బి.ఆర్.ఆర్., కరీంనగర్

నా డేటాఫ్ బర్త్ ప్రకారం వైబ్రేషన్స్ వివరించగలరు.

మీ ఛార్ట్‌ను కొంత డీప్‌గా వివరిస్తాను. ఇంటెన్స్ స్థాయిలో ఉన్న సంఖ్య 3,8,6. ధనాన్ని ప్రభావితం చేసే సంఖ్య 2. వృత్తిని ప్రభావితం చేసే సంఖ్య 3. వివాహాన్ని ప్రభావితం చేసే సంఖ్యలు 7,5. సంతానాన్ని ప్రభావితం చేసే సంఖ్యలు 6,7 మరియు 1,9. ప్రస్తుతం నడుస్తున్న పీరియడ్‌లో అత్యంత ప్రభావిత సంఖ్యలు 9,3. సూక్ష్మంగా చెప్పాలంటే పున్నమి చంద్రుని వంటి సంపాదన. ఎమోషన్స్ కాని, పొగడ్తలు కాని నన్నేమీ చేయలేవు అంటూనే మానసికంగా ఉబ్బితబ్బిబ్బయ్యే మనస్తత్వం. అప్పుడప్పుడూ మంచితనాన్ని నిరూపించుకోవడానికి చేసే సహాయాలు వెరశి మంచి మనిషి అనిపించుకునే ప్రవర్తన. ప్రథమ సంతానం ద్వారా కొంత మానసిక వేదన. రెండవ సంతానం మీ వృత్తిని వారసత్వంగా పొందడం, తద్వారా మిమ్మల్ని మీరు అద్దంలో గమనించుకోగలరు.

మీ పేరును పూర్తి స్థాయిలో ప్రభావితం గావించబడేది 63 అయితే షార్ట్‌ఫామ్‌లో 26. ఎప్పుడైనా పేరు 9,8 కాంబినేషన్స్‌లో సహజంగా ఉన్నప్పుడు లేదా ఏర్పడినప్పుడు సూచించబడేది మీ వృత్తి లా, పోలీస్‌లు, ఆశ్రితులు మీ చుట్టూ ఉంటారనడంలో సందేహం లేదు. ఈ 9,8 కాంబినేషన్ ఆర్.వి. ఎనర్జీ 30గా ఉన్నప్పుడు సమర్థుడు అని పేరు తెచ్చుకోవడంలో సందేహమే లేదు. కాకపోతే ప్రతి కాంబినేషన్ అద్భుతంగా ఉంది అని లెక్కించే లోపు పంటి కింద రాయిలానో, కంటిలో నలుసులానో కనపడే అంశం ఉంటూనే ఉంటుంది. అన్నీ బాగున్నాయి కానీ అంటూ అర్థోక్తిలో ఆగిపోయే అంశం మీ వరకూ మీ భార్యే. భార్య కారణంగా అత్యధిక ఆవేశాన్ని ప్రదర్శించగలగడం మీకు మైనస్సే. మీ ప్రతిభ, మీ పాండిత్యం గుర్తించకపోవడమే కారణం. ఆ ఒక్క అంశంలో మీరు తామరాకుపై నీటిబొట్టులా వ్యవహరించగలిగితే, నిగ్రహించుకోగలిగితే మిగిలినవి అన్నీ మిమ్మల్ని అదృష్టవంతుడు అనే పట్టికలో అగ్రభాగానికి చేర్చేస్తాయి. అదే విధంగా ప్రథమ సంతానం విషయంలో ఆవిడదే పైచేయి కావడం మిమ్మల్ని కొంత నిరాశపర్చడం వెనుక శక్తి స్థాయి 9,8,3. మీ పేరు ఇందుకు తగిన ట్టుగానే ఉంది. అన్నీ బాగున్నప్పుడు పేరును కదల్చకూడదు. మీ పేరు మీకు మంచి గుర్తింపునిచ్చే స్థాయిలోనే ఉంది కాబట్టి పేరులో మార్పులు, చేర్పులు సవరణలు అవసరం లేదు. పేరులో ఉన్న శక్తి మీరు అన్నదానం, వస్త్రదానం చేసినప్పుడు తగ్గుతుంటుంది. మరే విధంగానైనా సహాయం చేయవచ్చు కాని పై రెండు దానాలు చేయకండి. నేచర్‌లో ప్రతి అంశంలోను కాంటాక్ట్ అవ్వడం 85 శాతం ఉన్న ఛార్ట్ మీది. మీ వైబ్రేషన్స్ రిసీవింగ్ పవర్ శక్తివంతంగా ఉంది. ఇంతకు మించిన విషయాలు 2017లో చెప్పుకొందాం... శుభమ్.

ఎన్.ఎమ్.ఆర్., కడప

వైబ్రేషన్స్ అంటే ఏమిటి? అవి పేరును ఎలా కంట్రోల్ చేస్తాయి? వైబ్రేషన్స్ ఎలా పనిచేస్తాయి. నా పేరు ఏ వైబ్రేషన్స్‌లో ఉండాలి వివరించగలరు.

ఎన్నోసార్లు వివరించాను. అయినా ఎప్పటికప్పుడు సందేహమేనా? ఆద్యంతాలలోని డైమెన్షన్స్‌ను విశదీకరించేవే వైబ్రేషన్స్. టైమ్ టు టైమ్, డే టు డే మారుతూ ఉండే అద్భుత గుణకాలు వైబ్రేషన్స్. గతిని, దిశను నిర్ధారించేవి. ప్రతి వ్యక్తి లోనయ్యే సంఘటనల భాషాంతరీకరణే వైబ్రేషన్స్. క్లుప్తంగా చెప్పాలంటే లాంగ్వేజ్ ఆఫ్ వైబ్రేషన్స్– న్యూమరాలజి. మనకి ఉన్న రిపీట్ కాని సంఖ్య రూపాలు తొమ్మిదే. ఈ తొమ్మిది రూపాల ఫలిత క్రోడీకరణే వైబ్రేషన్స్ ప్రభావం. నిర్ధారించబడేది, నిర్వచించబడేది, అన్వయించబడేది ఈ సంఖ్యా రూపాలే. పేరును కంట్రోల్ చేసేది ఈ సంఖ్యారూపాలే. మీ పేరు తొమ్మిదవ వైబ్రేషన్‌కు సంబంధించి ఉండాలి.

Advt

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా : అంకెలతో అదృష్టం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76, అశ్విని లే–అవుట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500 033.

లోపలి ఖాళీలు

★ అరుణ పప్పు

''ఇక్కడున్న గోళీలు మీ ప్రొఫెషన్. ఇసుక కుటుంబం. నీరు రెండిటినీ తడిపి చల్లగా ఉంచే హాబీ. మీ ముందున్న గాజు గ్లాసు మీ జీవితం అనుకోండి. అప్పుడు మీరు దాన్ని ఏ వస్తువుతో ఎంతెంత నింపుతారో, ఎలా నింపుతారో ప్రయత్నించండి. ఏదీ మిగలకూడదు. అదీ పరీక్ష''. 'వర్క్ – లైఫ్ బ్యాలెన్స్' వర్క్‌షాప్ కొచ్చిన పార్టిసిపెంట్లందరూ దానిలో మునిగిపోయి చిన్నపిల్లల్లా కుస్తీలు పడుతుంటే మేస్టారిలా పర్యవేక్షిస్తున్న సోమా నాకు దగ్గరగా వచ్చి ''నువ్వు కనిపించడం భలే బావుంది లాలిత్యా. న్యూస్ పేపర్లలో నువ్వు పాఠకుల ప్రశ్నలకు సమాధానాలివ్వడం చూస్తుంటాలే. నాకీ కార్పొరేట్ కాన్ఫరెన్సులూ, సెమినార్లతోనే జీవితం అయిపోతోంది. సాయంత్రం వేరే కార్యక్రమాలేం పెట్టుకోకేం. రామనాథాన్ని కారడిగాను. గేట్ వే ఆఫ్ ఇండియా వరకూ వెళ్లొద్దాం. బోల్డు మాట్లాడాలి నీతో...'' అన్నాడు.

ముంబైలోని న్యూక్లియర్ ఫ్యుయెల్ కాంప్లెక్సు వాళ్లు తమ ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ వర్క్‌షాప్‌ను సోమాకిచ్చారు. నేను రేపు మాట్లాడాలి.

హైదరాబాదు నుంచి అతను వస్తున్నట్టు నాకు తెలీదు. పార్టిసిపెంట్లు తమకి తోచినట్టు చేశారు. 'ఎలా నింపారన్నదాన్ని బట్టి మీరు దేనికెంత ప్రాధాన్యమిస్తారో నాకు తెలుస్తుంది...' అంటూ సోమా ఒక్కొక్క గ్లాసూ తీసుకుని చూస్తున్నాడు. అందరిదగ్గరా ఏదో ఒకటి కొంతకొంత మిగిలిపోయే ఉంది.

''ఇప్పుడు చూడండి. గ్లాసులో ముందు గోళీలు పొయ్యాలి. దానిమీద నుంచి ఇసుక పోస్తే చక్కగా కుదురుకుంటుంది. ఇప్పుడు నీరు పొయ్యాలి. అన్నీ సరిగ్గా నిండి కనిపిస్తున్నాయా లేదా... కుటుంబానికీ వృత్తికీ సరైన పాళ్లలో ప్రాధాన్యతనివ్వాలి. ఒకవేళ పొరపాటున గ్లాసులోంచి గోళీలు కిందకి దొర్లిపోతే వెతికి పట్టుకోగలం. ఇసుక జారిపోతే మళ్లీ రాదు.. ఇవి రెండూ సరిగ్గా అమరాలంటే, మీ మనసును ఆహ్లాదపరిచే హాబీ ఏదో ఒకటి ఉండాలి. లేకపోతే లైఫ్ బోర్ కొట్టేసే ప్రమాదం ఉంది'' సోమా ప్రసంగం సాగిపోయింది.

సాయంత్రం నాలుగ్గంటల తర్వాత పడమటి సముద్ర తీరానికి చేరుకున్నాం. భుజాలు కాస్త వంచి నడుస్తున్న ఆయన్ని చూస్తుంటే ఏదో అవ్యక్తమైన ప్రాచీన భారాన్ని మోస్తున్నట్టు అనిపించింది.

సోమయాజులు యూనివర్సిటీలో ఎమ్మే సైకాలజీ చదువుతున్నప్పుడు మాకు సీనియర్. ఒకటీరెండూ కాదు, ఐదారేళ్లు. ఎమ్మెస్సీ మ్యాథ్స్ తర్వాత ఈ కోర్సులో చేరాడని చెప్పుకునేవాళ్లు. ఎందుకో ఏమిటో అర్థం కాక యూనివర్సిటీ చూరు పట్టుకుని వేలాడే గబ్బిలాల సంతతి కింద కట్టేసి నవ్వుకునేవాళ్లం. అయితే ఎవరైనా డౌట్లడిగితే అతను ఇట్టే తీర్చేసే తీరునీ, ముఖ్యంగా ఖణీగా మోగే అతని కంఠస్వరాన్నీ చూసి ప్రొఫెసరంత గౌరవమూ కలిగేది. నా క్లాస్‌మేట్ మృణ్మయి తరచుగా అతని దగ్గరకు వెళుతూ నన్నూ తీసుకెళ్తుంటే కాస్త పరిచయం పెరిగింది. ఆమె సోమా సోమా అని అస్తమానం అంటుంటే ఏదో కతుందిలే అనుకునేవాళ్లం అందరం. అనుకున్నట్టే వాళ్లిద్దరూ తర్వాత పెళ్లి చేసుకున్నారని తెలిసింది. మిగిలిన విషయాలేం తెలియలేదు.

నగరంలోకి ప్రవేశించడానికి సముద్రం మీది చీకటి సైతం భయపడుతోందా అన్నట్టు వెలుగుతున్నాయి నగరంలో దీపాలు. ఫుట్‌పాత్‌ల మీద మెరిసిపోతున్న దుకాణాలను చూస్తూ నడుస్తూ నడుస్తూ తాజ్ హోటల్ వెనుకవైపునున్న కేఫ్ లియొపోల్డ్ దాకా వచ్చాం.

''లోపలికెళ్దామా, ఇక్కడ బంగాళాదుంపతో రకరకాల వంటలు చేస్తారు, చాలా బావుంటాయి'' అంటూ దారి తీశారాయన. ఒక్కో బల్ల దగ్గరా దేశదేశాల మనుషులు, రంగురంగుల పానీయాలు, ఏవి ఏమిటో ఊహించడానికి వశం కాని స్నాక్స్ పళ్ళాలూ...ఇవన్నీ కలిసే ముంబైకి మరింత మెట్రో వన్నెలద్దుతున్నాయనిపించింది.

''డాక్టరమ్మా, ఇప్పుడు నీతో మాట్లాడొచ్చా? ఫీజెంతో చెబితే ఇచ్చుకుంటా...'' అన్నారాయన నేరుగా విషయంలోకి వస్తూ.

''ఫీజు ముక్కు పిండి వసూలు చేస్తాలెండి, మీద గ్గరో మృణ్మయి దగ్గరో. ఇంతకీ ఆమె ఎలా ఉంది? పిల్లలెంతమంది'' ప్రశ్నలు సంధించాను.

''అందరం బానే ఉన్నాం. బాబు ఇంజనీరింగ్ అయిపోవచ్చింది. మా అమ్మానాన్నా మాదగ్గరకే వచ్చేశారు. మృణ్మయి లెక్చరర్ ఉద్యోగమూ, సంగీతమూ అన్నీ భేషుగ్గా ఉన్నాయి...'' చెబుతున్నప్పుడు సోమా ముఖంలో ఏదో ఉదాసీనత కదలాడటం నా అనుమానమేనా?

''రాత్రిళ్లు అకస్మాత్తుగా మెలకువ వచ్చేస్తోంది. తర్వాత నిద్రపట్టడం లేదు. ఉదయం ఉరుకులూపరుగులూ... నిద్ర చాలక నీరసం వచ్చేస్తోంది..''

''ఆపండి మీ అనారోగ్యాల చిట్టా. నేనేం ఎంబీబీఎస్ డాక్టరునా ఇవన్నీ ట్రీట్ చెయ్యడానికి?''

''అనారోగ్యాల చిట్టా కాదు లాలిత్యా. పాపాల లిస్టు. నా భాష అర్థమయ్యే మనిషి కనిపించినప్పుడైనా పూర్తిగా మనసు విప్పకపోతే, ఇంకెప్పటికీ నన్ను నేను తిరిగి పొందలేను'' అంటూ గంభీరంగా మొహం పెట్టుకున్నాడాయన.

''నీకు మా కుటుంబం గురించి ఏమీ తెలియదనుకుంటాను కదా. అమలాపురం దగ్గర కాలవ గట్టునున్న ఒక అగ్రహారం మాది. ఏడున్నరేళ్ల దాకా స్కూలుకు వెళ్లలేదు నేను. అప్పుడు ఉపనయనం చేసి సంస్కృత పాఠశాలలో చేర్పించారు. పదమూడేళ్ల దాకా శెలవుల్లో తప్ప ఇంటికొచ్చిందే లేదు. అమ్మానాన్నల్నీ, అన్నయ్యల్నీ వదిలి ఉండలేక ఎంత ఏడ్చేవాణ్నో చెప్పలేను. విచిత్రం ఏమంటే మా నాన్నదా చదువు కాదు, అన్నయ్యలవీ మామూలు చదువులే. ఎందుకో మరి, నాదగ్గరకొచ్చేసరికి వేదమే అసలైన చదువని మా నాన్నగారిలో ముద్రపడిపోయింది. 'ఇంగ్లీషు చదువులయితే మాలాగా కంపెనీ ఉద్యోగాలు వాడికిందా వీడికిందా పనిచెయ్యడం తప్పదురా అబ్బీ. నాలుగు వేదం ముక్కలు నేర్చుకున్నావంటే సొంతంగా బతకొచ్చు' అనేవాళ్లు. పద్నాలుగో పుట్టినరోజు నాడు అధ్యాపకుల ఆశీర్వచనం తీసుకుని పరుగోపరుగు. ఆ స్కూలు వదిలి వచ్చేశాను. నాన్నగారికది నచ్చలేదు. నాతో మాట్లాడలేదు. ఎటూ చెప్పలేక అమ్మ నలిగిపోయేది. అన్నయ్యలు పెద్దవాళ్లయి ఎగిరిపోయారు కనుక ఇంట్లో నాతో మాట్లాడేవాళ్లే లేరు. పట్టుదలగా ఆర్నెల్ల పాటు చదివి పదోతరగతి పాసయ్యాను.

తర్వాత బీఎస్సీ చదువుతున్నప్పుడు నీరజ పరిచయమైంది. ఒకర్నొకరు చూడకుండా ఒక్కరోజైనా ఉండలేకపోయేవాళ్లం. కాలవ గట్లూ, కాకినాడ బీచులూ, యానాం దగ్గర గోదావరి స్నానాలు, లంకల్లో నైటవుట్లూ... అబ్బో, గొప్ప ప్రేమకథలే. యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ సీటొచ్చి చేరతానన్నప్పుడు కూడా నాన్నగారు మొహం ఎత్తలేదు. నీరజ ఫీజు సాయం చేస్తే చేరిపోయి ట్యూషన్లు చెబుతూ బండి లాక్కొచ్చేవాణ్ని. చదువయ్యాక ఎక్కడైనా లెక్చరర్‌గా చేరి పెళ్లి చేసుకోవచ్చని అనుకున్నాక ఇంట్లో చెప్పాం. పెద్ద గొడవ. నీరజ కులమేదో అడిగి రమ్మన్నారు. అలాగ అడగటానికి నాకు మొహం చెల్లలేదు. ఆమె ఎంతడిగినా ఈ కారణం చెప్పలేకపోయాను. నామోషీగా అనిపించింది. ప్రేమకు అడ్డు రాని కులం పెళ్లికి అడ్డవుతుందా అని ఆమె నిలదీస్తే ఏం చెప్పేది? అలాగని ఇద్దరమే వెళ్లిపోయి పెళ్లి చేసుకోవడం మాకిద్దరికీ ఇష్టం లేని పని. దాంతో అకస్మాత్తుగా కథ ఆగిపోయి మా దారులు వేరయిపోయాయి. ఆర్నెల్లలోనే ఆమె గుండెజబ్బుతో మరణించిందని తర్వాత తెలిసింది...''

''అంత చిన్న వయసులో ఏం గుండెజబ్బు? ఆత్మహత్యేమో...'' అన్నాను సాలోచనగా.

''తప్పు లాలిత్యా. అంత మాటనకు. ఆమెకు గుండెజబ్బున్న మాట నాకు ముందే తెలుసు. ఆ రోజుల్లో అది అరుదే. పెద్ద మందులూ దొరికేవి కాదు. ఇప్పట్లాగా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు ఊరూరా లేవు కదా. కోనసీమలో అసలే లేవు. నిజానికి ఆమెకు వైవాహిక జీవితమూ, మాతృత్వమూ నిషిద్ధమని డాక్టర్లు ముందే చెప్పారు. అలాగని అంత త్వరగా కడతేరిపోతుందనీ అనుకోలేదు.''



బొమ్మలు : అక్బర్

''అవన్నీ తెలిసినా మీరిద్దరూ అంత క్లోజ్‌గా తిరిగారంటే... దానివల్లే...'' అర్థోక్తిగా ఆపాను.

''లేదులేదు, అలాంటిదేమీ జరగలేదు. నా చేతిలో ఆమె చెయ్యుంటే చాలు, ఆమె నాతో ఉంటే చాలు జీవితం కులాసాగా గడిపెయ్యగలననుకునేవాణ్ని...''

''మరి?''

''నేనేమీ భగ్న ప్రేమికుడిలాగా మారిపోలేదు. ఎందుకంటే ఆమె ఆలోచన నాతో ఉందన్న భరోసా. పెళ్లి జరగడం జరగకపోవడం పెద్ద విషయమే కాదనిపించేది. కాని నీరజ చనిపోయిందని తెలిసినప్పుడు మాత్రం పిచ్చివాణ్నయిపోయాను. దాన్నుంచి తేరుకోవడానికి తెగ చదివేవాణ్ని. ఏమిటీ మనసు? ఎందుకు ఒక మనిషి చుట్టూ మన ప్రపంచాన్ని అల్లుకుంటాం? అదేనా

బీఎస్సీ చదువుతున్నప్పుడు నీరజ పరిచయమైంది. ఒకర్నొకరు చూడకుండా ఒక్కరోజైనా ఉండలేకపోయేవాళ్లం. కాలవ గట్లూ, కాకినాడ బీచులూ, యానాం దగ్గర గోదావరి స్నానాలు, లంకల్లో నైటవుట్లూ... అబ్బో, గొప్ప ప్రేమకథలే. యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ సీటొచ్చి చేరతానన్నప్పుడు కూడా నాన్నగారు మొహం ఎత్తలేదు. నీరజ ఫీజు సాయం చేస్తే చేరిపోయి ట్యూషన్లు చెబుతూ బండి లాక్కొచ్చేవాణ్ని. చదువయ్యాక ఎక్కడైనా లెక్చరర్‌గా చేరి పెళ్లి చేసుకోవచ్చని అనుకున్నాక ఇంట్లో చెప్పాం. పెద్ద గొడవ.

ప్రేమంటే? మృత్యువంటే ఏమిటి? జీవితానికి అర్థం ఏమిటి? వీటికి సమాధానాలు తెలుసుకోవడానికి సైకాలజీ అని, ఇంకోటనీ చదువుతూనే ఉండేవాణ్ని...''

''అప్పుడే మృణ్మయి వచ్చిందన్న మాట మీ జీవితంలోకి...''

''అవును. అయితే మీరందరూ అనుకున్నట్టు మా మధ్య ప్రేమకథేమీ జరగలేదు. ఆమె నన్నిష్టపడిన మాట నిజమే. నేను సైకాలజీలో పీహెచ్‌డీ పూర్తిచేసి మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాక వాళ్ల నాన్నగారొచ్చి మా ఇంట్లో వాళ్లతో మాట్లాడారు. నీరజ కాదన్నప్పుడు ఇక ఎవరైనా ఒకటే అనుకుని నేను సరే అనేశాను...''

''ఇక అంతా దారిన పడ్డట్టేగా. ఇప్పుడేవిటి ఇబ్బంది మరి?'' అడిగాను. ఆపాటికి రెండు జ్యూసులు, స్నాకులు పూర్తయ్యాయి. కారు డ్రైవర్ని పిలిచి వెనక్కి ఎన్ఎఫ్‌సీకి వచ్చేశాం. రాత్రి పదకొండవబోతోంది. సోమా చెబుతున్నదింకా పూర్తి కాలేదు. నేను నా గదిలోకి వెళ్లి పడుకోవాలా, వద్దా...

నా ఆలోచనను గమనించినట్టే అన్నారు సోమా – ''కాసేపు నా గదిలో కూచో లాలిత్యా... రేపుదయం ఆరింటికే నా ఫ్లైట్. అప్పుడిక మాట్లాడటం కుదరదు. ఫోన్లలో చెప్పగలిగే విషయమూ కాదు...''

సరేనని సోఫాలో కాళ్లు మఠం వేసుకుని విశ్రాంతిగా కూర్చున్నా. నిద్ర కమ్ముతోంది పల్చటి తెరలాగా...

''ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు అకస్మాత్తుగా నీరజ గుర్తొస్తోంది. అర్ధరాత్రి లేచి కూర్చుంటున్నా. ఆమె నిజంగా చనిపోలేదేమో అదొక గాలివార్తేమో నేనామె నిర్జీవ దేహాన్ని చూడలేదు గనుక తనెక్కడో బతికే ఉందేమో అనిపిస్తోంది...''

నాకేమీ అర్థం కాలేదు. అకస్మాత్తుగా ఎందుకీ అసందర్భపు భ్రాంతి ఈయనలో? నా మొహమే పెద్ద ప్రశ్నార్థకంగా తోచిందేమో, ఆయన చెప్పడం కొనసాగించారు.

''మృణ్మయి ఇంట్లో అందరూ బాగా చదువుకున్నవాళ్లు. వాళ్లు మాట్లాడుకోవడమంతా ఇంగ్లీష్‌లోనే. నాదేమో తెలుగు మీడియం. మొదటిసారి ఏబీసీడీల్ని చూసిందే పదిహేనేళ్లకి. ఏదో నట్టుతూనాన్చుతూ నడిపించడమే తప్ప ఆమెలా నేను అనర్గళంగా మాట్లాడలేను. దాంతో ఆమె త్వరగా ఉద్యోగంలో పైపైకి వెళ్లిపోయింది. నేనున్నచోటే ఉండేవాణ్ని. న్యూనత వల్ల ఆమెతో సరిగా ప్రవర్తించలేకపోయేవాణ్ని. చిన్నచిన్న తగువులు, వాటితో నెలేసి రోజులు మాట్లాడకుండా గడపటాలు... వీటితో విసిగిపోయి ప్రొఫెషనల్ సక్సెస్ మీద దృష్టి పెట్టాను. బ్రహ్మాండంగా ఎదగాలి. ఎదగాలంటే ఇంగ్లీష్ రావాలి. ఇక పట్టుదల వచ్చేసింది. సంస్కృతం నుంచి మామూలు చదువుకు వచ్చినవాణ్ని, నీరజ పోయిన బాధను భరించి సైకాలజీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన వాణ్ని, కాసింత ఇంగ్లీష్ ఎంత అని. బాగా ప్రాక్టీస్ చేసి ఏడాదిలో ఇంగ్లీష్‌లో పట్టు సాధించాను. వీటితో మేం కలిసి గడిపే సమయం తగ్గిపోయింది. ఇంట్లో కూడా క్లయింట్లను చూసేవాణ్ని. వాళ్లలో ఆడవాళ్లుంటే మృణ్మయి తట్టుకోలేకపోయేది. వాళ్లొచ్చి వెళ్లాక కేసంతా ఆరాలు తీసేది. నా సెల్‌ఫోన్ తీసి ఏ నెంబర్లకు మాట్లాడానో, ఎవరికేం మెసేజ్‌లిచ్చానో చూసేది. ఎవరికైనా సాయంత్రం ఆరున్నరకు రమ్మని మెసేజ్ పెట్టడమో, ఫోన్లో చెప్పడమో చేస్తే, ఇక ఆ సమయానికి నేనెక్కడికి వెళుతున్నానో అని కనిపెట్టుకుని చూసేది. ఎప్పుడు చూసినా గొడవలు. తనక్కావలసినదేదో నా దగ్గరున్నట్టు, దాన్ని సాధించు (మిగతా 12వ పేజీలో)

పర్యాటకానికి పండగొచ్చింది..

రాష్ట్రానికి పండగ కళ వచ్చింది. దసరా, దీపావళి ఇంకా రానేలేదు. అప్పుడే ఏం పండగ వచ్చింది అనుకుంటున్నారా? ఇది ఇళ్లల్లో చేసుకునే పండగ కాదు. చారిత్రక కట్టడాలకు, సాంస్కృతిక కేంద్రాలకు, సాహిత్య సుగంధ ప్రదేశాలకు కొత్తశోభను తీసుకొచ్చే పండగ. తెలుగుదేశపు ఔన్నత్యాన్ని చాటిచెప్పి, పర్యాటకుల్ని ఆకర్షించే వేడుక ఇది. రాష్ట్రంలో తొలిసారిగా పన్నెండు పర్యాటక కేంద్రాలకు తోరణాలు కట్టి, గుమ్మాలకు బొట్టుపెట్టి, ఆవరణలో ముగ్గులేసి, వేడుకలు జరుపుతోంది రాష్ట్ర పర్యాటక శాఖ. ఆంధ్రప్రదేశ్ నలుదిక్కులా జరుగుతున్న ఆ ఉత్సవం పేరు 'ఎ ఫెస్ట్ ఆఫ్ ఫెస్టివల్స్ ఫ్రైడ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్'. దీని గురించే ఈ ప్రత్యేక కథనం..

ఇదివరకు అరకు ఉత్సవమనో, హెరిటేజ్ వాక్ అనో.. అడపాదడపా వేడుకల్ని చేపట్టేది పర్యాటక శాఖ. ఇప్పుడు పర్యాటకుల్ని ఆకట్టుకునేందుకు కొత్త ప్రయోగం చేపట్టింది. ఒక జిల్లానో, ఒక ప్రదేశాన్నో అని కాకుండా.. రాష్ట్రంలో డజను పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసుకుని.. సెప్టెంబరు నుంచి జనవరి వరకు సీరియల్ వేడుకల్ని జరపాలని నిర్ణయించింది. ఏటా ప్రతి జిల్లాలోని ఈ పర్యాటక కేంద్రాలు ఫెస్టివల్‌లో కలుస్తాయి. ఒక్కో ప్రదేశంలో జరిగే పండక్కి ఒక్కో పేరు పెట్టి.. ఉత్సవరీతిలో చేయడం ఇదే మొదటిసారి. ఇందు కోసం ప్రత్యేక క్యాలెండర్‌ను తయారుచేసింది పర్యాటక శాఖ.

లేపాక్షిలో మొదలు..

అనంతపురం జిల్లాలోని లేపాక్షి ప్రముఖ పర్యాటక కేంద్రమనేది అందరికీ తెలిసిందే. హైదరాబాద్–బెంగుళూరు జాతీయ రహదారి సమీపంలో ఉంది ఇది. 4.5 మీటర్ల ఎత్తు, 8.23 మీటర్ల పొడవు కలిగిన ఇక్కడి ఏక శిలా నందీశ్వరుడు అబ్బురపరుస్తాడు. అందుకే 'లేపాక్షి బసవయ్య లేచిరావయ్య' అని కవి స్పందించాడు. మధ్యయుగ శిల్ప కళా సౌందర్యానికి మచ్చుతునకగా నిలిచిపోయే లేపాక్షిలోని మిగతా ఆకర్షణలు– ఒకటి 30 అడుగుల శివలింగం. దాన్ని నాగలింగం అని కూడా అంటారు. ఇంకోటి– పురాతన శివాలయం. ఈ ఆలయంలోని శిల్ప సంపదను చూసి అచ్చెరువొందని పర్యాటకులు ఉండరు. మరొకటి– వీరభద్రస్వామి ఆలయం. ఈ గుడికి ఎన్నో ప్రత్యేకతలు. పైకప్పు మీద వేసిన కలంకారీ చిత్రాలు మొదలు

గుడిలో వేలాడే స్థంభం వరకు అన్నీ ఆకర్షణీయాలే. గత నెల 8, 9న 'లేపాక్షి ఫెస్టివల్' ఘనంగా జరిగింది. ఫెస్టివల్ కాలెండర్‌లో ఇదే మొదటిది. పర్యాటక శాఖ ఆశించినట్లుగానే సందర్శకుల సంఖ్య పెరిగింది. ''లేపాక్షి ఫెస్టివల్‌కు సుమారు లక్షమంది వచ్చారు. కర్ణాటక పర్యాటకులు కూడా విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమానికి వచ్చిన మంత్రి అతిథిగృహ నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరు చేశారు. కొత్త సందర్శకులను ఆకట్టుకోవడం, ప్రభుత్వం మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేసేలా చేయడం ఫెస్టివల్ లక్ష్యం'' అన్నారు పర్యాటకశాఖ అధికారులు.

అరకులో ఆటపాటలు...

అరకు కేవలం ప్రకృతి అందాల నిలయం కాదు. గిరిజన సంస్కృతికి ఆవాసం. విశాఖకు 115 కి.మీ. దూరంలో ఉన్న అరకు సౌందర్యాన్ని తిలకించేందుకు రెండు కళ్లు చాలవు. రానున్న శీతాకాలంలో తూర్పుకనుమల్లోని కొండలన్నీ వరిసపూలతో పసుపు వర్ణంలోకి మారిపోతాయి. సముద్రమట్టానికి తొమ్మిది వందల మీటర్ల ఎత్తులో ఉండే ఈ ప్రాంతానికి విదేశీయులు కూడా వస్తుంటారు. వేసవిలో సేదతీరేందుకు ఇది ఎంత చల్లటి ప్రదేశమో అందరికీ తెలిసిందే. విశాఖ ప్రముఖ్యం పెరగడంతో.. అరకుకు కూడా ప్రాధాన్యం పెరిగింది. ''బొర్రాగుహలు, అనంతగిరి కాఫీతోటలు, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ చూడదగ్గవి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఈ నెల 15 నుంచి 21 వరకు 'అరకు ఫెస్టివల్'ను నిర్వహిస్తున్నాం..'' అన్నారు పర్యాటక శాఖ ఓఎస్‌డి మధుసూదన్.

అరకు చుట్టుపక్కల నివసించే గిరిజనులు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. ఛత్తీస్‌గడ్ నుంచి కూడా కొందరు గిరిజనులు రానున్నారు. వీరంతా కలిసి సంప్రదాయ ఆటపాటలతో అలరిస్తారు. ''ఒక రాష్ట్రంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని మరో రాష్ట్రంలో ప్రదర్శించడం వల్ల కల్చరల్ ఎక్స్ఛేంజ్ జరుగుతుంది'' అన్నది ప్రభుత్వ ఆలోచన. ఫెస్టివల్‌లో గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన కూడా జరుగుతుంది.

గండికోటకు కొత్త శోభ..

కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని 'గండికోట' మరోసారి అందరి దృష్టినీ ఆకర్షించనుంది. ఎందుకంటే, ఈ నెల 26 నుంచి 28 వరకు 'గండికోట హెరిటేజ్ ఫెస్టివల్' జరగనుంది. ఎర్రమల పర్వతశ్రేణి పరిధిలో ఇరుకైన కొండల మధ్య ఇక్కడ కేవలం 300 అడుగుల వెడల్పుతో పెన్న ప్రవహిస్తుంది. రాయలసీమలోని పర్యాటక ప్రదేశాల్లో గండికోటకు ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. కోటలో ఉన్న పెద్ద ధాన్యాగారం, మందుగుండు సామగ్రి గిడ్డంగి, మీనార్లు చూడదగ్గవి. రాజుల చెరువు, కత్తుల కోనేరు, రంగనాథాలయం, మాధవరామాలయం కాక పెద్ద మసీదు కూడా గొప్ప నిర్మాణం. గండికోట చుట్టుపక్కలున్న ప్రదేశాలకు కూడా గుర్తింపు తీసుకొచ్చేందుకే ప్రభుత్వం గండికోట ఫెస్టివల్‌ను చేస్తున్నది. ఫెస్టివల్‌లో అష్టదిగ్గజాల వైభవం పర్యాటకుల కళ్లముందు సాక్షాత్కరించనుంది. కవులతో ఒక కొలువును ఏర్పాటు చేయబోతున్నారు. గ్రామీణ క్రీడల్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కడప జిల్లా యంత్రాంగం పండగ ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పర్యాటక శాఖ తెలిపింది.

మదనపల్లిలో సాహిత్య సొరభాలు..

మదనపల్లి గుర్తుకొస్తూనే రవీంద్రుడు గుర్తుకొస్తారు. ఈ పట్టణంలోనే ఆయన మన జాతీయగీతం 'జనగణమన'ను బెంగాలీ నుంచి ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. జిడ్డుకృష్ణమూర్తిలాంటి మహామహులతోనూ మదనపల్లికి అనుబంధం ఉంది. పక్కనున్న తిరుపతి కూడా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య కేంద్రం. అందుకని, మదనపల్లిలో అతి పెద్ద సాహిత్య పండగను చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. ''నవంబరు 10 నుంచి 12 వరకు జరిగే సాహిత్య ఉత్సవం పుస్తక ప్రియుల్ని అమోఘంగా ఆకట్టుకుంటుందని.. భావిస్తున్నాం. ఇదివరకు హైదరాబాద్, విజయవాడ లాంటి నగరాల్లో సాహిత్య పండగలు జరిగాయి. అందుకని ఈసారి మదనపల్లిని ఎంచుకున్నాం. పుస్తక ప్రియుల్ని ఈ ప్రాంతానికి ఆకర్షించడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే కొత్తతరం విద్యార్థులకు సాహిత్య అభిరుచి కలుగుతుంది. పండగ జరిగినన్నాళ్లూ భారీ ఎత్తున సమావేశాలు, పుస్తక ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, పోటీలు నిర్వహిస్తున్నాం..'' అని చెప్పారు అధికారులు. ఇవన్నీ పర్యాటక వైవిధ్యాన్ని పెంచుతాయన్నది వారి విశ్వాసం.

ఓరుగల్లుకు రాణిగారొస్తున్నారు..

కాకతీయ వైభవానికి ప్రతీక వరంగల్ కోట. ఆ వైభవాన్ని అందించిన రుద్రమదేవి, మంత్రులు, సైనికులు మళ్లీ ఆ కోటలో దర్శనమివ్వబోతున్నారు. కాకతీయ ఫెస్టివల్ జరిగే తొలిరోజు.. కోట మీద సైన్యాన్ని, రాజులు, రాణులను వారి వారి ఆహార్యంలో తిలకించవచ్చు. ఈ ఏర్పాట్లన్నీ ఘనంగా చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు పర్యాటకశాఖ సలహాదారు జి.కిషన్ రావు పేర్కొన్నారు. ఫెస్టివల్‌లో భాగంగా.. వంద మందితో పేరిణి నృత్య ప్రదర్శన ఉంటుంది. ప్రముఖ సంగీత విద్వాంసులు బాలమురళీకృష్ణ, అజయ్‌చక్రవర్తి లతో జుగల్‌బందీ ఏర్పాటు చేస్తున్నారు. నృత్య కార్యక్రమాలతో రామప్ప దేవాలయం కళకళలాడనుంది. వెయ్యిస్తంభాల గుడిలో కళలు, చేతివృత్తులు, సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు ఉంటాయి. ప్రబంధాల్లో ప్రజలు తినే ఆహారం గురించిన ప్రస్తావన ఉంది. వాటిని అధ్యయనం చేసి.. కాకతీయ ఫెస్టివల్‌లో ప్రత్యేక ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేయనున్నారు. నవంబరు 24 నుంచి 30 వరకు జరుగుతున్న ఈ ఫెస్టివల్‌లో జానపదగేయాలు, శాస్త్రీయ నృత్యాలు, చిత్రలేఖనం, సాహిత్యసదస్సులు వంటి అన్ని ఆకర్షణలూ ఉంటాయి.

కాకినాడ యమ టేస్టీ..

ఉభయగోదావరి జిల్లాల్లో దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలకు కొదవ లేదు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని 'కాకినాడ బీచ్ ఫెస్టివల్' ఓ వెలుగు వెలిగిపోనుంది. సుందరమైన తీరప్రాంతం, సరస్సులు, పక్షులకు పెట్టింది పేరు ఈ జిల్లా. కోరింగ పక్షుల సంరక్షణ కేంద్రం ప్రత్యేకం. బ్రిటిష్‌వారు నిర్మించిన లైట్‌హౌస్ అందరికీ ఇష్టమైనది. కాకినాడ కేంద్రంగా చుట్టుపక్కల పర్యాటక ప్రదేశాలన్నిటికీ విశేష ప్రాచుర్యాన్ని తీసుకొచ్చేందుకు ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చందనాఖాన్ తెలియజేశారు.

పలస పక్షుల నెల్లూరు

అరకులోయ అందాలు..

విశాఖలోని కైలాసగిరి

లేపాక్షి బసవయ్య

కాకతీయ శిల్పకళ..

అరకు ఫెస్టివల్, విశాఖపట్టణం అక్టోబరు 15 నుంచి 21 వరకు	గండికోట హెరిటేజ్ ఫెస్టివల్, కడప, అక్టోబరు 26 నుంచి 28 వరకు	లిటరరీ ఫెస్టివల్, మదనపల్లి, నవంబర్ 10 నుంచి 12 వరకు	కాకతీయ ఫెస్టివల్ నవంబర్ 24 నుంచి 30 వరకు	కాకినాడ బీచ్ ఫెస్టివల్, తూ.గోదావరి నవంబర్ 28 నుంచి 30 వరకు

> ''చందనాఖాన్ గారు మా శాఖకు వచ్చాక.. ఈ ఫెస్టివల్స్‌కు పూనుకున్నాం. రాష్ట్రంలో ఎన్నో ప్రముఖ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటన్నిటినీ పదిమందికి తెలియజేస్తే.. మర రాష్ట్రం గొప్ప సందర్శన ప్రాంతం అవుతుంది. ఫెస్టివల్స్‌కు రూ.50 లక్షలు వెచ్చిస్తున్నది ప్రభుత్వం. పర్యాటక రంగంలో గుజరాత్, కర్ణాటక ఎంతో ప్రగతి సాధించాయి. పర్యాటక ప్రచార వ్యూహంలో భాగంగానే కొన్ని జిల్లాల్లో ఫెస్టివల్స్ చేస్తున్నాం. ఇవి ప్రతి ఏటా జరుగుతాయి. భవిష్యత్తులో మరిన్ని ప్రదేశాలు పండగ జాబితాలో చేరతాయి.
>
> – వి. మధుసూదన్, పర్యాటక శాఖ, ఓఎస్‌డి

గండికోట..

ఇప్పటికే కాకినాడ బీచ్ పార్కు కోసం ప్రభుత్వం 40 ఎకరాలు కేటాయించింది. దీని అభివృద్ధి మీద దృష్టి పెట్టినట్లు ఆమె చెప్పారు. పాతిక లక్షలు ఖర్చు చేసి.. కల్చరల్ పార్క్‌ను కూడా ఈ ఫెస్టివల్‌లో భాగంగా తీర్చిదిద్దనున్నారు. కాకినాడ బీచ్‌లో కాలక్షేపం కోసం 'మినీ శిల్పారామం' ఏర్పాటు కాబోతోంది. కేవలం పర్యాటక ప్రగతి కోసమే ఈ ప్రాంతంలో రూ.7.5 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని పర్యాటక ప్రదేశాలన్నింటినీ సులువుగా తిలకించేందుకు ప్రత్యేక ప్యాకేజీలు రానున్నాయి. నవంబరు 28 నుంచి 30 వరకు సీ ఫుడ్ ఫెస్టివల్ పెట్టడం పర్యాటకులకు నోరూరించే మరో కార్యక్రమం. ఆ రోజు చేపలు, పీతలు, రొయ్యల వంటకాలు ఘుమఘుమలాడతాయి.

పానగల్లులో చరిత్ర ముచ్చట్లు..

నల్గొండకు అతి సమీపంలోని పానగల్లు గొప్ప చారిత్రక ప్రదేశం. మరికాస్త ప్రాచుర్యం లభిస్తే.. ఏ పర్యాటక ప్రదేశానికీ తీసిపోదు. అందుకే, పానగల్లును పర్యాటక పండగల్లో చేర్చారు. కాకతీయుల కాలంలో సంగీత, సాహిత్య, సాంస్కృతిక వైభవానికి ఈ ప్రాంతాలన్నీ నిదర్శనం. పచ్చల సోమేశ్వరాలయం, చాయా సోమేశ్వరాలయం కాకతీయుల శిల్ప కళా నైపుణ్యానికి సాక్ష్యాలు. ఈ ఘనతను డిసెంబరు 7 నుంచి 9 వరకు జరిగే 'పానగల్లు ఫెస్టివల్' కళ్లకు కట్టనుంది. రాష్ట్రంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులతో అక్కడ చర్చాగోష్ఠులు ఏర్పాటు చేయనున్నారు. ఆ రోజుల్లో రాజుల పాలన, ప్రజల జీవన విధానం, కళలకు ఇచ్చే ప్రాధాన్యం గరించి పెద్దలు వివరిస్తారు. ఆర్కియాలజీ మ్యూజియంను కూడా అభివృద్ధి చేస్తున్నారు. తరచూ పండగ సందడి చేస్తేనే, ఆ ప్రాంతం పర్యాటక ప్రదేశంగా విలసిల్లుతుందన్నది ఆ శాఖ ఆలోచన.

విశాఖలో సందడే సందడి..

విశాఖకు ప్రత్యేకంగా పండగెందుకు? సుమనోహరమైన తీరప్రాంతం, ఆకుపచ్చని కొండల్ని చూస్తే కడుపు నిండిపోతుంది. ఈ సహజ అందాలకు పర్యాటక పండగ తోడైతే ఇంకెంత అద్భుతంగా ఉంటుందో చూడాలంటే డిసెంబరు 21 నుంచి 23 వరకు జరిగే 'విశాఖ ఉత్సవ్'కు హాజరుకావాల్సిందే! ఉత్సవ రోజుల్లో రాత్రిపూట సముద్రతీరం రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో.. తేజోవంతంగా మెరిసిపోనుంది. పండగలో భాగంగా.. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల పోటీలు, ఎగ్జిబిషన్లు, ఫుడ్ ఫెయిర్‌లు, ఫ్యాషన్ షోలు.. జరుగుతాయిక్కడ. ఇవన్నీ విశాఖ పర్యాటకాన్ని దశదిశలా చాటేవేనంటున్నారు సంబంధిత అధికారులు. రామకృష్ణ బీచ్, భీమిలీ బీచ్, కైలాసగిరి, విశాఖ ఉక్కు కార్మాగారం, చేపలరేవు, ఓడరేవు, డాల్ఫిన్స్‌నోస్, ఆంధ్ర విశ్వవిద్యాలయంతోపాటు.. నగరానికి దగ్గర్లోనే సింహాచలం, అరకు, బొర్రాగుహలు, బౌద్ధస్థలాలు చూడదగ్గవి ఉన్నాయి. వీటన్నిటినీ ఒకే గొడుగు కిందికి తెచ్చి.. కొన్ని ప్యాకేజీలుగా రూపొందించి.. పర్యాటకుల్ని ఆకర్షించే ఉద్దేశ్యంతో ఉంది ప్రభుత్వం. విశాఖను దేశంలోనే పేరెన్నికగన్న పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు విశాఖ ఉత్సవ్ తోడ్పడుతుంది.

నెక్లెస్ రోడ్ తళతళ!

హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డుకు పేరొచ్చిందే పండగలు, ఉత్సవాలు నిర్వహించినందుకు! లేకపోతే, అదొక విహార స్థలంగా గుర్తింపు తెచ్చుకునేదే కాదు..అంటున్నారు అధికారులు. ఒక ప్రముఖ ప్రదేశంలో తరచూ ఏదో ఒక ఫెస్టివల్ మూడ్‌ను తీసుకురాకపోతే సందర్శకులను ఆకట్టుకోలేం అన్నది వారి అభిప్రాయం. అందుకే, పర్యాటక పండగల్లో భాగంగా నెక్లెస్ రోడ్‌లో 'హైదరాబాద్ కార్నివాల్' ఘనంగా జరగనుంది. డిసెంబరు 23 నుంచి మూడ్రోజులు నగరంలో సందడే సందడి. సంగీత, సాహిత్య రంగాల్లో నిష్ణాతులైన వారంతా ఇక్కడికి వస్తున్నారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే ఖవ్వాలి, ముషాయిరా, గజల్స్ ఉంటాయి. రాత్రిపూట నెక్లెస్‌రోడ్ పొడవునా.. కలర్‌ఫుల్ లైటింగ్ ఏర్పాటు చేస్తారు. హుస్సేన్‌సాగర్‌లోని బోట్లను రంగు దీపాలతో అలంకరిస్తారు.

నెల్లూరులో పక్షుల ఉత్సవం

నెల్లూరు జీవవైవిధ్యానికి ప్రతీక. సుందరమైన సముద్రతీరం, విదేశీ పక్షుల రాక, ప్రాచీన దేవాలయాలకు కొదవ లేదు. ఆంధ్ర– తమిళనాడు సరిహద్దుల్లోని నేలపట్టు పక్షిసంరక్షణ కేంద్రం 459 హెక్టార్లలో ఉంది. సీజన్‌లో వలస పక్షులు ఎక్కడెక్కడి నుంచో తరలివస్తాయి. సైబీరియన్ కొంగలు, ఫ్లెమింగోస్, గూడబాతులు, వడ్రంగిపిట్టలు, తెల్లకొంగలు చూడాలంటే నెల్లూరులోని తీరప్రాంతాల్లోనే చూడాలి. అందుకే 'ఫ్లెమింగో ఫెస్టివల్'కు నడుం కట్టింది ప్రభుత్వం. వచ్చే ఏడాది జనవరి 7 నుంచి 9 వరకు ఉత్సవం జరుగుతుంది. ఇంకా సమయం ఉంది కాబట్టి.. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందో.. అధికారులు చర్చలు సాగిస్తున్నారు.

తారామతిలో..

గోల్కొండలోని 'తారామతి బారాదరి'లో ఫుడ్ ఫెస్టివల్ పెడుతున్నారు. జనవరి 25 నుంచి 27 వరకు ప్రత్యేక వంటకాలను ఇక్కడ ఆస్వాదించవచ్చు. ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలో త్వరలోనే నిర్ణయించనున్నారు.

పర్యాటక పండగ జరిగాక.. ఈ ప్రదేశాలకు ఎంతో కొంత అదనపు ఆకర్షణ వస్తుంది. పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు.. మరికొంత ప్రభుత్వ నిధులు సమకూరతాయి.

● సండేడెస్క్

''చారిత్రకంగానో, సాంస్కృతికంగానో.. ఒక ప్రదేశం గుర్తింపు తెచ్చుకుంటుంది. అయితే ప్రచారం కల్పించకపోతే.. అది పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందలేదు. అందుకే, మా శాఖ తొలిసారి పర్యాటక పండగలకు క్యాలెండర్ రూపొందించి.. ప్రణాళికాబద్ధంగా ఫెస్టివల్స్‌ను చేస్తున్నది. వీటి లక్ష్యం ఒక్కటే– కొత్త పర్యాటకుల్ని ఆకర్షించడం. ఇదివరకే తిలకించిన వారిని మళ్లీ రప్పించడం. పర్యాటక కేంద్రాల మీద ఆధారపడి బతికే స్థానిక వ్యాపార వర్గానికి చేయూతనివ్వడం. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ నిధుల్ని రాబట్టుకోవడం. ఇవన్నీ నెరవేరాలంటే పర్యాటక పండగల్ని తరచూ నిర్వహించాలి..''

– చందనాఖాన్,
స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పర్యాటకశాఖ

''హైదరాబాద్‌లోని శిల్పారామాన్ని ఎంతో అభివృద్ధి చేశాము. కేవలం నిర్మాణాల వల్ల దానికి అంత పేరు రాలేదు. నిత్యం ఏదో ఒక పండగ, సందడి చేస్తుండటం వల్లనే అది ఈ రోజు ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా దేశాన్ని ఆకర్షిస్తోంది. ఎప్పటికప్పుడు వైవిధ్యభరితమైన కార్యక్రమాలను చేశాం. ప్రతి పర్యాటక ప్రదేశానికి గుర్తింపు తీసుకురావాలంటే.. పర్యాటక పండగలు చాలా అవసరం. ఆ దృష్టితోనే నవరసభరితంగా ఉత్సవ సందడి చేస్తున్నాం..''

– జి.కిషన్‌రావు,
పర్యాటక సలహాదారుడు

పానగల్లు..

కాకినాడ పోర్టు..

నెక్లెస్‌రోడ్..

panagallu festival — పానగల్లు ఫెస్టివల్, నల్గొండ జిల్లా డిసెంబర్ 7 నుంచి 9 వరకు

VISAKHA UTSAV — విశాఖ ఉత్సవ్, విశాఖపట్టణం, డిసెంబర్ 21 నుంచి 23 వరకు

HYDERABAD CARNIVAL, Necklace Road, Hyderabad — హైదరాబాద్ కార్నివాల్, నెక్లెస్ రోడ్, హైదరాబాద్ డిసెంబర్ 23 నుంచి 25 వరకు

FLAMINGO festival — ఫ్లెమింగో ఫెస్టివల్, నెల్లూరు జిల్లా జనవరి (2013) 7 నుంచి 9 వరకు

❖ మిక్చర్ పొట్లం

బొమ్మలు: ఎన్.రాజశేఖర్ రెడ్డి

పరాన్నజీవులం!

''నాకు వచ్చిన జబ్బుకు ఇన్ని టెస్టులు అవసరమంటారా డాక్టర్?'' అమాయకంగా అడిగాడు అప్పన్న.

''తప్పదయ్యా .. నన్ను నమ్ముకున్న నువ్వు బతకాలంటే, నిన్ను నమ్ముకున్న నేను బతకాలంటే, మనిద్దరినీ నమ్ముకున్న లాబ్ వాడు బతకాలంటే ..'' చెప్పాడు డాక్టర్ వైకుంఠం.

నిజం కక్కించాడు

''ఎందుకయ్యా ఆఫీసుకి రోజూ లేటుగా వస్తావు? ఈ రోజేమిటి కారణం?'' అడుగుపెట్టగానే గార్డిగా కేకలేస్తూ విరుచుకుపడ్డాడు మేనేజర్ విశ్వామిత్ర.

''కంగారుపెట్టకండి సార్, గొంతు తడారిపోయి ఏం కారణం చెప్పాలో అర్థం కావడం లేదు'' తడబడుతూ నిజం కక్కేశాడు అప్పారావు.

బుర్రున్నోడు

''డాక్టర్, మీ దగ్గరకి పేషెంట్లను తీసుకొస్తే కమీషన్ ఇస్తారా?'' అడిగాడు గోవిందం.

''తప్పకుండా ... ఏదీ తీసుకొచ్చావా?'' ఆత్రుతగా అడిగాడు డాక్టర్ సదానందం స్టెతస్కోప్ పైన వాలిన ఈగల్ని తోలుతూ.

''ఆ పేషెంటుని నేనే. నాకివ్వబోయే కమీషన్‌తో వైద్యం చేయండి'' చెప్పాడు గోవిందం.

బరిలోని దెబ్బలు కావు

''మీరు బాక్సింగ్ మానేసి దాదాపు రెండేళ్లయిందిగా. మీ మొహం మీద తగిలిన దెబ్బ ఇంకా మానకపోవడం ఏంటి? షుగరుందేమో టెస్ట్ చేయించుకున్నారా?'' ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్ కైలాసం.

''నేను మానేశాను సరే ... మా ఆవిడ ఇంకా మానలేదే'' మూల్గుతూ చెప్పాడు మాజీ బాక్సర్ బాబూరావు.

అంతా మీ దయ!

''తాగుడు మానటానికి కొన్ని ఆసనాలు నేర్పించాను కదా. ఎలా ఉపయోగపడ్డాయి?'' అడిగాడు యోగా మాస్టర్ శివానంద.

''మీ పుణ్యమా అని ఇప్పుడు శీర్షాసనంలో కూడా తాగగలుగుతున్నా మాస్టర్జీ!'' సంతోషంగా చెప్పేడు బ్రహ్మానందం.

ఆలయ అభివృద్ధి దృశ్యమాలిక

స్వయంభువు

మహిషాసురుడ్ని కనకదుర్గమ్మ కృష్ణానదిని రేగాలి ఉన్న ఇంద్రకీలాద్రి పై స్వయంభువుగా వెలిశారు.
కడ తరాలక్రింద రక్తపు అమ్మవారి విగ్రహాన్ని కనుగొన్నారు. మొగలాయి సామంతులు సమయంలో కనకదుర్గమ్మ వారికి ఆలయం నిర్మించబడినది. కొండపట్టి కేంద్రంగా చేసుకుని మొగలాయి సామంతుడు రామప్పా నేడు నిర్మించబడ్డారు. గర్భాలయ మండపం నందికుండ తదితర నిర్మాణాలతో కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో విశిష్టపూజలతో వారి కార్యక్రమాలను నిర్వహించారు చేస్తారు. శ్రీ శ్రీ శ్రీ జంగం గణపయ్యగారు (అమరరాజాధార) కడ తరాలలోనే కనకదుర్గమ్మ ఆలయాన్ని సంరక్షించారు, అమ్మవారికి అర్చించారు, అనుదినపూజలు పాటించి చివరి శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. శిష్య రాయ సంప్రదాయం ప్రకారం అష్ట పూజాలు జరిపారు కొన్నిసార్లు, సృష్టికర్త బ్రహ్మనే ప్రధానంగా కుర్చొంటారు అర్చించారు. స్వయంభువు మధ్య కుదురుగా, రాయం అష్ట సుప్రసిద్ధం. నరరూపాన్ని శుభాయం ఉత్తర ఈశాన్యాన్ని కొలువై ఉంది. మహిషాసుర పీఠం ఆలయం కూడా ప్రధాన రాయగాడి ఎత్తర భాగాన ఉంది. కనకదుర్గదేవాలయం రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలలో మిన్నగా ఉంది. నిత్య అంబలో భక్తులు కిక్కిరి ఉన్నారు. కష్టమైనా దర్శనం పనిచేసి మొదట్లో కొన్నుకుంటారు. సమర్పణ రాయగాయ కనకదుర్గమ్మ ఆలయానికి గర్భగుడి ఉంది. యాత్రికుల రాకతోనూ రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నది.
కనకదుర్గమ్మ మహిషాసురుడు భక్తుడుగా నిత్య కనుపరచబడుతూ ఉన్నారు.
ప్రస్తుతం సుమారు 20 కోట్ల రూపాయల వ్యయంతో రాజగోపురం, మల్లికార్జున మహామండపం నిర్మాణంలో ఉన్నాయి.

దసరా ఉత్సవాలు :

భక్తులు కనకదుర్గమ్మలోని దివ్యానుభవాలు గుడి వద్ద నుంచి పిల్లాడు చేసిన రూ. 100 "క్యూ" టికెట్లు రూ.50 క్యూ టికెట్లు. భవానీలకు "క్యూ" మార్గం ద్వారా మూడోరోజు నాడు పోలీసుల సహకారంతో దర్శనానికి రావాల్సి ఉంటుంది. రూ. 1000 టికెట్ పుస్తకములు కొనుగోలు చేసిన భక్తులకు వారికి కేటాయించిన నిర్ణీత సమయం ఉదయం 6 నుండి 8 గంటలలోపు, రాత్రి 8 నుంచి 10 గంటలలోపు మాత్రమే రావలసివస్తాయి. కొండ దిగువ గల గుడి గుర్తుగా చూపించుకుని.

- క్లోక్‌రూం
- చెప్పులస్టాండ్‌లు ఏర్పాటు చేశారు.

ఆలయ పరిధిలో దుస్తుల బట్టలు, బ్యాగులు, కొండపైకి తీసుకుని వెళ్ళడం నిషేధించబడినవి.

శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి

త్రిపురాత్రయంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. దయకు ధ్యానిస్తే దుర్గాదేవి సుఖసిద్ధిని ఫలిత భక్తి సూత్రాలనే ఉపాసకులకే సుఖాన్నిచ్చే శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాకారాల్లో పవిత్రమైన ఈ నవరాత్రులలో దర్శనం ఇచ్చు అనుగ్రహాన్ని పొందుతే సంకల్పరం పాడుపుగా మారం అవ్వుతుంది చేసు. చేయించుకునే పూజాఫల సిద్ధికాన్ని పత్యగ సిద్ధికాన్ని స్వాధీనం నమ్మక. శ్రీ చక్రంలో మొదటి అమ్మవారిలో ఉంటే మొదటి దేవత బాలాదేవి.

శ్రీ గాయత్రీదేవి

సకలముంతాలకీ మూలమైన త్రిగాయ దేవతామాతగా ప్రసిద్ధిపొందిన శ్రీ గాయత్రీదేవి ముఖ్య విగ్రహం. పేరు. నీలి ధవళ పద్మంతో ప్రకాశిస్తు సంధ్యసమయాలలో సగుణమైన్న సగ్గాన్నానందను అర్థిస్తిన నమన శ్రీ గాయత్రీదేవి మంత్ర ప్రభావం ఎంతో గొప్పది. "గాయంతం రయతీతి గాయత్రి" అంటే గానం చేసేవారిని (పఠించువారిని) రక్షించేది అని గాయత్రి పేరు అగాగ గ్రాంగోగ్గోనుపత్రంలో "సావ్రగాయత్రి" అంటే మనం మాట్లాడే వాక్కే గాయత్రి అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి

అన్నం పరబ్రహ్మ పురుషుడు. అన్నం నిత్య జీవులకు అవసరం అంటారు అన్నాన్ని ప్రసాదించిన శ్రీ అన్నపూర్ణాదేవి విశ్వాన్నదాతేశ్వరుడు విశ్వలోకప్రదేశ్వరుడు అన్నపూర్ణాదేవి తనయుడు. మనిషి గాన పరిపరిధానాలు ధరించిన జనాలకు సహకారాన్ని ప్రసాదిస్తుంది. అమెవ నాకే అన్నపూర్ణ ఈ విశ్వమే. ఈ జీవరాశి సంరక్షణకు అమెవ నాకే అన్నపూర్ణ ఈ విశ్వమే. ఈ జీవరాశి సంరక్షణకు కావాలిసినవి అన్నం అని అర్థం. అన్నపూర్ణ అంటే జీవరాశి అన్నపూర్ణ అంటే అన్నం అని అర్థం. అన్నపూర్ణ అంటే అన్నం అని అర్థం చెప్పబడింది.

" బ్రహ్మాండేశ కృపాలయిన కరీ మాతా అన్నపూర్ణేశ్వరి "

శ్రీ మహాలక్ష్మీ దేవి

శ్రీ గణపయ్యగారు శ్రీకరుణ్లో సంగతులు మహాలక్ష్మి స్వరూపిణి. 1. సత్యలక్ష్మి 2. భోగలక్ష్మి 3. ధాన్యలక్ష్మి 4. యోగలక్ష్మి 5. కిట్టులక్ష్మి 6. సింహాలక్ష్మి 7. అష్టలక్ష్మి 8. అష్టలక్ష్మి అనే ఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి నమస్కరించుట. అంటేగాను. 1. ధనలక్ష్మి 2. ధాన్యలక్ష్మి 3. ధైర్యలక్ష్మి 4. కిటయిలక్ష్మి 5. అదిలక్ష్మి 6. కిట్టులక్ష్మి 7. గజలక్ష్మి 8. సంతాన లక్ష్మి అని మరికి ఎనిమిది రూపాల అష్టలక్ష్మిగా రూపాలతో పూర్తిచేయబడ్డాయి. రుగ్మత అంటే సత్యాలలో అష్టలక్ష్మి ఐశ్వర్యమును అనుగ్రహిస్తుంది. ఇదే సత్యమైన విధానం.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)

చదువులకు అధిష్ఠాన దేవత సరస్వతీదేవి మహనీయులకు సకలజ్ఞానములు ప్రసాదించు వారిలో స్థానమిచ్చి నమస్కరించి నన్నాశ్రయించి సరస్వతీ అమ్మవారి అమ్మ సన్నిధిపైన మూలా నక్షత్రం రోజున చేసే అలంకారంలో ఎక్కువ ప్రాధాన్యత సంతరించి ఆ వారాలలో అద్భుతం మరియు ప్రకాశ అమ్మవారి దర్శనం అని అనుగ్రహిస్తు ఆశీర్వదించు శీతలకుపెట్టలకు అనంత మంగళం. ప్రకృతిలో ఎలాగ మూలానక్షత్రం రోజున అమ్మవారికి పట్టపట్టలు సమర్పిస్తారు

శ్రీలలితా త్రిపురసుందరీదేవి

త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి ప్రసన్న విశ్వ మహాత్మురుడు సన్నా సూర్యుడు మరి ఉత్తర నాలుగో త్రిపురసుందరి అని సెలవరుచుకోగలరు. లలితాత్రిపుర సుందరి శ్రీ చక్ర అభిషేకకర్తగా, పంచదశాక్షర మహామంత్రంతో దేవతగా తనను ఆరాధించే భక్తులను. ఇంతకుముందు అనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అధిష్ఠానంలోనే శ్రీ చక్ర మహామంత్రం ఏర్పాటు చేసారు. ఈ శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.

శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)

అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అష్టమి అంటారు శ్రీ దుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గమన్న రాక్షసుడు చేసిన దుర్గాదేవి " దుర్గమ గమనం తర్వాత దుర్గా అని అంటారు. అదుపరిచి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి రోజు రాక్షసుడుతోడ్డిన దుర్గమురు అనే రాక్షసుడ్ని మహిషాసురుడు కాలాన్ని తోడంతో చంపి జగత్తుకు శాంతి ఈ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహిషాసుర, మహిషాసురుడ్ని, మహిషాసురుడు దుర్గాదేవిని ముసలపుటమ్మగా తొలుస్తారు.

శ్రీ మహిషాసురమర్దినీదేవి

మహిషాసురుడి వల్ల తీవ్రమైన సమస్యలు ఎదుర్కొన్న దేవతలందరూ తమ తమ తలిదండ్రులు దివ్య తేజస్సుల ప్రతిని ప్రసరించారు ఆ తేజస్సుల్లో కలిసిపోయి ఒక కన్య జన్మించింది ఎత్తింది. ఆ జన్మించిన దివ్య మహిషాసురుడు తమ తమ ఆయుధాలు సమర్పించారు. సామదానము తప్పనిసరిగా ఒక కిరీటాన్ని ఆ తల్లికి బహుమానం దయిచారు. అలా కిరీటాలతోనూ దూరాంతిని ఆ శక్తి జగజ్జేతగానూ, మహిషాసురుడి నోరాలపుడిగా గర్జనలు చేస్తూ సంహరించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అనేకరూప మోహిషాసురుడ్ని సంహరించాలని అదే స్వరూపంతో అంధకాసురుడ్ని దేవిగారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవి

అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారికి శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహిషాసుర సంహార, శ్రీకర్ణ అభిషేకాల దేవత కనుక శ్రీకరణ రాజరాజేశ్వరుల కొలువుతారు. పరమ శాంత స్వరూపంతో భరణులకు దీవించు ఒక్క తీరుగా (చెరుకుగడ) చేతిలో ధరించి ఒకచేత అభయమిస్తూ దుష్టులను దండించు రక్షణలుంటాయి. అనాదిగానే స్వరూపుడుగా రాజరాజేశ్వరుడే దక్షిణామూర్తిగానే అనాదియే ఉండేవని అన్నారు.

" బ్రహ్మాండ పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి "

16వ తేది : ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి	శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి	19వ తేది : ఆశ్వయుజ శుద్ధ చవితి	శ్రీ మహాలక్ష్మీ దేవి	22వ తేది : ఆశ్వయుజ శుద్ధ అష్టమి	శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)
17వ తేది : ఆశ్వయుజ శుద్ధ విదియ	శ్రీ గాయత్రీ దేవి	20వ తేది : ఆశ్వయుజ శుద్ధ పంచమి, షష్ఠి	శ్రీ సరస్వతీదేవి (మూలానక్షత్రం)	23వ తేది : ఆశ్వయుజ శుద్ధ నవమి	శ్రీ మహిషాసుర మర్దినీదేవి
18వ తేది : ఆశ్వయుజ శుద్ధ తదియ	శ్రీ అన్నపూర్ణాదేవి	21వ తేది : ఆశ్వయుజ శుద్ధ సప్తమి	శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి	24వ తేది : ఆశ్వయుజ శుద్ధ దశమి	శ్రీ రాజరాజేశ్వరీ దేవి (విజయదశమి)

ది. 24-10-2012 విజయదశమి రోజు సాయంత్రం 5 గంటలకు కృష్ణానది యందు తెప్పోత్సవం జరుగుతుంది.

హంసవాహన సేవగా కూడా ఈ శివశక్తిపీఠం పేరుగాంచినది ఉంది. ప్రతిరోజు సంధ్యారాతి గుర్తుగా కృష్ణవేణి మీద దీపాలు ఇబ్బడిగా వదులుతారు. భక్తులు మీద భక్తులు ఈ పవిత్ర కనకదుర్గమ్మగా పిలిస్తారు.

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానము - అర్జిత సేవల వివరములు

పూజ	రుసుము	సమయం
శ్రీదేవి ఖడ్గమాలార్చన	రూ. 5,116/-	ఉ॥ 4గం॥ నుండి 5 గంటల వరకు
స్వర్ణపుష్పార్చన	రూ. 2,500/-	ప్రతి గురువారం సా॥5-30 నుండి 6-30 వరకు
లక్షకుంకుమార్చన	రూ. 1,000/-	ఉ॥ 9గం॥ నుండి 11 గంటల వరకు
శ్రీ చక్రనవావరణార్చన	రూ. 516/-	ఉ॥ 9గం॥ నుండి 11 గంటల వరకు
చండీహోమం	రూ. 516/-	ఉ॥ 9గం॥ నుండి 11 గంటల వరకు
శాంతి కళ్యాణం	రూ. 500/-	ఉ॥ 9గం॥ నుండి 11 గంటల వరకు
ఊంజల సేవ	రూ. 516/-	ప్రతి ఆదివారం సా॥7గం॥ నుండి 8 గంటల వరకు
సర్పదోష నివారణ	రూ. 250/	ఉ॥ 9గం॥ నుండి 11 గంటల వరకు

శాశ్వత అన్నదాన పథకం : అన్నదాన మహాయజ్ఞంలో పాల్గొనే భక్తులు రూ. 1,00,000/-లు చెల్లించినచో దానమిచ్చు వచ్చే వడ్డీతో ప్రతిరోజు ఇద్దరికీ, రూ. 50,000/-లు చెల్లించినచో ప్రతి రోజు ఒక్కరికీ రూ. 5,116/-లు చెల్లించినచో సంవత్సరంలో ఒకరోజు దాత కోరిక ప్రకారం 35 మందికీ అలాగే రూ. 1,116/-లు చెల్లించినచో సంవత్సరంలో ఒక్కరోజు 8 మందికీ శాశ్వతంగా అన్నదానం జరుపబడుతుంది.

ప్రత్యేక కుంకుమార్చన

- రూ. 1,116/-లు రుసుము చెల్లించిన భక్తులకు ప్రత్యేక కుంకుమార్చనలు ది. 16.10.2012 నుండి ది. 24-10-2012 వరకు 9 రోజులు నవావరణార్చన మండపం నందు నిర్వహించబడును.
- మొదటి రోజు అనగా ది. 16-10-2012 నాడు రూ. 1,116/-లు చెల్లించిన కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు శ్రీ అమ్మవారి స్వర్ణకవచాలంకారం అనంతరం 10 గంటల నుండి 12 గంటల వరకు కుంకుమార్చన నిర్వహించబడును.
- రెండవ రోజు అనగా ది. 17-10-2012 నుండి ది. 24.10.2012 వరకు రండు బ్యాచ్‌లుగా ఉ॥ గం. 7 నుండి 9 గంటల వరకు, తదుపరి గం. 10 నుండి 12 గంటల వరకు పూజలు నిర్వహించబడును.
- పూజలో పాల్గొనే దాతలకు శ్రీ అమ్మవారి జ్ఞాపికలు, దేవి పట్టు, రవిక ముక్క, నాలుగు లడ్డుప్రసాదం ఇవ్వబడును.

శత చండీయాగం

- 16-10-2012 ఉ॥ 10 గంటలకు ప్రారంభం అగును.
- శివాలయం పక్క కొత్తగా నిర్మించిన యాగశాల నందు 9 రోజులు ఉ॥ 8 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించబడును.
  పూజా రుసుము : రూ. 1,116/-లు.
- ఒక టెక్కెట్టు మీద ఇద్దరికి మాత్రమే పూజకు ముందు దర్శనమునకు అనుమతించబడును. పూజలో పాల్గొన్న దాతలకు దేవి వస్త్రం, రవిక ముక్క, నాలుగు లడ్డుప్రసాదం ఇవ్వబడును.

సౌభాగ్య పంచమాల్లోను, శతచండీ యాగంలో పాల్గొనే భక్తులు, పూజా రసీదు చూపించి క్యూలైన్ పక్కనుండే మాడోరోడ్ మీదుగా పడత మార్గమునకు కొండపైకి రావలసియున్నది. పూజ అనంతరం పంచామృతం మాత్రమే రూ. 100/-లు క్యూ మార్గం ద్వారా శ్రీ అమ్మవారి దర్శనమునకు అనుమతించబడును.

భక్త మహాశయులందరికీ దసరా శుభాకాంక్షలు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో ది. 16-10-2012 నుండి 24-10-2012 వరకు 9 రోజుల పాటు దసరా మహోత్సవములు అత్యంత వైభవోపేతముగా నిర్వహించుట జరుగుచున్నది. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయముతో భక్తులకు ఎటువంటి అసౌకర్యము లేకుండా శ్రీ కనకదుర్గమ్మ వారి దర్శనము చేసుకొనుటకు అన్ని ఏర్పాట్లు చేయుట జరిగినది. కావున భక్తులందరూ అమ్మవారిని దర్శించి, పూజించి అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.

చిత్రా రామచంద్రన్
ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ

జి. బలరామయ్య
కమిషనర్, దేవాదాయశాఖ

ఎం. రఘునాథ్
సంయుక్త కమిషనర్, కార్యనిర్వహణాధికారి
శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం

చదువండి ! చదివించండి!! తరింపంచండి !!!

శ్రీ కనకదుర్గప్రభ
భక్తప్రచార మాసపత్రిక

విడి ప్రతి : రూ. 10/-
సంవత్సర చందా : రూ. 120/-
జీవిత చందా : రూ. 3,000/-

సంగీతం వచ్చింది... కాని బాల్యం పోయింది

'ఇండియన్ ఐడల్ -2' లో రన్నర్ అప్‌గా నిలిచిన తొలి దక్షిణాది గాయకుడతను. 'అణే చార్ అణే' (లగే రహో మున్నాబాయ్) పాటతో సినీ అరంగేట్రం చేసి, 'ఏకాంతంగా ఉన్నా' (అశోక్), 'ఎందుకో పిచ్చి పిచ్చిగా' (చిరుత), 'ఓరుగల్లుకే పిల్లా' (సైనికుడు), 'సిడ్నీ నగరం' (ఆరెంజ్), 'అమ్మాయి కిటికీ పక్కన కూర్చుంది' (మర్యాద రామన్న), 'సదా శివా సన్యాసీ' (ఖలేజా), 'వయ్యారాల జాబిల్లీ' (తీన్‌మార్), 'యమగా ఉందే' (శక్తి), 'తడిపెదవులే' (it's మై లవ్ స్టోరీ) నుండి 'పిల్లను చూస్తే' (కెమెరామెన్ గంగతో రాంబాబు) వరకు ఎన్నో శ్రావ్యమైన పాటలందించి శ్రోతల అభిమానం పొందాడు. పాతికేళ్లకే నంది, ఫిలిమ్‌ఫేర్ లాంటి పురస్కారాలను కైవసం చేసుకున్న వర్తమాన యువ గాయకుడు కారుణ్య హ్యాపీడేసే ఇవి.

తొలి అడ్వంచర్ అదే!

అప్పట్లో అమ్మా నాన్నలు సిద్ధి సమాధి యోగ తరపున మెడిటేషన్ కోర్సు కోసం చిట్టడి విలా ఉండే 'రావిరాల' ఆశ్రమానికి వెడుతూ బాల వాలంటీర్‌గా నన్నూ వెంట తీసుకెళ్లారు. అక్కడికి వచ్చినవారంతా 'మౌనమె మా భాష ఓ మూగ మనసా' అన్నట్లు ఉండేవారు. దాంతో నాలాంటి పిల్లకాయలకు పిచ్చెక్కిపోయేది. కోర్సులో భాగంగా ఒకరోజు అందర్నీ గుట్టలు ఎక్కించారు. ఒక పెద్ద కొండ సగం ఎక్కేసరికి వర్షం ... అంతా వెనుతిరిగారు. అయితే ఆ కొండ పూర్తిగా ఎక్కాలనేది నా కోరిక. వాళ్లతో తిరిగొచ్చేశానే కాని అక్కడ ఏముందో అని ఆలోచిస్తూ రాత్రంతా జాగరణ చేశా. తెల్లవారి 4 గంటల టైంలో నా వయసున్న కిట్టూ అనేవాడ్ని నిద్ర లేపి, ఆ కొండ దగ్గరకి తీసుకెళ్లాను. రాత్రంతా వర్షం పడడం వల్ల ఏటవాలుగా ఉన్న ఆ కొండ ఎక్కుతోంటే ఒకటే జారడం. అయినా 'సాహసం శాయరా డింభకా ... ' అనే మాటని జపం చేస్తూ అతి కష్టం మీద కొండ శిఖరం చేరాం. అక్కడ 'రాజకుమారి లభించలేదు'గానీ పెద్ద తాచు పాము కనిపించడంతో ... గుండె గుభేల్‌మంది. నాతో వచ్చిన కిట్టూ కెవ్వు కేక. 'చిమ్మచీకట్లో అంత సాహసం ఎలా చేయగలిగానా' అనేది ఇప్పటికీ సందేహమే!

స్టేజ్ ఫియర్ పోయింది

ఎల్.కె.జి నుండి టెన్త్ వరకూ మిధాని దగ్గరుండే బి.పి.డి.ఎ.వి.స్కూల్లో సాగిన చదువు నాది. పాడతానని తెలిసి మా ప్రిన్స్‌పాల్ సీతాకిరణ్‌గారు ఒకరోజు అసెంబ్లీలో నాచేత పాడించారు. ఇప్పటికీ గుర్తు 'ఆకులో ఆకునై' పాడా. దాంతో ఆవిడ ప్రతి మంగళవారం ప్రేయర్లో ఒక ప్రైవేట్ సాంగ్ పాడమని ఆర్డర్ జారీ చేశారు. నా టెన్త్ అయ్యేలోగా ఎన్ని వందల పాటలు పాడి ఉంటానో లెక్కేయండి! ఆ విధంగా నా స్టేజ్ ఫియర్‌ని పోగొట్టిన ప్రిన్స్‌పాల్‌గార్కి నేనెప్పుడూ రుణపడి ఉంటా. మా మేడమ్స్ లక్ష్మిగారు కంజీర, మంజరిగారు తబలా, తపతిగారు హార్మోనియం వాయిస్తుంటే నేను పాడేవాణ్ణి. వీరు ముగ్గురూ దేశంలోని మిగతా భాషల పాటల్ని కూడా సేకరించి నాతో పాడించి 'ఇంటర్ స్కూల్ కాంపిటిషన్స్'కు పంపించేవారు. నేను అలా వెళ్లగానే, షీల్డుకోసం ఒక అల్మారా తయారుచేయించేవారు మా ప్రిన్స్‌పాల్. ఆమెకు అంత నమ్మకం నేను షీల్డుతో తిరిగి వస్తానని.

పాటకు పల్లవి ప్రాణమంటారుగానీ ... పాడగా పాడగా ... ఆ పాటే నా ప్రాణంగా మారింది. మా 'నల్లాన్ చక్రవర్తి' వంశంలో తరతరాలుగా అంతా సంగీత ప్రియులే. తాతగార్లు 'శ్రీనివాస సోదరులు' శతావధాన్లు. మా కుటుంబ వేడుకల్లో అందరం ఒక చోట కలిశామంటే చాలు. సరస్వతి కొలువుతీరి, అప్పటి కప్పుడు అక్కడొక నిలయ విద్వాంసుల కచేరీ జరిగేది. మొదట్లో గాత్రం అబ్బిందని సంతోషించా గానీ, మిగతా పిల్లల్లా బాల్యానికి దూరమయినందుకు ఒక దశలో బాధపడ్డానని ఒప్పుకోవాలి. ఒకానొక సమయంలో ఈ గాత్రం నన్ను ఎన్ని ఇబ్బందులు పాలుచేసిందో, ఎన్ని మందులు మింగించిందో, ఎంత అశాంతికి గురిచేసిందో చెప్పలేను.

అమ్మ జానకి బి.డి.ఎల్.లో, నాన్న మధు డి.ఆర్.డి.ఎల్.లో ఉద్యోగులు కావడంతో బాల్యమంతా యుద్ధ వాతావరణంలో గడిచినట్టుండేది. ఒకరు 'పృథ్వి' లాంటి మిసైల్స్‌కు రూపకల్పన చేస్తే, మరొకరు వాటి తయారీకి నడుం బిగించేవారు. అబ్దుల్ కలామ్‌గారొచ్చినా, ఆగస్టు పదిహేనొచ్చినా ప్రార్థనా గీతం నేను వెళ్లి పాడాల్సిందే. నా పాట విని అందరూ చప్పట్లతో అభినందిస్తుంటే ఇతరులలో లేని ప్రత్యేకత ఏదో నాలో ఉందనేది మాత్రం కొద్దికొద్దిగా అర్థమయ్యేది. ఇద్దరి ఉద్యోగాలు ఒకే ఏరియాలో కావడంతో, నా చిన్నప్పుడే 'బాలాపూర్'లో ఇల్లు కట్టుకున్నాం. అప్పట్లో అది అడవి ప్రాంతం. తేళ్లు, పాములు, తొండలు, రాబందులు, ఉడుములు ... ఇలాంటి జీవరాసులతో కలిసి జీవించాం. రెండేళ్లపాటు ఆ ఏరియాకు ఎలక్ట్రిసిటీ లేదంటే మీరు నమ్మగలరా? తీరా ఒక్కొక్క ఇల్లూ పుట్టుకొస్తుంటే మాత్రం 'అయ్యో, ప్రకృతికి దూరమైపోతున్నామే' అని బాధనిపించేది.

పాట నాకు వరమా? శాపమా?

పాట అబ్బడం కాదుగానీ ఆటలన్నీ మిస్సయ్యే వాణ్ణి. తోటి పిల్లలు ఆడుకుంటుంటే గొప్ప అసూయగా ఉండేది. నాకిదేం శిక్షరా దేవుడా? అని ఏడుపొచ్చేది. స్కూలు నుండి రావడం ఆలస్యం నాన్నగారు రెడీగా ఉండేవారు – సంగీతం క్లాసులో నన్ను దిగబెట్టడానికి. పైగా ఎవరింటికి వెళ్లినా నన్ను చూడగానే ' కారుణ్యా ... ఒక పాట పాడు' అని దర్జాగా పురమాయించేవారు. ఆదివారం ఉదయం పదిగంటలకు టీవీలో వచ్చే డిడి ప్రోగ్రామ్స్ బేతాళ, మొగిలీ లాంటి సీరియళ్లు చూడనీయకుండా నన్ను కబళించే సంగీతం క్లాసులంటే ఏవగింపు కలుగుతున్న టైంలో ఒక సంఘటన జరిగింది.

మా కజిన్ 'వంశీ' పెళ్లిలో తలంబ్రాల సీన్ అయ్యాక అంతా పెళ్లి విందు ఆరగిస్తున్నారు. తర్వాత షరా మామూలే – అంతవరకు పురోహితుడు మంత్రాలు చదివిన మైకును నాకందించి పాట పాడమన్నారు. తప్పదు కదా! 'భక్త ప్రహ్లాద'లోని 'మందార మకరంద' పద్యం ఎత్తుకున్నాను. అంతే! ఎక్కడో డైనింగ్ హాల్లో తింటున్నవాళ్లంతా ఆ ఎంగిలి పళ్లేలతోపాటు పెళ్లి మండపం దగ్గరకి వచ్చేసి స్థాణువుల్లా నిల్చుండిపోయి నా పాట వినసాగారు. అంతా పిన్ డ్రాప్ సైలెన్స్! ఆ వెంటనే మరో పద్యం 'కంజాక్షునకు గాను ..'. నా పాటతో కడుపు నిండిపోయిన తృప్తి వాళ్ల కళ్లలో ... నా గాత్రానికి అంత పవరుందని అప్పటివరకూ నాకు తెలియదు. దాంతో లోపల ఏదో అలజడి మొదలైంది. ఇకపై పాటని నిర్లక్ష్యం చేయకుండా, మరింత సానబట్టుకోవాలని అనిపించింది.

బాలుగారి ప్రశంస...

నేను తొమ్మిదో తరగతిలో ఉండగా ఈటీవీ వారు పిల్లలతో 'పాడుతా తీయగా' తొలిసారిగా ఆరంభించారు. నాన్నగారు నేను పాడిన పాటలేవో వాళ్లకు పంపారు కానీ అప్పటికే వాళ్లు పెట్టిన గడువు అయిపోవడంతో నన్ను తీసుకోలేదు. ఆ తర్వాత సెలక్టయిన పిల్లల్లో ఒకబ్బాయి ఏవో కారణాల చేత తప్పుకుంటే ఆ ఛాన్స్ నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఉన్నపళంగా నన్ను తీసుకుని సారథి స్టూడియోకి వచ్చేయమని బాలుగారి ఆర్కెస్ట్రాలో ఉండే కృష్ణగారి నుండి పిలుపు. బాలుగారి ఎదుట పాడటం ... నిజంగా నాకో కల. ఇప్పటికీ బాగా గుర్తుంది. ఒక ఎపిసోడ్‌లో 'సుందరాంగా .. అందుకోరా' (భూకైలాస్) పాడితే, బాలుగారు 'నీ గొంతుని ఇలాగే ఉంచుకోవయ్యా... ఎంత బాగుందో ... కావాలిస్తే ఒక మగ గొంతు ఉన్న అమ్మాయితో పెళ్లి జరిపిస్తాం. ఇద్దరూ ఎంచక్కా పాడుకుంటూ ఉండొచ్చు' అన్నారు (ఫైనల్స్‌లో అబ్బాయిల్లో నేను, అమ్మాయిల్లో మాళవిక ఎన్నికయ్యాం).

స్వరం మారింది – గుండె జారింది

సరిగ్గా బాలుగారు ఆ మాట అన్న 3 నెలలకే నా గొంతులో ఏదో మార్పు. హైపిచ్‌లో పాడుతుంటే కీచుగా మారిపోయేది. ఒకే గొంతులో రెండు మూడు గొంతులు కలిసిన ధ్వని వచ్చేది. కంఠంలో ఏదో జరిగిపోయిందని బెంబేలెత్తిపోయి, ఇంట్లో వాళ్లని కంగారు పెట్టేశాను. వాళ్లు ఆలోపతి, హోమియోపతి, యునానీ, రేకీ హీలింగ్, భస్మాలు, చూర్ణాలు, యోగాలు ... ఉప్పు కారాలు తగ్గించడాలూ, కషాయాలు తాగింపించడాలూ ... హార్జ్‌మోలాలు తినిపించడాలూ ... ఒకటి కాదు, ఎన్ని రకాలుగా ప్రయత్నించాలో అన్ని రకాల ప్రయత్నాలూ చేశారు. గొంతు పోయిందని అన్నం తినడం మానేసి బెంగెట్టుకున్నాను. చివరికి ఒక డాక్టరుగారు 'గొంతులో ఏ లోపం లేదు. బాల్యం నుండి కౌమారంలోకి అడుగు పెడుతున్నప్పుడు సహజంగా ఏ అబ్బాయి స్వరమైనా మారుతుంద'న్నాడు. అదే నిజమైంది. 4 నెలల్లో స్వరంలో లాలిత్యం పోయి గాంభీర్యం నెలకొంది. అది వయసు మార్పనే ఐడియా ఎవరికీ రానేలేదు సుమండీ!

అందరి కన్నులు నామీదా ... నా కన్నులు మాత్రం నీమీదా...

శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ చదివేరోజుల్లో మా క్లాసులో ఒకమ్మాయి నన్ను విపరీతంగా ఆకర్షించేది. చూస్తుండగానే ఆ రెండేళ్లూ దొర్లిపోయాయి గానీ ఒక్కసారి కూడా తనని పలకరించిన పాపాన పోలేదు నేను. అది మూగ ప్రేమో, ఆరాధనో తెలిసేది కాదుగానీ ఒక క్రష్ అని మాత్రం అర్థమయ్యేది. (అదేంటో ... అమ్మాయిల్ని మా స్వంత సొత్తుల్లా .. పలానా అమ్మాయి నా కాండిడేట్, తనని మరొకడు కన్నెత్తి చూడరాదని ప్రకటించేసేవాళ్లం). ఇంటర్ తర్వాత మా దారులు వేరయ్యాయి. ఆ తర్వాత మూడేళ్లకు – నేను 'ఇండియన్ ఐడల్ రియాల్టీ షో'లో పాల్గొని వచ్చాక సి.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కాలేజీలో ప్రోగ్రాం ఇస్తుంటే ... నా ఇంటర్మీడియట్ ఫ్రెండ్ ఒకడు 'నీవు ఇష్టపడే అమ్మాయి నీ ప్రోగ్రాంకు వచ్చిందిరా' అన్నాడు. షో అయిపోయేవరకూ అందరి చూపులూ నాపైనుంటే నా చూపులు మాత్రం ఆ అమ్మాయికోసం వేలమంది ఆడియన్స్‌లో వెతుకుతూనే ఉన్నాయి. ప్రోగ్రాం పూర్తవడం, జనం ఒక్కసారిగా నా పైన పడిపోవడం ... దాంతో నన్ను బలవంతంగా కారెక్కించి పంపించడం ... ఆ అమ్మాయి మళ్లీ కనిపించనే లేదు. ఇప్పుడు కనిపించినా గుర్తుపడతానో లేదో అనుమానమే.

ఐడల్‌కు వెళ్లడంలో మిత్రుడి పాత్ర

'తీగల కృష్ణారెడ్డి' ఇంజనీరింగ్ కాలేజీలో థర్డ్ ఇయర్‌లో ఉండగా 'ఇండియన్ ఐడల్ రియాల్టీ షో -2' ఆడిషన్స్‌లో మా ఫ్రెండ్ వినయ్ (ఎల్‌కెజీ నుండి ఇంటర్ వరకు కలిసే చదివాం) ప్రోత్సాహంతో పాల్గొన్నాను. మొదట్లో అంతా నేనే 'విన్' అవుతాననుకున్నారు కానీ, చివరికి రన్నర్‌గా నిలవడం ... దాంతో బుల్లితెర ప్రేక్షకులంతా నిరాశకు గురికావడం, కొందరైతే నాకు రాలేదన్న బాధతో రిమోట్స్‌ని టీవీకేసి విసిరి కొట్టడం చేశారని తెలిసింది. అభిమానం ముందు ఎన్ని ఐడల్స్‌లో పాల్గొని గెలిచినా తక్కువే అనిపించి కళ్లు చిప్పిల్లేవి.

ఐడల్ ప్రోగ్రాంని అమెరికాలో చూసిన బాలీవుడ్ దర్శక, నిర్మాత విధు వినోద్ చోప్రాగారి సోదరి షెల్లీ (శైలజ) గారు, నేను విన్ కాలేదని తెలిసి ఏడుస్తూ, వాళ్ల అన్నయ్యకు ఫోన్ చేసి ఎలాగైనా కారుణ్యకు అవకాశం ఇవ్వమన్నారట. ఆయన నుండి పిలుపు వచ్చిన టైంలో ముంబాయిలో నా కో– సింగర్ 'మీనన్ జైన్' ఇంట్లో లంచ్ చేస్తున్నాను. ఆయన తీసిన పరిండా, 1942 లవ్ స్టోరీ, మున్నాబాయ్ ఎం.బి.బి.ఎస్. చిత్రాలు గుర్తొచ్చాయి. ఆయన సంగీత దర్శకులు 'శాంతన్ మొయిత్రా'కు ఫోన్ చేసి నా గురించి చెప్పడం, మర్రోజు రికార్డింగ్ జరగడం, 'లగేరహో మున్నాబాయ్'లో 'అణే చార్ అణే' పాట పాడించడం ... కలలో జరిగినట్లు జరిగిపోయాయి. తర్వాత జూ. ఎన్.టి.ఆర్.గారి 'అశోక్' చిత్రంతో మణిశర్మగారి ద్వారా తెలుగులో అరంగేట్రం చేశాను.

గమ్మత్తేమంటే, ఐడల్ నుండి వచ్చాక ఒకరోజు అతి మామూలుగా లంచ్ బాక్స్, బుక్స్ తీసుకుని రోజూ మాదిరే కాలేజీకి వెళ్లాను. స్టూడెంట్స్ అంతా 'కారుణ్యా, కారుణ్యా' అంటూ నా చుట్టూ మూగి 'ఐడల్ షోలో జడ్జిలుగా వచ్చిన అమితాబ్, ప్రియాంక చోప్రా, కరీనా, కాజోల్ ...లాంటి సెలబ్రిటీల గురించి చెప్పవా' అంటూ గుమిగూడారు. ఆరోజు క్లాసులన్నీ ఐడల్ ముచ్చట్లతోనే ముగిశాయి. అప్పటికే కొన్నాళ్లుగా 'పాట' నన్ను గాలమేసి లాగుతుండడంతో, ఇక పూర్తిగా పాటకే అంకితమవ్వాలని నిర్ణయించుకుని, ఆ రోజు సాయంత్రమే అప్పటివరకూ దాచుకున్న హ్యాపీడేస్‌ని మూటగట్టుకుని ఇంటికి వచ్చేసి, మళ్లీ కాలేజీ వైపు కన్నెత్తి చూడలేదు. నా హ్యాపీడేస్ మనసులో మెదిలినప్పుడల్లా ఆ జ్ఞాపకాల మూటని విప్పుతుంటాను!

karunyatheone@gmail.com

– గొరుసు జగదీశ్వరరెడ్డి

గుర్తు పట్టండి

1

2

వీళ్ళంతా ఒకనాడు వెండితెరపై ప్రేక్షకుల్ని అలరించిన నటులు. ఇటీవలే మరణించారు. వీరిని గుర్తుపట్టగలరా?

3

4

ట్రాఫిక్ సంగీతం

మీకు తెలుసా?

స్కూలుకెళ్లాలి. కాని ట్రాఫిక్ భూతాన్ని తలుచుకుంటేనే భయమేస్తుంది. అమ్మో ! ఆ బస్సులు, కార్లు, లారీల.. నుంచి వచ్చే శబ్దాలతో చెవులు చిల్లులు పడతాయి, గుండె బేజారెత్తుతుంది. ఒక మహత్తు జరిగి, అదే శబ్దాలు వినసొంపైన సంగీతంలా మారిపోతే, హాయి..హాయి. అయితే, మహత్తులేమీ లేకుండానే, రెండ్రోజులపాటు లండన్‌వాసులకు అలాంటి అదృష్టం పట్టింది తెలుసా? రోడ్డు మీద తిరిగే ఆ నల్లటాక్సీలు వీనులవిందైన సంగీతం అందించాయి వారికి. అది డ్రైవర్లు సాధారణంగా ఏర్పాటు చేసుకునే రికార్డర్ల, డివిడిల సంగీతం కాదు. రకరకాల ట్రాఫిక్ శబ్దాలే అలా మారిపోయిన సంగీతం.

అదెలా జరిగింది? ఒక డచ్ హెడ్ ఫోన్ కంపెనీ 'నగర శబ్దాలను వీనుల విందు చేయండి' అనే ప్రాజెక్టు చేపట్టింది. అందుకోసం ఒక్కో టాక్సీలో మైక్రోఫోన్లు, ఒక ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ అమర్చారు. వాటి సాయంతో హారన్లు, బ్రేకుల శబ్దాలన్నీ అలా మారాయన్నమాట. ఆ సంగీతం వినడం కోసం లోపల హెడ్ ఫోన్లు, బయట టాక్సీ చుట్టూ 67 స్పీకర్లు అమర్చారు. ఏ రోజు ట్రాఫిక్ ధ్వనులను బట్టి, ఆ రోజు సంగీతం తయారవుతుంది. భలే..భలే ఆ ప్రాజెక్టు వాహనదారులకు ఒక కొత్త ఐడియాను ఇచ్చింది.

పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో 'పరా'తో మొదలయ్యే పదాలను రాయండి.

1. మతిమరుపు — పరా □
2. భంగపాటు — పరా □□
3. హాస్యోక్తి — పరా □□
4. ఓదార్పు — పరా □□
5. ఓటమి — పరా □□
6. ఇతరులపై ఆధారపడడం — పరా □□
7. పతాకస్థాయి — పరా □□
8. కాంతి వెనుకకు తిరగడం — పరా □□□
9. ఒక మహర్షి — పరా □□□

నిర్వహణ : చేబియ్యం రామారావు

చెప్పండి చూద్దాం

1. పిఎస్ఎల్‌విని విస్తరించండి.
2. యుఎస్ ఓపెన్–2012 పురుషుల విజేత ఎవరు?
3. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
4. భారత ప్రధాన ఎన్నికల అధికారి పేరేమిటి?
5. ఇటీవల కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించిందెవరు?

రంగులు వేయండి

నా బొమ్మ



సాయి ప్రీతమ్ రాజ్,
6వ తరగతి
మార్టినెట్ హైస్కూల్,
పార్శిగుట్ట,
సికింద్రాబాద్.

దారి కనుక్కోండి

జవాబులు

పద విన్యాసం: 1. పరాధీనం 2. పరాజయం 3. పరాక్రమం 4. పరామర్శ 5. పరాభవం 6. పరావలంబి 7. పరాకాష్ఠ 8. పరావర్తనం 9. పరాశరుడు

దారి కనుక్కోండి: 1. ఎడమ వైపు నుంచి 2. కుడి వైపు 3. ఆర్సా 4. ఊరకే

గుర్తు పట్టండి: 1. ఎం.జి. శ్రీహర్షా 2. సెర్జియో గార్సియా 3. జస్టిస్ అల్తమస్ కబీర్, 4. సి.ఎస్. సంపత్, 5. ఆర్థిరంగ కిణిహాన్

అపార సూక్ష్మజాతి సంపద

పిల్లలూ! తారా ఎక్స్‌పెడిషన్స్ అంటే తెలుసా మీకు? అది ఒక పరిశోధనా సంస్థ. జీవావరణం మీద వాతావరణ మార్పుల ప్రభావం ఎలా ఉందో పరిశోధించే సంస్థ. రెండున్నరేళ్లుగా ఆ సంస్థ ఆధ్వర్యంలో 15 మంది శాస్త్రవేత్తల బృందం సముద్రగర్భంలో పరిశోధనలు చేపట్టింది. ఇంతకు ముందు వారి పరిశోధన గ్రీన్‌లాండ్, అంటార్కిటికాలకే పరిమితం. ఈ సారి ప్రపంచవ్యాప్త పరిశోధన చేపట్టారు. ఆ పరిశోధనలో కొన్ని మంచి విశేషాలూ ఉన్నాయి, కొంత నిరుత్సాహం కలిగించే వార్తలూ ఉన్నాయి. ఐనా అన్నీ తెలుసుకోవాలి గదా! 15 లక్షల సూక్ష్మాతి సూక్ష్మ జీవజాతులను కొత్తగా కనుగొనడం మంచి కబురు. వాటిలో వైరస్, బ్యాక్టీరియా కన్నా చిన్నవి, మెడుసాస్ అనే పెద్దజాతులూ ఉన్నాయి. ఇవి మానవుల ఉనికికి, జీవవైవిధ్యానికి ఎంతగా దోహదపడుతాయంటే, ప్రపంచంలోని 40 నుంచి 80 శాతం ఆక్సిజన్ అవే ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే, అంటార్కికాసముద్రంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి, ఆమ్లజలంగా మారుతున్న సముద్రజలాల నుంచి, మారుతున్న ఉష్ణోగ్రతల నుంచి వాటికి ప్రమాదం పొంచివుందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇది చెడ్డ కబురు.

అమ్మో! 'పాప్ లంగ్'

సండే పార్కుకు వెళ్లి, అట్లే మాల్‌కి వెళ్లి, మూవీకి వెళ్లారా? అక్కడా ఇక్కడా కూడా పాప్‌కార్న్లే లాగించేసారా? అలా ఒక్క రోజైతే ఫర్లేదు కానీ, రోజూ ఏదో ఒక సాకు చెప్పి పాప్‌కార్న్ తెగతింటుంటే మాత్రం జాగ్రత్త. ఈ మధ్య 'పాప్‌కార్న్ లంగ్ ' అనే వ్యాధి వస్తోందట అలాంటి వారికి. వేన్ వాట్సన్ సంగతి చూడండి. పది సంవత్సరాల పాటు రోజుకు రెండు బ్యాగుల పాప్‌కార్న్ మెక్కేసాడు. ఆ పాప్‌కార్న్ కృత్రిమ వెన్న రుచులతో తయారైనది. మైక్రోవేవ్ నుంచి హాట్ హాట్‌గా పాప్‌కార్న్ బయటికి తీస్తూంటే, ఆ పొగల్లోని డయాసెటైల్ అనే రసాయనం అతని ఊపిరితిత్తుల్లో చేరి గాలి ఆడకుండా చేసింది. ఇంకేముంది 'పాప్‌కార్న్ లంగ్ 'నేనున్నానని అతడిని పట్టేసింది. చెప్పొచ్చేదేమంటే, వేన్ వాట్సన్‌ను ఫాలో కాకండి, ప్లీజ్!



లోపలి ఖాళీలు

కోవడం తన హక్కన్నట్టు ఉండేది తన ప్రవర్తన. కాస్త పరధ్యానంగా ఉంటే 'ఆ పోయినావిడ గురించేనా, లేక పోతే ఇంకెవరి గురించైనానా' అని కావాలని గొడవ పెట్టుకునేది. నిజానికప్పుడు నీరజ గురించే కాదు, ఇంకే మనిషి గురించీ ఆలోచించే స్థితిలో ఉండేవాణ్ని కాదు. నా శ్రద్ధంతా కెరీర్ మీదే. బాబు చదువు పూర్తవబోతూ, నేను నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించాననుకున్నాక చూస్తే... మృణ్మయి తీరు పూర్తిగా మారిపోయింది. కాలేజీకి వెళ్లొచ్చి తనపాటికి తాను చదువుకునేది కాస్తా, ఇరుగూపొరుగూ ఆడవాళ్లతో కలిసి లలితా సహస్రం నేర్చుకునేందుకు వెళ్లేది. దాని తర్వాత సంగీతం క్లాసులకు వెళ్లడం మొదలెట్టింది...''

''సంగీతమా?''

''అదే నాకూ ఆశ్చర్యమనిపించింది. నలభయ్యేళ్లకు సంగీతం ఏమిటనడిగితే – ఏం నువ్వు ముప్పయ్యేళ్లు దాటాక ఇంగ్లీష్ నేర్చుకోలే, ఇదీ అంతే అనేసింది. విచిత్రంగా తను దాంతో పూర్తిగా మారిపోయింది. అదివరకు నాపట్ల ఉన్న అతి శ్రద్ధే అను, అనుమానమే అను, అదంతా తగ్గిపోయింది. మాట్లాడితే ఒకటీఅరా మాటలు. నేను క్లయింట్లతో మాట్లాడేది చెవినపడ్డట్టే ఉండదు. మా వాగ్యుద్ధాలకు జడిసి మా ఇంటికి రావడానికే భయపడేవారు మా అమ్మానాన్నలు. ఇప్పుడు తనని దేవత అంటున్నారు. తాను నేర్చుకోవడమే కాకుండా, గవర్నమెంటు స్కూళ్లలో పిల్లలకు సంగీతం క్లాసులు చెబుతోంది. అక్కడకెళ్లడమంటే ఎంత ఉత్సాహమో తనలో. ఎందుకొచ్చినదంటే వినదు. ఎక్కడికైనా హాయిగా తిరిగొద్దామంటే రాదు. డ్యూప్లే ఇల్లూ, బెంజి కారూ... అవన్నీ కూడా పట్టనట్టే ఉంటుంది. అదంతా పోనీ అనుకుంటే నాకిప్పుడు నీరజ గుర్తురావడమేంటో, లోపల్లోపలీ గిల్టీ ఫీలింగెందుకో తెలీడం లేదు' అన్నాడాయన నిరుత్సాహంగా.

ఇప్పటిదాకా అర్థం కాకుండా లోపల్లోపలే తిరుగుతున్నదేదో నాకిప్పుడు చప్పున మెరిసింది. సాధారణంగా మనుషులు తమలోని శక్తియుక్తులను ఇతరులను మెప్పించడంలోనే వ్యర్థం చేసుకుంటారు. సంపాదననో, హోదానో, ప్రతిభనో నలుగురిలో ప్రదర్శించి సంతృప్తి పడతారు. 'నేనేమిటి' అన్న ప్రశ్న వేసుకుని, దానికి సమాధానం వెతుక్కుని ఆ దారిలో నడవడానికి చాలా ధైర్యం కావాలి. ఆ ధైర్యం మృణ్మయికి వచ్చినట్టుంది. దాంతోనే ఆమె సత్యాసత్యాలకవతలి సాఫల్యాన్ని సాధించింది. దేన్నయినా పొంది తృప్తి పడే స్థాయి నుంచి తనను తాను ఇవ్వడంలో సంతృప్తి చెందుతున్నట్టుంది! ఈయనేమో వృత్తిలో తానంతటివాడు లేడనిపించుకున్నాక ఇక దేనికోసం పరిగెట్టాలో తెలీని అయోమయంలో ఒకనాటి ప్రేమని గుర్తు చేసుకుని బాధ పడుతున్నాడు.

''ఏవిటి ఆలోచనలో పడ్డావు లాలిత్యా? నిన్ను చాలా ఇబ్బంది పెడుతున్నాను కదా? నాకేదో తక్షణ పరిష్కారం ఇస్తావని కాదుగానీ, ఎందుకో చెప్పుకుంటే కాస్త తేలిక పడతాననిపించింది..'' అన్నాడాయన గొంతులో క్షమాపణ ధ్వనిస్తుంటే.

''మృణ్మయి వెతుకులాటకు సంబంధించి మీరు గమనించింది నిజమే అయుండచ్చు. అయితే ఆమె తనలోని ఖాళీలను సంగీత సాహిత్యాలతో పూరించుకుంటోంది. 'చక్కని రాజమార్గములుండగ సందుల దూరనేలనే మనసా' అన్న త్యాగరాజ తత్వవిచారం ఆమెకు బాగా తలకెక్కింది. ఆ స్వరాలే ధారలుగా కురిసి ఆమెను ప్రేమామృత స్వరూపిణిగా చేశాయి. అందరితో ప్రేమగా ఉంటుందన్నారు చూడండి... దానికదే నిదర్శనం. మీ అమ్మానాన్నలనే తీసుకోండి. 'దేవతరా' అన్న మాట వాళ్లు ఉత్తుత్తినే అనడం లేదు. కేవలం కోడలిగానే చూస్తే వాళ్లూ మీలాగ దుఃఖపడుదురేమో...''

''ఇబ్బందేం లేదు, నాకు తెలిసి దాదాపు అందరికీ లోపల్లోపల ఏదో తెలీని వెలితీ, పరిపూర్ణ ప్రేమానుభూతి కోసం ఎడతెగని అన్వేషణా ఉంటూనే ఉంటాయి సోమా. సమస్యేంటంటే ప్రతివాళ్లూ తమ లోపలి ఖాళీలను వేరే ఓ మనిషి పూరించగలరని అనుకుంటారు. అక్కడే వస్తుంది చిక్కంతా. ఇంకో వ్యక్తితో జీవితానికి పరిపూర్ణత వస్తుందన్న ఆలోచనతో ప్రీఆక్యుపై అయిపోయి వాస్తవంలో అటువంటి ది జరక్కపోయేసరికి నిరాశ పడతారు. తప్పంతా అవతలివాళ్ల మీదకు నెట్టి వాళ్లను వాళ్లు క్షోభ పెట్టుకుంటారు. మీరు మీలోపలి ఖాళీని ముందు నీరజతో పూరించుకున్నారు. అది కుదరక వృత్తిలో ఎదుగుదలను లక్ష్యంగా పెట్టుకున్నారు... మృణ్మయి తన జీవితానికి పరిపూర్ణత మీతో అనుకుంది, తర్వాత తానూ దిశ మార్చుకుంది...''

''కోరిక అన్ని దుఃఖాలకూ మూలమని బోధిస్తున్నావన్న మాట. కొంపదీసి మనం కూర్చున్నది రావి చెట్టు కిందనా ఏమిటి?'' అంటూ పైకీకిందకీ చూస్తున్నట్టు నటిస్తూ నవ్వారు సోమా.

''మీ ఆధ్యాత్మిక దుఃఖం నాకు అర్థమయిందిలెండి'' అన్నాను.

''దుఃఖంలో మళ్లీ రకాలు కూడానా? అదేమైనా డ్రింకా రకరకాలుండటానికి?'' గట్టిగా ఒక్కపెట్టున నవ్వాడాయన. తెరిపినపడ్డాడు. ఇక నేనను కున్నది చెప్పొచ్చు.

''అంత నవ్వాల్సిందేం లేదు. మానసిక వియోగం వల్ల కలిగేవాటిని ఆధ్యాత్మిక దుఃఖమంటారు. మొత్తానికి మీ బాధా వ్యధా తీరడానికో మార్గం కనిపిస్తోంది''

''మళ్లీ ఇదేం తిరకాసు పెట్టావు? బాధేవిటి, వ్యధేవిటి? రెండూ ఒకటి కాదా?''

''కాదు. కలియబెట్టడం వల్ల కలిగేది బాధ. భయపెట్టేది వ్యధ. గతం మీకు కలిగిస్తున్నది బాధా, వ్యధా కూడాను.''

కళ్లెత్తి ఎదురుగా చూస్తే గోడకున్న కేలండర్లో అమ్మవారి పసుపుపచ్చని ముఖం, విశాలమైన నయనాలూ, అభయమిస్తున్నట్టు చిరునవ్వూ కనిపించాయి. ఏదో అవ్యక్తమైన అనుభూతి కలిగింది. రెండు చేతులూ జోడించి నమస్కారం చేసుకున్నాను. 'యా దేవీ సర్వభూతేషు ప్రేమ రూపేణ సంస్థితా... నమస్తస్యై నమస్తస్యై' పెదవులు చిన్నగా పలికాయి.

''అర్థరాత్రి పూట నీ గోలేమిటి, నన్నొదిలెయ్యి మహానుభావా అని దండం పెడుతున్నావా లాలిత్యా'' అంటూనే సోమా వెనక్కు తిరిగి ఆ కేలండరును చూశారు.



ఆ తల్లి వర్షించే వాత్సల్యంతో నా మనసు నిండిపోయినట్టనిపించింది. ఆయన సమస్యకు పరిష్కారమూ లభించినట్టే. మృణ్మయి అందర్లాంటి మనిషి కాదు. ప్రొఫెషనల్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తూనే అంతరంగంలోని శూన్యాన్ని గమనించుకుంది. తనను తాను ఎక్స్‌టెండ్ చేసుకోవడమెలాగో ఆలోచించుకుంది. ఆలోచనను పక్కాగా అమల్లోకి పెట్టింది. నాకు అనిపించిందిదీ. దాన్నే బైటికి చెప్పాను.

''మృణ్మయి వెతుకులాటకు సంబంధించి మీరు గమనించింది నిజమే అయుండచ్చు. అయితే ఆమె తనలోని ఖాళీలను సంగీత సాహిత్యాలతో పూరించుకుంటోంది. 'చక్కని రాజమార్గములుండగ సందుల దూరనేలనే మనసా' అన్న త్యాగరాజ తత్వవిచారం ఆమెకు బాగా తలకెక్కింది. ఆ స్వరాలే ధారలుగా కురిసి ఆమెను ప్రేమామృత స్వరూపిణిగా చేశాయి. అందరితో ప్రేమగా ఉంటుందన్నారు చూడండి... దానికదే నిదర్శనం. మీ అమ్మానాన్నలనే తీసుకోండి. 'దేవతరా' అన్న మాట వాళ్లు ఉత్తుత్తినే అనడం లేదు. కేవలం కోడలిగానే చూస్తే వాళ్లూ మీలాగ దుఃఖపడుదురేమో...''

సోమా ఆలోచనలో పడ్డారు. లోహం వేడిగా ఉన్నప్పుడే వంగుతుంది.

''మీరామెను డ్యూప్లే ఇల్లూ, బెంజి కారూ, బంగారాల్లాంటి సందుల్లోంచి వెళితే పట్టుకోలేరు, ఆకట్టుకోలేరు. తను ఎంచుకున్న రాజమార్గంలోకి ప్రవేశించడమెలాగో చూడండి. మృణ్మయి ఎక్కువ దూరమే వెళ్లిపోయిందిగానీ, మీ జన్మసంస్కారం మాత్రం తక్కువదా? తప్పక అందుకుంటారు చూడండి... బెస్టాఫ్ లక్...'' చెప్పి, నా గదికొచ్చేసి ఏదో సంతృప్త భావనతో హాయిగా నిద్రపోయాను. ■

❖ సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి



అడ్డం

1. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లో తెలంగాణ కుర్రాడు నాగరాజు (4)
2. 'చిత్రం భళారే విచిత్రం'లో నరేశ్ జోడీ (3)
4. సిద్ధార్థ్ 'ఓ మై ఫ్రెండ్' దర్శకుడు (2)
6. పూరి జగన్నాథ్ 'ఇడియట్' సంగీత దర్శకుడు(2)
7. కృష్ణంరాజు, జయప్రద, జయసుధ కలయికలో వచ్చిన చిత్రం '...స్వప్నం' (3)
10. 'ఏమైంది ఈవేళ' హీరో పేరు ప్రథమార్థం అటుఇటుగా (3)
11. 'జాముురాతిరి జాబిలమ్మా జోలపాడనా ఇలా' పాట ఉన్న చిత్రం (4)

నిలువు

1. ఇటీవల మృతి చెందిన ఒకప్పటి పేరు పొందిన హాస్యనటుడు (4)
2. 'బొమ్మల కొలువు' చంద్రమోహన్ జోడీ (3)
3. 'ఆరెంజ్' హీరో (5)
5. అక్కినేని, వాణిశ్రీ, జయసుధ కలయికలో తాతినేని రామారావు చిత్రం (5)
8. 'ఎల్లువొచ్చి గోదారమ్మ ఎల్లాకిల్లా పడ్డాదమ్మా' పాట ఈ చిత్రంలోనిదే (3)
9. శోభన్‌బాబు, శ్రీదేవి జయచిత్ర కలయికలో వచ్చిన చిత్రం (2)

గత వారం జవాబులు

1 శ్రీ	దే	వి	●	2 తి	●	3 చం
ని	●	●	4 వీ	ర	భ	ద్ర
5 వా	ర	6 సు	డు	●	●	బో
స	●	కు	●	7 టైం	8 పా	స్
9 రె	హ	మా	న్	●	ట	●
డ్డి	●	రు	●	●	గా	●
●	10 ఆ	డు	తూ	పా	డు	తూ

❖ ఇన్‌బాక్స్

రెండు వైపులా

''మీరు మీ సినిమాల్లో ఎన్ని సీన్లు కాపీ కొట్టలేదు. అది తప్పు కాదా?'' అని రాజమౌళికి ఎన్నారైల నుంచి ఎదురైన ప్రశ్న సినిమా పరిశ్రమలో పైరసీ తీవ్రతను తెలుపుతోంది. సమస్య పరిష్కారం రెండు వైపుల నుంచి జరగాలి. లేకుంటే ఇంతే.

– ప్రసాద్ తోలేటి, హైదరాబాద్

నిలువుటద్దం

అద్భుతమైన ఎత్తుగడతో, అనితరసాధ్యమైన శైలిలో సూటిగా సంక్షిప్తంగా సాగింది కుటుంబరావు కథ. 'అన్నీ మేమే చెయ్యాలా' కథ నేటి దేశ, కాలమాన పరిస్థితులకు నిలువుటద్దం. నవ్విస్తూనే చాలామంది మనసుల్లోని ఫీలింగ్స్‌ను చాలా చక్కగా చెప్పారు. ఒక పెద్దాయన మమ్మల్నే కడిగేసినట్టనిపించింది.



– అనిల్ ప్రసాద్ లింగం, ఇ మెయిల్,
– డాక్టర్ ఎ.ఆర్.కె, కె.భారతి, డా సురేష్

చెంపపెట్టు

మత్తులో జోగుతున్న యువతను తట్టిలేపే కథ ఇది. బాధ్యతారహితంగా స్వార్థబుద్ధితో మసలుతున్న యువలోకానికి చెంపపెట్టు. 'నాకెందుకులే?' అనే ధోరణిలో ఉన్న వారికి ఒక షాక్ ట్రీట్‌మెంట్. మచ్చుకి కొన్ని సంఘటనలను చూపి, వాటి ద్వారా విషయాన్ని అవగతం చేసారు. మన సామాజిక ప్రక్షాళనా మహాయజ్ఞానికి ఇలాంటివి ఎంతైనా అవసరం.

–డా. కే.ఎల్వీ. ప్రసాద్, ఇ మెయిల్

అల్లరి డేస్

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' 'నాగరాజు' హ్యాపీడేస్ అల్లరి చిల్లరగానే గడిచాయి. ఆ సినిమా కోసమే న్యూయార్కులోంచి హైదరాబాద్‌లో దిగాడంటే నమ్మబుద్ధి కాలా!

–ఉమా, తాడేపల్లి గూడెం

వెర్రి ఎంత చిత్రం

సినిమాతారల ఫాన్స్‌లో వెర్రి ఎంత చిత్రవిచిత్రంగా ఉంటుందో చెప్పిన సినిమా యాంటీవైరల్. 2012 కాన్ చిత్రోత్సవానికి బ్రాండన్ కానన్‌బర్గ్ తీసిన 'యాంటీవైరల్ ' సినిమాతో పాటు, అతడి తండ్రి దర్శకత్వం వహించిన 'కాస్మోపాలిస్' కూడా ఎంపిక కావడం విశేషం.

– అన్వర్, వరంగల్

వైవిధ్యభరితం

గిరిజనులు సంవత్సరం పొడుగునా సొంతంగా తయారు చేసుకునే పానీయం మడ్డికల్లు. దానిని ఎవరితోనూ పంచుకోరు, ఎవరికీ అమ్ముకోరు. అదే వారికి ఆహారమూ,ఔషధమూ కూడా. దీనిని బట్టి వారి జీవనశైలి ఎంత వైవిధ్యభరితమైనదో ఊహించవచ్చు. ఆ కల్లును సర్వరోగ నివారిణిగా మార్చవచ్చు అనే రచయిత ప్రతిపాదన గమనించదగినది.

– తిరుపాల్, రేణిగుంట



అడ్డం

1. మారిన 'తీరు' (3)
4. వాడుకలో గోధుమ రొట్టె – పరాటా చెల్లి (3)
6. అంతపుర 'దాసి' (5)
9. సినిమా పూర్తయ్యాక వెండితెరపై కనిపించే పదం – చివర వత్తు లేదు (2)
11. చదరంగం ఆడాలంటే ఇవి ఉండాల్సిందే – ఏకవచనం (2)
12. ఎర వేయడమే ... చేపలు పట్టే ఒక సాధనం (2)
14. పువ్వులేని 'విరిబోణి' (2)
15. నక్క కూత (2)
16. ఒక అరబ్ నగరం (3)
17. ఆద్యంతాలు లోపించిన 'అగ్రహారం' (2)
18. ఎండిన పెద్ద మోడు (2)
19. ఈ దేవుడు మాద్రి సుతుల్లో ఒకడు (2)
20. సగం 'చాపకూడు' (2)
23. వెనకనుండి దూసుకొచ్చిన శరం (2)
25. బద్ధకస్తుడి గుణం (5)
28. 'కళ్లు లేని --- ని బాబయ్యా!' (3)
29. ఒక సంగీత వాయిద్యం (3)

నిలువు

1. తండ్రిమాట జవదాటక తల్లిని నరికిన 'రాముడు' (3)
2. తిరగబడ్డ భర్త (2)
3. పిల్లలందరూ ముద్దుగా పిలుచుకునే -- నెహ్రూ! (2)
4. ఆద్యంతాలు లేని 'వాచకము' (2)
5. ఒక పక్షి – అరిస్తే అరిష్టమంటారు (3)
7. ఇంగ్లీషు 'లయ' (2)
8. దాదాపు కనుమరుగైన మూడు చక్రాల బండి (2)
10. కోస్తా 'ఆలుగడ్డ' (5)
11. వివాహం (5)
13. అనవసరపు ఖర్చు (3)
20. తడారిన కన్నీటి మరక, అడ్డం 6లో ఉంది (3)
21. వాతావరణంలోని చల్లదనం (2)
22. ఒకటికి ఒకటి తోడు (2)
24. అక్బర్ పాదుషా తాత, మొగల్ వంశ స్థాపకుడు (3)
25. ఎరుకలసాని చెప్పే జోస్యం (2)
26. తిరగబడ్డ గంగ సవితి (2)
27. కోనంగిలో దాగిన కపట తనం (2)

గత వారం జవాబులు

1 చి	2 రు	నా	3 మా	●	4 ద్రా	క్షా	5 రా	6 మం
7 ట్టె	తు	●	8 స	9 మీ	క్ష	●	10 వి	డో
లు	●	●	●	గ	●	●	●	ద
11 క	12 పి	●	13 మ	డ	14 క	●	15 ఉ	రి
●	16 రం	గు	లు	●	17 ల	వు	డు	●
18 భో	గి	●	19 పు	20 ల	త	●	21 త	22 కాం
జ	●	●	●	వం	●	●	●	చీ
23 న	24 రం	●	25 స్వ	గ	26 తం	●	27 ను	పు
28 ము	ది	గా	రం	●	29 తు	లా	భా	రం

నిర్వహణ : గొరుసు

అంకెలి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

గత వారం జవాబులు

4	1	8	2	6	5	3	9	7
6	9	5	3	1	7	8	4	2
2	3	7	9	8	4	5	6	1
8	2	6	5	3	9	7	1	4
5	4	9	7	2	1	6	3	8
3	7	1	8	4	6	2	5	9
9	8	3	4	5	2	1	7	6
7	6	2	1	9	3	4	8	5
1	5	4	6	7	8	9	2	3

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

1		6		8		2		4
	3	9			4	6	1	
	2		3		1		8	
	7	8				4	5	
9				7				6
	4						9	
	6		1		7		4	
	8	7	5			1	6	
5		1		4		3		2

రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255
ఫోన్: 040-6522 5554

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారిచూపే నేత్రం, జ్యోతి శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నం తలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు .....

పుట్టిన తేదీ .....

పుట్టిన సమయం .....

పుట్టిన ఊరు (మండలం) .....

ప్రశ్న .....

పుట్టిన తేదీ వివరాలు లేని వారు 1 నుండి 249 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాసి పంపండి. (ఇవి కృష్ణమూర్తి పద్ధతిలోని 249 సబ్స్).

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా

అదృష్ట రత్నజ్యోతి,

ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 500 033.

అదృష్ట రత్నజ్యోతి

వి.ఎస్., నిర్మల్

మా అబ్బాయి జన్మకుండలి సంపూర్ణంగా నిర్మొహమాటంగా వివరించగలరు.

మీ అబ్బాయి జన్మకుండలి ప్రకారం–

నక్షత్రం పుష్యమి. రాశి కర్కాటకం.

2015 జూన్ వరకు శని దశ.

2015 జూన్ నుండి 2032 మార్చ్ వరకూ బుధ దశ.

2032 మార్చ్ నుండి 2039 ఫిబ్రవరి వరకూ కేతు దశ.

2039 ఫిబ్రవరి నుండి 2058 అక్టోబర్ వరకూ శుక్ర దశ. పిదప రవి దశ.

కంట్రోలింగ్ ఫేక్టర్స్ : శనికి చంద్ర రవి బుధ శుక్రులు. బుధునికి గురు, శుక్ర కేతువులు. కేతువుకు చంద్రుడు. శుక్రునికి చంద్రుడు.

యోగాలు : 1. బుధాదిత్యయోగం. పనిచేస్తుంది. ఇక్కడ పిల్లలకు ఉపయోగపడుతుంది.

2. రాజయోగం. పిజిలో టాపర్‌గా నిలబెడుతుంది. విదేశాల్లో ఉంటే పూర్తి శాతం పనిచేస్తుంది.

3. పర్వతయోగం. ఇది గత జన్మలో ఈ జాతకుడు ఎంత క్రమశిక్షణగా ఉన్నదీ, ఎలాంటి పాపకర్మా లేకుండా ఎంతగా జాగ్రత్త పడిందీ వివరించే యోగం ఇది!

ఆవేశంలో తోచినట్టు చేసేయడం, పిదప దాని కర్మ ఫలాన్ని అనుభవించలేక ఏడవడం... కోటానుకోట్ల మంది జీవితాలూ ఈ ఈక్వేషన్‌తోనే నడుస్తుంటాయి. కర్మబంధం ఎక్కడా అంటకుండా నడిపిన జీవితానికి, కనీసం ఆ ప్రయత్నానికి సాక్ష్యమే ఏ జన్మకుండలిలోనయినా పర్వత యోగం ఉండడం!

ఇక విద్య... మనపై రుద్దింది చదువుతామా, మనసుకు నచ్చింది రుబ్బుతామా అన్నది చదువుకునే వయసులోనే బోధపడడానికి చాలా మేధస్సు కావాలి. అందుకేనేమో పిజి రసాయనశాస్త్రంలో చేయడం, టాపర్ కావడం జరిగేది! రాహు శని చంద్రులు కలిసి ఇచ్చే ఈ చదువులో ఈ జాతకునికి గట్టి పట్టే ఉంటుంది.

బుధ దశ అయిపోయే వరకూ సామాన్యంగా నడిచిపోయే జీవితం కేతు దశ ప్రారంభం నుండే యోగించడం ప్రారంభమవుతుంది. అంటే అప్పటికి 26 ఏళ్ళ వయసు.

కేతువులో శుక్రుడు వివాహాన్నిస్తాడు. ఆయనే అధిపతీ, కారకుడు. చంద్రలగ్నాత్తూ సప్తమ స్థితి. అయితే ఇక్కడ జాగ్రత్తపడవలసిన విషయం, శుక్రునిలో తిరిగి వివాహాన్నిచ్చే ప్రయత్నం, ఏదైనా వ్యాపారం చేస్తే విరమించబడుతుందన్నది గ్రహించడం.

కుజ దోషం ఉంది కానీ పనిచేయదు. శని దోషం లేదు. కాలసర్పదోషం లేదు. వివాహం విషయంలో ఎలాంటి చెడు ఘటనలూ, ప్రతిఘటనలూ ఉండవు. కారణం పూర్వజన్మలో కావలసినంత రుణపడి ఒకరి కోసం ఒకరు పుట్టడం! ఉన్న ఊరి నుండే అమ్మాయి రావడం జరుగుతుంది. 26వ ఏట వివాహం.

అమ్మాయి ఎంతటి సౌశీల్యవతో అంతకుమించిన సౌందర్య రాశి!

నల్లటి మేఘాల్లో పోతున్న తెల్లటి కొంగల సమూహం లాంటి సౌందర్యం!!

సంతానం సంఖ్య 3. సంతానం మొత్తం కేతు దశ అయిపోయే నాటికి అయిపోతుంది. అంటే 26 నుండి 33వ సంవత్సరం మధ్య ఇక 33 నుండి 20 సంవత్సరాల పాటు శుక్ర దశ. ఎలాంటి ఆటంకాలూ లేని దశ.

ఈ శుక్ర దశ మొత్తం విదేశ నివాసం, ఇంపోర్ట్స్ అన్డ్ ఎక్స్‌పోర్ట్స్ వ్యాపారం, విజయం... ఒక్క మాటలో చెప్పాలంటే జీవితం గర్వంతో నిలబడే పర్వతం... ఐరావతం!

అయితే ఈ శుక్ర దశ యోగించడం అనేది, 2039 ఫిబ్రవరి నుండి 2042 మే మధ్య... అంటే శుక్రునిలో శుక్ర భుక్తిలో... అంటే తన 33 నుండి 36వ ఏట మధ్య ఎలాంటి పరాయి సంబంధాలూ పెట్టుకోకపోవడం మీద ఆధారపడి ఉంటుంది. ఇక్కడ వ్యసనం హసనాన్ని దూరం చేస్తుందన్న విషయాన్ని ఈ జాతకుడు గుర్తించాలి.

ఈ శుక్రునిలో శుక్రునిలో వ్యసనమా, వ్యాపారమా అనేది ఈ జాతకుని చేతిలో ఉంటుంది. అంటే నిజానికి ఎక్కడా ప్రకృతి కల్పించుకోదు. అంతా తన ఇచ్ఛ మీద ఆధారపడుతుంది. ఇక్కడ తనని తాను జయించగలిగితే శుక్ర దశాశేషం విశేషంగా యోగిస్తుంది!

శుక్రునిలో కుజునిలో అంటే తన 39వ ఏట గొప్ప గృహ యోగం. వృత్తిలో తిరుగులేని విధంగా స్థిరపడిపోవడం.

40 నుండి 43వ సంవత్సరం మధ్య... అంటే రాహుభుక్తిలో ఆరోగ్యం కాపాడుకోవలసి ఉంటుంది. రెమిడీస్ పాటించాలి. 43, 44, 45 సంవత్సరాల్లో పోగొట్టుకున్న ధనాన్నీ, ఎక్కడి నుండో ఎప్పటి నుండో రావలసిన ధనాన్నీ తిరిగి పొందడం జరుగుతుంది.

అయితే రవి దశలో 52 నుండి 58 మధ్య ఎక్కువ కాలం స్వదేశంలో గడపడం ఉంటుంది. అయితే శుక్ర దశలోని ఉత్సాహం కనిపించదు. అంతా ఆధ్యాత్మికమయంగా ఆ కార్యక్రమాల్లో నడిచిపోతుంది.

అదృష్ట రత్నం : పుష్యరాగం, వైఢూర్యం విడివిడిగా ధరించాలి.

శక్తియుక్తులు : తన నిజాయితీయే తన శక్తి! ఆ శక్తిని లగ్న గురువూ, లగ్నం మీది లగ్నాధిపతి వీక్షణ బలోపేతం చేస్తున్నాయి. ఈ జన్మకుండలిలోని మరో బలం లూజ్ సైకాలజీ లేకపోవడం.

హసద్భిః క్రియతే కర్మ రుదద్భి రనుభూయతే!

మనసుకు ఏది తోస్తే అది చేయడం, ఘనకార్యం చేసేనని ఆనందపడడం, చివరికి ఏడుస్తూ వాటి ఫలితాలు అనుభవించడం. ఇదే చాలా మంది విషయంలో జరిగే ప్రక్రియ! రుణం, పాపం, జీవితానికి బొమ్మా బొరుసూ. ప్రపంచాన్ని నడిపించే ఇరుసు. వీటి గురించిన అవగాహన కలిగి ఉండడమే ఈ జాతకుని శక్తి! జన్మజన్మకూ బలోపేతం కావడం మీదనే ఆసక్తి!!

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అధినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అధినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 62255** Advt

కొత్త స్నేహితుల మధ్య 'లవ్'లో ఓ వారం

స్వీడిష్ యాత్ర-2

ఇలా వెళ్ళి అలా రావడం కాక ఎక్కడ వీల యితే అక్కడ, ఎవరికి ఇబ్బంది లేకపోతే వాళ్ళ దగ్గర ఉండిపోయి స్వీడన్ దీవుల్లోని సామాన్యుల జీవితాన్ని మనకు పరిచయం చేస్తున్నారు ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ శాఖలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎం. ఆదినారాయణ. ఆయన స్వీడిష్ యాత్రానుభవాల రెండో భాగం ఇది.

వేకువనే పక్షులకంటే ముందుగా లేచాడు లూసియన్. చలిగాలి రివ్వుమంటున్నా లెక్కచేయకుండా పైన్ చెట్ల కింద రాలిపోయిన కాయల్ని పోగుచేసి, దూరంగా ఉన్న డెబ్రిస్ పిట్‌లోకి చేరుస్తున్నాడు. లాన్‌మోవర్‌తో గడ్డిని కత్తిరించే సమయానికి నేను లేచాను. నాకంటే పెద్దాయన అలా కష్టపడుతూ ఉంటే చూస్తూ ఎలా ఉండగలను? ''నేను కూడా మీకు సహాయం చేస్తాను'' అంటూ తోడుగా వెళ్ళాను. పనిచేయటం నాకు కొత్త కాదు. ఇంటి చుట్టూ శుభ్రం చేసి ఇల్లు అద్దెకు ఇచ్చుకుంటే లూసియన్‌కు కొంత ఆదాయం వస్తుంది. దాంతో ఆయన ప్రయాణాలకి, ఫోటోగ్రఫీకి ఇబ్బంది లేకుండా పోతుంది. ''ఆదీ! ఇక్కడ పనివారిని పెట్టుకొంటే రోజుకి వంద యూరోలు (రూ. ఏడువేలు) ఇవ్వాలి. కాబట్టి పనులన్నీ మేమే చేసుకుంటాం'' అని చెప్పాడు. ఇద్దరం కలిసి సాయంత్రానికి పనంతా పూర్తి చేయగలిగాం.

అక్కడికి దగ్గర్లో ఉన్న 'ఫారో' ఐలాండ్‌లో ఇంగ్‌మార్ బెర్గ్‌మేన్ (1918-2007) చాలా సినిమాలు తీశాడు. అక్కడికి వెళదామనుకున్నాను. అయితే మిలటరీ సంబంధమైన కారణాల వలన పర్యాటకుల్ని ఆ దీవికి రానీయడం లేదు అని తెలిసింది. అందువలన దగ్గరలో ఉన్న 'ఇవీస్' మ్యూజియంకు ఆ మర్నాడు ఉదయం బయలుదేరి వెళ్ళాం. చాలా చిన్నదే అయినా అందంగా ఉంది. ఇది ఇవీస్ మేడంగారి సొంత మ్యూజియం. ఆమె దాన్ని ఈ దీవిలో ఉంటున్నవారికి ఇచ్చివేసింది. అందువలన వారానికి ఒకసారి అందరూ కలిసి మ్యూజియాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి కష్టపడి పనిచేస్తారు. ఇక్కడ ఉన్న వస్తువుల్లో గోట్‌లాండ్ చరిత్రకి సంబంధించిన శాసనాలతో పాటుగా మత్స్యకారులు ఉపయోగించే గాలాలు, వలలు, ఉచ్చులు ఉన్నాయి.

కొత్త స్నేహితుల పరిచయం

సాయంత్రం విస్బీకి వెళ్ళాం. కాలేజీ విద్యార్థులు ఆర్ట్ ఎగ్జిబిషన్ పెట్టారు. అక్కడ 'జూయి' అనే కెనడియన్ రచయిత్రి, లావోస్‌లో ఇంగ్లీషు టీచరుగా పనిచేస్తున్న ఒక స్థానికుడు, ఎలీనా అనే రష్యన్ చిత్రకారిణి పరిచయం అయ్యారు. ఎలీనా వయసు యాభై ఉంటుంది. స్వీడన్‌కి ఇమ్మిగ్రేషన్ మీద వచ్చి అక్కడే ఉండిపోయి స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ ఉంది.

జూయి ముందునుంచే లూసియన్‌కి తెలియడం వలన మాతో పాటు ఫెరిలూన్‌కి వచ్చేసింది. డిన్నర్‌కి ప్రత్యేకంగా యాస్పరాగస్ తయారు చేశారు లూసియన్. జూయి మంచి నటి అని డిన్నర్ సమయంలో తెలుసుకున్నాను. ఆమె వయస్సు అరవై దాటినా, 'యాంటిగాన్' అనే గ్రీకు నాటకంలోని డైలాగుల్ని గుక్క తిప్పుకోకుండా చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఉదయాన ముగ్గురం కలిసి తీరం మీద కాసేపు షికారు చేసి, తర్వాత విస్బీకి వెళ్ళి జూయిని ఆమె ఇంట్లో దింపి తిరిగి వస్తున్నప్పుడు గున్నార్ మావెర్నిక్ అనే ఇ-మెయిల్ స్నేహితుడు నాకు ఫోన్ చేశాడు.

'నీకు ఇతనెలా తెలుసు?' ఆసక్తిగా అడిగాడు లూసియన్.

''మీరు ఇండియా నుండి వచ్చేశాక, ఇంటర్‌నెట్ ద్వారా కొంతమంది స్వీడిష్ ప్రజలతో కరస్పాండ్ చేశాను; ఎప్పటికైనా స్వీడన్ వెళతాను అనే నమ్మకంతో. అందరికంటే ముందుగా నాకు జవాబు ఇచ్చిన వ్యక్తి ఇతడే'' అంటూ ఫోన్ లూసియన్‌కి ఇచ్చి మాట్లాడమన్నాను.

''ఆదీ... మనం ఇప్పుడు 'లవ్' అనే గ్రామానికి వెడుతున్నాం. నీ మిత్రుడు నన్ను కూడా ఆహ్వానిస్తున్నాడు. ఇక్కడ నుండి ఇరవై నిమిషాల డ్రైవ్'' అంటూ కారుని పక్క రోడ్డులోకి దూకించాడు. నాకు ఇంటి వద్ద పని లేదు. కాబట్టి కొత్త మిత్రుడి ఇంట్లో నాలుగు రోజులు ఉందామనే ఆలోచన.

వాళ్ళకి వేసవి పండుగ కాలం

గున్నార్ రిటైర్ అయిన లెక్కల టీచరు. ఆయన భార్య గున్నెల్ సైకాలజీ డిపార్టుమెంటులో పనిచేస్తూ ఉంది. వీళ్ళు నివాసం ఉంటున్న గ్రామం పేరు లవ్. ఇది విస్బీకి దక్షిణంగా 15 కి.మీ. దూరంలో ఉంది. దారిలో మాకు అందమైన చర్చ్‌లు కనిపించాయి. రోమా అనే గ్రామం కనిపించగానే ఆగి లోపలికి వెళ్ళాం. నేనేమో దాన్ని 'రోమాజిప్సీ'ల నివాసం అనుకున్నాను. కాని ఈ దీవి మీదికి రోమను సైన్యాలు దండయాత్ర చేసినప్పుడు వారు ఏర్పాటు చేసుకున్న సైనిక శిబిరం అది. గ్రామాన్ని ఆనుకుని ఉన్న చర్చి ప్రాంగణంలో స్టేజి నిర్మిస్తున్నారు. ''ఈ సమ్మర్‌లో మేము షేక్స్పియర్ 'ఒథెల్లో' నాటకాన్ని వేస్తున్నాం'' అని చెప్పారు యువకులు. ఎండాకాలం అంటే స్వీడిష్ ప్రజలకి పండుగ కాలం. జూలై, ఆగస్టు నెలల్లోనే వారికి ఎండాకాలం సెలవులు ఇస్తారు.

లవ్ గ్రామంలోని చర్చి మలుపులో గున్నార్ దంపతులు మాకు స్వాగతం పలికారు. వారిది పెద్ద ఫాంహౌస్. ఇంటి ముందున్న యాపిల్ చెట్ల మీద కీటకాలు సంబరాలు చేసుకుంటున్నాయి. చుట్టూతా కూరగాయల తోటలు. సామానులు పెట్టుకోవడానికి ఇళ్ళు వేరేగా ఉన్నాయి. ఎర్రని తులిప్ పూలతోట ఇంటి వెనుక నుండి తొంగి చూస్తూ ఉంది. ఆరు గంటలకల్లా డిన్నర్ సిద్ధం చేశారు. టేబుల్ మీదకి ధృవపు జింక మాంసం వచ్చింది. దానికి తోడుగా ఇటాలియన్ వైన్ రాగానే 'స్కోల్' (చీర్స్) చెప్పుకున్నాం. ''మీ గెస్ట్‌ని హైజాక్ చేసినందుకు క్షమించాలి'' అంటూ లూసియన్ వైపు తిరిగి నవ్వుతున్నాడు గున్నార్. ''ప్రొఫెసర్ గారికి మీకంటే మంచి హోస్టు ఎవరూ దొరకరు. ఒక వారం పాటు మీరు అట్టిపెట్టుకోండి. తరువాత నేను వచ్చి తీసుకెళతాను'' అని చెప్పి, డిన్నర్ పూర్తయ్యాక వెళ్ళిపోయాడు లూసియన్.



చర్చి; శిల్పకళ (ఇన్‌సెట్‌లో)

పనిని దైవంగా భావించిన మేస్త్రీలు

''మా గ్రామం చూద్దురు గాని రండి సార్'' అంటూ తీసుకుపోయారు గున్నార్ దంపతులు. ముందుగా చర్చిలోకి వెళ్ళాం. అది మధ్యయుగాల నాటి నిర్మాణం. ఈ ఐలాండ్‌లో ఉన్న ప్రతి చర్చి ఉపయోగంలోనే ఉందని తెలుసుకున్నాను. లోపల ఉన్న క్రీస్తు బొమ్మకంటే చర్చి నిర్మాణమే నచ్చింది నాకు. పనినే దైవంగా భావించి ఉంటారు ఆ మేస్త్రీలు. పొలాల్లోకి వెళ్ళగానే పొట్టి గుర్రాలు కొన్ని ఎగురుకుంటూ ముందుకు వచ్చాయి. ప్రతి పొలంలోనూ ఒకటో రెండో గుర్రాలు కనిపిస్తూనే ఉన్నాయి. గ్రామంలో ఇళ్ళు మొత్తం కలిపి వందకంటే మించవు. పలుచగా, దూరదూరంగా కనిపిస్తున్నాయి. దారిలో ఎదురైన ఇద్దరు స్నేహితులకి నన్ను పరిచయం చేశారు. వారిలో ఒకామెకి కొండలు ఎక్కడమంటే ఎంతో ఇష్టమట. చివరగా వారి ఇంటి ముందున్న తేనెటీగల కేంద్రానికి తీసుకెళ్ళారు. ''ఎడ్మండ్ హిల్లరీ కొంతకాలం పాటు బీ కీపర్‌గా పనిచేశాడు'' అని నేను చెప్పగానే 'అలాగా' అంటూ భుజాలు ఎగరేశాడు గున్నార్. రాత్రికి నా రూంలో ఉన్న నిప్పుకోడి గుడ్డు(ఖాళీది)తోనూ, వయోలిన్‌తోనూ కాసేపు ఆడుకుని నిద్రలోకి జారుకున్నాను.

విండ్ మిల్

గున్నెల్ తన ఉద్యోగానికి వెళ్ళిపోయాక మేమిద్దరం మీట్‌బాల్స్‌తో టిఫిన్ ముగించి దగ్గరలో ఉన్న విండ్ మిల్ (గాలిమర) వద్దకు వెళ్ళాం. డచ్ దేశపు చిత్రకారుల బొమ్మల్లో ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి ఈ నిర్మాణాలు. మధ్య యుగాల్లో ఈ గాలిమరలని ఉపయోగించి నీళ్ళు తోడడం, పిండిని ఆడించడం చేసేవారు. పెద్ద స్టాండింగ్ ఫ్యాన్ మాదిరిగా ఉండే ఈ విండ్ మిల్స్‌ని జాతీయ సంపత్తిగా పరిగణిస్తున్నారు అక్కడివాళ్ళు.

విండ్ మిల్ ఎత్తు ఇరవై అడుగులు పైనే. 15 అడుగుల పొడవుగా ఉండే నాలుగు రెక్కలకి అమర్చిన తెరచాప వలన అవి తిరుగుతాయి. స్తంభం చుట్టూ నిర్మించిన చెక్క గదిలో గోధుమలు ఆడించడానికి తగిన ఏర్పాటు ఉంటుంది. 'ఎవరి తరువాత ఎవరి వంతు?' అని తెలియజేయడానికి ఆనాటి రైతులు వేసుకున్న గుర్తులు కూడా చెక్కల మీద ఇంకా కన్పిస్తున్నాయి.

గుబురు చెట్లలో కూర్చున్న నైటింగేల్ పక్షి టప్ టప్ మంటూ తన స్వరపేటికల్ని ఒక్కొక్కటిగా తెరుస్తూ ఉంది. కనుచూపు మేరంతా ఎగుడు దిగుడు మైదానాలు, వాటి నిండా గొర్రెల మందలు. మేము త్వరగానే ఇంటికి తిరిగి వచ్చి కూరగాయల తోట అంతా శుభ్రం చేసి మొక్కలకు ఎరువు వేశాం. మేడం ఇంటికి రాగానే నేను అలా షికారుకి బయలుదేరాను. ''సార్, రాత్రికి మీకోసం గున్నార్ వయోలిన్ మీద పాటలు వినిపిస్తానంటున్నాడు, త్వరగా రండి!'' అంటూ నా కోటు జేబులో ఒక బీర్ టిన్ పెట్టి 'హాపీ వాకింగ్' చెప్పింది గున్నెల్ మేడం. దారిలో కనిపించిన ప్రతి ఒక్కరూ నాకు 'హాయ్' చెబుతున్నారు. కొందరు కుక్కలను తీసుకుని బయలుదేరారు. మరికొందర్ని కుక్కలే ముందుకు లాక్కుని పోతున్నాయి. మరికొందరు గుర్రబ్బండి మీద పొలాల్లో తిరుగుతున్నారు. వారికి ఎలాంటి చీకూ చింతా ఉన్నట్లుగా కనిపించడం లేదు.

గున్నార్ దంపతులతో వ్యాసకర్త (మధ్యలో)

ఊయలలూపిన సంగీత ఝరి

డిన్నర్ సమయానికి నేను ఇంటికి చేరేసరికి గున్నార్ వయోలిన్ శృతి చేసుకుంటున్నాడు. ''ఇప్పుడు మీకు 'Blind Hans' అనే మా జానపద సంగీతకారుడి పాటలు వినిపిస్తాను'' అంటూ ఒక సుదీర్ఘమైన రాగాలాపనలోకి వెళ్ళాడు. అంతా వాయిద్యం మీదే. చాలా మంద్రస్థాయిలో సాగిపోతూ ఉంది ఆ పాట. నేను వయోలిన్ విని చాలాకాలం అయింది. మెల్లగా డాన్సు చేయటం మొదలుపెట్టాను. గున్నెల్ నవ్వుకుంటూనే అంతా వీడియో తీసింది. దాదాపు పావుగంటసేపు సాగిన ఆయన సంగీత ఝరిలో ఉయ్యాలలూగింది నా శరీరం. ''మీ తెలుగువారి జానపద గీతాలు ఎలా ఉంటాయని'' అడిగిన వెంటనే ఇంటర్‌నెట్ ఓపెన్ చేసి అందెశ్రీ, గోరటి వెంకన్న పాడిన తెలంగాణ జానపదగీతాల్ని వినిపించి వివరించాను. గ్రామసీమల్లోని ప్రేమనీ, సౌందర్య సంపదనీ పదిమందికి పంచిన ఆ వాగ్గేయకారులంటే నాకు చాలా ఇష్టం.

బొమ్మలు చెక్కాలనిపించింది

మర్నాటి ఉదయం వాళ్ళ ఇంటి ముందు మెత్తని రాళ్ళు రెండు కనిపించగానే బొమ్మలు చెక్కాలనిపించింది. వారి షెడ్‌లో ఉన్న పరికరాల్లోనే రెండు మూడు తీసుకుని వాటితోనే పని మొదలుపెట్టాను. గున్నార్ వచ్చి ''ఇంతకంటే మంచి రాళ్ళు, పరికరాలు సాయంత్రానికల్లా ఏర్పాటుచేస్తాను, నాతో రండి'' అంటూ నన్ను సముద్రతీరం వద్దకి తీసుకుపోయాడు. ఒడ్డు మీదనే మంచి సున్నపురాళ్ళు దొరికాయి. అడుగు సైజులో ఉన్న నాలుగైదు రాళ్ళు కార్లోకి ఎక్కించాము. ఒక ముసలావిడ తీరం మీద కూర్చుని కాఫీ తాగుతూ, సూర్యోదయాన్ని ఆహ్వానిస్తూ ఉంది. నీటిలో వేట చేస్తున్న సముద్రపు హంసలు కదిలిపోతున్న పూలబుట్టల మాదిరిగా ఉన్నాయి. అదే తీరంలో మరికొంచెం ముందుకెళ్ళగానే చేపలు పట్టేవారుండే చెక్క ఇళ్ళు కనిపించాయి. ఎరుపు రంగులో ఉన్న ఆ చెక్క ఇళ్ళ అమరిక నన్ను ఆకట్టుకుంది. ఎరిక్ పీటర్‌సన్ అనే ఒక పెద్దాయన ఒక్కడే కనిపించాడు అక్కడ. ఆయనకు తోడుగా పదిపిల్లలు ఉన్నాయి. 65 సంవత్సరాలు దాటిన ప్రతి నిరుద్యోగికీ ప్రభుత్వం అక్కడ పెన్షన్ ఇస్తుంది. దాంతోనే బతుకుతున్నాడు ఆయన.

ఆ తర్వాత మా కారు నాషోల్‌మెన్ అనే నేషనల్ పార్కు వైపుగా ప్రయాణించింది. అంతా సముద్రతీరమే. దారి పొడవునా కుందేళ్ళు మందలుగా ఉన్నాయి. కదలవు, మెదలవు, బిత్తరపోయినట్లుగా మనవైపే చూస్తూ ఉంటాయి. ఈ తీరంలో విండ్ టర్బైన్‌లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. పాత లైట్‌హౌస్‌ని చూస్తుంటే మధ్యయుగాల నాటి విజయస్తంభాలు గుర్తుకి వచ్చాయి.

ఆ గడ్డి మైదానం అంతా పరుచుకున్న ఎరుపు, పసుపు రంగుల చిన్నపూలని ఆడమ్ అండ్ ఈవ్ అని పిలుస్తున్నారు. తీరం వెంట టెరన్ పక్షులు నిర్భయంగా తిరగడమే కాకుండా, ఎక్కడ పడితే అక్కడ గుడ్లు పెడుతున్నాయి. నేను ఒక గూటి వద్దకు వెళ్ళి కాసేపు కూర్చుని ఆ గుడ్ల మీద జారుతున్న రంగుల్ని పరిశీలించాను. ఇంటికి రాగానే మేము తెచ్చిన సున్నపురాళ్ళ మీద బొమ్మలు మొదలుపెట్టాను. కానీ పదునైన, సన్నని ఉలి లేకపోవడంతో సగంలోనే పని ఆగిపోయింది.

(తరువాయి భాగం వచ్చే వారం)

రచయిత ఫోన్ : 98498 83570

స్పందన

తాటికల్లుతో సిర్క



కొప్పుల హేమాద్రిగారి 'మడ్డికల్లు' వ్యాసం చదివాక మధుమేహ వైద్యంపై నేను చాలాకాలంగా బద్ధకిస్తున్న ఒక వ్యాసాన్ని ఇదిగో ఈ రూపంలో రాసి పంపిస్తున్నాను. రచయితతో వెంటనే మాట్లాడాను. అయితే వారికి వైద్యం మీద ఆసక్తి లేదన్నారు.

జీలుగ చెట్టు గురించి ఒక విషయం చెప్పాలి. అడవిలో ప్రయాణించేవారికి జీలుగ చెట్టు దిక్సూచి లాంటిది. జీలుగ చెట్టు ఎత్తుగా ఉంటుంది. దూరం నుండి చూసినా ప్రత్యేకంగా కనిపిస్తుంది. సాధారణంగా జీలుగ చెట్టు పరిసరాల్లోనే ఆదివాసుల ఆవాసాలుంటాయి. వేసవిలో అయితే, జీలుగ చెట్టు కిందే వాళ్ళు జీవితాన్ని గడుపుతారు.

వెజిటబుల్ సలాడ్స్, చైనీస్ ఫుడ్స్‌లో మనం వినెగర్ వాడుతుంటాం. ఆహార పదార్థాలు వెంటనే చెడిపోకుండా వినెగర్ ఉపయోగపడుతుంది. పిండి పదార్థాల వల్ల బరువు పెరగకుండా కూడా వినెగర్ ఆపుతుంది. సంకీర్ణ పిండి పదార్థాలు గ్లూకోజుగా మారే క్రమాన్ని వినెగర్ నియంత్రిస్తుంది. ఆ మేరకు అది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపయోగపడుతుంది.

బాగా నీళ్ళు కలిపిన పలుచని ఎసిటిక్ ఆమ్లమే వినెగర్. మనం సాధారణంగా వాడేది సింథటిక్ వినెగర్. సహజమైన వినెగర్‌ను కల్లుతో చాలా సులువుగా, చౌకగా ఇళ్ళలో తయారు చేసుకోవచ్చు.

వినెగర్‌ను సంస్కృత, అరబ్బీ భాషల్లో సిర్క అంటారు. ఆయుర్వేద యునాని వైద్య రీతుల్లో సిర్క తయారీ (జైమోలజీ) వివరాలున్నాయి. ద్రాక్ష, నేరేడు, యాపిల్, ఖర్జూర, తదితర పళ్ళతో సిర్కా చేయవచ్చు. తాటి కల్లుతో సిర్కా చేయడం చాలా సులువు. వేసవిలో తాటికల్లు విరివిగా దొరుకుతుంది. సిర్కాకు పోతు(మగ తాటి చెట్టు) కల్లు మంచిది. మా ఇళ్ళలో ఏడాది పొడవునా సిర్క వాడేవాళ్ళు. మా అమ్మ ప్రతి వేసవిలో సిర్క చేసేది.

తయారీ విధానం : 1. ఒక కొత్త కుండలో మూడు వంతులు తాటికల్లు పోసి, మూతిని పలుచటి గుడ్డతో కట్టాలి. 2. ఎండ నేరుగా పడేచోట, ఒక గొయ్యి తవ్వి, మూతి మాత్రమే పైకి ఉండేలా కుండను గోతిలో పూడ్చాలి. 3. మూతను రేగడి మట్టితో కప్పాలి. 4. 40 రోజుల తరువాత కల్లు పులిసి, ఇగిరి సిర్కగా మారిపోతుంది. 5. కుండను పైకి తీసి, సిర్కను వడగట్టి సీసాల్లో నింపుకుని నిల్వ చేసుకోవాలి.

హెచ్చరిక : మొత్తం ప్రక్రియలో ఎక్కడా నీళ్ళు తగలరాదు.

– ఉషా యస్ డానీ

ఆత్మల భాషను అందించిన దుబాసీ

వివిధ దేశాల్లో, వివిధ రంగాల నుండి చెప్పుకోదగిన ఏభై మంది – జీవితంలో పరిణిత దశకు చేరాక, జీవితానుభవంలో పండిపోయాక, జీవితంలోని సౌందర్యకోణాన్ని దర్శించాక, ఒక సారాంశాన్ని, ఒక స్పష్టతని, తత్వాన్ని అర్థం చేసుకున్నాక వాటన్నిటి గురించి మనతో ఒక మృదుస్వరంతో మాట్లాడితే ఎలా ఉంటుంది? – మాధవ్ శింగరాజు వినిపించిన 'అభౌతిక స్వరాన్ని' వింటే ఆ అనుభవం ఎలాంటిదో తెలుస్తుంది.

ఒక శాస్త్రవేత్త, శిల్పి, రచయిత, సాహస యాత్రికుడు, సామాజిక సంస్కర్త, ఆదివాసీ పోరాట నాయకుడు, ఒక ప్రాచీన చక్రవర్తి, సమకాలీన రాజకీయవేత్త, ఒక వ్యోమగామి, ఒక సంగీత విద్యాంసుడు, ఒక మౌన ఋషి తమ అభౌతిక స్వరంతో మనల్ని స్పృశిస్తే ఎన్నో కథలు, ఎంతో కవిత్వం, మరెంతో ప్రాపంచిక జ్ఞానం, ఫిలాసఫీ, సౌందర్యాల సారం మన కనుల ముందు పేజీలుగా, స్వగత కథనాలుగా ఆవిష్కారం కావటం ఒక అలౌకిక అనుభవం.

ఇన్ని ఆత్మ కథనాత్మక కథల్ని, వారి అనుభవాలని తానే జీవించినట్లు రాయడం మాధవ్ శింగరాజుకి ఎలా తెలుసో తెలుసుకోవాలని ఉంది. వ్యక్తుల గురించి మామూలు వివరాలూ, వారి గొప్పతనం, వారి అలవాట్లు, అభిరుచులు వంటి సమాచారం మనకెక్కడైనా దొరకవచ్చు. కాని ఎంచుకొన్న ప్రతీ వ్యక్తి జీవన సారాంశాన్ని ప్రతిఫలింప చేయడం, దానినొక సృజనాత్మక రచనలా మలచడం ఈ పుస్తకంలో మనకు కనిపిస్తుంది.

ఇందులో మనల్ని ఆకర్షించి లొంగదీసుకునే అనేక అంశాల్లో రచయిత వచనం మొదటిది. సూటిగా, సరళంగా, సంక్షిప్తంగా, తాత్వికంగా, తార్కికంగా ఉంటూ ఎంతో అందంగా కనిపిస్తుంది. 'కవీ! నీ గొంతు ముడివిప్పి పాడు, రవిక ముడివిప్పి పాలిచ్చే తల్లిలా!' అని అంటున్నప్పుడు మనిషి పట్ల అలాంటి ప్రేమ ఏదో ఈ రచయితకు ఉండడం వల్లనేమో, ప్రతి పదాన్నీ తన రక్తమాంసాల్లో ముంచి తీసి అకల్మషంగా, సజీవంగా, ప్రాణతుల్యం చేసి గానం చేశాడు. తెలుగులో ఇలాంటి పుస్తకాలు అరుదు. బహుశా ఈ పుస్తకం వెనక ఎన్నో సంవత్సరాల తపస్సు దాగి ఉంటుంది. పుస్తకం చదివిన వ్యక్తిలో మనుషుల పట్ల, రచయిత పట్ల అదే స్థాయిలో ప్రేమ కలగటం రచయిత అదనంగా మనకందిస్తున్న మరో అందమైన కానుక.

– కాకుమాని శ్రీనివాసరావు

అభౌతిక స్వరం
(Autobiographical vignettes of great men and women)
రచన: మాధవ్ శింగరాజు
పేజీలు: 300, వెల: రూ. 150/–
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్,
హైదరాబాద్–27 ఫోన్: 040–2465 2387

తేటగీతిలో హాలుడి కావ్యం

గాథా త్రిశతి అంటే 300 గాథలు గల గ్రంథం అని అర్థం. ఒకటవ శతాబ్దిలో శాతవాహన చక్రవర్తి హాలుడు సేకరించిన ప్రాకృత గాథల సమాహారమే 'గాథా సప్తశతి'. అందులోని 300 గాథల్ని తెలుగులోకి అనువదించారు నరాల రామారెడ్డి. భారతీయ కావ్య సాహిత్యంలో అత్యుత్తమంగా చెప్పదగ్గ మొదటి పది రచనల్లో ఇది ఒకటి. ఆధునిక సాహిత్యకారుల్లో ప్రముఖ విమర్శకులు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'గాథా సప్తశతి' పేరుతో 700 గాథలను తెలుగులోకి అనువదించారు. రాళ్ళపల్లి అనువాదంలో కందమూ, తేటగీతీ, ఆటవెలది ఉంటే, రామారెడ్డి ఒక్క తేటగీతితోనే తెలుగు చేసారు. రాళ్ళపల్లి మూలభాష నుంచి చేస్తే రామారెడ్డి సంస్కృతం నుంచి అనువాదం చేసారు.



గాథా త్రిశతి (శాలివాహన ప్రాకృతగాథలకు ఆంధ్రానువాదం), నరాల రామారెడ్డి
వెల : రూ. 120, పేజీలు : 166
ప్రతులకు : విశాలాంధ్ర

ఓ పరిశోధకురాలి ఆత్మకథ

వకుళాభరణం లలిత వృత్తిరీత్యా అధ్యాపకురాలు. నేరస్థ జాతులమీద, దేవదాసీ, జోగినీ వ్యవస్థల మీద పరిశోధన చేసారు. స్త్రీలలో జీవిత చరిత్రలు రాసిన వారు తక్కువ. ఆ రాసినవారు కూడా మేధావులో, ఉద్యమకారిణిలో అయివుంటారు. 1950 దశకంలో స్త్రీ విద్యకు అంతగా ప్రోత్సాహం లేని రోజుల్లో ఈమె చదువుకున్నారు. నెల్లూరు జిల్లా కావలి కళాశాలలో తాను ఇంటర్మీడియట్‌లో చేరినప్పుడు 120 మంది విద్యార్థులలో ఏడుగురుమాత్రమే విద్యార్థినులనీ, నాటి పరిస్థితులను రాబోయే తరాలవారికి తెలియజేయాలనే సంకల్పంతోనే ఆత్మకథ రాయడానికి పూనుకున్నానని ఆమె వివరించారు. విముక్త జాతులపై పరిశోధన ముఖ్యంగా పి.కె. భౌమిక్ (కలకత్తా విశ్వవిద్యాలయం) వద్ద చేయడం తన అదృష్టంగా ఇందులో చెప్పుకున్నారు.

నా జ్ఞాపకాలు, వకుళాభరణం లలిత
వెల : రూ. 80, పేజీలు : 166
ప్రతులకు : 0866–2436643

పప్పులు బెల్లాలు మరికొన్ని...

'ఒరులేయవి యొనరించిన ...' అంటే ఇతరులు ఏపనులు చేస్తే మనం నొచ్చుకుంటామో ఆ పనుల్ని మనం చెయ్యకుండా ఉండడమే పరమ ధర్మమని విదురుడు చెప్పిన మాటలతో ప్రారంభమై, 'యత్నించి చూడు రాళ్ళ రాసులలోన రవ్వకాగలవు' అన్న బోయి భీమన్న సూక్తితో తిరుపతిలోని కీర్తి కోవెల ప్రచురణల సంస్థ పిల్లలకు 'పప్పులు బెల్లాలు' పంపకాన్ని ప్రారంభించింది.



'పప్పులు బెల్లాలు' ... అనే పదం వినగానే పిల్లల కోసమే కదా అనుకుంటాం... అందుకే రచయిత తల్లితండ్రులకీ, టీచర్లకీ కూడా అని టాగ్ తగిలించాడు. ఈ పుస్తకం ముందుమాటలలో రచయిత, ఆయన సాహిత్య గురువు ప్రకటించుకున్న ఉద్దేశాలు హర్షణీయమే అయినప్పటికీ పుస్తకం లోపలికి వెళితే ఆ లక్ష్యం నెరవేరదేమో ననిపిస్తుంది. కథలు, కవితలు, ఉపన్యాసాలతో పిల్లలకు బుద్ధులు, సుద్దులు చెప్పడంతో పుస్తకం కాస్త బరువెక్కింది. అయినా మోయాల్సిన బరువే .

''పద్మ సరోవరంలో విరిసే పుష్పాల్లాంటి పిల్లల మధ్య గడిపితే కావలిసినంత ఆరోగ్యం, ఆహ్లాదం దొరుకుతున్నాయి.'' అందుకే కోట పురుషోత్తం ఆ సరోవరంలోనే కాలం గడుపుతున్నాడని సాకం నాగరాజు కితాబిచ్చి లక్ష కాపీలతో ఈ పప్పులు, బెల్లాలు పిల్లలకు ఉచితంగా పంచి పెట్టిస్తున్నాడు. అవి మీకు కూడా కావాలంటే వంద రూపాయల ధర పెట్టాల్సిందే.

– ఆర్.శ్రీకృష్ణ ప్రసాద్

పప్పులు బెల్లాలు, కోట పురుషోత్తం
పేజీలు : 94, వెల : రూ. 100
ప్రతులకు : విశాలాంధ్ర

సుందర వ్యాఖ్యానం



ఎంపిక చేసిన జాషువా పద్యాలను సంకలనం చేసి, తనదైన పద్ధతిలో వ్యాఖ్యానాలు జోడించారు లాబన్‌బాబు ఈ పుస్తకంలో. ముఖ్యంగా జాషువా కవిత్వంలో భావుకత, రసజ్ఞతలపై ఆయన దృష్టి కేంద్రీకరించారు. ఇందులో (జాషువా) కవితా వైభవం, మానవతావాదం, నివాళులు–నీరాజనాలు, హాస్య వల్లరి, తాత్విక చింతన అని మొత్తం అయిదు అధ్యాయాలున్నాయి.

జాషువా ఆణిముత్యాలు, తాళ్లూరి లాబన్‌బాబు
వెల : రూ 60, పేజీలు : 126
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్

స్వీకారం

కళాప్రపూర్ణ పూర్ణచంద్రిక
కూర్పు : డా. కొల్లోజు కనకాచారి
పేజీలు : 214,
ప్రతులకు : 98486 29811

★★★

కవితల ఝరి–పాటల సిరి
రచన : మద్దాళి వెంకటేశ్వరరావు
పేజీలు : 58, వెల: రూ. 72
ప్రతులకు : 98483 81202

★★★

రసఝరి (ఔత్సాహిక కవితా సంపుటి)
రచన : కిరణ్ సిస్టర్స్
పేజీలు : 170, వెల: రూ. 80
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

★★★

చిరుగజ్జెలు (బాలల గేయాలు)
రచన : డా. వడ్డేపల్లి కృష్ణ
పేజీలు : 94, వెల: రూ. 35

అంతరించిన ఆదర్శాలు (కథల సంపుటి)
రచన : రేగులపాటి విజయలక్ష్మి
పేజీలు : 76, వెల: రూ. 50, లైబ్రరి : రూ.75

సంస్కారం కథలు (కథల సంపుటి)
రచన : రేగులపాటి కిషన్‌రావు
పేజీలు : 154, వెల: రూ. 55, లైబ్రరి : రూ.100
ప్రతులకు : విశాలాంధ్ర

★★★

చిత్రాంగి (చారిత్రాత్మక పద్యనాటకం)
రచన : తుర్లపాటి రామచంద్రరావు
పేజీలు : 72, వెల: రూ. 40
ప్రతులకు : 99125 43702



★★★

భారతదేశపు శక్తి
రచన : ఎపిజె అబ్దుల్ కలాం
పేజీలు : 77, వెల: రూ. 99
ప్రతులకు : 0891–6671043

ఆర్తి గల వ్యాసాలు



వేమన, నారాయణగురు ప్రజాయోగులు అనే వ్యాసంతో పాటు, సమకాలీనులైన సినారె, సి.రామచంద్రరావు, ఓల్గా, పాపినేని, బాలశౌరిరెడ్డి తదితరుల సాహిత్యం గురించి వివిధ సందర్భాల్లో రాసిన 15 వ్యాసాలున్నాయి ఇందులో. వీటన్నిటిలోకి 'నక్క ఆండాళమ్మ' గురించి రాసిన వ్యాసం ఆర్తితో, తీరని దుఃఖంతో ఉంటుంది.

వ్యాస సంకలనం, డా ఎన్.గోపి
వెల: రూ 100, పేజీలు: 100
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్

కృష్ణం వందే జగద్గురుం

మైనింగ్ మాఫియా కథాంశంగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'కృష్ణం వందే జగద్గురుం'. హీరో రానా బీటెక్ బాబుగా, నాటకాల రాయుడిగా ఇందులో నటిస్తున్నారు. నయనతార హీరోయిన్. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దీనితోనైనా ఈ 'లీడర్' 'గమ్యం' చేరుకుంటాడా లేదా అనేది వేచి చూడాల్సిందే!

RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED, Head Office & Regd. Office: BANGALORE. Mfg. Units: Channapatna (KA), Tiruchirapalli (TN)

HYDERABAD:
5/5-93 & 94, 2ND FLOOR, SHIVA CHAMBERS, RANIGUNJ,
SECUNDERABAD - 500 003
Phone No. 040-27700840/27700841, 27711239/2274 , FAX: 040 27700841,
E:powerzenhyd@gmail.com,
MR. M D PRASAD : 0 98486 15020 ,
MR. RAMESH : 0 98486 15026

VIJAYAWADA:
#40-22, MOGALRAJ PURAM, BSRK COMPLEX
VIJAYAWADA - 520 010
KRISHNA DISTRICT,
ANDHRA PRADESH.
Phone No. 0866 2492838/ 2492848
powergenvja@gmail.com
MR. AVINASH, 0 95538 33444
0866 2492838

VISAKAPATANAM:
GROUND FLOOR, #48-6-33,
RAMA TALKIES SIDE ROAD, SRINAGAR,
VISAKAPATNAM - 530 016
Phone No. 0891-3012009 / 2791602 /
0 98487 88816
rapowergenvizag@gmail.com
Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814,
Mr. SHARVAN : 0 98487 88815

KURNOOL:
P.O. No. 14, APSP SHOPPING COMPLEX,
NEAR BELLARY CHOWRASTRA,
KURNOOL - 518 002, Phone No. 08518 - 256700
kurnool@rapowergen.com
Mr. D.K. KISHORE :0 99486 71600

ANANTHAPUR:
Mr.G.T.PRABHAKAR : 0 98486 02300

Other State Branches: Hubli | M'lore | Pune | Kochi. Tamil Nadu: Chennai | Madurai | Coimbatore | Tirunelveli

21 అక్టోబర్ 2012

ఆదివారం ఆంధ్రజ్యోతి

కవర్‌స్టోరీ

ఇలా మొదలైంది

2 పండగ
దసరా భారతీయం

3 కవిత
మా ఊరెళ్ళాలి

6 హ్యాపీడేస్
వంశీ పైడిపల్లి

Powered By
ASHOK LEYLAND

Compact
Most Fuel Efficient
Minimum Maintenance Expenses

Exclusive, Most trusted & No.1 OEA of Ashok Leyland

RAPOWER GENERATORS

10kVA to 2000 kVA DIESEL GENERATORS

RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED, Head Office & Regd. Office: BANGALORE. Mfg. Units: Channapatna (KA), Tiruchirapalli (TN)

HYDERABAD: MR. M D PRASAD : 0 98486 15020, MR. RAMESH : 0 98486 15026 | VIJAYAWADA: MR. AVINASH, 0 95538 33444, 0866 2492838 VISAKAPATANAM: Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814, Mr. SHARVAN : 0 98487 88815 | KURNOOL: Mr. D.K. KISHORE :0 99486 71600 | ANANTHAPUR: Mr.G.T.PRABHAKAR : 0 98486 02300

www.rapower.in

దసరా, నవరాత్రి ఉత్సవ్, దుర్గాపూజ, శారదోత్సవ్.. ఇలా పేరేదైనా కాని.. పండగ మాత్రం ఒక్కటే! దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలలో జరుపుకునే పెద్ద పండగ దసరా. ప్రాంతాన్ని బట్టి, అక్కడి సంస్కృతిని బట్టి వేర్వేరుగా చేస్తున్నా.. భిన్నత్వంలో ఏకత్వం చూపిస్తున్న ఈ పండగ పరమార్థం ఒక్కటే.. దుష్టశక్తులను సంహరించి.. విజయ శక్తిని ఆహ్వానించడం. ఇంత ప్రముఖమైన దసరాను మన దేశంలోని బెంగాల్, మైసూర్, ఢిల్లీ, ఒడిశా, గుజరాత్, వారణాసి, కులు ప్రాంతాలలో ఎలా చేస్తారో చెప్పేదే ఈ కథనం...

దసరా భారతీయం

బెంగాల్‌లో ఊరేగింపు

బెంగాలీలకు అతి పెద్ద పండగ దుర్గాపూజ. సప్తమి, అష్టమి, నవమి తిథులలో దుర్గామాతకు రకరకాల పూజలు చేస్తారు. అన్ని చోట్లా ఉన్నట్లే.. బెంగాల్‌లోనూ దసరాకు సంబంధించిన రెండు కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఒకటి– మహిషాసురున్ని దుర్గాదేవి సంహరించడం. రెండోది– రావణాసురున్ని రాముడు వధించడం. ఇవే జానపద కథలుగా, భజనలుగా అక్కడ ప్రసిద్ధి చెందాయి.

పండగ జరిగే తొమ్మిది రోజులూ హరికథలు, బుర్ర కథలు, పురాణశ్రవణంతో రాష్ట్రమంతా సందడి సందడిగా ఉంటుంది. ఉత్సవాలలో చివరి రోజున.. భక్తులు కాళీమాతను దర్శిస్తారు. ఆ తర్వాత దుర్గామాతను హుగ్లీ నదిలో నిమజ్జనం చేస్తారు. సమైక్యభావాన్ని పెంపొందించేందుకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేస్తారు. దసరాను విజయానికి శుభసూచకంగా భావిస్తారు కనక.. వ్యాపారులు, సంగీతకారులు, పుస్తకవిక్రేతలు.. అందరూ తమ తమ కొత్త వస్తువులను, పుస్తకాలను, మ్యూజిక్ ఆల్బమ్స్‌ను ఆ రోజుల్లోనే విడుదల చేస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు కూడా ప్రతి దసరాకు తమ ఉద్యోగులకు బోనస్‌లు ప్రకటిస్తాయి. రాష్ట్రం మొత్తం దసరా సెలవుల్లో మునిగిపోతుంది. ప్రజలందరూ మరో వ్యాపకం పెట్టుకోకుండా పండగ సంబరాల్లో మునిగిపోతారు.

మైసూర్‌లో రాయల్ పండగ..

దసరా వచ్చిందంటే చాలు. మైసూరు మహారాజ భవనం వెలుగులు దేశమంతా పరుచుకుంటాయి. రాజ దర్పం ఉట్టిపడే రీతిలో ముస్తాబవుతుంది ఈ పట్టణం. రాజభవనం, ఆలయాలు, చారిత్రక కట్టడాలు, విడిది కేంద్రాలు అన్నీ ప్రత్యేకంగా అలంకరించిన విద్యుత్‌దీపాలతో కళకళలాడతాయి. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచే కాక విదేశీయులు సైతం తరలివస్తారు. దసరా అనగానే మైసూరే గుర్తుకొచ్చేంత స్థాయిలో ఈ పండగ జరగడమే ఇందర్ని ఆకర్షించడానికి కారణం.

మైసూరు దసరాకు నాలుగొందల ఏళ్ల చరిత్ర ఉంది. పదిహేనవ శతాబ్దంలో విజయనగర రాజులు ప్రారంభించిన ఉత్సవాలు ఇవి. వారి సామ్రాజ్యం పోయాక.. మైసూరు వడయార్లు దానిని కొనసాగించారు. మొదటి రాజా వడయార్ దీనికి ఆద్యులు. చాముండేశ్వరికి పూజలు చేయడంతో ఆరంభం అవుతుంది ఇది. విజయదశమి రోజున అంబారీ మీద అమ్మవారిని ఊరేగిస్తారు. చూడముచ్చటగా అలంకరించిన ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు వీధుల్లో వెళ్లే ఆ దృశ్యం అపురూపం. పురవీధులన్నీ కోలాహలంతో నిండిపోతాయి. కోలాటం, చెక్కభజనలు, జానపద నృత్యాలు సరేసరి. నవరాత్రుల్లోనే ఒక రోజు రాజభవనంలో ప్రత్యేక దర్బారును నిర్వహించడం ఆనవాయితీ. రాజులు పాలించిన ఆ రోజుల్లో.. ఈ దర్బారుకు రాచకుటుంబీకులు, ముఖ్యమైన అతిథులు, బ్రిటిష్ ఉన్నతాధికారులు, ప్రజలు హాజరయ్యేవారు. ఆ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. చామరాజ వడయార్ ప్రారంభించిన ఎగ్జిబిషన్‌ను కూడా ఏటా ఏర్పాటు చేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని వస్తువులనూ ఇందులో విక్రయిస్తారు వ్యాపారులు. ప్రస్తుతం కర్ణాటక ఎగ్జిబిషన్ అథారిటీ దీని బాధ్యతలు చూస్తోంది. కేవలం దసరా ఉత్సవాలకే కాదు.. చారిత్రక పట్టణమైన మైసూరు పచ్చదనానికీ, అద్భుతమైన శిల్పకళ కలిగిన దేవాలయాలకు ప్రసిద్ధి కావడంతో.. పర్యాటకుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది.

రామ్‌లీలామైదాన్‌లో రావణ వధ..

ఉత్తరాదిలో దసరాకు పేరెన్నికగన్నది రామ్‌లీలా మైదాన్. ఢిల్లీ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ మైదానం విజయదశమి రోజున ఇసకేస్తే రాలనంత జనంతో కిటకిటలాడిపోతుంది. 1930 ముందు ఈ మైదానం ఒక పెద్ద సరస్సు. ఆ తర్వాత క్రీడామైదానంగా మారింది. గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి నాయకులందరూ రామ్‌లీలా మైదాన్‌లో రాజకీయ సభలను నిర్వహించేవారు. ఇప్పటికీ భారీ బహిరంగ సభలు జరుగుతుంటాయి. పండగలకు, ఉత్సవాలకు కూడా వేదికగా మారింది ఈ ఆటస్థలం. దసరా రోజున జరిగే రావణ దహనానికి ఇదే కేంద్రం. రాముడు రావణాసురున్ని సంహరించినందుకు గుర్తుగా ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా చేస్తారు ఉత్తరభారతీయులు. భారీస్థాయిలో మందుగుండు పేలుస్తూ.. జనం కేరింతల మధ్య సాగుతుంది ఈ కార్యక్రమం. ఢిల్లీలో దసరా ప్రారంభమైన నాటి నుంచి అమ్మవారికి ఒక్కో రోజు ఒక్కో అలంకరణ చేస్తారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే దేవతగా దేవిని ఆరాధిస్తారు. చాలాచోట్ల మండపాలను ఏర్పాటు చేసి.. విగ్రహాలను భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.

గుజరాత్‌లో పసుపు శోభ..

గుజరాత్‌లో ఇళ్ల గోడల మీద పసుపు వర్ణపు రాతలు, బొమ్మలు ఉన్నాయంటే దసరా వచ్చినట్లే లెక్క. శ్రీచక్రం, త్రిశూలం, శక్తి ఆయుధాల బొమ్మలు పండగ శోభను చిత్రీకరిస్తాయి. మనం పండక్కి ఇంటి ముందు అలికి ముగ్గులేసుకున్నట్లు.. గుజరాతీలు గోడల మీద రాసి వేడుకల్ని చేసుకోవడం ఎప్పటి నుంచో వస్తున్నది. దసరా రోజు పొద్దున్నే పొలాల్లోకి వెళ్లి మట్టిని తీసుకొస్తారు. ఆ మట్టిని కుండల్లో నింపి... దాని మీద బార్లీ, గోధుమ గింజల్ని చల్లుతారు. అందులో రాగి లేదా వెండి నాణెం వేస్తారు. అలా అలంకరించిన మట్టికుండను దేవిగా ఆరాధించడం గుజరాతీల ఆచారం. దీన్నే కుంభీ ప్రతిష్ట అని పిలుస్తారు. అష్టమినాడు యజ్ఞం, దశమి నాడు నిమజ్జనం చేయడం పండగలోని ముఖ్య ఘట్టాలు. ఇవన్నీ పూర్తయ్యాక మహిళలంతా కలిసి 'గర్బా' అనే ఉత్సవంలో పాల్గొని పాటలు పాడతారు. అచ్చం తెలంగాణలో బతుకమ్మ పండగనే పోలి ఉంటుంది ఈ దసరా ఉత్సవం. దుర్గ, పార్వతి ఒకరే అయినా రెండు రూపాల్లోనూ అమ్మవారిని పూజిస్తారు.

ఒడిశాలో పండగలే పండగలు..

దసరాకు ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరు ఉన్నట్లే.. ఒడిశాలోనూ బోలెడు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అకల్‌బోధన్, దుర్గాపూజ, షోడశ ఉపాసన, దుర్గోత్సవ్, శారదోత్సవ్.. పేర్లతో దసరా సంబరాలు జరుగుతాయి. మార్చి నుంచి నవంబరు వరకు పండగల వాతావరణమే తలపిస్తుంది. మార్చి–ఏప్రిల్ మధ్య చైత్ర దుర్గాపూజ, సెప్టెంబరు–అక్టోబరు మధ్య శారదీయ దుర్గాపూజ, అక్టోబరు– నవంబరు మధ్య కాళీపూజలు చేస్తారు. దసరాకు పల్లెల్లో 'రామ్‌లీల' అనే జానపద నాటకాన్ని ప్రదర్శిస్తారు. రాజుల ఆహార్యాన్ని తలపించే దుస్తులు, ధగధగలాడే కిరీటాలు, గిల్టునగలు పెట్టుకుని రాముని కథను కళ్లకు కడతారు కళాకారులు. పండగ చివరి రోజున రావణున్ని దహనం చేస్తారు. దీన్ని 'రావణ్ పోడి' అంటారక్కడ. ఒడిశాలోని భువనేశ్వర్, కటక్, బాలాసోర్, పూరిలలో దసరాను ప్రముఖంగా జరుపుకుంటారు. అక్కడక్కడ పల్లెల్లో బుల్‌ఫైట్‌లతో ఆనందిస్తారు గ్రామీణప్రజలు.

ఒడిశావాసులు దసరాకు లక్ష్మీదేవిని కూడా పూజిస్తారు. కటక్ కళాకారులు తయారు చేసిన దుర్గామాత విగ్రహాలను వీధుల్లో నిలబెడతారు. పూజల్లో ధాన్యాన్ని వాడతారు. 'మానబాన' అని పిలిచే ఈ సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది.

వారణాసి, కులులోయలో..

వారణాసికి రెండు కి.మీ. దూరంలో ఉన్న దుర్గాదేవి ఆలయం దసరాకు కిటకిటలాడుతుంది. పద్దెనిమిదవ శతాబ్దానికి చెందిన ఈ ఆలయాన్ని.. బెంగాలీ మహారాణి ఒకరు నిర్మించారు. ఇది పూర్తిగా నాగర శైలితో కట్టిన కట్టడం. ముఖద్వారంలోని ఆర్చి ఎరుపు రంగుతో ఆకర్షిస్తుంది. వారణాసి పర్యాటక ప్రాంతం కావడంతో.. దసరాకు ఇక్కడి హోటళ్లు, లాడ్జిలు, దుకాణాలు ఆఫర్లతో ఊరిస్తుంటాయి.

హోటళ్లలో దసరా స్పెషల్ మెనూలు ప్రత్యేకం. ఈ ఉత్సవాలకు పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

హిమాచల్ ప్రదేశ్‌లోని 'కులు'లోయలోని ధల్‌పూర్ మైదాన్‌కు అక్టోబర్ మాసమంతా పండగే. దసరా ఉత్సవాలతో తీరికలేకుండా ఆనందిస్తుంటారు అక్కడి ప్రజలు. కులు ఉత్సవాలు 17 వ శతాబ్దం నుంచి జరుగుతున్నాయి. పర్యాటకుల్ని ఆకట్టుకునేందుకు దసరాను అంతర్జాతీయ పండుగగా ప్రకటించింది హిమాచల్‌ప్రదేశ్. అప్పటి నుంచి నృత్యాలు, చిత్రలేఖన ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా అన్ని రాష్ట్రాలలో జరిగే దసరా పండగ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతోంది.

మైసూర్‌లో సందడి

కులు లోయలో కొలువైన అమ్మవారు

రామ్‌లీలా మైదాన్‌లో...

ఒడిశాలో ...







కామెంట్

అందుకే మరి...!

రేప్‌లు ఎందుకు జరుగుతాయి?

అమ్మాయిలు ఉన్నారు కనుక.
వాళ్ళు ఒళ్ళు కనిపించేలా బట్టలు వేసుకుంటారు కనుక.
ఒంటరిగా తిరుగుతుంటారు కనుక.
వయస్సులో ఉన్నారు కనుక.
అందంగా ఉంటారు కనుక.
అబలలై ఉంటారు కనుక.
అబ్బాయిల్ని రాసుకుని పూసుకుని తిరుగుతారు కనుక.
అర్ధరాత్రుళ్ళు, అపరాత్రుళ్ళు ఉద్యోగాలు చేస్తుంటారు కనుక.
చీరలు పైకెగ్గట్టి, చేతులు పైకెత్తి పిరుదులూ, వక్షోజాలూ
కనిపించేలా పనులు చేస్తుంటారు కనుక.
ఛాతీ విరుచుకుని నడుస్తుంటారు కనుక.
ముద్దుముద్దుగా మాట్లాడతారు కనుక. స్నేహం చేస్తారు కనుక.
ఆకర్షణీయంగా నవ్వుతారు కనుక. ప్రేమగా చూస్తారు కనుక.
అమాయకంగా ఉంటారు కనుక.
ఆదరంగా మాట్లాడతారు కనుక.
ఇన్ని తప్పులుంచుకుని మరి అబ్బాయిల్ని ఆడిపోసుకోవడమెందుకు?
తప్పనిసరై రేప్ చేస్తున్న వాళ్ళను తప్పు పట్టడం ఎంత ఘోరం! ■

విశేషం

ఈ సర్కారు బడికి భలే డిమాండ్!

ఆ బడికి వేళపాళలు లేవు. గంట కొట్టరు. పీరియడ్ల లెక్కలేవీ లేవు. సెలవులూ ఇవ్వరు. అలాగని నిర్బంధమేమీ లేదు. ఉత్సాహముంటే బడికి రావొచ్చు. లేకపోతే మానేయవచ్చు. కర్రపెత్తనం, కళ్ల బెత్తు ఏవీ ఉండవక్కడ! అయితేనేం? ఇక్కడ చదువుకున్న పిల్లలు చాకుల్లా తయారవుతున్నారు. ఇది ఏ కార్పొరేట్ స్కూలో అనుకునేరు. ఇది జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల. పుణే జిల్లాలోని సిర్పూర్ తాలూకా కార్డెల్‌వాడీ గ్రామంలో ఉంది. స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ ఫెసిలిటీస్‌ను సమకూర్చుకున్న ఈ పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు ఉపాధ్యాయ దంపతులు దత్తాత్రేయ సాకత్, బీబీనంద. ఆయన ఆంగ్లం, ఆమె లెక్కలు బోధిస్తారు. పాఠశాలకు మంచి పేరు తీసుకురావడంతో.. పదిహేన్నేళ్ల నుంచి ఈ భార్యాభర్తలకు బదిలీ అనేదే లేదు.

''మేము టీచర్లుగా వచ్చినప్పుడు ఈ పాఠశాల ఘోరంగా ఉండేది. ఎక్కడ చూసినా కలుగులే. ఎలుకలు పారాడేవి. పిల్లలకు బల్లలు ఉండేవి కావు. మరుగుదొడ్ల మాటే ఎత్తలేము. గ్రామ కమిటీ దృష్టికి తీసుకెళితే ప్రజలు తలా కొంత వేసుకున్నారు. అలా మెల్లగా నిధుల్ని

పోగు చేశాం. ఆ డబ్బుతో పాఠశాల స్వరూపాన్నే మార్చేశాం. చుట్టుపక్కల ఊర్లవాళ్లందరూ ముక్కున వేలేసుకున్నారు. అధికారులు విస్తుపోయారు. ఆడియో విజువల్ టీచింగ్ కోసం – కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఎల్‌సిడి టీవీ, కేబుల్ కనెక్షన్ సమకూర్చుకున్నాం. సంప్రదాయ బోధనా పద్ధతులతో పాటు అత్యాధునిక పద్ధతుల్ని కూడా పిల్లలకు అందిస్తున్నాం. ఇప్పుడు పుణే చుట్టుపక్కల స్టేట్ ఆఫ్ ద ఆర్ట్ ఫెసిలిటీస్ ఉన్న ప్రభుత్వ స్కూలు మాదొక్కటే'' అన్నారు ఉపాధ్యాయ దంపతులు.

ఈ పాఠశాలకు ఇదెలా సాధ్యమవుతుందో తెలుసుకునేందుకు.. ప్రభుత్వం బృందాల వారీగా టీచర్లను అక్కడికి పంపి.. శిక్షణ ఇస్తోంది. దీన్నిబట్టి మనకేం తెలుస్తుంది? తప్పంతా ప్రభుత్వ పాఠశాలలది కాదు. పనిచేస్తున్న టీచర్లది. వాళ్లలో అంకితభావం ఉంటే ఏ పాఠశాలైనా సరస్వతీ నిలయమే అవుతుందని. ■

ఈవారం కవిత

మా ఊరెళ్ళాలి



బొమ్మ: అక్బర్

ఊరెళ్ళాలి!
నగరం నన్ను ఆవహించకముందే ...
మా ఊరెళ్ళాలి.
మొలకను చెట్టుగా చేసిన ఊరు
మట్టిబెడ్డను మడిగా మలిచిన ఊరు
మౌనరాగాన్ని హార్మనీమెట్ల మీద పరుగులెత్తించి
మధురగానంగా స్వరపరిచిన ఊరు

టీకాట పాదాట కోతిపిర్రాట .. సుడ్డాట ..సెర్రాట
బొంగరాలాట ... సిరతా బిళ్ళాట ..
ఎన్నెన్ని ఆటలు నేర్పిందనీ ..
ఆడే ప్రతి ఆటలోనూ బతుకుపోరులో గెలుపు సాధించే
మెలకువ ఒకటి ఉందని చెప్పి
ప్రతి వెన్నెల రాత్రినీ ఒక క్రీడా శిక్షణ శిబిరంగా నిర్వహించిన ఊరు.

నాగావళి, జంఝావతి నదులు రెండూ రెండు హస్తాలుగా
అలల ఉయ్యాల లూపి ... ముత్యంలా కడిగి ముద్దు చేసి
'ఎదురీదాల్సిన జీవితం ముందుందిరా నాన్నా' అని 'ఈత నేర్పిన' ఊరు.
పెదవి విప్పి అడగకుండానే ... గోమాతై గొంతులో పాలధారలు కురిపించి,
మేడిపట్టి మడిలో దిగితే పంటచేనై పలకరించి
ఒడిని 'బడి' చేసి ఎన్నెన్ని కతలు చెప్పిందో.
పాటను దీపంగా అందించి పదిమందిని ఒక్కటిగా
ముందుకు నడిపించడం నేర్పిందీ ..
నడీది గుమ్మాన్ని రంగస్థలి చేసి .. నా ముఖానికి రంగేసి
'జీవితమంటే నాటకమేన్రా కన్నా' అని నన్ను కళాకారుణ్ణి చేసిందీ ..
గుండె గుండెను దండ గుచ్చి, వరస వరసల పిలుపులతో
మనుషుల్ని ముత్యాల సరం చేసిందీ మా ఊరే.
దండలో దారం తెగిపోకముందే మా ఊరెళ్ళాలి.

మాగుంప నడిబ్బాబు
నాడి పట్టి చూడగానే రోగమేదో చెప్పినట్టు
పిడికెడు మట్టి చేతిలోకి తీసుకుని పంటను అంచనావెయ్యడం ..
స్వేదజలంతో మంత్రించి మట్టిని మెతుకు చెయ్యడం,
కొడవలి పట్టే ఒడుపు ... నాగలి పట్టే నేర్పు,
ఆకు తీత ... కావిడి మోత .. ఎన్నెన్ని విద్యలు నేర్పించిందనీ
కష్టపడి నేర్చినవన్నీ కర్ణ విద్యలైపోయాయి
చేతిలోని ఆయుధాలు జమ్మిచెట్టెక్కిపోయాయి
ఆశ్రయమే యిచ్చిందో ... అపహరించుకొచ్చిందో నగరం
అజ్ఞాతవాసపు అర్జునుణ్ణి చేసింది నన్ను.
విమోచనం లేని శాపం నాది.
విరామం లేని ప్రయాణం నాది.
పయనం ముగిసేలోగా మా ఊరెళ్ళాలి.
గుండెజముకు మీటి కాలాన్ని వెనక్కు మళ్ళించాలి.
అలల తీగలు సవరించి కలలగతానికి ప్రవాహాన్ని మళ్ళించాలి.
ఆకుల గలగలల్తో నా ఊపిరి శృతికలిపి
తోటల్లో పరిమళాల స్మృతుల పూలు పూయించాలి.
'ఎన్నో ఏళ్లు గతించినవిగానీ ..' పద్యమెత్తుకుని
నడీది గుమ్మం నాకెదురొచ్చి స్వాగతం పలికేలా
నేను మీ హరిశ్చంద్రుణ్ణని గర్వంగా గుర్తు చేయాలి.
నా పుట్టినూరికి పాటతోనే ప్రణమిల్లాలి.
రంగురంగుల వలలు విసిరి వ్యధామోహంలో
నగరం నన్ను ముంచెయ్యకముందే ...
నగరభూతం భవన దంతాల నడుమ నేనో క్రిమిని కాకముందే
మా ఊరెళ్ళాలి
తల్లి నాగావళి ఒడ్డున పండై రాలి
తిరిగి మొక్కై పచ్చగా చిగురించాలి ..
ఔను ...
ఇప్పుడే .. మా ఊరెళ్ళాలి.

– గంటేడ గౌరునాయుడు , 94414 15182

అక్టోబర్ 21 నుండి 27 వరకు

డా. పి.ఎ. రామన్

మేషం: అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

దైవకార్యాల్లో ప్రముఖంగా పాల్గొంటారు. ఒక శుభకార్యం చేయాలనే ఆలోచన దిశగా ఆలోచనలుంటాయి. శనివారం నాడు ప్రయాణంలో చికాకులు, అసౌకర్యం తప్పవు. చిరు వ్యాపారులకు ఆశాజనకం. పనులు మందకొడిగా సాగుతాయి. ఒప్పందాలు, చెల్లింపుల్లో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు ఆరోగ్య భంగం, చికాకులు అధికం. అమ్మవారిని నీలి శంకుపూలతో పూజిస్తే సంకల్పం నెరవేరుతుంది.

వృషభం: కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

మీ ఓర్పు, నేర్పులకు పరీక్షా సమయం. అవకాశాలు అందినట్టే చేజారిపోతుంటాయి. అయినా పట్టుదలతో యత్నాలు సాగించండి. ఆది, సోమవారాల్లో ఏ పనీ సాగక నిరుత్సాహం చెందుతారు. మీ సంతానం రాక ఉత్సాహం కలిగిస్తుంది. దంపతుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. దైవదర్శనాల్లో చికాకులు అధికం. అమ్మవారికి చేమంతులు, తెల్లనిపూలతో అర్చన శుభం.

మిథునం: మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

వ్యాపారాలు జోరుగా సాగుతాయి. ఎదుటివారిని వాక్చాతుర్యంతో మెప్పిస్తారు. అసాధ్యమనుకున్న పనులు సైతం సునాయాసంగా పూర్తి కాగలవు. మంగళ, బుధ వారాల్లో ఖర్చులు అధికం. కుటుంబంలో అనురాగ వాత్సల్యాలు పెంపొందుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో స్వల్ప చికాకులు తప్పకపోవచ్చు. కార్యసిద్ధికి అమ్మవారిని ఎర్ర మందారాలతో పూజించాలి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

విలువైన వస్తువులు, వాహనం అమర్చుకుంటారు. పొదుపు పథకాల దిశగా ఆలోచనలుంటాయి. కొన్ని పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి. వృత్తి, వ్యాపారాల్లో అనుభవం గడిస్తారు. ఆది, గురువారాల్లో అందిన సమాచారం తీవ్రంగా ఆలోచింపజేస్తుంది. ఉద్యోగస్తులకు ఏకాగ్రత ప్రధానం. అమ్మవారిని మల్లెలు, కనకాంబరాలతో పూజిస్తే సంకల్పం నెరవేరుతుంది.

సింహం: మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆర్థిక లావాదేవీలు, ఉమ్మడి వ్యవహారాలు సమర్థంగా నిర్వహిస్తారు. మీపై వచ్చిన అభియోగాలు తొలగిపోగలవు. ధన వ్యయంతో వ్యవహారాలు ముడిపడి ఉంటాయి. వ్యవహార ఒప్పందాల్లో కుటుంబ సభ్యుల సలహా పాటించండి. మంగళ, శనివారాల్లో పనులు హడావుడిగా ముగిస్తారు. ప్రయాణాల్లో జాగ్రత్త. అమ్మవారిని తెల్ల చేమంతులు, గరుడవర్ధని పూలతో అర్చించిన శుభం, జయం.

కన్య: ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. మీ కష్టానికి తగిన ప్రతిఫలం ముడుతుంది. కొన్ని పనులు సునాయాసంగా పూర్తి చేస్తారు. బంధువులతో సంబంధాలు మెరుగుపడతాయి. గురు, శుక్రవారాల్లో మీ యత్నాలు గట్టుగా సాగించండి. ప్రముఖులతో సంప్రదింపులు ఫలిస్తాయి. ఒక శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. కార్యసాధనకు అమ్మవారిని గులాబీలు, మల్లెలతో పూజించండి.

తుల: చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆత్మీయుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ధనం ఆచితూచి వ్యయం చేయాలి. ఉహించని పెద్ద ఖర్చు తగిలే ఆస్కారం ఉంది. ముఖ్యమైన వ్యవహారాలు స్వయంగా చూసుకోవడం మేలు. శనివారం నాడు ప్రయాణంలో అసౌకర్యం, చికాకులు ఎదురవుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో కొత్త సమస్యలు తలెత్తుతాయి. అమ్మవారిని కనకాంబరాలు, కలువలతో పూజించిన రుణ విముక్తి.

వృశ్చికం: విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలతో హడావుడిగా ఉంటారు. మీ శ్రమ ఫలించకున్నా యత్నించామన్న సంతృప్తి ఉంటుంది. ఆలోచనలతో మనస్థిమితం ఉండదు. ఆత్మీయుల హితవు మీపై ప్రభావం చూపుతుంది. వాగ్వాదాలకు దూరంగా ఉండండి. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో దానికి వ్యయమవుతుంది. లక్ష్యసాధనకు అమ్మవారిని తామరపూలు, నీలి శంకుపూలతో పూజించండి.

ధనస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

రుణాలు తీర్చగల్గుతారు. పొదుపు పథకాల దిశగా ఆలోచనలుంటాయి. మీ ఆంతరంగిక, ఆర్థిక విషయాలు గోప్యంగా ఉంచండి. అయిన వారికి ఒక ముఖ్య సమాచారం అందిస్తారు. షాపు గుమస్తాలు, సేల్స్ సిబ్బంది శ్రమకు తగిన ప్రతిఫలం అందుతుంది. వ్యాపారాల్లో నష్టాలను పూడ్చుకుంటారు. అమ్మవారికి పసుపు గన్నేరు, చేమంతులతో అర్చన చేయించిన శుభం.

మకరం: ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆత్మీయులు, కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. మీ చతురోక్తులు అందరినీ ఆకట్టుకుంటాయి. ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. కొత్త పథకాలతో ముందుకు సాగుతారు. కొందరు మిమ్మల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. స్త్రీల ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. మల్లెలు, చామంతులతో అమ్మవారికి అర్చన అవివాహితులకు శుభదాయకం.

కుంభం: ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం లభిస్తుంది. పెద్దల ఆశీస్సులు పొందుతారు. ఖర్చులు అధికమైనా ఇబ్బంది ఉండదు. మంగళ, బుధవారాల్లో అనవసర జోక్యం తగదు. మీ పనులు, కార్యకలాపాలు హడావుడిగా ముగిస్తారు. స్త్రీలకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. వాహన చోదకులకు ఏకాగ్రత ప్రధానం. సంతాన పురోభివృద్ధికి అమ్మవారిని గులాబీలతో పూజించండి.

మీనం: పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ప్రయత్నపూర్వకంగా కొన్ని వ్యవహారాలు అనుకూలిస్తాయి. బంధుమిత్రులకు మీరంటే అభిమానం ఏర్పడుతుంది. మీ శ్రీమతి ప్రోత్సాహంతో ఒక శుభకార్యానికి యత్నాలు ప్రారంభిస్తారు. గురు, శుక్ర వారాల్లో కొత్త సమస్యలు తలెత్తే సూచనలున్నాయి. కొన్ని పనులు అర్ధంతరంగా ముగించాల్సి వస్తుంది. ఖర్చులు పెరుగుతాయి. అమ్మవారిని తెల్లని పూలతో అర్చించిన శుభం, జయం.

అంకెలతో అదృష్టం

ఐ.బి. సాహు
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.....
2. పుట్టిన తేదీ .....

(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)

3. పుట్టిన సమయం .....
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు .....
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

ఎ.సి.ఆర్., అహ్మద్‌నగర్

వైబ్రేషన్స్ ప్రకారం నా పేరు ఏ వైబ్రేషన్‌లో ఉండాలో తెలియజేయగలరు. నా ప్రమోషన్ విషయం వివరించగలరు.

మీ జన్మ వివరాలను బట్టి మీ వరకు పనిచేసే ప్రత్యేక వైబ్రేషన్ 8. ఈ వైబ్రేషన్‌ను సపోర్ట్ చేసే మరొక వైబ్రేషన్ 7. వీటికి అనుసంధానంలో ఉన్న వైబ్రేషన్ 4. మీ వైబ్రేషన్స్ గణన జరిగిన రోజున ఉన్న వైబ్రేషన్ 6. హార్మోనిలో లేని వైబ్రేషన్ 2. ఇన్ఫ్లుయెన్స్ కాబడుతున్న వైబ్రేషన్స్ 3,5,8,1. అసోసియేటివ్‌గా ఉన్న వైబ్రేషన్ 1. ఇక ఈ వైబ్రేషన్స్‌లో హార్మోనిగా ఉన్న వైబ్రేషన్స్ 4,8. న్యూట్రల్‌గా ఉన్న వైబ్రేషన్ 6. పదే పదే తమ శక్తిని పెంచుకున్న వైబ్రేషన్స్ 7,3. కాబట్టి ప్రత్యేక వైబ్రేషన్ 8. మీకు పాజిటివ్ శక్తిని ఇవ్వలేదు. ఈ అంశాన్ని మరింతగా బలపరిచేది 7వ వైబ్రేషన్ అందువలన నష్టాలు తప్పనిసరి. 3వ వైబ్రేషన్ సమస్యలు, డిప్రెషన్‌కు కారణం. న్యూట్రల్‌గా 6వ వైబ్రేషన్ పొజిషన్‌లో లాస్, ఎలివేట్ కాబడకపోవడం తద్వారా ఫిజికల్ స్ట్రెస్. ఇదే అంశాన్ని బలపరిచే అసోసియేటెడ్ వైబ్రేషన్ 1 మరింత ధృవీకరిస్తుంది.

క్లుప్తంగా మీ ప్రమోషన్ తృటిలో మిస్ అవుతుంది. ఆర్డర్‌లో ఎంత మొదటి స్థానంలో ఉన్నా మీ వైబ్రేషన్స్ సహకారం లేదు కాబట్టి మీకు ప్రమోషన్ అందడం కష్టం. అదేవిధంగా 7 మరియు 1 వైబ్రేషన్లలోని అసమతుల్యత మీకు ట్రాన్స్‌ఫర్ అవకాశాన్ని ఇవ్వలేవు. ఇక ఆరోగ్య విషయంలో చింత అవసరం లేదు. ఫీ రీ ఎంబర్స్‌మెంట్ వంటి అవకాశాన్ని మీరు ఉపయోగించుకోలేరు. ఇక నెక్స్ట్ అవకాశం అందుకోవడానికి మీ పేరును బలంగా మార్చుకోవలసిందే. ముందుగా నెగెటివ్ శక్తి న్యూట్రల్ చేయవలసి ఉంటుంది. ఆపై మీ పేరు పాజిటివ్ శక్తి పెంచే స్థాయిలోకి మార్చవలసి ఉంటుంది. మీరు వ్యక్తిగతంగా వచ్చి పేరులో మార్పు తీసుకొనవచ్చును.

ఎల్.కె., తిరునల్వేలి

ఏ పని చేసిన కాని కలిసి రాదు. వ్యాపారం చెయ్యాలని కోరిక. ఇప్పుడు చేసే ఉద్యోగంలో చాలా బాధలున్నాయి. నేను వ్యాపారం చెయ్యవచ్చా. నా పేరును సరిచేయగలరు.

మీ ఛార్ట్‌లో వైబ్రేషన్స్ మీకు ఉద్యోగ స్థిరత్వాన్ని ఇవ్వవు. అందువల్ల ఈ రకమైన ఆలోచనలు రావడంలో తప్పు లేదు. వ్యాపారం రెండు రకాలు. పెట్టుబడితో, పెట్టుబడి లేకుండా. పెట్టుబడి సమకూర్చుకోవడం కష్టం. ఉద్యోగం ఆధారంగా లోను సమకూర్చుకోవడం ద్వారా వ్యాపారం ప్రారంభించవచ్చు. ఒక సంవత్సరం పాటు ఉద్యోగం, వ్యాపారం రెండూ నడుపవలసిందే. ప్లాస్టిక్ పరిశ్రమ, టాయ్స్ ఈ రెండు అంశాలలో మీరు వ్యాపారం మొదలుపెట్టవచ్చు. మీ పేరులో 'ఎ' అక్షరం చేర్చి ప్రతిరోజు 230 సార్లు వ్రాయండి. ఇలా ఒక సంవత్సరం పాటు వ్రాయండి. ఈ కోర్స్ వల్ల మీరు వ్యాపారంలో లాభాన్ని సాధించే శక్తి స్థాయికి చేరుకుంటారు. కోర్స్ క్రమ పద్ధతిలో వ్రాయండి.

ఎన్.డి., వాడి

మా అబ్బాయికి వివాహం కావడం లేదు. ఆర్థికంగా స్థిరపడిన కుటుంబమైనా వివాహ ప్రయత్నాలు కుదరడం లేదు. మా అబ్బాయి పేరులో సవరణ అవసరం ఎంతవరకు ఉంది.

మీ అబ్బాయి చార్ట్ ప్రకారం వివాహం 32 సంవత్సరాల తర్వాతే జరుగుతుంది. వివాహం ఆలస్యం కావడానికి మరే అడ్డంకులు లేవు. త్వరగా వివాహం చేయాలనే ప్రయత్నంలో లేనిపోని పొరపాట్లు చేయకండి. మీ అబ్బాయి పేరులో 'కె' అక్షరం చేర్చి కోర్స్ వ్రాయమనండి. 270 సార్లు రోజూ 100 రోజుల పాటు వ్రాయాలి. 9 కోర్స్‌లు వ్రాయాలి. కోర్స్ మధ్యలో విడిచినట్లయితే లేదా వ్రాయనట్లయితే వివాహం మరింత ఆలస్యం అవుతుందని గమనించగలరు. శుభమ్.

యు.ఆర్., సాత్నా

పుట్టిన వివరాలు లేవు. 24 సంఖ్య నాకు ఇష్టమైన సంఖ్య. ఫోటోగ్రఫి అంటే చాలా ఇష్టం. ఎప్పటికైనా సినిమాలలో చేయాలని కోరిక.

మీరు అడిగిన సంఖ్యలలోని కాంబినేషన్ మీ ప్రవృత్తికి అద్దం పట్టే కాంబినేషన్. కాకపోతే 2014 వరకు ఆగవలసి ఉంటుంది. సినిమాలలో పేరు సాధించడానికి మీరు అడిగిన కాంబినేషన్ స్థాయి సరిపోదు. కొన్ని ప్రత్యేకమైన సంఖ్యలు అడిగినపుడు ఈ వివరాలలో సమాధానం చెప్పడానికి అవకాశం ఉంటుంది. ఎవరైనా ప్రముఖ వ్యక్తి ఆశ్రయం సంపాదించగలిగితే మీ కోరిక తీరే అవకాశం ఉంటుంది. ఈ దిశగా మీ శక్తిని మీరు పెంచుకోవచ్చు. ఇందుకుగాను మీ పేరులో 'ఆర్' అక్షరం చేర్చి ప్రతిరోజు 96 సార్లు వ్రాయండి. ఎన్ని రోజులు వ్రాస్తే అంత శక్తి మీరు సాధించగలరు. శుభమ్.

Advt

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా : అంకెలతో అదృష్టం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 033.

మాయాజాలం

★ డా. ఎం. హరికిషన్

''సాటిమనిషి సేవకోసం జీవి తమే వెలిగించు
కరిగిపోతూ కాంతిని పంచి
పదిమందికి వెలుగును పంచు...''

ప్రకాష్ సెల్‌ఫోన్లో పాటలు వింటూ చెప్పబోయే పాఠం కోసం పుస్తకంలో పాయింట్స్ నోట్ చేసుకోసాగాడు. అంతలో పక్కన సోషల్ సార్ కూర్చుంటూ ''మిత్రమా ... కొంచెం ఆ పాట బ్లూటూత్ ద్వారా ఎక్కిస్తావా .. చాలా బాగుంది'' అంటూ కొత్తగా కొన్న సెల్ చేతిలో పెట్టాడు.

ప్రకాష్ దాన్ని అటూ ఇటూ తిప్పి చూస్తూ ''ఏమో సార్ ... నాకు అంత ఐడియా లేదు. ఫోన్‌లు, మెసేజ్‌లు, పాటలు వినడం తప్ప మిగతా ఆప్షన్‌లు ఎప్పుడూ చూడ లేదు'' అన్నాడు తిరిగి ఇచ్చేస్తూ.

''నాదీ అదే సమస్య సార్ ... హైస్కూల్ చదివే చిన్న చిన్న పిల్లలు కూడా చేతికి సెల్ దొరుకితే చాలు చకచక ఏవేవో నొక్కి ఏమేమో చేసేస్తుంటారు. మనకేమో ఈ టెక్నాలజీ అర్థమై చావడం లేదు'' అన్నాడు సోషల్ సార్.

''సార్ ... మన కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ ఉన్నాడు గదా ... పోయి వాన్ని అడగండి, చెప్తాడు'' అన్నాడు ఇంగ్లీష్ సార్ మధ్యలో జోక్యం చేసుకుంటూ.

''నిజమేననుకో ... కానీ ఆ కంప్యూటర్ రూంలోకి పోవాలంటేనే ఏదో అనీజీ. వానికి పెద్ద టెక్కు. ఏదో ఆకాశం నుండి ఊడిపడ్డట్టు, పెద్ద మేధావి అయినట్టు తెగ ఫోజు కొడుతుంటాడు.''

''నిజమే సార్ ... మీరు చెప్పేది. మనమింత చదువులు చదివి, ఇంత అనుభవమున్నా ఆ పొట్టిగాళ్ల ముందు చులకనైపోయాం. డిగ్రీ పాస్ కావడం చేతగాని సన్నాసులు గూడా కంప్యూటర్ల ముందు కూర్చొని ఏవేవో గెలుకుతుంటే కడుపులో దేవినట్లనిపిస్తాది.''

''సార్ ... ఈసారి అందరం మెయిల్ ఐడీ సబ్‌మిట్ చేస్తేగానీ జీతాలు రావంట గదా ... నిజమేనా?'' అడిగాడు ఇంగ్లీష్ సార్.

''అవునవును. మొన్న మీరు సెలవు పెట్టారుగదా ... ఆ రోజు వచ్చింది స్టాఫ్ ఆర్డర్. ఐనా అదేమంత కష్టం కాదులే. కొండారెడ్డి బురుజు ఎదురుగా రామం ఇంటర్‌నెట్ సెంటర్ ఉంది. ఇరవై రూపాయలు ఇస్తేచాలు. పది నిమిషాల్లో ఐడీ క్రియేట్ చేసి పాస్‌వర్డ్ ఇచ్చేస్తాడు. మన టీచర్సంతా అక్కడికే వెళ్లేది'' సమాధానమిచ్చాడు సోషల్ సార్.

అంతలో బెల్ కొట్టడంతో ఎవరికివారు పుస్తకాలు సర్దుకొని వాళ్ల తరగతులకు బయలుదేరారు.

★★★

ఫోన్ మోగుతోంది. ఆదివారం కావడంతో బద్ధకంగా మంచమీద్మద అటూ యిటూ దొర్లుతున్న లావణ్య విసుగ్గా ఫోన్ అందుకుని చూసింది.

'ధనలక్ష్మి .. ఏమబ్బా ఇంత పొద్దున' అనుకుంటూ, నిద్రపోతున్న భర్తకు డిస్టర్బ్ కాకుండా పక్కకు వచ్చి ఆన్ చేసింది.

''ఏమే ... ఈరోజు ఇంట్లోనే ఉంటున్నావా? బైటికెక్కడికన్నా వెళుతున్నావా?'' అడిగింది ధనలక్ష్మి.

''ఇంట్లోనేలే ... ఏం?''

''కొంచెం మాట్లాడాల... ఎన్ని గంటలకు రమ్మంటావ్?''

లావణ్య ఒక నిమిషం ఆలోచించింది. ఎప్పుడూ అడగని ధనలక్ష్మి ఇలా అడుగుతోందంటే ఏదో అత్యవసరమైన పనే ఉంటుందని నిర్ణయానికి వచ్చి ''సర్లేవే ... పద కొండింటికి రా... మా ఆయనకు వాళ్ల కొలీగ్ ఇంట్లో ఏదో ఫంక్షనుందట. అప్పటికంతా వెళ్లిపోతాడు'' చెప్పింది.

★★★

లావణ్యతో మాట్లాడిన తర్వాత ఫోన్‌పెట్టేసి వంట గదిలోకి వచ్చి బెండకాయలు కడిగి, ముక్కలు కట్ చేయసాగింది ధనలక్ష్మి.

అప్పుడే నిద్రలేచిన ప్రకాష్ నిద్రకళ్లతోనే అక్కడికి వచ్చి ''ధనా ... తొందరగా టిఫిన్ చెయ్ ... బైటకెళ్లాలి'' అన్నాడు.

''సెలవు రోజు కూడా అంత తొందరేమి? పదకొండుకు గదా నీవు బైటపడేది'' అంది మూకుడు స్టౌ పైకి ఎక్కిస్తూ.

''నిజమేలే ... కానీ ఈ రోజు కొంచెం పనుంది. నిన్న సాయంత్రం ట్యూషన్లో చిన్న గొడవయ్యింది. ఒక పిల్లవాడి పేరెంట్స్‌ను పిలిపిస్తున్నారు .. వెళ్లాలి'' అన్నాడు.

''గొడవా ... ఏమయ్యింది?'' ఆసక్తిగా పనాపేసి భర్త వైపు తిరిగింది.

''చెబుతాగానీ, ముందు ఆ టిఫిన్ సంగతి చూడు.''

''పది నిమిషాల్లో కూరయిపోతుందిలే. చపాతీ పిండి ముందే తడిపి పెట్టా ... ఇంతకూ ఏమైంది? ఏదో గొడవైందన్నావే'' మరొకసారి గుర్తు చేసింది ధనలక్ష్మి.

''అదా ... నిన్న సాయంత్రం సాయిరాం కాలేజీలో ఈవెనింగ్ క్లాస్ చెబుతున్నానా .. వెనక బెంచీలో ఒక పిల్లవాడు కూర్చొని పాఠం వినకుండా కిందికే చూస్తావున్నాడు. పక్కనున్న పిల్లోళ్లు గూడా అప్పుడప్పుడు కళ్లు తిప్పి అటువైపు తొంగి చూస్తావుంటే ... అనుమానం వచ్చి హఠాత్తుగా వాళ్లదగ్గరికి పోయి చూస్తే ... ఇంకేముంది?! పుస్తకం మధ్యలో సెల్ ఫోన్ పెట్టుకొని సినిమా హీరోయిన్ల బొమ్మలు చూస్తావున్నాడు. పిచ్చికోపమొచ్చిందనుకో. ఫట్ ఫట్ మని చెంపమీద రెండు వాయించి, చొక్కా పట్టుకొని ప్రిన్స్‌పాల్ దగ్గరికి తీసుకుపోయినా. ఆయన దాన్ని ఓపెన్ చేసి చూస్తే ... సెల్ ఫోన్ నిండా హాట్ హాట్ వీడియో సాంగ్స్. హీరోయిన్ల అర్ధనగ్న దృశ్యాలు, నీలి చిత్రాల బిట్స్ ... ఈ తల్లిదండ్రులకు కొంచెం కూడా బుద్ధి లేదు. పిల్లలకు సెల్ ఫోన్లతో ఏం పని? వాళ్లు అడిగిందే ఆలస్యం – ఎందుకు, ఏమిటి, అవసరమా అని ఆలోచించికుండా కొనియ్యడమే. ఆఖరికి ఆరోతరగతి పిల్లల బ్యాగుల్లో కూడా సెల్‌ఫోన్లే. అందుకే ఆ అబ్బాయి తల్లిదండ్రులని పిలిపిస్తున్నాం కౌన్సిలింగ్‌కి ...'' అంటూ బ్రష్‌పై పేస్టు వేసుకొని బాత్‌రూమ్ వైపు నడిచాడు.

ప్రకాష్ చాలా బిజీ. అతని సబ్జెక్ట్‌కి మంచి డిమాండ్ ఉండడం, పైగా బాగా చెబుతాడనే పేరుండడంతో ఉదయం, సాయంత్రం నాలుగైదు కాలేజీలలో పార్ట్ టైమ్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. పొద్దున ఏడు గంటలకు క్యారియర్ తీసుకొని బైలుదేరితే తిరిగి ఇంటికి చేరేది రాత్రి పదికే.

ధనలక్ష్మి డిగ్రీవరకు చదువుకొంది. ఇంటి బాధ్యతంతా ఆమెదే. పిల్లలు కాలేజీకి పోగానే ఇంటికి కావలసిన సరుకుల దగ్గర్నుండి, కట్టాల్సిన బిల్లుల వరకూ అన్నీ చకచక పూర్తి చేసుకుంటుంది.

టైం చూసింది. ఎనిమిదవుతోంది. పిల్లలింకా మిద్దెమీది నుండి దిగిరాలేదు. ఆదివారమయితే చాలు ఏ పదింటికోగాని దిగిరారు. ఇంటర్నెట్ పెట్టించాక మరీ ఆలస్యం అవుతోంది. ఇద్దరూ ఆడపిల్లలే. పెద్దమ్మాయి ఇంజనీరింగ్ సెకండియర్‌లో, చిన్నమ్మాయి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నారు. పెద్దమ్మాయి సబ్జెక్ట్‌కు కావలసిన సమాచారం కొరకు చాలాసార్లు నెట్ సెంటర్‌కు పోవాల్సి వస్తోంది. అది ఇంటికి దూరంగా ఉండడం, రాత్రుళ్లు ఆలస్యం అవుతుండడంతో ... పైగా ఈ మధ్యకాలంలో సెల్‌ఫోన్ వీడియోల వల్ల అమ్మాయిలకు రక్షణ కరువవ్వడం .. ఇదంతా ఎందుకని ఇంటికే కనెక్షన్ పెట్టించుకున్నారు. కిందవుంటే ఇంటికొచ్చే బంధువులతో, స్నేహితులతో పిల్లల చదువులకి డిస్టర్బెన్స్ అవుతుండడంతో పైగదిలోకి మార్చారు. అప్పటినుంచి పిల్లలు కిందికి దిగిరావడమే లేదు. ఇంతకు ముందు టీవీలో సినిమా చూడ్డానికో, సీరియల్ చూడ్డానికో వచ్చేవారు. ఇప్పుడు అన్నం ప్లేట్లు కూడా తీసుకొని పైకి ఉరుకుతున్నారు. చిన్నపిల్ల కూడా గేమ్స్ అనీ, ఫేస్‌బుక్ అనీ వాళ్లక్కతో పోటీపడుతూ ఉంటుంది. కంప్యూటర్‌కి సంబంధించిన జ్ఞానం ఇంట్లో భార్యాభర్తలిద్దరికీ లేకపోవడంతో అసలు వాళ్లేమి చేస్తున్నారో, ఏం చదువుతున్నారో అర్థం కావడం లేదు. పిల్లల్తో మాటలు కూడా చాలా కరువైపోయియి.

ఇంటర్నెట్ ఇంటికి వచ్చాక పిల్లల్లో వచ్చిన మార్పు గురించి ఒకసారి లావణ్యకు బాధపడుతూ చెప్పింది ధనలక్ష్మి. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తోంది లావణ్య.

''చూడు పిల్లలని గుడ్డిగా నమ్మకూడదు. స్వేచ్ఛని సద్వినియోగం చేసుకునే వయసు, పరిపక్వత వాళ్లకింకా ఉండదు. కొంచెం నియంత్రణ అవసరం. ఒకసారి నెట్ ఆన్ చేయి. కుడివైపున పానర్‌లాగా ఒక గుర్తు ఉంటుంది. దానిని క్లిక్ చేయి. కొన్ని పేర్లు వస్తాయి. అందులో హిస్టరీ అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేయి. గత వారం రోజులుగా మీ పిల్లలు ఏం చేస్తున్నారు, ఏం చూస్తున్నారు అనే విషయాలన్నీ వరుసగా తేదీ, టైమ్‌తో సహా ప్రత్యక్షమవుతాయి. దాన్ని బట్టి ఒక అంచనాకు రావచ్చు'' అంది లావణ్య.

తరువాత రోజు పిల్లలు వెళ్లిపోయాక మేడ మీది గదికి చేరింది ధనలక్ష్మి. ఇంటర్నెట్ ఓపెన్ చేసి చూడగానే అదిరిపోయింది. పెద్దపిల్లకన్నా చిన్నపిల్ల ఇంకా ఫాస్ట్‌గా ఉంది. ఎవరో అబ్బాయితో ఛాట్ కూడా చేస్తూ ఉంది. భర్తకు చెబితే అనవసరంగా గొడవ. నిమిషాల మీద కోపమొచ్చేస్తుంది. వయసొచ్చిన పిల్లలని కూడా చూడకుండా బాదేస్తాడు. ఎంత చెప్పినా అర్థం చేసుకోడు. అందుకే ఆ సమస్య నుండి ఎలా బైటపడాలో అర్థంకాక పొద్దున్నే లావణ్యకు ఫోన్ చేసింది.

అంతలో భర్త తలస్నానం చేసి బైటకు వచ్చాడు. టిఫిన్ తింటూ ''ఇంకా లేవలేదా పిల్లలు'' అన్నాడు.

''ఆదివారం కదా'' అంది ధనలక్ష్మి.

''పడుకోనియ్యిలే పాపం ... రాత్రంతా చదివీ చదివీ అలసిపోయి ఉంటారు'' అంటూ టిఫిన్ తిని కాలేజీకి వెళ్లిపోయాడు.

ధనలక్ష్మి వంటగది శుభ్రంగా సర్ది పిల్లలను లేపుదామని పైకి పోయింది. పెద్దపిల్ల మంచమ్మీద పడి నిద్రపోతోంది. చిన్నపిల్ల నిద్రమబ్బుతోనే కంప్యూటర్ ముందు కూర్చొని ఏదో టైప్ చేస్తూ ఉంది.

''ఏందే ... అంత పొద్దున్నే మొదలు పెట్టేశావ్? బ్రష్ చేసేదుందా ... లేదా?'' అంది కోపంగా ధనలక్ష్మి.

''నీకేం తెలియదులేమ్మా ... చాలా ఇంపార్టెంట్ పని. ఫిజిక్స్ ఎక్స్‌పరిమెంట్ డౌన్‌లోడ్ చేసుకుంటున్నా. ఉదయమైతే నెట్ ఫాస్ట్‌గా ఉంటుంది'' తల తిప్పకుండా సమాధానమిచ్చింది.

ధనలక్ష్మి కంప్యూటర్ వైపు చూసింది. ఏదో సినిమా డౌన్‌లోడ్ అవుతోంది. అమ్మ చూస్తోందని తెలిసినా ఏమాత్రం తడబాటు లేదు. తమ అజ్ఞానం మీద వాళ్ల కంత నమ్మకం. ఒళ్లు జలదరించింది. ఏమీ మాట్లాడకుండా ''నాకు కొంచెం పనుంది. బైటికి పోతున్నా. చపాతీ పిండి ఫ్రిజ్‌లో ఉంది. కాల్చుకుని తినండి'' అంటూ కిందికి వెళ్లిపోయింది.

పిల్లల గురించే ఆలోచిస్తూ స్నానం పూర్తి చేసింది. సమయం పది దాటింది. టిఫిన్ తిని నెమ్మదిగా బైలుదేరింది. చేరుకునేసరికి పదకొండయ్యింది.

''రా .. రా ... నీ కోసమే ఎదురు చూస్తున్నా'' అంటూ ఆహ్వానించింది లావణ్య. ''ఫోన్లో మాట్లాడుకోవడమే తప్ప .. చాలా రోజులైంది నిన్ను చూడక. కొంచెం ఒళ్లు చేసినట్టున్నావే'' అంది నవ్వుతూ.

''నీ మాదిరి తిరిగే ఉద్యోగం కాదు గదా. తినడం, పడుకోవడం. ఒళ్లురాక ఏమొస్తాది చెప్పు'' నవ్వుతూ సమాధానం ఇచ్చింది ధనలక్ష్మి.

ఇద్దరూ కాసేపు అవీ ఇవీ మాట్లాడుకున్నాక ''ఏందే ... ఎప్పుడూ లేంది అంత (మిగతా 12వ పేజీలో)

బొమ్మలు : అక్బర్

..ఇదంతా ఎందుకని ఇంటికే కనెక్షన్ పెట్టించుకున్నారు. కిందవుంటే ఇంటికొచ్చే బంధువులతో, స్నేహితులతో పిల్లల చదువులకి డిస్టర్బెన్స్ అవుతుండడంతో పైగదిలోకి మార్చారు. అప్పటినుంచి పిల్లలు కిందికి దిగిరావడమే లేదు. ఇంతకు ముందు టీవీలో సినిమా చూడ్డానికో, సీరియల్ చూడ్డానికో వచ్చేవారు. ఇప్పుడు అన్నం ప్లేట్లు కూడా తీసుకొని పైకి ఉరుకుతున్నారు. చిన్నపిల్ల కూడా గేమ్స్ అనీ, ఫేస్‌బుక్ అనీ వాళ్లక్కతో పోటీపడుతూ ఉంటుంది. కంప్యూటర్‌కి సంబంధించిన జ్ఞానం ఇంట్లో భార్యాభర్తలిద్దరికీ లేకపోవడంతో అసలు వాళ్లేమి చేస్తున్నారో, ఏం చదువుతున్నారో అర్థం కావడం లేదు. పిల్లల్తో మాటలు కూడా చాలా కరువైపోయియి.

బాల్యం నుండి ఎదురైన 'హ్యాపీడేస్'ని మిస్ కాకుండా అనుభవిస్తూ, చివరికి తను కోరుకున్న సినీ రంగం వైపు అడుగులు వేశాడతను. ఈశ్వర్, వర్షం, మాస్, భద్ర చిత్రాలకు అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టరుగా పనిచేసిన అనుభవంతో ప్రభాస్ 'మున్నా' చిత్రానికి తొలిసారిగా దర్శకత్వం వహించాడు. తర్వాత జూ. ఎన్.టి.ఆర్. 'బృందావనం' విజయంతో సినీవినీలాకాశంలో తన అస్థిత్వపు బావుటా ఎగరేశాడు. ఇప్పుడు రామ్‌చరణ్ 'ఎవడు?'తో మనముందుకు దూసుకు రాబోతున్న యువ దర్శకుడు వంశీ పైడిపల్లి అందిస్తున్న హ్యాపీడేస్ ఇవి.

అదేమిటో... చిన్నప్పట్నించీ నాకు సినిమా పిచ్చే

పొద్దంతా సినిమా హాల్లోనే

నాకు 'సినిమా' వైపు దృష్టి మళ్లడానికి వెనకున్న కారణం ఊర్లోని మా 'లక్ష్మి' థియేటర్. నేను పుట్టకముందే నాన్నగారు ఆ థియేటర్ కొన్నారు. ఏడాదిలో సంక్రాంతి, వేసవి, దసరా ... ఇలా మూడు దఫాలుగా సెలవులిచ్చేవారు స్కూల్లో. ఎప్పుడు ఖానాపూర్ వెళ్లినా ఎక్కువగా ఆ సినిమా హాల్లోనే గడిపేవాడ్ని. రీల్స్ లోడ్ చేయడం, ప్రొజెక్టర్ నడిపించడం, సౌండు సిస్టమ్స్ ఎలా పనిచేస్తాయో పరిశీలించడం, బుకింగ్‌లో కూర్చొని టికెట్స్ అమ్మడం ... కొత్త సినిమా వస్తోందంటే చేసే హడావిడి ఇంతా అంతా కాదు. ఇవన్నీ నాకు తెలియకుండానే సినిమాపై మోజు ఏర్పడేలా చేసేవి. ఇక సెలవులు అయిపోతున్నాయంటే మాత్రం దడ మొదలయ్యేది నాలో. ఆ సినిమా హాలుని, అమ్మావాళ్లను వదలి హైద్రాబాద్ రావాలంటే ఏడుపొచ్చేది. రావడమేంటి ఏడుస్తూనే ఉండేవాడ్ని. మా సినిమా హాల్ మేనేజర్ శేఖర్‌తో నన్ను పంపించేవారు. మా నాన్న నోటి వెంట ఆ మాట వినగానే ఆయన గుండెలో రాయి పడేది. ముందే అతను బి.పి. పేషెంటు. హైద్రాబాద్ చేరేవరకు అతడిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించేవాడ్ని. ఒకటికి రెండు బి.పి. మాత్రల్ని వేసుకుంటేగానీ నన్ను కంట్రోల్ చేయలేకపోయేవాడు. ఎప్పుడో ఒకసారి నాన్న దిగబెట్టేవాడు. అప్పుడు మాత్రం మనం గప్‌చుప్ ... రాముడు మంచి బాలుడు కదా!

ఆ సినిమా ఇష్టంతోనే స్కూల్ వార్షికోత్సవాల్లో వేసే నాటికల్లో పాల్గొనాలనే ఉబలాటం ఉండేది నాలో. ఒకసారి 'శ్రీకృష్ణదేవరాయలు' డ్రామా వేస్తుంటే ఆ కిరీటాలు, గదలు, విగ్గులు లాంటి ఆహార్యం చూసి 'టెప్ట్' అయ్యి, నేను కూడా రాజు వేషం వేస్తానన్నాను. వాళ్లిచ్చిన డైలాగులు సరిగ్గా చెప్పలేదో ఏమో గానీ చివరికి శూలం పట్టుకుని నోరు మెదపకుండా నిలబడే ద్వారపాలకుడి పాత్ర ఇచ్చి అదే రాజు పాత్ర అని సర్దుకోమన్నారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడూ మొహానికి రంగేసుకుని స్టేజి ఎక్కిన గుర్తు లేదు.

ఒకసారి వెనక్కి తిరిగి నా స్కూల్ డేస్‌ని, కాలేజీ డేస్‌ని గుర్తు చేసుకుంటే, అలవోకగా పెదాలు విచ్చుకుని, జీవితం కంటే మిరకిల్ ఈ ప్రపంచంలో మరొకటి లేదేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఆ వయసులో ఎవరం ఏమవుతామనేది ఎవరికీ తెలియదు కదా! అనుకోనిది జరగడం మిరకిల్ కాక మరేమిటి?

నేను ఫస్ట్ క్లాస్ నుండి టెన్త్ వరకు చదివింది 'హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్లో'. అక్కడే హాస్టల్లో ఉండటంతో అదే ప్రపంచంలా ఉండేది. అప్పట్లో స్కూలొక జైలులా, రోజులు భారంగా గడిచినట్లుండేది కానీ, ఇప్పుడాలోచిస్తే ... అవే నిజమైన హ్యాపీడేస్ అనీ ... బాధలకు, బాధ్యతలకు దూరంగా విహంగంలా స్వేచ్ఛగా ఎగిరింది అప్పుడే కదా అనిపిస్తుంది. అదీగాక నవీన్, శ్రవణ్, పవన్, చందూ, రమణ, ఆనంద్ లాంటి మనసుకు దగ్గరైన కొందరు మిత్రుల్ని ప్రసాదించిన స్కూల్ అది. వాళ్లు నా 'క్లాస్‌మేట్స్' అనడం కంటే, 'సోల్‌మేట్స్' అంటే బాగుంటుంది. వీళ్లల్లో డాక్టర్లు, కంపెనీ యజమాన్లు, అమెరికాలో సాఫ్ట్‌వేర్‌లో సెటిలైన వాళ్లూ ఉన్నారు. మిత్రులైన అందరూ మనతోపాటు ట్రావెల్ చేయరు కదా. చివరిదాకా నడిచేది కొందరే. అందరం ఎప్పుడైనా కలిస్తే మా మా అధికారపు వలువల్ని వదిలేసి మరోసారి 'పబ్లిక్ స్కూల్' పిల్లలుగా మారిపోయి కేరింతలు కొడతాం.

నాన్నగారితో తథిగిణతోం!

అదేమిటో ... చిన్నప్పట్నించీ నాకు సినిమా పిచ్చే. చిరంజీవి సినిమా విడుదలైందని తెలిస్తే చాలు, 'అసెంబ్లీ' అవగానే అట్నుంచి అటే అందరం కూడబలుక్కుని, క్లాస్‌కు వెళ్లకుండా వెనక గోడ దూకి మార్నింగ్ షోకి పారిపోయేవాళ్లం. నాకు దివ్యభారతి సినిమా లంటే కూడా యమపిచ్చిగా ఉండేది. గోడ దూకే బ్యాచ్‌లో నాతో పాటు నవీన్, శ్రవణ్, పవన్ ఉండేవాళ్లు. క్రాస్‌రోడ్స్‌లో ఉన్న సుదర్శన్ 70 ఎం.ఎం.కి తప్ప మిగతా అన్ని హాళ్లకు వెళ్లేవాళ్లం. ఎందుకంటే ఆ హాలు నవీన్ వాళ్లదే. అక్కడున్న స్టాఫ్ గుర్తుపట్టి వాడి ఇంట్లో చెబుతారని అదొక్కటి మినహాయించేవాళ్లం.

నేను 8వ తరగతిలో ఉండగా షరా మామూలుగా గోడదూకి వెళ్లి, సినిమా చూసి వచ్చేసరికి నన్ను చూడ్డానికి నాన్నగారు ఊరి నుండి వచ్చి ఉన్నారు. ఇంకేముంది? పట్టుబడిపోయాను. దొంగ దొరికిపోయాక శిక్ష తప్పదు కదా. తథిగిణతోం! బహుశా నాకు గుర్తున్నంతలో అదే తొలిసారి, చివరిసారి అనుకుంటా నాన్నగారితో దెబ్బలు తినడం. తర్వాత ఎప్పుడూ ఆయన నాపై చెయ్యి చేసుకోలేదు. ఆ సంఘటనతో 'వీడ్ని ఇలా వదిలేస్తే లాభం లేద'నుకున్నారేమో వెంటనే ఆదిలాబాద్ జిల్లా, ఖానాపూర్‌లో ఉన్న అమ్మవాళ్లను హైద్రాబాద్‌కు షిఫ్ట్ చేయించారు. అప్పట్నించి ఇంటి నుండే స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. దాంతో మరింత ఫ్రీడం దొరికేదనుకోండి.

నా ఒక్కడికే ఒక ఇన్విజిలేటర్!

ఉప్పల్ 'లిటిల్ ఫ్లవర్స్'లో (ఇంటర్మీడియట్ సెకండియర్) ఉండగా జరిగిన సంఘటన ఇది. అప్పట్లోనే నాకో బైకుండేది. సంక్రాంతి హాలీడేస్ డిక్లేర్ చేసిన రోజే ... అంతా ఊరెళ్తామనో, మరేదో గుర్తు లేదుగానీ ఆ సంతోషంలో మరో ఇద్దర్ని ఎక్కించుకుని స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ కాలేజీ ఎదురుగా ఒక టర్నింగ్ వద్ద స్కిడ్ అయి పడేశాను. నా వెనకవాళ్లకి ఏమీ కాలేదు కానీ, నాకు మాత్రం కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఇంకేముంది? కాలుకి పెద్ద కట్టు. లోపల స్టీల్ రాడూ! సరిగ్గా ఎగ్జామ్స్ రెండు నెలలు ఉండగా జరిగిన యాక్సిడెంట్. చూస్తుండగానే హాల్‌టికెట్ కూడా వచ్చేసింది. 'ఎగ్జామ్స్ రాస్తావా? లేక సెప్టెంబర్‌కు ప్రిపేరవుతావా?' అని అడిగారు నాన్న. 'లేదు, ఇప్పుడే రాస్తాను' అనేశాను. ఎందుకంటే 'సరిగ్గా నడవలేక, క్లాసెస్‌తో కుంటుతూ ఎగ్జామ్ హాల్‌కు వెళ్తే సింపతీతో కాపీ కొట్టొచ్చునే'ది నా ఆలోచన. మా అమ్మగారితో పాటు ఒకరోజు ముందే మౌలాలీలోని ఒక కాలేజీ సెంటర్‌లో నా సీటెక్కడో చూడ్డానికి బయల్దేరాను. తీరా అక్కడికి వెళ్లాక తెలిసింది ఏమంటే – నేను ఎగ్జామ్ రాయాల్సింది నాలుగో అంతస్తులో అని. అన్ని మెట్లు ఎక్కి వెళ్లడమనేది అసాధ్యం. అంతలో ప్రిన్స్‌పాల్‌గారు అటుగా వచ్చి మా అమ్మగారితో, ''అంత శ్రమ పడి ఎందుకమ్మా ఫోర్త్ ఫ్లోర్ ఎక్కడం? నా రూమ్‌లో నా ఎదురుగా కూర్చుని ఎగ్జామ్ రాయమనండి' అన్నారు. ఒక్కసారిగా షాక్ అయ్యాను. మొదటికే మోసం వచ్చిందిరా దేవుడా అనుకున్నా. వందమంది స్టూడెంట్స్‌కి ఒక ఇన్విజిలేటర్ ఉండాల్సింది పోయి నాకొక్కడికే ఒక ఇన్విజిలేటరు అయ్యాడు. ప్రిన్స్‌పాల్ మీద చాలా కోపం వచ్చింది. కొసమెరుపు ఏంటంటే .. ఎగ్జామ్స్ అన్నీ ఆయన రూమ్‌లో, ఆయన ఎదురుగా కూర్చుని, అస్సలు కాపీ కొట్టకుండా రాసి, ఫస్ట్‌క్లాస్‌లో పాసవడం!

అన్నట్టు, చెప్పడం మరిచిపోయా – 'లిటిల్ ఫ్లవర్స్' ఓన్లీ బాయ్స్ కాలేజీ కావడంతో అమ్మాయిలు లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపించేది. పైగా కౌమార దశ ఎంటరింగ్ కదా ... ఆ లోటును పూరించుకోడానికి అప్పుడప్పుడు సాయంత్రాలు కాలేజీ అయిపోయాక ప్రత్యేకంగా సికింద్రాబాద్‌కు గుంపుగా తరలి వెళ్లి 'సెయింట్ ఆన్స్' ముందు నిలబడి, అమ్మాయిలను చూసేవాళ్లం. అది కేవలం ఆరోగ్యకరమైన వేడుకే గానీ, చెడు ఆలోచనలకు తావుండేది కాదు.

కర్రతో వెంబడించిన చోటే, పూలతో స్వాగతించారు

అప్పట్లో వచ్చిన ప్రేమదేశం, ప్రేమికుడు సినిమాలంటే పడి చచ్చేవాళ్లం. ఈ రెండు సినిమాలు కుర్రకారుని ఎట్లా అల్లల్లాడించాయో మీకు తెలియంది కాదు. కాని మా దరిదాపుల్లో ఉన్న హాల్స్‌లో ఆ సినిమాలు ఆడుతున్నా చూసేవాళ్లం కాదు – క్రాస్‌రోడ్స్ వెళ్లి సంధ్య, సుదర్శన్, ఓడియన్ లాంటి వాటిల్లో చూస్తేనే సినిమా చూసినట్టు ఉండేది మాకు. నేను టికెట్స్ తీస్తానని చెప్పి, మిగతా వారిని న్యూస్‌పేపర్స్ కటింగ్స్ తీసుకురమ్మని ఒప్పందం చేసుకునేవాడ్ని (పాట మొదలవగానే కాగితం ముక్కల్ని పైకి విసిరేయడంలో గొప్ప ఆనందం ఉండేది మరి)

ఒకసారి సుదర్శన్ 35 ఎం.ఎం.లో 'ప్రేమికుడు' సినిమాకి 20 మందిని వెంటేసుకుని వెళ్లాను. అప్పటికే ఆ సినిమా చూడ్డం నాలుగో సారనుకుంటా. సినిమా మొదలైంది. మొదటి పాట మొదలవగానే 20 మందిమి ఒకేసారి లేచి నిలబడి పేపర్ కటింగ్స్‌ని పైకి విరజిమ్మి, విజిల్స్ వేస్తూ, డాన్స్‌లు మొదలెట్టాం. మొదట్లో ఏదో కుర్రకారు అభిమానం అనుకున్నారుగానీ, ప్రతి పాటకీ లేచిపోతుంటే ఇక ఓపిక సన్నగిల్లి, కోపంతో వెళ్లి సినిమా మేనేజర్ 'మక్సూద్'ని వెంటబెట్టుకుని వచ్చారు. ఆయన రావడం రావడంతోనే పెద్ద కర్రపుచ్చుకుని వచ్చి మమ్మల్నందర్నీ హాల్ బయటకి తరిమేశాడు.

(అదే సుదర్శన్ 35 ఎం.ఎం.లో నా 'బృందావనం' సినిమా విడుదలైనప్పుడు, అదే మేనేజర్ మక్సూద్ కనిపించాడు. 'ప్రేమికుడు' సినిమాలో తను కర్రతో మమ్మల్ని వెళ్లగొట్టిన సంఘటన గుర్తుచేస్తే 'అప్పుడది నా డ్యూటీ కదా సార్' అన్నాడు నవ్వుతూ)

డిగ్రీలోనే పెళ్లి పెద్దనయ్యాను

ఇంటర్మీడియట్ తర్వాతనేను చేరింది కాచిగుడా దగ్గరున్న 'భద్రుక కామర్స్ డిగ్రీ కాలేజీ'లో. మొదట్నించి నాన్నగారు నా చదువు విషయంలో చాలా శ్రద్ధగా ఉండేవారు. నేనెప్పుడూ మంచి స్కూళ్లలో, కాలేజీల్లోనే చదవాలని నగరంలోని కాలేజీలన్నీ జల్లించి తనకు నచ్చిన దాంట్లో చేర్పించేవారు. అప్పటి వరకూ అమ్మాయిల ముఖం ఎరుగని 'లిటిల్ ఫ్లవర్స్' నుండి కో – ఎడ్యుకేషన్ 'భద్రుకొ'కు రావడంతో కాస్త రిలీఫ్‌గా ఉండేది. (మరో కాలేజీ ముందు నిల్చుని బీటేసే బాధ తప్పినందుకు). నా జూనియర్ ఒకమ్మాయంటే క్రష్ ఉండేది. అయితే తనతోనూ అందరితో ఉన్నట్టే ఫ్రెండ్లీగా ఉండేవాడ్నే కానీ ఏనాడూ ధైర్యం చేసి నా మనసులోని మాట చెప్పలేదు. ఆ అమ్మాయి కనిపించగానే నా చుట్టూ ఉన్న ఫ్రెండ్స్ నవ్వుతూ నన్ను ఏడిపించేవాళ్లు కూడా. అయితే నేను చేసిన సాహసం ఏంటంటే నాతో పాటు డిగ్రీ చదువుతున్న వాళ్లల్లో మూడు జంటల్ని ఒకటి చేసి పెళ్లి పెద్దనయ్యాను. ఒక జంటకి (అమ్మాయి తరపు వాళ్లకు ఇష్టం లేకపోయినా, సాహసించి) ఆగమేఘాల మీద ఆర్యసమాజ్‌కు తీసుకెళ్లి పెళ్లి చేయడం పెద్ద అడ్వంచర్. ఆ జంటలన్నీ హ్యాపీగా కాపురాలు చేసుకుంటున్నాయిప్పుడు.

డిగ్రీ తర్వాత అదే కాలేజీలో ఎం.సి.ఏ. చేసి, కొంత కాలం ఉద్యోగం చేశాను. ఆ తర్వాత 'ఈశ్వర్' చిత్రానికి దర్శకులు జయంత్‌గారి దగ్గర అసిస్టెంట్ డైరెక్టరుగా చిత్రప్రస్థానానికి నాంది పలికి ... ఇదిగో ఇప్పుడిలా డైరెక్టరు హోదాలో మీతో నా హ్యాపీడేస్‌ను పంచుకుంటున్నాను.

– గొరుసు జగదీశ్వరరెడ్డి

1


2

3

గుర్తు పట్టండి

ఇక్కడున్న వారంతా 2012 సంవత్సరానికి గాను నోబెల్ ప్రైజ్ గెలుచుకున్నవారు. వీరిని గుర్తుపట్టగలరా?

4

5

బాక్టీరియా బంగారం

మీకు తెలుసా?

పిల్లలూ, బంగారు బాతు గుడ్డు కథ విన్నారు కదా! ఆ కథ లోలాగా, ఈ బాక్టీరియా బంగారు గుడ్లు పెట్టకపోవచ్చు గానీ, బంగారం ముక్కలను మాత్రం ఇచ్చింది. మిచిగాన్ యూనివర్సిటీ పరిశోధకులు కాజెం కషెఫీ, ఆదం బ్రౌన్ ఈ ప్రయోగాన్ని ఒక తమాషాగా, కళగా ఆస్ట్రియాలో ఇటీవల ప్రదర్శించారు.

కుప్రియావిడస్ మెటాల్లిదురన్ అనే బాక్టీరియాకు ద్రవ రూపం లోని గోల్డ్ క్లోరైడ్‌ను ఆహారంగా ఇచ్చారు. విషపూరితమైన ఈ లోహపదార్థం చాలా తక్కువ పరి మాణంలో సముద్రంలో దొరుకు తుంది. దీనిని ఎక్కువ మోతా దులో తీసుకునే జీవులు ఢాం అంటాయి. అయితే ఈ బాక్టీ రియా గట్టిపిండం గనుక, ఆ లోహపదార్థాన్ని తీసుకున్నా జీవ క్రియలు యథావిధిగా సాగించ డమే కాక, చిన్న చిన్న బంగారం ముక్కల్ని కూడా విసర్జించింది.

'ఇంకేం మన పంట పండింది' అని వాటి ద్వారా భారీగా బంగారం ఉత్పత్తి చేసే కార్యక్ర మాన్ని సైంటిస్టులు భుజాన వేసు కోలేదు. అందుకు వీలూ లేదు. ఎందుకంటే, పైన చెప్పిన ప్రయోగం చాలాచాలా సుదీర్ఘమై నదే కాక, గోల్డ్ క్లోరైడ్‌ను కృత్రి మంగా తయారు చేయాలన్నా మళ్లీ బంగారాన్నే ముడిసరుకుగా వాడాలి. కనుక తమ ప్రాజెక్టులో భాగంగా వారు చేపట్టిన ఈ పరి మిత ప్రయోగాన్ని ఆస్ట్రియావా సులు తమాషాగానే చూసివెళ్లారు. అయితే, తమ ముచ్చటకు 'నయా రసవాదమని' పేరుపెట్టుకోవడం మరవలేదు కషెఫీ, బ్రౌన్.

పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో 'అవి'తో ఆరంభమయ్యే పదాలను రాయండి.

1. ఆటంకాలు లేకుండా అవి ☐
2. విడదీయలేనిది అవి ☐☐
3. వివేక హీనం అవి ☐☐
4. నమ్మకం లేకపోవడం అవి ☐☐
5. నీతిమాలినది అవి ☐☐
6. తీరుబడి లేకపోవడం అవి ☐☐
7. విధేయత లేకపోవడం అవి ☐☐☐
8. కన్య, కుమారి అవి ☐☐☐
9. అంగవైకల్యం అవి ☐☐☐
10. రక్తసంబంధం అవి ☐☐☐

నిర్వహణ : చేబియ్యం రామారావు

చెప్పండి చూద్దాం

1. జలగలతో చేసే వైద్యాన్ని ఇంగ్లీషులో ఏమంటారు?
2. ఇటీవల యుపీఏ కూటమి నుంచి వైదొలగిన పార్టీ ఏది?
3. ఇ.డి పూర్తి పేరు ఏమిటి?
4. సమస్యల సుడిలో చిక్కుకుని, తరచుగా పేరు వినిపిస్తున్న ఎయిర్‌లైన్స్ సంస్థ ఏది?
5. ట్వంటీ-20 ప్రపంచకప్ ఫైనల్లో ఆడిన జట్లేవి, విజేత ఎవరు?

రంగులు వేయండి

నా బొమ్మ

జి. సాయిప్రీతి, 9వ తరగతి
మార్టినెట్ హైస్కూల్,
పార్సిగుట్ట, సికింద్రాబాద్

దారి కనుక్కోండి



జవాబులు

తప్పులు
1. ఖాయిదీ తరహా 2. తెలుగుదేశం పార్టీ
3. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు 4. కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్
5. రాజస్థాన్-ఛత్తీస్‌గఢ్, బెంగళూరు రాజస్థాన్.

గుర్తుపట్టండి
1. సర్జీ హరోచ్-ఫ్రెంచ్, 2. డేవిడ్ జి. పైస్టహంట్-ఫ్రెంచ్,
3. మహ్మద్-నోబెల్ 4. జా. రాబర్ట్ లెఫ్కోవిట్జ్-ఇజ్రాయిల్,
5.జా. క్రిస్టఫ్ కోచ్-ఇజ్రాయిల్

పద విన్యాసం
1. అకస్మాత్తు 2. అఖండం 3. అవివేకి 4. అనాథ ఫిర్యాదు 5. అవిధేయత, అక్షయ పాత్ర.

దారి కనుక్కోండి
1. అమ్మవారు 2. అరుణాచలం 3. అమ్మకం 4. అరాచకం 5. అరిచి 6. అరిగాంధం 7. అరిచుకు 8. అరిచాడు 9. అరిటాకు 10. అరిచాడు

భూమిలోకి ప్రయాణం!

సరదాగా...



భూమి పుట్టుక గురించి, అగ్నిపర్వ తాలు, భూకంపాలు రావడానికి గల కార ణాల గురించి మీరు చాలా సార్లు చదువు కున్నారు కదా! అయినా వీటి గురించి తెలుసుకోవాల్సింది ఇంకా ఎంతో ఉందట. అందుకోసం 'ది ఇంటెగ్రేటెడ్ ఓషన్ డ్రిల్లింగ్ ప్రోగ్రాం' అనే ప్రాజెక్టును చేపట్టారు సైంటిస్టులు. భూమట్టం నుంచి మూడువేల కిలోమీటర్ల లోతు వరకు పరి శోధించడమే ఆ ప్రాజెక్టు పని. అందుకు ఎన్ని చిక్కులని? పసిఫిక్‌మహా సముద్రం మధ్యలో మూడు కేంద్రా లను ఎన్నుకోవాలి. అక్కడికి డ్రిల్లింగ్ సామగ్రిని చేర్చాలి. నౌకని సముద్రభూ భాగం నుంచి కనీసం 4 కిలోమీటర్ల పైన ఉండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. అక్కడి నుంచి 30 సెం.మీ వెడల్పు ఉండేలా 6 కిలోమీటర్ల వరకు రంధ్రంచేయాలి. లోపలి డ్రిల్లింగ్ పరికరాన్ని 50-60 గంట లకొకసారి మారుస్తుండాలి. లేకుంటే సముద్ర ఉప్పదనానికి అది చిలుం పడు తుంది. ఇదంతా ఒక ఎత్తు అనుకుంటే, ఈ ప్రాజెక్టుకు అయ్యే ఒక బిలియన్ యుఎస్ డాలర్లను సమకూర్చుకోవడం మాటలు కాదు. ఇంత వరకు జపాన్ మాత్రమే తన వంతు తల ఊపింది. మిగి లిన దేశాలు గప్‌చిప్‌గా ఉన్నాయి. ఈ లెక్కన డ్రిల్లింగ్ మొదలు కావాలంటే ఈ దశాబ్దం అయిపోవచ్చు. మరి భూమి పుట్టుక సంగతులు ఎప్పటికి తెలుస్తా యని? అందుకే సైన్సు చరిత్రలోనే ఇది ఒక పెద్ద సవాల్‌గా నిలుస్తుందని ప్రాజెక్టు లీడర్ డామన్ టీగెల్ వివరిస్తున్నాడు.

ఎ టు జడ్ గెలాక్సీలు

తెలుసా?

ఈ విశ్వం అనంతమని తెలుసు కదా మీకు. గెలాక్సీలు అందులో ఒక భాగం. వాటిచిత్రాలను వర్గీకరించవలసిందిగా 'గెలాక్సీ జూ' అనే వెబ్‌సైట్ ఆన్‌లైన్‌వా లంటీర్లను సాయం కోరింది. వందలు వేలు కాదు ఏకంగా రెండు లక్షలా యాభై వేలమంది ఆ పనిలో ఉన్నారి ప్పుడు. ఏళ్లకు ఏళ్లు శ్రమించాక, ఆ గెలా క్సీల్లో కొన్ని ఇంగ్లీషు అక్షరాల్లా, కొన్ని జంతువుల ఆకారాల్లో వున్నట్లు వారు కనుగొన్నారు. అయితే ఈ సైట్లో పొందు పరిచిన గె లాక్సీచిత్రాలు ఇప్పటివరకు బయట ఎవరూ చూడలేదు. నాసా హబుల్ టెలిస్కోపుద్వారా, స్లోన్ డిజిటల్ స్కై సర్వే ద్వారా తీసినచిత్రాలే అందులో ఉన్నాయి.

పురుష ప్రపంచం దద్దరిల్లలేదు కాని వెండితెర వెనక మహిళా లోకం మాత్రం నిద్రలేచింది. పాతమాటే కదా అంటారేమో...తెరపై ఎంతమంది తారలు వెలిగినా...తెరవెనుక మహిళల పాత్ర ఇప్పటికీ చాలా తక్కువే. ముఖ్యంగా దర్శకత్వ విభాగంలో. ఇప్పటివరకూ దర్శకులుగా పరిచయమైన హీరోయిన్ల గురించే తెలుసు మీకు. కాని ఎలాంటి గుర్తింపులేని అమ్మాయిలు దర్శకులుగా రాణించడానికి ముందుకొస్తున్నారిప్పుడు. నేటి అసిస్టెంట్ డైరెక్టర్లు రేపటి డైరెక్టర్లు అవుతారో లేదో గాని ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్న అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. వారి అనుభవాలే ఈవారం 'కవర్‌స్టోరీ'...

ఇలా...మొదలైంది

'లవ్‌లీ' షూటింగ్‌లో డైరెక్టర్ జయ

రాజాకు డైలాగ్ చెబుతున్న జ్యోతి

'రాఖీ' షూటింగ్‌లో సౌజన్య

'అలా మొదలైంది' సెట్‌లో నందినీరెడ్డి

తెలుగు సినిమా రంగంలో మహిళా దర్శకుల ఊసు ఎత్తగానే భానుమతి, సావిత్రి, విజయనిర్మల పేర్లు టకటకా చెప్పేస్తారు. అయితే వీళ్లంతా హీరోయిన్లుగా స్థిరపడ్డ తర్వాతే దర్శకులుగా పరిచయమయ్యారు. అలా కాకుండా కేవలం దర్శకత్వంలోనే రాణించాలనుకుని సినిమా రంగంలోకి అడుగుపెట్టిన ఆడవాళ్లు చాలా తక్కువ. ఈ మధ్యకాలంలో దర్శకులుగా పరిచయమైన బి.ఎ. జయ, నందిని రెడ్డిలు మాత్రం దీనికి మినహాయింపు. పూర్వపు దర్శకత్వంలో ప్రత్యేక శిక్షణ ఏదీ తీసుకోకుండా నటిగా ఉన్న అనుభవంతోనే దర్శకులుగా మారారు. కాని అటువంటి సాహసాలు ఇప్పుడెవరూ చేయడంలేదు. సినీ రంగంలో సుదీర్ఘ ప్రయాణాలకు అస్కారం లేకుండా పోవడం వల్లనేమో. జీవిత వంటి ఒకరిద్దరు ఇలాంటి ప్రయోగాలు చేసినా సక్సెస్‌ని చూడలేకపోయారు. అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేయకుండానే బి.ఎ. జయ దర్శకత్వ విభాగంపై అవగాహన పెంచుకుని చంటిగాడుతో మొదలుపెట్టి ఇప్పటివరకూ నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించారామె. మొన్నా మధ్య లవ్‌లీ సినిమా వందరోజుల వేడుకలో నాగార్జున నేను జయ దర్శకత్వంలో నటిస్తానని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అంటే తెలుగు సినిమా రంగంలో మహిళా దర్శకులకి మంచిరోజులొస్తున్నాయన్నమాట.

ఏడాది క్రితం వచ్చిన 'అలా...మొదలైంది' కూడా మహిళా దర్శకత్వానికి మరో శుభారంభమే. ప్రస్తుతం నందినీరెడ్డి హీరో సిద్ధార్థను డైరెక్ట్ చేయడంలో బిజీగా ఉన్నారు. పదహారేండ్లే పాటు అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేశాకే నందినీరెడ్డి దర్శకత్వం బాధ్యత తీసుకున్నారు. అబ్బాయిలంతమంది కాకపోయినా కొంతకాలంగా కొందరు అమ్మాయిలు కూడా అదే బాటలో నడుస్తున్నారు. ప్రొఫెషనల్‌గా పని నేర్చుకోడానికే ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ దర్శకుల దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేస్తున్న అమ్మాయిలు ప్రస్తుతం పదిమందివరకూ ఉన్నారు. చునియ, సౌజన్య, జ్యోతి, ప్రియదర్శిని, రమ, గౌరి, ప్రవీణ... వంటి వారితో పాటు ఒకటి రెండు సినిమాలకు పనిచేసినవారు కూడా మరో ఐదారుగురు ఉన్నారు. అమ్మాయిలు సినిమా రంగం పేరెత్తడాన్నే చాలామంది తల్లిదండ్రులు సహించరు. కారణం...వర్క్ టైమింగ్స్, షూటింగ్ స్పాట్స్. ఇవికాకుండా రకరకాల అపోహలు, భయాలు. ప్రస్తుతం అసిస్టెంటు డైరెక్టర్లుగా పనిచేస్తున్న ఏ అమ్మాయిని పలకరించినా '...బట్ ఇట్ ఈజ్ ఎ గుడ్ జాబ్' అని సగర్వంగా చెబుతున్నారు. డైరెక్టర్లు కూడా అమ్మాయిలు దర్శకులయితే మంచి సినిమాలు తెరకెక్కుతాయంటున్నారు.

మగవాళ్ల ప్రపంచం

ఒక్క నటన విభాగంలో తప్పిస్తే మిగతా విభాగంలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఆడవాళ్లు కనిపించేచారు కాదు ఇదివరకు. ఇప్పుడలా కాదు...అన్ని విభాగాల్లో ఆడవాళ్లు వేలు పెడుతున్నారు. డైరెక్షన్ డిపార్టుమెంటులో అయితే ఏకంగా కాలే పెట్టేసారు. ప్రముఖ దర్శకులు చాలామంది వారి డైరెక్షన్ డిపార్టుమెంటులో అమ్మాయిలకు చోటు కల్పిస్తున్నారు. అలాంటి ప్రయోగం చేసిన దర్శకుల్లో రాఘవేంద్రరావు ఒకరు. అన్నమయ్య సినిమా దగ్గర నుంచి శిరిడిసాయి వరకూ ఆయన దగ్గర అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేసిన సబీహ అనే అమ్మాయిని పంకరిస్తే...''నన్నందరూ చునియా అని పిలుస్తారు. నేను ఇప్పటి వరకూ ఏడు సినిమాలకు అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేశాను. కాలేజీ రోజుల్లోనే సినిమా రంగంలో స్థిరపడాలని కలలు కన్నాను. సినిమా రంగం అంటే నటనొక్కటే కాదు కదా! మన టాలెంట్‌ని నిరూపించుకోడానికి 24 రంగాలు ఉన్నాయి. వాటిలో నేనెంచుకున్నది దర్శకత్వం. మొదట జెమిని టీవీలో వచ్చిన అంత్యాక్షరి కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఏడైనా సీరియల్‌కి పనిచేసే అవకాశం వస్తే బాగుండునని ముళ్లపూడి వరగారిని అడిగితే ఆయన నన్ను రాజమౌళిగారికి పరిచయం చేశారు. ఆయన చేస్తున్న శాంతి నివాసం సీరియల్‌కి నాకు అసిస్టెంటు డైరెక్టరు అవకాశం కల్పించారు. అదే సీరియల్‌ని హిందీలో తీసినప్పుడు కో-డైరెక్టరుగా పనిచేశాను. ఆ సమయంలో నా పని గురించి రాఘవేంద్రగారు తెలుసుకుని ఆయన సినిమాల్లో పనిచేసే అవకాశం కల్పించారు. మధ్యలో రాజమౌళిగారు తీసిన సింహాద్రి సినిమాకు కూడా పనిచేశాను'' అని చెప్పారు చునియ.

''మా నాన్నగారు ఆర్కిటెక్ట్. అమ్మ ఇంట్లోనే ఉంటుంది. ఏదో నా అభిరుచి కారనలేక డైరెక్షన్ డిపార్టుమెంటే కదా అని ఒప్పుకున్నారు. తెల్లవారుజామున వెళ్లడాలు, అర్ధరాత్రి రావడాలు, క్యాబ్ లేకపోతే రోజుకో అబ్బాయి ఇంటిదగ్గర దిగబెట్టడాలు....అమ్మతో రోజూ తిట్లే. 'నువ్వేదో తప్పు చేస్తావని కాదమ్మా...మా సేవాళ్లు ఏమనుకుంటారు...' ప్రతి రోజూ ఇదే డైలాగ్. 'నన్ను చూసి కామెంట్ చేసేవాళ్లు వచ్చి నన్ను డైరెక్టరు చేయరు కదమ్మా....నా గురించి నీకు తెలుసుకదమ్మా' అంటూ నేనూ రొటీన్ జవాబు చెబుతూ ఉండేదాన్ని. ఇంటి సంగతి అలా ఉంటే...సెట్‌లో నన్ను చూసి కొందరు 'ఇప్పుడు ఇక్కడ అమ్మాయిలు అవసరమా...' అన్నట్లు చూసేవారు. రాఘవేంద్రరావు సార్ మాత్రం నాకు టీచర్‌గానే కనిపించేవారు. పని నేర్చడంలో, చెప్పడంలో ఆయన మంచి నేర్చరి. నేను ఏం చెయ్యగలనో ఆయన బాగా గుర్తించారు. కాస్ట్యూమ్స్ నుంచి స్క్రిప్ట్ వరకూ అన్నింటిలోనూ నాకు మంచి అనుభవం ఇచ్చారు. మొత్తం డిపార్టుమెంటులో నేనొక్కదాన్నే అమ్మాయిని కావడం వల్ల కొంచెం సాఫ్ట్‌గానే చెప్పేవారు. అదే అబ్బాయిలయితే గట్టిగా కోప్పడేవారు. ఇక సంపాదన అంటారా.. సినిమాకి ఇంత రెమ్యునరేషన్ అని ఉంటుంది. దాన్ని నెలకింత చొప్పున ఇస్తారు. దాదాపు బయట ఉద్యోగాల్లాగానే ఉంటుంది. శ్రీరామదాసు సినిమాకి కెమరామాన్‌గా పనిచేసిన ఖన్నాకూనపురెడ్డి అనే అబ్బాయిని పెళ్లిచేసుకున్నాను. ఇద్దరిదీ ఒకటే రంగం కావడం వల్ల ఎలాంటి మనస్పర్థలు లేకుండా పనిచేసుకుంటున్నాం. '' అని ముగించారు చునియా.

లెక్కచేస్తే లెక్కలేనన్ని...

ఏ రంగంలోనైనా అడుగు వెనక్కి వేయకుండా ముందుకి దూసుకెళ్లాలంటే పెళ్లిని వాయిదా వేయాల్సిందే. లేదంటే... కామాలు, ఫుల్‌స్టాప్‌లు పడతాయి. దర్శకులుగా ఎదగాలంటే కొన్నాళ్లు పెళ్లికి దూరంగా ఉండాలంటున్న అసిస్టెంటు డైరెక్టరు సౌజన్య గురించి తెలుసుకుందాం ''ఎంఎ పొలిటికల్ సైన్స్ చేసిన నాకు గొప్ప సినిమాలు తీసి పేరు సంపాదించాలనే కోరిక చాలా బలంగా ఉంది. ఏం కోర్సులు చేయాలో తెలుసుకుని అన్నీ నేర్చుకున్నాను. ముందు దేవదాసు కనకాలగారి ఇన్స్టిట్యూట్‌లో చేరాను. తర్వాత ముంబయిలోని ఆశాచంద్రా ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లో డైరెక్షన్ డిపార్టుమెంటు కోర్సు పూర్తిచేశాను. మొదట నాకు తేజాగారి దగ్గర అవకాశం వచ్చింది. తర్వాత శేఖర్‌కమ్ములగారి గోదావరి, కృష్ణవంశీగారి రాఖీ, చందమామ, శశిరేఖా పరిణయం సినిమాలకు, ప్రకాశ్‌గారి అనగనగా ఒక ధీరుడు, క్రిష్ తీసిన వేదం సినిమాలకు అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేశాను. డైలాగ్స్ చెప్పించడం నుంచి డబ్బింగ్ చెప్పించడం వరకూ అన్ని పనులు నేర్చుకున్నాను. సెట్‌లోకి వెళ్లాక మేం పడే కష్టాలన్నీ ఒకెత్తయితే ఇంటి దగ్గర నుంచి లొకేషన్‌కి రావడం, లొకేషన్ నుంచి ఇంటికెళ్లడం మరొకెత్తు. కష్టమంటే ఏం లేదు...టైమింగ్స్ ఒకటి, అప్పటికప్పుడు లొకేషన్లు మారిపోవడం మరొకటి. మరీ లేవలేనంత పరిస్థితితే తప్ప జలుబు, జ్వరం వంటివేమీ పట్టించుకోకూడదు. చాలావరకూ క్యాబ్ సొకర్యం ఉంటుంది. దగ్గర లొకేషన్ అయితే బండిమీద ఇంటికెళ్లిపోతాను. కాకపోతే రాత్రి వస్తేండు దాటితే ట్రాఫిక్ పోలీసులు బండి ఆపుతారు. అప్పుడు దగ్గరున్న ఐడికార్డు చూపిస్తే సరిపోతుంది.

ఇబ్బందుల గురించి చెప్పాలంటే...కృష్ణవంశీగారు దగ్గర పనిచేస్తున్న కొత్తలో ఒకరోజు ఆయన దగ్గరకెళ్లి ఎవరో ఏదో అన్నారని చెప్పబోతే...ఆయన విషయం కూడా పూర్తిగా వినకుండా చెప్పిన మాట ఒక్కటే. 'ఈ రోజు నీకొచ్చిన సమస్యని నేను తీరుస్తాను...మరి రేపు రాబోయే సమస్యని ఎవరు తీరుస్తారు?' అని అడిగారు. 'రేపు నువ్వు డైరెక్టరయ్యాక వందమందిని డీల్ చెయ్యాలి. చిన్న చిన్న సమస్యలు పట్టించుకోవడం మానేస్తే పెద్ద సమస్యలు కూడా నీ జోలికి రాకుండా ఉంటాయి' అని ఆయన చెప్పిన మాటలు నాకు బాగా ఉపయోగపడ్డాయి. మా ఇంట్లో నాకు పెళ్లిసంబంధాలు చూస్తుంటే వద్దని అడ్డుపడుతున్నాను. నేను డైరెక్టరుగా స్థిరపడ్డ తర్వాతే పెళ్లి గురించి ఆలోచిందామనుకుంటున్నాను. ప్రస్తుతం నేను ఒక కథని రెడీ చేసుకున్నాను. ఒక యువ హీరో ఓకే కూడా చెప్పారు. నిర్మాతని కూడా ఒప్పించి దర్శకురాలిగా పరిచయమవ్వడానికి ప్రయత్నాలు చేసుకుంటున్నాను'' అని చెప్పారు సౌజన్య.

అసిస్టెంట్ డైరెక్టర్ చునియా

ఉద్యోగం లాంటిదే...

డైరెక్షన్ డిపార్టుమెంటులో పనిచేయడం అనేది ఉద్యోగం లాంటిదే అంటున్నారు అసిస్టెంటు డైరెక్టరు జ్యోతి. ఇంజనీరు, సాఫ్ట్‌వేర్ రంగాలెలాంటివో ఇదీ అంతే నంటున్నారు. 'ఒక దర్శకుడి దగ్గర అన్ని పనులూ నేర్చుకోవడానికి మీరు పనిచేస్తున్న బ్యానర్ ఒక ఇన్స్టిట్యూట్ అనుకుని పనిచేయాలి. దర్శకులు మారితే మనం పని చేసే ఇన్స్టిట్యూట్ మారుతుంది అంతే' అని ఎంతో సింపుల్‌గా చెబుతున్న జ్యోతి ఉద్దేశ్యం ఏంటంటే...అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేయడాన్ని ఒక ఉద్యోగంలా భావించే రోజులొచ్చాయని. ''నేనున్నటివరకూ నాలుగు సినిమాలకు పనిచేశాను. ఇది కూడా అన్ని ఉద్యోగాల్లాంటిదే కాని నలుగురు గుర్తించే ఉద్యోగం. పూర్వంలా ఇప్పుడు షూటింగ్ లొకేషన్లు అభిమానులతో కిక్కిరిసిపోయి ఉండడం లేదు. లొకేషన్లలోకి ఎవ్వరినీ రానివ్వడం లేదు. అవుట్‌డోర్ షూటింగులు చాలా తక్కువైపోయాయి. దాంతో అసిస్టెంట్‌లకు కొన్ని కష్టాలు తగ్గాయి. పైగా సెట్‌లో హీరో, హీరోయిన్లు చెప్పినట్లు మాకు నరదాగా గడిచిపోయే వాతావరణమేమీ ఉండదు. పది గంటలకు షూటింగ్ మొదలయితే ముగించేవరకూ అసిస్టెంట్‌లకు ముచ్చెమటలు పడతాయి. ప్రతి చిన్న విషయాన్ని గమనించుకోవాలి. చిన్న తప్పు వచ్చినా...డైరెక్టరు ఊరుకోరు. కొన్ని సందర్భాల్లో ఒక్కరు తప్పు చేసినా చివాట్లు అందరికీ పడతాయి. మాకు అప్పగించిన పని నుంచి దృష్టి మరల్చకుండా పనిచేయాలి. నాకు అప్పగించినవే కాకుండా నాకు తోచిన సలహాలు, నాకు కనిపించిన తప్పులు పక్కవారికి చెబుతుండాలి. మొత్తానికి కలిసిమెలిసి పనిచేయాలి. చాలా కష్టపడాలి. లేదంటే రెండో సినిమా లేనట్టే. ప్రస్తుతం 'హాన్డ్‌సల్ డేస్' అనే సినిమాకి అసోసియేట్ డైరెక్టరుగా పనిచేస్తున్నాను'' అని ముగించారు జ్యోతి.

ఆ అభిప్రాయం మార్చుకోవాలి...

సినిమా రంగం అనగానే రకరకాలుగా ఊహించుకుంటారు. ఈ రంగంలో ఆడవారికి భద్రత తక్కువనే అపోహలు కూడా ఉన్నాయి. ఈ అభిప్రాయాన్ని మార్చుకోవాలంటున్నారు అసిస్టెంట్ డైరెక్టరు ప్రియదర్శిని. ''ప్రస్తుతం అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న అమ్మాయిల్లో చాలావరకూ ఎలాంటి బ్యాగ్రౌండ్‌లేనివారే. డిగ్రీ సర్టిఫికెట్లు చేతిలో పట్టుకుని డైరెక్షన్ డిపార్టుమెంటులో చేరినవారే. ఈ డిపార్టుమెంటులో కావాల్సిన అర్హతలు...హార్డ్‌వర్క్, పట్టుదల, సమస్యలపై నడుచుకుంటూ వెళ్లే తత్వం. దీంతో పాటు ప్రవర్తన. మనల్ని బట్టే ఎదుటివారి ప్రవర్తన ఉంటుందని నమ్మాలి. నేను మొదట జర్నలిస్టుగా పనిచేశాను. దర్శకత్వంపై ఉన్న అభిమానంతో ఈ రంగంలోకి అడుగుపెట్టాను. మొదట అవగాహన కోసం కొన్ని సినిమా షూటింగ్‌లు చూడ్డానికి వెళ్లినా అసిస్టెంట్ డైరెక్టరుగా మాత్రం తేజాగారి దగ్గర 'జై' సినిమాకి పనిచేశాను. ఆ సినిమా షూటింగ్ మొత్తం రామోజీఫిల్మ్‌సిటీలోనే జరిగింది. నెలరోజులపాటు అక్కడే ఉండిపోవాలన్నారు. ఇంట్లోవాళ్లని ఒప్పించి పది జతల బట్టలు పట్టుకుని వెళ్లాను. తర్వాత కృష్ణవంశీగారు తీసిన 'చక్రం' సినిమాకి పనిచేశాను. ఎఎన్ ఆదిత్యగారి బాస్ సినిమాకి కూడా చేశాను. డైరెక్షన్ డిపార్టుమెంటులో ఉన్న అన్ని విభాగాల్లో అనుభవం సంపాదించాను. ఎంత నేర్చుకున్నా... పనిచేసే టప్పుడు ఎంతమేరకు దృష్టి పెడతామన్న విషయంపై మా టాలెంట్ అంతా ఆధారపడి ఉంటుంది. ఆ మధ్య ఒక సినిమాలో హీరోయిన్ మన జాతీయ జెండాని తిరగేసి పట్టుకుంది. ఆ విషయాన్ని ఎవ్వరూ గమనించలేదు. అది పెద్ద గొడవైంది. ఆ జెండా పట్టుకోమని ఇచ్చిన అసిస్టెంటు, ఆ సీన్‌ని ఫైనల్ చేసిన డైరెక్టరు అందరూ తప్పుచే నిన్టయింది. అందుకే సెట్‌లో, ఫ్రేమ్‌లో ఏ చిన్న తప్పు జరిగినా అసిస్టెంట్‌లు గమనించాలి. లేదంటే ఆ నష్టం అందరూ భరించాలి. మొత్తానికి బుర్ర వేడెక్కిపోయే జాబ్. సక్సెస్ అయితే మంచి కిక్ ఇచ్చే జాబ్ కూడా ఇదే.'' అన్నారు ప్రియ దర్శిని.

అవగాహన వచ్చింది

సినిమా అనగానే హీరో, హీరోయిన్, సహ నటులు, దర్శకుడు, నిర్మాత...వీరు మాత్రమే అనుకునే రోజులు పోయాయి. డైరెక్షన్ డిపార్టుమెంటులో ఎవరుంటారు, ఎలాంటి పని ఉంటుంది అనే అంశాలపై అవగాహన పెరగడం ఎల్ల అక్కడున్న ఉపాధి అవకాశాల గురించి కూడా వేట మొదలైంది. ఇప్పుడు అమ్మాయిలు ఏ రంగంలోనైనా అడుగుపెడుతున్నారు కాబట్టి అక్కడ కూడా తమ సత్తా చూపించుకోవడానికి సిద్ధమవుతున్నారంటున్నారు అసిస్టెంటు డైరెక్టరు గౌరి. ''డైరెక్షన్ డిపార్టుమెంటు గురించి పూర్వం చాలామందికి తెలియదు. ఇప్పుడు అవగాహన పెరిగింది. కొంచెం సాహసంతో కూడిన పనే అయినా ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేయడానికి వచ్చినవారిలో నేనొకదాన్ని. నేను 'చినుకు' సినిమాతో పరిచయమయ్యాను. తర్వాత రామకృష్ణగారి 'డైరీ', రాఘవేంద్రగారి 'ఝుమ్మందినాదం', విక్రమ్ తీసిన 'ఇష్క్' సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేశాను. డైరెక్షన్ డిపార్టుమెంటు అంటే చాలా టెన్షన్ జాబ్. ఏకాగ్రత చాలా అవసరం. కొన్ని కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీస్తారు. చిన్న తప్పు జరిగినా నష్టం పెద్దమొత్తంలో ఉంటుంది. మన టాలెంట్ వల్ల, కష్టం వల్ల సినిమా హిట్ అయినా పేరు తర్వరగా బయటికి రాదు. కాని ఏదైనా తప్పు చేస్తే మాత్రం క్షణాల్లో అందరికీ తెలిసిపోతుంది. కాబట్టి బాధ్యత తీసుకుని పనిచేయాలి. మన తప్పుని పక్కవాడిమీద తోసెయ్యకూడదు. ఈ ఛాలెంజింగ్ వర్క్ చేస్తున్నందుకు చాలా గర్వంగా ఫీలవుతున్నాను'' అని చెప్పారు గౌరి.

● భువనేశ్వరి

సాఫ్ట్‌గా ఉంటే కుదరదు...

ప్రస్తుతం ఇండస్ట్రీలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న అమ్మాయిల సంఖ్యని చూస్తే చాలా సంతోషంగా ఉంది. అసిస్టెంట్‌గా పనిచేస్తున్నప్పుడు ఏదైనా ఇబ్బంది వచ్చినా, పొరపాటు వచ్చినా చూసుకోడానికి పైన డైరెక్టరు ఉంటారు. కాని డైరెక్టర్ అయ్యాక ఆ చాయిస్ ఉండదు. అన్నీ మనమే చూసుకోవాలి. పైగా మహిళా దర్శకురాలు అనగానే...'హమ్మయ్య పరవాలేదు...' అనుకునే నటులు ఉంటారు. అంటే...సెట్‌లో ఎలా ఉన్నా ఏమీ అనరని. నేను మాత్రం చాలా కండిషన్లు పెడతాను. సెట్‌లో ఎవరూ సెల్‌ఫోన్ ఆన్ చేయకూడదు. సిగరెట్లు కాల్చకూడదు. కాలక్షేపానికి పేకలు వంటి తెచ్చుకుంటుంటారు. అలాంటివాటికి నో ఎంట్రీ. ఇలాంటి వాటన్నింటిపై దృష్టి పెడుతూనే సీన్‌లు పర్‌ఫెక్టుగా వచ్చేలా చూసుకోవాలి. నేను ఎవరి దగ్గరా అసిస్టెంటుగా పనిచేయలేదు కాని నాకున్న పరిచయాలతో చాలామంది దర్శకుల దగ్గర స్టోరీ డిస్కషన్లు వినేదాన్ని. అలానే షూటింగ్ స్పాట్‌కి వెళ్లి చూసేదాన్ని. నా మొదటి సినిమా 'ప్రేమలో పావనీ కళ్యాణ్' కాని భయపడి పేరు వేసుకోలేదు. కథా రచయిత 'పేరే వేశాను. దానికి పాజిటివ్ టాక్ వచ్చాక 'చంటిగాడు' తీశాను. ఆ తర్వాత ప్రేమికులు, లవ్‌లీ సినిమాలకు దర్శకురాలిగా పనిచేశాను. ఎంత టాలెంట్ ఉన్నా...తెలివితేటలున్నా కొత్తగా ఆలోచించడం, సమాజంలో వస్తున్న మార్పుల్ని గమనించడం, ప్రేక్షకులకి కావాల్సిన అంశాలు వెతుక్కోవడం....చేస్తూనే ఉండాలి. ఆడవాళ్ల దర్శకత్వం అనగానే ఒక పక్క ఇండస్ట్రీ, మరోపక్క ప్రేక్షకులు మంచి సినిమాని ఆశిస్తారు. మరొకటి ఎక్కువకాలం గ్యాప్ రాకుండా చూసుకోవాలి. చేసిన ప్రతి సినిమాకూ నూటికి వెయ్యిపాళ్లు కష్టపడాలి. ఒక సినిమా మొదలయ్యిందంటే దృష్టి అంతా దానిమీదే ఉండాలి. మధ్యలో ఎన్ని ఇబ్బందులొచ్చినా పట్టించుకోకూడదు. అలా ఉండాలంటే కుటుంబ సహకారం చాలా ముఖ్యం. నాకు అదే సగం బలం. పైగా నా సినిమాలకు నా భర్త బి. ఎ. రాజుగారే ప్రొడ్యూసర్ అవ్వడం వల్ల నేను తేలిగ్గా పనిచేయగలుగుతున్నాను. ఎలాంటి బ్యాగ్రౌండు లేని మహిళా దర్శకులు తమని తాము నిరూపించుకోవాలంటే చాలా కష్టపడాలి. విజయం కోసం ఎన్నిరోజులైనా ఎదురుచూడాలి. అందుకున్న విజయాన్ని నిలబెట్టుకోవాలి. లవ్‌లీ సినిమా తర్వాత నాగార్జునగారు నాతో సినిమా చేస్తానని ప్రకటించారు. కథ సిద్ధంగా ఉంది. అలాంటి స్టార్ హీరో ఒక మహిళా దర్శకురాలితో పనిచేస్తానని అనడం చాలా మంచి మార్పు. దర్శకత్వ విభాగంలో ఆడవాళ్ల సత్తా చూపే కాలం వచ్చిందనడానికి ఈ మార్పే నిదర్శనం.

– బి.ఎ. జయ, దర్శకురాలు

సక్సెస్ రేటు తక్కువ...

సక్సెస్ రేటు అతి తక్కువగా ఉన్న రంగం ఇది. మనం నూటికి నూరుపాళ్లు కష్టపడ్డాం కనక మనల్ని విజయం తప్పకుండా వరిస్తుందని ఊపిరి తీసుకునే అవకాశం లేని రంగం. అమ్మాయిలు ఇందులో అడుగుపెట్టడం ఇప్పుడు తేలికే కావచ్చు. కాని నిలదొక్కుకోవడం మాత్రం పెద్ద సాహసం. ఎన్నాళ్లు ఇండస్ట్రీలో ఉంటే అన్నిరోజులూ పరిగెడుతూనే ఉండాలి. ఒక సినిమా హిట్ అయిందని రెస్ట్ తీసుకుంటే మర్నాడు నువ్వు లిస్టులో ఉండవు. ఇలాంటి టఫ్‌ఫీల్డ్‌లోకి అమ్మాయిలు రావడం అనేది అందరూ సంతోషించాల్సిన విషయమే. అమ్మాయిలు కాబట్టి అవకాశం ఇచ్చే పరిస్థితి ఉండదిక్కడ. టాలెంట్ ఒక్కటే అల్టిమేట్. పనిచేస్తే ఉండనిస్తారు. లేదంటే తరిమేస్తారు. అలాగే అదృష్టం బాగుండి సినిమా తీసే అవకాశం వచ్చి సినిమా హిట్ అయిందనుకోండి. రెండో హిట్ సినిమా కోసం ఎదురుచూస్తారు..అది పోయిందా మీ పని మళ్లీ మొదటికి వస్తుంది. కొన్ని విషయాల్లో చాలా మొండిగా ఉండాలి. అసిస్టెంట్ డైరెక్టరుగా చేరే ముందే డైరెక్టరుగా పనిచేసే కెపాసిటి మీకు ఉందాలేదా నిర్ణయించుకోవాలి. సెట్‌లోకి ఎంటరయ్యాక వందలమందిని కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఒక్కడు మాట వినకపోయినా పనిగాడి తప్పుతుంది. మహిళా దర్శకురాలు అని గౌరవించేవారూ ఉంటారు, చిన్నచూపు చూసేవారూ ఉంటారు. ఇద్దర్నీ ఒక్కతాటిపై నడిపించాలి. ఇప్పటివరకూ సెట్‌లో నాకు ఎలాంటి ఇబ్బంది ఎదురవలేదు. ఆ విషయంలో మన తెలుగు నటులను మెచ్చుకోవాలి. ఆడవాళ్ల కమర్షియల్ సినిమాలు తీయగలరా? అనే ప్రశ్న చాలామంది అడుగుతుంటారు. డైరెక్టర్ అన్నాక అన్నిరకాల సినిమా తీయాలి. కాని ఎవరి స్టయిలంటూ వాళ్లకి ఉంటుంది. మగవాళ్లంతా కమర్షియల్ సినిమాలు తీసే విజయం సాధించడం లేదు కదా! శేఖర్‌కమ్ముల, శ్రీనువైట్ల వారి వారి స్టయిల్స్‌లో సక్సెస్ అవుతున్నారు కదా. అలాగే నాక్కూడా ఒక స్టయిల్ ఉంది. నాలుగైదు సినిమాలు హిట్ అయితేగాని స్టార్ హీరోలు ముందుకురారు. ఆ స్థాయికి చేరుకోవడమనేది మా టాలెంట్ మీదే ఆధారపడి ఉంటుంది. ఈ డిపార్టుమెంటులో నిలబడడానికి మన ఆత్మస్థైర్యం ఎంత ముఖ్యమో కుటుంబ సహకారం కూడా అంతే ముఖ్యం. అమ్మాయిల్ని అర్థం చేసుకుని ప్రోత్సహించే వారి తల్లితండ్రుల సంఖ్య పెరగాలని కోరుకుంటున్నాను.

– నందినీరెడ్డి, దర్శకురాలు

మిక్చర్ పొట్లం

బొమ్మలు: ఎన్.రాజశేఖర్ రెడ్డి

అందులో తప్పేంటో?!

''నీకేమైనా పిచ్చా?'' ఇంట్లోకి అడుగుపెడుతూనే, కోపంగా అంతెత్తున ఎగిరాడు జోగయ్య.

''నేనేం చేసానండీ?'' వణికిపోతూ, అమాయకంగా నోరెళ్లబెట్టింది ఆండాళ్లు.

''కనిపించినవాళ్లందరికీ సంతాన స్వాములవారి దయవల్లే కొడుకు పుట్టాడని చెబుతున్నావట? బయట జనమంతా నాకేసి జాలిగా చూస్తున్నారు తెలుసా! పిచ్చిమొహమా, పిచ్చి మొహమా అని ... తలెత్తుకోలేకపోతున్నాను'' విసుక్కున్నాడు జోగయ్య.

ఏ రాయైతేనేం?

''పదేళ్లుగా గొడ్డు చాకిరీ చేస్తున్నావు. మీ మేనేజర్ని జీతం పెంచమని అడక్కూడదట్రా?'' సలహా ఇచ్చాడు పెంచలయ్య.

''అడగొచ్చు. కానీ, నేను అద్దెకుండేది ఆయనింట్లోనేగా ... ఇలా నాకు జీతం పెంచగానే, అలా అద్దె పెంచేస్తాడు మరి'' వాపోయాడు నాంచారయ్య.

రివర్స్ గేర్

''నిన్న నేను మా ఆవిడతో సరసాలాడుతుంటే అనుకోకుండా మా పన మ్మాయి చూసేసిందిరా?'' బాధగా చెప్పాడు పరబ్రహ్మం.

''దానికంత బాధెందుకురా?'' ఆశ్చర్యపోయాడు బ్రహ్మానందం.

''ఎందుకంటే, ఈ రోజునుండి పనిలోకి రావడం మానేసింది'' చెప్పాడు పరబ్రహ్మం.

హమ్మయ్య ... బతికాడు!

''ఎలాగైనా మా నాన్నని బతికించండి డాక్టర్'' బోరుమన్నాడు సుదర్శనం.

''అలాగే నయ్యా... ఆపరేషన్ చెయ్యనని మాటిస్తున్నాను. సరేనా... ఇక నా కాళ్లొదిలేయ్...'' అభయమిచ్చాడు డాక్టర్ కైలాసం.

బొగ్గుల్లో ముంచేయమంటావా?

''ఎదురింటి పున్నయ్య... వాళ్లావిడని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడట ... మీరూ ఉన్నారెందుకూ?'' ఈసడించింది వరాలు.

''అదేం గొప్ప? ఆయనది పూల వ్యాపారమే పిచ్చిదానా. నేనూ చూసుకోగలను ... కాని నాది బొగ్గుల వ్యాపారమైపోయిందే ...'' చెప్పాడు సూరయ్య.

కల నెరవేర్చుకున్నారు

ఫిజిక్స్ లెక్చరర్ 'నీ ఫ్యూచర్ ప్లాన్ ఏంటి' అని అడిగితే, 'ఫిలిం డైరెక్టర్ అవుతానని' తడేమని ఆదిత్య బదులు చెప్పారంటే అతడి కాన్ఫిడెన్స్‌కు హ్యాట్సాఫ్. కల నెరవేర్చుకున్నారు, 'మనసంతా నువ్వే' సినిమా మనకు అందించారు. కాలేజీడేస్‌లో వందల ప్రైజులు సాధించారంటేనే ఆయన మోస్ట్ టాలెంటెడ్ అని అర్థమయిపోలా!

– గణేష్, తిరుచానూరు

ఎదిగినా ఒదిగాడు

'నేను ఇప్పటికీ సిద్ధార్థ ముద్దుబిడ్డనే' అంటూ యువ దర్శకులు వి.ఎన్.ఆదిత్యగారు ప్రతి ఏడాదీ సిద్ధార్థ కాలేజిలో జరిగే 'సృజనోత్సవ్'కి తనతోబాటు ఒకరిద్దరు సెలబ్రిటీలను వెంట తీసుకుని వెళ్లి పాల్గొనడం, ఆ రకంగా ఆయన తన హ్యాపీడేస్‌ని నిత్యనూతనంగా ఉంచుకోవడం నాకెంతో నచ్చింది. నేను వ్యక్తిగతంగా ఆయనను కలిసాను. పెద్దల పట్ల ఆయన వినయ విధేయతలు, మాట తీరు, స్నేహశీలత, ఎదిగిన కొద్దీ ఒదిగివుండే వ్యక్తిత్వం నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయన దర్శకత్వంలో త్వరలో రానున్న 'పార్క్'చిత్రం కూడా మరో బ్లాక్‌బస్టర్ కావాలని మనఃస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– నీలం నాగరాజేశ్వరరావు, నెల్లూరు
మహమ్మద్ ఫరూ, ఇ మెయిల్

ఉపయోగకరం

'మనోవైద్యుల మనసు వైద్యం' చాలా బాగుంది. ఎంతో మంది మానసిక సమస్యలను పరిష్కరించే వైద్యులు తమ సమయాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటారనేది ఒక ఆసక్తికరమైన అంశం. ప్రముఖ వైద్యులు నిరంజన్ రెడ్డి, గౌరీదేవి, భాస్కర్ నాయుడు అందించిన సమాచారం ఎంతో ఉపయోగకరం.

– మార్టూరు అజయ్‌కుమార్, చిలకలూరిపేట
జి.రమణి మోహన్, కడప; సత్యం ఆదూరి, హైదరాబాద్

కొటేషన్

'మనోవైద్యుల మనసువైద్యం' కథనంలో మాకు ఒక కొటేషన్ దొరికింది–''ఇంట్లో పిల్లల అల్లరిని పాజిటివ్‌గా చూడాలి. ఒక్కోసారి వాళ్ల అల్లరివల్లే ఆఫీసునుంచి మన వెంటపడి వచ్చే సమస్యలు మాయమైపోతాయి''. ఇది మానసిక వైద్యుడి అభిప్రాయమే అయినా, పది కాలాలపాటు గుర్తుండిపోయే కొటేషన్‌లాంటిదే.

–శ్రద్ధ, నూజివీడు

చిత్ర నిర్మాణ వ్యయం తగ్గించాలి

పైరసీ మాత్రమే తెలుగు చిత్ర పరిశ్రమను దెబ్బతీస్తున్నదనడం సరికాదు. 'కర్ణుడి చావుకు వంద కారణాలు' అన్నట్లుగా పైరసీ అందులో ఒక కారణం మాత్రమే. అందువల్ల చిత్ర పరిశ్రమకు చెందిన వారందరూ చిత్ర నిర్మాణ వ్యయం తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీని వల్ల కొంత వరకు పరిశ్రమను రక్షించుకోవచ్చు.

– పి. మస్తాన్‌రావు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు

పోస్ట్‌మోడర్న్ సినిమా

కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్ ప్రయోగాత్మక చిత్రం'ఇన్ ఎనదర్ కంట్రీ' ఆసక్తికరంగా ఉంది. మూడు కథలూ, మూడు నేపథ్యాలూ, మూడురకాల మూడ్‌లలో సినిమా తీయడమంటే గొప్ప ప్రయోగమే. గొడుగు, లైట్‌హౌస్, అందం అనే ఈ మూడు మాటలు కవిత్వంలో ప్రతీకల్లాంటివి. అందుకే మరి అది పోస్ట్ మోడర్న్ సినిమా.

– రాజేష్, బెంగళూరు

కాసిన్ని మాటల్లోనే..

ఔను, ఇది 'ఛోటీ దునియా'. మన వూరు నుంచి న్యూయార్కు దాకా ఒకటే లోకం. ఒకటే సమస్యలు. ఒకటే ఘోష. అక్కడ Occupy ఇక్కడ తెలంగాణ. 'ఈ ప్రపంచం చాలా పెద్దది' అనుకుంటాం కానీ నిజానికి చాలా చాలా చిన్నది. ఈ కథ మొత్తం ఈ కాసిన్ని మాటల్లోనే ఇమిడివుంది.

– రాగిణి, కడప

ఐకోనో రైటింగ్

కడప జిల్లాకు చెందిన శ్రీనివాసరావు 'ఐకోనో రైటింగ్'ను కనిపెట్టడం మనకు గర్వకారణం. ఆ విద్యను దేశ విదేశాలకు విస్తరించే పనిలో ఉన్నందుకు మరింత సంతోషం. చేసిన పనే చేయకూడదనే ఆలోచనతో ముందుకు వెళతున్న ఆయనకు అభినందనలు. ఆయన వ్యక్తిగత జీవితం కూడా ఆసక్తికరంగా ఉంది.

– దాము, పుంగనూరు

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.com కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

వంటసాల

పొట్లకాయతో కొన్ని...

పాయసం

కావలసిన పదార్థాలు: పొట్లకాయ (చిన్న) ముక్కలు – 2 కప్పులు, బియ్యం – 1కప్పు, నెయ్యి – 2 టీ స్పూన్లు, పాలు – 1 కప్పు, పంచదార – 1 కప్పు, నేతిలో వేగించిన జీడిపప్పు, కిస్‌మిస్ – అలంకరణ కోసం.

తయారుచేసే విధానం: బియ్యాన్ని అర టీ స్పూను నెయ్యిలో దోరగా వేగించి, గంటపాటు నానబెట్టాలి. తర్వాత నీరు వడకట్టి పేస్టులా రుబ్బి, పాలు కలిపి పక్కనుంచాలి. పొట్లకాయ ముక్కల్ని ఆవిరిపై ఉడికించి, మిగిలిన నేతిలో కొద్దిసేపు వేగించి, పాల మిశ్రమాన్ని పోసి పది నిమిషాలు చిన్న మంటపై తిప్పుతుండాలి. పంచదార వేసి కరిగిన తర్వాత సర్వింగ్ బౌల్‌లోకి తీసుకుని జీడిపప్పు, కిస్‌మిస్‌తో అలంకరించాలి.

గుత్తి కూర

కావలసిన పదార్థాలు: పొట్లకాయ – 1, ఉడికించిన ఆలుగడ్డ – (పెద్దది) 1, ఉల్లి తరుగు – 1 కప్పు, పచ్చిమిర్చి తరుగు – 1 టీ స్పూను, కొత్తిమీర తరగు – అరకప్పు, నిమ్మరసం – 1 టీ స్పూను, ఉప్పు – తగినంత, నూనె – వేగించడానికి సరిపడా, రవ్వ – 3 టేబుల్ స్పూన్లు.

తయారుచేసే విధానం: పొట్లకాయని ఒకటిన్నర అంగుళం ముక్కలుగా కట్ చేసి, లోపలి గుజ్జు, గింజలు తీసేయాలి. ఒక పాత్రలో చిదిమిన ఆలు, ఉల్లి, మిర్చి, కొత్తిమీర తరుగు, నిమ్మరసం, ఉప్పు కలిపి ముక్కల్లో నింపాలి. కూర కనిపించే భాగాల్ని రవ్వలో అద్ది సన్నని మంటపై నూనెలో దోరగా వేగించాలి. (ఇష్టమైతే ఆలు మిశ్రమానికి బదులు శనగపిండి, పసుపు, కారం, జీలకర్ర పొడి, మిరియాలపొడి, ఉప్పు, పంచదార, చింతపండు గుజ్జుల మిశ్రమాన్ని తగిన మోతాదులో తీసుకుని పొట్ల గొట్టాల్లో కూరవచ్చు)

పల్లీపొడితో కూర

కావలసిన పదార్థాలు: పొట్లకాయ – 1, ఉల్లిపాయ తరుగు – అరకప్పు, ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, శనగపప్పు – అర టీ స్పూను చొప్పున, ఉప్పు – తగినంత, నూనె – 1 టేబుల్ స్పూను, ఎండుమిర్చి – 6, వెల్లుల్లి రేకలు – 6, వేరుశనగ పప్పులు – అరకప్పు, కరివేపాకు – 4 రెబ్బలు, పసుపు – అర టీ స్పూను, ఇంగువ – చిటికెడు, కొత్తిమీర తరుగు – అరకప్పు.

తయారుచేసే విధానం: పొట్టకాయని ముక్కలుగా తరిగి చిటికెడు పసుపు కలిపి, కప్పు నీటితో ఉడికించాలి (ముక్క సగం ఉడికితే చాలు). ఎండుమిర్చి, వేరుశనగపప్పులను విడివిడిగా వేగించి వెల్లుల్లితో కలిపి పొడి చేయాలి. నూనెలో తాలింపు దినుసులు, కరివేపాకు, ఇంగువ, పసుపు, ఉల్లితరుగు వేగించి ఉడికిన ముక్కలు కలపాలి. 5 నిమిషాలు మగ్గించి ఉప్పు, వేరుశనగ పొడి మిశ్రమం కలిపి మరో రెండు నిమిషాలు ఉంచి కొత్తిమీర చల్లి దించేయాలి.

'దేవుడున్నాడా ... ఉంటే నిదురపోయాడా?'' (లత 'రసిక్ బల్ మా' బాణి) పాట వినగానే మన కళ్లముందు అమాయకత్వం మూర్తీభవించిన ఒక ముఖారవిందం కదలాడుతుంది. ముఖానికి తగ్గట్లుగా ఆమెకు లభించిన పాత్రలు కూడా దాదాపు అలాంటివే. 45 ఏళ్ల క్రితం 'నిండుసంసారం' చిత్రంలో ఎన్.టి.రామారావు చెల్లెలుగా అవిటి పాత్రతో వెండితెరంగేట్రం చేసిన అనిత గండర గండడు, విజయ, మంగమ్మగారి మనవడు, స్వాతిముత్యం లాంటి ఎన్నో చిత్రాల్లో కథానాయికగా, క్యారెక్టర్ నటిగా నటించారు. ఆమె నాలుగు పదుల సినీ అనుభవాలే ఈవారం జ్ఞాపకాలు.

చెల్లి, తల్లిగానే ఆదరించారు

మా ఊరు మచిలీపట్నం. మా అమ్మ ప్రఖ్యాత రంగస్థల కళాకారిణి వాణీబాల. మా అమ్మ ఆ రోజుల్లో జె.వి. రమణమూర్తి, రావికొండలరావు లాంటి గొప్ప కళాకారులతో కలిసి 'కాళరాత్రి' మొదలైన నాటకాలు వేశారు. ఆదుర్తి సుబ్బారావు తేనెమనసులు చిత్రంలో సుకన్యకు తల్లి వేషం వేశారు. నేను డిసెంబర్ 8, 1954న పుట్టాను. మా నాన్న నందనరావుగారు. మా అమ్మలో ఉన్న కళాతృష్ణను ఆయన ఏ రోజూ కాదన లేదు. పైపెచ్చు నన్ను కూడా ఓ నటిగా చూడాలని తప న పడేవారు. అందుకే నాకు సంప్రదాయ నాట్యంలో నాగేశ్వర శర్మగారి దగ్గర శిక్షణ ఇప్పించారు. మా అమ్మ అప్పట్లో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఉద్యోగం కూడా చేశారు. బందా కనకలింగేశ్వరరావుగారు కన్యా శుల్కం రేడియో అనుసరణ (1967) చేసినపుడు కె. వెంకటేశ్వరరావు 'గిరీశం' పాత్ర సంభాషణల్ని చదివితే, మా అమ్మ 'మధురవాణి' సంభాషణల్ని చదివారు.

రామాకుమారి నుంచి అనితగా...

అమ్మ 'తేనెమనసులు' చిత్రంలో చేసిన తర్వాత నన్ను సినిమా నటిని చేయాలనుకుంది. అమ్మ పాత్రల నిర్మలమ్మగారి భర్త కృష్ణారావు గారు, మా నాన్నగారు చాలా స్నేహితులు. ఆయన మచిలీపట్నం వచ్చినప్పు డల్లా మా ఇంటికి వచ్చేవారు. అలా ఒకసారి వచ్చిన పుడు నన్ను చూసి ''అమ్మాయి లక్షణంగా ఉంది. సిని మాల్లో చేరిస్తే పేరొస్తుంది. నేను ప్రయత్నిస్తాను'' అన్నారు. అనడమే కాకుండా అన్నమాట నిలబెట్టుకు న్నారు కూడా. పి. గంగాధరరావుగారి 'నిండు సంసారం' (1968) చిత్రంలో నాకు అవకాశం కల్పిం చారు. సి.యస్. రావుగారు దాని దర్శకులు. అందులో నాది ఎన్.టి. రామారావుగారి చెల్లెలి వేషం. అవిటి పాత్ర. ప్రారంభంలోనే ఇలాంటి పాత్ర ఏమిట్రా బాబూ అనుకున్నాను. కానీ పెద్ద స్టార్స్‌తో కదా అని ఒప్పుకు న్నాను. ఎన్.టి. రామారావు గారింటికి తీసుకువెళ్ళారు. ఆయన ఆపాదమస్తకం చూసి ఓ.కె. అన్నారు. ఫస్టు సీన్ లోనే హేమలత, నాగయ్య, ఎస్. వరలక్ష్మి గార్లతోటి చేశాను. నాకేమనిపించలేదు. సి.ఎస్.రావుగారు నాకు గురుదేవులు. ఒక పసిపిల్లకు స్కూలు టీచరు పాఠాలు చెప్పినట్లు సంభాషణలు, ఉచ్చారణా విధానం అన్నీ నేర్పారు. ఆయనే నా పేరు కూడా మార్చారు. నా అసలు పేరు రామాకుమారి. కానీ ఆ పేరు నాజూకుగా లేదని 'అనిత'గా పునః నామకరణం చేశారు.

ఎన్టీఆర్... అభిమానానికి మారుపేరు

ఎన్.టి. రామారావుగారిని సెట్ మీద చూసినపుడు భయం వేసేది. అయితే ఆ కంగారులో ఏదైనా టేక్ మిస్ అయినా విసుక్కునే వారు కాదు. ''ఏం ఫరవాలేదు చెల్లెమ్మా! బాగా చేయి, బ్రహ్మాం డంగా చేస్తావు'' అని సర్ది చెప్పే వారు. సొంత చెల్లెల్లా పలుకరించే వారు. వారింట్లో ప్రతి కార్యక్రమా నికీ ఆహ్వానించేవారు. ఆయన సొంత చిత్రం 'తిరగబడ్డ తెలుగు బిడ్డ' (1988) చిత్రంలో బాలకృ ష్ణకు తల్లిగా చేశాను. ఆ సినిమా ప్రారంభోత్సవానికి వెళ్ళినపుడు ఎన్.టి.ఆర్.గారు ''రా చెల్లెమ్మా! మొదటి కొబ్బరికాయ నువ్వే కొట్టాలి'' అని పట్టుబట్టి నా చేత మొదటి పూజ చేయిం చారు. ఏమైనా అభిమానాలు, ఆప్యాయతలు ఆ మహ నీయునిలోనే చూడాలి. వారి సతీమణి బసవతారకం గారు దివంగతులైనప్పుడు పరామర్శించడానికి వెడితే ఒక పసిపిల్లాడిలా మాట్లాడారు. దివిసీమ కార్యక్ర మాల్లో కూడా నేను ఆయన వెంటే 23 రోజులు పర్యటిం చాను. దేవికగారు రుక్మిణిగా, సావిత్రిగారు సత్యభా మగా వేస్తే నేను జాంబవతిగా, రామారావుగారు శ్రీకృ ష్ణుడిగా పలు ప్రదర్శనలిచ్చాం.

నటీమణులంతా స్నేహితులే

ఇక నా రెండవ చిత్రం పి.ఏ.పి. సుబ్బారావుగారి 'ఆదర్శ కుటుంబం' (1969). ఇందులో అక్కినేని నాగే శ్వరరావుగారి చెల్లెలుగా నటించాను. ఆయన చాలా సర దాగా ఉండేవారు. ఎప్పుడైనా షూటింగ్‌లో డైలాగులు సరిగా చెప్పకపోయినా తేలికగానే తీసుకునేవారే గానీ కోప్పడేవారు కాదు. పైగా నిర్మాతలతో అలాంటి సందర్భాలేవైనా వస్తే ఆర్టిస్టుల పక్షాన మాట్లాడేవారు. ఆ చిత్రం షూటింగ్ సమయంలోనే, మా స్టూడియో పక్క ఫ్లోర్‌లో వాణిశ్రీగారికి షూటింగ్ ఉండేది. ఆ విరామంలో ఆమె సెట్ కొచ్చి ఎంతో ఆప్యాయంగా మాట్లాడే వారు. వాణిశ్రీగారి అమ్మ, మా అమ్మ మంచి స్నేహితురాళ్ళు. అదే కుటుంబ స్నేహం నేటికీ కొనసాగుతోంది. అదే విధంగా గీతాంజలితో కూడా. గీత నా ప్రాణస్నేహితురాలు. 'ఆదర్శ కుటుంబం' నటీనటవర్గమంతా తెరవె నుక కూడా ఆదర్శ కుటుంబం లాగే ఉండేది. కథానాయిక జయలలితగారు, నేను సొంత వదినా ఆడపడుచుల్లాగే ఉండేవాళ్ళం. మేము లావైపో తామని ఆ రోజుల్లో మాకు స్వీట్స్ ఇచ్చేవాళ్ళు కాదు. ఈ ఇబ్బందిని గమనించిన సూర్యకాంతం గారు మా ఇంట్లో వాళ్ళకు తెలీకుండా చీరలో దాచిపెట్టుకుని స్వీట్స్ తెచ్చిచ్చేవారు. నేనూ జయలలితగారూ ఇద్దరం ఎవరికంటా పడకుండా చాటుకు వెళ్ళి తినే వాళ్ళం. సూర్యకాంతం గారి లాంటి మంచి మనిషిని నేనింతవ రకూ చూడలేదు.

అదేవిధంగా ఛాయాదేవిగారు. ఆమెను చూడగానే అందరూ భయపడేవారు గానీ చాలా భోళామనిషి. విజయ బాపినీడు గారి 'విజయ', 'గూటిలోని రామచి లుకా' తదితర చిత్రాల్లో నటించేటప్పుడు మాకు భోజ నం చెయ్యడానికి కూడా తీరిక దొరికేది కాదు. ఛాయాదే విగారు షూటింగ్ అయ్యేంతవరకూ కాచుకు కూర్చుని అన్నం ముద్దలు కలిపి మా నోట్లో కుక్కేది. ఇప్పుడు నా కూతురు భోజనం చేసే టైం లేదు మమ్మీ అంటే వెనకటి మా ఛాయాదేవిగారే నాకు గుర్తుకొస్తుంటారు.

ఆ వేషమైతే అనిత ఓకే అనేవారు

ఇక మహానాటి జమునగారితో కలిసి 'మనసు మాంగల్యం' (1971), 'చిరంజీవి రాంబాబు' (1978) తదితర చిత్రాల్లో ఆమెకు చెల్లెలుగా నటించాను. ఆమెను బంగారు తల్లి అంటాను నేను. ఎందుకంటే పరి శ్రమలో నిర్మాతల శ్రేయస్సును కోరే నటి ఆమె. నాకు తెలిసినంతలో హీరోల్లో కృష్ణగారు, హీరోయిన్లలో జము నగారు నిర్మాతల్ని బాగా గౌరవించేవారు. ఒక సినిమా నటిగా ఉండి ఎప్పుడూ ఆమె రంగస్థల కళాకారుల గురించే ఆలోచించేవారు. అబ్బూరి కమలాదేవి, ధూళి పాళ, కనకం వంటి రంగస్థల కళాకారులకెందరికో తన పుట్టినరోజు నాడు సన్మానాలు చేసేది. చాలా హుందాగా ఉండేది. జమునగారు ఎప్పటికీ నాకు అక్కయ్యే. నేను, చంద్రకళ అప్పట్లో సిస్టర్స్ వేషాలు చాలా వేశాము. అప్పటి అగ్రహీరోలంతా చెల్లెలు వేష మంటే చాలు వేసేయండి అనితను అనేవారు.

నాకు తెలుగులో చాలా సంతృప్తినిచ్చిన చిత్రాలు మొదట్లో 'దేవుడు చేసిన బొమ్మలు', ఆ తర్వాత కె. విశ్వ నాథ్‌గారి 'స్వాతిముత్యం'. సుత్తి వీరభద్రరావుగారి భార్యగా నటించానందులో. చాలా అమాయకపు పాత్ర, నా మొహానికి సరిపోయే పాత్ర. ఈ రెండూ నాకు వ్యక్తి గతంగా ఇష్టమైనవి. తెలుగులో నా ఆఖరి చిత్రం 'పెళ్ళి సందడి' (1996). సినిమాలు లేని రోజుల్లో డబ్బింగ్ ఆర్టిస్టుగా బిజీగా ఉండేదాన్ని. ప్రముఖ హీరోయిన్ రాధకు నా గాత్రం బాగా సరిపోయేది.

కోలుకోలేని సంఘటనలు

మా అమ్మగారు 1996లో చని పోయారు. అది నాకు తీరనిలోటు. ఆ విషాదం నుండి నేను కోలుకోక మునుపే 2002లో మా వారు పోయారు. ఇవి రెండూ నన్ను మానసికంగా కొంచెం కృంగదీ శాయి. అందువల్ల నటించడం ప్రస్తుతానికి మానేశాను. అయితే 'కలవారి కోడలు' తదితర టీవీ సీరి యల్సు చేశాను. ప్రొమ్టింగ్‌కు అల వాటుపడడం కష్టమై అవీ మానుకు న్నాను. నాకు ఒక కూతురు తనూజ. తను ప్రస్తుతం బెంగుళూరులో ఉద్యోగం చేస్తోంది. అందువల్ల నేను బెంగుళూరులో ఉండాల్సివస్తోంది. చెన్నయ్‌లో నా చెల్లెలు పుణ్య ఉంటోంది. పైగా చెన్నయ్ నాకు ఇష్టమైన ప్రదేశం కనుక వస్తూపోతూ ఉన్నాను. అమ్మాయికి పెళ్ళి చేసేస్తే నా బాధ్యతలు తీరిపోతాయి.

ఆత్రేయ గారన్నట్టు భానుమతి, ఎన్.టి. రామా రావు, గోపాల్‌రెడ్డి లాంటి పోయినోళ్ళకు తీపిగుర్తుగా మిగిలిపోయాను. వాళ్ళను తలచుకుంటూ, వారితో పెన వేసుకుపోయిన జ్ఞాపకాల్ని తలపోసుకుంటూ ప్రశాం తంగా గడిపేస్తున్నాను.

– డా. కంపల్లె రవిచంద్రన్
98487 20478

హీరోయిన్‌ని చేసిన కాంతారావు

ప్రముఖ నటులు 'నటప్రపూర్ణ' కాంతారావు గారి గురించి చెప్పుకోవాలి. నన్ను తెలుగులో హీరోయిన్‌ను చేసింది ఆయనే. ఆ సినిమా 'గండర గండడు' (1969). కన్నడంలో 'భలే భాస్కర్', 'సర్వకావళ్', 'గండుగల్లి' తదితర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించాను. అయినా పెద్ద సక్సెస్ కాలేదు. క్యారెక్టర్ ఆర్టిస్టుగానో, సెకండ్ హీరోయిన్‌గానో మాత్రమే ప్రేక్షకులు నన్ను ఆదరించారు.

చలాకీగా ఉండే చంద్రమోహన్

సినిమాల్లో నాకు ఎక్కువ జోడీగా నటించిన వారు చంద్రమోహన్! ఆయన దగ్గర వ్యక్తిగా నేను నేర్చుకున్నది చాలా ఎక్కువ. చాలా నిరాడంబ రంగా ఉండేవారు. చాలా చలాకీగా కూడా ఉండే వారు. నాన్ కాంట్రవర్షియల్. ''ఇంకో నాలుగు అంగుళాలు పొడవుంటే ఇండస్ట్రీని తినేసేవాడు'' అనేవారు బి. సరోజాదేవిగారు అప్పట్లోనే. ఆయ నతో 'మాతృమూర్తి', 'కొత్తకాపురం' ఇలా ఓ ముప్పై చిత్రాలు చేశాను. నేను అభిమానించే వ్యక్తుల్లో చంద్రమోహన్ మొదటివారు.

తప్పిన పెను ప్రమాదం

'పగసాధిస్తా' చిత్ర నిర్మాణ సమయంలో నేను ఓ పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డాను. ఒక రకంగా చెప్పాలంటే కృష్ణగారి సమయస్ఫూర్తే నా ప్రాణం కాపాడింది. ఆ చిత్రంలో కృష్ణగారిది నాకు అన్న వేషం. ఆ చిత్రంలో ప్రభాకరరెడ్డిగారు నన్ను చంపి కొండల మీద పడేస్తారు. ఒక కొండ మీద షూటింగ్. మధ్యలో ఎలా జారిపోయానో ప్రభాకరరెడ్డిగారి చేయి పట్టుతప్పి కిందికి జారిపో యాను. దొర్లుకుంటూ పడిపోతుంటే కృష్ణగారు నా కాలి కింద ఏదో ఆధారమున్నట్టు సైగ చేశారు. నేను అప్పుడు కాలికి తగిలిన ఓ బండను గట్టిగా పట్టుకున్నాను. ఎలాగో ప్రాణాలతో బయటప డ్డాను. నాకు తగిలిన దెబ్బలు చూసి కృష్ణగారు ఎంతో కంగారుపడి ఏడ్చేశారు. ఆ సంఘటన ఇప్పుడు తల్చుకున్నా గుండె ఝల్లు మంటుంది.

కొడుకుల్లేని లోటిలా తీరింది

బాలకృష్ణ, అర్జున్, జగపతిబాబు, శ్రీకాంత్... ఇలా అగ్రహీరోలకంతా తల్లిగా నటించాను. ఇప్ప టికీ వాళ్ళందరూ అమ్మా... అమ్మా... అని నన్ను ఆప్యాయంగా పలకరిస్తూనే ఉంటారు. బాలకృష్ణ అయితే ఎంత గారాబమో చెప్పలేను. 'తిరగబడ్డ తెలుగుబిడ్డ', 'పల్నాటిపులి', 'రాము' తదితర చిత్రాల్లో వరుసగా ఆయన కొడుకు, నేను తల్లి. షూటింగ్ విరామంలో ఇద్దరం క్యారమ్స్ ఆడుకు నేవాళ్ళం. ఆ ఆప్యాయతలు నేడేవీ? నాకు నిజ జీవితంలో కొడుకులు లేరు. ఆ లోటు సినిమాల వల్ల తీరింది.

'తినేశావు కదే' అన్న భానుమతి

'పంగమ్మగారి మనవడు' (1984) చిత్రంలో నేను సుహాసినికి తల్లిగా, నా అభిమాన నటి భానుమతిగారికి కూతురిగా నటించాను. ఆ చిత్రం షూటింగ్‌లో ఆమె నన్ను సొంతకూతురు లాగే చూసుకునేది. నేను ఆమెతో ఆస్తి పంపకాలు చేయమని పోట్లాడే సీన్ ఒకటుంది. పోటాపో టీగా చేశామిద్దరం. చిత్రీకరణ పూర్తయ్యాక 'తినే శావు కదే' అని కాంప్లిమెంట్ ఇచ్చారు. అది నాకు ఏ అవార్డు ఇవ్వనంత తృప్తిని కల్గించే మాట. అది మాట కాదు. మంగళాశాసనం. ఆ చిత్ర మహి మేమో. ఆమె బ్రతికున్నంత కాలం నన్ను సొంత బిడ్డలాగే చూసుకున్నారు. ప్రతి సంవత్సరం నా పుట్టినరోజు నాడు నాకు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్పేవారు.

మిషన్‌కి మనసుంటే...

**మొన్నీమధ్య వాల్‌మార్ట్‌కి వెళ్లాను.
లోపలికి వెళ్లేముందు అక్కడ ఓ మిషన్ దర్శనమిస్తుంది.
అదేవిటంటే..మన దగ్గరున్న నాణేలను..జమ చేసుకునే యంత్రం.
ఈ మిషన్‌లో..మన దగ్గరున్న నాణేలను..పోసేయాలి..
మనూళ్లో పిండి మరలో బియ్యం పోస్తామే.. సరిగ్గా అలాగే..
ఓ పది సెకండ్లపాటు..గణ గణ..డబడబ..దబదబ..శబ్దాలు వినిపిస్తాయి
ఆ తర్వాత ఆ మిషన్‌లోంచి ఓ స్లిప్ వస్తుంది.
అందులో ఓ మెసేజ్ ఇలా ఉంటుంది..**

''అయ్యా! మీరు ఈ మిషన్‌లో ఒంపిన నాణేల విలువ ఇంత.. మీకు సరేననిపిస్తే..పచ్చ బటన్ నొక్కండి. మీకు ఓ స్లిప్ వస్తుంది. ఆ స్లిప్‌లో ఉన్న అమౌంట్..మీరు కొనబోయే ఐటమ్స్ తాలూకు అమౌంట్‌లో మినహాయించబడుతుంది. ఈ ట్రాన్సాక్షన్ మీకు సమ్మతం కాకపోతే..ఎర్రబటన్ నొక్కండి. మీరు ఈ మిషన్‌లో పడేసిన నాణేలు కింద ఉన్న బిన్‌లో పడిపోతాయి...

ఏ డిడక్షనూ(మినహాయింపూ)లేకుండా..మీరు వాటిని నిరభ్యంతరంగా వెనక్కి తీసుకెళ్లిపోవచ్చు.''

దీన్ని జూసి..ఈ ఊరికి విజిటర్స్ వీసాతో వచ్చిన మనూరి వెంకయ్య నాయుడు ఏం జేసాడంటే..

తన దగ్గరున్న నాణేలని..సెంట్లూ, డైములూ, క్వార్టర్సూ.. అన్నీ కలిపి ఓ బస్తాడు నాణేలను.. చాలా కష్టం మీద అక్కడికి మోసుకెళ్లాడు.

ఆ మిషన్‌లో పడేసిన..మూడు నిమిషాల తర్వాత.. ఓ స్లిప్ వచ్చింది. నూట నలభై రెండు డాలర్ల అరవై మూడుసెంట్లు..

ఒక్క సెంట్ కూడా తేడా లేకపోయేసరికి..ఆశ్చర్యపడి.. ఇంకోమారు వేస్తే ఏం జరుగుతుందో చూద్దామని..

ఆ నాణేలని ఇంకోమారు ఆ మిషన్‌లోకి ఒంపి.. బటన్ నొక్కాడు.

ఇంకో స్లిప్ వచ్చింది..సరిగ్గా..అదే.. నూట నలభై రెండు డాలర్ల అరవై మూడు సెంట్లు..

మన వెంకయ్యనాయుడు..మరింత ఆశ్చర్యపడి..సరే..ఇంకో మారు ట్రై చేద్దామని..ఎర్రబటన్ నొక్కి..తన నాణేలను వెనక్కి తీసేసుకుని మూడోసారి ఆ మిషన్లో ఒంపేసాడు.

మళ్లీ పాత కథే..ఒక్క సెంటు కూడా తేడా లేకుండా అదే అమౌంట్‌కి ఒక స్లిప్ వచ్చింది. ఎర్రబటన్ నొక్కి తన నాణేలను..వెనక్కి తీసేసుకున్నాడు.

ఈసారి ఎలాగైనా ఆ మిషన్‌ని ఓ ఆట పట్టించాలని డిసైడ్ అయిపోయి.. తన దగ్గరున్న మన ఊరి యాభై పైసల నాణేలు రెంటినీ..రూపాయి నాణేలు మూడింటినీ..

రెండు రూపాయల నాణేలు నాలుగింటినీ కలిపి..

అందులో ఒంపేసి..బటన్ నొక్కాడు.

వెంటనే..శబ్దాలు వినిపించి..రెండు నిమిషాల తర్వాత.. ఆగిపోయాయి.

ఐదు నిమిషాల పాటు భయంకర నిశ్శబ్దం.

తర్వాత మిషన్‌లోంచి పెద్ద సైజ్‌లో ఉన్న ఓ ప్రింటవుట్ వచ్చింది. ఈ ప్రింటవుట్..ఇంతకు ముందు వచ్చిన వాటికంటే కాస్త పెద్ద సైజులో ఉండడం జూసి..మన వెంకయ్య నాయుడు ఇంకాస్త ఉత్సాహంతో దాన్ని అందుకుని చదవసాగాడు.

.....

ప్రింటవుట్

.....

''అయ్యా మీరే ఊరినుంచి వచ్చారో మాకు తెలియదు కానీ అమెరికా వాస్తవ్యులు మాత్రం కాదని రూఢిగా చెప్పొచ్చు. మీరు మొదటి మారు వేసి మళ్లీ.. వెనక్కి తీసేసుకున్నప్పుడు..మనసు మార్చుకున్నారేమో అనుకున్నాను.. రెండో మారు వేసి..వెనక్కి తీసుకున్నప్పుడు..కాస్త బాధ అనిపించినా..సరే ఊరికి కొత్త అయ్యుండొచ్చు అనుకుని ఆ బాధ భరించాను. మూడో మారు చేసినప్పుడు బాధా..దాంతో బాటు జరిగిన అవమానాన్నీ భరించాను. కానీ నాలుగోమారు..మీ ఊరి నాణేలని కలిపేసి..నా శీలాన్ని శంకించారు. ఇది నేను భరించలేని అవమానం. ఆ కారణంగా..మీరు నాలో పడేసిన నాణేలని..వేటినీ నేను తిరిగి ఇవ్వబోవడం లేదు. అదీ కాక..అదనంగా ఇంకో మూడు వందల డాలర్ల జరిమానా విధిస్తున్నాను.. ఎలాగంటారా.. పోయిన సోమవారం సాయంత్రం ఆరుగంటల నలభై మూడు నిమిషాల ఇరవై సెకండ్ల టైమ్‌కి.. మీరు అరవై మూడు డాలర్ల యాభై మూడు సెంట్లకి సోపులూ, చాక్లెట్లూ వీసా క్రెడిట్ కార్డ్ XXXX - XXXX - XXXX - 1234 మీద కొన్నారు.

ఈ వాక్యం చదివేలోపు ఈ కార్డ్‌కి..మీరు మూడు వందల డాలర్ల డెబిట్ ఐపోయుంటుంది.(మీ భద్రత కోసమూ, సెక్యూరిటీ కారణాల వల్లా మీ క్రెడిట్ కార్డ్ తాలూకూ పూర్తి వివరాలు పేర్కొనడం లేదు) ఆ రోజున చాక్లెట్లూ, సోపులూ కొన్న వ్యక్తీ, ఈ రోజున నాణేలు పోసిన వ్యక్తీ ఒక్కడేనని ఎలా నిర్ధారించామన్న పిచ్చి సందేహాలు వద్దు. కొనుగోలు చేసిన ప్రతి వ్యక్తి తాలూకు ఫోటో మా రికార్డులలో నిక్షిప్తమై ఉంటుంది. మా జాగ్రత్తలో మేముండాలి గదా!'' ఈ విషయం గురించి..మీకు దిక్కున్న చోట చెప్పుకోవచ్చు. మీ అమెరికా ప్రయాణం సుఖంగా జరగాలని మనసారా ఆశిస్తూ..సెలవు తీసుకుంటాను

బొమ్మ: బాపు

★★★

అది సాంతం చదివాక.. అంతకు ముందు రోజే శ్రీరామజయం.. లవకుశ.. సినిమాలను రెంటినీ రెండు ఛానెళ్లలో చూసిన వెంకయ్యనాయుడు ''సీతాదేవి శీలాన్ని శంకించిన శ్రీరాముడికే శిక్ష తప్పలేదు.. ఇహ నేనో లెక్కా!!!'' అని ఆత్మారాముడికి సర్దిచెప్పి.. పార్కింగ్ లాట్ వేపు నడిచాడు.

– శీనా
097890 58199

మాయాజాలం

''మా బంధువుల అబ్బాయైతే చదువులో నెంబర్ వన్. కాలేజీ టాపర్. అవసరమంటే నెట్ పెట్టించారు. ఎలా చిక్కుకున్నాడో గానీ ఎప్పుడు చూడూ కొత్త సినిమాలు, గేమ్స్, పాటలు, పోర్న్ వీడియోలు, ఫేస్‌బుక్‌లు, ట్విట్టర్లు, ఛాట్‌లు, మెయిళ్లంటూ రాత్రింబవళ్లు ఆ గదిలోనే. రిజల్ట్స్ వచ్చేదాకా వాస్తవం గ్రహించలేకపోయారింట్లో. కానీ ఏం లాభం? అప్పటికే బానిసైపోయాడు. కనెక్షన్ తీసేస్తే పిచ్చిపట్టినవానిలా అరుస్తూ కేకలేస్తున్నాడు. మానసికంగా దెబ్బతిని ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు''

పొద్దున్నే ఫోన్ చేశావ్ ?'' అంటూ లావణ్య అసలు విషయంలోకి దించింది.

''అదేనే ... నీవు చెప్పావు కదా. నెట్‌లో పిల్లలు ఏం చేస్తున్నారో గమనించమని. అలాగే చూశా. పనికొచ్చేవి పదయితే పనికి రానివి నూటాపది. కొన్ని చూస్తే తలతిరిగిపోయింది. ఆడపిల్లలు కూడా ఇలాంటివి చూస్తారా అని ఆశ్చర్యమేసింది. ఏం చేయాలో తోచక నీ దగ్గర కొచ్చాను'' అంటూ జరిగిందంతా వివరించింది.

''ఆడపిల్లా, మగపిల్లా అని చూడొద్దు. ఆకర్షణలు అంత బలంగా ఉంటాయి. ఏమాత్రం నియంత్రణ కోల్పోయినా చాలు సాలెగూట్లో చిక్కుకుపోతారు. మా బంధువుల అబ్బాయైతే చదువులో నెంబర్ వన్. కాలేజీలో టాపర్. అవసరమంటే నెట్ పెట్టించారు. ఎలా చిక్కుకున్నాడో గానీ ఎప్పుడు చూడూ కొత్త సినిమాలు, గేమ్స్, పాటలు, పోర్న్ వీడియోలు, ఫేస్ బుక్‌లు, ట్విట్టర్లు, ఛాట్‌లు, మెయిళ్లంటూ రాత్రింబవళ్లు ఆ గదిలోనే. వాళ్ల నాన్న వాడి కళ్లకింద నల్లని చారలు చూసి

నెట్ పెట్టించాక పాపం ఇంకా కష్టపడి చదువుతున్నాడు అనుకున్నాడేగానీ, రిజల్ట్స్ వచ్చేదాకా వాస్తవం గ్రహించలేకపోయాడు. కానీ ఏం లాభం? అప్పటికే బానిసైపోయాడు. కనెక్షన్ తీసేస్తే పిచ్చిపట్టినవానిలా అరుస్తూ కేకలేస్తున్నాడు. మానసికంగా దెబ్బతిని ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు'' చెప్పింది లావణ్య.

ఆ మాట విని ధనలక్ష్మికి భయం వేసింది. ''ఐతే, ఇప్పుడే నెట్ తీపించేస్తా.. పీడా పోతుంది'' అంది.

''నేను చెబుతున్నది అందుక్కాదు. వాళ్లు ఎదగడానికి సదుపాయాలు ఎంత అవసరమో, వాటికి బలికాకుండా చూసుకోవడం కూడా అంతే అవసరం అని అర్థం చేసుకోవడానికి. ఇందులో పిల్లల తప్పుకన్నా మన తప్పే ఎక్కువ. ఇంత చదువు చదివి కూడా పిల్లల భవిష్యత్ కోసం ఆ కంప్యూటర్ గురించి, ఇంటర్నెట్ గురించి తెలుసుకోవడం ఎలా? అదేదో పెద్ద బ్రహ్మరాక్షసి అన్న భయం మనలో పేరుకుపోయింది. మనం దాంట్లో కోర్సులు నేర్చుకోవడమంటే కష్టంగానీ బేసిక్స్ తెలుసుకోవడానికి ఎంతసేపు? ఈడ్చికొడితే మూడు నెలలు చాలు. ఏమాత్రం తెలివి తేటలు లేని, పనికి రాని సన్నాసయినా సరే కాస్త బట్లర్ ఇంగ్లీష్ వస్తే చాలు సులభంగా వచ్చేస్తుంది అది. మనకు కంప్యూటర్ గురించి తెలుసు అనే భావన పిల్లల్లో కలిగుతే చాలు. వాళ్లు హద్దుల్లో ఉంటారు. అలాగే ఆ మేడమీది గదిలోంచి కిందకి దించి అందరూ తిరిగే ప్రదేశంలోనే కాస్త ప్రైవేట్‌గా ఉండేలా ఏర్పాటు చేయి. దాన్ని వాడటానికి రెండు గంటలో, మూడు గంటలో సమయాన్ని నిర్ణయించు. అలాగే మీ పిల్లలకి నీవు తెలుసుకున్న విషయాన్ని ఏమాత్రం తడబాటు లేకుండా ముఖాముఖి చెప్పి ... ఇంకోసారి ఇలాంటివి జరిగితే ఊర్కోనని వార్నింగ్ ఇవ్వు'' అంటూ అనేక సలహాలు ఇచ్చింది.

లావణ్యకు థాంక్స్ చెప్పి బయలుదేరింది ధనలక్ష్మి. ఇంటికి దగ్గరలో 'నైస్' కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ కనిపించింది. లావణ్య మాటలు గుర్తుకు వచ్చాయి. కొత్త బ్యాచ్ ఎప్పుడు మొదలవుతుందో కనుక్కోవడానికి లోపలికి అడుగు పెట్టింది.

.....

రచయిత సెల్: **94410 32212**

❖ సినిమా పజిల్

నిర్వహణ : **యజ్ఞమూర్తి**



అడ్డం

1. నాగార్జున హీరోగా ఆర్.ఆర్. మూవీ మేకర్స్ నిర్మించిన చిత్రం (4)
4. 'ఆనాటి చెలిమి ఒక కల' పాట ఈ చిత్రంలోనిదే (4)
5. ప్రవరాఖ్యుడిని వలచిన యువతి, ఎస్వీ రంగారావు తొలి చిత్రం (4)
8. కాంతారావు, రాజశ్రీ జంటగా విఠలాచార్య చిత్రం (5)
10. జె.డి. చక్రవర్తి హీరోగా నటించిన సినిమా (2)
11. 2005లో వచ్చిన ఓ బి-గ్రేడ్ సినిమా (4)

నిలువు

1. రాజేంద్ర ప్రసాద్, సీత జంటగా రేలంగి నరసింహారావు చిత్రం (7)
2. అజయ్‌దేవగన్, వివేక్ ఒబెరాయ్‌తో రాంగోపాల్ వర్మ సినిమా (3)
3. 'మనుషులు చేసిన దొంగలు'లో కృష్ణ జోడీ (3)
6. 2011 నంది అవార్డుల్లో తృతీయ ఉత్తమ చిత్రం తారుమారు (3)
7. 'పాలు నీళ్ళు'లో మోహన్‌బాబు సరసన నాయిక(4)
9. 'కందిరీగ' హీరోయిన్ (3)

గత వారం జవాబులు

1 సు	ధా	క	ర్	●	●	2 క
త్తి	●	●	●	3 రా	జీ	వి
4 వే	ణు	5 శ్రీ	రా	మ్	●	త
లు	●	రా	●	6 చ	క్రి	●
●	●	7 మ	ధు	ర	●	8 దే
9 క	●	ర	●	10 ణ్	రు	వ
11 క్ష	ణ	క్ష	ణం	●	●	త



అడ్డం

1. ఎల్లోరాతో పాటు గుర్తొచ్చే గుహలు (3)
4. అందమైన జలపుష్పం – ఒక రకం గజ్జికి ప్రతినామం (3)
6. సృష్టికి ప్రతి సృష్టి చేసిన నరుడు – స్నేహితుడితో అంతమయ్యాడు (3)
9. పేరుమారిన 'క్రియ' – అట్నుంచి (2)
11. కొందరు దీన్ని పూసి మారేడు కాయ చేస్తుంటారు (2)
12. మద్దెలతో మొరపెట్టుకున్నదెవరు? (2)
14. 'మంచి' – చెప్పబోతే పల్టీ కొట్టింది (2)
15. తెలంగాణ 'దప్పిక ' (2)
16. సరస్వతీ కొలువైన తెలుగువారి ప్రసిద్ధ క్షేత్రం (3)
17. నీడలా వెంటాడే – 'మధుబాబు' కథానాయకుడు (2)
18. కాలుతున్న శవం (2)
19. కాళిదాసులో కనిపించే బంగారం తూనిక (2)
20. ఆద్యంతాల హాహాకారం (2)
23. మన్మథసతి (2)
25. 'చలం'గారి చివరి మజిలీ (5)
28. 'రాయల కవి' – ముక్కుతో ప్రసిద్ధి చెందిన 'అష్టదిగ్గజం' (3)
29. 'కాటకం' సవరిస్తే – ఒకనాటి ఒరియా రాష్ట్రం (3)

నిలువు

1. 'పృథ్వి'కి మరోపేరు (3)
2. సువాసన – బంగారానికి అబ్బినట్టని సామెత (2)
3. ఇది కానివాడు మోక్షగామి కాడంటారు (2)
4. రోజులు మనవి కాకపోతే పామై కరిసేది (2)
5. వికృతిలోకి మారిన 'రాక్షసి' (3)
7. ఊపిరి (2)
8. తల తెగిన 'శత్రువు' (2)
10. ఎంతసేపూ మన గురించేనా? పొరుగువారికి బాసటగా ఉందాం (5)
11. రాక్షస సంహారిణి ... '-----మర్దిని' (5)
13. రెండ్రోజుల్లో రాబోయే పర్వదినం (3)
20. దేవుడి ముందు జ్వలించే కర్పూరం (3)
21. తేనీరులో దాగిన 'దేవుడి రథం' (2)
22. ఈ పీనుగు తోడు లేకుండా వెళ్లదంటారు (2)
24. బొట్టు – లలాటంపై దిద్దేది (3)
25. అనసూయలో సగం (2)
26. తిరగబడ్డ ఒకనాటి 'ఆరుపైసలు' (2)
27. చుట్టూ నీళ్లున్న ప్రాంతం – త్రేతాయుగపు రాజ్యం (2)

గత వారం జవాబులు

1 ప	ధ్ధ	2 తి	●	3 చా	●	4 చ	పా	5 తి
ర	●	6 ప	7 రి	చా	8 రి	క	●	తు
9 శు	10 బం	●	థం	●	క్షా	●	11 పా	వు
●	12 గా	లం	●	13 దు	●	14 బో	ణి	●
15 ఊ	ళ	●	16 దు	బా	య్	●	17 గ్ర	హ
●	18 దుం	గ	●	రా	●	19 స	హ	●
20 చా	ప	●	21 తే	●	22 జ	●	23 ణం	24 బా
రి	●	25 సో	మ	26 రి	త	27 నం	●	బ
28 క	బో	ది	●	గౌ	●	29 గి	టా	ర్

నిర్వహణ : గొరుసు

గత వారం జవాబులు

1	5	6	7	8	9	2	3	4
8	3	9	2	5	4	6	1	7
7	2	4	3	6	1	9	8	5
6	7	8	9	2	3	4	5	1
9	1	3	4	7	5	8	2	6
2	4	5	6	1	8	7	9	3
3	6	2	1	9	7	5	4	8
4	8	7	5	3	2	1	6	9
5	9	1	8	4	6	3	7	2

అంకెళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

3	8			1			5	9
			7		9			
	7	9		2		6	1	
	4		6	7	5	9		
	3	5				1	7	
	9		2	3	1	4		
5	2			6		8	9	
			8		7			
	6	3		9			4	7

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255
ఫోన్: 040-6522 5554

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారిచూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్త మడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలుర మవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు .....

పుట్టిన తేదీ .....

పుట్టిన సమయం .....

పుట్టిన ఊరు (మండలం).....

ప్రశ్న .....

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా

అదృష్ట రత్నజ్యోతి,

ఆంధ్రజ్యోతి దినపత్రిక
ప్లాట్ నెం.76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 033.

అదృష్ట రత్నజ్యోతి

కె.ఆర్.కె.ఆర్., హైద్రాబాద్

మా అబ్బాయి జన్మకుండలి సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు.

మీ అబ్బాయి జన్మకుండలి ప్రకారం–

నక్షత్రం ఉత్తర.

2012 మార్చ్ నుంచి 2019 జనవరి వరకూ కుజ దశ.

2019 జనవరి నుంచి 2036 అక్టోబర్ వరకూ రాహుదశ.

2036 అక్టోబర్ నుండి 2052 ఆగస్ట్ వరకూ గురు దశ.

2052 ఆగస్ట్ నుండి 2071 ఏప్రిల్ వరకూ శని దశ.

కంట్రోలింగ్ ఫేక్టర్స్ : కుజునికి బుధశనులు. రాహువుకు బుధ చంద్రులు. బృహస్పతికి బుధ శనులు. చెడు నిర్ణయాలు తీసుకోవడంలో తనకు తానూ, మంచి నిర్ణయాలు తీసుకోవడంలో శని కంట్రోలింగ్ ఫేక్టర్స్‌గా పనిచేస్తారు. దీనినే మరోలా చెప్పుకుంటే, జీవితంలో మంచి స్థితి నుంచి వ్యసనాలు లేదా తప్పుడు నిర్ణయాలతో చెడిపోవడానికి ఇక్కడ బృహస్పతీ, ఎలాంటి నీచ స్థితి నుండయినా ఒడ్డుకు తీసుకువచ్చి బాగుపడేలా చేసేది శనీ అని గ్రహించాలి!

విచిత్రమేమంటే సూర్యుని వలన శని చేసే మంచి అప్పుడప్పుడూ వికటిస్తుంది, అదృష్టం బలహీనపడుతుంటుంది!

యోగాలు : పరివర్తన యోగం. భాగ్య దశమాధిపతుల మధ్య పరివర్తన. రవి గురులకు గట్టి రెమిడీస్ పాటిస్తే పనిచేయడం 60 నుండి 90 శాతానికి పెరుగుతుంది.

దశలు : ప్రస్తుతం ప్రారంభమైన కుజ దశ బాగుంటుంది. అయితే చిన్నచిన్న గండాలు కాకుండా ఆయా రెమిడీస్ పాటించాలి.

అధిపతీ, కారకుని మీద కుజుని వీక్షణ, అధిపతి గురునికి తిరిగి విద్యాస్థానం మీద వీక్షణ, కుజునిలో శని ప్రభావం ఇంబైబ్ అయి ఉండడం, పరివర్తన యోగం వంటి కాంబినేషన్స్ వలన కుజ దశ విద్యని ఇంజినీరింగ్ వైపు నడిపిస్తుంది. అయితే రాహు దశ ప్రారంభంలోనే... అంటే 2019 జనవరి నుండి... అంటే తన 20వ ఏట నుండి విదేశాల్లో విద్యనభ్యసించడం జరుగుతుంది. ఇంజినీరింగ్ అక్కడ పూర్తి చేయడం జరుగుతుంది. అయితే రాహువులో గురుని భక్తిలో ఈ జాతకుడు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. వయసు, అతి నమ్మకం చెడగొట్టకుండా చూసుకోవాలి. పైన చెప్పుకున్నది ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. రాహువులో గురునిలో చెడిపోయే పరిస్థితులు ఎలా వస్తాయో, రాహువులో శనిలో ఒక్కసారిగా అకస్మాత్ సంఘటనలతో, ఆలోచనా వికాసం కలిగి మంచి మార్గంలోకి వెళ్ళడం, తిరిగి జీవితంలో చెడిపోయే ఆలోచనా విధానంలోకే వెళ్ళకుండా కృతనిశ్చయానికి రావడం మంచి పరిణామంగా చెప్పుకోవాలి. ఏదిఏమైనా, ఎక్కడ ఉన్నా... ఈ జాతకుని జీవితంలో అత్యంత కీలకమైన పీరియడ్స్–

1. 2021 సెప్టెంబర్ నుండి 2024 ఫిబ్రవరి మధ్య.
2. 2050 మార్చ్ నుండి 2052 ఆగస్ట్ మధ్య.

ఏదిఏమైనా రాహుదశలో దాదాపుగా విదేశాల్లోనే ఉండడం గురుదశ అక్కడా ఇక్కడా అన్నట్టుగా నివసించడం జరుగుతుంది. అయితే శని దశలో... అంటే 53వ ఏట నుండి మళ్ళీ ఎక్కువ కాలం విదేశాల్లోనే ఉండడం, ఆ దశ మొత్తం శుక్రుని కారణంగా యోగించడం ఉంటుంది. శుక్రుడు తనకు తాను మేలు చేసుకోలేకపోయినా శని దశను యోగించేలా చేయడం విశేషం. ఇక్కడ యోగకారకుడయిన శుక్రుడు తన అంతర్దశలో యోగించాలని ప్రయత్నించడం, గురుని సహాయ నిరాకరణ వలన యోగించాల్సినంత యోగించలేకపోవడం కారణంగా బృహస్పతికి ఆయా సమయాల్లో ఆయా పరిహారాలు పాటించాలి.

లాంగండ్ షార్ట్ ఏతావాతా చెప్పుకుంటే– ఇక్కడ రవి అదృష్టాన్ని ఎప్పటికప్పుడు తగ్గించడానికి; చంద్రుడు స్థిరత్వం లేని ఆలోచనా విధానానికీ; కుజుడు ధనాన్నీ, ఆయుష్షునీ పెంచడానికీ; రాహువు ధనాన్నీ, స్నేహాన్నీ ఇచ్చి పోగొట్టడానికీ, అలాగే వృత్తిలో ఎప్పటికప్పుడు మార్పు కలిగించడానికీ; గురువు వృత్తికీ, వ్యాపారం చేసి నష్టపోవడానికీ, జీవిత భాగస్వామి చేతిలో కీలుబొమ్మయి పోవడానికీ, భాగస్వాముల చేతిలో మోసపోవడానికీ; శని ధనాన్నీ, పూర్వపుణ్యాన్నీ అందుబాటులోకి తీసుకు రావడానికీ; బుధుడు భాగ్యాన్నీ కలిగించాలని ప్రయత్నించడం... ఆ ప్రయత్నంలో సూర్యుని వలన సంపూర్ణ స్థాయిలో చేయలేకపోవడం, అయితే విదేశయానానికి మాత్రం అడిగినంత మాత్రాన ఔననడానికీ; కేతువు ఒక క్షణం ఆస్తికత్వం, మరుక్షణం నాస్తికత్వం కలిగించడానికీ, శుక్రుడు మంచి వాహన యోగం ఇచ్చినా గురుని వలన వాహన ప్రమాదాలు తప్పించలేకపోవడానికీ పనిచేయడం జరుగుతుంది!

వివాహం : లగ్నాత్తూ, చంద్రలగ్నాత్తూ కూడా వివాహాన్నిచ్చే అధికారం బృహస్పతిదే. రాహువులో గురునిలో వివాహం... అంటే 25వ ఏట. గత జన్మ వైరం ప్రథమ పరిచయంలోనే తెలిసిపోతుంది కదా. ఉయ్యాల జంపాలలూగిస్తుందనుకున్న భార్య రాచి రంపాన పెట్టడం ఊహించని ఘాతం! దీనితో నిద్రపోతున్న ద్విస్వభావ యోగం ఉద్దీప్తమవ్వడం, మరో స్త్రీ తన జీవితంలోకి ప్రవేశించడం అనివార్యమవుతుంది. తనను తాను మేధావిగా, రింగ్ మాస్టర్‌గా ఊహించుకునే మొదటి భార్యతో పోల్చి చూసుకుంటే ఈమె మరో వరం... మానసిక సరోవరం!

సప్తమాధిపతికి ద్విస్వభావం, అష్టమ స్థితీ కలిగితే జరిగే పరిణామాలూ, ప్రమాణాలూ ఇలాగే ఉంటాయి.

ఈ లోకంలో అంతే... కావలసిన వారికి అందదు, అందిన వారికి కావాలనిపించదు. ఏదయినా ప్రారబ్దమే కదా...

అదృష్ట రత్నం : పచ్చ.

శక్తియుక్తులు : జీవితం ప్రవహించే నది! హృదయం చాలా ఇరుకయి నది!

ప్రేమ... స్మృతి సంపాతమయిపోయే ఒక జ్ఞాపకం!

వివాహం... అనివార్యమయిన వ్యాపకం!

న వైరాగ్యాత్పరం భాగ్యమ్!!

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అధినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అధినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 62255** Advt

విశాఖపట్నం నుండి స్వీడన్ వెళ్ళి అక్కడ దీవుల్లో టూరిస్టుగా కాక స్థానికుడుగా గడిపి వచ్చారు ప్రొ. ఎం.ఆదినారాయణ. విస్బీ నగరంలో తన చిత్రకళా ప్రదర్శన, కొత్త పరిచయాలు, పాటల గురించి ఆయన చెప్పిన విశేషాలే నేటి ట్రావెలోకం.

విస్బీలో నా బొమ్మల ప్రదర్శన

స్వీడిష్ యాత్ర-3

స్టాక్‌హోం మ్యూజియంలో...

స్టీఫెన్ హాన్స్ అనే ఒక ఆర్కిటెక్టు ఈ గ్రామంలోనే ఉన్నాడనీ, అతడు తన ఇంటి చుట్టూరా నాలుగు అడుగుల ఎత్తులో రాతిగోడని నిర్మిస్తున్నాడని తెలియగానే అక్కడ ఉలి దొరికే అవకాశం ఉందేమోనని ఇద్దరం ఆయన వద్దకి వెళ్ళాం. ఆయన కట్టిన గోడ చాలా అందంగానూ, దృఢంగానూ ఉంది. సిమెంటు లేకుండా కడుతున్న ఆ గోడకి మూలసూత్రం ఇంటర్ లాకింగ్ సిస్టమ్. ఒక రాతిని మరొక రాయితో అనుసంధానం చెయ్యడం ద్వారా స్వీడన్‌లో చాలా కోటలు, చర్చిలు నిర్మించారు. ''నా వద్ద సుత్తులు మాత్రమే ఉన్నాయని'' చెప్పాడు. ఎందుకైనా మంచిదని రెండు చిన్న సుత్తులు తీసుకున్నాం.

సంప్రదాయాన్ని ఇంకా పాటిస్తున్నారు

సాయంత్రం గున్నెల్ రాగానే ముగ్గురం కలిసి తీరంలో ఉన్న ఒక చారిత్రక ప్రదేశానికి వెళ్ళాం. ఒక ఎత్తయిన గుట్ట ఎక్కి చదునైన ప్రదేశం చేరుకున్నాం. అక్కడి నుండి సముద్రం చాలా దూరం వరకూ కనిపిస్తూనే ఉంది. క్రీ.శ. 9-10 శతాబ్దాల్లో ఈ ఎత్తయిన ప్రదేశంలో గ్రామానికి సంబంధించిన రక్షకభటులు ఉండేవారట. సముద్రం మీదుగా దండయాత్రకి వచ్చే వైకింగ్‌ల ఓడల్ని ఇక్కడ నుండి గమనించవచ్చు. ప్రమాదాన్ని పసిగట్టగానే మంటలు వేసి, డప్పులు మ్రోగించి ఇతర కాపలాదార్లకి తెలియజేసేవారు. క్షణాల్లో ద్వీపం అంతటా తెలిసిపోయి శత్రువుని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యేవారు. ఆనాటి చరిత్రని వాళ్ళు ఇప్పటికీ గుర్తుపెట్టుకుని, ప్రతి చలికాలంలోనూ ఆ కొండమీద మంటలు వేసే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

అలా మేము కొండల మీద తిరుగుతున్నప్పుడు గున్నెల్ దృష్టి నుండి ఒక పువ్వు కూడా తప్పించుకునేది కాదు. 'ఐ లవ్ ఫ్లవర్స్' అంటూ వాటి దగ్గర కూర్చుని ముద్దులు పెడుతూ ఉండేది. ''ఈ రోజు ఎలాగైనా టూల్స్ సంపాదించి బొమ్మల్ని పూర్తి చేయాలి'' అనే ఉద్దేశంతో ఉదయాన్నే సూంద్రేలో ఉన్న సున్నపు రాతి గనుల వద్దకి వెళ్ళాం. అక్కడ మాకు విన్సెంట్ విలియమ్స్ అనే శిల్పి పరిచయమై 'నా స్టూడియోకు రండి' అంటూ తీసుకెళ్ళి రెండు మంచి ఉలులు ఇచ్చాడు. 'నేను పొలిటికల్ సైన్సు ప్రొఫెసరుగా ఉప్‌సాలా యూనివర్సిటీ నుండి రిటైర్ అయ్యాకే శిల్పాలు చెక్కడం నేర్చుకున్నాను'' అని తన కళా జీవితం గురించి చెప్పారు.

తిరిగి వస్తున్నప్పుడు 'Lasers Jason Bird Museum' చూశాం. స్టాక్‌హోంలో బెర్గ్‌మేన్ ఫెస్టివల్ జరుగుతుందని, ఆ సందర్భంగా మంచి నాటకాలు వేస్తున్నారని ఆ మ్యూజియం నోటీస్ బోర్డులో చదివాను. మరోచోట ''కారల్ లిన్నేయస్ 1741వ సంవత్సరంలో ఇక్కడ పరిశోధనలు జరిపాడు'' అని చెక్కిన రాతి ఫలకాన్ని చూశాను. ఇంటికి రాగానే రెండు రోజుల పాటు స్టోర్‌రూంలో గొర్రెతోలు మీద కూర్చొని అడుగు సైజు రాతి బొమ్మలు రెండిటిని చెక్కగలిగాను. వాటి మీద 'ట్రావెలింగ్ టెరన్' అని సంతకం చేసి గున్నెల్ మేడమ్‌కి ఇవ్వగానే 'వావ్' అంది. తెల్లవారితే మే 18వ తేదీ. నేను ఊహించినట్టుగానే సాయంత్రానికి లూసియన్ ఫోన్ చేశాడు. విస్బీలో నా బొమ్మల ప్రదర్శన కోసం గ్యాలరీ దొరికిందని చెప్పాడు. వెంటనే బయల్దేరి సాయంత్రానికి లూసియన్ ఇంటికి చేరుకున్నాను.

తక్కువ ధరకే పిల్లి బొమ్మ అమ్మేసా

విస్బీలోని ప్లిండ్‌బెర్గ్ ఆర్ట్ గేలరీలో, నేను తీసుకువచ్చిన చిత్రాల్ని ప్రదర్శనకు పెట్టాను. గ్యాలరీ చిన్నదే అయినా, యజమాని మంచివాడు. అతడూ పెయింటర్ కావడంతో సులభంగానే స్నేహం కుదిరింది. ఆ రోజు ఉదయం అలీసా అనే అమెరికన్ అమ్మాయి కాస్త ముందుగానే గ్యాలరీకి రావడంతో ఆమె చేతుల మీదుగానే బొమ్మలు తగిలించడం, వాటికి టైటిల్స్ తయారు చేయడం లాంటి ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. ఎగ్జిబిషన్ చూడడానికి వచ్చిన వారిలో ఒకామెకి పిల్లి బొమ్మ నచ్చింది. ''పోయిన సంవత్సరం నా పిల్లికి కాన్సర్ వచ్చి మరణించింది. నాకు ఆ బొమ్మ కావాలి'' అని అడగడంతో ఆ బొమ్మను చాలా తక్కువ ధరకే అమ్మవలసి వచ్చింది. సాయంత్రం లూసియన్ రాగానే ''మన ఫెరిలూన్ ఐలాండ్ ఇంటిని ఈ రోజే ఆన్‌లైన్‌లో ఒక జర్మనీ కుటుంబం వారు అద్దెకు తీసుకున్నారు. కాబట్టి మనం రేపు ఉదయాన్నే అక్కడ సామానంతా ఖాళీచేసి, స్టోన్‌షీర్‌కాలో ఉన్న ఇంటికి మారిపోవాలి'' అని చెప్పాడు.

తెల్లారి లేవగానే అదే పనిలో ఉండి, పది గంటల కల్లా కొత్త ఇంటికి వెళ్ళాం. అరగంట డ్రైవ్. ఇల్లు పెద్దదే కానీ రోడ్డుకి దూరంగా ఉంది. ఇంట్లో టాయిలెట్ లేదు. ఎదురుగా ఉన్న చెట్ల కింద ఒక డ్రై టాయిలెట్ ఏర్పాటు చేశారు. అక్కడ నీళ్ళు వాడకూడదు. పేపరే ఉపయోగించాలి. భరించలేని వాసన. నేను మాత్రం సాయంత్రానికల్లా మూడు అడుగుల లోతు గుంట తీసుకుని దాన్ని వెట్ టాయ్‌లెట్‌గా మార్చుకున్నాను. నా ఇండియన్ టాయిలెట్ లూసియన్‌కి నచ్చినా, ఆ స్టూలు వదిలి పెట్టి రాలేకపోయాడు. నా టాయిలెట్ ఉపయోగించిన ప్రతిసారీ మట్టితో కొంచెం పూడ్చుకుంటూ పోవాల్సిందే. ఇంటి చుట్టూతా మాత్రం అద్భుతమైన వాతావరణం ఉంది. ఎటుచూసినా పసుపు రంగు పూల పానుపులే. పీజెంట్ పక్షుల కూతలు మధురంగా ఉన్నాయి. పచ్చిక బయలులో Wild Onions కనిపించాయి. ఫెరిలూన్ కంటే వంద రెట్లు బాగుంది. సముద్రం దగ్గరలోనే ఉంది. ఆ బీచ్ పేరు జుంగ్‌ఫ్రూన్.

పెరిగిన గడ్డిని గొర్రెగా మలిచా...

ఈ ఇంట్లో ఉన్న మూడు గదులు చిన్నవైనా చాలా చక్కగా ఉన్నాయి. ఇక్కడ లూసియన్ చేయబోతున్న పని ఏమంటే రబ్బరు అచ్చుల నుండి ప్లాస్టర్ బొమ్మల్ని పోతపోయటం. ఇవి ఒక అడుగు సైజు కంటే పెద్దవి కాదు. వారాంతాలలో జరిగే లొప్పిస్ (పాత సామానులు అమ్మే షాపు)లో వీటిని అమ్మితే కొంత డబ్బు వస్తుంది. ''టాక్సులు ఎక్కువ కట్టాలి. అందుకోసం మేము కష్టపడక తప్పదు'' అని చెప్పాడు లూసియన్.

సాయంత్రానికి రెండు బస్తాల ప్లాస్టర్‌ని సిద్ధం చేసుకున్నాం. అచ్చులు ఆరబెట్టడానికి వీలుగా ఒక బల్లని కూడా శుభ్రం చేశాం. కాని ఆ బొమ్మలు చేయడానికి ఆయన నా సహాయం అడగలేదు. అన్ని పనులూ స్వయంగానే చేసుకుంటున్నాడు. ''ఆ లాన్ మీద గడ్డి బాగా పెరిగింది. ఏదైనా ఒక బొమ్మ చేస్తే మంచిది కదా!'' అన్నాడు. అంతకు ముందున్న ఇంటిలో ఒక పక్షి బొమ్మను, గుడ్డు బొమ్మను చేసి పెట్టా కదా. అది గుర్తొచ్చినట్టుంది. మరుసటి ఉదయాన్నుంచే నా పని మొదలుపెట్టాను. లాన్‌మూవర్‌తో, ఒక పద్ధతి ప్రకారం గడ్డినంతా కట్ చేస్తూ ఒక పెద్ద గొర్రె ఆకారాన్ని తీసుకురాగలిగాను.

పది గంటల ప్రాంతంలో లూసియన్ బల్ల మీద నుంచి పడిపోవడంతో ఆయన కాలు బాగా నొప్పి చేసింది. చెక్క సోఫా మీద ఆయన్ని పడుకోబెట్టి ''ఈ పూటకి విశ్రాంతి తీసుకోండి సార్!'' అంటూ నేనే టీ తయారు చేసి ఇచ్చాను. గతంలో ఒకసారి తన మోకాలికి ఆపరేషన్ జరిగిందని చెప్పాడు. ఓ గంట పోయాక నన్ను పిలిచి ''మొన్న అలీసాకి ఇల్లు సమస్యగా ఉందని చెప్పావు కదా. ఆమెని ఇక్కడికి పిలిస్తే మనకి అన్నం వండి పెడుతుంది. ఆమె సమస్య కూడా తీరిపోతుంది. ఏమంటావు?'' అని అడగ్గానే ఆమె నంబరు ఇచ్చాను. సాయంత్రం నాలుగు గంటల కల్లా అలీసా ఒక్కతే చిన్న సంచి తీసుకుని వచ్చేసింది. అలీసాకి 32 ఏళ్ళుంటాయి. నా అంత పొడుగు ఉంటుంది. కళాభిమాని. అమెరికాలోని మిన్నెసోటాలో కొంతకాలం పాటు బ్యాంక్ ఉద్యోగం చేశాక మనసు మార్చుకుని, సంగీతం నేర్చుకుని చిలీ వెళ్ళిపోయి వాళ్ళ తమ్ముడి వద్ద ఉందట. ''పెళ్ళి చేసుకుని, డబ్బు సంపాదించి మేము గర్వపడేలా ఏదైనా గొప్ప పని చేయమ్మా'' అని తన కుటుంబ సభ్యులు చెప్పిన మాటల్ని వినకుండా రెండు సంవత్సరాల క్రితం స్వీడన్ వచ్చి, ఉప్‌సాలా సిటీలో ఒక ఆర్టిస్ట్ ఫ్రెండ్ వద్ద ఉంటూ ఉంది. ''సార్, ఒక నెల రోజులు మీరు నాకు నివాసం ఏర్పాటు చేయగలిగితే చాలు'' అని అడిగింది లూసియన్‌ని.

''మేం ఇక్కడ సరిగ్గా మూడు రోజుల కంటే ఎక్కువ ఉండం. తర్వాత నీవు ఒక్కదానివే ఉండాలి. అలా అయితే రెండు నెలలు ఉండిపోయినా ఫరవాలేదు'' అని లూసియన్ చెప్పడంతో ''మెనీ థాంక్స్, అలా అయితే దగ్గరలోనే ఒక ఉద్యోగం కూడా వెతుక్కుంటాను'' అంటూ సంతోషపడింది.

తన బొమ్మల ప్రదర్శనశాలలో అలీసాతో...



లూసియన్

పాటలో ప్రతిబింబించిన అలీసా జీవితం

డిన్నర్ పూర్తయ్యాక తన చిన్న సంచిలో నుండి గిటార్ లాంటి మూడు తీగెల వాయిద్యాన్ని బయటికి తీసింది. ''ఇది రష్యా దేశపు గిటారు, పేరు భ్యూదా. మా అంకుల్ పాత సామాన్ల పెట్టెలో దొరికింది'' అని చెపుతూ శృతి చేసుకుని తాను స్వయంగా రాసుకున్న పాటల్ని చక్కగా పాడింది. లూసియన్ కాలునొప్పితో ఈజీచైర్‌లో ఉండిపోయినా, కెమెరాకి మాత్రం పని చెబుతూనే ఉన్నాడు. కొవ్వొత్తి వెలుగు ఆమె గిరజాల జుట్టు మీదకి చేరుకుని జారుడుబల్ల ఆట మొదలుపెట్టింది. ఎంతో మధురంగా ఆమె పాడుతూ ఉంటే చూడముచ్చటగా ఉంది. 'We are like the ships in the harbour' అనే పాట తన జీవితాన్ని గురించి రాసినట్లుగా అనిపించింది. నా కోసం 'The wind blows into your sails, for your heart is open' అనే లిరిక్ పాడింది.

జూన్ మొదటి వారంలో లూసియన్ బెల్జియం వెళ్ళిపోవాలి. ఆ వారంలో నన్ను గెస్ట్‌గా ఉంచుకోవడానికి బెర్నాదెత్తే మేడం స్టాక్‌హోంలో సిద్ధంగా ఉంది. లూసియన్ చేసిన ప్లాస్టర్ బొమ్మల్ని షాపుల్లో ఇవ్వడం, ఎగ్జిబిషన్ నుండి నా బొమ్మల్ని వెనక్కి తేవడం మాకు మిగిలిన పని. ఒక గంటసేపట్లో ఆ పని కూడా పూర్తి చేశాం. జూన్ మొదటి వారంలో 'ఇండో స్వీడిష్ క్లబ్, స్టాక్ హోం'లో నా ఉపన్యాసం ఉందని ఆ క్లబ్ సెక్రటరీ హరిహరన్ మెయిల్ పంపాడు. కాబట్టి మేము రేపు సాయంత్రానికల్లా బయలుదేరి స్టాక్‌హోం వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాం. లూసియన్ ఇప్పుడు బాగానే నడవగలుగుతున్నాడు.

ఉదయాన్నే అందరం బయలుదేరాం. అలీసా కూడా మా వెంట వచ్చింది. పాడే పక్షులకీ, ఊగే పువ్వులకు కదలలేని గడ్డి గొర్రెబొమ్మకి గాలి ముద్దులు పంపించి, విస్బీలో బోటు ఎక్కి సాయంత్రానికల్లా స్టాక్‌హోంలోని నైన్‌షామ్ రేవులో దిగాం.

విస్బీలో ఒక వీధి

(తరువాయి భాగం వచ్చే వారం)

రచయిత ఫోన్ : 98498 83570

పరిధులు, ప్రమేయాలు

తెలుగు సాహిత్యంలో కవులు, రచయితలే విమర్శ కావతారం ఎత్తడం కొత్త కాదు. ప్రత్యేకంగా విమర్శనా రంగంలో కృషి, అధ్యయనం చేసేవారు లేకపోవడం వల్ల ఏర్పడే నష్టం కంటే, రచయితలే విమర్శక పాత్ర పోషించడం వలన కలిగే ప్రయోజనం ఎక్కువనే చెప్పాలి. పాత, కొత్త సాహిత్యాల గురించి ఏదో ఒక మేరకు అవగాహన ఏర్పరచుకోవడానికి వీరి వ్యాసాలు దోహదపడతాయి. ఇంద్రగంటి జానకీబాల 'అన్యస్వరం', పగడాల నాగేందర్ 'మొగురం', నల్లూరి రుక్మిణి 'పరామర్శ', దర్భశయనం శ్రీనివాసాచార్య 'ఇష్టవాక్యం'–సమకాలీన సాహిత్యంపై వారి వారి అభిప్రాయాలను వెలిబుచ్చే సంకలనాలు. వీటిల్లో వారికి నచ్చిన అంశాలపై వారి పరిధుల్లో వారు స్పందించారు.

వీటిల్లో జానకీబాల 'అన్యస్వరం' సాహిత్యేతర అంశాలకు సంబంధించినది. అయితే, ఆమె చేయితిరిగిన సాహితీవేత్త కావడంతో ఇందులోని రచనలన్నీ సులభగ్రాహ్యంగా ఉన్నాయి. ఇంట్లోకి టీవీ రావడం, బ్యాంకు పనుల్లో ఖాతాదారుల ఇబ్బందులు, ఆయా సందర్భాల్లో స్త్రీ పురుషుల అభిజాత్యాలు, అహంకారాలు... ఒకటేమిటి అన్నీ ఈ 'అన్యస్వరం'లో ఇమిడిపోయాయి. ఈ స్వరాల్లో కొన్ని సుతిమెత్తగా చురకలు పెడితే, కొన్ని నవ్వులు కురిపిస్తాయి. కొండొకచో భుజాలు తడుముకునేట్టు చేస్తాయి. వీరి స్వరం అన్యమే అయినా, అపస్వరం కాకపోవడం హర్షించదగిన విషయం. దర్భశయనం వ్యాఖ్యలు కూడా చాలావరకు సుతిమెత్తగానే సాగుతాయి. పేరు 'ఇష్టవాక్యం' కాబట్టి– ఆయన ఇష్టమొచ్చినట్టు రాశారని అనుకునేరు– ఇష్టమైనవి మాత్రమే రాశారు.

రుక్మిణి, నాగేందర్ భిన్న ధృవాల వంటివారు. దశాబ్దాల పాటు దేశ విదేశీ ఉద్యమాలు, అధ్యయనాలు, ఆచరణ రుక్మిణి ఆలోచనను రాటుదేల్చాయి. ఆవేదన, ఉద్రేకం, ఎగసిపడుతున్న కొత్త ఉద్యమ నేపథ్యం నాగేందర్ ఆలోచనలో ఆవేశాన్ని నింపాయి. ''ఏ గూటి పక్షి... ఆ పలుకే పలుకుతుంది'' అన్న తీరున... విషయం ఏదైనా వాళ్ళకు వాళ్ళే తగిలించుకున్న ప్రత్యేకమైన కళ్ళద్దాల్లోంచి మాత్రమే చూడడం ఈ ఇరువురి వ్యాసాల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

రుక్మిణి పేరుకు 'పరామర్శ' అన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో మొహమాటం లేని విమర్శే చేశారు. తాపీ ధర్మారావు, శ్రీపాద, శ్రీశ్రీ, రావిశాస్త్రి మొదలుకుని నక్సల్బరీ వెలుగుల వరకూ లోతైన విశ్లేషణ సాగించిన రుక్మిణి; చలం, స్త్రీవాద కవిత్వం దగ్గరకు వచ్చేసరికి ఆశ్చర్యకరమైన ప్రశ్నలు లేవనెత్తారు. చలం సాహిత్యంపై వ్యాఖ్యానిస్తూ ఎక్కడైనా తిండి, నిద్ర, మర్యాద, చాకిరీయే అయినప్పుడు స్త్రీలు త్యాగాలు ఎందుకు చేసి నట్టని రుక్మిణి నిలదీస్తారు. ప్రేమకీ, శరీర దృఢత్వానికీ అభేదం లేనట్టేనా అని ప్రశ్నిస్తారు. ఇవి చాలా లోతుగా చర్చించాల్సిన అంశాలు. అక్కడితో ఆగకుండా రాజేశ్వరీ, అమీర్‌లకు బియ్యం, దోసకాయ పచ్చడి ఎక్కడి నుంచి వచ్చాయో అర్థం కాదంటూ 'మైదానం'లో సామాజిక కోణం లోపించిందనడం అసందర్భంగా తోస్తుంది. మనుషులతో, సమాజంతో సంబంధం లేని దివ్యమైన ప్రేమ ఉంటుందనే భ్రమ కలిగించారని కూడా చలాన్ని నిందించారు. కానీ, ఇన్నేళ్ళ తర్వాత కూడా ప్రేమ అనేది ఒక అలౌకికమైన భావనగానే ఎందుకు విరాజిల్లుతోందో ఆలోచించలేదు.

స్త్రీవాద కవిత్వం తొలినాళ్ళలో వచ్చిన కవితల్లో లోపించిన దళిత, బహుజన దృక్కోణాన్ని రుక్మిణి చక్కగా పట్టుకున్నారు. కక్కులూ, ఏరుగుళ్ళూ వద్దని మాతృత్వాన్నే వదులుకుందామా అని నిలదీశారు. తాను రుద్ది మెరిపించిన బాత్‌రూమ్‌లను ఉపయోగించుకునే మొగుడి రక్తాన్ని రుచి చూడాలనుకుంటే... మరి శ్రమఫలం దక్కనివారు మన సౌందర్యాలపై దాడి చేస్తే ఏం చేయాలని ప్రశ్నించారు. మన ఇళ్ళు తుడిచి, ఎంగిళ్ళు ఎత్తి, మన గుడ్డలు ఉతికేవారి సంగతేంటని ప్రశ్నలను లేవనెత్తారు. తొలినాళ్ళలోని స్త్రీవాద కవిత్వానికి ఇవి పెద్ద ప్రశ్నలే. అయితే, ఇన్నాళ్ళకీ ఎవరూ ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతక్కపోవడం, వెతకాలని కూడా అనుకోకపోవడం విచారకరం. ఇదే సందర్భంలో 'నీలిమేఘాలు'లో అంతా వైయక్తికమే ఉందని పాతపాటనే పాడటం సమకాలీన స్థితిని అంగీకరించలేకపోవడంగా కనిపిస్తుంది.

కొత్తగా వచ్చే ఏ ఉద్యమమైనా అప్పటికే మనుగడలో ఉన్న వాటిపై ఆగ్రహ ప్రశ్నలను సంధిస్తూ మొదలవుతుంది. అయితే, నాగేందర్ దగ్గరకు వచ్చేసరికి ఆ ఆగ్రహం మోతాదు కాస్త ఎక్కువగా ఉంది. ఉనికిలో ఉన్న ఉద్యమాలపై చేసిన విసుర్లు తిడుతున్నాడేమో అనిపించేలా ఉన్నా, తాను అంగీకరించే అంశాల పట్ల మొగురంలో లోతుగా, విస్తృతంగా చర్చించాడు. దళిత సాహిత్యోద్యమంలో భాగంగా కొత్తగా వచ్చిన కవులని అభిమానిస్తూ, వారి అక్షరాల్లోని ఆవేదనను సహృదయంతో విశదీకరించాడు. ఆయా ఉద్యమాల పట్ల అభిమానం ఉన్నప్పటికీ ఆబ్జెక్టివ్‌గా కూడా ఉండడం నాగేందర్ ప్రత్యేకత. అందుకే స్త్రీ, దళిత, బహుజన, మైనార్టీ వాదాలు సాధికారతను కోల్పోయాయని దశాబ్దం క్రితమే అంగీకరించాడు. వీటికి కారణాలను కూడా విశ్లేషించాడు. అయితే తాను భాగస్వామి అయిన, లేదంటే తాను అభిమానించే ఉద్యమాల పట్ల చూపిన సహృదయత ఇతర ఉద్యమాలపై చూపలేకపోయాడు. గట్టిగా దశాబ్దకాలం కూడా నిలువని– అంతమాత్రాన వాటి పాత్ర తక్కువేమీ కాదు– ఉద్యమాలను వెనకేసుకొస్తూ నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న విప్లవోద్యమంపై విరుచుకుపడడం నాగేందర్ స్టైల్. ఆత్మవిమర్శ చేసుకోవడం, లోటుపాట్లను సవరించుకోవడం అనే లక్షణాలు ఏదో ఒక మేరకైనా ఉండబట్టే విరసం మనుగడ సాగిస్తోందని నాగేందర్ ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తాడు. ఆత్మ విమర్శనా ధోరణిలో నాగేందరే లేవనెత్తిన అనేక అంశాలపై దశాబ్దం గడుస్తున్నా ఆయా వేదికలపై చర్చ ప్రారంభం కాకపోవడానికి ఏం సమాధానం చెబుతాడు? అయితే, ఆయా సందర్భాలు డిమాండ్ చేసిన మేరకు నమ్మిన ఉద్యమం వైపు నిలబడి నాగేందర్ బలమైన స్వరాన్నే వినిపిస్తాడు. ఉద్యమ, ప్రాంతీయ పరిమితులు విధించుకోకుండా తన కృషిని కొనసాగిస్తే నాగేందర్ బలమైన విమర్శకుడిగా రూపొందుతాడు.

ఈ నలుగురి వ్యాస సంకలనాలు చూస్తే– విమర్శ కూడా ఒక ప్రత్యేక విభాగమని, అందులో ప్రత్యేకంగా కృషి చేయడం తప్పనిసరి అని ఎవరికైనా బోధపడుతుంది.

–దేరా

అన్యస్వరం, ఇంద్రగంటి జానకీబాల, వెల: రూ. 150
ఇష్టవాక్యం, దర్భశయనం శ్రీనివాసాచార్య, వెల:రూ.90
పరామర్శ, నల్లూరి రుక్మిణి, వెల : రూ. 80
మొగురం, పగడాల నాగేందర్, వెల : రూ. 150,
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

పాత్రికేయ కవిత

మూడు దశాబ్దాలకు పైగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్న నగునూరి శేఖర్ 'రన్నింగ్ కామెంట్రీ' ఇది. విప్లవోద్యమాల ఖిల్లా (కరీంనగర్ గాజులపల్లి) లో పుట్టిపెరిగిన నేపథ్యమూ, ఆ తరహా దోస్తులూ, ప్రముఖ కవి దేవీప్రియ కామెంట్రీ, కవిత్వం, దామెర రాములు మినీ కవితలు ఆయన వాక్యాలకు పదునుపెట్టాయి. అవే కామెంట్రీ కవితలనే కొత్తరూపం తీసుకున్నాయి. ఒక్కొక్కటి ఎనిమిది పాదాల్లో ఉన్నాయి. అప్పటికి జనంనోళ్లలో నానుతున్న, పత్రికల్లో వార్తాంశాలుగా వస్తున్న రోజువారీ సంగతులే ఈ రూపంలో పాఠకుని చేరడంవల్ల వెంటనే ఆకట్టుకుంటాయి. సుదీర్ఘ అనుభవం ఉన్న జర్నలిస్టులూ, భాషా సౌకుమార్యం గల పాత్రికేయ రచనలూ బాగా లోటనిపించే ఈ రోజుల్లో ఈ పుస్తకం రావడం సంతోషకరం. తెలంగాణం, పెన్‌కౌంటర్, గదీ మాట గిదీ పాట, సమాజానందస్వామి, 'పంచ్'తంత్ర అనే శీర్షికల కింద వివిధ పత్రికల్లో రాసిన కామెంట్రీ ఉంది. 'కమాన్ కబుర్లు' శీర్షిక కింద రాసిన కొన్ని పొట్టి కథనాలూ ఇందులో చేర్చారు. రచయిత మాటతో పాటు అల్లం నారాయణ, దేవులపల్లి అమర్, అన్నవరం దేవేందర్ ముందుమాటలు ఉన్నాయి.



– ఎన్నికల మేనిఫెస్టో / ఏముందో చూసుకో/ హామీల గుబాళింపే/ వొల్లంతా పూసుకో
గొప్ప గొప్ప పథకాలు/ గోడ మీద రాసుకో/ ఐదేళ్ళకోసారి/ అడిగే నోరు మూసుకో

– రాజకీయ గాడిదలకు/ మాకు ఏమి పోలిక/ అడ్డమైన గడ్డి కరచి/ అవుతారు ఏలిక
ఆలినైనా వదులుతారు/ వీడబోరు పదవులు/ అప్పనంగా వచ్చునంటి/ నాకుతారు పెదవులు

– యింద్రవెల్లి రమేష్

పెన్‌కౌంటర్ , నగునూరి శేఖర్
పేజీలు : 130, వెల : రూ. 60, ప్రతులకు : 9959914600

సీమ గుండెల చప్పుడు

రాయలసీమ మట్టి పరిమళాలను పరిచయం చేసేవి 'మొలకల పున్నమి' కథలు. పదమూడు కథల సంకలనమిది. ఇందులో ప్రతీ కథ అక్కడి గ్రామీణ వాతావరణానికి అద్దం పట్టేదే. కవిత్వం, వచనం ఈ కథల్లో పేక – పడుగు మాదిరిగా కలగలసి ఉంటాయి. ప్రతి సన్నివేశంలో సందేశం భావగర్భితంగా ఉంటుంది. సీమ పల్లెల కష్టాలు, నీళ్ళకోసం తిప్పలు, మోసం చేసే మోడాలు (మేఘాలు)... ఒకటనేమిటి సీమను పలకరించే, పలవరించే సమస్తం ఈ కథల్లో ప్రతిబింబిస్తాయి.



ప్రతి కథలో రైతు బహిరంగంగానే కనిపిస్తాడు. తను చచ్చినా పర్వాలేదు, చినుకు పడితే చాలనే వీరశివుడు (మాండవ్యం), సీమ రాజకీయాలను ప్రతిబింబించే (డేగల రాజ్యం), దేశభక్తిని తెలియజేసే (ఏడు లాంతర్ల సెంటరు), మంచోడు ధర్మారెడ్డి కాడి మీద నుంచి లేవకపోతాడా (దింపుడు కళ్ళం ఆశ) అంటూ గ్రామం మొత్తం ఎదురు చూపులు... ఇలా ఏ కథను చూసినా ఆలోచింపజేసే ఇతివృత్తాలే. మొదలుపెడితే ఆసాంతం చదవాల్సిందే. ఆ జడిలో తడవాల్సిందే. సున్నిత హృదయులైతే కళ్ళు నులుముకోవాల్సిందే. ఈ సంకలనం కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం పొందడం సంతోషించదగ్గ విషయం. గుంటూరు శేషేంద్ర శర్మ పరిచయం, బూదరాజు 'కడప మాండలిక భాష' ఈ సంకలనానికి అదనపు పరిమళాలను అద్దాయి.

– మద్దిపట్ల మణి

మొలకల పున్నమి, వేంపల్లి గంగాధర్
పేజీలు : 120, వెల : రూ. 50
ప్రతులకు : విశాలాంధ్ర

సున్నిత కవితలు



ఇది దాసరాజు రామారావు రెండో కవితా సంకలనం. ఈ 40 కవితల్లో 14 కవితలు తెలంగాణ అంశంపై రాసినవి. 1956 పెద్ద మనుషుల ఒప్పందం నుంచి 2009 డిసెంబర్ 9 ప్రకటన వరకు పరిస్థితిని ఇలా కవితాత్మకం చేసారు– ఆకాశం దిగిరాదు/ నేల ఎగబాకదు/ పంటికింద పల్లిగింజ /నయాకృష్ణ గీత/ నాన్చుడు, త్రేన్చుడు. ఈ కవితలో శ్రీకృష్ణ కమిటీపై దెప్పిపొడుపు. 'నెమలీకల పద్యం', 'పూల లోకం' బాగున్నాయి.

పట్టుకుచ్చుల పువ్వు, దాసరాజు రామారావు
పేజీలు: 136, వెల: రూ 50
ప్రతులకు: అన్ని పుస్తకాల షాపులు

స్వీకారం

ఎస్సీ ఎస్టీలపై అత్యాచారాలు
(పోలీసు–కోర్టులు–ఎలా పనిచేస్తున్నాయి)
పేజీలు : 118, వెల: రూ. 50



ఎస్సీ ఎస్టీ నిధులు
(విదిలింపు – మళ్ళింపు)
పేజీలు : 88, వెల: రూ. 40
రచన : బొజ్జా తారకం
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

★★★

సమాలోచనా త్రయం
రచన : మాదిరాజు రంగారావు
పేజీలు : 252, వెల: రూ. 160
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్

★★★

భాగ్యనగరము పేజీలు : 310,
రిబ్బా పేజీలు : 92
రచన : 'అక్షర శిల్పి' చల్లా నరసింహారావు
ప్రతులకు : 96407 77799, 90106 02699

★★★

తేనెలూరు తెలుగు మనది
రచన : తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి
పేజీలు : 90, వెల: రూ. 30
ప్రతులకు : 99895 15300

★★★

అక్షరాంజలి
సంపాదకుడు : ఎస్వీ రామారావు
పేజీలు : 112, వెల: రూ.100
ప్రతులకు : విశాలాంధ్ర

★★★

గమనం–గమ్యం
(ఎస్. మునిసుందరం కవిత్వం)
పేజీలు : 268, వెల: రూ.300
ప్రతులకు : 'కవితాలయ' 10–3–190ఎ2, కోటకొమ్ముల వీధి, తిరుపతి–517501.

'బాసగూడ'పై నిజనిర్ధారణ



బాసగూడా పోలీస్‌స్టేషన్ పరిధిలో సర్కేగూడ వద్ద జూన్ 28న సీఆర్‌పిఎఫ్ పోలీసులు ఏకపక్షంగా కాల్పులు జరిపి, 17 మంది ఆదివాసులను చంపిన సంఘటనపై ప్రజాసంఘాలు నిజనిర్ధారణకు వెళ్లాయి. వాటిలో విరసం తరపున వెళ్లిన పాణి రాసిన పుస్తకం ఇది. ఆదివాసులతో, ఉద్యమనాయకులతో మాట్లాడి, తన అనుభవాలను, అనుభూతులను, ఆలోచనలను, అభిప్రాయాలను పంచుకున్నాడు రచయిత.

చింతల్నార్, పాణి
పేజీలు: 84, వెల: రూ 40
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

ఆటోనగర్ అడ్డా...

'బెజవాడ' తరువాత విజయవాడలోని ఆటో యూనియన్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'ఆటోనగర్ సూర్య'. నాగచైతన్య, సమంత.. హీరో, హీరోయిన్‌గా వినోదం, మాస్, రాజకీయ కథాంశంతో వస్తున్న చిత్రం ఇది. పదునైన సభాషణలతో భారీ అంచనాలు పెంచిన దేవా కట్టా ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆర్. ఆర్. మూవీ మేకర్స్ సమర్పణలో కె.అచ్చిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

28 అక్టోబర్ 2012

ఆదివారం ఆంధ్రజ్యోతి

2

ప్రారంభం

ఉళేనూరు క్యాంపు కథలు

5

కథ

వాంగ్మూలం

6

హ్యాపీడేస్

అంజనా సౌమ్య

కవర్‌స్టోరీ

వైద్య విదూషకులు

Powered By
ASHOK LEYLAND

Compact · Most Fuel Efficient
Minimum Maintenance Expenses

Exclusive, Most trusted & No.1 OEA of Ashok Leyland

RAPOWER GENERATORS

10kVA to 2000 kVA DIESEL GENERATORS

RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED, Head Office & Regd. Office: BANGALORE. Mfg. Units: Channapatna (KA), Tiruchirapalli (TN)

HYDERABAD: MR. M D PRASAD : 0 98486 15020, MR. RAMESH : 0 98486 15026 | VIJAYAWADA: MR. AVINASH, 0 95538 33444, 0866 2492838 VISAKAPATANAM: Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814, Mr. SHARVAN : 0 98487 88815 | KURNOOL: Mr. D.K. KISHORE : 0 99486 71600 | ANANTHAPUR: Mr.G.T.PRABHAKAR : 0 98486 02300

www.rapower.in

మా తిక్కల నాయనమ్మ తెలివీ తేట

మా అమ్మ నన్ను పొద్దున్నే నిద్దర లేపి తలస్నానం చేయించి కొత్త గౌను వేసింది. చలికి వణికి పోతుంటే

''కాసేపు పొంత దగ్గిర కూచ్చో వెచ్చగా ఉంటది'' అంది.

తమ్ముణ్ణి స్నానానికి తీసికెళతా, ''ఇంత సుకుమారమయిన పిల్లనెక్కడా సూళ్ళేదు. చలికి తట్టుకోలేక ఒగుడాకల్లే అల్లాడ తాంది'' అని విసుక్కుంది. ఇంతలో మా అన్నయ్య స్నానం కానిచ్చి వచ్చి పొంత దగ్గర నించి ఒక్క నెట్టు నెట్టాడు నన్ను, వేడి కోసం.

నేను ఆణ్ణి గుట్టుగా చూసి, ''మా'' అని ఒక్క అరుపు అరిసా. ''ఏంటి'' అంది అమ్మ.

''సూడు తోత్తన్నాడీడు'' అన్నా.

''ఈడేంటి? అన్న అన్లేవా'' అన్నాడు.

''ఒరేయ్ నేను నిన్ను చచ్చినా అన్న అనను'' అన్నా.

ఆడు నన్ను కొట్టబోయాడు, ఈలోపే నేను ఆడిని రెండు పీకి అమ్మ దగ్గరికి పరిగెత్తా. అప్పుడు అమ్మమ్మ వచ్చి అమ్మతో, ''రాక్షసి బ్డిడని కన్నావు ఎట్టాగయితేం'' అని మా అన్నని లాక్కుపోయింది. అమ్మమ్మ ఎప్పుడూ అంతే, దానికి అన్నయ్యంటేనే ఇట్టం. చిన్నప్పటి నించీ పెంచింది కదా.

''ఇంత పొద్దున్నే సానం ఎందుకమ్మా'' అనడిగా.

''మనం కొత్తిల్లు కట్టు కుంటన్నాము. ఇవ్వాళ గుణార్థం (భూమి పూజ)'' అంది. ''ఎక్కడమ్మా'' అన్నాను. ''మన సూరమ్మ ఆళ్ళ ఇంటి పక్కన'' అంది.

క్యాంపులో మా నాన్న కొన్న స్థలంలో కొత్తిల్లు కడ తన్నారన్న మాట. మాది ఉళేనూరు క్యాంపు. అమ్మాయి చేతికి ఉండే అరవంకీలా తుంగభద్రకి అవిరి ఉంటది మా ఉళేనూరు క్యాంపు. సొచ్చంగా పారే నీటితో తెల్లంగా శుభ్రంగా ఉంటుంది మా తుంగభద్ర. 'గంగా స్నానం తుంగా పానం శ్రేష్ఠం' అనేది ఇందుకేనేమో! తుంగభద్రకి మూడు తరాల కిందట ఆంధ్రా నించి వచ్చిన కుటుంబాలు మావి. చెట్టూ చేమా నరుక్కుని బీళ్ళు దున్నుకుని వ్యవసాయం మొదలుపెట్టారు. ఒకర్ని చూసి ఒకరు ఆంధ్రా నించి వచ్చి కలిసారు. స్థానికుల పొలాలు కౌలుకు తీసుకున్నారు. పొలాల్లోనే ఇళ్ళేసుకు న్నారు. ఆ ఇళ్ళనే క్యాంపులంటారు. ఏ ఊరికి దగ్గరగా ఉండే క్యాంపుని ఆ ఊరిక్యాంపు అంటారు. జామాపూ ర్‌లో కన్నడిగులుంటే, జామాపూర్ క్యాంపులో ఆంధ్రా వాళ్ళుంటారు. ఒక్కో క్యాంపులో ఇరవై అయిదు నుంచి యాభై ఇళ్ళుంటాయి. తుంగభద్ర మీదే మా బతుకు లన్నీ ఆధారపడి ఉంటయ్యి. చల్లగా కళకళలాడతా తుంగభద్ర పారితే పాడి పంటలతో పిల్లా పాపలతో ఆనం దంగా ఉంటాం. కోపం వచ్చి ఉగ్రరూపం చూపి చ్చిందా.. ఇచ్చినయ్యి అన్నీ ఇంతకింతా లాక్కుపోయి తనలో కలుపుకుని స్మశానాన్నే మిగుల్చుద్ది. అందుకు తుంగభద్రంటే మాకు భయమూ భక్తీ కూడా. ఉళేనూరు లాగే ఇక్కడ అనేక క్యాంపులున్నయ్యి. బెన్నూరు క్యాంపు, ఇళగనూరు క్యాంపు, నందెళ్ళి క్యాంపు, సిద్దా పూర్ క్యాంపు, సాలించిమర క్యాంపు ఇట్లా. అక్కడి పది క్యాంపులాళ్ళూ మా నాన్న, అమ్మ చేసే వైద్యం మీదే ఆధారపడేవాళ్ళు. నాన్న పేరు సుబ్బారావు. డాక్టర్ సుబ్బారావంటారు అందరూ. అమ్మ పేరు జోయ. జయమ్మ అంటారు. ఉళేనూరులో మా నాన్న కడుతున్న కొత్తిల్లు గురించే మీకు చెప్పింది. పొద్దన్నే స్నానాలు చేసి మేమంతా చేరుకుంది అక్కడికే. అప్పుడు నాకు ఎనిమి దేళ్ళో పదేళ్ళో ఉంటయ్యి.

నాన్న,అమ్మ, అమ్మమ్మ, మావయ్యలూ, మేనత్తలూ, నాయనమ్మలూ అందరూ ఉన్నారక్కడ. అప్పటికే మా బీమప్ప, గాజుల దేవప్ప, ఎంకోబు (మా వ్యవసాయం పనులు చూసుకునే వాళ్ళు) కలిసి నిట్టాళ్ళకి గుంటలు తవ్వారు.

అమ్మ తెల్లటి నుదిటి మీద ఎఱ్ఱటి కుంకం బొట్టు పెట్టుకుని అందరాడాళ్ళకి కూడా పెట్టింది. నాకు పెట్టలేదని అలిగా. అమ్మమ్మ ''ఈ రాక్షసి క్కూడా పెట్టు'' అని, బొట్టు పెట్టిచ్చి కాళ్ళకి పసుపు కూడా రాయిం చింది. గుంటల్లో పసుపు, కుంకుమ, పువ్వులు, నవర త్నాలు, నవధాన్యాలు ఏసి, కర్పూరం ఎలిగిచ్చి, ఐదుగురు అత్తలూ నీళ్ళు పోసారు. 'వినాయకా వినాయకా' అంటా నిట్టాళ్ళు నిలబెట్టేశారు.

తరవాత దేశాయి క్యాంపు సంతలో టేకు చెక్క కొని, చుట్టింటికీ పెద్దింటికీ తలుపులూ, కిటి కీలూ చెయ్యమని వడ్రంగి కిచ్చారు. నిట్టాళ్ళ నుంచి ఎన్నుగాడి (రెంటినీ కలిపి వేసే పెద్ద అడ్డకఱ్ఱ) మూలలో కఱ్ఱలు పెట్టి, కొబ్బరి తాళ్ళతో కట్టి, దర్వాజాలకి అడ్డుకఱ్ఱలు ఏసి నిలబెట్టారు. పచ్చి వాసాలు తెచ్చారు. ఆటి మొదళ్ళు కోసుగా నున్నగా ఒక్క దెబ్బతో నరికినట్టున్నయి. ఆటిలో మిగిలినాటితో నీళ్ళు తాగే గ్లాసులు, పొయ్యి ఊదుకునే గొట్టాలు కూడా కోయించారు. తాతయ్య జనపనార పేని ఆంధ్ర నుంచి తెచ్చిన పురికొసతో పైకప్పుకి కట్టుకట్టారు. వారం రోజు లకి ఇల్లు ఆకారం వచ్చింది. తాళ్ళతో, పచ్చివాసాలతో, అడ్డుగా చీల్చి కట్టిన బద్దలతో, కప్పులేని ఇంటోకి ఎలితే సూరీడు కాంతి పడి లోపల నీడలతో పచ్చీసు ముగ్గులా ఉంది. సూరినీళ్ళ వాగు నించి ఇల్లు కప్పటానికి జమ్ము, చావిడికి రెల్లు గడ్డి కూడా వచ్చింది. జమ్ముతో ఇల్లు నెయ్యటానికి మా బంధువు ఒకాయన వచ్చాడు. ఆయన చేత్తో నేత నేసి ఇల్లు కప్పితే ఓ పదేళ్ళు దాకా కారటం కానీ, తిరగకప్పే అవసరం కానీ ఉండదంట.

నందెళ్ళి అనే ఊరు నుంచి బళ్ళతో పాటి మట్టి, తెల్ల టిది తోలారు. కొండ దగ్గర నుంచి అలకటానికని ఎఱ్ఱ మట్టి రెండు బళ్ళు తోలిచ్చారు. తాత జమ్ము కట్టలు కట్టి ఇత్తంటే, చివర్లు నరికి ఎంత బాగా అల్లినట్లు చేశారో. పచ్చి జమ్మి వాసన, జనపనార తడిపిన వాసన ఎంత బాగుందో. నేల పయిన పాటి మట్టి, ఊక, నల్లమట్టి పోసి నీళ్ళు జల్లి దిమ్మెస కొడతంటే నేనూ దిమ్మెస లేపుదాం అని లేప బోయాను అంతే.

''డాం'' అని దాన్ని మీదేసుకుని మట్టిలో పడ్డా.

తాత పిఱ్ఱమీన ఒక్కటి పీకాడు.

''ఛీ.. మునిలి, చుట్టకంపు'' అని తిట్టుకుంటూ ఎల్లి పోయా.

పాటి మట్టీ కొండ రాళ్ళతో గోడలు లేశాయి. కిటి కీలు, తలుపులూ కూడా పెట్టేశారు. మాంకాళి, కాళావు, అమ్మమ్మ, ఇంకొక ఆంధ్రా అమ్మమ్మా గోడలు అలికి సామాన్లు పెట్టుకునే బడ్డీలు కట్టేశారు. కమ్మటి కొత్తమట్టి తుంగభద్ర నీళ్ళతో కలిసి నేల గంధం వాసన బలే వచ్చేది. బట్టీ సున్నం తెప్పిచ్చి బయట గోడలకి, ఇంట్లో గోడలకి కొడితే నల్లటి గోడలల్లా తెల్లగా మారి ఇల్లంతా పిండి వెలుగే. చుట్టూ ఏవన్నా పెట్టుకోటానికీ, కూర్చోటానికీ అడుగు వెడల్పు, ఎత్తులో అరుగులు కట్టిచ్చారు. వాటికి బియ్యం నానబెట్టి రుబ్బిన పిండిలో బొటన వేలు ముంచి జంట బొట్లు అద్దారు. ఎఱ్ఱమట్టి, పేడా కలిపి మురగబెట్టి నేలమీద ఇస్తరాకుల అలుకు అలికింది అమ్మమ్మ. అంటే ఇస్తరి కుట్టినట్టు, ఎటు చూసినా 'యు' ఆకారంలో అర్ధచంద్రాలుగా కనిపించేది. బలే ఉంద ప్పుడు మా ఇల్లు.

ఇంటికి రంగులెయ్యాలిగా! ఏం రంగులెయ్యాలి అని మాటలు మొదలయ్యాయి. మా వాళ్ళు రంగుల్ని ఎఱుపు, తెలుపు, నలుపు అనరు. గడప పచ్చ, బొట్టు ఎఱుపు, రామనీలం, మామిడి చిగురు కెంపు, మంచి గంధం, దోస పసుపు, ఆకుపచ్చ, పాల తెలుపు, పెసర పచ్చ, కరివేరు గులాబి, క్రిష్ణ బులుగు, నస్యం నలుపు, కాటుక నలుపు, మబ్బు నీలం, చిలకాకు పచ్చ, దొండ పండెరుపు, సముద్రపు పచ్చ, పండు మిరప ఎఱుపు, వంగ పువ్వు ఊదా, వంకాయ ఊదా, తూటు పువ్వు ఊదా, ముళ్ళ గోరింత పసుపు, పచ్చి పసుపు, నిమ్మ పండు పసుపు, చెంద్రకాంత రాణి, బూడిద తెలుపు, ప్యాడ కసరు పసుపు... ఇలా మనకు తెలిసిన వాటితో కలిపి పలుకుతారు. రంగుల్ని లక్క అంటారు. గడపకి కావాల్సిన లక్క జాబితా అమ్మమ్మ నాన్నకి చెప్పింది. నాన్న గంగావతి ఎల్లి వాటిని తెచ్చాడు.

ఆ రోజు మేము బడి నించి వచ్చి, సంచులు గూట్లో పడేసి, కాళ్ళు కడుక్కుని, ''అమ్మమ్మా ఆకలి'' అన రిచాం.

తింటానికి ఎన్న పూసలో ఉడికించిన చిలగడ దుంపలిచ్చి మా అమ్మమ్మ ఇలా అంది, ''తలుపులకి, గడపలకి లక్క ఎయ్యాలి, గొడవ చేసి ఇటు పరుగెత్తు కొచ్చి అల్లరి చేశారో ఈపులు పగులుతయ్యి ఒక్కొక్క ళ్ళకి''.

''మేం దగ్గిరికి రాము, దూరంగా ఉండి చూత్తాం. కానీ ఆఖరులో కొద్దిగా లక్క మిగుల్చు, మా పలకల బొందులకి ఏసుకుంటాం'' అనడిగాం.

''సరే'' అంది.

తలుపులకి ఆకుపచ్చ, గడపలకి పచ్చిపసుపు గబ్బు సవురు కొద్దిగా కలిపి పలచగా చేసి ఏసింది అమ్మమ్మ.

తాటి త్యాగలో చందమామని చీల్చి బండతో మెత్తగా పీచులా కొట్టి కుంచిలా మార్చి మంచి పువ్వులే సింది. మా గడప బలే నాణ్ణెంగా ఉంది సూడ్డానికి.

మా ఇంటికి కొంచం దూరంలో ఉండే నాయనమ్మ వరసయ్యే సుబ్బమ్మ కొత్తిల్లు చూట్టానికి వచ్చింది, కర్ర పట్టుకుని. అందరూ ఆమెని సుబ్బీ, ఎఱ్ఱి సుబ్బీ అనే వాళ్ళు. మేమయితే ఊళ్ళో నాయనమ్మ అనో, తిక్కల నాయనమ్మ అనో చెప్పుకునేవాళ్ళం.

అమ్మా ''తిక్కల నాయనమ్మ వత్తంది'' అన్నా వాకిట్లో ఆమెను చూసి.

''తప్పు అట్టా అంటావా'' అని మా అమ్మమ్మ నన్ను ఒక్కటి పీకింది.

''ఈళ్ళంటే తప్పు లేదు, నేనంటేనే తప్పు'' అను కున్నా.

వచ్చి కూసుంది. ఆళ్లేత్తన్న రంగులు కాసేపు చూసింది.

''వదినో మీ తెనాలోళ్ళు ఎంతయినా సూచ్చం గల్లా ఓళ్ళు, ఇయ్యన్నీ ఎట్టా తెలుసూ..!'' అని ఆశ్చర్యంగా అడిగింది.

''ఏ.. ఉంది సుబ్బమ్మ వదినా..తెలివీ తేటా ఉంటే నువ్వయినా ఎయ్యొచ్చు'' అనింది మా అమ్మమ్మ.

అమ్మ ఏసిచ్చిన దోసె అట్టు తిని, టీ తాగి కాస్సే పుండి ఎల్లిపోయింది మా తిక్కల నాయనమ్మ.

మరుసటి ఆదివారం నాన్న గంగావతి సంతకి ఎల్లాడు. అక్కడ ప్రతి కొట్టూ ఎక్కి దిగుతా ఉందంట మా తిక్కల నాయనమ్మ. ఇదేంటి అని కిరాణా కొటో ఆమె ఎనక నిలబడ్డాడంట నాన్న.

కొట్టతను ''ఏం కావాలమ్మా ''అనడిగాడంట.

''ఒక తవ్వెడు పచ్చ తెలివి, సోలెడు ఎఱ్ఱ తెలివి, కొద్దిగా పసుపు తెలివి, ఇంకేవయినా తెలివి తేటలుంటే ఇవ్వు'' అని అడుగుతందంట.

కొట్టాడి మొహంలో ఆ రంగులన్నీ కనిపించాయంట మా నాన్నకి.

ఇంటికొచ్చి చెబితే అందరూ పడీ పడీ నవ్వటమే.

– మన్నం సింధు మాధురి

సెల్: 08790906686

ఏం రంగులెయ్యాలి అని మాటలు మొదలయ్యాయి. మా వాళ్ళు రంగుల్ని ఎఱుపు, తెలుపు, నలుపు అనరు. గడప పచ్చ, బొట్టు ఎఱుపు, రామనీలం, మామిడి చిగురు కెంపు, మంచి గంధం, దోస పసుపు, ఆకుపచ్చ, పాల తెలుపు, పెసరపచ్చ, కరివేరు గులాబి, క్రిష్ణ బులుగు, నస్యం నలుపు, కాటుక నలుపు, మబ్బు నీలం, చిలకాకు పచ్చ, దొండ పండెరుపు, సముద్రపు పచ్చ, పండు మిరప ఎఱుపు, వంగ పువ్వు ఊదా, వంకాయ ఊదా, తూటు పువ్వు ఊదా, ముళ్ళ గోరింత పసుపు, పచ్చి పసుపు, నిమ్మ పండు పసుపు, చెంద్రకాంత రాణి, బూడిద తెలుపు, ప్యాడ కసరు పసుపు... ఇలా మనకు తెలిసిన వాటితో కలిపి పలుకుతారు. రంగుల్ని లక్క అంటారు.

మా అమ్మ తెరిచిన తలుపు

నేను ఈ కథలు రాయడానికి గల కార ణాలన్నిటినీ కలిపి ఒక్క పదంలోకి కుదిస్తాను– 'అమ్మ'. మా అమ్మ జోయ. నాకు ఊహ తెలి సినప్పటి నుంచీ అమ్మ నాకు నేర్పింది– మూసిన తలుపుల్ని తెరవడం. ఇళ్ళకీ, ఊళ్ళకీ తలుపులు బార్లా తెరవడం. తెరిచి చూడటం కాదు, తరచి చూడటం. కాలికి కొట్టు కునే గుమ్మాలు, తలకి తట్టుకునే వాకిళ్ళు దాటు కుంటూ వెళ్ళి చూడడమే కాదు, విసిరేసినట్టుండే ఇళ్ళని, ఎవరికీ పట్టని ఊళ్ళని కూడా లోగిళ్ళలోకి తీసుకు రావడం నేర్పింది.

తప్పటడుగుల దశ దాటాక వేలు విడిచేసినా, వేసిన అడుగులన్నీ అమ్మ వేయించినవే. చిటికెన వేలే కాదు, నన్నే విడిచి వెళ్ళిపోయింది మా అమ్మ. అయినా, నాతోనే ఉంటుంది, ఎప్పటిక ప్పుడు కొత్త తలుపులు తెరుస్తూ–

మా అమ్మ తెరిచిన తొలి తలుపు ఆంధ్ర–కర్ణా టక సరిహద్దుల్లో ఉన్న ఉళేనూరు.

కామెంట్



నడిచేదీ..నడిపించేదీ

ఈ ప్రపంచం దేని కారణంగా నడుస్తోందని ఈ మధ్య ఒక టీవీ చానెల్ వీక్షకులను అడిగి అత్యుత్తమ జవాబుకు పెద్ద బహుమతి కూడా ఇవ్వనున్నట్టు ప్రకటించింది.

ఇంత సింపుల్ విషయం ఎవరికి తెలియదు చెప్పండి? అందరూ యథాశక్తి ఎస్సెమ్మెస్‌లు ఇచ్చారు. ఉత్తరాలు, ఫోన్లు, ఇ – మెయిళ్ళకు అవకాశముంటే ఇంకా చాలామందే చెప్పి ఉండేవారు.

కొందరు సూర్యుడు, సౌరకుటుంబం, పాలపుంత, విశ్వం లాంటి ఖగోళ సమాధానాలు చెపితే మరికొందరు గురుత్వాకర్షణ శక్తి లాంటి సైన్స్ సూత్రాలు టైప్ చేసి పంపించారు. భూమి, సముద్రం, గాలి, వాన, నీరు వంటి ప్రకృతి శక్తులు గుర్తొచ్చాయి కొందరికి. కొండలు, నదులు, అడవులు లేకపోతే మనమెక్కడుంటాం అన్నవాళ్లు కూడా ఉన్నారు కొందరు.

మగవాళ్లంతా మగవాళ్ల వల్ల అనీ, ఆడవాళ్లంతా ఆడవాళ్ల వల్ల అనీ ఎవరు నమ్మిన విషయాన్ని వాళ్లు మెసేజ్ పంపారు. పిల్లలు లేకపోతే ప్రపంచం ముందుకు పోనే పోదని రాసినవాళ్లూ చాలామందే ఉన్నారు.

మొక్కలు, జంతువులు లేకపోతే ఈ ప్రపంచం ఏం తిని బతికి ఉండేది? కాబట్టి అదే కరెక్టు ఆన్సరు అని రాశారు పలువురు.

ఇవన్నీ మరీ మౌలిక విషయాలు. నేటి ప్రపంచం నడుస్తున్నది సైన్స్, టెక్నాలజీల మీద అని సెల్ కీబోర్డును గట్టిగా నొక్కి మరీ రాశారు కొందరు. విద్యుచ్ఛక్తి సైన్స్ కిందికే వస్తుందని తెలియనివాళ్లు విడిగా దాన్కొక్కదాన్నే టైప్ చేసి పంపారు. ఫ్యాక్టరీ మిషన్లు, ఇంటి మిషన్లే కాదు పంటలు, వినోదం అన్నీ కూడా ఆగిపోతాయి కదా కరెంటు లేకపోతే ... అనేది వాళ్ల పాయింటు.

ఈ కాలం పిల్లలకు పాత విషయాలు సరిగ్గా తెలియవని తెలిసిన పెద్దవాళ్లు ఒకటికి రెండుసార్లు లెంపలేసుకుని, సెల్‌ఫోన్లను చేతుల్లోకి తీసుకుని దేవుడు దేవుడు దేవుడు అని మూడుసార్లు రాసి పంపించారు ఎందుకైనా మంచిదని. దేవుడి కంటే ధర్మం బెటర్ ఆన్సర్ అని ఫీలయిన వాళ్లూ చాలామందే ఉన్నారు. దానికి తమ తమ మతం పేర్లను జోడించడం దాదాపు ఎవరూ మరి చిపోలేదు. మృత్యువు వల్లనే నడుస్తోందని కూడా కొందరు అన్నారు. లేకపోతే ఇంత జనాభాను భరించలేక ఈ ప్రపంచం ఎప్పుడో కుప్పకూలి పోయేదన్నారు.

మొత్తం మీద చాలా రెస్పాన్సే వచ్చింది వాళ్లకు. ఒక్క ప్రశ్న కోటి జవాబులు అని రోజూ ఊరించి ఊరించి చివరికి ఒకరోజు ఫలితాలు ప్రకటించారు. పైవన్నీ పాత జవాబులు కాబట్టి సరికొత్తగా, నేటి పరిస్థితులకు తగినట్టుగా అనిపించిన జవాబుకు బహుమతి ఇస్తున్నామని చెప్పారు వాళ్లు. ఆ జవాబు పేరు 'చార్జర్లు'. అది లేకుండా సెల్, కెమెరా, ఎమర్జెన్సీ లైట్, బ్యాటరీ, ఐపాడ్, కిండిల్, కొన్ని రకాల బైకులు, కార్లు ... మొదలైన అత్యాధునిక పరికరాలేవీ నడవడం లేదు కాబట్టి ప్రపంచాన్ని అత్యాధునికంగా నడిపించే వాటినే మనం సరైన జవాబుగా ఆమోదించాలని ఆ చానెల్ వాళ్లు తమ ఎంపికకు వివరణ ఇచ్చారు. జై చార్జర్లు, జైజై చార్జర్లు. ■

విశేషం

స్లమ్‌డాగ్ బిలియనీర్

మహారాష్ట్రలోని అలోకా జిల్లాలో రోపర్‌ఖేడా అనే దళితవాడలో పుట్టింది కల్పన సరోజ్. కుల సంప్రదాయం ప్రకారం పన్నెండేళ్ల వయసులోనే తనకంటే పదేళ్లు పెద్ద వాడైన వ్యక్తితో పెళ్లయింది. అయితే, మెట్టినింటికి వెళ్లిన ఏడాదికే పుట్టింటికి తిరిగి రావాల్సి వచ్చింది. భర్త వేధింపులు మనసు, శరీరాలను గాయపరిచాయి. ఇరుగుపొరుగు దళితులు అవన్నీ భరించాలన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా భర్తను వదులుకోవడం తప్పని మందలించారు. కల్పన వినలేదు. దీంతో ఆమెను దళితవాడ నుంచి వెలివేసినంత పనిచేశారు. దిక్కుతెలియని స్థితిలో ఆత్మహత్యకు పూనుకుంది. అదృష్టమో.. దురదృష్టమో కాని చావలేదు. ఆ క్షణం గడిచాక మాత్రం.. బతకాలి.. తనలాంటి పదిమందిని బతికించాలి.. అన్న పట్టుదలతో ముంబయికి రైలెక్కింది. ఆ మహానగరంలో చేతికి దొరికిన పనల్లా చేసింది. ఆమెలోని పట్టుదల, నిజాయితీ ఒక వ్యక్తిని ఆకర్షించాయి. ఇద్దరి మనసులు కలవడంతో పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. మోడు వారిన జీవితం ఇప్పుడిప్పుడే చిగురులు వేస్తోంది అనుకుంటున్న సమయంలోనే దురదృష్టం వెంటాడింది. భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఊరొదిలి వచ్చిన ఒక మహిళ ఇద్దరు పిల్లల్ని పెట్టుకుని ముంబయిలో బతకడం ఒక పెద్ద సవాలు. భర్త నడిపే చిన్న బీరువాల తయారీ కేంద్రం ఒక్కటే తనకు ఆధారం. బెరుకు బెరుకుగానే అక్కడికి వెళ్లి.. రాత్రింబవళ్లు పనివాళ్లతో పోటీపడి పనిచేస్తూ దాన్ని లాభాల బాట పట్టించింది కల్పన. కూడబెట్టుకున్న డబ్బుకు తోడు బ్యాంకు రుణాలు తీసుకుని షుగర్ ఫ్యాక్టరీ, స్టీలు ఫ్యాక్టరీలను ప్రారంభించింది.

వాటికి పెట్టిన పేరు 'కల్పనా సరోజ్ అండ్ అసోసియేట్స్. కసితో పనిచేయడం ఒక్కటే ఆమెకు తెలుసు. ఇదివరకు గతాన్ని తల్చుకున్నప్పుడల్లా కన్నీళ్లు పెల్లుబుకేవి. ఇప్పుడు సవాళ్లను స్వీకరించడమే ఆమె జీవితం. కంపెనీలను పరుగులు పెట్టిస్తూ.. మరో కన్‌స్ట్రక్షన్ కంపెనీని నెలకొల్పింది. అయినా అవేవీ ఆమెకు సంతృప్తినివ్వలేదు. ముంబయిలోని పారిశ్రామిక వాడలో 'రామ్‌జీ కామినీ' అంటే తెలియని వారు ఉండరు. ఒకప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ అంతటి వాడు అతనికి స్నేహితుడు. నాన్‌ఫెర్రస్ ట్యూబ్స్‌ను ఉత్పత్తి చేసే 'కామినీ ట్యూబ్స్' నడిపాడాయన. ఈ ట్యూబుల్ని ప్లంబింగ్, హీటింగ్, ఎయిర్ కండిషనింగ్, అండర్ గ్రౌండ్ వాటర్, గ్యాస్ సర్వీస్, మెడికల్ గ్యాస్‌లలో విరివిగా వాడతారు. ఇంత డిమాండు ఉన్నా అప్పట్లో ఆ కంపెనీ మూతపడింది. ఉద్యోగులకు జీతాల్లేవు. కేసు కోర్టులో నడుస్తోంది. అయినా కల్పనా సరోజ్ మూతపడిన ఆ కంపెనీ తలుపుల్ని తెరవడం ఒక సంచలనం. కోర్టు ఆదేశాల ప్రకారం ఉద్యోగులకు రూ.85 కోట్లు వేతనాలు చెల్లించి.. కంపెనీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించింది. మళ్లీ.. శ్రమ.. శ్రమ.. శ్రమ..! ''ఇప్పుడు 'కామినీ ట్యూబ్స్' మూడు వేల టన్నులు ఉత్పత్తి చేస్తోంది. పదివేల టన్నుల లక్ష్యం పెట్టుకున్నాం..'' అంటోంది ఈ దళిత సీఈవో. నాలుగేళ్ల కిందటే రూ.300 కోట్ల టర్నోవర్ దాటిన ఈ కంపెనీ విజయాలను.. కల్పన కృషిని అంతర్జాతీయ పత్రికలు సైతం కొనియాడుతున్నాయి. చిన్నప్పుడు ఎదురైన కష్టాన్నే తల్చుకుని.. మొండిగోడల మధ్యనే బలవన్మరణానికి పాల్పడి ఉంటే.. ఈ రోజు కల్పన నీడలో ఇంతమంది బతికేవారు కాదు. ■

ఈవారం కవిత

మణికట్టు మీద పచ్చబొట్టు

దండెంమీద ఆరేసిన
గుడ్డను లాగినంత సులువుగా
నా నుండి నా భూమిని లాక్కున్న ప్రతిసారీ

తలుపులేని వంటింట్లోకి చొరబడి
కూటికుండలో కుక్క మూతి పెట్టినంత అదాటుగా
నా నోటికాడ కూడును లాక్కున్న ప్రతీ సారీ

ఊళ్లో వదిలిన ఆంబోతు మీద కర్రుకాల్చి ముద్రవేసినట్టు
నాకు తెలియకుండానే
నా మణికట్టు మీద
పచ్చబొట్టు పొడుస్తున్నారు.

కుల అకారణ కారణంగా
నేను అవమానం పొందిన ప్రతీసారి

నేల మీద పడి రక్తం సీసా భళ్లున బద్దలైనట్లు
మానభంగానికి గురైన ప్రతీసారి

నాకు తెలియకుండానే
నా మణికట్టుమీద
పచ్చబొట్టు పొడుస్తున్నారు.

ఇసుర్రాయి మధ్య బియ్యపు గింజల్లా నలిగిపోయిన
తరతరాల నా దస్యజాతి చరిత్రను
తెరచి చూస్తే తరచి చూస్తే
ఒక్క మణికట్టు మీదే కాదు
నా సర్వాంగీణ సమస్త శరీరమూ
బలవంతపు పచ్చబొట్లతో నిండిపోయింది.

బొమ్మ: అక్బర్

ఇప్పుడు ఆకాశంలోని చుక్కలకంటే
నా జాతి శరీరంమీద
కమిలిన కుష్టుమచ్చల్లాంటి
పచ్చబొట్లే లెక్కకు మిక్కిలి కన్పిస్తాయి.

ఇనుప చువ్వకు మాంసం ముక్కలు గుచ్చి
బొగ్గుల పొయ్యి మీద కాల్చినట్లు
వేనవేల హత్యాకాండల తర్వాత కూడా
అనంతకోటి అవమానాల అనంతరం కూడా
ఆత్మగౌరవపు సూర్యుడు ఎటు తిరిగితే అటు
నా కోటానుకోట్ల దళిత పొద్దు తిరుగుడు ముఖాలు
శిరస్సులు ఎత్తుకొని పరిభ్రమిస్తూనే ఉన్నాయి.

చంపబడింది ఐదుగురు మాత్రమే
ఐదుగురు మృతవీరులు పంచభూతాలై
సింహ పంచములై
ఐదుకోట్ల అక్షౌహిణుల సైన్యమై
పునరుద్భవిస్తారు.

రక్తమోడుతున్న గాయాల్ని
నీళ్లు నిండిన ఎర్రబారిన కళ్లతో చూసుకున్నట్లు
కాలిలో దిగిన ఈత ముల్లులా
నిత్యమూ సలపరిస్తున్న పుండును
ఉబ్బిన నరాలతో పంటిబిగువున అదిమి పట్టినట్లు
ఓ నా లక్ష్మింపేటా
నిన్ను నా బాహువుల మధ్య పొదువుకుంటున్నాను
నా కవిత్వాన్ని
నల్లని సైను గుడ్డను చేసి
నీ సమాధుల పెట్టెకు నన్ను నేను చుట్టుకుంటున్నాను.

ఎంతో దూరం లేదు
నేను ప్రవచించే దళిత సూక్తంలో
ప్రభవించే దళిత విరాఠ్ పురుషుడు
ఈ జాతి పెట్టుడు పచ్చబొట్లను
సమూలంగా తుడిచివేసే రోజు
మరింకెంతో దూరంలో లేదు.

– శిఖామణి , 9848202526

అక్టోబర్ 28 నుండి నవంబర్ 3 వరకు డా. పి.ఎ. రామన్

మేషం: అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

పనులు మందకొడిగా సాగుతాయి. ఒక శుభ కార్యం దిశగా ఆలోచనలుంటాయి. బంధుమిత్రులకు చక్కని సలహాలిస్తారు. ఏమరుపాటుతనం ఇబ్బందులకు దారితీస్తుంది. ఆది, సోమవారాల్లో ప్రయాణాల్లో అసౌకర్యం, చికాకులు అధికం. పెద్ద మొత్తం రుణాలిచ్చిపుచ్చుకునే విషయంలో ఆలోచన అవసరం. స్త్రీలకు ఆరోగ్య సంతృప్తి ఉండదు. ఉద్యోగులు ఒత్తిడి, చికాకులు ఎదుర్కుంటారు.

వృషభం: కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆర్థిక ఒడిదుడుకుల నుంచి బయటపడతారు. ధనం వదులుకున్నా మనశ్శాంతి లభిస్తుంది. సంప్రదింపులు, ఒప్పందాలకు అనుకూలం. మీ ప్రమేయంతో ఒక శుభ కార్యం నిశ్చయమవుతుంది. మంగళ, బుధవారాల్లో ఇతరులకు సలహాలిచ్చి ఇబ్బంది పడతారు. వ్యక్తిగత, ఆదాయ విషయాలు గోప్యంగా ఉంచాలి. మీ బలహీనతలు, ఆగ్రహావేశాలు అదుపులో ఉంచుకోవాలి.

మిథునం: మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

లక్ష్య సాధనలో విఫలమైనా పట్టుదలతో యత్నాలు సాగించండి. కుటుంబీకులు, సన్నిహితుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఆర్థిక స్థితి ఏమంత సంతృప్తికరంగా ఉండదు. ఇలా వచ్చిన ధనం అలా వ్యయమవుతుంది. మీ సంతానం ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. గురు, శుక్రవారాల్లో పనులు, కార్యక్రమాలు సజావుగా సాగవు. కొత్త వ్యక్తుల వల్ల సమస్యలెదురవుతాయి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆదాయాభివృద్ధి లేకున్నా ఆర్థిక సంతృప్తి ఉంటుంది. రోజువారీ ఖర్చులే ఉంటాయి. కొత్త ఆలోచనలు, పథకాలతో ముందుకు సాగుతారు. అవివాహితులు కొత్త అనుభూతికి లోనవుతారు. శనివారం నాడు రుణదాతల ఒత్తిడి, శ్రీమతి పోరు చికాకుపరుస్తాయి. విద్యార్థులకు ఏకాగ్రత లోపం, మందలింపులు తప్పవు.

సింహం: మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఒక శుభకార్యం నిశ్చయమవుతుంది. కల్యాణ మంటపాలను అన్వేషిస్తారు. పెట్టిపోతలు, ఒప్పందాల్లో పెద్దలను సంప్రదించండి. సొంత నిర్ణయాల వల్ల వ్యవహారం బెడిసికొట్టవచ్చు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. ఆది, సోమవారాల్లో పనులు, కార్యకలాపాలు మందకొడిగా సాగుతాయి. వ్యాపారంలో నష్టాలను అధిగమిస్తారు. ప్రయాణాల్లో అవస్థలు తప్పవు.

కన్య: ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యవహారానుకూలత, అవకాశాలు కలిసి రావడం వంటి ఫలితాలున్నాయి. ఆత్మీయులకిచ్చిన మాట నిలబెట్టుకుంటారు. మిమ్మల్ని కలవరపరచిన సంఘటన సమసిపోతుంది. పనుల్లో జాప్యం, ఆటంకాలు ఎదుర్కుంటారు. కొత్త వ్యక్తుల విషయంలో జాగ్రత్త. వ్యాపారాల విస్తరణ, పెట్టుబడుల వ్యవహారంలో పునరాలోచన అవసరం. మీ శ్రీమతి సహాయంతో ఒక సమస్యని అధిగమిస్తారు.

తుల: చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్యమైన వ్యవహారాలు మీ సమక్షంలో జరుగుతాయి. సందర్భానుసారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం మందగిస్తుంది. వైద్యసేవలకు ధనం బాగా వెచ్చిస్తారు. సంతాన మూలకంగా చిన్నచిన్న సమస్యలు తలెత్తుతాయి. వృత్తి, ఉపాధి పథకాల్లో నిలదొక్కుకుంటారు. నూతన వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. స్పెక్యులేషన్ లాభాల దిశగా సాగుతుంది.

వృశ్చికం: విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక సమస్యలు, ఒత్తిడి, చికాకుల నుంచి ఉపశమనం పొందుతారు. కొంత మొత్తం ధనం అందుతుంది. రుణాలు తీర్చగలుగుతారు. ఆకస్మిక ప్రయాణం తలపెడతారు. భాగస్వామిక ఒప్పందాలు, చెల్లింపుల్లో మెలకువ వహించండి. ఉద్యోగస్తులకు పర్యటనలు, పనిభారం అధికం. ఉద్యోగ యత్నంలో భేషజం, బిడియం తగదు. వ్యాపారాల్లో ఒడిదుడుకులు తొలగుతాయి.



ధనస్సు: మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. ఒక శుభకార్యం సానుకూలమవుతుంది. పెద్దలు, ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. ఖర్చుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తారు. గురు, శుక్రవారాల్లో మీపై శకునాలు, ఇతరుల వ్యాఖ్యలు ప్రభావం చూపుతాయి. విమర్శలు,నిందలకు దీటుగా స్పందిస్తారు. పనివాళ్ళ విషయంలో జాగ్రత్త.

మకరం: ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రతి వ్యవహారం మీ చేతుల మీదుగా సాగాలని ఆశిస్తారు. కుటుంబసభ్యుల సొంత నిర్ణయాలు ఇబ్బంది కలిగిస్తాయి. ఆదాయ వ్యయాలు సమీక్షించుకుంటారు. ఖర్చులు తగ్గించుకోవాలన్న మీ యత్నం ఫలించకపోగా మరింత అధికమవుతాయి. శనివారం ఏ పనీ సాగక నిరుత్సాహం చెందుతారు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. మొక్కుబడులు తీర్చుకుంటారు.

కుంభం: ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

కుటుంబ, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయి. అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. ఒప్పందాలు, సంప్రదింపులకు అనుకూలం. గృహ మార్పు యత్నం ఫలిస్తుంది. ఉమ్మడి, సొంత వ్యాపారాల్లో రాణిస్తారు. మీ పలుకుబడితో ఒకరికి ఉద్యోగావకాశం లభిస్తుంది. ముఖ్యమైన విషయాలు కుటుంబ సభ్యులకు తెలియజేయడం ఉత్తమం. ప్రయాణంలో జాగ్రత్త.

మీనం: పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

మీ కార్యక్రమాల్లో మార్పులుంటాయి. అనుకున్న పనులు ఒక పట్టాన పూర్తి కావు. ఆర్థిక ఇబ్బందులు లేకున్నా వెలితిగానే ఉంటుంది. దుబారా ఖర్చులు అదుపు సాధ్యం కాదు. శుభకార్యాలు, వేడుకల్లో పాల్గొంటారు. స్త్రీలకు అయినవారి రాక సంతోషం కలిగిస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పక్కదారి పట్టే సూచనలున్నాయి. వృత్తి వ్యాపారాల్లో మెళకువలు, అనుభవం గడిస్తారు.

అంకెలతో అదృష్టం

ఐ.బి. సాహు
సెల్ : 95810 94208, 90142 48124

4 పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.....
2. పుట్టిన తేదీ .....

(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)

3. పుట్టిన సమయం .....
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు .....
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

ఎల్.ఎన్.ఆర్., రాయచూర్

సంఖ్యాశాస్త్రం ప్రకారం పేరు మార్చుకోవడం వల్ల మార్పు సాధించాను. ఈ మార్పు అన్నిటిలోనూ ఒకే పేరుతో సాధించుకోవచ్చునా? ఒక్కసారి మాత్రమే పేరు మార్చుకోవాలా?

సంఖ్యాశాస్త్రం పుట్టిన తేదీ, డెస్టిని అంశాలను దాటి ఎంతో విస్తృత పరిధిని పెంచుకుంది. ఒక వ్యక్తి పేరులో ఒక అక్షరం చేర్చాము. ఈ చేరిక వలన ఈ సంవత్సరంలో ఎలా ఉంటుంది. రాబోయే ఐదేళ్ళలో ఎలా ఉంటుంది? ఈ మార్పు ఏ శక్తి స్థాయి పెంచడానికి, ఒక అంశంలోనే శక్తి స్థాయి పెంచడం వలన మిగిలిన అంశాలు ఏవిధంగా ప్రభావితం చేయబడుతున్నాయి. ఈ అంశ స్వభావం మొత్తంగా పాజిటివ్ శక్తిని ఇస్తుందా నెగెటివ్ శక్తిని ఏమేర తగ్గించగలదు ఇత్యాది విషయ నిర్ణన సంపూర్తిగా గమనించవలసిందే. వృత్తిపరంగా పేరును బలపరచడం జరిగింది. ఇక మీ సమస్య ఇల్లు కట్టగలనా, కొనగలనా?

మార్చిన మీ పేరులోని శక్తి మీ పే స్కేలు పెంచడంలో సహాయపడింది. మీరు జన్మించిన స్థలం వైబ్రేషన్స్, మీరు ప్రస్తుతం నివసిస్తున్న స్థలం వైబ్రేషన్స్ లెక్కించినపుడు 2015 వరకు ఇంటి విషయం ఫలించదు. ఫలితాలను నిర్ణయించడంలో తొందరపాటు పనికిరాదు. ఫలిత నిర్ణయం పేరు మార్పు ద్వారా సూచించవలసి వచ్చినపుడు ఒక వ్యక్తి పుట్టిన తేదీని సంపూర్ణంగా పరిశీలించవలసిందే. ఒక్కసారి మాత్రమే పేరు మార్చుకోవాలా అని అడిగారు. సరైన పద్ధతిలో నిర్ణయించబడిన పేరు మార్పు ఒక్కసారి చాలు. మీరు ఫలితాన్ని సాధించారు కాబట్టి తిరిగి పేరు మార్పునకై ప్రయత్నించకండి. ఎన్నిసార్లు మార్పుకు గురియైతే అంతగా బలహీనపడుతుంది. పేరులో వైబ్రేషన్ శక్తి. పేరు మార్పు, తదుపరి అంశాలు, రెమెడీలు సక్రమంగా అనుసరిస్తే సరిపోతుంది.

మీ పేరులో వైబ్రేషన్స్ శక్తి అనుకూలంగా మలచబడలేదు. ఈ ఛార్ట్‌లో వైబ్రేషన్స్ గమనించవచ్చు.



ఇండివిడ్యువల్ వైబ్రేషన్ 5. విధాన వైబ్రేషన్ 3. రూలింగ్ వైబ్రేషన్ 1. కంట్రోలింగ్ వైబ్రేషన్ 9. న్యూట్రల్ వైబ్రేషన్ 6. ఆర్.వి. ఎనర్జీ 41/36.

పేరులో మార్పు వంద శాతం ఆర్.వి. ఎనర్జీపై ఆధారపడి ఉంటుంది. ఈ ఎనర్జీలో ఉండే సంఖ్యా స్వరూపాలు మీ జీవితాన్ని శాసిస్తాయి. ఈ రెండు సంఖ్యా స్వరూపాల మధ్య అంతరం పాజిటివ్‌గా ఉండాలి. ఈ పాజిటివ్ శక్తి ఎంత స్థాయిలో ఉంటే అంత సమస్యలు తక్కువ అదే నెగెటివ్ శక్తి అయితే సమస్యల తోరణం. ఇక్కడ మీరు చెప్పిన సమస్య మూలం 4వ సంఖ్యకు చెందినది. ఛార్ట్‌లో నాలుగవ సంఖ్య బలం 60 శాతం వరకు ఉంది. వైబ్రేషన్ భ్రమణ వేగంలో ఈ నాలుగవ సంఖ్యా స్వరూపం 2013 ఆగస్టులో పాజిటివ్ దిశవైపు మారుతుంది. ఈ దిశగా మీరు ఫలితాన్ని అందుకోవచ్చు.

ఇందుకుగాను రెమెడీ ఒక్కటే. పేరులో 'ఎన్' అక్షరం చేర్చాలి. ఈ మార్పు కేవలం నెగెటివ్ స్థాయి తగ్గించడానికే. ఆరు కోర్సులు వ్రాయాలి. 24 సార్లు ప్రతి రోజు. కోర్సు వ్యవధి మూడు రోజులు. కోర్సు మధ్యలో ఏవిధమైన ఆటంకమూ రానివ్వకుండా జాగ్రత్తపడండి. ఈ కోర్సు పూర్తి అయిన తరువాయి మీ పేరు శక్తివంతంగా మారుతుంది. ఆపై మీ పేరులో 'ఎన్' తొలగించి 'ఆర్' అక్షరం చేర్చి వాడుకోవాలి. మొదటి మార్పు నెగెటివ్ స్థాయి తగ్గించడానికి. రెండవ మార్పు పెరిగిన పాజిటివ్ శక్తిని కాపాడుకోవడానికి. 2013 ఆగస్ట్ తరువాయి మీరు ఏ పని మొదలుపెట్టినా ఫెయిల్యూర్ కారు. ఒక్కటే కండిషన్. కోర్సును ఖచ్చితంగా వ్రాయగలిగినపుడు మాత్రమే. గుర్తుంచుకోవలసిన విషయం ఇదే. ఈ విషయంలోనే మీరు కాలాన్ని కంట్రోల్ చేయవలసి ఉంటుంది. ఆపై అన్నీ శుభాలే!!!

సి.కె.ఆర్., విజయవాడ

నా పేరులో మార్పు సూచించగలరు. నేను నా పుట్టిన తేదీకి సరిపడే నంబర్‌లోనే పేరు మార్చుకున్నాను. అయినా...

మీరే కాదు ఎంతోమంది ఇలాగే వ్రాస్తుంటారు. పేరు పుట్టిన తేదీకి సరిపడేట్లుంటే చాలు అనే అభిప్రాయం వాస్తవంలో ఎంతవరకు కరెక్ట్. మీరు పుట్టిన తేదీ 4. 4కు సరిపడిన 13లో పేరు మార్చుకోవచ్చు. తప్పులేదు. ఈ మార్పు పరస్పర విరుద్ధంగా పనిచేసినపుడు ఎదురయ్యే ఆటుపోట్ల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోగల శక్తివంతులు అయితే సమస్యే లేదు. ఇక్కడ మరో ముఖ్య అంశం. 4→13 కాంబినేషన్‌లో మీ వైబ్రేషన్స్ శక్తి నశించినా లేదా న్యూట్రల్‌గా మారినా లేదా మరింత నెగెటివ్‌గా మారినా నెపం ఎవరి మీద వేస్తారు?

ప్రాథమిక స్థాయిలోనైనా జ్ఞానం లేనపుడు మీపై మీరే ప్రయోగాలు జరుపుకుని నింద సంఖ్యాశాస్త్రంపై వేయడం సముచితంగా లేదు. ఏదో పజిల్ ఆడుకున్నట్లుగా మీ జీవితంతో మీరే ఆటాడుకుంటున్నారు. ఇక్కడ మీరు పెంచుకున్న నెగెటివ్ స్థాయిని కంట్రోల్ చేయగల శక్తి 15వ సంఖ్యలో మాత్రమే ఉంది. మీ పేరులో 'ఎస్' అక్షరం చేర్చి ప్రతిరోజు 150 సార్లు వ్రాయండి. వంద రోజుల పాటు బ్రేక్ లేకుండా వ్రాయండి. 4 కోర్సులు వ్రాయండి. శుభమ్.

ఎమ్.ఆర్., వైజాగ్

నా పేరులో వైబ్రేషన్స్ వివరించగలరు. నా పేరులో మార్పు శక్తివంతంగా చేయగలరు. ఏ పని చేసినా చివరి వరకు వచ్చి ఆగిపోతుంది.

Adv.

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా : అంకెలతో అదృష్టం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 033.

వాంగ్మూలం

★ స్వాతికుమారి బండ్లమూడి

గుండె పగిలిపోతుందిరా చిన్నోడా .. యాభయ్యేళ్ళ ఒంటరోడిని, తాగుబోతు నా కొడుకుని, అర్ధరాత్రుళ్లు ఫోన్ చేసి ''లవ్ యూ రా బంగారు కొండా'' అంటే సంస్కారపు జబ్బు ముదిరినోడివి కాబట్టి నా మత్తు సంగతి కనిపెట్టి నీ నిద్రమత్తుని దాచిపెట్టి 'ఇవ్వాళ కూడా డోసెక్కువైందా?' అని విసుక్కోకుండా అడిగినప్పుడు ఎంత ముచ్చటేసేదిరా!

సఫరింగ్, సఫరింగ్, సఫ – రింగ్, టేబిల్ మీద ఖాళీ గ్లాసుల అడుగుజాడల రింగులు. వలయాలు, వేదనా వలయాలు, శోధనా వలయాలు, కళ్లు తిరిగి ఒళ్లు తిరిగి ... ర్రెయ్, ఇంతకుముందు ఇక్కడో నయగారా ఉండాలి, సింకులో నీళ్లాపేసిన బాస్టర్డ్ ఎవడ్రా? కాగితాలున్నయ్ కాబట్టి సరిపోయింది మాటలు కక్కడానికి.

పత్రికలో పడిన నీ ఒకేఒక్క కథ, ఆపైన నీ ఉత్తరాలు చూసి మొదటిసారి నిన్ను కలిసినప్పుడు నేను ఊహించినట్టే ఉన్నావ్. ఐనా ఏం ఊహించాను నేను? తెలివి, మొండితనం, వయసులో ఉండే పట్టుదలా, అదే నాకు తెలిసిన నువ్వు, నాకెప్పటికీ దొరకని నాలాంటి నువ్వు. ఆ సాయంత్రం అంతసేపూ తాగుడూ వాగుడూ నాదే అయ్యాక ''అలాగ ఫోటోలో దేవుడిలా కూచుంటావేం? నిజంగానే తాగవా?'' అని నేను దేవుణ్ణీ, నిన్నూ ఒకేసారి అనుమానిస్తే ''తాగినవాళ్లని ఇంతదగ్గరగా ఎప్పుడూ చూళ్ళేదు మాస్టారూ'' అన్నెప్పి ''కేవలం మీ కోసమే ఇంతసేపూ ...'' అన్న ముక్కని చెప్పకుండా అభిమానంగా నవ్వినప్పుడు; అప్పుడు గ్లాసు దించి మరోసారి నీ మొహంలోకి చూస్తే, ఎందుకో ... ఎందుకో శివాని గుర్తొచ్చింది.

పెళ్ళాం, బెటరాఫ్ – ఇలా ఎలా రిఫర్ చేసినా చిరాకు పడేది శివాని. ఆ పేరు చూసే ప్రేమించుంటాను. సృష్టిలో ఎక్కువైపోయిన ప్రతిదాన్నీ లయం చెయ్యడానికి, శివమెత్తినప్పుడు లయతో తాండవమాడ్డానికి తోడుండే శక్తి తన అస్తిత్వాన్నంతా ఆక్రమించకుండా శివుడు ఎలాగాపాడో సగం శరీరం దగ్గరే! ఎలాగో నిభాయించాడు, తట్టుకు నిలబడ్డాడు. మాటలా అది! నాలాంటోడివల్ల కాలేదు. ఇందాకన్నాగా 'మా ఆవిడ' అని తన గురించెవరికైనా చెబ్తే 'నేను నువ్వే అవుతాను కానీ, నీకు మరేదో ఎలా అవుతాను?'' అని పెళ్లిలో చదవని మంత్రాల్నేవో కొత్తగా నేర్పలేక మళ్లీ వెంటనే మూగగా అయిపోయేది.

మూడేళ్ల కొడుకుపోయినపుడు ఎన్ని నెలలకీ మనిషి కాలేదు. శరీరం కోసం తప్ప ఓదార్చడానికి ముట్టుకోడం రాని మగాణ్ణే అప్పటికి. తన ఏడుపు నన్ను అస్తమానమూ డిఫెన్స్‌లో ఎందుకు పడేసేదో ఎప్పుడాలోచించినా అర్థం కాదు. సొంతసొత్తులా తప్ప సాటి మనిషిలా చూడలేనని తెలిశాక కూడా, ఎప్పటికీ చేతికి తగలని పచ్చగడ్డి పరక కోసం బీడునేలమీద తడుములాడినట్టు తనక్కావల్సిన దేనికోసమో చాన్నాళ్లు నా దగ్గర వెతుకుతూనే ఉండేది. ఇప్పుడు నాకు పగులుతున్నట్టుగానే తనకీ గుండె ఎన్నిసార్లు పగిలి ఉంటుందో! ఒక రోజు నిజంగానే నా శక్తినంతా లాక్కుని జీవితాన్ని, మనుషుల్ని దేబిరించకుండా హుందాగా తనకి నప్పుతుందేమో అన్న ఆశతో మరే లోకానికో వెళ్లిపోయాక, వెళ్లిపోయి రెండు పుష్కరాలు దాటాక నువ్వు ...

ఇప్పుడిదో కొత్త పిచ్చి – ''పిచ్చిలో ఉన్న ఆనందం పిచ్చోడికి తప్ప తెలీదు'' అని నేనంటే ''నెరుడాని మీవాదం కోసం వాడేసుకుంటారు – స్పానిష్ మీ బలహీనత'' అని నువ్వు ఎడ్మైరింగ్‌గా నవ్వేవాడివి.''నువ్వు గత జన్మలో రష్యా వోడివిరా'' అని నేనన్నప్పుడు కృతజ్ఞతతో నవ్వినట్టు ...

''కథొకటుంది మాస్టారూ. మూడు ముక్కల్లో చెప్పొచ్చు. పెళ్లాన్ని దారుణంగా చంపేసి రేప్పొద్దున ఉరికంబం ఎక్కబోతున్న హంతకుడి గురించి ఇద్దరు సెంట్రీలు మాట్లాడుకుని, నైట్ డ్యూటీలను బూతులు తిట్టుకుని ఒక దమ్ములాగి సెల్స్‌లో రౌండుల కెళ్లటం మొదటి భాగం. చనిపోయిన భార్యప్రియుడు, ఈ గొడవల్లో తను ఏ రకంగానూ ఇరుక్కోకుండా ఇన్‌ఫ్లుయెన్స్‌తోఎలా నెట్టుకొచ్చాడో, చిత్తుగా తాగి బార్లో ఫ్రెండ్స్ దగ్గర కోతలు కొయ్యడం రెండోది. ఖైదీ కొడుకు అనాథాశ్రమంలో భయంగా ముడుచుకు పడుకుని తను స్కూలుకెళ్లి వచ్చేలోపు అమ్మా నాన్నా ఇద్దరూ కనపడకుండా పోవడమేంటో అర్థంకాక ఎక్కిళ్ళు బయటికి వినపడకుండా నోరుమూసుకుని, కాసేపటికి కళ్లు తుడుచుకోకుండానే నిద్రపోవడం–ముగింపు: అంతే కథ. మొత్తం కథలో ఆ హంతకుడిని నేరుగా చూపించకుండా పొగమంచు కప్పెయ్యాలన్నమాట, రాయొచ్చంటారా? అని మొహమాటంగా సలహా అడిగినప్పుడు –

''నా అనుభవంలోంచి చూస్తే అంత గొప్పకథ కాదు గానీ, నీ వయసుకి గ్రాండ్ గానే ఉంటుందిలే, కానియ్'' అని ఉడికిస్తే ''ఒక్కసారైనా అన్‌కండిషనల్‌గా మెచ్చుకోరుగా మీరు'' అంటూ నువ్వు ఉక్రోషపడితే 'నాకేవవుతాడ్రా వీడు? నిండా పాతికేళ్లు లేవు. నా కొడుకే బతికుంటే వీడంతైతే, ఇలా లోలోపల దావానలంతో దహించుకుంటూ ఉండేవాడా?' అనొక విపరీతపు ఆలోచన సెంటిమెంట్‌తో సతమతం చేస్తుండేది.

''ఐనా పెద్దాయనా! మనమీకాలంలో పుట్టి ఈ చట్టాలు, ఇప్పుడున్న సమాజమే ప్రామాణికం అనేసుకుని ఏదో రాసేస్తాం కానీ; ఈ స్థలం, కాలం, ఇప్పటి నైతికత ఇవన్నీ అబద్ధం, అసంబద్ధం అయిన మరోచోట, నక్షత్రాల ధూళి రాలిపడే అనంతమైన శూన్యంలో, ఉల్కాపాతాల మౌనంలో కాంతియుగాలకవతలకి మేధస్సుని పంపి రాయగలిగితేనే సృజనకి అర్థం'' అని నువ్వొగిపోతుంటే పాతికేళ్ల క్రితపు నా ఆవేశమూ, దాన్లోంచి పుట్టి ఇప్పటికీ ఆగని నా అన్వేషణా గుర్తొచ్చేవి.

ఏమన్నావు? స్థలం, కాలం – ఎన్ని స్థలాల్లో తిరిగాను, ఏ కాలాల్లో బతికాను. పిచ్చి పట్టినవాడిలా ఏ రైల్లో ఎక్కడ ఎక్కానో, అదెక్కడికెళ్తుందో తెలీకుండానే. నిద్ర లేచినప్పుడు ఏ స్టేషనొస్తే అదే నా ఊరు. పడమటి కనుమల్లో ఏదో పల్లెటూరి హోటల్లో టీకప్పులు కడగటంలో మొదటిసారి మెడిటేషన్ దొరికినప్పుడు; గోవాబీచ్ లగ్జరీ రిసార్టుల్లో టాయిలెట్ల సఫాయిలో నాలుగు డబ్బులు పోగవగానే సింబాలిజం, ఫ్యూచరిజం, ఫిలాసఫీ అని ఇష్టమొచ్చిన పుస్తకాల కోసం ఖర్చు పెట్టేసినప్పుడు; నేనొదిలేసొచ్చిన ఎకౌంట్స్ మేనేజర్ పోస్టులో గోతికాడ నక్కలా దూరి వారానికార్రోజులు సగం టీలు, సగం గాసిపింగూతో గడిపేసే శివప్రసాద్‌కి ఫోన్ చేసి 'నిజంగానే నేను గొప్పగా బతుకుతున్నానా ఫూల్' అని పగలబడి నవ్వాలనిపించేది.

అజంతా గుహల్లో గైడుగా వెలగబెట్టినప్పుడు చరిత్రని పొయెటిగ్గా చెబుతుంటే ఆ కాసేపట్లోనే శిల్పి హృదయ రహస్యాల్ని కళ్లతో కొనేసుకోవాలని తపించి, కళలోని అందాన్ని తప్ప ఆత్మని పట్టుకోలేక అల్లాడే యాత్రీకుల అలసటని, ఫోటోల్ని తప్ప జ్ఞాపకాల్ని దాచుకోలేని యాంత్రికతనీ చూసి జాలిగా ఓదార్చాలనిపించేది.

ఇంకా ఎన్నెన్ని స్థలాలు, ఎలాంటి అనుభవాలు!

దారంతెగి గాలివాటుకి ఎగిరిపోయి పతనమైన పతంగులు, వివస్త్రంగా ఉబ్బి వరదల్లో కొట్టుకొచ్చే దిక్కులేని శవాలు, ఇసుక తుఫానులు చెరిపేసిన ఎడారి ఒంటెల ప్రయాణపు గుర్తులు, అసంతృప్త ఆగ్రహాలు నిండిన సముద్రపు సుడుల్లో అలవాటుపడ్డ మొండి ధైర్యంతో సాగిపోయే ఓడలు చేరని తీరాలు.

ఏ స్థలాల్లోని, ఏ కాలానివి ఈ జ్ఞాపకాలన్నీ?

తనలోని సుఖాన్ని తనకే తిరిగి ఇచ్చే మరో సాధనం కోసం వెర్రెక్కిన శరీరపు కేకలు, ఏ అస్థిపంజరాల్ని కప్పిన అవసరాల్నో చేరిన చోట – ఎవరివో స్త్రీ దేహాలు, స్నేహాలు, దాహాలు, మోహాలు. మొహం మొత్తుళ్లు, విదిలింపులు, వదిలింపులు, డబ్బుల ఎరలు, ఏ చెట్టువో రాలి నీటివాలుకి కొట్టుకొచ్చిన అడివిపూలు – ఎటర్నల్ స్ట్రగుల్ ఆఫ్ ద యానిమల్ ఇన్‌స్టింక్ట్స్.

యుగాల తరబడి ఇందరు వెతుకుతున్న ఈశ్వర ప్రేమ హౌరా నదికి అవతల ఎక్కడో ఏ ఇరుకు సందుల్లోనో దొరికినప్పుడు; బసంతీ! నా చెవిలో ఏదో అన్నావ్? ఆర్ట్ సినిమాలో నటన మర్చిపోయిన హీరోయిన్లాగా. మనసుతో శరీరాన్ని కోరుకోవడం మర్చిపోయిన చాలా ఏళ్లకి, పరిచయం పాతబడి వెళ్లిపోతుంటే – నేనిచ్చిన డబ్బులు చనువుగా నా జేబులో తిరిగి పెట్టేస్తూ ఏమిటి బసంతీ అన్నావ్ నా కెప్పుడూ అర్థంకాని మరో లోకపు భాషలో!! ఎప్పుడో శివాని కోసం పిచ్చెక్కిపోయిన మొదట్లో భావుకత్వమంతా కళ్లల్లో వెలిగించుకుని నుదుటిమీద ఆర్తితో పెట్టిన ముద్దు – కామంతో కాదు, రిచువల్‌గా, అలవాటుగా కాదు .. 'ఐ కేర్ ఫర్ యూ' అని అంత సున్నితంగా చెప్పడం మళ్లీ నీ దగ్గరే. ఒకసారెళ్లిన చోటకీ, వదిలేసొచ్చిన మనుషుల దరిదాపులకీ వెళ్లే అలవాటు లేదు నాకు. ఎక్కడున్నావో, ఎప్పుడైనా తలచుకున్నావో లేదో. అప్పటికి కష్టంగా అనిపించినా తప్పలేదు. నాకు తెలుసు నీతో నేనుండలేను. అసలెవరితోనూ, ఎక్కడా ఉండిపోలేను శాశ్వతంగా. పదిహేనేళ్లవదూ? 'బై బై బసంతీ' అని కూడా చెప్పకుండా వెనక్కి తిరిగి చూడకుండా లేటైపోతున్న ఏ రైలు కోసమో అన్నట్టు త్వరత్వరగా నడుచుకుని వచ్చేసి...



బొమ్మ : అక్బర్

ఎక్కడి చట్టం, సమాజం, నైతికత, నైతికాతీతత! నిజంగానే నువ్వు రాయగలవురా చిన్నోడా; నేనాగిపోయిన చోటునుంచి ముందుకు కాకుండా పైపైకి వెళ్లి, నక్షత్రాల మధ్య ఖాళీలో గడ్డకట్టిన ఇంక్ పెన్నుని గట్టిగా విదిలించి కొట్టి ...నీకా దమ్ముంది.

''ప్రయోగాల మీద అంత తపన ఉన్నవాడివి, ఈ మూడుముక్కల కథలెందుకు నీకు?'' అనడిగితే ''లేద్సార్, ఈ ఒక్కసారికీ రాధికకి మాటిచ్చాను. తను పనిచేసే వీక్లీలో స్టోరీ సెక్షన్‌కి మారింది. మీకెప్పుడూ చెప్పలేదు కదా తను చాలా ఇంటలిజెంట్ అండ్ సెన్సిబుల్‌గా అనిపిస్తుంది'' అని మురిసిపోయినోడివి – ఇన్ని నెల్ల తర్వాత మళ్లీ మొన్ననగా ఫోన్ చేసి ''మనకి నచ్చేది లోకంలో నిజంగా ఉందని తెలిసీ, అందుబాటులో ఉండీ, మనది కానప్పుడు, ఎలాగండీ తట్టుకునేది?'' అని ఏదో గొప్ప ఆశాభంగాన్ని మగాడివి కాబట్టి ఏడవకుండా మానిప్యులేట్ చేస్తుంటే – ఏంట్రా ఇంత ముదురుగా మాట్లాడావ్! ఒకవేళ తాగి ఉన్నావా అని అనుమానమేసి పట్టరాని కోపమొచ్చింది.

.....

అప్పటిదాకా ఎక్కింది దిగుతూ, అప్పుడే లోపలికి దిగింది నరాల్లోకి మైకంతో, తడిపిన కొద్దీ ఎండిపోతున్న గొంతుతో – ఎక్కినమెట్లు దిగుతున్నానో, దిగవలసిన మెట్లు ఎక్కుతున్నానో మెట్లకే తెలియాలి. నీడనుంచి నిజాన్ని విడదీసి చూపడానికి విషపుటాలోచనలు చేస్తున్న మోసపు ఉదయాన్న; నిశ్చింతగా పడుకున్న రాత్రినెవరో రాక్షసంగా నేల అడుక్కి తొక్కేస్తుంటే, ఆ ఊపుకి రోడ్డుమీద తూలిపడుతున్న ప్రతీదాన్ని కేర్లెస్‌గా చూసుకుంటూ ...

అదే మొదటిసారి పనిగట్టుకుని ఫలానా చోటకని అనుకుని ఎవర్నయినా చూడ్డానికి రావడం.

''మీ పుస్తకాన్ని ప్రచురిస్తాం'' అని ఎవరైనా అడిగితే ''చేసుకోండి, నాకెందుకు చెప్పడం?''

''మరి రాయల్టీలు?''

''ఊళ్లో నా తమ్ముడున్నాడు, వాడికిచ్చెయ్యండి. నా తాగుడుకి డబ్బులు చాలక ఉత్తరం రాస్తే వాడే పంపుతాడు.''

అంత నిర్లక్ష్యం, అంత పొగరుబోతు దిలాసా. అలాంటిది నిన్న రాత్రి నువ్వు ఫోన్లో ''దాని దుంప తెగ, ఎంత దౌర్భాగ్యపు జీవితమండీ'' అనగానే ఈ టైంలో బస్సు లుంటాయా అనే ఆలోచన లేకుండా నువ్వు పుస్తకాలు కొరియర్ పంపిన కవరు వెనక అడ్రెస్ పట్టుకుని, ఇందాకా వస్తే ...

గది తలుపు తోసుకుని ''నేనెవరో చెప్పుకోరా ఇడియట్?'' అని నీ ఆశ్చర్యం చూద్దామనుకుంటే ...

నీలాగే నీ గది కూడా నేననుకున్నట్టే ఉంది. నేలంతా పరుచుకున్న పుస్తకాలు, టేబుల్ మీద ఒలికిపోయిన ఇంకు మరకలు, కానీ ఒంటిమీద స్పృహేదీ? పక్కన సూయిసైడ్ నోటేదీ? డస్ట్ బిన్‌లో చింపిపారేసిన డైరీ కాగితాల మధ్యలో ఉన్న రెస్టిల్ షీట్లు ఏ వివరాలూ చెప్పవు. అసలెవరైనా 'నా చావుకెవరూ కారణం కాదు' అని రాశారంటే ఆ కారణమైన వాళ్లని కాపాడ్డానికే అని అర్థం. మరి అసలేమీ రాయకుండా ఇలాటి పని ఏ చివరి జ్ఞాపకాన్ని కాపాడ్డానికి?

పెద్ద పనిమంతుడిలా కథల్రాయడమే కానీ నిద్రమాత్రలేసుకునే ముందు చిన్న చీటీ ముక్క రాయాలనీ, ఆ రాసేముందు ఇంటిగోడలకి బీటలేస్తూ మొండిగా బతికే ఏ పిచ్చిపూలచెట్టునో గుర్తుతెచ్చుకుని బతకాలనీ, నీ ప్రాణమ్మీద నీకధికారం లేదనీ, నీ నిరాశకి సమాధానం చెప్పాల్సిన బాధ్యత నీ బతుక్కి లేదనీ, రెండు మైలురాళ్ల మధ్య నిశ్శబ్దంలో అలసట తీర్చుకోవాలే కానీ అర్థాంతరంగా ఆగిపోకూడదనీ, ఇలా చేసిన నీ తలపొగరుకి శిక్షగా 'లవ్ యూ రా బంగారుకొండా' అని ఇక నేనెప్పుడూ చెప్పబోననీ.

ఈ మాత్రం ఊహించలేనివాడివా నువ్వు అని తలచుకున్నకొద్దీ ...

గుండె పగిలిపోతుందిరా చిన్నోడా!

.....

swathikumari@gmail.com

'నీలాగే నీ గది కూడా నేననుకున్నట్టే ఉంది. నేలంతా పరుచుకున్న పుస్తకాలు, టేబుల్ మీద ఒలికిపోయిన ఇంకు మరకలు, కానీ ఒంటిమీద స్పృహేదీ? పక్కన సూయిసైడ్ నోటేదీ? డస్ట్ బిన్‌లో చింపిపారేసిన డైరీ కాగితాల మధ్యలో ఉన్న రెస్టిల్ షీట్లు ఏ వివరాలూ చెప్పవు. అసలెవరైనా 'నా చావుకెవరూ కారణం కాదు' అని రాశారంటే ఆ కారణమైన వాళ్లని కాపాడ్డానికే అని అర్థం. మరి అసలేమీ రాయకుండా ఇలాటి పని ఏ చివరి జ్ఞాపకాన్ని కాపాడ్డానికి?'

చదువులో, సంగీతంలో సవ్యసాచిలా ఏకకాలంలో చక్రం తిప్పిన పాటల రాణి ఆమె. 'పాడుతా తీయగా', 'ప్రియా ప్రియతమా రాగాలు', 'సూపర్ సింగర్ 3' లాంటి ఎపిసోడ్స్‌లో విజేతగా నిలిచి ఎందరో అభిమానుల్ని గెలుచుకున్న ఎం.బి.ఏ. పట్టభద్రురాలు కూడా. 'పసలపూడి కథల' టైటిల్ సాంగ్‌తో బుల్లితెర ప్రేక్షకుల తలలో నాలుకయ్యారు. కోటి సంగీత దర్శకత్వంలో 'క్లాస్‌మేట్స్'తో సినీ గాయనిగా అరంగేట్రం చేసి ఇప్పటికే అర్ధ సెంచరీ దాటేశారు. 'చోరీ చోరీ' (లవ్ లీ), 'లిజన్ టు మై హార్ట్స్' (ప్రేమకావాలి), 'ఊహలో సుందరా' (సరదాగా కాసేపు), 'చినుకులా రాలి' (అహ నా పెళ్లంట), అచ్చాహై (సింహ), 'దేవుడా దేవుడా' (దేవుడు చేసిన మనుషులు), 'ఇంద్రధనుస్సులకు' (బురిడీ), 'సంపేస్తున్నాయే పిల్లా' (దేవరాయ) లాంటి పాటలతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల వారికి కూడా తన స్వరమాధుర్యం పంచుతున్న వర్ధమాన గాయని అంజనా సౌమ్య అందించే హ్యాపీడేస్ ఇవి.

అందరి చీటీల్లోనూ నా పేరే...

కల నిజమాయెగా ...

కాలేజీ బస్సులో ప్రతి రోజూ కొత్త పాటల రికార్డులు వేస్తుండేవారు. అవి విన్నప్పుడల్లా 'నా పాట కూడా వీళ్లందరితో పాటు కాలేజీ బస్సులో వినే అదృష్టం వస్తుందా?' అనుకునే దాన్ని. తథాస్తు దేవతలు నా మొర ఆలకించారేమో! ప్రాజెక్టు వర్క్‌కోసం హైద్రాబాద్ వెళ్లినప్పుడు కోటిగారు అనుకోకుండా 'క్లాస్‌మేట్స్' సినిమాలో చిత్రగారు పాడాల్సిన ఒక పాట ట్రాక్ నాతో పాడించారు. తర్వాత అదే పాటని స్రవంతి రవికిషోర్‌గార్కి వినిపిస్తే సినిమాలో 'సదా' లిప్ మూమెంట్‌కి సరిగ్గా సరిపోతుంది. అమ్మాయి బాగా పాడింది. చిత్రగారితో మళ్లీ పాడించక్కర్లేదేమో' అన్నారట. దాంతో, వారం తర్వాత కోటిగారు సినిమాలో నా పాటనే ఉంచేస్తున్నామని చెప్పేసరికి ఆనందం పట్టలేకపోయాను. మా ప్రాజెక్ట్ వర్క్ కంప్లీట్ చేసి, కాలేజీలో సబ్‌మిట్ చేయడానికి వెళ్తుంటే అదే పాటని బస్‌లో స్టూడెంట్స్‌తో కలిసి వినడం వహ్, మధురమైన, మరవలేని అనుభవం.

'స్వరములు ఏడైనా రాగాలెన్నో'

– మధ్యమావతి, శివరంజని, యమునా కళ్యాణి, ఆనందభైరవి ... ఒకటా, రెండా? ఏడు స్వరాలకే ఇన్నేసి రాగాలుంటే, రెండు దశాబ్దాల పై చిలుకు విద్యనేర్చిన కాలంలో ఎన్నేసి జ్ఞాపకాలు పొదిగి ఉంటాయో ఊహించండి! ఇవన్నీ మీతో ఒకేసారి కలబోసుకోవడం సాధ్యమా? అందుకే, చేదువి నా గుండెలోనే నిక్షిప్తం చేసుకుని, గుప్పెడు తీపి గుర్తులను మాత్రం మీతో పంచుకుంటాను.

రెండేళ్లు ఫ్రీ ఎడ్యుకేషన్ ఛాన్స్

కాకినాడ 'ఆదిత్య' పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నప్పుడు జరిగిన ఈ సంఘటన నన్నెంతగా బేజారెత్తించిందో చెబుతాను. ఆ సంవత్సరం డిసెంబర్ 31న మా స్కూల్లో జరిగిన 'సింగర్స్ ఆఫ్ ద ఇయర్' ప్రోగ్రాంలో పాల్గొన్నప్పుడు ఎవరో ఇచ్చిన ఉసిరికాయ తినేయడంతో గొంతు పట్టేసి, పలకడం మానేసింది. సరిగ్గా అదే వారంలో హైద్రాబాద్ వెళ్లి 'పాడుతా తీయగా' ఫైనల్స్‌లో పాల్గొనాల్సి ఉంది. ఇక చూడండి, ఎంత టెన్షనో! రకరకాల మందులు మింగితే కాని గొంతు మాట వినలేదు. అప్పట్లో ఏ పాటయినా సీరియస్‌గా ముఖం పెట్టి పాడేదాన్ని. ఒకసారి ప్రోగ్రాంలోనే బాలుగారు 'ఏంటమ్మాయ్, మైసూరుపాకు తింటూ ఆవకాయ తింటున్నట్టు మొహం పెడతావ్?' అన్నారు. అందులో సెకండ్ విన్నర్‌గా సెలక్ట్ కావడంతో స్కూల్ వాళ్లు టెన్త్ వరకూ ఫ్రీ ఎడ్యుకేషన్ ఛాన్స్ ఇచ్చేశారు. పాటతో సాధించిన తొలి విజయం అది.

పాటకు చిల్లర వేయబోయిన చేపలమ్మి!

కాకినాడ నుండి తాళ్లరేవు వెళ్లేదారిలో ఉండేది మా KIET ఇంజనీరింగ్ కాలేజీ. మొదట్లో ర్యాగింగ్ దెబ్బకు భయపడి కొన్నాళ్లపాటు ఆర్.టి.సి.బస్సులో వెళ్లాను. అయినా అక్కడా సీనియర్స్ కాపుకాసి మాతో పాటు బస్సెక్కేసి ర్యాగింగ్ మొదలెట్టేవారు. అమ్మాయి కనిపిస్తే చాలు పాడమని ఆర్డరేసేవారు. పాడ్డం రాని అమ్మాయిలకు మాత్రం నరకంగా ఉండేది. నేను ఏ పాట పాడమన్నా ఎంజాయ్ చేస్తూ పాడేదాన్ని. కాకపోతే బస్సు నిండా చేపల బుట్టలుండేవి. ఆ వాసన భరిస్తూ పాడటం కొద్దిగా ఇబ్బందే. ఒకరోజు (దాదాపు 20 కి.మీ. దూరం ఉన్న) కాలేజీ వరకు నాచేత ఏకధాటిగా పాడిస్తూనే ఉన్నారు. ఆ రోజు కొసమెరుపు ఏంటంటే నన్ను బస్సుల్లో పాటలుపాడి చిల్లర అడుక్కునే రకం అనుకున్న ఒక చేపలమ్మి చిల్లర డబ్బులతో నా దగ్గరకి రాబోవడం. ఆ దెబ్బతో ఆ తర్వాత ఆర్.టి.సి. బస్సెక్కుతే ఒట్టు. మర్రోజే కాలేజీ బస్సులోకి జంప్ .... ర్యాగింగ్ తప్పనప్పుడు ఏ బస్సయితే ఏమిటి చెప్పండి?

కాలేజీలో చేరిన వారానికి ఏదో పనుండి లైబ్రరీ వెళ్లి, అక్కడ కనిపించిన దృశ్యం చూసి నోరు తెరిచాను. నాతో పాటు చేరిన వాళ్లంతా బేల ముఖాలు వేసుకుని మా సీనియర్స్ రికార్డులను రాసిపెడుతున్నారు. ర్యాగింగులో భాగమట అది. వామ్మో, నన్నూ బుక్ చేస్తారేమో అని భయమేసి మెల్లగా జారుకుంటుంటే ఒక సీనియర్ పిలిచి ''మన కాలేజీ స్పెల్లింగ్ చెప్పు?'' అన్నాడు. కంగార్లో 'KITE' అనేశాను. 'ఆహాc ..అవునా? సరే, ఇంటికి వెళ్లి వెయ్యిసార్లు కాలేజీ పేరు (kakinada institute of engineering and technology) రాసుకుని రా'' అని హుకుం జారీ చేశాడు. చచ్చినట్టు రాత్రంతా జాగరణ చేసి రాసేసరికి వేళ్లు నెప్పెట్టి, ఏడుపొచ్చేసింది.

ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే కాలేజీ మేనేజ్‌మెంట్ ఇచ్చిన 'ప్రైజర్స్ డే' ఫంక్షన్‌లో కీరవాణిగారి 'నువ్వే నా శ్వాస' (ఒకరికొకరు) పాట పాడేసరికి అంతా నా అభిమానులైపోయారు. ''అయ్యో ఇంత బాగా పాడే అమ్మాయినా రాగింగ్ చేసాను'' అని పశ్చాత్తాప పడ్డాడట నాచేత 'కైట్' రాయించినబ్బాయి.

'మిస్టర్ వెటకారం'

థర్డ్ ఇయర్ మొదటి సెమిస్టర్‌లో ఉండగా మా లెక్చరర్ ఒకాయన మమ్మల్ని ఒక్కొక్కర్నీ నిల్చోబెట్టి ఫ్యూచర్ ప్లాన్స్ గురించి ఆరాతీస్తున్నాడు. ఆయన పేరు గుర్తులేదుగానీ, నిలువెల్లా వెటకారమని మాత్రం తెలుసు. ఒక్కొక్కరు తమకిష్టమైన రంగాన్ని చెప్పి, అందులో దున్నేస్తాం, పొడిచేస్తాం, చీరేస్తాం అని డబ్బా కొడుతున్నారు. నా వంతొచ్చి లేవబోతుంటే 'సర్లే, నువ్వు పాటలు పాడేసి బతికేస్తావ్ ...' అన్నాడు వెటకారంగా. తోటి విద్యార్థుల ముందు ఆ మాట అనగానే షాక్ అయ్యాను. దుఃఖం ఎగదన్నుకొచ్చేసింది. అలాగే బెంచీ కింద నేలపై కూర్చుండిపోయి వెక్కిళ్లుపెట్టి ఏడ్చేశాను. నా కన్నీటితో చేతి రుమాలంతా ముద్దముద్దయిపోయిందంటే నమ్ముతారా? కొసమెరుపు ఏంటంటే, తర్వాత మూడేళ్లకి అదే కాలేజీలో జరిగిన ఒక ఫంక్షన్‌కు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తే, ఆ మిస్టర్ వెటకారం ఫాకల్టీగా కనిపించడం!

చిత్ర, రావు బాలసరస్వతీ దేవి, శంకర్ మహదేవ్‌లతో...

విశాఖ 'గీతం కాలేజీ' ముచ్చట్లు

ఇంజనీరింగ్ తర్వాత ఎం.బి.ఏ. చేయడానికి వైజాగ్ 'గీతం'లో చేరాను. పాండురంగపురంలో అమ్మతో పాటు ఉండేదాన్ని. నాన్న జాబ్ రీత్యా (వైశ్యాబ్యాంక్ మేనేజర్) కాకినాడలోనే ఉండి వారం వారం వైజాగ్ వచ్చేవారు. టూ వీలర్‌పై బీచ్ రోడ్డులో రిషికొండ వరకూ రోజూ వెళ్లడం అదొక అద్భుతం. సముద్రం అంచున ట్రావెలింగ్ ఎంత గొప్ప అనుభూతిగా ఉంటుందో మీకు చెప్పక్కర్లేదు. ఒకసారి సెలవుల్లో కాకినాడ వెళ్లినప్పుడు తల వెంట్రుకలు బాగా చికాకు పెడుతుంటే అమ్మతో చెప్పి కొంత కట్ చేయించాను. ఆ తర్వాత కాలేజీకి వెళ్లినప్పుడు ఒకబ్బాయి నా దగ్గరకి గబగబా వచ్చేసి 'ఏంటండి? పొడవాటి జుత్తు కట్ చేసుకున్నారు?' అంటూ విచారంగా మోహం పెట్టి వాపోయేసరికి ఆశ్చర్యపోయి 'బాబోయ్, అబ్బాయిలు అమ్మాయిలను నఖశిఖపర్యంతం పరీక్షిస్తుంటారా? అని నోరెళ్లబెట్టాను. కాలేజీ చివరి రోజుల్లో ఒక హోటల్లో ఫేర్‌వెల్ ఇచ్చారు. అప్పుడు జరిగిన ఫన్‌గేమ్‌లో స్టూడెంట్స్ అంతా వాళ్లకు నచ్చిన వాళ్ల పేరుని చీటీపై రాయమంటే, అబ్బాయిల్లో ఎక్కువగా నా పేరుని మెన్షన్ చేయడంతో నాకు 'మోస్ట్ హాపెనింగ్ గర్ల్' అనే బిరుదు ప్రదానం చేసి, కరతాళధ్వనుల మధ్య నన్ను సన్మానించడం ఒక తీపి గుర్తు.

నా మాటకి చిరు గారు స్టేజీ ఎక్కేసారు

'గీతం'లో ఉండగానే 'మా టీవీ' సూపర్ సింగర్స్ 3లో పాల్గొనడానికి హైద్రాబాద్ వెళ్లాను. ఆ క్రమంలో ఒక రోజు 'చిరు' సినిమాల్లోని పాటల ఎపిసోడ్ ... బ్యాక్‌గ్రౌండ్‌లో చిరంజీవిగారి కట్ అవుట్స్ పెట్టారు. షో అయిపోయాక మెల్లగా కెమరామన్‌తో చెప్పి, పక్కనే ఉన్న చిరు 'ఇంద్రసేనారెడ్డి' హోర్డింగ్‌పై చెయ్యి వేసి ఫోటో దిగాను. చిరుగారంటే అంత అభిమానం నాకు. తర్వాత హైద్రాబాద్‌లో జరిగిన ఒక ఫంక్షన్‌లో స్టేజిపై ఈ విషయాన్ని చెప్పినప్పుడు ఆడియన్స్‌లో ఉన్న చిరంజీవిగారు వెంటనే స్టేజిపైకి వచ్చి 'హోర్డింగ్ మీద చెయ్యి వేసి దిగడమెందుకమ్మా? ఇప్పుడు నాపైనే వేసి దిగొచ్చు' అంటూ నాపక్కన నిల్చుని ఫోటోకి ఫోజివ్వడం ఒక తీపి అనుభవం.

గీతంలో ఎం.బి.ఏ. పూర్తయ్యాక కొన్ని ఉద్యోగాలు నా వెంట పడ్డాయి కానీ, వాటిని తప్పించుకుని నేను 'పాట' వెంట పడి హైద్రాబాద్ వచ్చేశాను. ఈ క్రమంలో గాయనిగా పలుమార్లు విదేశాలు చుట్టి కచేరీల్లో పాల్గొన్నాను కూడా. ఎందుకంటే 'పాట'లోని మత్తు మరింకెందులోనూ నాకు దొరకలేదండి!

anjana929@yahoo.co.in

– గొరుసు జగదీశ్వరరెడ్డి

ఆ దెబ్బతో పరార్...

స్కూల్ ఫైనల్లోనో, అంతకుముందు సంవత్సరమోగానీ – ఒకబ్బాయి రోజూ నన్ను ఫాలో అవుతూ ఉండేవాడు. స్కూల్ బస్ బయల్దేరగానే సైకిల్ ఎక్కేసి, బస్‌కంటే ముందు నేను దిగాల్సిన స్టేజ్ దగ్గర కాపు కాసేవాడు. తర్వాత నేను ఇంటికి చేరేవరకూ బాడీగార్డులా సైకిల్ నడిపిస్తూ వెంట వచ్చేవాడు. రోజూ ఇదే తంతు. పోనీ నన్నేమన్నా కామెంట్ చేస్తాడా అంటే అదీ లేదు. మూగగా వెంటపడటం. ఈ టార్చర్ తట్టుకోలేక స్కూల్ అవగానే మాథ్స్ చెప్పించుకోడానికి ప్రైవేట్‌లో చేరిపోయా. రెండు మూడ్రోజులు నాకోసం వెతికి, చివరికి నా ఆచూకీ తెలుసుకుని తనూ వచ్చి నాతో పాటు ట్యూషన్‌లో చేరిపోయాడు. వీడ్ని ఎలా తప్పించుకోవాల్రా దేవుడా? అని ఆలోచించి, ఒక రోజు వాడు లేచి వెళ్లబోతుంటే పక్కనే ఉన్న స్కేల్ చూపించి ''అన్నయ్యా, నీవు స్కేల్ మర్చిపోయావ్'' అని అరిచాను. అంతే ఆ తర్వాత నా దరిదాపుల్లోకి వస్తే ఒట్టు. పైగా ట్యూషన్ మానేశాడు.

రేగుపళ్ల ప్రహసనం

చదువుకునే రోజుల్లో పుస్తకాల బ్యాగులో విధిగా రేగుపళ్లు ఉండేవి. ఒకసారి ప్రైవేట్‌లో రాంబాబు మాస్టారు ప్రహరీ గోడకు కుర్చీ వేసుకుని మాకు మాథ్స్ చెబుతున్నారు. నేను తిన్న రేగుపళ్ల గింజల్ని మాస్టారు చూడకుండా లాఘవంగా ప్రహరీ గోడ అవతలికి విసిరేదాన్ని. ఒకరోజు గురి తప్పి సరిగ్గా నా ఎంగిలి గింజ ఆయన ఒళ్లో ఠపీమని పడింది. ఆయన దండకం మొదలెట్టకముందే లేచి నిల్చుని తప్పు ఒప్పేసుకున్నాననుకోండి.

అయితే ఇంటర్లోకి వచ్చాక కూడా రేగుపళ్లని వదిలేదాన్ని కాదు. నేను, లావణ్య, మంజు ముగ్గురం ఒకే బెంచీలో వరసగా కూర్చునేవాళ్లం. సరిగ్గా సంస్కృతం పీరియడ్‌లో నిద్ర ముంచుకొచ్చేది. నిద్రను తప్పించుకోడానికి రేగు వడియాలు చప్పరించేవాళ్లం. (రేగుపళ్లు సీజనల్ ఫ్రూట్ కదా. అంచేత పళ్లు దొరకనప్పుడు వడియాలపై పడేవాళ్లం) ఒక క్యారీబ్యాగ్‌ని మా బెంచ్ అడుగున మేకుకి తగిలించి అందులో ఎంగిలి గింజల్ని వేసేవాళ్లం. ఒకరోజు సంస్కృతం క్లాసు చెబుతున్న మేడమ్ ఎవరిపైనో అరుస్తూ సడన్‌గా నావైపు తిరిగి ''చూడండి, క్లాసులో బుద్ధిగా ఎలా మెసలాలో సౌమ్యను చూసి నేర్చుకోండి'' అంది. అప్పటికే నా బుగ్గనిండా రేగు వడియం. పెదాలు విప్పకుండానే నవ్వు మొహం పెట్టి 'హీహీ' అన్నాను. వెంటనే ''నోరు విప్పి కూడా నవ్వదు, అంత సంస్కారం ఉండాలి'' అంది ఆవిడ. వెంటనే నా పక్కనున్న లావణ్య ''నీ మొహం దాని బుగ్గనిండా రేగు వడియం ఉంది .... అందుకే ఆ యాక్షన్'' అంది. ఆ మాటలు ఆవిడ చెవిదాకా వెళ్లకపోవడంతో పరువు నిలబడిందనుకోండి.

గుర్తు పట్టండి

1

2

3

4

5

ఇక్కడున్న మహిళలంతా సామాజిక ఉద్యమకారులు. వీరిని గుర్తుపట్టగలరా?

శబ్దాలు ఎందుకు నచ్చవు?

మీకు తెలుసా?

మంచి పాట, మంచి సంగీతం వస్తే వినసొంపుగా ఉంటుంది. అదే గంభీరమైన శబ్దాలు, ఢాం ఢాం లాంటి మొరటు శబ్దాలైతే..అసలు విన లేము. ఇలా ఎందుకు జరుగుతుందని పరిశోధన చేపట్టారు వెల్‌కం ట్రస్టు ఫర్ న్యూరోఇమేజింగ్, న్యూకాసిల్ యూనివర్సిటీవారు. డాక్టర్ సుక్‌బినేర్ కుమన్ నేతృత్వంలో పరిశోధన మొదలైంది. 13 మందిని ఎంపిక చేసుకుని, రోజూ మనం వినే 74 రకాల శబ్దాలను వారికి వినిపించారు. ఫలితాలు కచ్చితంగా ఉండాలి కదా! అందుకని శబ్దాలను శ్రోతలు వింటున్నపుడు వారిలో కనిపించే హావభావాలను కాక, వారి మెదళ్లు ఎలా స్పందిస్తాయో ఎంఆర్ఐ స్కానర్ ద్వారా రికార్డు చేసారు. 2 వేల నుంచి 5 వేల హెచ్‌జడ్ ఫ్రీక్వెన్సీ గల శబ్దాలు మెదడులోని అమిగ్దాల కణాలను క్రియాశీలం చేస్తాయని, దానితో భావోద్రేకాలు రేకెత్తి, ఆయా శబ్దాలకు విముఖత చూపుతామని (అంటే అవి వినడానికి మనం ఇష్టపడమని)తెలుసుకున్నారు. ఒక ఐదు రకాల శబ్దాలను విన్నపుడు వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయని, వాటిలో కనీసం రెండు శబ్దాలను రోజూ వినాల్సి వస్తుందని వారు తెలిపారు. మంచి పాట,సంగీతం విన్నపుడు అలా జరగదు కాబట్టే అవి మనకు వినసొంపుగా ఉంటాయన్న మాట.

పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో 'అవ'తో ఆరంభమయ్యే పదాలను వ్రాయండి.

1. వీలు — అవ
2. భంగపాటు — అవ
3. అడ్డంకి — అవ
4. ఆవశ్యకత — అవ
5. బయట — అవ
6. బుద్ధికుశలతలో ఓ ప్రక్రియ — అవ
7. తెలుసుకోవడం — అవ
8. సలక్షణం కాదు — అవ
9. చిన్నబుచ్చడం — అవ
10. అర్థం చేసుకోవడం — అవ

నిర్వహణ : చేబియ్యం రామారావు

చెప్పండి చూద్దాం

1. ఇస్రో పూర్తి పేరేమిటి?
2. ఇటీవల శ్రీలంకలో జరిగిన ట్వంటీ-20 మహిళల ప్రపంచకప్ విజేత ఎవరు?
3. ఈ ఏడాది వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి గెల్చుకున్నదెవరు?
4. అర్థశాస్త్రంలో నోబెల్ ఎవరికొచ్చింది?
5. ఈ మధ్య మరణించిన కంబోడియా మాజీ రాజు ఎవరు?

రంగులు వేయండి

నా బొమ్మ

డి. శివాని, 9వ తరగతి, భవిత కలర్స్ ఫ్లో, దత్తాత్రేయ కాలనీ, ఎల్లమ్మబండ, కూకట్‌పల్లి, హైదరాబాద్.

దారి కనుక్కోండి

జవాబులు

పదవిన్యాసం
1. అవలీలగా 2. అవభంగపాటు 3. అవరోధం 4. అవసరత 5. అవతల 6. అవధానం 7. అవగాహన 8. అవలక్షణం 9. అవహేళన 10. అవగాహన

రంగులేయండి
1. ఆకుపచ్చ రంగు, 2. పసుపు రంగు, 3. ఎరుపు రంగు, 4. ఆరెంజ్ రంగు, 5. తెలుపు రంగు

చెప్పండి చూద్దాం
1. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, 2. ఆస్ట్రేలియా, 3. జపాన్ శాస్త్రవేత్తలు షిన్యా యమనాక-జాన్ గుర్డాన్ కలసి పంచుకున్నారు, 4. ఆల్విన్ రోత్, లాయిడ్ షాప్లీ పంచుకున్నారు, 5. నరోడమ్ శివరాజ్

బుజ్జి సంగీతకారుడు

సరదాగా...

జోస్ బొలీవియా దేశపు కుర్రవాడు. పూర్తి పేరు జోస్ ఆండ్రె మొంటానో బైనా. వయసు ఏడేళ్లే కాని అపర సంగీతవేత్తగా పేరు తెచ్చుకున్నాడు. లెజిస్లేటివ్ ప్యాలస్‌లో ప్రదర్శన కూడా ఇచ్చాడు, అదీ రాక్ వీరుడు గ్లెన్ వర్గాస్ లాంటి ప్రసిద్ధుల పక్కన. అదేం పెద్ద గొప్ప అంటారా? పెద్ద గొప్పే..ఎందుకంటే ఆ కుర్రాడు అంధుడు..అయినా, అంత పేరు తెచ్చుకున్నాడు. అంతే కాదు. నాలుగేళ్ల వయసులోనే డ్రమ్స్ వాయించాడు. మామూలుగా ఆ కుర్రాడికి మూడింతల వయసున్న వాళ్లే అలా డ్రమ్స్ వాయించగలరు. పియానో వాయించడంలో దిట్ట అనిపించుకున్నాడు. ఐదేళ్ల కల్లా జాజ్ సంగీతంలో కూడా మాస్టర్ అయ్యాడు. టాంగో, బొలెరో, బ్లూస్.. అన్నీ విన్నాడు. అయినా, 'ఇంత సాధించానే' అని బుల్లి సూపర్‌స్టార్ ఎకసెక్కాలకు పోలా. రోజూ లేచి రెడీ అయ్యి స్కూలుకు వెళుతున్నాడు. క్లాసులో పాఠాలు శ్రద్ధగా వింటున్నాడు. ఇచ్చిన హోంవర్కు తంచనుగా చేసుకుపోతున్నాడు. జోస్ తండ్రి మాత్రం ఉబ్బి తబ్బిబ్బవుతున్నాడు.'' నా కొడుకుకు రాని సంగీతం లేదు. అతడి మార్గం అనితర సాధ్యం'' అంటున్నాడు. తన కొడుకు మెదడులో మ్యూజిక్ చిప్‌తో పుట్టినట్లు నమ్ముతున్నాడు. చాలా మంది అది నిజమే అంటున్నారు.

మరో లోకంలోకి..వందేళ్లలో?

తెలుసా?

అతి వేగంతో ప్రయాణించగల ఒక రాకెట్ భూమికి అతి సమీపంలోని నక్షత్రం చేరడానికి ఎన్నేళ్లు పడుతుందో తెలుసా! కనీసం లక్ష సంవత్సరాలు. కానీ '100 ఇయర్స్ స్టార్‌షిప్ ఇనిషియేటివ్' అనే ప్రాజెక్టును చేపట్టిన సైంటిస్టుల లెక్క వేరే ఉంది- వంద సంవత్సరాల్లో లేదా రెండొందల సంవత్సరాల్లో.. మన సౌరకుటుంబం ఆవలి నక్షత్రానికి మనుషులను తీసుకుపోవాలనేది వారి లెక్క. అందుకు అవసరమైన రోదసీనౌక , అందులో ఎంతమందిని పంపాలి, వారికి ఆహారం ఎలా..తదితరాల గురించి మల్లగుల్లాలు పడుతున్నారు. వారికి గ్రాండ్ విషెస్ చెబుదామా బుడతలూ.

ఆస్పత్రులు ఎప్పుడూ జబ్బులతో మూలుగుతున్నట్లు ఎందుకు ఉండాలి? వార్డులన్నీ దిగులు ముఖాలేసుకుని నీరసించినట్లు ఎందుకు కనిపించాలి? ఎమర్జెన్సీ వార్డులన్నీ మృత్యు భయంతో ఎందుకు వణుకుతుండాలి? ఆడుతూ పాడుతూ హాయిగా వైద్యం చేయించుకుంటే ఎంత బావుండు అనుకుంటాం మనం. ఆ పని చేసేందుకే ఇప్పుడు ఆస్పత్రుల్లో వాలిపోయారు వైద్యవిదూషకులు (డాక్టర్ క్లౌన్స్). వీళ్లు సాధారణ డాక్టర్ల మాదిరి సూదులు వెయ్యరు. మందుబిళ్లలు మింగించరు. ఆపరేషన్లు చేయరు. ఆస్పత్రిలో రోగి చుట్టూ అలుముకున్న దిగులును చిటికెలో మటుమాయం చేసి.. సందడి సందడి చేసేస్తారు. పీకుపోయిన ముఖాల్లో నవ్వులు పూయిస్తారు. మూగబోయిన మనసులలో కొత్త రాగాలు పలికిస్తారు. నవ్విస్తూ నయం చేసే ఈ క్లౌన్స్.. విదేశాల్లో వైద్య చికిత్స స్వరూపాన్నే మార్చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే మన దేశంలోకీ అడుగుపెట్టారు. ఈ ట్రెండ్‌ను విశ్లేషిస్తూ మీ ముందుకు వచ్చింది ఈ వారం కవర్‌స్టోరీ.

నవ్వితే సంతానం!

ఇజ్రాయిల్‌లోని 'విట్రో ఫెర్టిలైజేషన్ క్లినిక్'లో ఒక రోజు డాక్టర్లు గట్టిగా అరిచారు. 'ఏమైంది.. ఏమైంది' అంటూ తోటి డాక్టర్లు వాళ్ల చుట్టూ మూగారు. 'ఇది అద్భుతం. కొత్త విషయాన్ని కనుక్కున్నాం'' అన్నారు ల్యాబ్‌లోని డాక్టర్లు. వారు కనుక్కున్నది 'క్లౌన్ థెరపీతో సంతాన సాఫల్యం..'. సంతాన చికిత్స కోసం వచ్చిన కొంతమంది మహిళలకు గర్భం రావడానికి ఐవిఎఫ్ చేశారు. అలా చికిత్స తీసుకుంటున్న కొంతమందికి క్లౌన్ థెరపీ చేశారు డాక్టర్లు. అంటే, వైద్య విదూషకులు రోజూ ఆ మహిళల దగ్గరికి వచ్చి.. కాసేపు అల్లరిచేసి, నవ్వులు పూయించి వెళతారన్న మాట. కొన్ని నెలలపాటు చికిత్స కొనసాగింది. ఆశ్చర్యం ఏంటంటే.. క్లౌన్‌థెరపీ తీసుకున్న మహిళల్లో ఊహించని ఫలితాలు వచ్చాయి. వాళ్లందరూ తల్లులు అయ్యారు. ఐవిఎఫ్ చేసినా.. క్లౌన్ థెరపీ ఇవ్వని మహిళల్లో సంతాన సాఫల్యం తక్కువగా నమోదైంది. ''కొన్నేళ్లు ప్రయత్నించినా పిల్లలు కలగని మహిళలు ఐవిఎఫ్ చేయించుకుంటారు. అసలే పిల్లలు లేరన్న బాధతో ఉంటారు వాళ్లు. ఖరీదైన ఈ ప్రక్రియతో అయినా సంతానయోగ్యం కలుగుతుందో లేదోనన్న ఆందోళన వాళ్లలో ఉంటుంది. ఇలాంటి మానసిక పరిస్థితులు వైద్యచికిత్సకు అడ్డంకిగా మారతాయి. ఇక్కడే క్లౌన్ థెరపీ క్రియాశీలకపాత్ర పోషించింది'' అని వైద్యులు ప్రకటించారు. ఈ అరుదైన పరిశోధనను 'ఫెర్టిలిటీ అండ్ స్టెరిలిటీ' అనే మెడికల్ జర్నల్ ప్రచురించింది.

అమ్మ నవ్వింది

''మా అమ్మకు వైద్య పరీక్షల్లో క్యాన్సర్ అని తేలింది. ఒక్కసారిగా కుప్పకూలిపోయినంత పనైంది. క్యాన్సర్ వచ్చిందన్న షాక్‌ను ఆమె మనసులో నుంచి తుడిపేసేందుకు రకరకాలుగా ఆలోచించాను. అప్పుడే మిత్రులెవరో చెబితే క్లౌన్ థెరపీ గురించి విన్నాను. వెంటనే అమ్మకు విషయం చెప్పాను. అయిష్టంగానే నాతో వచ్చింది. థెరపీలో ఉన్నంతసేపైనా ఆవిడ కళ్లలో సంతోషాన్ని చూశాక నా కడుపు నిండిపోయింది. వైద్యచికిత్స పరంగా ఆ సంతోషం ఎంతో ఉపయోగపడుతుందని వైద్యులు చెప్పారు..'' అని తన అనుభవాన్ని చెప్పుకొచ్చింది తపస్య దాస్‌గుప్తా.

ఎయిర్‌పోర్ట్‌లో క్లౌన్స్

''ప్రయాణికులకు ఓ గమనిక. బెంగుళూరు నుంచి దుబాయ్ వెళ్లే బోయింగ్ విమానం కాస్త ఆలస్యంగా వస్తుంది. దయచేసి గమనించగలరు. ధన్యవాదములు..'' బెంగుళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అప్పటికి నాలుగుసార్లు ఆ అనౌన్స్‌మెంట్ వచ్చింది. ప్రయాణికులు విసుగెత్తిపోయారు. ఇక కాసేపట్లో దాడి చేసినా చేస్తారు. వాళ్లలో అంత అసహనం ఏర్పడింది. ఎయిర్‌పోర్టు సిబ్బంది సర్ది చెప్పే పరిస్థితి ఎప్పుడో చేతులు దాటిపోయింది. టెన్షన్‌లో ఉన్న అధికారులకు ఎవరో ఐడియా ఇచ్చారు. అంతే, వెంటనే అక్కడికి క్లౌన్స్‌ను తీసుకొచ్చారు సిబ్బంది. అలసటగా ఉన్న ప్రయాణికులు మెల్లగా వాళ్ల వైపు తలతిప్పి చూశారు. క్షణాల్లో బదలిక పోయి.. కుతూహలం ఏర్పడింది ప్రయాణికులకు. క్లౌన్స్ చేసిన వినోదానికి.. విమానం సంగతే మరిచిపోయారందరూ!

వైద్య విదూషకులు

ఆస్పత్రిలో చేరిన పిల్లవాడికి హాస్య చికిత్స చేస్తున్న వైద్య విదూషకులు

కాలిన గాయాలతో అల్లాడిపోతున్నాడు ఒక పిల్లవాడు. వైద్యులు, నర్సులు ఒంటిని చల్లబరిచేందుకు మందులు రాస్తున్నారు. నొప్పి తగ్గడానికి మందుబిళ్లల్ని మింగిస్తున్నారు. బాధని మరిపించేందుకు అంగట్లో బొమ్మల్ని కూడా కొనుక్కొచ్చారు ఆస్పత్రి సిబ్బంది. ఊహూ! ఫలితం లేదు. బెడ్డు మీద బిడ్డ ఎగిరెగిరి పడుతూనే ఉన్నాడు. ఏం చేయాలి? డాక్టర్లకు దిక్కు తోచడం లేదు. కేసు ఒక సవాలై కూర్చుంది. రకరకాల చర్చలు జరిగాయి. ఆఖరికి డాక్టర్లంతా కలిసి ఒక 'చమత్కారమైన' నిర్ణయాన్ని తీసుకున్నారు.

ఏం మాయ చేశారో ఏమో – మర్నాడు పిల్లవాడి అరుపులు వినిపించడం లేదు. ఒళ్లంతా పచ్చిపుండైనా లేచి ఆడుకుంటున్నాడు. మందులు, వైద్యులు నయం చేయలేని ఆ బాధను ఎవరు పోగొట్టినట్లు? అదేదో దివ్యమైన వైద్యం అయ్యుండాలి..!

ఇదివరకటిలా తెల్లకోటు, మెడలో స్టెతస్కోపు, చేతుల్లో సూదులు పట్టుకుని కనిపించే డాక్టర్లు లేరక్కడ. ఈసారి జోకరు వేషగాళ్లొచ్చారు. రంగురంగుల బెలూన్లు పట్టుకుని, జుట్టుటోపీ పెట్టుకుని, వొదులుదులు దుస్తులు తొడుక్కుని, ముక్కుకు ఎర్రటి బంతిని తగిలించుకుని.. చూస్తూనే నవ్వొచ్చే ఆకారంలో ఉన్నారంతా. చిత్రమైన వేషధారణకు తోడు వింతచేష్టలు చేస్తుంటే.. ఎవరికైనా నవ్వురాక మానదు. కాలిన గాయాల పిల్లవాడే కాదు, పక్కబెడ్లలోని రోగుల పెదవుల పైనా చిన్న దరహాసం. కొంతసేపటికి జబ్బు పదిలిన ఫీలింగ్. ఇంకొంచెం సేపటికి ఆస్పత్రిలో ఉన్నామన్న సంగతినే మరిచిపోయారు. జ్వరంతో మూలిగే వారు లేచి చప్పట్లు కొట్టారు. నీరసంతో లేవలేని వాళ్లు మెల్లగా లేచి నిల్చున్నారు. ఆ దృశ్యం రోగులకు తోడుగా వచ్చిన వాళ్లకే కాదు.. డాక్టర్లకూ అపురూపంగా కనిపించింది. ఇన్నాళ్లూ ఏదో పోగొట్టుకున్నట్లు బేలగా ఉండే ఆస్పత్రి.. ఉన్నట్లుండి ఆటస్థలంగా మారడం అద్భుతం కాదా మరి.

మనసుకు మందు..

చూసేందుకే వీళ్లు జోకర్లు. వృత్తిరీత్యా వీళ్లను క్లౌన్ డాక్టర్లు, క్లౌన్ థెరపిస్టులు అంటారు. వీళ్లు చేసే వైద్యం క్లౌన్‌థెరపీ. నవ్విస్తూ నయం చేసే వైద్య విదూషకులన్న మాట! సాధారణ డాక్టర్లు ఒంటికి వైద్యం చేస్తే, వీళ్లు మనసుకు మందు ఇస్తారు. క్లౌన్ డాక్టర్లు వైద్యశాస్త్రం చదవక్కర్లేదు. ఎదుటి వాళ్లను నవ్వించగలిగితే చాలు. బాధాతప్త హృదయాల్ని తడిమి.. వాళ్ల పెదాల మీద చిరునవ్వుల్ని మెరిపించ గలిగితే డాక్టర్ క్లౌన్స్‌గా పట్టాపుచ్చుకున్నట్టే. ఇదొక బతుకుతెరువు ఉద్యోగమైనా, ఎక్కువమంది సేవాదృక్పథంతోనే ఇందులోకి వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఒక్కో క్లౌన్‌కు ఏడాదికి రూ.15 లక్షల ఆదాయం వస్తోంది. భారత్‌లో అత్యున్నతస్థాయి క్లౌన్స్‌కు రూ.5 లక్షలు వస్తున్నది.

ఆస్ట్రేలియా, అమెరికా, యూరప్‌లోని ఆస్పత్రుల్లో ఈ క్లౌన్స్ చేస్తున్న అద్భుతాలు అన్నీఇన్నీ కావు. శాస్త్రీయంగా విస్తుగొలిపే ఫలితాలను తీసుకొస్తున్నారని వైద్యులే ఒప్పుకుంటున్నారు. మన దేశంలో క్లౌన్ థెరపీ పట్ల ఇప్పుడిప్పుడే ఆసక్తిని చూపిస్తున్నాయి కార్పొరేట్ ఆస్పత్రులు. ఢిల్లీ, ముంబయి, చెన్నయి, బెంగుళూరులలో క్లౌన్ సంస్థలు వెలిశాయి. అయితే భారతీయ వైద్య విదూషకులు కేవలం ఆస్పత్రులకే పరిమితం కావడం లేదు. మురికివాడలు, బస్తీలు, గ్రామీణ పాఠశాలలు, జైళ్లు, వలస కార్మికుల నివాసాలు, కాందిశీకుల శిబిరాలను ఎంచుకుని.. థెరపీని విస్తరించారు. ''ధనికులు,పేదల మధ్య దూరం పెరిగింది. పేదల పిల్లలు అభివృద్ధి ఫలాలను అందుకోలేక పోతున్నారు. కాయకష్టం చేసే తల్లిదండ్రులు పిల్లల ఆలనాపాలన చూసుకోలేకపోతున్నారు. దాంతో వాళ్లలో దిగులు, ఒంటరితనం, న్యూనతాభావాలు పెరిగిపోతున్నాయి. వీటిని కాస్తయినా తొలగించే ప్రయత్నం చేసేందుకే వర్క్‌షాప్‌లు పెడుతున్నాం'' అంటున్నారు ఇండియన్ క్లౌన్స్.

సర్కస్‌తో స్ఫూర్తి..

హాస్యానికి హీలింగ్‌పవర్ ఉందని ఎన్నో పరిశోధనల్లో రుజువవుతూనే ఉంది. తాము నవ్వుతూ పదిమందిని నవ్వించే హాస్యచతురత ఉన్న వాళ్లు ఒత్తిడిని దూరం చేయగలుగుతారు. నవ్వడం వల్ల శరీరంలో కొన్ని రసాయనిక మార్పులు జరుగుతాయి. ఫలితంగా తెల్లరక్త కణాల (టి సెల్స్) సంఖ్య పెరుగుతుంది. తద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ ప్రక్రియ హాస్యంతోనే సాధ్యం అవుతుందని న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ మైఖెల్ క్రిస్టెన్‌సన్ చెప్పారు. అందుకే ఆయన రోగులకు బట్టి మందులిస్తే సరిపోదని భావించారు. వాటితోపాటు హాస్య ఔషధం ఇస్తే చక్కటి ఫలితాలు వస్తాయని భావించి 'బిగ్ ఆపిల్ సర్కస్ క్లౌన్ కేర్ యూనిట్' అనే విభాగాన్ని నెలకొల్పాడు. ఆయన చేసిన ఆ ప్రయత్నమే 'క్లౌన్ థెరపీ'కి దారి తీసింది. ఈ ఆలోచన సర్కస్ ఆడించే వాళ్ల నుంచి వచ్చిందట. సర్కస్‌లలో హాస్యగాళ్లే కాక, గారడీ విద్యలు ప్రదర్శించే వాళ్లు, ఇంద్రజాలికులు కూడా వినోదాన్ని పండిస్తుంటారు. పుట్టినరోజు వేడుకల్లో, వీధి ప్రదర్శనల్లో, పార్టీల్లో సందడి చేయడం చూస్తున్నాం. విదూషకుల వేషం, హావభావాలు పిల్లల్ని భయపెట్టి ఆకర్షిస్తాయి. పెద్దల్ని నవ్విస్తాయి. బోల్తంత కాలక్షేపం దొరుకుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రులకు కూడా వైద్య విదూషకుల్ని రప్పిస్తే.. పేషెంట్ల బాధని మరిపించవచ్చని తలిచారు వైద్యులు. ''చాలామందికి దవాఖానాల్ని చూస్తూనే భయం. పరీక్షలకు, ఆపరేషన్లకు భయపడతారు. ఇంట్లో ఎగిరిగంతులేసే పిల్లలైతే బెడ్డు మీద పడిన వెంటనే కుంగిపోతారు. మానసిక రోగగ్రస్తుల పరిస్థితి మరింత క్షీణిస్తుంది. ఇవన్నీ వ్యక్తుల మానసికధోరణి మీద ఆధారపడిన అంశాలు. అన్ని జబ్బులూ మందులతో నయం కావు. మనసు నిశ్చింతగా ఉన్నప్పుడే మందులు కూడా ఒంటికి పడతాయి. ఇక్కడే మా అవసరం ఉంటుంది. రోగుల బోర్‌డమ్‌ను బ్రేక్ చేసి.. వారిని ఉల్లాసపరిచేందుకు మేము రకరకాల విద్యలు ప్రదర్శిస్తుంటాం...'' అని చెప్పారు ఇండియన్ క్లౌన్ థెరపిస్ట్ అశ్వత్‌భట్. ఒకప్పుడు నాటకకర్త అయిన భట్ ఇప్పుడు క్లౌన్ థెరపిస్టు. ఢిల్లీలో 'థియేటర్ గారేజ్ ప్రాజెక్ట్' అనే సంస్థను ఏర్పాటు చేసి.. ఉత్తరాఖండ్ పర్వతాల్లో నివసించే పిల్లలకు క్లౌన్ థెరపీ ఇస్తున్నాడాయన.

మై 'మలపిస్తారు..'

విషాదం అలుముకున్న చోట హాస్యాన్ని నింపడం ఒక పెద్ద సవాలు. క్లౌన్ థెరపిస్టులు సకల హాస్య విద్యల్లో ఆరితేరిన వారై ఉండాలి. అందుకే, ఆ నైపుణ్యాలన్నీ నేర్చిస్తున్నాయి శిక్షణ సంస్థలు. ''మొదట్లో క్లౌన్స్ అంటే ఒట్టి జోకర్‌గాళ్లు మాత్రమే. ఇప్పుడు ఆ వేషాన్ని చూసి నవ్వే రోగులు లేరు. మారుతున్న కాలం కొద్దీ వేషాలు మారొస్తేనే నవ్వుతారు. మార్కెట్‌లోకి వచ్చే కొత్త కొత్త టాయ్స్‌ని కొంటుంటాం. వాటి ద్వారా గిలిగింతలు పెట్టే చిన్న కథలని చెబుతాం. ప్రపంచంలోని హాస్య కథల్ని, హాస్యోక్తుల్ని అధ్యయనం చేస్తేనే ఇది సాధ్యం అవుతుంది. రోగాన్ని బట్టి మందు డోసు ఇచ్చినట్లు రోగి మనస్తత్వాన్ని బట్టి మేము యాక్ట్ చేస్తుంటాం. మేము ఎంత శ్రమించినా కొందరు వ్యాధిగ్రస్తులు స్పందించరు. వాళ్ల మనసు నిండా జబ్బు పట్టుకుందన్న బాధే ఉంటుంది. ఇలాంటి క్రిటికల్ పేషెంట్లను సంతోషపెట్టడానికి క్లౌన్స్ అందరం కలిసి టెలిఫోన్, వీడియో కాన్ఫరెన్సుల్ని పెట్టుకుంటాం. అడ్వాన్స్‌డ్ హ్యూమర్ టెక్నిక్స్‌తో.. ఎలాగైతేనేం నవ్విస్తాం..'' అంటారు సర్టిఫైడ్ క్లౌన్ థెరపిస్టు మార్టిన్ డిసౌజా. ఇతను 'క్లౌన్స్ ఆఫ్ అమెరికన్ ఇంటర్నేషనల్', 'వరల్డ్ క్లౌన్ అసోసియేషన్'లో ముఖ్య సభ్యుడు. ప్రపంచదేశాలన్నీ పర్యటిస్తూ రోగుల్ని మాయ చేస్తుంటాడు.

థెరపిస్టులందరూ ఒకే పద్ధతుల్ని ఎంచుకోరు. దేశ ప్రజల జీవనశైలి, అనుసరించే సంస్కృతిని బట్టి హాస్యరసాన్ని వండుతారు. భారత్‌లో జానపద కథలు, పురాణాలతోపాటు ఆధునిక తరహా జీవనశైలిని ప్రతిబింబించే ఇతివృత్తాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎక్కువమంది క్లౌన్స్‌కు.. మ్యూజిక్, మ్యాజిక్, స్టోరీటెల్లింగ్, జోకింగ్, డ్యాన్సింగ్, టాయ్స్, మూవీ స్క్రిప్టింగ్ (వక్రాలబండి) హాస్య సాధనాలు.

క్లౌన్స్‌కు ఒక్కోసారి భాషా సమస్య వస్తుంది. అప్పుడు ప్రత్యేక అనువాదకులు సాయపడతారు. ఇజ్రాయిల్‌లో విస్తృత ప్రాచుర్యం పొందిన కొందరు క్లౌన్స్ ప్రస్తుతం 70 దేశాల్ని నవ్విస్తున్నారు. అమెరికాలో 'క్లౌన్స్ విత్‌ఔట్ బార్డర్స్', 'హ్యూమానిటేరియన్ క్లౌన్స్ అబ్రాడ్', 'మెడికల్ క్లౌన్ ప్రాజెక్ట్' అనే సంస్థలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఫ్రాన్స్‌లోని 'డాక్టర్ క్లౌన్స్' ఇండియాలో 'డాక్టర్ క్లౌన్స్ ఇండియా' అనే పేరుతో సేవలు మొదలుపెట్టింది.

సలామ్ బాలక్ ట్రస్ట్‌లో పిల్లల్ని అలరిస్తున్న క్లౌన్

క్లౌన్స్ ఆగయా..

తమిళనాడులోని వెల్లూరుకు చెందిన ప్రఖ్యాత క్రిస్టియన్ మెడికల్ కాలేజి (సిఎంసి) వైద్యచికిత్సలో క్లౌన్ థెరపీ సాయాన్ని తీసుకోవాలనుకుంది. వెంటనే 'హ్యూమానిటేరియన్ క్లౌన్స్'కు చెందిన విదూషకుల్ని రప్పించింది. ఆ సంస్థ తరఫున ఆస్ట్రేలియా, స్పెయిన్, ఇంగ్లండ్, స్వీడన్‌కు చెందిన 15 మంది ఆస్పత్రికి వచ్చారు. వాళ్ల రాకతో స్తబ్దుగా ఉన్న పీడియాట్రిక్ వార్డులో ఒక్కసారి సందడి మొదలైంది. ''పిల్లలు డాక్టర్లని చూస్తూనే సూదులు వేస్తారేమోనని బెంగ పెట్టుకుంటారు. మందులు వేసుకోవడం కూడా వాళ్లకు ఇష్టం ఉండదు. అందువల్ల ఆ బెంగను, అయిష్టాన్ని పోగొట్టేందుకు ఏదో ఒక సర్‌ప్రైజ్ ఇవ్వాలి. ఆ పని చేయడానికే క్లౌన్స్‌ను తీసుకొచ్చాం. క్షణాల్లోనే ఆస్పత్రిని ఆహ్లాదంగా మార్చేశారు వారు. పిల్లలు త్వరగా కోలుకునేందుకు ఈ వాతావరణం ఎంతగానో తోడ్పడుతుంది..'' అని చెప్పారు సిఎంసి వైద్యులు.

బెంగుళూరులోని 'రామయ్య మెమొరియల్ హాస్పిటల్'లో కూడా ఇదే ప్రయోగం చేశారు. స్కూల్ టీచర్ డిఎస్ మధుసూదన్, అనిత దంపతులు తమ కొడుక్కి సర్జరీ చేయించేందుకు అప్పుడే ఆస్పత్రికి వచ్చారు. ఆపరేషన్ థియేటర్ బయట దిగులు ముఖాలేసుకుని కూర్చున్నారు. అంతలోనే క్లౌన్స్ అక్కడికి రావడంతో వాళ్ల మనసు తేలికైంది. ''మా ముఖాల్ని చూసి మా కొడుకు దిగులతో ఉన్నాడు. ఆపరేషన్ థియేటర్‌లోకి ధైర్యంగా వెళితేనే బాబు ఆరోగ్యానికి మంచిది. మీరే అలా డీలా పడిపోతే అబ్బాయి ఇంకా దిగజారిపోతాడు.. అని డాక్టర్లు చెప్పారు. ఆ సమయంలో ఎవరైనా మాతో మాట్లాడితే ఓదార్పు దొరుకుతుందనుకున్నాం. సరిగా అప్పుడే ఈ క్లౌన్స్ వచ్చారు. మా బాధని అర్థం చేసుకున్.. మా పిల్లాడిని నవ్వించారు. ఆ టైమ్‌లో వాడు నవ్వడం మేమిప్పటికీ మరిచిపోలేం..'' అన్నారు ఆ తల్లిదండ్రులు. బాధ కలిగినప్పుడు శరీరం బిగుతుగా మారిపోతుంది. హృదయస్పందనలు పెరిగిపోతాయి. అదే సంతోషంలో ఉంటే.. మనసు తేలికపడుతుంది. వైద్యం చేయడానికి శరీరం సహకరిస్తుందని శస్త్రచికిత్స చేసే వైద్యులు చెపుతారు.

సెయింట్ జాన్స్ హాస్పిటల్, కిద్వాయ్ మెమొరియల్ ఇన్‌స్టిట్యూట్‌లలో కూడా ఇదే తరహా హాస్య చికిత్స చేశారు క్లౌన్స్. ఈ కార్యక్రమాలన్నీ 'డాక్టర్ క్లౌన్స్' ఆధ్వర్యంలో జరిగాయి. ఆస్పత్రుల నుంచి ఊహించినదానికంటే ఎక్కువ స్పందన వచ్చింది.

ఇజ్రాయిల్‌లో కోర్సు..

మెడికల్ క్లౌన్స్‌కు ఇజ్రాయిల్ ప్రసిద్ధి. అక్కడి ప్రతి ఆస్పత్రిలో విధిగా వైద్య విదూషకుల్ని ఏర్పాటు చేస్తున్నారు. విలువైన పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. ఈ మధ్యనే భారత్‌లోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం ముంబయిలోని 'కెమ్ హాస్పిటల్'లో ఒక వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసింది. ఆ దేశంలో పేరొందిన క్లౌన్స్ హాజరయ్యారు. సుమారు రెండొందల మంది పిల్లలు క్లౌన్ థెరపీతో ఉపశమనం పొందారు. ''ఒకప్పుడు రోగం వస్తే కోలుకోవడం చాలా తేలిక. ఇప్పుడైతే ఆస్పత్రిలోనే చాలా రోజులు గడపాల్సి వస్తోంది. కారణం అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికే మనందరం ఆందోళన, ఒత్తిడి, ఒంటరితనం అనే జబ్బులతో నలిగిపోతున్నాం. వీటికి ఇంకో జబ్బు తోడవ్వడం వల్లే పరిస్థితులు విషమిస్తున్నాయి. మానసిక సమస్యల్ని తొలగించేందుకు క్లౌన్స్ ఉపయోగపడుతున్నారు. అందుకే, 'మెడికల్ క్లౌనింగ్'లో గ్రాడ్యుయేషన్‌ను అందిస్తోంది మా దేశం'' అని చెప్పుకొచ్చారు ఇజ్రాయిల్ విదూషకుడు హమ్యూటల్ ఎండే.

చీకట్లో వెలుగుపూలు...

వైద్య చికిత్సకు సహాయకారులుగానే కాదు. మానసికోల్లాసాన్ని కలిగించడంలోనూ ముందుంటున్నారు క్లౌన్స్. ఢిల్లీ సమీపంలోని గుర్‌గావ్ భారీ నిర్మాణాలకు పెట్టింది పేరు. అక్కడ పనిచేస్తున్న తాపీమేస్త్రీలు, కూలీలు తాత్కాలిక నివాసాల్లో ఉంటూ జీవనం సాగిస్తుంటారు. పెద్దలు పనులకు వెళ్లడంతో.. పిల్లలకు చదువులు ఉండటం లేదు. బాల్యంలో దొరకాల్సినంత వినోదమూ వారికి దక్కడం లేదు. ఇలా పెరిగి పెద్దయిన పిల్లల్లో మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. అందుకే, కార్మికుల పిల్లల కోసం 'మొబైల్ క్రెచ్సెస్' అనే సంస్థ డేకేర్ సెంటర్లను నిర్వహిస్తోంది. పిల్లల్లో ఒంటరితనాన్ని తొలగించేందుకు అది ఈ మధ్య క్లౌన్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసింది. దీనివల్ల పిల్లల మనసులో గూడుకట్టుకున్న దిగులును తుడిపేసినట్లయిందంటున్నారు నిర్వాహకులు.

బడి ఎగ్గొట్టే పిల్లల్ని తిరిగి రప్పించుకునే ఆకర్షణ కూడా క్లౌన్స్‌కు ఉంది. తమిళనాడులోని పెరియాన్‌చన్న పరాయ్ అనే గ్రామంలో పాఠశాల గుడులన్నీ ఖాళీగా కనిపించేవి. అయ్యవార్లు రకరకాల ప్రయత్నాలు చేసినా పిల్లలు బడికి వచ్చేవారే కాదు. 'హ్యూమానిటేరియన్ క్లౌన్స్'ను తీసుకొచ్చాక బిలబిలమంటూ వాలిపోతున్నారు పిల్లలు. మ్యాజిక్, మ్యూజిక్, గారడీలతో వాళ్లు పిల్లల్ని బాగానే ఆకట్టుకున్నారు. ''విద్యార్థులకు మొహం మొత్తిన్నట్లు పాఠాలు చెబితే ఇష్టం కలగదు. కాస్త వినోదాన్ని, మరికాస్త ఉత్సుకతను కలిగిస్తే.. పిల్లలు ఆసక్తి చూపిస్తారు..'' అని పాఠశాలకు వచ్చిన క్లౌన్స్ చెప్పారు.

నవ్వించి నయం చేస్తారిలా...

రాజస్థాన్‌లోని తిలోనియా పేరు చెప్పగానే బేర్‌ఫుట్ కాలేజి గుర్తుకొస్తుంది. ఆ కళాశాలలో కూడా క్లౌన్ థెరపీ క్లాసులు ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని 'సలామ్ బాలక్ ట్రస్ట్' వీధి పిల్లల ఆశ్రమ పాఠశాల. మొబైల్ స్కూళ్లను కూడా నడుపుతోంది ఈ సంస్థ. ''పిల్లల నడవడిక మెరుగవ్వాలంటే, వారిలో చదువు పట్ల శ్రద్ధ కలుగజేయాలంటే.. ముందు వాళ్లు తమకెవరూ లేరన్న భావనను తొలగించుకోవాలి. లేదంటే గతాన్ని మరిచిపోవాలి. ఆ పని చేసేందుకు మేమున్నామంటూ కొందరు క్లౌన్స్ మమ్మల్ని సంప్రదిస్తే, సరే రండన్నాము. వారు వచ్చాకే తెలిసింది. ఇదొక అబ్బురపరిచే వినోదమని'' అంటారు ట్రస్టు ప్రతినిధులు. ఇలా క్లౌన్ థెరపీ రోజు రోజుకు కొత్త పుంతలు తొక్కుతోంది.

డాక్టర్లు జ్వరానికి ఒక మందు, దగ్గుకు మరో మందు, క్యాన్సర్‌కు ఇంకొక మందు ఇస్తుంటే, క్లౌన్ డాక్టర్స్ మాత్రం అన్ని రోగాలకు ఒకే ఒక్క మందును ఇస్తున్నారు. ఆ మందు పేరు హాస్యం. అత్యంత చవకైనదీ, ఎటువంటి దుష్ప్రభావాలు లేనిదీ. అందుకే, మనందరికీ ఈ క్లౌన్స్ ఏం చెబుతున్నారో తెలుసా?

హాస్యమేవ ఆరోగ్యప్రాప్తిరస్తు!! అని.

● సండే డెస్క్

మిక్స్చర్ పొట్లం

బొమ్మలు: ఎన్.రాజశేఖర్ రెడ్డి

తోలు కాపాడుకున్నాను

''జేబులో పర్స్ మర్చిపోయి, చైనీస్ హోటల్లో తినడం తప్పయిపోయిందిరా'' వాపోయాడు ఆంజనేయులు.

''ఏం చేశారు?'' ఆతృతగా అడిగాడు వీరన్న.

''పది పాముల్ని నా ముందు పడేసి, వాటి చర్మం ఒలవమన్నారు. లేదంటే నా తోలు వలిచేస్తామన్నారు'' బేరుమన్నాడు అంజన్న.

పరిష్కారం ఉంది నాయనా!

''నాకీ మధ్య సరిగ్గా నిద్ర పట్టడం లేదు డాక్టరుగారూ'' చెప్పేడు సూరిబాబు.

''ఏం చేస్తుంటారు మీరు?''

''ఒక ప్రైవేట్ కంపెనీలో గుమాస్తాగా''

''ఆ ఉద్యోగం వదిలేసి, ఎలాగోలా గవర్నమెంట్ ఉద్యోగం సంపాదించండి. మీ సమస్య పరిష్కారం అవుతుంది'' చెప్పేడు డాక్టర్ సదానందం.

ఈ రాత్రికి నిద్ర పోవచ్చు

''మీకు మద్దెలు వాయించడం రాదు కదండీ? మరి ఎందుకు పక్కింటాయన్ని అడిగి మద్దెలు తెచ్చారు?'' ఆసక్తిగా అడిగింది అలివేలు.

''రాత్రి పగలూ తేడాలేకుండా, అర్ధరాత్రుళ్లు కూడా వాయించి నిద్ర పోకుండా చేస్తున్నాడు మరి'' అసలు విషయం చెప్పేడు సుందర్రావు.

ఇంట గెలిచా! రచ్చే మిగిలింది!!

''మేడమ్, ఏ ధైర్యంతో మీరు ఈ ఎన్నికల్లో గెలవగలరని భావిస్తున్నారో చెప్పగలరా?'' ఆండాళ్లమ్మ మూతి ముందు మైకును పెట్టి అడిగాడు విలేకరి వీరన్న.

''మా ఆయనకూ, నాకూ మధ్య ఏ గొడవ, ఎప్పుడొచ్చినా నేనే గెలుస్తుంటాను. ఆ ధైర్యంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను'' ఆత్మవిశ్వాసంతో చెప్పింది ఆండాళ్లమ్మ.

మగబుద్ధి

''ఏంటోయ్ వెంకటేశం, నిన్న మొన్నటి వరకూ ప్రతి ఫంక్షన్‌కూ ఒకమ్మాయిని వెంటేసుకుని తిరిగేవాడివి కదా. ఈ ఫంక్షనుకు ఒంటరిగా వచ్చావేం?'' అడిగాడు కోదండం.

''ఆ అమ్మాయికి పెళ్లయిపోయిందండి''

''అవునా? అరె, ఎవరితో?''

''నాతోనేనండి!'' తాపీగా చెప్పాడు వెంకటేశం.

అదే ఫార్ములానా?

మూడు నవలల ఆధారంగా వచ్చిన మూడు హాలీవుడ్ సినిమాలూ కాన్ ఫిల్మోత్సవ్‌లో తుస్సుమనడం ఆహ్వానించదగిన పరిణామమే. ఇంకా 'సెక్స్-హింస' ఫార్ములా ఆధారంగా సినిమాలు రావడం, మనము చూడడమూనా! తెలుగు సినిమాలు కూడా మూసధోరణి నుంచి బయట పడవలసి వుంది.

– శశాంక్, రాజమండ్రి

అప్పుడే ముగిసిందా?

కాన్ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించిన వివిధ భాషల, దేశాల సినిమాల పరిచయం ఆసక్తికరంగా సాగింది. అప్పటివరకు ఎవరికీ తెలియని నటీనటులూ, దర్శకులూ కాన్ పుణ్యమా అని నటులుగా,దర్శకులుగా మారిపోతున్నారంటే ఆ ఉత్సవాల ప్రాధాన్యం అలాంటిది. ఇంకా ఈ శీర్షిక కొనసాగి, మరిన్ని సినిమాల గురించి తెలుసుకునే అవకాశం ఉంటే బాగుండేది.

– ప్రశాంత్, వరంగల్

బతుకుభారం

'ఇక నుంచి ఆరు గ్యాస్‌సిలిండర్లే' అని ప్రభుత్వం ప్రకటించేసరికి మా గుండెలు గుభేలుమన్నాయి. ఆ ప్రకటనను ఎద్దేవా చేస్తూ మన్మోహన్‌జీకి శ్రీశ్రీశ్రీ సామాన్య జీజీజీ రాసిన లేఖ చదివాము. ఇలాంటి లేఖలు మరిన్ని రాసి మా సంసారాలు గుల్ల కాకుండా కాపాడండి. తడిసి మోపెడయ్యే ఖర్చులతో బతుకు భారమైంది బాబో!

– సుష్మా, లేఖిని, విశాఖ

నాన్నబాట

పరిస్థితుల ప్రభావంతో సాహిత్యం బాట వీడి సంసార సాగరంలో మునిగిన నాన్నలపై కవిత బాగుంది. 'కన్నీళ్ళతో నవ్వాడు నాన్న' అని ముగించడం రసస్ఫోరకంగా ఉంది.

– కాత్యాయని, ఒంగోలు

ఖాళీల భర్తీ

మన జీవితాల్లో ఎన్నో అసంతృప్తులు,తీరని ఆవేదనలూ ఉంటాయి. ఆ లోటుపాట్ల ద్వారా ఏర్పడిన ఖాళీలను ఇతర వ్యాపకాల ద్వారా భర్తీ చేసుకుంటుంటాం. ఇది మనందరికీ అనుభవమే. దీనికి కథారూపం 'లోపలి ఖాళీలు'. కథలో సంభాషణలు నడిపించిన తీరు బాగుంది. మృణ్మయి పాత్రలో వచ్చిన మార్పు ఒక క్రమంలో కాకుండా హఠాత్తుగా వచ్చినట్లుంది.

– సుదేఖ,హైదరాబాద్

ముచ్చటేస్తోంది

స్వీడన్ దీవుల్లోని సామాన్యుల జీవితాన్ని తెలుసుకున్నందుకు ఆనందంగా ఉంది. మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో గంగజాతరల మాదిరి, వారికి కూడా ఎండా కాలమే పండగల కాలం అని తెలుసుకున్నాను. సముద్ర తీరం పొడవునా బిత్తరచూపులు చూసే కుందేళ్లమంద, ఆ గడ్డిమైదానాలు, రంగు రంగుల పూలు.. తలుచుకుంటే ముచ్చటేస్తుంది.

– శంకర్, తిరుపతి

బాధాకరం

పాతికేళ్లకే నంది, ఫిలిం ఫేర్ పురస్కారాలు అందుకున్న కారుణ్య 'హ్యాపీడేస్' బాగున్నాయి. అందులో బాధలూ ఉన్నాయి. పాటే ప్రాణంగా మార్చుకున్న ఆ యువగాయకుడు పాట కోసం ఆటపాటలకు దూరమై బాల్యం కోల్పోవడం బాధాకరమే. అయితే అక్కడితో ఆగలేదు కథ. ఆపై బాలుగారి ప్రశంస పొందారు. గాయకుడిగా రాణిస్తున్నారు.

– వినీల్, ఆదోని

సక్సెస్ చేయాలి

'పర్యాటకానికి పండగొచ్చింది' కథనం ద్వారా డజను పర్యాటక కేంద్రాల విశేషాలు తెలుసుకున్నాము. ఇది పర్యాటక శాఖ చేసిన మంచి ప్రయోగం. పోలో మంటూ అమెరికా, లండన్..వెళుతున్నవారే ఎక్కడ చూసినా ఉంటున్నారు. మన రాష్ట్రంలోని ప్రాధాన్యం గల ప్రదేశాలు మనకు అందరికీ తెలుసా అంటే సందేహమే. ఈ పండగ విజయవంత మయ్యేందుకు మనమూ ప్రయత్నించాలి.

– గిరిధర్, ఆదిలాబాద్

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారంలోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.com కి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

వంటసాల

మంచూరియా మహారుచి

బేబీకార్న్‌తో

కావలసిన పదార్థాలు: బేబీ కార్న్ – 12, క్యారెట్ – 1, క్యాప్సికం – 1, ఉల్లిపాయ – 1, మైదా – 4 టేబుల్ స్పూన్లు, నూనె – తగినంత, అల్లం, వెల్లుల్లి పేస్టు – 2 టీ స్పూన్లు, పచ్చిమిర్చి – 3, స్ప్రింగ్ ఆనియన్స్ – అరకప్పు, జీరాపొడి, మిరియాలపొడి, ఉప్పు – రుచికి తగినంత.

సాస్ కోసం: అల్లం రసం, సోయా సాస్ – ఒకటిన్నర స్పూను చొప్పున, స్వీట్‌కార్న్ సాస్ – పావు కప్పు, పంచదార – అర టీ స్పూను, వెనిగర్ – 1 టీ స్పూను, మిరియాలపొడి – అర టీ స్పూను, ఉప్పు – రుచికి తగినంత, కార్న్‌ఫ్లోర్ – 2 టీ స్పూన్లు (పావు కప్పు నీటిలో కరిగించాలి)

తయారుచేసే విధానం: అంగుళం పొడవున కట్ చేసి ఉడికించిన బేబీ కార్న్ ముక్కల్లో ఉప్పు, కారం, సగం అల్లం వెల్లుల్లి పేస్టు, మైదా వేసి తగినంత నీరు పోస్తూ ముక్కలకు బాగా పట్టేలా చిక్కగా కలిపి నూనెలో దోరగా వేగించి పక్కనుంచాలి. 2 టేబుల్ స్పూన్ల నూనెలో ఉల్లి, అల్లం వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చి, క్యాప్సికం వేగించి కారం, ఉప్పు, సాస్‌లు వేసి పెద్దమంటపై ఒక నిమిషం వేగించాలి. ఇప్పుడు వేగించిన బేబీకార్న్ కలిపి నిమిషం తర్వాత స్ప్రింగ్ ఆనియన్స్, నీటిలో కరిగిన కార్న్‌ఫ్లోర్ చల్లాలి. ముక్కలకు గ్రేవీ బాగా పట్టిన తర్వాత దించేసి కొత్తిమీర తో అలంకరించుకోవాలి.

కావలసిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్ ముక్కలు – పావు కేజీ, పచ్చిమిర్చి – 2, కొత్తిమీర – 1 కట్ట, క్యాప్సికం – 1, ఉల్లిపాయ – 1, సోయా సాస్ – 2 టేబుల్ స్పూన్లు, వెనిగర్ – 1 టీ స్పూను, పంచదార – 1 టీ స్పూను, ఉప్పు – రుచికి తగినంత, మిరియాలపొడి – అర టీ స్పూను, కార్న్‌ఫ్లోర్ – 2 టేబుల్ స్పూన్లు, మైదా – 4 టేబుల్ స్పూన్లు, నూనె– తగినంత, చికెన్ స్టాక్ – 2 కప్పులు, టమోటా కెచప్ – 4 టేబుల్ స్పూన్లు. వెల్లుల్లి – 4 రేకలు.

తయారుచేసే విధానం: కూరగాయల్ని క్యూబ్స్‌గా కట్ చేసుకోవాలి. చికెన్ ముక్కలకు ఉప్పు, కార్న్‌ఫ్లోర్, మైదా, చిటికెడు మిరియాలపొడి పట్టించి నూనెలో దోరగా వేగించాలి. మరో కడాయిలో 2 టేబుల్ స్పూన్లు నూనె వేసి వెల్లుల్లి, ఉల్లి, క్యాప్సికం, గ్రీన్ ఆనియన్స్ 2 నిమిషాలు వేగించి కొత్తిమీర, సోయా సాస్, టమేటో కెచప్, పంచదార వేసి కొద్దిసేపు తర్వాత చికెన్ స్టాక్ చేర్చి మరిగించాలి. ఇప్పుడు చికెన్ ముక్కలు కలిపి ఒక నిమిషం తర్వాత టేబుల్ స్పూను కార్న్‌ఫ్లోర్ కలిపి గ్రేవీ చిక్కబడే వరకు ఉంచాలి. తర్వాత కొత్తిమీరతో అలంకరించి సర్వ్ చేయాలి.

చికెన్‌తో

ఫిష్‌తో

కావలసిన పదార్థాలు: (వంజరం లేదా, ముళ్లు తీసిన) చేప ముక్కలు – అరకేజీ, ఉల్లిపాయ – 1, స్ప్రింగ్ ఆనియన్స్ – 1 కట్ట, పచ్చిమిర్చి –4, క్యాప్సికం – 1, అల్లం –అంగుళం ముక్క, వెల్లుల్లి రేకలు – 4, సోయాసాస్ – 2 టీస్పూన్లు, కారం–1 టీ స్పూను, వెనిగర్ –1టీ స్పూను, అజినమోటో – చిటికెడు, మిరియాలపొడి, చక్కెర – పావు టీస్పూను చొప్పున, ఉప్పు – రుచికి తగినంత, నూనె – తగినంత, (రెడ్) ఫుడ్ కలర్ – చిటికెడు.

గ్రేవీ కోసం: కార్న్ ఫ్లోర్ – 4 టేబుల్ స్పూన్లు, బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు, వంటసోడా – రెండు చిటికెలు, కారం – ఒకటిన్నర స్పూను, అజినమోటో – పావు టీస్పూను, ఉప్పు – అర టీ స్పూను.

తయారుచేసే విధానం: గ్రేవీ పదార్థాలన్నీ తగినంత నీటిలో చిక్కగా కలిపి, చేప ముక్కలు ముంచి నూనెలో దోరగా వేగించి పక్కనుంచాలి. 3 టేబుల్ స్పూన్ల నూనెలో తరిగిన క్యాప్సికం, ఉల్లి, స్ప్రింగ్ ఆనియన్స్, పచ్చిమిర్చి, మెదిపిన అల్లం, వెల్లుల్లి వేసి ఒక నిమిషం పెద్దమంటపై వేగించాలి. ఇప్పుడు మంట తగ్గించి సోయాసాస్, కారం, వెనిగర్, అజినమోటో, మిరియాలపొడి, పంచదార వేసి వేగించాలి. తర్వాత చేప ముక్కలు కలిపి మంట పెంచి ముక్కలకు గ్రేవీ బాగా పట్టిన తర్వాత దించేసి, కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి.

ఔషధ బసంతులూ, అందమైన బసంతులూ

హిమాచల్‌ప్రదేశ్ భూతలస్వర్గమే! కానైతే, నేను అక్కడికి విహారయాత్రకై పోలేదు! మందు మొక్కల వెదుకులాటలో వెళ్ళక తప్పలేదు. అసలేం జరిగిందంటే...

ఇరవయ్యో శతాబ్దపు చివరి రోజుల్లో, 'హైపరికం పెర్ఫొరేటం' (సెయింట్ జాన్స్ వర్ట్ : ప్రాంతీయ నామం 'బసంత్' అట!) అనే మొక్క పూచే పూలలోంచి తయారు చేసిన 'యాంటి డిప్రసెంట్' మందుకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ వచ్చింది. ఆ మొక్కకు మరికొన్ని అత్యుత్తమ గుణాలు ఉండడంతో అప్పటికే అది ఉపయోగంలో ఉంది. మన హిమాలయ ప్రాంతాల్లో కూడా పెరుగుతుందని రికార్డయితే ఉంది కాని ఎంత 'పీక్కుని తెచ్చుకోవచ్చో' లెఖ్ఖలూ, పత్రాలూ గట్రా అప్పటికి తయారు కాలేదు. కొండకోనల్లో మందు మొక్కలను సేకరించి అమ్ముకునే నలుగురైదుగురు బడా వ్యాపారులు (Raw Drug Dealers) అమృత్‌సర్‌లో ఉన్నారు. ఐతే రెండు మూడు జాతుల మొక్కలకు ఒకే ప్రాంతీయ పేరు ఉండడం సంభవిస్తే మాత్రం, ఆ వ్యాపారులు 'నిజమైన మొక్క' ఏమిటో తెలియక వారికి ఏది అందుబాటులో ఉంటే దానిని అడిగిన వారికల్లా అంటగడతారు! అందుకని, మరీ అవసరమైతే మనమే అక్కడకు వెళ్ళి సంగతేంటో తెలుసుకోవాలి. తప్పయితే సరిచేసుకోవాలి. కనుక అమృత్‌సర్ వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను.

డెహ్రాడూన్‌లో అధ్యయనం

అమృత్‌సర్ వెళ్ళేముందు దెహ్రాదున్ (డెహ్రాడూన్)లో ఉన్న ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను దర్శించి 'హైపరికం' ప్రజాతికి చెందిన అన్ని జాతి మొక్కలను బాగా 'స్టడీ' చేశాను. తరువాత అమృత్‌సర్ వెళ్ళి 'బసంత్' పేరుతో ఏ పూలను అమ్ముతున్నారో చూపించమన్నాను. ఓ బస్తా విప్పించి కుప్పలా పోయించాను. అందులో పూలకన్నా పుల్లముక్కలే ఎక్కువగా ఉన్నాయి. పూలు ఓ ముప్పై శాతం ఉండొచ్చు. ఐతే అవి మనకు కావలసిన బసంత్ పూలు కాదు. 'యాంటి-డిప్రసంట్' గుణాలు ఈ పూలకు లేవు. 'అసలు మొక్క' కోసం అది పెరిగే మంచుకొండల్లో వెదకవలసిందే! తప్పదు మరి.

అప్పుడు మొదలైంది అసలు మూలికా ప్రస్థానం! బయలుదేరే ముందు కాస్త వీలు చేసుకుని, స్వర్ణమందిరంలోకి ఆచారం ప్రకారం శిరస్సును (జేబు రుమాలతో) కప్పుకుని వెళ్ళి అందులో ఉన్న పవిత్ర గ్రంథాన్ని తిలకించాను. అలాగే, జలియన్ వాలాబాగ్ (1919)లో రౌలత్ యాక్టుకి (సత్యాగ్రహం చేసే వారికి రెండేళ్ళ జైలు శిక్ష వెయ్యొచ్చు అనే చట్టానికి) వ్యతిరేకంగా జరిగిన సభకు హాజరైన వందలాది దేశభక్తుల్లో కొందరు, డయ్యర్ దొరగారి కుతంత్రాన్ని ఎదుర్కోలేక, బయటకు వెళ్ళే దారిలేక దూకేసిన మంచినీళ్ళ బావినీ, ఆ మారణకాండలో మృతిచెందిన అమరవీరుల జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపాన్నీ దర్శించాను. అలాగే, అమృత్‌సర్ వెళ్ళే ప్రతి ఒక్కరూ చూడాలని కలలు కనే బాఘా (వాఘా) కూడా.

ప్రయాణం షురూ...

మర్నాడు నేను ట్రావెల్ ఏజెంట్‌ను కలిసి 'హిమాచల్‌ప్రదేశ్ వరకూ వెళ్ళవలసి ఉంది. మేం వచ్చిన పని పూర్తయిపోతే మధ్యలోనే వెనక్కు వచ్చేస్తాం' అని చెప్పి ఓ 'బొలేరో' కారు కుదుర్చుకున్నాం. బొలేరో బయలుదేరింది. బటాలా, గురుదాస్‌పూర్, పఠాన్‌కోట, జోగిందర్ నగర్, కుల్లూ (కులు) మొదలైన పట్టణాలు దాటుకుంటూ, బారులు తీరి ఉన్న యాపిల్ తోటలను తిలకిస్తూ, 'మండి' చేరాము. దారిలో ఎదురైన కొండల్లో 'హైపరికం' కోసం ఎంత వెదికినా ఒక్క మొక్క కూడా కనబడలేదు. మండి మా మొదటి హాల్ట్. మండిలో ఆగడానికి ఓ కారణం ఉంది. దేశమంతటా నాకు ఏకలవ్య శిష్యులు చాలామంది ఉన్నారు. తాడూ బొంగరంలేని రోజుల్లో ఆయుర్వేద కౌన్సిల్ కోసం రెండు బృహద్గ్రంథాలను తయారు చేసి పెట్టాను కదా. 'గోదావరీ పరీవాహక జిల్లాలలో లభించే వనమూలికలు' అనేది మొదటిదైతే, రెండవది 'కృష్ణానదీ పరీవాహక జిల్లాలలో లభించే వనమూలికలు'. ఇండియన్ మెడిసిన్ కౌన్సిల్ వారు (ఆయుష్) వీటిని 'స్టెన్సిల్ కాపీలు' తీయించి, పుస్తకాల్లా కుట్టించి, పబ్లికేషన్ క్రమ సంఖ్యలు ఇచ్చి, అన్ని రాష్ట్రాల్లో ఉన్న తమ పరిశోధనా కేంద్రాలకు పంపించారు. ఆయా కేంద్రాలలో ఉన్న వనమూలికా సర్వేక్షణాధికారులూ, ఆయుర్వేద, యునానీ, హోమియోపతి వైద్యులూ- వాటిని భగవద్గీతలా పారాయణం చేసి చాలా విషయాలు గ్రహించారు. దానికి తోడు నేను కౌన్సిల్‌లో చేరేటప్పటికే నాలుగైదు పుంజీల (16-20) కొత్త మొక్కలను కనిపెట్టి ఇండియన్ ఫారెస్టర్, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా బులెటిన్ మొదలైన సైంటిఫిక్ జర్నల్స్‌లో ప్రచురించాను. కనుక వారంతా నేను ఏ మీటింగ్‌లోనైనా కనబడితే నాకు ద్రోణాచార్యుడికిచ్చినంత గౌరవం ఇచ్చేవారు! అందుచేత 'మండి'లో ఉన్న ఇన్‌ఛార్జ్ ఆఫీసరుకు ముందుగా తెలియజేయడంతో ఆయన నాకు ఆతిథ్యమివ్వడమే కాకుండా నా వెంట ఉండడానికి ఒక గైడ్‌ను కూడా ఏర్పాటు చేశాడు.

రోహ్‌తంగ్ దాటినా నిరాశే

మర్నాడు బొలేరో మళ్ళీ ముందుకు దూసుకుపోయింది. పిక్నిక్ స్పాట్ అయిన 'రోహ్‌తంగ్' దాటేసేము. ఐసుతో కప్పుకుపోయిన దారుల్ని అప్పటికే శుభ్రం చేసెయ్యడంతో మా ప్రయాణానికి ఏ ఆటంకమూ రాలేదు. కొన్నిచోట్ల పర్యాటకులు ఐస్ స్కేటింగ్ చేస్తున్నారు. 'వ్యాస్ నది' (బియాస్ నది) గట్టు వెంబడి ఎవరో ఓ కుర్ర డైరెక్టర్ పదహారేళ్ళ హీరోయిన్‌తో డైలాగు చెప్పిస్తూ సినిమా షూటింగ్ చేసుకుంటున్నాడు. మేము వీటినేమీ పట్టించుకునే స్థితిలో లేము. కొండలూ, గుట్టలూ తగిలిన చోట నెమ్మదిగా పోతూ 'హైపరికం' కోసం అన్వేషిస్తూనే ఉన్నా. కాని ప్రస్థానం ఫలప్రదమైనదిగా తోచడం లేదు. హైపరికం కోసం మరీ ముందుగా వచ్చేసామనిపించింది. మరొక్క నెలరోజుల తరువాత వచ్చివుంటే దొరికేదేమో అనిపించింది. 'ఇంతటితో ఈ మొక్కల వేటకు స్వస్తి. బండిని తిప్పవయ్యా వెనక్కి' అని డ్రైవర్‌తో అంటుండగా, ఎదురుగా ఓ పోలీస్ వాహనం వచ్చి ఆగింది.

అందులోంచి 'వాకీటాకీ' చేత్తో పట్టుకున్న పోలీస్ ఆఫీసర్ దిగి, మా బండిని ఆపించి, ఎక్కడ నుంచి వస్తున్నారు? ఎక్కడికి వెడుతున్నారు? అంటూ ప్రశ్న మీద ప్రశ్న సంధించాడు. ''మేము బోటనిస్టులం. మందు మొక్కలపై పరిశోధన చేస్తున్నాము'' అన్నాను. 'మీ వాహనం పంజాబ్ రాష్ట్రానికి చెందింది. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రవేశించడానికి పర్మిట్ ఉందా?'' అంటూనే, డ్రైవర్ని పర్మిట్ కాగితాలు తీయమన్నాడు. డ్రైవరు నీళ్ళు నములుతూ 'లేవండి, ఇంత దూరం వస్తామని అనుకోలేదండి' అన్నాడు. పోలీసు ఆఫీసరు సి.ఆర్. బుక్కూ, డ్రైవింగ్ లైసెన్సు తీసేసుకుని, డ్రైవర్ని 'కీలాంగ్ పోలీస్ స్టేషన్'కి వచ్చి కనబడమన్నాడు. ఇది విన్న మాకు పచ్చి వెలక్కాయ గొంతులో అడ్డం పడ్డట్టయింది! ఇదెక్కడి తద్దినంరా బాబూ అని నేను తలపట్టుకున్నాను. ఇంకా వచ్చిన పని పూర్తి కానేలేదు. ''హేమాద్రిని పంపితే ఏ మూలికనైనా, ఎక్కడ దాక్కున్నా వెదికి పట్టుకువస్తాడనే నమ్మకాన్ని వమ్ము చేసే ఘడియ వచ్చేసింద''నుకున్నాను. ఇరుక్కున్నది బోర్డర్ సెక్యూరిటీ వ్యవహారంలో! కీలాంగ్ వెళ్ళక తప్పదు. ఎప్పుడు వదులుతారన్నది మన చేతిలో లేదు. అంటే, ఇంతటితో 'హైపరికం' వేట సమాప్తమైనట్టే!

పోలీసు బాధలే దారి చూపాయి

కీలాంగ్ అనే ఊరు మనాలీ-లేహ్ నేషనల్ హైవేలో ఉంది. ఆ దిశగా మా వాహనం ఉరకలు వేసింది. అయితే మేం ఇప్పుడు ఎత్తయిన ప్రదేశం నుండి లోయలోకి దిగుతున్నాం. వాతావరణం అనుకూలంగా ఉంది. మేం వెళ్ళే దారిలో అక్కడక్కడా మంచుతో కప్పబడని పర్వతాలు ఉన్నాయి. నా దృష్టి వాటిపై పెరుగుతున్న మొక్కలపై పెట్టాను. దాదాపు ఓ కొండ మొదలుకి వాహనం చేరగానే- ఆ రాళ్ళ సందుల్లో ఓ అడుగు ఎత్తు పెరిగిన మొక్క కనబడింది. చూడ్డానికి హైపరికంలాగే ఉంది. కాని పువ్వులే లేవు. పువ్వుల్లేని మొక్కను- అదీ మొదటిసారి, కచ్చితంగా గుర్తించడం మహాకష్టం! నేను నెమ్మదిగా కొండపైకెక్కుతూ రాళ్ళ సందుల్లో పెరుగుతున్న మరికొన్ని మొక్కల్ని పరిశీలించాను. కొమ్మ చివర ఐదు రేకలతో పసుపు పచ్చని పూలు, రేకలమీద నల్లని మచ్చలూ! 'యురేకా! హైపరికం దొరికింది! హైపరికం దొరికింది!' అని అందరికీ వినబడేలా అరిచాను. తరువాత ఎక్కువ మొత్తంలో హైపరికం పూలను సేకరించి, సాయంత్రమయ్యేటప్పటికి కీలాంగ్ చేరాము. పోలీస్‌స్టేషన్‌లో పని తొందరగానే తెమిలింది. మా ప్రయాణానికి ఏ ఆటంకం లేకుండా డ్రైవర్‌ని తరువాతెప్పుడో మనాలి మేజిస్ట్రేట్ కోర్టుకు వచ్చి, జరిమానా కట్టమని సమన్లు ఇచ్చాడు. డ్రైవర్ లబోదిబోమన్నా ప్రయోజనం లేకపోయింది. (ఫైన్ డబ్బు మేము సర్దేశామనుకోండి.)

నాక్కావలసిన మొక్క దొరికే ప్రదేశం ఇప్పుడు నాకు తెలుసు. నా మూలికా ప్రస్థాన విజయానికి పరోక్షంగానైనా మూల కారకుడైన 'కీలాంగ్ పోలీస్‌బాబు'కు నిండు హృదయంతో జేజేలు పలికి, ఈ వ్యాసం ఇక్కడితో ఆపెయ్యాలి. కాని నాకు ఆపాలని లేదు.

మంచుకొండ ముద్దుబిడ్డలు

పుష్పాన్వేషణ పూర్తి చేసుకున్న తరువాత తిరుగు ప్రయాణమయ్యాం. మనాలి, మండి దాటిన తరువాత 'రోడ్ అండర్ రిపేర్-మెన్ ఎట్ వర్క్' అనే సూచిక రోడ్డుకడ్డంగా పెట్టి ఉండడంతో మా కారు ఆగింది. రోడ్ రిపేర్ పని చురుగ్గా జరుగుతోంది. ఇరవై, ముప్పై మంది కూలీలు అటూ ఇటూ కదులుతున్నారు. తారుడ బ్బాలోంచి మరిగిన తారును బకెట్‌లో నింపుకునే వారూ, శుభ్రం చేసిన రోడ్డు మీద జల్లెడలాంటి ఏర్పాటు ఉన్న వాటర్ కేన్లతో వేడి వేడి తారు చల్లుతూ ముందుకు కదిలేవారూ, దానిమీద కంకరరాళ్ళు పోసేవారు, ఆ రాళ్ళను సమంగా సర్దేవారు, దానిపై రోడ్ రోలర్‌ను లాగేవారు ఇలా పని చకచకా సాగుతోంది. సూచికలో 'మెన్ ఎట్ వర్క్' అని రాసి ఉన్నప్పటికీ, పనిచేస్తున్న వారిలో మూడు వంతులు ఆడపడుచులే. మంచుకొండ ముద్దుబిడ్డలే! అందరూ అందగత్తెలే! వారికి అలసట అంటే ఏమిటో తెలియదనుకుంటాను. వారి ముఖాలు తామరపువ్వులు విచ్చుకున్నట్టున్నాయి. బుగ్గలు దోరయాపిల్ పళ్ళలా రంగుతేలాయి. చిదిమితే మధుర సారం కారేలా ఉన్నాయి. వారి అందాన్ని వర్ణించడానికి నేను వాడిన మాటలు నిజంగా నిజాన్ని తెలియజేస్తాయంటే నేను నమ్మను. మీరూ నమ్మవద్దు. వారి అందం వర్ణనాతీతం. బహుశా, వ్యాస్ నది మోసుకుపోతున్న 'హైపరికం పెర్ఫొరేటం' యొక్క పుష్పసార సహిత హిమజలాన్ని వారు నిత్యం సేవించడం కూడా ఒక కారణం కావచ్చు.

ఈ పూల నుండి లభ్యమయ్యే 'హైపరిసిన్'కి మానవ శరీరాన్ని రక్షించే గుణాలెన్నో ఉన్నాయి. అది సూర్యతాపాన్నుండి శరీరాన్ని కాపాడుతుంది. చర్మాన్ని బిగుతుగా, కాంతులీనేలా ఉంచుతుంది. ముడతలు పడనీయదు. ఇక, జటామాంసి, పుష్కరమూలం, కుష్ఠం, మాంసరోహిణి, తాలిస్‌పత్రం, దారుహరిద్రా, ఎఫెడ్రా మొదలైన దివ్యౌషధులు పెరిగేది వీరి ఇలాకాలోనే. ఇబ్బడిముబ్బడిగా గోమూత్ర శిలాజిత్తు స్రవించేది కూడా ఈ పర్వత శ్రేణుల్లోనే కదా. ఎటొచ్చీ, నా బాధంతా 'నెత్తిమీద మోస్తున్న కంకరరాళ్ళ ఇనుపగమేళా, అది పడిపోకుండా కుదురులా చుట్టిపెట్టుకున్న చునీదార్, కాళ్ళకు కట్టుకున్న టైరు ముక్కలూ, వాటికి అంటుకుని అట్టకట్టుకుపోయిన తారూ... కంపారిజన్ కరక్టో కాదో కానీ- అచ్చు 'సముద్రంలో ప్రమాదవశాత్తూ వొలికిపోయి, తెట్టుకట్టిన క్రూడాయిల్లో చిక్కుకున్న పెంగ్విన్ పక్షుల్లా' పర్వత పుత్రికలూ... ఓహ్! ఆ దృశ్యం ప్రకృతికే వికృతి! అది చూసిన నాకైతే మనస్సు కకావికలమైపోయింది! అవుతుందా అవదా? మీరే చెప్పండి!

– కొప్పుల హేమాద్రి
98482 96865

రోహ్‌తంగ్ దారిలో హేమాద్రి

హైపరికం మొక్కలు దొరికిన కొండ

నేనూ - నా పొలిటీషియన్ కల

పండిత పుత్ర పరమ శుంఠ అన్నారే గానీ, కూతురి గురించి చెప్పలేదే? లింగ వివక్ష నాకు నచ్చని విషయం. 'పండిత పుత్రికా పరమోత్తమ శుంఠికా' అన్న నానుడి కూడా జనాల్లోకి లాక్కెళ్ళి, కన్న కూతురిగా నా రుణం తీర్చుకుందామనుకుని, మా నాన్న ఏయే విషయాల్లో పండితుడో, ఆ పుస్తకాల జోలికి చచ్చినా పోయేదాన్ని కాదు. అంచేత, పాలిటిక్స్, హిస్టరీ, జాగ్రఫీ నాకు అంతుబట్టని విషయాలైనాయి.

వారసత్వంగా పదవులు వచ్చినట్లు, చదువులూ రావాలి. అంతేగాని మీ నాన్న బాగా చదివాడు, నువ్వూ చదవాలి అంటే ఇదిగో, నాలాంటి శుంఠలే మిగులుతారు.

మా ఇంట్లో అందరికీ పాలిటిక్స్ అంటే విపరీతమైన ఆసక్తి. మొదట్లో అవంటే నాకు పరమ విసుగు. ఎందుకసలా పాలిటిక్స్? ఎవడు పాలిస్తే మనకేంటి. హాయిగా వేడి అన్నంలో ఓ చుక్కనెయ్యి, కంది పచ్చడి వేసుకుని భోంచేసే దానికి. పనికిమాలిన రాజకీయాలు అని చిరాకు పడుతుండే దాన్ని.

మా మేనమామలు పెదనాన్నలు అందరూ కమ్యూనిస్టు సిద్ధాంతాలు గుక్కపెట్టి చెప్తూ ఇల్లంతా వేడెక్కించేవాళ్ళు. ఇంట్లో ఎవడికి వాడు ఓ విప్లవకవిలా ఫీలవుతూ, నేనో నిప్పుకణికను, నింగికెగిరిపోతా, పక్కింటి వీరాస్వామి గడ్డివాముపైన పడతా అంటూ, ఉండేవాళ్ళు. ఓ సారి జడవేసే ముందు మా అమ్మ కొబ్బరి నూనె సీసా కాసేపు ఎండలో పెట్టమంది. వీళ్ళ వ్యవహారం ఏవిటో చూద్దామని, అది తెచ్చి ఒకటి వాళ్ల వీపు కానించి చూశా. అదింకా గడ్డ కట్టింది. పోచుకోలు మనుషులు.

వీళ్ళ కమ్యూనిస్ట్ సొద వింటూ పెరిగినందున ఎనిమిదో తరగతిలో రాష్ట్రపతి పేరేమిటి అన్న ప్రశ్నకు చంద్రరాజేశ్వరరావు అని రాసొచ్చాను. మా పంతులుగారు విజ్ఞానం అందరికీ పంచాలన్న ఉద్దేశ్యంతో నా పేపర్‌ని అన్ని క్లాసుల వాళ్ళకూ పంపించారు. అలా నా పేపర్, పరువూ ఒకే సారి ఊరేగించబడ్డాయి.

అనకూడదు కానీ మా నాన్న కన్నీ తాహతుకు మించిన ఆశలు. నన్నేదో చెయ్యాలని కలలు కనేవాడు. క్విజ్‌లోనూ,డిబేటింగ్‌లోనూ, వ్యాస రచనలోనూ పాల్గొనాలనేవాడు. రేడియోలో విజయమూరి లక్ష్మి ఏదో చక్కటి పాట పాడుతుంటే, వినేసిపోవచ్చుగా.'' అమ్మాయీ ఈ పాట నువ్వు నేర్చుకో, స్కూల్లో యానివర్సరీ రోజు నీతో పాడిస్తా '' అని చెప్పాడొకసారి. ఆ యానివర్సరీ ఆయ్యేవరకూ తగ్గకుండా జ్వరం తెచ్చుకోవాలంటే చిన్నపిల్లకెంత కష్టమో ఆలోచించడు.

మా వూరి డాక్టరమ్మను చూసి ఇదిగో అమ్మాయ్, నువ్వలా డాక్టరవ్వాలి అనేవాడు. కలెక్టర్ బంగళా చూసి నువ్వు కలెక్టర్ కూడా అవ్వాలనే వాడు. ఓ చేత్తో పూల దండలందుకుని మరోచేత్తో ఒడుపుగా జనాలవేపు విసిరేసే ఇందిరా గాంధిని చూసి ముచ్చట పడి నేను కూడా ఆవిడలా ఓ చలాకీ రాజకీయవేత్తనైతే బాగుండుననుకునేవాడు. నాకేమో చదువే సరిగా రాదు, ఇలా అనేక ప్రజ్ఞలు ప్రదర్శించగల సామర్థ్యమెక్కడిది?

ఒకే మనిషి ఇన్ని కాలేరు కనుక ఇద్దరం ఓ ప్లాను వేశాము. ముందు డాక్టరవ్వాలి. ఆ ఎం.బి.బి.ఎస్ పట్టా అలంకారంగా అట్టే పెట్టుకుని ఆ పైన, కలెక్టరవ్వాలి. కొంతకాలం పాటు ఎడా పెడా మంచిపనులు చేసేసి, సినిమాల్లోలాగా ఈ డాక్టర్ cum కలెక్టరమ్మ దేవతతో సమానం అన్న పేరు తెచ్చుకున్న తర్వాత, ఆ ఉద్యోగం మొహాన రాజీనామా విసిరికొట్టి రాజకీయాల్లో చేరి, లీడర్ అయిపోవాలి. స్టేజీల మీద ధారాళంగా ప్రసంగించేస్తూ ప్రజాసేవలో తరిస్తూ గొప్ప పేరు తెచ్చుకోవాలి. అదీ ప్లాను.

నాకేమో లోకజ్ఞానం తక్కువ. మీకు నా స్థాయి అర్థం కావడం కోసం ఓ ఉదాహరణ చెప్తాను. ఈ మధ్యన రెండువారాలు సెలవ లొచ్చాయి. కెనడాలో సాంబడని మా కజినొకడున్నాడు. వాడికి నా మీద వల్లమాలిన అభిమానం. చిన్నతనంలో, అందరూ చెర్లో ఈతలేస్తుంటే, నీళ్ళలో దిగేందుకు భయపడి ఒడ్డునే కూర్చుని పిరికి సాంబడని పేరు తెచ్చుకున్నాడు. ఎదురు డబ్బులిచ్చినా ఎత్తుకెళ్ళని కొన్ని లాగూ చొక్కాలకు వాడు నా సహకాపలాదారు.

'' అక్కా నేనెప్పటికైనా నీళ్ళలో కెళ్ళగలనా'' అని ఏడుస్తుంటే, ధైర్యం చెప్పి వాడి భుజం తట్టి, వాణ్ణి గేదా రోహణగావించి, చెర్నాకోలతో బలంగా దాని వెన్నుతట్టి చెరువులోకి పంపి, వీడు చెరువులో విహరించేలా చేశానని కృతజ్ఞతతో తల్లడిల్లుతూ ఉంటాడు. ఎప్పట్నుండో రమ్మంటున్నాడని ఆ రెండు వారాలు వాడిదగ్గరకెళ్దామనుకున్నా. ఆస్ట్రేలియాలో ఉన్న మా అన్నకు ఫోన్‌చేసి మన సాంబడి దగ్గరకెళ్తున్నానని చెప్పాను.

అదేమిటి మా ఇంటికి రావొచ్చుగా అన్నాడు. సర్లే దారేగా, తిరుగుప్రయాణంలో వస్తాలే అన్నా. ' ఇండియాకు ఏది ఎటుపక్కుందో తెలియకపోతే ఎట్టా బాగుపడతావే'' అన్నాడు.

అయినా ఏదెక్కడుంటే మనకెందుకు? టికెట్ కొనుక్కుని బోర్డింగ్ పాస్ తీసుకుని ఫ్లైట్ ఎక్కేసి పొయ్యేదానికి!

మా నాన్న ఆశల్లో ఒకటి తీర్చేసరికి మా తాతలు దిగొచ్చి 'జనరల్ నాలెడ్జి లేని నీ కూతురు జనాల్నేం ఉద్ధరిస్తుంది కానీ, ఇంక చాలు రారా' అని మా నాన్నను వాళ్ళతో బాటే తీసుకెళ్ళారు.

పాపం మా నాన్న! కలెక్టర్ అవుదామనుకునేసరికి ఏజ్ బారన్నారు. సరే పొలిటీషియన్ అయిపోయి నాన్న కల తీర్చాలని ఈ మధ్యన మరీ మరీ అనిపిస్తూ ఉంది. పొలిటీషయన్లు ఏం చేస్తారు, ఎలా ఉంటారు,ఏం మాట్లాడుతున్నారు? అన్న విషయాలపై టీవీ చూసి, కొంత హోం వర్క్ చేశాను. చూసిన కొద్దీ రాజకీయాల్లోకి దిగేసేద్దాం అన్న ఉత్సాహం ఊపేస్తోంది.

దానికి తోడు బరువు కూడా పెరిగాను, వేపాకులు, కాకర పిందెలు తిని డైటింగ్ చేసినా తగ్గడం లేదు. నా రాజకీయ రంగ ప్రవేశ ప్రోత్సాహానికి ఇదో మంచి శకునంలా అనిపించింది. బక్క రాజకీయ నాయకులెవరూ పెద్దగా పైకొచ్చిన దాఖలాలు లేవు. స్లిమ్‌గా ఉన్న పొలిటీషియన్స్ మీద జనాలకు ఓ లాంటి తక్కువ అభిప్రాయం ఉంటుంది. వెయిట్ తక్కువ వాళ్ళు చెప్పే మాటలకు వెయిట్ తక్కువే ఉంటుంది.

మటన్ పులావులు, కోడి వేపుళ్ళు, కొర్రమీను పులుసులు తిని తిని బోరు కొట్టినపుడు టూర్లు వేయొచ్చు. ఎంచక్కా రోడ్డు పక్కన గుడిసెవాళ్ళు నూరుకున్న చింతకాయ పచ్చడేసుకుని, వాళ్ళ పచ్చిపులుసుతో అన్నం తింటూ ఫోటోలు తీయించుకోవడంకంటే ఇంకేం గావాల బతుక్కి..

చిన్నప్పటి ఆటలు పెద్దయిన తర్వాత ఆడుకోలేక పోతున్నందుకు అసలు బాధ పడక్కర్లా, అసెంబ్లీలో ఆడుకోవడానికి బోల్డంత మంది ఉంటారు. కోపాలొస్తే పెద్దమనుషుల్లా కప్పిపుచ్చుకోవలసింది అంతకన్నా లేదు. ఒకళ్ళనొకళ్ళు తోసేసుకుంటుంటే ఎంత బాగుంటుంది.

చిన్నప్పటి కజిన్స్ అందరూ గుర్తొచ్చారు. ముందు మనం వెళ్తే తర్వాత ఒక్కొక్కణ్ణీ లాక్కొచ్చి అసెంబ్లీలో కూలేసి ఏడు పెంకులాటో, మరి చర్‌పట్టీనో ఏదో ఒకటి ఆడేసుకోవచ్చు. ఆ బల్లలు, అవీ ఓ తలకాయనొప్పి సరంజామా అనుకుంటే. అన్నీ గోడవారగా నిలబెట్టేస్తే బోల్డంత జాగా. స్పీకర్ టేబిల్ వరకూ ఉంచేద్దాంలే. ఎప్పుడైనా 'వీరి వీరి గుమ్మడి పండు' ఆడాలంటే తల్లిలా కూచోడానికి ఒకరుండాలిగా.

అసెంబ్లీలో మార్షల్స్ ఎత్తుకుని బయటకు తీసుకెళ్తుంటే రంకెలేస్తూ బయటికెళ్ళడం ఎంత బాగుంటుంది. ఎప్పుడో చిన్నతనంలో మా అన్నలో, కజిన్సో ఇద్దరు చేతులు చతురస్రాకారంలో పట్టుకుని మమ్మల్ని ఎక్కించి దేవుడమ్మా దేవుడు అని ఊరేగించేవాళ్ళు. మళ్ళీ అలాంటిరోజులు వచ్చేనా,అసెంబ్లీ ప్రాంగణాన అలనాటి బాల్యక్రీడా వినోద వసంతాలు వికసించేనా? ఇంతకూ ఆడమార్షల్స్ ఉంటారా అసెంబ్లీలో, ఉంటే నా బరువు మోయగల వాళ్ళై ఉంటారా చూడాలి.

ఏదైనా కొత్త విషయం నేర్చుకోవాలంటే, ఒక ట్రైనింగ్ కో, ట్యూషన్ కో వెళ్ళాలి కదా. అలాగే రాజకీయ ట్రైనింగ్ ట్యుటోరియల్స్ ఏవైనా ఉన్నాయా అని చూస్తే ఎక్కడా లేవు.

తెలిసిన రాజకీయ నాయకుడొకాయన ఉంటే, ఎలాగైనా ఆయన్ని బతిమాలి రాజకీయ ట్యూషన్ చెప్పించుకుందామని వెళ్ళా. సార్ పూజలో ఉన్నాడంటే కూర్చుని ఎదురుచూస్తున్నాం. ఓ పావుగంటకు వచ్చాడాయన. తెల్లని బట్టలు, ఎర్రని బొట్టు. ఇప్పటివరకూ, మా వూరి సిరిలచ్చమ్మదే నేను చూసిన పెద్దబొట్టు. సిరిలచ్చమ్మ రికార్డు బద్దలు కొట్టిన మొనగాణ్ణి చూసిన దిగ్భ్రాంతిలో నుంచున్నాను.

ఆయన నా ఉత్సాహం పట్టుదల గమనించి తర్ఫీదు ఇవ్వడానికి వొప్పుకున్నాడు. కొంతకాలం తర్ఫీదు తర్వాత mock exam పెడతానన్నాడు. ఉట్టుట్టి ప్రెస్ మీట్. దాంట్లో నేను పాసైతే కనక రాజకీయాల్లో క్లిక్ అయ్యానన్న మాటే.

మీరే ప్రయోజనం ఆశించి రాజకీయాల్లోకొస్తున్నారు?

నాకంటూ సొంత ప్రయోజనాల్లేవు. ప్రజా ప్రయోజనాలకోసం ప్రాణత్యాగానికి సైతం వెనుకాడను.పిల్లలంతా అమెరికాలో సెటిల్ అయ్యారు. వాళ్ళెప్పుడూ అంటుంటారు.' నువ్వు ఇక్కడికే వచ్చి కృష్ణా,రామా అనుకోరాదా? ఎందుకీ కష్టం' అని. కాదు, నేను పుట్టిన గడ్డకోసం ఏదైనా చెయ్యాలి, నా అన్నదమ్ముల కోసం,అక్కచెల్లెళ్ళకోసం నా జీవితం అంకితం కావాలి అనుకున్నాను. రానని చెప్పేశాను. ఈ శరీరం మట్టిలో కలిసేంతవరకూ, నా శ్వాస గాలిలో ఏకమయ్యేవరకు ప్రజాసేవ చేస్తూనే గడుపుతాను.

జీడిపాకంలా సాగుతున్న ఒక సున్నితమైన సమస్య మీదమీ అభిప్రాయం చెప్పండి. మీరైతే ఏం పరిష్కార మార్గాన్ని సూచిస్తారు?

సూత్రప్రాయంగా ప్రభుత్వ విధానాల సవరింపు కోసం,సున్నితమైన విధాన అధ్యయనం చేస్తూ, అఖిల పక్ష, భారతీయ, ప్రవాస, పృథక్కైన మేధావుల విస్తృత చర్చా వేదిక ఏర్పాటు చేసి, వేర్పాటువాదం నెరుపుతున్న, విభేదిస్తున్న పార్టీ వర్గాలన్నింటినీ ఒకే త్రాటి మీదకు తీసుకు రావడానికై నిరంతర కృషి సలుపుతున్నాం.

వుట్టుట్టి జర్నలిస్టులందరూ మాట రాకుండా పడిపోతే, పనివాళ్ళు నీళ్ళు చిలకరించుతున్నారు. నన్ను చూసి మా గురువుగారు దగ్గరకొచ్చి, 'చాలమ్మా చాలు' అని కండ్లు తుడుచుకున్నారు.

.....

సంక్షిప్తంగా
sailajachandu.blogspot.in నుంచి

❖ సినిమా పజిల్

నిర్వహణ : యజ్ఞమూర్తి



అడ్డం

1. 'కెమెరామెన్ గంగతో రాంబాబు' దర్శకుడు (6)
5. 'అగ్గిరాముడు'లో ఎన్టీ రామారావు జోడీ (4)
6. శివ దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా నటించిన చిత్రం (2)
8. వెంకటేశ్ హీరోగా ఎమ్మెస్ రాజు సినిమా (5)
12. మోహన్‌బాబు హీరోగా 1983లో వచ్చిన ఒక చిత్రం (4)
13. జూ. ఎన్టీఆర్, ఇలియానా జంటగా నటించిన చిత్రం (2)

నిలువు

1. 'ఖడ్గం'లో ప్రకాశ్‌రాజ్ జోడీ (5)
2. కృష్ణ, శ్రీదేవి జంటగా కె.బాపయ్య దర్శకత్వంలో వచ్చిన చిత్రం (5)
3. తనయుడు అరుణ్‌కుమార్ హీరోగా దాసరి తీసిన చిత్రం తలకిందులైంది (2)
4. 'ఓ హంసనడక దానా అందాల కనుల దానా' పాట కృష్ణ నటించిన ఈ చిత్రం లోనిదే (4)
7. విజయచందర్, సుమలత జంటగా వచ్చిన 'రాజాధిరాజు' దర్శకుడు (2)
9. భరత్ దర్శకత్వంలో వినోద్‌కుమార్, మహేశ్వరి జంటగా వచ్చిన చిత్రం (3)
10. వెంకటేశ్, విజయశాంతి జంటగా వచ్చిన చిత్రం గజిబిజిగా (3)
11. బాలకృష్ణ 'చెన్నకేశవరెడ్డి'లో ఓ నాయిక (2)

గత వారం జవాబులు

1 డ	మ	రు	2 కం	●	●	3 మం
బె	●	●	4 పె	ళ్ళి	రో	జు
5 వ	రూ	6 ధి	ని	●	●	ల
రి	●	రో	●	7 జ	●	●
కి	●	8 వి	జ	య	సిం	9 హ
చే	●	●	●	ప్ర	●	న్సి
10 దు	ర్గ	●	11 మ	ద	ని	క



అడ్డం

1. 'స్వగృహ ఫుడ్స్'లో ప్రత్యేకంగా అమ్మబడే 'చారు' (3)
4. అడవుల పాలైన సీతకు ఆశ్రయం కల్పించిన ముని (3)
6. వరుడితో పురోహితుడు పలికించే ఒక మంత్రం (5)
9. ఆద్యంతాల 'ముదిగారం' (2)
11. సున్నా లుప్తమైన 'బాణం' (2)
12. గుత్తులు – ఏకవచనంగా మారి, ఊరిపేరైంది (2)
14. తోక తెగిన 'ప్రేతాత్మ' (2)
15. వినసొంపు కాని 'సవ్వడి' (2)
16. పేరు మారిన 'బిల్వ' వృక్షం (3)
17. తమలపాకు జోడి (2)
18. మన అదృష్టం చెప్పే 'ఫలం' (2)
19. కృష్ణుడి ప్రేయసిని పిలవండి (2)
20. పేరు మారిన 'నగరం' (2)
23. సునిశితంలో దాగిన చీకటి (2)
25. నక్షత్రంతో మొదలైన మంత్రం (5)
28. పోయినవారికి 'అంజలి ఘటించడం' (3)
29. వికృతిలోకి మారిన 'సూర్యుడు' (3)

నిలువు

1. కారుమబ్బులు కమ్మినప్పటి 'ఆకాశ గర్జన' (3)
2. పడవే – పల్టీ కొట్టింది (2)
3. సాటి ప్రాణిని ఈ కోత కోయడం తగునా? (2)
4. గడ్డి గుమ్మి (2)
5. ఒక దేవతా జాతి (3)
7. వెర్రి – దీనికో లెక్కుందంటాడు పవన్ కళ్యాణ్ (2)
8. '-- ని నాతిగ చేసిన రాముడివో'! (2)
10. తిరనాళ్లలోని వర్ణచక్రం, బతుకుని దీంతో పోలుస్తారు (5)
11. వంద మంది పృచ్ఛకులకు సమాధానం చెప్పే పండితుడు (5)
13. ఒక సీజనల్ ఫ్రూట్– మధుమేహ వ్యాధికి మంచిదట (3)
20. అలనాటి సినీ నటి – లలిత, రాగిణిల తోబుట్టువు (3)
21. భారతనారి సంప్రదాయక కట్టు (2)
22. క్రతువులతో జరిపించే యజ్ఞం (2)
24. గంగని తలపై మోసే వాడు (3)
25. బొట్టు కాని బొట్టు – పెళ్లిలో వరుడు కట్టేది (2)
26. కరవాలం (2)
27. ఒక వారానికి దీన్ని తగిలిస్తే నిలువు 25కి సమానమే–కిందనుండి (2)

గత వారం జవాబులు

1 అ	జం	2 తా	●	3 కా	●	4 తా	మ	5 ర
వ	●	6 వి	7 శ్వా	మి	8 త్రు	డు	●	క్క
9 ని	10 ప	●	స	●	వు	●	11 మ	సి
●	12 రో	లు	●	13 ద	●	14 తం	హి	●
15 దూ	ప	●	16 బా	స	ర	●	17 షా	డో
●	18 కా	ష్ఠం	●	రా	●	19 కా	సు	●
20 హా	రం	●	21 తే	●	22 రా	●	23 ర	24 తి
ర	●	25 అ	రు	26 ణా	చ	27 లం	●	ల
28 తి	మ్మ	న	●	అ	●	29 క	ట	కం

నిర్వహణ : గొరుసు

గత వారం జవాబులు

3	8	2	4	1	6	7	5	9
1	5	6	7	8	9	2	3	4
4	7	9	5	2	3	6	1	8
2	4	1	6	7	5	9	8	3
6	3	5	9	4	8	1	7	2
7	9	8	2	3	1	4	6	5
5	2	7	3	6	4	8	9	1
9	1	4	8	5	7	3	2	6
8	6	3	1	9	2	5	4	7

అంకెళి

నిర్వహణ : పి. రాఘవరెడ్డి

	4	8		3				6
	7	2		4			9	1
		6					3	4
			2		7	6	4	
2	9	7		1		3	5	8
	6	4	8		3			
						4	6	3
	3	1		7		9	8	
4	2	9		6				

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255
ఫోన్: 040-6522 5554

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారిచూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్త మడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలుర మవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు .....

పుట్టిన తేదీ .....

పుట్టిన సమయం .....

పుట్టిన ఊరు (మండలం).....

ప్రశ్న .....

మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా

అదృష్ట రత్నజ్యోతి,

ఆంధ్రజ్యోతి దినపత్రిక
ప్లాట్ నెం.76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033.

అదృష్ట రత్నజ్యోతి

ఎమ్, రామగుండం

నా భవిష్యత్ సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు.

మీ జన్మకుండలి ప్రకారం–

2007 జనవరి నుండి 2013 నవంబర్ వరకూ కేతు దశ.
2013 నవంబర్ నుండి 2033 ఆగస్ట్ వరకూ శుక్ర దశ.
2033 ఆగస్ట్ నుండి 2039 జులై వరకూ రవి దశ.
2039 జులై నుండి 2049 మే వరకూ చంద్ర దశ.
2049 మే నుండి 2056 ఏప్రిల్ వరకూ కుజ దశ.
పిదప రాహు దశ.

కంట్రోలింగ్ ఫేక్టర్స్ : కేతువుకు బృహస్పతి, శుక్రునికి కుజ బుధ రాహువులు. రవికి రాహు కేతు కుజులు. చంద్రునికి బుధ శుక్రులు. కుజునికి శుక్ర బుధ గురు కేతువులు. రాహువుకు బృహస్పతి.

ఇక్కడ ఎవరి పెత్తనాన్నీ అంగీకరించక తమ పని తాము చేసుకుంటూపోయేది 1. కేతువు 2. చంద్రుడు 3. రాహువు. శుక్రునిలో ద్విగుణీకృతమయ్యే స్త్రీత్వం, రవిలో ద్విగుణీకృతమయ్యే పురుషతత్వం, అగ్ని తత్వం ఇక్కడ ప్రత్యేకతలు.

యోగాలు : వృత్తి స్థానంలో ఏర్పడిన రాజయోగం. అయితే అది వైద్య రంగంలో అయితేనే పనిచేస్తుంది.

శని కుజుల పరస్పర వీక్షణ, శుక్రుడు రాహువులా, బుధుడు రవిలా పనిచేయడం, అలాంటి రవి బుధ శుక్రులు యతిలో ఉండడం, రవి కుజునిలా పనిచేయడం, ఆ రవి వృత్తి స్థానంలో పడడం, వంటి కాంబినేషన్స్ వలన వైద్యురాలు కావడం నిశ్చయం! రాజయోగం వలన ఆ రంగంలో నిష్ణాతురాలు కావడం అంతకంటే నిశ్చయం!

2013 నుండి 2033 వరకూ నడిచే శుక్ర దశ, కుజునికి గట్టి రెమిడీస్ పాటిస్తే యోగించడం జరుగుతుంది. 2033 నుండి 2039 వరకూ నడిచే రవి దశ వృత్తిలో తిరుగులేని స్థితినిస్తుంది, అయితే అది కేతువుకు బలమైన పరిహారాలు పాటిస్తేనే!

2039 నుండి పది సంవత్సరాలు నడిచే చంద్ర దశలో 90 శాతం విదేశాలతో సంబంధం ఏర్పడుతుంది, ఏర్పడాలి. అలా కాకపోతే... అంటే ఏదో ఒక రూపేణా విదేశ సంబంధం ఏర్పడకపోతే, ధన నష్టం, ఒక స్నేహితురాలి చేతిలో నయవంచనకు గురి కావడం, మానసిక క్లేశం అనివార్యం. 54వ సంవత్సరం నుండి నడిచే కుజ దశ బాగానే ఉంటుంది. ఇక విదేశీ సంబంధం అవసరం పడదు. అయితే ఆరోగ్యం కాపాడుకోవాలి. రవి కుజులకు గట్టి రెమిడీస్ పాటించాలి.

ఈ జన్మకుండలి వరకూ రవి వైద్యురాలిని చేయడంలో; చంద్రుడు విదేశీ యానాలకూ; కుజుడు ప్రాణగండాల నుంచి, తిరిగి వాటి నుండి బయట పడేయడానికీ; రాహువు వైద్యం ద్వారా ధనాదాయానికీ, వివాహం ఆలస్యం కావడానికీ; శని కూడా వివాహం ఆలస్యం కావడానికీ, ద్వికళత్రానికి దారితీసే పరిస్థితులు ఏర్పడడానికీ; బృహస్పతి విద్య కోసం హాస్టల్‌లో ఉంచడానికీ వైవాహిక జీవితంలోని ఏ సమస్యనయినా పరిష్కరించి భార్యాభర్తలను విడిపోకుండా కాపాడడానికీ, శక్తికీ; బుధుడు విదేశ యానాలకూ; కేతువు గండాలకు, ఆయుష్షుకు; శుక్రుడు రాజయోగానికీ, వృత్తిలో గొప్ప స్థితికీ అలాగే వృత్తిలో సమస్యలకూ పనిచేయడం జరుగుతుంది.

ఇక శుక్ర దశ యోగించడానికి– నిష్ఠగా, పవిత్రంగా ఉండాలి. శుక్రునిలో శుక్రునిలో... అంటే 2013 నవంబర్ నుండి 2017 మార్చ్ మధ్య ఎలాంటి ఎఫైర్‌లూ, లవ్ ఎఫైర్‌లూ లేకుండా చూసుకోవాలి. దీనిమీద ఆధారపడి శుక్ర దశ యోగించడం, యోగించకపోవడం జరుగుతుంది.

రవి దశ యోగించడానికి– ఎవరినీ పల్లెత్తు మాట అనకూడదు. కోపం వహించకూడదు. స్లిప్‌ఫ్ టంగ్‌తో రవి దశ శక్తి పోతుంది. రవిలో రవిలో... అంటే 2033 ఆగస్ట్ నుండి డిసెంబర్ మధ్య ఎవరినీ ఏమీ మాటలతో బాధపెట్టకుండా, వాళ్ళ చేత శాపాలు తినకుండా ఉండడం మీద రవి దశ మొత్తం యోగించడం, యోగించకపోవడం ఆధారపడుతుంది.

చంద్ర దశ యోగించడానికి– ఎవరికీ ధనం రుణంగా ఇవ్వకూడదు. మితిమీరి అన్నదానం చేయకూడదు. కుపాత్ర దానాచ్చ భవే ద్దరిద్రః !

అలాగే ఈ దశలో మనసు పాత్ర చాలానే ఉంటుంది. ఆకర్షణలకు లోనవుతున్నామా... ఆధ్యాత్మికంగా, ఆస్తికత్వంతో ఉండగలుగుతున్నామా అన్నదానిమీద చంద్ర దశ యోగించడం, యోగించకపోవడం ఆధారపడి ఉంటుంది.

కుజ దశలో ఒక పెద్ద సర్జరీ ఉంటుంది. విజయవంతమవుతుంది. కానీ సెకండ్ లైఫ్!

కుజ దశ యోగించడానికి... మెడిసిన్స్ దానం చేయాలి. ఎంత ఉచితంగా మీరు ట్రీట్ చేయగలిగితే అంత మంచిది. కుజునిలో కుజునిలో అంటే... 2049 మే నుండి అక్టోబర్ మధ్య ఒక విదేశ యానం తప్పనిసరిగా చేయాలి. ఎలాంటి పరాయి సంపర్కం కూడదు. వీటిమీద ఆధారపడి కుజ దశ యోగిస్తుంది! ఇవి ఈ జాతకురాలి వరకూ మాత్రమే అని గ్రహించేది.

వివాహం : శుక్రునిలో గురునిలో వివాహం. అంటూ 2023 డిసెంబర్ నుండి ఏ క్షణంలోనయినా. శని వలన వైవాహిక జీవితంలో ఎప్పటికప్పుడు విడిపోవాలనీ, అధిపతీ, గురుని వీక్షణ వలన కాపాడే కలిపే శక్తీ వెరసి, వైవాహిక జీవితం నడిచిపోతుంది!

ఏది ఏమైనా వైవాహిక జీవితం బాగుండడానికి పాటించాల్సిన అతి పెద్ద రెమిడీ స్థిరాస్తులు మీ పేరు మీద ఉండకపోవడం!

సంతానం : సంఖ్య రెండు. పరివర్తన యోగం వలన మూడు ఉండదు. మొదటి సంతానం స్వదేశంలో, రెండవ సంతానం విదేశాల్లో స్థిరపడడం జరుగుతుంది.

స్థిరచరాస్తులు : చాలా ఉంటాయి. వాహన యోగం అసాధారణం.

అదృష్ట రత్నాలు : పచ్చ+వజ్రం.

శక్తియుక్తులు : భర్తే మీ బలం, భర్తే మీ బలహీనత! వృత్తే మీ బలం, వృత్తే మీ బలహీనత! లూజ్ సైకాలజీ ఎంత లేకపోతే అంతగా మీరు వృద్ధిలోకొస్తారు. అనవసరమైన ఆలోచనలే మీ నిజమైన శత్రువు!

''ఆనో భద్రాః క్రతవో యంతు విశ్వతః''

అన్ని దిశల నుండీ మనకు ఉత్తమమైన ఆలోచనలే వచ్చుగాక!

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం **'అభినేత'**. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత **'అభినేత'** ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: **92465 62255** Advt

నోబెల్ మ్యూజియంలో, రోమా జిప్సీలతో...

స్వీడిష్ యాత్ర-4



నోబెల్ మ్యూజియం వద్ద వ్యాసకర్త

ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బహుమతులు ఏమిటి అని ఎవర్నడిగినా వచ్చే సమాధానం ఒకటే- నోబెల్ బహుమతులని. ఆ సంస్థ కేంద్రం స్టాక్‌హోంలోనే ఉంది కాబట్టి నోబెల్ మ్యూజియాన్ని సందర్శించ కుండా తిరిగి రారెవ్వరూ. దాంతోపాటు మన నేల మీద నుంచే వెళ్ళిన రోమా జిప్సీలను చూడడం కూడా భారతీయులందరికీ ఆసక్తి ఉన్న విషయమే. నెల రోజుల స్వీడన్ పర్యటనకు ముక్తాయింపు పలుకుతూ ప్రొ. ఎం. ఆదినారాయణ ఈ రెండు అనుభవాల గురించి రాసిన విశేషాలే నేటి ట్రావెలోకం.

విస్బీ నుండి స్టాక్‌హోంకు వచ్చీరాగానే నేను, అలీసా కలిసి ఆమె బాయ్‌ఫ్రెండ్ తొరబియాన్ ఉండే ఉప్‌సాలా నగరానికి వెళ్ళాం. ఉప్‌సాలాకి 'విద్యల నగరం' అని పేరు. స్కాండినేవియా దేశాలన్నిటిలోను ముందుగా ఇక్కడే విశ్వవిద్యాలయం ఏర్పడింది. ఒక ప్పుడు స్వీడన్‌కి రాజధానిగా ఉండేది ఈ నగరం. దీని పరిసరాల్లో బిర్చ్, పైన్ చెట్లు ఎక్కువగా ఉన్నందువల్ల స్థానిక కళాకారులందరూ అక్కడ చెక్కతోనే ఎక్కువ బొమ్మలు చేస్తారు. అలాగే రెయిన్ డీర్ తోలుతో కూడా రకరకాల అందమైన వస్తువులు, సంచులు తయారుచే యడం వారికి బాగా తెలుసు. ఇలాంటి హస్తకళలు నేర్చుకోవడానికి దగ్గరలో ఉన్న 'షాక్‌హాగ్ స్కూలా'లో ఒక సెంటర్ కూడా ఉంది. మూస్ అనే జంతువుని వేటాడి, దాని మాంసాన్ని మాత్రమే తీసుకుని జనం చర్మాన్ని అక్కడే వదిలేయటం వలన 'మూస్ తోళ్ళ' పరి శ్రమని కూడా అభివృద్ధి చేయాల్సి వచ్చిందట.

ఉప్‌సాలా నుండి ఉత్తరంగా పైకి వెళితే ధృవపు జింకలు తిరిగే ప్రదేశం వస్తుంది. అక్కడ సామి జాతికి చెందిన సంచారజీవులు ఉంటారు. ఆ ప్రదేశాన్ని లాప్ లాండ్ అని పిలుస్తారు. ఉప్‌సాలా దగ్గర్లోని కొండల మీద, పచ్చిక బయళ్ళ మీద చాలాసేపు తిరిగి యూనివ ర్సిటీకి కూడా వెళ్ళి రాత్రికల్లా స్టాక్‌హోం చేరాను. మర్నాడు స్టాక్‌హోంలో ఉదయం 10 గంటలకు నా ఉప న్యాసం. కాని ఆ రోజు టౌన్ అంతా జాగింగ్ ప్రోగ్రాంలో ఉండడం వలన నా ఉపన్యాసానికి ఎక్కువ మంది రాలేకపోయారు. వచ్చిన వారిలో ఒక తెలుగు వ్యక్తి అయినా లేడు. సాయంత్రం దాకా బయట తిరిగి లూసియన్ ఇంటికి తిరిగి వెళుతున్నప్పుడు నా వయ సున్న ఒక వ్యక్తి నాకు రైల్వేస్టేషన్ దగ్గర తారసపడ్డాడు.

ఆ శిల్పాన్ని చూద్దామనుకుంటే...

'నా పేరు షిల్లర్' అని అతను పరిచయం చేసుకో గానే ఇద్దరం కబుర్లలో పడిపోయాం. 'ఎక్కడెక్కడ తిరి గావు?' అని అడిగాడు. అంతా వివరంగా చెప్పాను. "Oh, that is life" అంటూ భుజాలు ఎగురవేశాడు. తనకి ప్రెస్‌లో ఉద్యోగం అని చెప్పాడు. ''జాంకోపింగ్ సిటీలో ఉన్న 'ఇండియన్ రోప్ ట్రిక్' శిల్పాన్ని చూద్దామ నుకుంటున్నాను, మీరు చూశారా?'' అని అడిగాను.

''ఆ బొమ్మ చాలా బాగుంటుంది. కానీ దాన్ని ఐదు సంవత్సరాల క్రితమే తీసివేశారు. మూడు వందల ముప్పై అడుగుల ఎత్తులో ఉన్న పెద్ద తాడు, దాని మీదికి ఎగబాకుతున్న పిల్లవాడు, నేల మీద నిలబడి తాడును పట్టు కున్న ఫకీర్'' షిల్లర్ ఆ బొమ్మని బాగా వర్ణించాడు.

ఈ శిల్పాన్ని కాలే ఓర్నమార్క్ అనే స్వీడిష్ శిల్పి 1980లో చేశాడు. 'ఇబన్ బతూతా' 'ఇండియన్ రోప్ ట్రిక్'ని మొదటిసారిగా 1346వ సంవత్సరంలో హాంగ్‌జు వెళుతు న్నప్పుడు చూశానని తన 'రిహ్లా'లో రాసుకున్నాడు. ఆ తర్వాత 1890వ సంవత్సరంలో చూశామని కొం దరు రాశారు. ప్రపంచంలో ఈనా టికీ అధికంగా చర్చించబడే ఇంద్ర జాల విద్య 'Indian Rope Trick' ఒక్కటే.

ఆ ట్రిక్ ఏమిటంటే...

ఇంద్రజాలికుడు ఆకాశంలోకి విసిరిన తాడు సహా యంతో, అతని శిష్యుడు దాని పైకి వెళ్ళి అదృశ్యమైపో తాడు. ఎంత పిలిచినా పలకడు. కోపంతో శిష్యుణ్ణి శపి స్తాడు. కాసేపటికల్లా పై నుండి శిష్యుడి శరీర భాగాలు రక్తం కారుతూ కింద పడిపోతాయి. ఇంద్రజాలికుడు వాటిని ఒక గోతాంలోకి వేసి మంత్రం చదవగానే శిష్యుడు యథాప్రకారం బయటికి వస్తాడు. ఇదే ఇండి యన్ రోప్ ట్రిక్.

దుప్పటి మీద పెట్టిన బరువుల్లా ఇళ్ళు

లూసియన్ బెల్జియం వెళుతున్నందువల్ల మర్నాడు నేను బెర్నాదెత్తే మేడం ఇంటికి మారాను. అది ఎత్తయిన కొండ మీద ఉంది. చుట్టూతా అడవి. ఎటు చూచినా పైన్, ఓక్, మేపుల్ చెట్లే కనిపిస్తున్నాయి. ఇళ్ళు ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవాలి. పచ్చిక బయలు అనే విశాల మైన దుప్పటి గాలికి ఎగిరిపోకుండా, అక్కడక్కడా దాని మీద పెట్టిన బరువులు మాదిరిగా ఉన్నాయి వారి ఇళ్ళు. రోడ్డు మలుపులో ఉన్న సరస్సు వద్దకి వెళ్ళగానే వర్షపు జల్లు పలుకరించింది. గుర్రాలు పరుగులు అందు కున్నాయి. మేం తడిసిపోయాం. అమ్మాయిలే ఎక్కు వగా స్వారీ చేస్తూ కనిపించారు.

మర్నాడు నేను ఒక్కడినే National Library of Sweden కి వెళ్ళాను. లిన్నేయస్ పార్కులో ఉన్న పెద్ద భవనం అది. అక్కడ 'The Grand Tour' అనే పుస్తకం చూశాను. 1922వ సం.లో అగథా క్రిస్టీ (1890-1976) తన భర్తతో పాటు ఓడ మీద చేసిన ప్రపంచ యాత్ర గురించి రాసిన పుస్తకం అది.

అద్భుతమైన 'ఆర్ఫియస్ శిల్పం'

తర్వాత నోబెల్ బహుమతుల ప్రదానం జరిగే కాన్ సర్ట్ హాల్‌కి వెళ్ళాను. ముఖద్వారం వద్ద ప్రముఖ స్వీడిష్ శిల్పి కారల్ మిలాస్ (1875-1955) చేసిన 20 అడు గుల 'ఆర్ఫియస్ శిల్పం' అద్భుతంగా ఉంది. ఆర్ఫియస్ గ్రీకు పురాణాల్లో గాయకుడు అతని సంగీతానికి రాళ్ళు కరిగిపోయేవని, సకల జంతువులు అతని చుట్టూ మూగిపోయేవని అంటారు.

అక్కడ నుండి నేను సిటీ సెంటర్‌కి వచ్చి ఇండియన్ ఎంబసీ పక్కనే ఉన్న అడోల్ఫ్ ఫ్రెడరిక్ చర్చి ఆవరణలో స్వెన్ హెడిన్ (1865-1952) సమాధిని చూశాను. ఇరవై సంవత్సరాల పాటు ఆసియాలో, ముఖ్యంగా హిమాలయ ప్రాంతాల్లో భౌగోళిక, పురాతత్వ అన్వేష ణలు చేసిన సాహస పండితుడు హెడిన్. అతడు రాసిన 'My Life as Explorer' అనే పుస్తకం ఈనాటికీ సాహసయాత్రికులకి ఉత్తేజాన్ని కలిగిస్తూనే ఉంది. ఆర్ఫి యస్ బొమ్మ గురించి బెర్నాదెత్తే మేడమ్‌కి చెప్పగానే సంతోషపడి నన్ను ఏకంగా కారల్ మిలాస్ గార్డెన్‌కి తీసుకుపోయింది. ఐదెకరాల్లో నిర్మించిన భవన సము దాయంలో మిలాస్ చేసిన శిల్పాలన్నీ ఉంచారు. ఈ తోట అంతా ఒక కొండమీద ఉంది. ఆయన భార్య ఓల్గా కూడా కళాకారిణే. వారి సమాధులు తోటలోనే ఉన్నాయి.

నోబెల్ మ్యూజియం చూశాను

ఇంక మూడు రోజులే మిగిలాయి. నేను చూద్దామను కున్న నోబెల్ మ్యూజియంకు వెళ్ళాను. అక్కడ ఆల్‌ఫ్రెడ్ నోబెల్ (1833-1896) జీవితం గురించి, నోబెల్ బహు మతి గ్రహీతల జీవితాల గురించి ఒక పద్ధతిలో తెలియ జేస్తున్నారు. రవీంద్రనాథ్ టాగూర్ (1861-1942) ఫోటోని చూసినప్పుడు చాలా ఆనందపడ్డాను. ఆయన జీవిత వివరాల్ని చదువుకుంటున్నప్పుడు మేడమ్‌కి ఒక 'గీతాంజలి' కాపీని పంపిస్తానని మాట ఇచ్చి గీతాంజ లిలో నాకు బాగా ఇష్టమైన వాక్యాల్ని వినిపించాను.

''నాకు తెలియని మిత్రులకి నన్ను పరిచయం చేశావు.
నావి కాని ఇళ్ళల్లో నాకు స్థానాన్నిచ్చావు.
దూరాన్ని దగ్గరచేసి, పరదేశిని నా సోదరుడుగా మార్చావు.''

టాగోర్‌లో దాగివున్న మహాయాత్రికుడి అంతరం గాన్ని తెలియజేసే ఈ గీతం నాకెంతో ఇష్టం.

డైనమైట్‌ని కనిపెట్టిన నోబెల్‌కి 350 రకాల ఇతర

కారల్ మిలాస్ శిల్పం: గాడ్స్ హెడ్


నేషనల్ లైబ్రరీ

పరిశోధనలపై కూడా పేటెంట్లు ఉన్నాయి. నోబెల్‌కి పెళ్ళి కాలేదు కాబట్టి వారసులు లేరు. 1888వ సంవత్స రంలో ఆయన తమ్ముడు ఆల్‌ఫ్రెడ్ లుడ్‌విగ్ మరణించి నప్పుడు ఒక ఫ్రెంచి పత్రికవారు పొరపాటుగా ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించాడు అనుకుని 'The Merchant of Death is Dead' అనే శీర్షికతో 'మారణాయుధాలు కనిపెట్టిన నోబెల్ మరణానికి బాధపడనక్కరలేదు' అని రాశారు. దాంతో నోబెల్ అప్పటికే ఆరుసార్లు మార్చి రాసిన తన వీలునామాని మరోసారి మార్చి ''మానవాళి మనుగడకి పనికివచ్చే పరిశోధనలు చేసిన వారికే నా ఆస్తిమీద వచ్చే ఆదాయంతో బహుమతులు ఇవ్వాలి'' అని రాశాడు. ఆ విధంగా 1901వ సంవత్సరం నుండి నోబెల్ బహుమతులు ఇవ్వడం ప్రారంభించారు.

రోమా జిప్సీలను కలిశాను

ఇక మిగిలింది జిప్సీలను కలవడం. ఇంగ్‌వార్‌కి ఫోనుచేసి జిప్సీలను కలుసుకోవడానికి వారి ఆఫీసుకి వెళ్ళాను. స్వీడన్‌లో తిరిగే జిప్సీలు ఏర్పాటు చేసుకున్న సొసైటీ అది. జిప్సీ ప్రముఖుల ఫోటోలు, వారికి సహాయం అందిస్తున్న వివిధ సంఘాల వారి ఆహ్వా నాలు గోడలకి తగిలించి ఉన్నాయి. దాదాపు ఇరవై మంది జిప్సీలు ఉన్నారక్కడ. ప్రస్తుతం స్వీడన్‌లో 45 వేల మంది దాకా రోమా జిప్సీలు ఉన్నారనీ, వారిలో 20 వేల మంది ఎప్పుడూ సంచారంలోనే ఉంటారని తెలిసింది. స్వీడిష్ ప్రభుత్వం జిప్సీల అభివృద్ధి కోసం చాలా సహాయం అందిస్తున్నదని చెప్పారు. స్వీడన్‌లో తిరిగే జిప్సీలని 'కాల్దరేష్' అంటారు. వారంతా ఒక ప్పుడు వడ్రంగం పని చేసేవారు.

10-13 శతాబ్దాల్లో ఉత్తర భారతదేశం నుండి ముస్లిం దేశాలకు వలసపోయిన డోమ్ జాతివారు కాల క్రమేణా ఐరోపా, అమెరికా దేశాలకు విస్తరించారు. ఈనాడు దాదాపు 30 దేశాల్లో తిరుగుతున్న ఈ జిప్సీ లందరూ మన భారతీయ సోదరులే. ఆటపాటల్లో ఆరి తేరిన మన దొమ్మరివారే ఆ రోమా జిప్సీలు.

''ఏప్రిల్ 8వ తేదీన అంతర్జాతీయ రోమా దినోత్సవం జరుగుతుంది. ఆరోజు మీరు తప్పనిసరిగా రావాలి'' అంటూ వారు కొన్ని కరపత్రాలు ఇచ్చారు.

''నేను రాలేకపోయినా, ఆ రోజుని తప్పకుండా గుర్తుంచుకుంటాను. నేనూ మీలాంటి సంచారజీవినే'' అని చెప్పి వారి వద్ద శెలవు తీసుకున్నాను.

మేడం ఇంటి ముందున్న ఒక గట్టి పైన్ ఉడ్ ముక్క మీద నా మనసు పడింది. దాంతో ఒక చిన్న 'పిల్లవాడి తల' బొమ్మచేసి మేడమ్‌కి ఇచ్చాను. దానికి బదులుగా ఆమె నాకు గోధుమగడ్డితో తయారు చేసిన 9 అంగు ళాల జింక బొమ్మని గిఫ్ట్‌గా ఇచ్చింది. నా పేరు Christmas Buck.

రేపు సాయంత్రమే నా ప్రయాణం.

ఇంటికి కుడి పక్కగా ఉన్న కాలిబాటలో వాకింగ్‌కి బయలుదేరాను. పెద్దబాటలోకి వెళ్ళి అడవిదాటి రోడ్డుకి చేరేసరికి, అక్కడ తిరుగుతున్న గుర్రాలు నన్ను గుర్తు పట్టి సన్నగా సకిలించాయి. ఎగురుతున్న పక్షులు, పొడ వైన చెట్ల గిటార్ తీగల్ని మెల్లగా కదుపుతున్నాయి.

"Stray not from the path you persue
Loose not the Road you travel"

అనే పాట గుర్తుకు వచ్చి వెంటనే బయలుదేరాను.

(అయిపోయింది)

రచయిత సెల్ : 98498 83570

మధ్యయుగ శాస్త్రీయ చరిత్ర

మన రాష్ట్ర చరిత్రను శాస్త్రీయంగా అధ్యయనం చేసే ప్రయత్నాల్ని ప్రోత్సహిస్తూ, ఆయా పరిశోధనలను వెలువరించే ఆశయంతో 1976లో ఆంధ్రప్రదేశ్ చరిత్రకాంగ్రెస్ స్థాపించబడింది. ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్రను ఎనిమిది సంపుటాలుగా ప్రచురించాలనే వారి మహత్తర సంకల్ప ఫలితంగా వెలువడిన నాలుగో అనువాద సంపుటి ఇది. ఈ కృషి వెనుక సహజంగానే ఎంతోమంది సంపాదక వర్గ సభ్యులూ, చరిత్రకారులూ, పరిశోధకులూ, సలహాదారులూ, అనువాదకులూ, శ్రేయోభిలాషులూ, మద్దతుదార్లూ ఉన్నారు.

సుమారుగా రాష్ట్రకూటముల పాలన అంతరించి, వారి స్థానంలో కళ్యాణ చాళుక్యులు బలపడినప్పటి నుండి ప్రతాపరుద్రుని మరణం వరకూ ఈ సంపుటి తన దృష్టిని సారించింది. దక్షిణ భారతదేశానికి ఎల్లప్పుడూ ఒక ప్రత్యేక భౌగోళిక, రాజకీయ, సాంస్కృతిక నిర్దిష్టత ఉంటూ వస్తున్నది. కృష్ణ, గోదావరి, కావేరి, పెన్న, ఇంకా ఇతర జలవనరులపైనా, సారవంతమైన డెల్టాలు, మైదానాల పైనా, చివరిగా సుదీర్ఘమైన సముద్రతీరం వెంబడి వెలసిన రేవులపైనా ఆధిపత్యం కోసం వివిధ రాజరికాలు, వంశాలు సంఘర్షిస్తూ వచ్చాయి. ఉత్తరభారతదేశ చరిత్రతో పోలిస్తే, ముస్లిందాడుల తాకిడి పరిమితంగానే సోకింది. అయితే ఈ సంపుటి తన గణనలోకి తీసుకున్న కాలాంతానికి ఉలుగ్‌ఖాన్(మహమ్మద్ బిన్ తుగ్లక్) ఓరుగల్లుని వశపరుచుకున్నాడు, ప్రతాపరుద్రుడిని బందీని చేసాడు. ఉత్తరాదిన బలపడిన ముస్లింపాలకులకు (తరువాత వచ్చిన మొఘల్ వంశీయులతో సహా) దక్కన్ (లేదా దక్షిణ) ప్రాంతం అందీఅందని మిఠాయిగా మిగిలిపోయింది. కాకతీయుల కాలాన్ని మినహాయిస్తే ఈ సంపుటి తన దృష్టిపెట్టిన మూడు శతాబ్దాలలో (క్రీ.శ. 1000-1324) రాజకీయ అస్థిరత, వికేంద్రీకరణ, స్థానిక పాలకుల మధ్య ఆధిపత్యం కోసం జరిగిన నిరంతర ఘర్షణలు, విరిగిపడిన వంశవృక్షాలు మనకు ఎదురవుతాయి. అయితే ఈ సమాచారం అంతా కూడా ఒకే చోట ప్రోది చేయటం అనేది ఒక మహత్తర కార్యం. తద్వారా ఇది పరిశోధకులకూ, ఔత్సాహిక చరిత్రకారులకూ,చరిత్రపట్ల కుతూహలం కలిగినవాళ్లకూ ఎంతో ఉపయోగకరం. ఈ సమాచారపు మూలాలు, శాసనాల వివరాలు, వ్యాసకర్తలు సంప్రదించిన గ్రంథాల జాబితాలు, చివరిలో ఇచ్చిన పదపట్టిక- ఇవన్నీ కూడా మూల గ్రంథంగా ఈ పుస్తకానికి గల విశిష్టతను సుస్థిరం చేస్తున్నాయి. ప్రాంతీయ చరిత్రకూ స్థానిక చరిత్రకూ మధ్య ఉండే ఖాళీలను శాస్త్రీయంగా పూరించడం ద్వారా ఇటువంటి మూలగ్రంథాలు మరింత సమర్థవంతమూ, పరిపూర్ణమూ అయిన పరిశోధనలకూ, రచనలకూ బాటలు వేస్తాయి. ఆలస్యంగా అయినా ఇటువంటి గొప్ప ప్రయత్నం చేస్తున్నందుకు ఈ కృషి వెనుక ఉన్న వారందరినీ అభినందించాల్సిందే.



అయితే వ్యాస రచయితలెవ్వరూ తెలుగులో ప్రత్యక్షంగా రాసినట్లు లేదు. ఈ ధోరణి మన చరిత్రపై జరిగే చర్చలన్నీ ఇంగ్లీషులోనే మిగిలిపోయే దుర్గతికి దోహదం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వారి కృషి మూలంగా ఇకపైనైనా తెలుగులో ఈ విషయాల మీద విస్తారమైన చర్చ జరుగుతుందని ఆశిద్దాం.

– ఉణుదుర్తి సుధాకర్

మధ్యయుగ ఆంధ్రదేశం (క్రీ.శ. 1000-1324)
సంపాదకులు : సి.సోమసుందరరావు, పేజీలు : 485, ధర : 395, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

తాతగారి కతలూ కబుర్లూ మరొకసారి

'జరా కష్టం, కష్టం నిర్ధన జీవనం, పుత్రశోకం మహత్కష్టం, కష్టాత్ కష్టతరం క్షుధా' అని మనిషికి కష్టాలేమిటో మహాభారతం చెప్పింది. ఎనభయ్యేళ్లకు పైబడిన జీవితంలో అలాంటి ఎన్నో కష్ట సుఖాలను, ఎత్తుపల్లాలను చూసిన వయోవృద్ధులు, అనుభవ జ్ఞానసంపన్నులు కబుర్లను కలబోసి చెబుతుంటే ఎలా ఉంటుందో అలా ఉంది దాశరథి రంగాచార్య 'శతాబ్ది' పుస్తకం. తాను విన్నవీ కన్నవీ అనుభవించినవీ – ఎన్నో స్థలాలు, సందర్భాలు, కథలు, గాథలు... వాటన్నిటినీ ఇందులో మాల గుచ్చారు రచయిత. నింపాదిగా సాగే ఒకనాటి గ్రామీణ జీవితం పట్ల ఆయనకున్న మమత, ఆధునిక జీవనశైలిలోని పద్ధతుల పట్ల రోత... దాదాపు ప్రతి పేజీలోనూ కనిపిస్తుంటుంది. అలాగని పాఠకులకు ఇవన్నీ పూర్తిగా కొత్త విషయాలనీ అనలేం. రంగాచార్య 'జీవన యానం', 'అమృతంగమయ'లోనూ, ఇతర రచనల్లోనూ ఎరుకపరిచినవాటినే మళ్లీ ఒకసారి ఈ పుస్తకంలో స్పృశించారు. ఈ కారణం వల్లనే 'శతాబ్ది' ఉత్సాహంగా చదివించదు. ఇప్పటివరకూ ఆయన రచన లేవీ చదవనివారికి మాత్రం ఇది కొత్తగానే ఉండొచ్చు. లేదూ, విశ్వనాథగారు అప్పుడెప్పుడో చెప్పినట్టు 'తిన్నయన్నమే తినుచున్నట్లు...' అవే విషయాలను మరొకసారి చదివితే తప్పేముంది అనుకున్నా పర్లేదు.



శతాబ్ది, డా. దాశరథి రంగాచార్య
పేజీలు : 294, వెల : రూ.175
ప్రతులకు : విశాలాంధ్ర

రాళ్ళు తగిలే పరమాన్నం

'సవినయంగా శిరస్సున్ను భాగిసి వంధించుతూ' శాఖమూరు రామగోపాల్ కన్నడ నుంచి తెలుగులోకి అనువదించి అందించిన కథలివి. మొత్తం 16 కథలు. నిస్సందేహంగా శ్రేష్ఠమైనవే, కానీ తెలుగు అనువాదంలో మాత్రం కాదు. ఉదాహరణకు కొన్ని కథల్లోని వాక్యాలు – 'విసర్జించుకొన్న బీజం నుంచి వచ్చిన విరసమో లేక విసర్జించుకొన్న బీజం నుంచి అది ఒక రక్షణగా దేహానికి ఉపయోగపడుతుందనే లెక్క', 'జనం ఈ కాలంలో సమాజముఖి అయినా సంవేదనాశీలత్వం లేకుండా ఉండటం అనేది పెద్ద ఫ్యాషన్', 'ఈ శతమానం నాగరికత మనకి అందించిన తత్వం, నవ్య మాహితిని దక్కించుకొన్నాక దేహానికి మనస్సుకు వేగస్పర్థె ఉండినప్పుడు ప్రపంచాన్ని చూసే సాధారణ కళ్లకు ఉండే వేగం, ఒదిగిపోయే మాహితి అదెంతగా ఉండొచ్చు' – ఇవి తెలుగు వాక్యాలేనా? తెలుగు పాఠకులు చదివి అర్థం చేసుకోగలరా? అనువాదానికీ ప్రచురణకూ మధ్య ఎడిటింగ్ అనే ఒక ముఖ్యమైన పని ఉండాల్సిన అవసరం తెలియకపోవడం వల్ల జరిగే అనర్థమిది. కన్నడ సరిహద్దుల్లో మాట్లాడే తెలుగు అని సరిపెట్టుకోలేనంత గందరగోళం ఈ వాక్యాల నిండా. ఇక అచ్చుతప్పుల సంగతి సరేసరి. 'నిజం చెప్పొద్దూ' అంటూ మనకీ కథలను పరిచయం చేసిన కొలకలూరి ఇనాక్ కూడా అలవాటయిన స్తుతిస్తోత్రాలనే వల్లించారు తప్ప లోటుపాట్లను ప్రస్తావించలేదు. ఇది మొదటి భాగమే అంటున్నారు గనక, కనీసం రెండో భాగంలో మరిన్ని కథలను అందించేటప్పుడైనా వాక్యనిర్మాణం పట్ల, ఎడిటింగ్ పట్ల ఇంకొంత శ్రద్ధ చూపిస్తారని ఆశిద్దాం. ఇన్ని రాళ్లు నోటికి తగుల్తున్నా, ఈ కథలను చదవడం పాఠకుడికి పరమాన్నమేనని చెప్పాలి. పొరుగునున్న కన్నడిగుల ఆచారవ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు, మాటతీరు, దైనందిన వ్యవహారాలు అన్నిటినీ అద్దం పట్టినట్టుగా చూపించే ఉత్తమ కథలివి. వస్తు, శిల్పాల పరంగా చూసినప్పుడు ప్రతి ఒక్కటీ ఆణిముత్యమే. 'నేను చంపిన యువతి', 'ఉద్ధారం', 'మీసాల మామ' మాత్రమే కాదు, ఇందులో ఉన్నవన్నీ అత్యుత్తమ కథకులు అందించిన గొప్ప కథలనడంలో సందేహమే లేదు.



శ్రేష్ఠ కన్నడ కథలు తెలుగులో, శాఖమూరు రామగోపాల్
పేజీలు : 211, ధర : రూ.150,
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

అరుణ పప్పు

మనిషితనం, మంచితనం కలగలిసిన శారద

సాహితీ లోకానికి 'శారద'గా పరిచితుడైన ఎస్. నటరాజన్ జీవించింది కొద్ది కాలమైనా, ఆ కాలంలోనే ఆయన తెలుగు సాహిత్యానికి అందించిన సంపద ఎంతో విలువైంది. భాష రీత్యా తమిళుడైనా తెలుగు గడ్డకు ప్రవాసం వచ్చి, తెనాలిలో హోటల్ వర్కర్‌గా పని చేస్తూ తెలుగు నేర్చుకుని, తెలుగు సాహిత్యం మీద అభిమానం పెంచుకుని, ఆ భాషలో గొప్ప రచయితలకు తీసిపోని రీతిలో రచనలు చేయడం ఏ రకంగా చూసినా అసామాన్య విశేషమే. ఆయన రాసిన 'మంచీ చెడూ', 'అపస్వరాలు' నవలలు ఐదవ దశకంలో సాహితీ ప్రియుల హృదయాల్ని కదిలించి వేసి, ఆయన అభిమానులుగా మార్చేశాయి. కానీ ఇవాళ దాదాపు విస్మృత రచయితగా మారిపోతున్న ఆయనపై ఇప్పుడు సి.పి. బ్రౌన్ అకాడమీ 'కష్టజీవి, సాహిత్య చిరంజీవి శారద' పేరుతో పుస్తకాన్ని తీసుకు రావడం ముదావహం. శారద అంటే తెలిసిన, ఆయనతో పరిచయం ఉన్న విహారి దీని రచయిత. శారద జీవన యానం ఎలా సాగిందనే అంశాలతో పాటు, ఆయన రచనల పరిచయం కూడా ఇందులో ఉంది. ఇదివరకు శారదకు అత్యంత సన్నిహితులైన ఆలూరి భుజంగరావు రాసిన 'సాహిత్య బాటసారి శారద' పుస్తకంపైన ఆధారపడి శారద బాల్యం, విద్యాభ్యాసం, తెనాలి రాక, ఆయన వృత్తీ-ప్రవృత్తీ వగైరా విషయాల్ని 20 పేజీల్లోనే ముగించారు విహారి. 140 పేజీల పుస్తకంలో 64 పేజీలను శారద నవలలూ, కథానికలూ, నాటికలూ, వ్యంగ్య కథనాలను పరిచయం చేసేందుకు కేటాయించారు. శారద గురించి వివిధ సందర్భాల్లో పలువురు సాహిత్యకారులు వ్యక్తం చేసిన అభిప్రాయాలకూ పుస్తకంలో చోటు కల్పించారు. తెలుగు నవలా సాహిత్యంపై శారద ముద్ర ఎంత సుస్థిరమో వివరించే అంకంలో 'తన కాలంనాటి సమాజంలోని అన్ని అవాంఛనీయతల్నీ నిరసించి, మానవాభ్యుదయాన్ని ఆకాంక్షించిన శారదది వాస్తవిక జీవన దృక్పథం. ఆయన నవలల్లో కనిపించే ఆ వాస్తవిక దృక్పథమే శారద ముద్ర' అంటారు విహారి. 'మనిషితనం'తో, 'మంచితనం'తో పీడిత జనంతో ఐక్యమైపోయిన శారద గురించి మరోసారి జ్ఞాపకం చేసిన ఈ పుస్తకం సాహిత్యాభిమానులందరూ దాచుకోదగ్గది.



– బుద్ధి

కష్టజీవి, సాహిత్య చిరంజీవి శారద (ఎస్. నటరాజన్)
రచన : విహారి, పేజీలు: 140, వెల : రూ. 95
ప్రతులకు : సి.పి. బ్రౌన్ అకాడమి, 53, నాగార్జున హిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్ – 500082

ఆత్మహత్యలొద్దు

తెలంగాణ రాష్ట్రం కోసం జరుగుతున్న పోరాటాన్ని పట్టించుకోకుండా అధికారమనే మత్తులో నిండా మునిగిన నాయకుల ధోరణితో నిరాశ చెంది, వందలాది యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. 'ఇది సరైన దారి కాదు గెలిచి పోరాడా'లని యువతకు ఉద్బోధించి, వారిలో స్థైర్యం నింపేందుకు తెచ్చిన పుస్తకం ఇది. జూలియస్ ఫ్యూజిక్, మావో, భగత్‌సింగ్, ఫిడెల్‌కాస్ట్రో.. రచనల నుంచి కొన్ని భాగాలతో పాటు ప్రముఖుల వ్యాసాలున్నాయి ఇందులో.

ఓడిపోవద్దు, వెల: రూ. 60, పేజీలు: 104
ప్రతులకు: అన్ని పుస్తకాల షాపులు

స్వీకారం

జీవించు-నేర్చుకో-అందించు

రచన : తుమ్మేటి రఘోత్తమరెడ్డి
పేజీలు : 140, వెల: రూ. 75

కథావాహిని 2012

సంచాలకుడు : 'రచన' శాయి
పేజీలు : 198, వెల: రూ. 150
ప్రతులకు : నవోదయ బుక్ హౌస్

★★★

శతాయుష్మాన్

(చరిత్రపుటల్లో ఒక 'ఊరు-రైతు' కథ)
రచన : కృష్ణ సాయిరామ్
పేజీలు : 78, వెల: రూ.100
ప్రతులకు : 94401 92377

★★★

కాలుష్యం కోరల్లో పర్యావరణం

రచన : ఆచార్య గొల్లు సూర్యనారాయణ
పేజీలు : 72, వెల: రూ. 55
ప్రతులకు : విశాలాంధ్ర

★★★

మహారాజశ్రీ అవతారంగారు

(హాస్య వ్యంగ రస రాజకీయ హేల)
రచన : సింహప్రసాద్
పేజీలు : 196, వెల: రూ. 100

చీకటి గీతలు (కథలు)

రచన : గవర ఈశ్వరరావు
పేజీలు : 156, వెల: రూ.100

బండ్రు నర్సింహులు

(తెలంగాణ సాయుధ పోరాట యోధుని కథ)



రచన : పి. చంద్
పేజీలు : 122, వెల: రూ. 70
ప్రతులకు :
ప్రధాన పుస్తక కేంద్రాలు

మిత్రవాక్యాలు

పందలాది పాటలు రాసిన 'మిత్ర'తో తమకున్న అనుబంధాన్ని పంచుకుంటూ, ఆయన సాహిత్యంపై ఐదుగురు తెలంగాణ ప్రముఖులు విశ్లేషణకు పూనుకుని, రాసిన వ్యాసాల సంకలనమిది. 'ఎంత సాహసమైనదీ తెలంగాణా/ ఎర్ర జెండా ఎరుపు ఈ నేల పైన', 'ఆడుదాం డప్పుల్ల దరువెయ్యరా', 'ఎందుకు కాలిపోతున్నారు' అనే ఆయన ప్రసిద్ధ పాటలపై కూడా వారు మిత్ర వాక్యం అందించారు.

మిత్ర పర్వం, వెల: రూ. 60, పేజీలు: 108
ప్రతులకు: అన్ని పుస్తకాల షాపులు

మైత్రి కుదిరింది

హిట్ కోసం ఎదురు చూస్తున్న నవదీప్, సదాలకు 'మైత్రి' కలిసొస్తుందో లేదో కాని.. వీరిద్దరి జంట మాత్రం చూడముచ్చటగా ఉందంటోంది ఫిల్మ్‌నగర్. ఫ్రెష్‌లుక్‌తో ఆకట్టుకుంటున్న హీరో హీరోయిన్లు..సక్సెస్ వస్తుందన్న ఆత్మ విశ్వాసంతో ఉన్నారు. 'జయం', 'అపరిచితుడు'లలో అందర్నీ మెప్పించింది సదా. ఆటకైనా పాటకైనా ఫైటుకైనా సై అంటున్న నవదీప్ కూడా ఇటు బుల్లితెరమీద, అటు వెండి తెరమీద కనువిందు చేస్తూనే ఉన్నారు. 'మైత్రి'తో మనసులు దోచేందుకు సిద్ధం అవుతున్నారు.

Powered By
ASHOK LEYLAND

Exclusive, Most trusted &
No.1 OEA of Ashok Leyland

RAPOWER GENERATORS

10kVA to 2000 kVA DIESEL GENERATORS

- Compact
- Most Fuel Efficient
- Minimum Maintenance Expenses

The next generation power source
BUNGLOW DG
Blue Magic!

10 kVA & 15kVA
PORTABLE GENERATORS
Can take care of AC loads / water pump / lighting and other miscellaneous loads.
Remote operated DG Set is our innovative and special feature.

www.rapower.in

RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED, Head Office & Regd. Office: BANGALORE. Mfg. Units: Channapatna (KA), Tiruchirapalli (TN)

HYDERABAD:
5/5-93 & 94, 2ND FLOOR, SHIVA CHAMBERS, RANIGUNJ, SECUNDERABAD – 500 003
Phone No. 040-27700840/27700841, 27711239/2274 , FAX: 040-27700841,
E:powerzenhyd@gmail.com,
MR. M D PRASAD : 0 98486 15020 ,
MR. RAMESH : 0 98486 15026

VIJAYAWADA:
#40-22, MOGALRAJ PURAM, BSRK COMPLEX
VIJAYAWADA – 520 010
KRISHNA DISTRICT,
ANDHRA PRADESH.
Phone No. 0866-2492838/ 2492848
powergenvja@gmail.com
MR. AVINASH, 0 95538 33444
0866 2492838

VISAKAPATANAM:
GROUND FLOOR, #48-6-33,
RAMA TALKIES SIDE ROAD, SRINAGAR,
VISAKAPATNAM – 530 016
Phone No. 0891-3012009 / 2791602 /
0 9848788816
rapowergenvizag@gmail.com
Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814,
Mr. SHARVAN : 0 98487 88815

KURNOOL:
P.O. No. 14, APSP SHOPPING COMPLEX,
NEAR BELLARY CHOWRASTRA,
KURNOOL – 518 002, Phone No. 08518 – 256700
kurnool@rapowergen.com
Mr. D.K. KISHORE :0 99486 71600

ANANTHAPUR:
Mr.G.T.PRABHAKAR : 0 98486 02300

Other State Branches: Hubli | M'lore | Pune | Kochi. Tamil Nadu: Chennai | Madurai | Coimbatore | Tirunelveli